ముగ్గురుమిత్రులు

(మాక్సింగోర్కీ)

అనువాదము:

గద్దె లింగయ్య

తొలికూర్పు :

1950

1000 ప్రతులు.

వెల

అయిదు రూపాయలు.

కూచున్నాడు. అటునిటు చూచి "బాబాయ్! మ
మిప్పుడెక్కడున్నాము?" అనడిగాడు.

టెరెన్సు వానిని బుజ్జగించుతూ "భయంలేదు లే
పడుకోరా" అన్నాడు.

ఇలియూ తలెత్తి మరొకసారి నల్దిశలా కలయజూ
చాడు. ఆ అర్ధరాత్రివేళ చిమ్మచీకటి, నిస్తబ్ధత లాంటే
హృదయాన్ని కంపింప జేశాయి. భీతిగొని నాకు భయ
మేస్తోంది బాబాయి!" అన్నాడు.

"ఇదు ఎందుకు? నే నుండగా నీ కేంభయం?
అన్నాడు టెరెన్సు.

"మరింతకుముం దేదో పెద్ద చప్పు డయిందిగా."

"నీకు కల వచ్చి వుంటుంది."

"కాదు బాబాయి! ఆధ్వని యింకా నా చెవుల్లో
గింగురు మంటూనే వుంది."

"దూరాన యెక్కడో తోడేలు అరుస్తోంది; అంతే
యిక పడుకో" మన్నాడు టెరెన్సు.

కాని, ఇలియూకు కళ్ళు మూతపడలా. ఆ నిశ్
నీరవ వాతావరణము వానికి జంకు పుట్టిస్తోంది. తోడేల
అరపు కా అర్భకుని గుండె లవిసి పోతున్నాయి. ఇలియ
గొంతుకూచునే పినతండ్రివంక చూస్తున్నాడు. టెరెను
వెనుక దిగ విడిచి వచ్చిన పాదిరీ గుడివేపు రెప్ప వాల
కుండ చూస్తుండడం కుర్రాడు గమనించాడు.

"మన మింకా చాలా దూరం రావల్సే వుంది" అన్నాడు ఇలియా.

"ఏమిటి?"

"ఇంకా వూరికి దాపులోనే వున్నాము. గబ గబ వెళ్తే మంచిదిగా."

"చీకటిగా వుంది. కాస్త నిమ్మళంగానే వెడదాములే."

ఇలియా మరి మాట్లాడలా. అంతటా నిశ్శబ్దం ఆవరించి వుంది. తానుకూడ పిన్నబ్బ చూస్తున్న వేపుకే చూడసాగాడు. ఎల్లెడల నిశాదేవి రాజ్యమేలుతోంది. కన్ను పొడుచుకున్నా యెటూ యేమీ కన్పించటం లేదు; కాని, ఇలియాకు తమవీధి మూలకి ప్రక్కన నేలమీద తన తండ్రి పడివున్నట్లు, వాని రెక్కలు వెనక్కి విరిచి కట్టబడి యున్నట్లు, కాళ్లు కూడ త్రాళ్లతో కట్టివేయ బడినట్లూ, అతని చుట్టూర పిల్లలు, పెద్దవాళ్ళూ చేరి వున్నట్లూ తోచింది. ఈ దృశ్యం తలపుకు రాగానే వ్యాకుల చిత్తుడై సంతప్త హృదయంతో క్షోభించిపోయాడు. బిగ్గరగా ఏడవాలనుకున్నాడు; కాని, పినతండ్రి శాంతికి భంగము కల్గించరాదని హృదయ దౌర్బల్యాన్నణచుకొని, దుఃఖాన్ని దిగమింగి వూరుకున్నాడు.

అప్పుడొక శకునపక్షి కూత వేసింది. అదే సమయంలో వేదనా భరితమగు నిట్టూర్పుకూడ వినపడింది. ఒకటొకటిగ నిట్టూర్పులు వెలువడుతూనే వున్నాయి. ఇలి

ముగ్గురు మిత్రులు

యాకు వణుకు పుట్టింది. ఎట్టట్లో గుండె గూడ జెట్టుకో
“బాబాయి! నువ్వేడుస్తున్నావా?” అనడిగాడు.

జెరెన్సు కదల్లేదు, మెదల్లేదు. పిన్నబ్బ మాట్లాడ
పోవటంవల్ల ఇలియా ధైర్యం దిగజారిపోయింది. మెల్లి
లేచి జెరెన్సు ప్రక్కకుపోయి అతణ్ని కావిలించుక
గావురు మన్నాడు.

జెరెన్సు కూడ దుఃఖం పొంగి పొర్లి వచ్చిం
గద్గద కంఠంతో “ఆ దుర్మార్గులు మనల్ని వూళ్లో వు
నిసుండ తరిమివేశారు. మనకి తలదాచుకునేందుకూ
యెక్కడా తావులేదు” అని చెప్పాడు.

“బాబాయి! ధైర్యం వహించు. నేను పెద్దవా
నయిన తర్వాత యీ అవమానానికి ప్రతిక్రియ చేసి తీ
ర్తాను” అన్నాడు ఇలియా బింకంగా.

ఏడ్చి ఏడ్చి ఇలియా సొమ్మసిలి కునుకుపాట్లు ప
సాగాడు. జెరెన్సు వాడిని పడుకోబెట్టి నిద్రపుచ్చా
తాను కుమిలి కుమిలి యేడుస్తూనే వున్నాడు.

తెల్లవారిన తరువాత నిద్రనుంచి మేల్కొనే
ఇలియా తానొక అపరిచిత విచిత్ర ప్రదేశంలో
తెలుసుకున్నాడు. ఎదురుగా పెద్ద నదియొకటి ప్ర
త్తోంది. నది కవతలి వేపున విశాలోన్నత స
తళుక్కు బెళుక్కులతో విరాజిలుతున్నవి. నగరాంత
క్రైస్తవమత ప్రార్థనామందిర శిఖరాలు తళ్ళళ
తున్నవి. బాలార్కుని స్వర్ణ కిరణ కాంతిచే ఆలోకిత

పతిదీ బంగారు మలామా వేయబడినట్లు ధగ ధగలా...
...ోంది. ఇలియా నలుదిక్కుల విస్మిత దృక్కుల బరపి "ఈ
...ూతన ప్రపంచంలో మాబోటి పేద-సాదలు జీవించే
...లాగు? ఈ చింపిరి గుడ్డలతో ఎవరు గడప తొక్కనిస్తారు?
...ఈ కానిచోట మా కాదరు వెవరు? "అనుకున్నాడు తనలో.
...రిద్రుల కా నగరంలో మనుగడ లేనందువల్లనే తమబండి
...ట్టణానికి వెలుపలనే ఆపబడింది కాబోలు లనుకున్నాడు.

ఇలియా భయంతో గజగజలాడుతూ పినతండ్రి
...సం దృష్టిని నాల్గుదిశలకు పరుగెత్తించాడు. చేరువలో
...డిసియున్న అనేకబండ్లు కనపడినయి. ప్రతిబండికడను
స్త్రీ-పురుషులు కులాసాగా మాట్లాడు కుంటున్నారు.
...రి దుస్తుల్లో, వేషాల్లో యేదో ప్రత్యేకత కన్పించింది.
...ళ్ళందరూ తమకంటె ఘరానా వ్యక్తులుగా చూపడుతు
...్నారు. వారి నిర్భయ, నిశ్చింత, స్వేచ్ఛా స్వభావాలు
...లియా కెంతో నచ్చినవి. వారిని తదేక దృష్టితో పరికిం
... తానున్న వారివలె విలువగలిగి అందంగావుండే
...షణాలంకారములతో విహారానికి బయలుదేరే
...గూర్చి ఇలియా వూహాప్రపంచలో తేలిపోతుం...
...రెన్ను వచ్చాడు. అతని వదన మానందముతో
...వంతమై కళకళలాడుతోంది. వస్తూనే ఇలియాతో
...న్నాడు—" దేవుడు మన యందు దయ తలిచాడు. మన

కీపట్నంలో మంచి వారి ప్రాపకము లభ్యపడింది. కొన్నాళ్లు పాటిక్కడ వారి ఆశ్రయంలోనే వుందాం."

"మరి మన మక్కడికి వెళ్ళే దెప్పుడు బాబాయి" అని ఇలియా వుబలాటంతో అడిగాడు.

"కొంచెం సేపట్లో పడవ వస్తుంది. దానిమీద నది దాటి పట్టణంలోకి వెళ్దాం."

"మన మసలు పట్నంలోకి పోరాదేమోనని నేను భయపడ్డాను."

"ఈశ్వరుడు సర్వజీవులను సంరక్షిస్తాడు. ఆయనే మనకి దారి చూపుతాడు."

"మన ముండబోయేదా యెర్రమేడలోనేనా?"

"కాదు. అది సైనికులుండే కోట."

"మరి మనముండేది మేడలో కాదూ?"

"అవును. అదీ చాలా పెద్దదే" నని పెరెన్ను మందహాసం చేశాడు.

బలే! ఇలియా సంతోషంతో వుప్పొంగి పోయాడు. "మేడలో ఏం చక్కగా వుండొచ్చు! మనం వృద్ధిలోకి రావటానికి కృషి చేద్దాం" అన్నాడు.

పెరెన్ను మెల్లగా బండి వెనక్కిపోయి ఒక వేడి నిట్టూర్పు విడిచాడు.

2

ఇల్లెల్లాంటిదో షెరెన్సు కాశ్రయమిచ్చిన హోటలు యజమానికూడ అట్టివాడే. బలంలేని దొండ ఒళ్ళుగల లావుపాటి ఆ ఖామందు దేహం వాని. సౌధపు విశాల, శిథిలావస్థలకు అనుకృతిగా నేవుంది. వాని పొగరంగు కళ్ళు ఆ పెద్దభవంతిలోని తలుపులూడి, చువ్వలు విరిగిన కిటికీలను తలదన్నుతున్నాయి.

షెరెన్సు కీయబడిన గది—గది గదికాదు కొట్టు-కశ్మలాని కాటపటు. పట్టణమందలి గలీజంతా అక్కడే పోగు పడిందేమో ననిపించుతుంది. ఆ కొట్టునందె షెరెన్సు ఇలియాలు తల దాచుకుంటున్నారు. వీళ్ళక్కడికి చేరిన మూడోనాడు హోటలు యజమాని కర్రను నేలమీద టకటక పొడుచుకుంటూ అక్కడికొచ్చాడు. వాని అడుగుల సవ్వడి చెవులపడగానే ఇలియా ప్రక్కనె వున్న పెంటపోగు చాటున నక్కాడు. భయంతో వాడక్కడి నుంచి యజమానిని నిక్కి చూస్తున్నాడు. ఖామందు నిశిత దృష్టి వాడి పైన పడనే పడింది అతను కర్రతో ఇలియాను చూపుతూ "ఆ పుత్ర కుంకెవడు? ఇక్కడి కెల్లాం వచ్చాడు?" అని గద్దించాడు.

పాపం! ఇలియా గుండె గుభేల్ మన్నది. నఖశిఖ పర్యంతం కంపించి పోతున్నాడు.

"మాట్లాడవేం? వీణ్నిక్కడి నుంచి తరిమేసెయ్యాల? ....ఏమిటీ! ఒరెన్బు అన్న కొడుకా? ఆ వెధవ తనతో ఒక బిడుతను కూడ వున్నాడని ముందే యెందుకు చెప్పలా? మొదటే నన్ను దగా చేశాడన్న మాట. ఈ గెంటెయ్యండా గుంటణ్ని" అని యజమాని కూకలేశాడు.

అంతలో సారానమ్మే పెట్రుషా కిటికీలో నుంచి తల యివతలికి పెట్టి యజమానితో చెప్పాడు— "దిక్కు లేని పిల్లాడు లెండి. నాలుగైదు రోజుల్లో వెళ్ళిపోతాడు. ఒరెన్బు ముందుగా నాతో చెప్పే తీసుకొచ్చాడు. మీరు గట్టిగా వెళ్ళగొట్టమంటే యిప్పుడే పంపేస్తాను."

ఇదంతా చూచి ఇలియూ గాభరాపడి గుప్పున బావురుమని యేడ్పు సాగించాడు. వృద్ధుని పరుషములతో వాడు బేజారయి పోయాడు. యజమాని వెళ్ళిపోయి తర్వాత ఒరెన్బువచ్చి ఇలియూను చేరదీసి పూరడించ సాగాడు. "పర్వాలేదులే, యిక పూరుకో. ఆ ముసలాయన అలాగే కేకలేస్తుంటారు; అంతే. ఇక్కడి వ్యవహారమంతా పెట్రుషా చేతిలో వుంది. ఆయన కాదన్నదేమీ యజమాని చేయరులే" అని ఇలియూను సముదాయించాడు.

ఈ క్రొత్త ప్రదేశానికి పరిచితుడయ్యేకొద్దీ ఇలియూ ప్రతి విషయాన్ని పరిశీలనా దృష్టితో చూడసాగాడు. తన స్వంత యింటికంటె ఇలియూకి విశాలమైన భవంతి ఎంతో ముచ్చటగావుంది. తమ పూరిళ్ళిపాది కలిసినా లేనంతమంది రకరకాల మనుషులతో కిక్కిరిసి వుందీభవనం. ఇది ఇక్క

టూరి సంతవలె నిత్యము కళకళలాడుతోంది. పై అంతస్థులోని హోటలు నిరంతరము పూటకూళ్ళకు వచ్చే జనంతో కిటకిటలాడుతూంటుంది. వరండా వైపు గదుల్లో కొందరు స్త్రీలు అద్దెకుంటున్నారు. మొత్తంమీద అక్కడున్నవాళ్ళందరూ తాగుబోతులే. వాళ్ళలోను మతిస్సా ముఖం క్రూరమై భయంకరంగా ఉంటుంది. క్రిందిభాగంలో చెప్పులు కుట్టే ఫర్షిష్కా భార్య, కూతురుతో కాపురముంటున్నాడు. వారి ప్రక్కనే జర్మియా అనే ముసలివాడొకడుంటున్నాడు. ఇంటిముందు గది నానిపున్న రేకువసారాలో కమ్మరి. కొలిమి తిత్తి అస్తమానం 'వుఫ్ వుఫ్' అని యెడతెరిపి లేకుండా బుసకొడుతూంటుంది. సావెలు - అంటే కమ్మరి మహా అహంభావి. అతడు పగలంతా సణుక్కుంటూ గొణుక్కుంటూ పని చేసుకుంటూండేవాడు. వాని పెళ్ళాను చక్కని చుక్క. ఆమె ముఖమెప్పుడూ నవ్వుతో కళ కళలాడుతూండేది. విధాత వాళ్ళిద్దరినీ పరస్పర విరుద్ధంగా సృష్టించాడు.

ఈవిధంగా ఆమేడలోని ప్రతి గజం మేర స్త్రీ-పురుషులతో నిండివుంది. అది అస్తమానం పెనంలో కళపెళ వుడుకుతూన్నట్టు అతి కోలాహలంగా వుండేది. పనిపాటుల నుండి విముక్తులై సాయంత్రం బసకు చేరుకున్న వాళ్ళందరూ వరండాల్లోను ఇంటిముంగలా గుమికూడి యిచ్ఛవచ్చిన ఆమోద-ప్రమోదాల్లో మునిగి తేలుతూండేవారు.

సంజవేళల పెందలాడే బువ్వతిని పిల్లమూక కథలు చెప్పమంటూ జర్మియాచుట్టూ మూగేవారు. పిల్లలు తన్ను

చుట్టవేసినప్పుడు వాళ్ళని చూచి ఆముసలాడేదో అంతరం
గిక వ్యథ ననుభవించుచూ గద్గద కంఠుడై కంట నీరు పెట్టే
వాడు; కాని, మరుక్షణంలోనే తెప్పరిల్లి పిల్లలకు కథల
విన్పించటంలో తత్పరుడయ్యేవాడు. బాలబాలిక లాతడు
ల్లబుగా చెప్పే కథల నాలకించేందుకు చెవి కోసుకునేవారు.
అందరిలోను పెత్రుహాకొడుకు యాష్కా జాకోబు జర్మియా
పట్ల భక్తి ప్రపత్తులు కలిగి వుండేవాడు. పెద్ద తల, నిడివైన
నాసిక, సన్నని మెడ కలిగి జాకోబు అందంగా వుండేవాడు
వాని చంచల దృక్కులు నిలకడేమాత్రం లేనట్టు ఎప్పుడూ
అటునిటు పరుగులు తీసేవి. ఆదృష్టి దేనిమీద నిలిచినా
చీల్చుకుని లోపలికి చొరబడేందుకు ప్రయత్నించుతూన్న
ట్టుండేది. ఉజ్వల ముఖము, శుభ్రమైనదుస్తులు వాని చురుకు
తనాన్ని వెల్లడించుతూండేవి. క్రమంగా వానికి ఇలియాతో
నేస్తమేర్పడింది. ఒకరోజున జాకోబు "మీవూళ్ళో మంత్ర
గాళ్ళున్నారా?" అనడిగాడు ఇలియాని.

"ఆడ భూతాలు, మంత్రగత్తెలు వున్నా" ర:
ఇలియా చెప్పాడు.

"వాళ్ల జుట్టు యెర్రగా వుంటుందా?"

"ఊహుం, తెల్లగా వుంటుంది."

"అయితే పర్వాలేదులే. తెల్లజుట్టున్నవాళ్ళకి జా
వుంటుంది. ఎర్రటి వెంట్రుకలవాళ్ళు పచ్చిరక్తం తాగుత
రట."

మిత్రులిద్దరూ యిలాంటివే ఎవేవో కబుర్లు చె

ఉనేవారు. కులాసాగా కబుర్లతో కాలక్షేపం చెయ్యటానికి కని వాళ్ళిద్దరూ యింటిముందొక మూల మరుగుస్థలాన్ని వెతుక్కున్నారు. అక్కడికి పెద్దవాళ్ళు పోకస్యంకాని యిరుకు సందుగుండా వెళ్ళాలి. అక్కడొక వేపచెట్టుంది. దాని మొదట్లో కూచుని స్నేహితులిద్దరూ బాతాఖాని వేసేవారు.

పగటిపూట కనపడిన దృశ్యాల ప్రభావం ఇలియా మీద బాగా పనిచేసేది. విచిత్రము, రహస్యమయము నైన జీవిత ప్రవాహంలో పడి వాడు విహ్వాల హృదయుడయ్యే వాడు. హొటలు దృశ్యాన్ని చూచి వాని మనసు కలత చెందేది భిన్న భిన్న స్వభావాల వ్యక్తులక్కడికి చేరుతూం డడము వేర్వేరు వినోదాల్లో పాల్గొనటము చూచినప్పుడు వాళ్ళందరినీ వున్మాదమావేసించినట్టుగా భావించుకొనే వాడు.

ఇలియా యెప్పుడైన హొటలు హాల్లోకిగాని, గదుల్లోకి గాని, వెళ్తే టెరెన్సు చూచిన 'తక్షణమె కసురు కుంటూ వచ్చి "ఒరే అబ్బీ! -ఇక్కడికొచ్చావెందుకు? నీ కక్కడేంపని? పో, పరుగుతియ్యి. బయటికెళ్ళి ఆడుకో. నిన్ను యజమాని చూస్తే చిర్రుబుర్రుమంటాడు. అని తరిమేసే వాడు. పాపం దిక్కు మొక్కు లేని ఆగుంటడు నుసుగు గొదుకుంటూ, తారుకుంటూ అక్కడనుంచి జారుకునేవాడు.

మేడముందరి గలభాతో చెవులు చిల్లులు పడతా యేమోననిపించేది. ఒకవేపున సావెలు సమ్మెటను యెత్తి

ముగ్గురు

ధనాధన్ మంటూ కొడు
నోరు బించుకుని చివాట్లు
ప్రక్కన షర్ఫీషాక్ శ్రావ్యకంఠంతో కూనరాగం తీస్తు
డేవాడు. వరండా గదుల్లోనుంచి ఆడవాళ్ళ ఏడుపులూ పె
బొబ్బలూ, తిట్లూ, గావుకేకలూ వినవచ్చేవి. సావె
సుతుడు పాషాక్ కొయ్య గుర్రమెక్కి "చల్ చల్ గుర్రం. చలోరే గుర్ర" మంటూ యింటిముంగల ఆవరణలో నాలుగ ప్రక్కలకు స్వారీ చేస్తూండేవాడు.

పాషాక్ పచ్చి పోకిరీ. బద్మాషులకు సర్దారు. ఆ గడుగ్గాయి ఒకటి రెండు తడవలు ఇలియాను బాదాడు కూడాను. ఇలియా దెబ్బలు తిని పిన్నబ్బతో పిర్యాదు చేసుకున్నాడు. "ఏంచేస్తాం బాబు! అన్నిటికి సహించి వూరుకోవాల్సిందే" నని పెరెన్ను పుసలాయించాడు.

అందుకు "తిరగబడి నేనూ కొడ్తా" నన్నాడు ఇలియా ఆత్మాభిమానంతో.

"కొంపతీసి అంతపని చేశేవు?"

"ఏం, ఎందుక నేం? వాడుత్తపుణ్యానికే నామీదె పడి కొడుతూంటే నేను నోరుమూసుకుని పడుండాలా?"

"అవును. వూరుకోవాలి. వాడిక్కడి వాడు. నువ్వో పొరుగూరి వాడివి. పొట్ట చేత్తో పట్టుకొచ్చినవాళ్ళం మన మేమి చేయగలంరా బాబూ?" అని పెరెన్ను తమ అ హాయ స్థితిని వెల్లడించి తల దించుకున్నాడు.

ఎదురు చెప్పలేకపోయాడు.
కాని, వాని సౌసమాధాన మెంతమాత్రం సంతృప్తిపరచ లేకపోయింది. తరవాత అవకాశం చిక్కినప్పుడల్లా ఇలియూ పాషాని దబాయించుతూనే వుండేవాడు. ఒకనాడది గాంచి జెరెన్ను ఇలియూని ముఖం వాచేటట్టు గూకలు వేసాడు. దాంతో వాడు కళ్ళు తెరిచాడు. తనకు తతిమ్మా పిల్లలకి తాహతులో తేడా వున్నట్టు గ్రహించుకున్నాడు. అదాదిగా వానికి పాషామీద ద్వేషమూ, జాకోబు నం దభిమానమూ యినుమడించినయి.

జాకోబు శాంతస్వభావి గంభీర హృదయుడు. వాడె న్నడూ యెవరితోను గిల్లి కజ్జా పెట్టుకునేవాడు కాదు. ఒక రితో మాటపడి యెరగడు. అనాథలు చెవ్వాకులంటే వాని కసలే యిష్టముండదు. వానికి విశాలోద్యానవనాల్లో ప్రఫుల్ల వదనాలతో వింత వింత కొత్తాటలాడే గొప్పింటి కుర్రకా రును గూర్చి చెప్పుకోవటమంటె మహా సంబరంగా వుండేది ఇలియూ తప్ప జాకోబు కింకొక స్నేహితుడుగాని, సహ చరుడుగాని లేడు. వాని కోమల హృదయంలో ఫర్‌పిషా త్రికయ మాషా మాత్రం స్థానం సంపాదించుకుంది. ఆపిల్ల కూడా పగలంతా వీళ్ళతోనే ఆడుకుంటూండేది.

మాషా మాత శాంతిప్రియ. ఆబిడ స్వభావ మతి సరళం. మితభాషిణి కూడాను. ఆమె తమ వాకిట్లో కూచుని యేకాగ్రచిత్తంతో యెప్పుడు యేదో ఒకపని చేసుకుంటూం డేది. ఎవరితోను మాట్లాడేదికాదు. కూతురు మాషాని గూడ చేసన్నతోనే పిలిచేది.

ఇలియా కామెపట్ల అత్యంత గౌరవం. అయితే మూడుసంవత్సరాల క్రితం పక్షవాతంవల్ల ఆమెకాళ్ళు పట తప్పిపోయాయని ఇంకెన్నో రోజులు జీవించదనీ విన్న లగా యతు ఇలియా భయపడి మాషాతల్లికి వైదొలగి దూరంగా వుండసాగాడు.

ఒకరోజున ఇలియా ఆమె వాకిలి ముందుగా వెళ తున్నాడు. ఆమె వాని చేయిపట్టుకుని "చూడబ్బాయి మమ్మాల్మయిని దయగా చూస్తూండే. దాన్నెప్పుడు తంటాల పెట్టకూడదు. మాషాజోలికి పోవుకదూ?" అన్నది. దీనంగా ఇలియా కళ్ళల్లోకి ఒకసారి చూచి చెయ్యొదిలింది.

అదిమొదలు ఇలియా జాకోబులు మాషాపట మరింత అనురక్తులయ్యారు. ఆమెమీద ఈగనైన వాలనిచ్చే వారు కారు. ఆపడతి వినతి ఇలియాను మంత్రముగ్ధునిలా చేసింది. అంతకు పూర్వమెన్నడు, తనకంటె పెద్దవాళ్ళవ ఇలియాను దయాభిక్ష నడిగియుండలేదు. ఎవరిని చూచినా తిట్టి, కొట్టి పిల్లలమీద పెత్తనం చలాయించేవాళ్ళే. ఒక్క జర్మియామాత్రం చిన్నపిల్లలమీద చేయి చేసుకునేవాడు కాదు. కల్లెర చేసి పిల్లల్ని బెదరించటము, కసరటము అత రికి మామూలే.

క్రమక్రమంగా ఇలియాకు పట్టణవాసంకంటె పల్లె జీవితమె ఆనందదాయకము, సుఖప్రదము నని తోచసాగింది తమ వూళ్ళో యిష్టం వచ్చినట్లు విచ్చలవిడిగ తిరుగుతూ డేవాడు, కాని యిక్కడో! పినతండ్రి వాని నెన్నో కష్

పెట్టాల్లో పెట్టాడు. ఈ వేపుకు రాకు, ఆగదిలోకి పోవద్దు. అని అన్నీ ఆంక్షలే. పల్లెటూళ్ళో తింటానికి లభించే పండ్లు కాయలూ, పదార్థాలు యిక్కడ కలనైన ప్రాప్తించటం లేదు. ఇంతెందుకు? పట్నంలో మట్టికి నీటికీకూడ డబ్బిచ్చి కొనుక్కోవల్సి వస్తోంది. గ్రామీణుల్లో వున్న కలుపుగోలు తనం నగరవాసుల్లో మచ్చుకైన కన్పించకున్నది. పట్టణం లోని స్వార్థమయ పోటీజీవితం చూచి ఇలియా హృదయం వికలమయిపోయింది.

ఒక దినమున భోజనసమయంలో పినతండ్రి వేదనా సూచక స్వరంతో "మన యీ దుర్దినాల కంతెప్పుడో? పెట్రుహా వాళ్ళబ్బాయితోపాటు నిన్నుకూడ చదవేద్దా మన్నాడు. నీకు బడికి వేళ్ళే యీడొచ్చింది కూడాను. చదువురానివాడు గుడ్డిగవ్వకు కొరగాడు. నా భవిష్యత్తు, ఆశ నీమీదనే ఆధారపడివున్నై; అయితే స్కూలుకు పంపాలంటే నీకు లాగులు, చొక్కాయిలు, జోడు వగైరా వుండాలి. కాని వాటన్నిటినీ కొనడానికి తగ్గ జీతం కూడ రాకు రాదాయె" అని నిట్టూర్చాడు.

ఇలియా పసి హృదయం కకావికసపడింది. కంఠం రుద్ధ మయింది. బిక్కమొగం పెట్టి జలదరించుతున్న కంఠంతో మన మసలిక్కడనుంచి వెళ్ళిపోదాం బాబాయి!" అన్నాడు.

"ఎక్కడికి వెళ్తాము? మన కాశ్రయ మెవరిస్తారురా బ్బాయి!" టెరెన్సు జాలిగా అన్నాడు.

"అడవిలోకి పోదాం, అక్కడేగా తాతయ్య అనేక సంవత్సరాలు గడిపింది. మనంకూడా ఆకులు, అలములూ, కాయలూ, దుంపలూ ఏరుకు తిందాము. పిట్టల్ని కొట్టి, జంతువులను వేటాడి కూడా పొట్టనింపుకోవచ్చు. అక్కడ మనజీవితాలు సుఖంగా గడిచిపోతాయి."

ఔరెన్సు (ప్రేమార్ద్ర) దృష్టితో అన్న కొడుకువంక చూచి వీపుమీద తట్టి "అడివిలో క్రూరమృగాల భయ మెక్కువ నాయనా!" అన్నాడు.

మనవద్ద ఆయుధా లుంచుకుందాం. నేనిప్పుడు కాస్త పెద్దవాణ్ణయానుగా. మృగాలంటే యిప్పుడంతగా భయ లేదులే. మనం ధైర్యంతో వాటిని తెగటార్చుదాము. ఎట్టి పరిస్థితిలోను యిక్కడి నికృష్ట జీవితంకంటె అక్కడేనయం ఈ జీవితము దుర్భరము. అసహ్యము్నై యెత్తుభారంగా వుంది. ఇక్కడ యెదుటివాడిని ప్రేమించేవాడే లేడు. ప్ర వ్యక్తి ఎవడినో ఒకణ్ణి దోచుకుంటానికే ఆలోచింపుతూం టాడు. పరస్పరజీవిత సంఘర్షణె యిక్కడి జీవిత పరమావ జగడము, కొట్లాటలూ నిత్యకృత్యాలే.

ఆనాటి సాయంత్రం జర్మియా బసకు చేరుకొన్న తర్వాత ఔరెన్సు తన దుస్థితిని యేకరువు పెటుకున్నాడు ఆవృద్ధుడు మొదటినుంచీ ఔరెన్సుపట్ల సానుభూతి క వున్నాడు. వాని గోడంతా విన్నాక దిలాసా కల్గించుచు "ధైర్యంగా ఉండు. ఈవిధంగా బెంగగొని అలజడి చె ప్రయోజనం లేదు దేవుడి ఘనత మహాత్మ్యాలలో విశ్వాస

కలిగిఉండాలి. ఈవిశాల విశ్వంలోని సర్వము సర్వేశ్వర సృష్టి. సుఖ దుఃఖాలు రెండూ ఆయన లీలా విలాసాలే. ఆయనేదిచేసినా మానవుల సుఖసౌభాగ్యాల నిమిత్తమే. కాబట్టి ఎప్పుడెవరికే యిబ్బంది వచ్చినా తాల్మి కలిగి సానందంగా అనుభవించాలేగాని బెంబేలుపడి లాభంలేదు. ఎల్లకాలం ఒకేరీతి నుండదు. నీకూ మంచిరోజులు రాకపోవు అన్నాడు.

"నా ఆశ అంతా ఆ దేవదేవునిమీదనే బాబా! భగవదనుగ్రహానికి చెయ్యి చాచాను. భగవదభీష్ట మెలావుందో అని ఒరెన్సు పైకి చూచాడు.

"ఈశ్వరుడు సర్వ జీవరాసుల్ని కన్పెట్టి వుంటాడు. ఆయన చూపు కందనిది లేదు. ఎవరి శ్రమకు తగ్గ ఫలితాన్ని వారికి ప్రసాదించుతాడు. నువ్వూ ఆ పరమ పిత బానిసవే. నిన్ను తప్పక కృతార్థుని చేస్తాడు. ఇలియా కుస్తుల్నిగురించి నువ్వేమీ చింతించకు నేను కొంత పైకం బదులిస్తాను. ఇలియాకి కావలసిన వుడుపులు వగైరా కొను. నే నా డబ్బుకోసం వత్తిడి పెట్టనులే.నీవద్ద దస్తు చేరినప్పుడే యిద్దువుగాని."

ఒరెన్సు ముఖం సంతోషంచే వికసించింది. కృతజ్ఞతా భరితాత్ముడై ".తండ్రీ జర్మియా!" అన్నాడు.

జర్మియా వాని నోరుమూస్తూ "చాల్లే వూరుకో. అవసరం గడుపుకో. రేపట్నుంచి కొన్నాళ్ళపాటు ఇలి

యాను నా వెంట తీసుకెడుతుంటాను. నాకు చేదోడు వాదోడుగా వుంటాడు'' అని చెప్పాడు.

"బాబా! నువ్వు దయా స్వరూపివి. నీకే మాటలతో కృతజ్ఞత తెలుప గలను? నిన్నే విధంగా ప్రశంసించ గలను?'' అని టెరెన్సు వృద్ధుని చెయ్యి స్పృశించాడు.

''పిచ్చివాడా! ఎవడూ వుదారుడు కాదు. ఒకరి కిచ్చే వాడింకొకడు లేడు. నేను నీకిస్తే నీవింకొకనికి సహాయ పడుతావు. వాడు మరొకడికి తోడవుతాడు. ఇట్లే [illegible] భగవత్ప్రేరణచే యీ ప్రాపంచిక రథం నడుస్తూ వుంటుంది అన్నిటికి కర్త ఆ దేవదేవుడే" అని జర్మియా నిమీలిత నేత్రుడయినాడు.

3

ఇలియా పక్కమీద పరుండి యిద్దరి సంభాషణ ఆలకించాడు. జర్మియా తుది పలుకులు వాని కత్యంతానందాన్ని కల్గించినయి. ఆ సంతోషంతోనే వాడు నిద్రాదేవిచే ఆవహింప బడ్డాడు.

జర్మియా కృపవల్ల ఇలియా రోజులు జాలీగా గడుపసాగాడు. జర్మియా పొద్దు పొడిచిన తరువాత ఇలియాను తోడ్కొని యిల్లు విడచి బయలుదేరే వాడు. పగలంతా పట్టణమందలి వీథులు సందు-గొందులు గ్రుమ్మరుతూ పార వేయబడ్డ చింపిగుడ్డలు, మేకులు, లోహపుతునకలు వగైరా ఏరుకునే వారు. నగరంలోని వివిధ ప్రదేశాల్లోని చిత్ర విచిత్ర వస్తువులను, మనోహర దృశ్యాలను గాంచినప్పుడు ఇలియా హృదయం కుప్పిగంతులు వేసేది. ఒక్కొక్క దృశ్యాన్ని చూచినప్పుడు జర్మియాపైన ప్రశ్నపరంపరను కప్పించేవాడు. ఇలియా సందేహాలను తీర్చుటతోను, వానితో మాట్లాడుటతోను, వేర్వేరు ప్రదేశాలను వర్ణించుటతోను జర్మియా కపూర్వ సుఖానుభూతి కలిగేది.

ఒక రోజున బజారులో శకలాలేరుకుంటూ పోతూండగా యెట్టయెదుట కానవచ్చిన భవ్యహర్మ్యానికి యజమాని యెవరని ఇలియా అడిగాడు.

"ఇదా? ఇది పచేలిన్ ది. అతడీ పట్టణంలో గొప్ప భాగ్యవంతుడు" అని చెప్పాడు జర్మియా.

"ఎవరయినా అస లంతంత మోతుబరు లెల్లా అవు తారు తాతా?"

"డబ్బును కూడబెట్టడానికి మనుషులు రేయింబగళ్ చెమటోడ్చి కష్టపడుతారు. ధనమార్జించిన పిమ్మట పెద్ద పెద్ద యిళ్ళు, భవంతులు కట్టించుకొని దాస-దాసీజనాన్ని పెట్టుకుంటారు. అప్పుడానంద మనుభవించుతూ సుఖంగా జీవితం గడుపుతారు. అల్లాంటప్పుడు లోకులు 'ఫలానా వారి కష్టించి కూడబెట్టిన సంపాదన ననుభవించుతున్నా' డని చెప్పుకుంటారు; కాని, వాస్తవంలో అల్లాంటివాళ్ళు చాల తక్కువ. వారిలో చాలామట్టుకు దుర్మార్గులై, కుటిలోపాయాలతో ధనార్జన చేసినవాళ్ళే. ముదనష్టాలతో మూట వేసిన వాళ్ళుకూడా వుంటారు. పచేలిన్ విషయంలో మొదట చెప్పిన రకమని చాలా వదంతులున్నై. వాని గంభీ ముఖము, పిల్లికళ్లు భయానకమై కసాయితనాన్ని వెల్లడించుతూంటై. అతణ్ని చూచినప్పుడు వాని విషయంలో అనే దుర్భావనలు కలుగుతుంటాయి; కాని యిదమిద్ధమని యేమీ చెప్పలేము. ఒకొక్కప్పుడు కొందరి నాకస్మికంగా భాగ్యదేవత వరిస్తుంది. వారిట్టే శ్రీమంతులం పోతారు. అదంతా భగవంతుని మాయా విలాసం. మన మందరము ఆయనచే సృష్టింపబడిన వాళ్ళమే. ఆయన మనల్ని భూమండలంమీద కర్మ ఫలితా ల్ననుభవించేందుకే వదిలాడు; మన మిక్కడేమి చేస్తున్నదీ, తన ఆదే

న్నింతవరకు ఆచరించుతున్నదీ ఆయన అనుక్షణము గమ
ించుతూనే వుంటారు. అదిగో! ఆ కన్పించే మాళిగ పావో
ిచ్ ది. వాడు పచేలిన్ కంటె ధనవంతుడని ప్రతీతి. ధని
ుడో దరిద్రుడోగాని, వాడొక దగుర్బాజీ అనిమాత్రం
ా కాకరమె. నే నిప్పుడు వాని మంచి చెడ్డలను పరిశీలించ
ం లేదు. అది సర్వేశ్వరుని పని; కాని, వాని చేతలు పాప
ూయిస్తాలు. ఆదిలో వాడు మాంపూరి వాడే. అప్పుడు
ొట్టు అమీనాగా వుండేవాడు. ఒకళ్ళ నొకళ్ళగ
ుకొమ్మల్లరిని వాడుకొల్లగొట్టి బికార్ల ఫకీరుల్ని చేసివేశాడు.
ాపం పండేవరకు ఎవనికైనా తగినఫలితం ముట్టదు. పాపం
ండినాక దేవుడు కట్టి కుడుపకమానడు. పావోనిచ్ పాపం
ండింది. ఈశ్వరుడు వానిని దండింప నారంభించాడు.
మొదట పావోనిచ్ చెవిటివా డయ్యాడు. తరువాత వాని
ొడుకు గుర్రంమీద స్వారిచేస్తూ క్రిందపడి చచ్చాడు. మరి
ొన్నాళ్ళకు ఆతని కూతురు వంశానికి కళంక మాపాదించి
ెవడితోనో లేచిపోయింది."

జర్మియా జుట్లీనగరంలోనె నెరిశింది. అతని కిక్కడి
ిటింటి చరిత్ర కొట్టినపిండి. వృద్ధుడా విషయాలన్నీ తప్పీ
ుగా చెపుతూంటే శ్రోతలహృదయా లూగిస లాడుతాయి.
ెయితే జర్మియా మాటల్లో యీర్ష్యా-ద్వేషా లేమాత్రం
ాడకట్టేవికావు.

ఇలియా జర్మియా ముఖంలోకి చూస్తూ అతను
చెప్పేది చాలా ఆప్యాయంగా వింటూండేవాడు. ఎప్పుడైనా

"నేనా సౌధాంతర్భాగాలు చూడగలనో లేదో" అని అంటూండేవాడు.

ఆమాటకు "బిడ్డా! ఆయుర్దాయముంటే అన్నీ చూస్తావు. నువ్వుకూడ శ్రీమంతుడివి, భాగ్య శాలివి కావచ్చు. కృషి చేస్తే కాని దేముంది? నాయీ కళ్ళతో యెన్నెన్ని చూచాను! మానవ జీవితావస్థలను గమనించుతూ యెన్నికన్నీళ్ళు కారాయో వీటినుంచి! ఈ తనువు లోని జీవరసమంతా కన్నీరై ప్రవహించి తుదకిప్పటికి బొంది మాత్రం మిగిలింది." అన్నాడు జర్మియా అతిదీనంగా.

భగవంతుని కృపా కటాక్షాలను గూర్చి జర్మియా వక్కాణించుతూంటే ఇలియా డెందము భవిష్యద్భవ్యస్థితిని గూర్చిన వుజ్జ్వలానంద సందోహమై తేలికపడేది. ఎంతో వుత్సాహంతో శ్రమపడి వృద్ధునితో సహకరించేవాడు. చెత్త పోగులు, మురికి గుంటలు, కాల్వలు కెలికి కెలికి యినప ముక్కలు, రాగి రేకులు, గాజు పెంకులు వగైరా యేరి తీసి జర్మియా కందించుట కెంతో వుబలాటపడేవాడు. ఎప్పుడైనా యేదేని కాస్త విలువైన వస్తువు దొరికితే జర్మియా యెగిరి గంతేసి అందిపుచ్చుకుని అటునిటు పొంగజూచి గప్‌చిప్‌గా దాన్ని జోలిలో వేసుకు నేవాడు.

ఇలియా రంగురంగుల గాజు పెంకుల్ని యేరి జేబి నింపుకుని భుజాన వేసుకుని స్వయం పోషకునిలాగ సంతృప్తితో యింటిముఖం పట్టేవాడు. దారిలో ,,అబ్బీ! వాటిని తలాఒకటి పంచిపెట్టు. పిల్లలు సంతోషిస్తారు. చుట్టునున్న

వారిని సంతోషపెట్టే వారిపట్ల భగవంతుడుకూడ ప్రసన్ను డవుతాడు. అందరు సుఖపడాలనీ, ఆనంద మనుభవించాలనీ దేవులాడుతారు; కాని, యీలోకంలో అందరికీ ఆనంద మెక్కడ రాసిపెట్టివుంది! నిర్భాగ్యు లెందరో జీవితాలనైతే వెళ్ళబుచ్చుతూనే వున్నారు; కాని, వాళ్ళకి సుఖం దుర్లభ మయినా యిస్తేగా!'' అని జర్మియా బోధించేవాడు.

పగలస్తమానం యింటిముందర తారాడుతూ వీళ్ళ వాళ్ళ తిట్లు, యీసడింపులు పడేకంటే సందుగొందులోను, పెంటకుప్పల్లోను మురుక్కాల్వల్లోను పారవేసిన పాత సామానుల్ని గాలించి యేరుటలోనే ఇలియా కానందం లభించుతోంది. ఆ సందుగొందుల్లో జర్మియాలాంటి వయసుడిగిన యేఒకరిద్దరు వృద్ధులతో తప్ప పాషాణవంటి రాలుగాయి యెటునుంచో అమాంతంగావచ్చి మీదపడి తన్ను ఒకటి, రెండు పిడిగ్రుద్దులు గ్రుద్దేవాడుగాని, అమ్మనాలి బూతులు కూసే వాడుగాని యెవడూ కన్పించడుగా మరి!

ఒకటి రెండుగంటలసేపు అదీయిదీ యేరుకొని యిద్దరూ పోయి యే చెట్టునీడనో చతికిల బడేవారు. బొక్కసాలోనుంచి చద్దరొట్టెలు తీసి తాపీగా తినేవారు. తిని రెండుగుక్కల నీళ్ళు తాగిన తర్వాత జర్మియా చెప్పేవాడు—"నాయినా! ఈ విశ్వం యెంత విశాల మయిన దనుకున్నావు! అయినా కూడా తమకిది చాలదన్నట్టు మానవు లిందలి ప్రత్యణువు కోసము గ్రుడ్డిగా దెబ్బలాడుకుంటారు. పరమేశ్వరుడు వీరి మూఢత్వానికి జాలిగా నవ్వుతాడు. ఆయన స్వస్థానంలో

వుండే మానవుల హృదయస్థభావాలన్నిటినీ ఆకలింపుతో ఆకలింపు చేసుకుంటాడు. అందువల్లనే ఆయన్ను సర్వజ్ఞుడనీ సర్వవ్యాపితుడనీ అంటారు. ఆయనకంతా కనపడుతూనే వుంటుంది. ఎల్లరి కర్మలను చూస్తూ పాపపుణ్యాలను తూస్తుంటాడు. నువ్వు నీ పాపాలనుండి మానవుల కన్ను గప్పగలవేగాని, ఈశ్వర దృష్టినుండి మరుగు పర్చలేవు. మానవుడు పాపాచరణతో ప్రవృత్తుడు కాగానే భగవంతుడు 'రే దుష్టా! ఆగు మాగు'మని హెచ్చరించుతాడు. అప్పటికీ దారిలోకి రానివాని పాపం బ్రద్దలవుతుంది. భగవంతుడు వాడిని శిక్షించడానికి వుద్యుక్తుడవుతాడు. ఎట్టి కఠిన శిక్ష విధించుటకును ఆయన వెనుదీయడు. మనం పరస్పరం ప్రేమించుకోవాలన్నదే ఆయన యింగితము. ఆవిధంగా ప్రవర్తించని వ్యక్తి యావజ్జీవితము యమయాతన లనుభవించుతూ కష్ట జీవితమును గడపాల్సివస్తుంది.''

ఇలియా పుడమిమీద పడుకొని అర్థనిమీలిత నేత్రుడై వృద్ధ జర్మియా చెప్పు విషయాలను గురించి ఆలోచించుకునేవాడు. ఏదో విచిత్రమైన వుదాసీన భావమేర్పడి గుండె బరువెక్కినట్టయి కళ్ళముందేవేవో అస్పష్టాకారాలు మెదలేవి. అంతులేని బ్రహ్మాండమగు ఆకృతి-ఎవని దివ్యతేజస్సుచే దిక్కులన్నీ దీప్తిమంతము లవుతున్నవో ఎవని కృపాంబుధికి పారములేదో. ఎవడు నిర్మలాంబర వీధిని తేజరిల్లు చున్నాడో, సర్వప్రాణులెవని స్వచ్ఛంద పవిత్ర జ్యోతివంక పరుగులిడి పోతున్నవో - అట్టి దివ్య మంగళ తేజోమూర్తి కనపడుతూన్నట్టు తోచేది. అప్పుడు

ఇలియా ఆనందోద్రేకంతో చటుక్కున లేచి కూచునే వాడు. సందేల ఇలియా యింటికి తిరిగి వచ్చేవాడు. అప్పుడు వాని ముఖం యేదో ఘన కార్యం చేసివచ్చినట్టు ఆత్మాభిమానంతో కళకళలాడు తూండేది. వాని మనసిప్పుడు సామాన్య బాలకుల భాంతి ఆటపాటల్లో లగ్నమవటంలేదు. అల్లా చేయటం తనకి న్యూనతగా భావించు తున్నాడు. ఇంటికిరాగానే ముసలివాడనేవాడు— "పగలంతా తిరిగి తిరిగి చీకటిపడే వేళకి యెల్లాగో గూటికి చేరుకున్నాము. బిడ్డా, యిలియా! కాళ్ళూ చేతులూ కడుక్కొని హోటల్లోకి రా. కాస్త తిని మరీ జపో తలకి."

ఇలియాను చూచీ చూడటంతోనే పిల్లకారంతా వచ్చి వానిచుట్టూ మూగేవారు. చూడాలనే కుతూహలం కొద్దీ వాని జోలి నూడలాగే వారు. పాష్కా ఇలియాను దారిలోనే అడ్డగించి "జోలిలోవన్నీ నాకుచూపించి కదులు" మని జబర్దస్తీ చేసేవాడు.

"ఆగవోయ్! నన్ను కాళ్ళు, చేతులు కడుక్కొనీరా" అనేవాడు ఇలియా.

ఒక వేపునుంచి పెరెన్కు వచ్చి ఇలియా వీపుమీద చెయ్యేసి తట్టి "ఏమోయ్ పనోడ! పనిలోనుంచి తిరిగొచ్చావు!" అని ప్రేమతో పల్కరించేవాడు.

పిత్రువ్యుని మాటలకు ఇలియా పొంగిపోయేవాడు. క్రమంగా అక్కడి వారందరు ఇలియాను శ్రమశీలిగా పరిగణించసాగారు.

ఒకనాడు కొడుకు ఆగడాన్ని సహించలేక సావెలు పాషాకాను తాటితో కట్టేసి చితగొట్టాడు. కోపం పట్టలేక నోరుచించుకొని నానాచివాట్లు పెడుతున్నాడు. "పసికి మాలిన చవట! నీ యీకువాళ్ళు కష్టపడి రెండురాళ్ళు సంపాదించుకొస్తూంటే నువ్వు తెగతిని సోమరిగాతిరగటమే కాక అస్తమానూ రద్ది చేస్తున్నావా? తినికూచోక యీఅల్లరేమిటి? నీ వుచ్చి పగులకొడ్తానుండు" మని తిట్టి ఆవేశంతో మళ్ళీ మోదసాగాడు.

పాషాకా లబోలిబోమని యేడుస్తున్నాడు. ఇలియా యిదంతా చూస్తూనే వున్నాడు. సావెలు అన్నమాటలు తన్నుద్దేశించేనని వుబ్బిపోయాడు; కాని మరుక్షణంలో పాషాకాస్థితి తలచుకొని జాలిపడ్డాడు. తన తాహాతు మరచి పరుగెత్తుకెళ్లి "సావెలు బాబాయి! పాషాకాఅన్నయ్యని వొదిలిపెట్టు. ఇంకెప్పుడు అల్లరిచేయడులే" అని బ్రతిమాలాడు.

సావెలు కోపంలో కన్ను మిన్ను తెలియకుండా వున్నాడు. ఒకబుడ్డాడొచ్చి తన్నుమందలించటం నామర్దాగా తోచింది. "ఊఁ, మహా చెప్పొచ్చావు లేవోయ్; పో యికడనుంచి, లేకపోతే నీ తిక్కాగూడ వొదిలిస్తా"నని హుంకరించాడు.

పాపం! ఇలియా తెల్లపోయాడు; నోరుమూతపడింది. అయినా యింకే మన గలడు!

తండ్రి విడిచిపెట్టెళ్లిన తర్వాత పాషాకా పడుతూ లేస్తూ పోయి ప్రాంగణంలో ఒక మూల కూచుని వెక్కి

వెక్కి యేడుస్తున్నాడు. ఇలియాకు మళ్లీ జాలి వేసింది. వాడి దగ్గరకు చేరి "ఎక్కడెక్కడ తగిలినయి? బాగా నొప్పిగా వుందా?" అని పరామరిక చేశాడు.

పాష్కాకి కోపం పొడుచుకొచ్చింది. "పోవోయ్, నా జోక్యం నీ కెందుకు?" అన్నాడు తలెత్తి చూడకుండా నే.

ఇలియా చిన్నపుచ్చుకున్నాడు. జాలి పౌరుషంగా మారింది. "నువ్వు రోజూ అందరిని కొడ్తావే; ఇప్పుడు తగిన శాస్తి జరిగిందిలే" అని దీర్ఘం తీశాడు. పాష్కా గబుక్కున ఇలియా పైకి లంఘించి మీా దెక్కి కూచున్నాడు. ఇలియా కోపంతో భగ్గుమన్నాడు. ఒక విదిలింపుతో లేచి పాష్కా పైకి దూకి వాణ్ని పీటీమన్ను చేశాడు. కాస్సే పిద్దరూ పెనగులాడారు. పాష్కా వుక్రోషం పట్టలేక ఇలియాను కొరికి రక్కాడు. ఇలియా తీసిపోక వాడి తలకాయని నేలకేసి కొట్టాడు. చివరికి పాష్కా ఓడిపోయి విడిచి పెట్టుమని బ్రతిమాలుకున్నాడు.

ఇలియా తక్షణం వదిలేసి "జాగ్రత్త! మళ్లీ నామీాద కెప్పుడైన వచ్చావంటె నా తడాఖా చూపిస్తా."

పై మాటలని ఇలియా తన చేతి దండనుండి కారుతున్న రక్తాన్ని తుడుచుకుంటూ వెళ్లిపోయాడు. దారిలో పావెలు యెదురొచ్చాడు. జొత్తుల్లాంటి వాని కళ్లు చూచి ఇలియా గజగజలాడాడు. పాష్కాని కొట్టి

వచ్చినందుకు తన్నాతడు బాదక మానడనుకున్నాడు. తారుకుని పక్కకు తప్పుకొని సావెలు వంక చూచాడు. సావెలు వుగ్రరూప మింకా అలాగే వుంది. "ఏమిటి, గుడ్లు మిటకరించి చూస్తున్నావు? నన్నెప్పుడూ చూళ్లేదా? పో, పో," అని వురిమాడు.

చీకటి పడినాక సావెలు మరొక తడవ తారసిల్లాడు. అతడు ప్రేమతో ఇలియాను దగ్గరకు లాక్కొని తల నిమురుతూ "నీ వృత్తి చక్కగా సాగుతోందా!" అనడిగాడు.

ఇలియా వుబ్బి తబ్బిబ్బయ్యాడు. నేడా యింటి లోని వారందరిలోను క్రూరాతిక్రూరుడు తనతో నవ్వు తూ మాట్లాడు తున్నాడు. ఇది ఇలియా అనుభవంలో సామాన్య విషయం కాదు. పైగా సావెలు "నువ్వు పెద్ద వాడి వవుతున్నావు. దుక్కలాగున్నావు. మరి కొన్నాళ్ళు పోతే నిన్ను నా కార్ఖానాలో వుంచు కుంటాన్లే" అన్నాడు కూడాను.

ఇలియా కంఠం రుద్ధ మయింది. రెండు చేతులతో సావెలు పాదాలంటి కళ్ల కద్దుకున్నాడు. సావెలు వాని మూపు తట్టి వదిలేశాడు.

మర్నాటి పొద్దుగూకునూటు ఇలియా తన జోలి దించి, సామాను క్రింద పరచి చూచుకున్నప్పుడు వాని చిత్త ముల్లాసంగా వుంది. యథాప్రకారం పిల్లలు చుట్టూ చేరారు. తలొక వస్తువును చేత పట్టబోతూంటే "ఆగం

డాగండి. మీ రన్నీ తీసికెళ్లి పోతే నే నేంకావాలి? నేను వీటిని అమ్మేతాను. మీరు కావలసినవి కొనుక్కోండి” అని చెప్పాడు ఇలియా.

జాకోబు జేబిలోనుంచి చిన్న నాణె మొకటి తీసిచ్చి ఒకటి తీసుకో బోయాడు. ఇలియా అడ్డు తగిలి “ధర అడక్కుండా నే తీసుకుంటా వేమిటోయ్! జేబులో నుంచి డబ్బు తీసిస్తేనే సరిపోతుం దను కున్నావా?” అన్నాడు.

తర్వాత బేరమాడటము, కొనటము జరుగుతోంది. బేరంలో వాగ్వాదం కూడ సాగింది. అదే సమయంలో మెల్లగా పిల్లికి మల్లె పాష్కా వచ్చి అదాటుగా ఒకటి రెండు వస్తువులు లంకించుకొని వుడాయించాడు. అందరూ తెల్లపోయారు. వాడి కొంటెపనికి చిన్న పిల్లలు బిక్క మొగాలు పెట్టారు. ఇలియా జాకోబులు వాణ్ని పట్టుకోటానికి వెంట బడ్డారు; కాని లాభంలేక పోయింది. వారికిది కొత్తేమీ కాదు. పాష్కా నిత్యము చేసేదే. అందువల్లనే పిల్లలందరు వాడిని యెబ్బెట్టుగా చూస్తారు. వానితో ఆడుకు నేందు కెవరూ యిష్టపడరు. ఎవరికి వారు వాడికి దూరం దూరంగానే వుంటారు.

జాకోబు తరుచుగా మాషాతో కలిసి ఆడుకు నేవాడు. ఆమె మీద మాట పడనిచ్చేవాడు కాదు. ఇలియా వద్ద తమాషా వస్తువులు పట్టుకెళ్ళి యిచ్చి మాషాని సంతోష పెట్టేవాడు. జాకోబు ఇలియా లిద్దరూ కూడ

జతగా వుండేవారు. ఇద్దరూ వినోదకర విషయాలు చెప్పు కుంటూ కాలక్షేపం చేసేవారు. ఇద్దరూ మాషాని ఆనందింప జేయటానికి ప్రయత్నించేవారు. జాకోబు విచిత్ర విషయా లెన్నో చెప్పేవాడు. వాని చమత్కారపు మాట లాలకించుతూ ఇలియా నిద్ర సంగతే మర్చిపోతూండేవాడు. ఒక్కొక్కప్పుడు జర్మియా వచ్చి వాడిని లేవదీసుకొని పోవాల్సి వచ్చేది. ఇలియా నవ్వుకుంటూ వృద్ధు ననుసరించి పోయి సుఖ నిద్ర పోయేవాడు.

4

జర్మియా ఇలియాకి చొక్కాయి, షరాయి, టోపీ, కాలి జోడు కొనిచ్చాడు. ఇలియా యిప్పుడు విద్యార్థి అయ్యాడు. తొలినాటి సాయంత్రం బడినుంచి తిరిగి వచ్చినప్పుడు వాని మోము మ్లానమై, విషాద భరితంగా వుంది. కంట నీరుపెట్టి "బళ్లో నన్నందరు వుడికిలించారు. నన్ను చూచి వాళ్ళు ముక్కులు మూసుకొని, మూతులు ముడుచుకున్నారు. నా ఒంటినుంచి గబ్బు వస్తోందన్నారు. వాళ్ళు నన్నెందు కేడిపించాలో? పెంట కుప్పల్లో వాటేసిన వాటిని యేరుకుంటే తప్పా?" అని మొర పెట్టుకున్నాడు.

పెరెన్ను వాని వెంట్రుకలు జీరుతూ "పిల్లలు కొత్త వాళ్లని వేళాకోళం చేసి వెక్కిరిస్తారు. ఉడికిలించటం

వారికి స్వభావము; కాని, బుద్ధిమంతులు వాటిని సరకు చెయ్యకూడదు. నాలుగు రోజులు పోతే అన్నీ తగ్గి పోతయి ” అని బుజ్జగించాడు.

“అందరూ నా దుస్తుల్ని చూచి యెద్దేవ చేశారు కూడాను.”

జర్మియా నవ్వి “బిడ్డా! భగవంతుని నమ్ముకో. ఆయనే నీకు మేలు చేస్తాడు” అని సముదాయించాడు.

జర్మియా భగవన్నామ సంస్మరణని గూర్చి చెప్తుంటే కోపం చల్లారి ఇలియా శాంతించేవాడు; కాని, మర్నాడు పాఠశాలలోని విద్యార్థుల మాటల తీరు, పరుష వాక్యాలు మళ్ళీ వాని నుద్విగ్న మానసుణ్ని చేసేవి. ఇలియా తన్ను తా గుర్తించుకో సాగాడు. సావెలు వంటి కఠినాత్ముని దృష్టిలో సైతం తన కొక విధమైన గౌరవ మేర్పడింది; కాని, బడి పిల్లకాయలు తన్ను చులకనగా చూస్తున్నారే. ఇలియా కది దుర్భర మయింది. స్కూలులో తనకి జరుగుతున్న అవమానము, పట్టిన గతీ వాని హృదయాన్నటమటంప జేసేవి. బడి వాని కొక బ్రహ్మ రాక్షసి లాగుంది. పాఠశాల పేరు విన్నంతనె వాని తల బరువెక్కేది. సహాధ్యాయుల్లో యెవరితోను వానికి పొత్తేర్పడ లేదు. అందరితోను యెడామొగంగా వుండే వాడు. ఇలియా కుశాగ్ర బుద్ధి, శ్రద్ధలు సహపాఠుల కసూయను కలిగించినయి. వాళ్ళు ఇలియాను మరింత ద్వేషించ సాగారు. వానితో చదువులో పోటీ చేయ

లేక చదువురాని వాజమ్మలు కుటిలోపాయాలు పన్ని వానిని కించ పరుప జూచే వారు. జాకోబు కూడ ఆ బళ్ళోనే చదువు కుంటున్నాడు. వాడొక మందమతి. అందుచే వానికి దెబ్బలు దండిగా ముట్టుతుండేవి. తలి మ్మాలి బాలురు వానిని కూడ యెత్తిపొడుపులతో యేడ్పించేవారు. 'గబ్బిలాయి' అని పేరు పెట్టారు జాకోబుకి. అయినా వాడు తన్ను కాదన్నట్టు పట్టించుకునేవాడు కాదు. బడిలో ఎవరితోను కలిసి మెలసి తిరిగేవాడు కాదు. ఇంటి వద్ద కూడ ఒంటరిగా నుండ నభిలషించేవాడు. అప్పు డప్పుడు ఇలియా మామాలతో మాత్రం కాలం గడిపే వాడు. వాడికెక్కడలేని విచిత్ర సందేహాలు పుట్టుకొచ్చేవి. ఒక తేప "ఇంత చిన్ని కళ్లతో మానవులు పెద్ద పెద్ద వస్తువులను యెలా చూడగలుగుతున్నారో?" నని ఇలి యాను ప్రశ్నించాడు.

మరొక తడవ దినకరుని గూర్చి మాట్లాడుతూ జాకోబు మరింత విస్మయం వెలిబుచ్చాడు. "సూర్యుడు అంత వెచ్చగా కాగి పోవటానికి కారణమేమిటో?" అనడి గాడు.

ఇలియా నవ్వాడు. అందుమీందట జాకోబు "నా వుద్దేశ మేమిటో తెలుసా? సూర్య చంద్రులు భార్యా భర్తలనీ, వారిద్దరి సంయోగం వల్లనే ఆ తారాగణ మంతా వుద్భవించిందనీ అనుకుంటున్నాను. నువ్వే మంటావు?" అన్నాడు.

మొదట్లో యిల్లాంటి చిత్ర విచిత్ర విషయాలను గూర్చి ఆలోచించడము ఇలియాకు ఆనందంగానే వుండేది; కాని, అందువల్ల తన చదువు అనాంతరం యేర్పడుతోందని క్రమంగా గ్రహించుకున్నాడు.

ప్రతిదినము తనకళ్ళముందెన్నో సంఘటనలు జరుగుతుండేవి. ఇలియా వాటన్నిటిని గురించి ఆలోచించు టవసరమే ననుకునేవాడు. ఒకనాడు బడినుండి వచ్చి జర్కియాతో అన్నాడు— "తాతా! మా మాష్టారు బలే చిత్రమయిన మనిషి. నిన్న మిఠాయి కొట్టు వారబ్బాయి కిటికీ అద్దం పగులగొడితే నాలుగు కూకలేసి తమ డబ్బుతోనే మళ్ళీ అద్దం వేయించారు."

"అయితే మీ పంతులయ్య చాలా మంచి వాడన్న మాట" అన్నాడు జర్కియా.

"నే నల్లా అనుకోవటంలేదు తాతా! ఈ మధ్యనె ఇంకో విద్యార్థి చెయ్యితగిలి అద్దంచిట్లితే వాని తండ్రివద్ద రెట్టింపు కిమ్మతు వసూలు చేశారు. మరదేం న్యాయం?"

"బిడ్డా! నీ విల్లాటి విషయాలన్నీ బుర్రకి పట్టించుకోకూడదు. ఒకరి తప్పొప్పులను పరిశీలించటము మన పని కాదు. పరమేశ్వరుడె యెల్లరి కర్మలను పరీక్షించుతాడు. మనం యెప్పుడూ మాయలో పడిపోతాము. మంచి మనకళ్ళకి కనపడదు. మనం రంధ్రాన్వేషణ మాత్రం చేస్తుంటాము; దేవుడట్లు గాక సమదృష్టితో చూస్తాడు. నాకు యెనభై యేళ్ళొచ్చాయి; గాని, యింత వయస్సులోను నే నెవర్ని

సత్కార్యం చేస్తుండగా చూశ్ళేదు. అయితే అంతమాత్రాన యిన్నాళ్ళ నుంచి నాకళ్ళముం మంచిపనీ జరగనే లేదని తలచ కూడదు. తప్పకుండా జరిగే వుంటయి. కాని, అవి నా దృష్టిలో మాత్రం పడలేదన్న మాట. అంటే నేను వాటిని గుర్తించలేక పోయాను; అంతే."

"కాని, యిందులో యేమంత సూక్ష్మ విషయాలే దే! ఒకే అపరాధానికి రెండురకాల శిక్షా విధానం న్యాయయుక్త మెల్లా అవుతుంది? రెండో అపరాధి నుండికూడ మొదటి పిల్లవానివద్ద వసూలు చేసినట్టె నష్టపరిహారం రాబట్టుకో వాలి గద?"

ముసలాతడు ఇలియాతో యేకీభవించలా. "మనకి సరియైన న్యాయం జరగాల్సిన యోగ్యత లేదు; కాబట్టి మన మా విషయంలో నోరెత్తరాదు. భగవంతుడే గట్టి తనిఖీ చేసి నిర్ణయించుతాడు." అని నొక్కి చెప్పాడు.

ఇలియా యిక మాట్లాడలా; కాని, జర్మియా వాదము వానికి మనస్కరించ లేదు. వాని వదన మండలాన్ని విషాద ఛ్ఛాయ లలము కున్నయి. కొంత తడవాగి తటాలున అడిగాడు— "తాతా! మనందరిని విచారించడానికి భగవంతుడు కచేరి నెప్పుడు ప్రారంభించుతాడు?"

అది ఒకరు చెప్పేదికాదు. ఎప్పుడో ఒకనాడు అకాత్తుగా హెచ్చరిక గంట మ్రోగుతుంది. ఈశ్వరుడు క్రిందికి దిగివచ్చి విచారణ ప్రారంభించుతాడు. నువ్వుకూడ నాతో

చర్చికి వస్తూండు. అక్కడ నీ సందేహాలన్నీ నివృత్తి అవుతాయి."

ఇలియా వృద్ధునితో చర్చికి వెళ్ళాడు. జనం తండోప తండాలుగా వచ్చారు. ప్రార్థనా మందిరము కిటకిట లాడు తోంది. కాలుమోపే సందు లేదు. పట్టణంలోని కులీనులు, సామాన్యులు, సన్మార్గులు, దుర్మార్గులు అన్ని తరహాల మనుషులు అక్కడ చేరారు. ఎల్లరి హృదయాలు పవిత్రమై నిర్మలంగా వున్నట్టు తోస్తోంది. ప్రతివాని ముఖంలోను శాంతి చిహ్నలు ప్రతిబింబించుతున్నై. చెడుగు మానవు లను వదలి పారిపోయిందా అన్నట్టు తోచింది. ప్రతివాని వదనము వికసించి వుంది. యావన్మంది యేకాగ్ర చిత్తులై ప్రార్థనలో లీనమయ్యారు. ఇలియా తన్నుదినము బడిలో కొట్టి, తిట్టుతుండే తుంటరి బాలకు లిద్దరినికూడ అక్కడ చూచాడు. వాళ్ళని చూచినందువల్ల ఇలియా స్వాంత మెట్టి వికారమును చెందలేదు. వాళ్ళను క్షమించి యికనా యిద్దరి తోను సఖ్యతగా వుండాలని ఆత్రపడ్డాడు; కాని, స్కూలుకు వెళ్ళిం తర్వాత ఆ భావనలన్నీ నశించి పోయినవి. ఇలియా యెప్పటి మోస్తరుగా వ్యథిత హృదయుడై మ్లాన ముఖం తోనె బడినుండి తిరిగి వచ్చాడు. ఏ సమాజంలోగాని, సభా సంఘాలలోగాని ఒకరో యిద్దరో తతిమ్మావారి పోకిళ్ళతో అసంతృప్తిచెంది భేదించినవారు కనపడుతూనే వుంటారు. వాళ్ళు మిగతా వారికంటె మంచివాళ్లా కావచ్చు, చెడ్డ వాళ్లా కావచ్చు. వారిలో చెడుగు అంతగా లేకపోయినా ఒకొక్కక్క వ్యక్తిని సంఘం అసహ్యించుకోవటంకూడా కద్దు.

ఈ సమాజంలో ఇలియా అట్టివాడె. క్రమక్రమంగా వాడ సమాజాని కనుగుణంగా మారిపోవటము, సమాజదృక్పథ ఇలియా దృక్పథము పరివర్తనం కావటముకూడ సంభవమే; కాని, ఆతరుణంలోనె గుండెను పిండిచేయగల సంఘటన జరుగుటవల్ల వాని జీవితక్రమమె అన్యమార్గంలో పడింది.

ఒకనాటి సంగతి: ఇలియా జాకోబులు భోజనాని వెడుతున్నారు. ఇంటిముందేదో గలబా వినబడింది. ఇలియా గిరుక్కున వెనక్కితిరిగి అటువేపుకు పరుగుతీసాడు. ముందా వరణలో జనం గుమికూడి వున్నారు. ఏమేమో వాగు తున్నారు. ఇలియా గుంపును చీల్చుకుంటూ యెట్టో లోపలికి చొరబడ్డాడు. కమ్మరి కార్ఖానా ముందొక స్త్రీశవము పడివుంది. సావెలు గుమ్మంలోకూచొనివున్నాడు. వాని పెదిమలు అదురుతున్నై. కన్నులు జోత్తుల్లా గున్నవి. ముఖం వికృతమై భయం కల్గిస్తోంది.

"చప్పున పోలీసుల్ని పిలవండి. ఈ దుర్మార్గుణ్ని వూరకే వదలకూడదు" అనే కేక విన్పించింది గుంపు నుంచి.

జనం ఆగ్రహావేశంతో పళ్ళు నూరుతున్నారు. అంతలో జర్మియా అక్కడికొచ్చాడు. అతని నెరిసిన వెంట్రు కలు చెదిరివున్నై. చెమట కాల్వలు కడుతోంది. కుడిచేతో నీళ్ళగ్లాసు పట్టుకొచ్చాడు. ఆగ్లాసును సావెలు కందించుచు "కొంచెంనీళ్ళు తాగు నాయనా!" అన్నాడు కనికరంతో.

"ఈ ఛండాలుడిని దయతలచ కూడదు. వీణ్ణి పు
ంబ మెక్కించాల్సిందే" నన్నాడు గుంపులో ఒకడు.

సావెలు మెదలకుండ గ్లాసంది పుచ్చుకొని నీళ్ళన్నీ గటగట తాగేశాడు. కొంచెమాగి కర్కశ స్వరంతో చెప్పాడు—"నేను దీనికెన్ని తడవలో చెప్పాను; కాని, నా మాటల్ని కించిత్తైనా లక్ష్యపెట్టిందికాదు. తన గొయ్యి తానే త్రవ్వుకుంది. నే నేం చేస్తాను? పాష్కకి దిక్కులేదని మాత్రం నాకు దిగులుగా వుంది. బాబా జర్మియా! దిక్కులేని పాష్కని కాస్త కనిపెట్టి చూస్తుండు. దేవుడు నీకు మేలు చేస్తాడు."

వృద్ధుడు వానిని ఓదార్చసాగాడు. అంతలో గుంపులోనుండి యెవరో అన్నాడు— "ఓరి లుచ్ఛా! భగవంతుని పేరునుగూడా వుచ్ఛరించు తున్నావుగా!"

ఈ మాటలువిని సావెలు తలెత్తి గ్రుడ్లురిమి గుంపు వంక చూచాడు. "మీరంతా యిక్కడి కెందు కొచ్చారు? మీకిక్కడేం పని? పో, పొండి" అని గదమాయించాడు.

వాని గంభీర గర్జనతో జనంలో కలవరం పుట్టింది. ఒక్కొక్కరె అక్కడనుంచి చల్లగా జారుతున్నారు. సావెలు కూర్చున్న చోటునుండే చనిపోయి పడియున్న తన భార్యవైపోసారి చూచాడు! తర్వాత లేచి కార్ఖానాలోకి వెళ్ళిపోయాడు. అందులో ఒకమూల నున్న దిమ్మమీద కూచుని చేతుల్తో నెత్తి నదిమి పట్టుకున్నాడు.

సావెలు దుర్గతికి ఇలియా కళవళ పడ్డాడు. వాని కోమల హృదయం దయార్ద్రమయింది. ఇక నక్కడ నిల చుండ లేక పోయాడు. ఆవరణంలో జనసమ్మర్దం లేనిచోటుకు వెళ్ళాడు. మళ్లీ అక్కడినుంచి గుంపు రెండో వేపుకు న చాడు. ఎవరేమి చెప్పుకుంటున్నదీ శ్రద్ధగా ఆలకించాడు కాని, వానికేమీ బోధపడలా. వాని హృదయమే శూన్య మయిపోయింది.

పోలీసులు వచ్చారు. కదం తొక్కుతూ లాఠీలు త్రిప్పుతూ జనాన్ని చెదరగొట్టారు. ఏమేమేమిటో అడి రాసుకుని సావెలును అరెస్టు చేసి తీసుకెళ్ళారు.

సావెలు వెళ్తూ వెళ్తూ జర్మియాకు వంగి నమస్కారం చేశాడు. తర్వాత పోలీసుకట్టడిలో ముందుకు సాగిపోయాడు. అక్కడ పోగైన అంతమంది జనంలోను సావెలుకోసం జా పడింది జర్మియా ఒక్కడే.

జన మింకను జట్లుజట్లుగ యింటిముంగల నిలబడి పై సంఘటనను గూర్చి తర్కవితర్కాలు చేస్తూనేవున్నారు. ప్రేతం యథాస్థానంలోనే పడివుంది. సావెలు గదపముందొక కానిస్టేబిలు పహరా యిస్తున్నాడు. వాడు మండిగముమీద కూచుని దమ్ము లాగుతున్నాడు. ఉండుండి తుపుక్కున వుమ్మివేస్తూ జర్మియా మాటల నాలకించుతున్నాడు.

జర్మియా అక్కడున్న వారితో యిల్లా చెపుతు న్నాడు—మీారీహత్యను సావెలే చేశాడనుకుంటున్నారా

కాదు, మానవుడెన్నడు మరోమనిషిని చంపలేడు. ఇల్లాంటి ఏహ్యము, హేయము నైన పని మానవునివల్ల జరుగుతుందా? అల్లా ఎన్నటికీ జరుగదు. అతని హృదయంలో సైతాను ప్రవేశించి యీ అనర్థం చేశాడు, అంతే."

ఇంతవరకు చెప్పి తన గుండెలో నుంచి యేదో వస్తువు త్రోసివేయబడుతుంటే ఆపబోతున్నట్లు రెండు చేతులతో గుండెను గట్టిగా అదుముకున్నాడు. ఒకసారి కాండ్రించి దగ్గి మళ్లీ ప్రారంభించాడు— "సైతాను యెడతెగకుండ నా చెవిలో 'దాన్ని చంపు, అనుమానం లేకుండా చంపెయ్యి' మని చెప్పాడు."

"చాలా రోజుల నుంచేనా?" పహరా జవానడిగాడు.

" అవును, చాల రోజుల నుంచీను. సైతానింకేమి చెప్పిం దనుకున్నారు? ఆమె నీది. నీవామెను హత మార్చవచ్చు. 'చంపేసెయ్యి' అని వూదింది; కాని, అది పూర్తిగా భ్రమ: గుర్రం మనది; కుక్క మనదే; కాని స్త్రీపైన మనకెట్టి అధికారమూ లేదు. స్త్రీ భగవంతుని వస్తువు. ఆమెలో మానవాత్మ వుంది. సృష్ట్యారంభం నుండి విధాత స్త్రీ నెన్ని ఇక్కుమలపాలు గావించినా భూదేవిలా ఓరిమితో సహిస్తూ వచ్చింది. సైతాను మనల్ని భగవంతునికి వ్యతిరేకంగా రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తుంటుంది. సైతాను దేవునికి బద్ధవిరోధి. మనల్నికూడా తనకి తోడు చేసుకుంటానికే చూస్తుంది. ఆ సైతానే నావెంట నా వేశించి యీ హత్య చేయించాడు.

పోలీసుజవాను అన్నాడు—"కాని, ఆ సైతాన్నెవరూ చూళ్ళేదే. సావెళే ఆమెని చంపేశాడు."

"సరే, మరి అతన్ని రెచ్చగొట్టిం దెవరో ఆలోచించావా? ఈ పాపం చేయమని వానిని ప్రేరేపించిన దెవరంటావు?"

కానిస్టేబులు కళ్ళెర్రజేసి "ఇంతకూ యీ కష్టాని కేమవుతా డేమిటి?" అనడిగాడు.

"ఏమీ అవడు" అని జర్మియా చెప్పాడు.

"మరి నీకీ వాగుడంతా దేనికి?"

"దేవుని పేరుతో."

"ముసలాళ్ళకు మతి పోతుంది. అనాథలు చెన్నాకులు వాగటం మాత్రం మీకు అలవాటవుతుంది. చాల్లే ఇక పో."

ఆ విధంగా కసరి పోలీసు జర్మియా వేపు నుంచి మొఖం త్రిప్పేసుకున్నాడు. జర్మియాం వాగ్ధోరణి సాగుతూనే వుంది. సావెలు దేమీ తప్పులేదనీ, అతను సైతాను ప్రేరణ వల్లనే భార్యను చంపుకున్నాడనీ అందరికి నచ్చజెప్పాలని వృద్ధుని పట్టుదల.

ఇలియా మ్రాన్పడి చూస్తూ అందరి మాటలు వింటున్నాడు. అక్కడ పిసుగత్తి నారీ మండలి వున్న దిక్కుకెళ్ళాడు.

"పెళ్ళికి ముందునుంచి అది చెడిన ముండే. పాష్కాగాడు మాత్రం సావెలుకు పుట్టాడా యేం? వాడు పుట్టక పూర్వమె అది ఆ తాగుబోతు పంతులు మచ్చికలో పడింది" అన్న దొక నెరజాణ.

"ఆత్మహత్య చేసుకొని చచ్చాడే-ఆమాష్ట రేనా?" అనడిగింది మరొక తె.

"అవును, వాడే."

అప్పుడె అక్కడి కొచ్చిన మాశర్ అందుకు న్నాడు—"ఏమయినప్పటికి సావెలు చేసింది వెధవ పని. ఆ విధంగా హత్యచేసి యీ రీతిని స్త్రీ పైన దోష మారో పించడం గర్హనీయం."

"నాభార్య బొత్తుగ పనికి మాలిన మొద్దు; అయినా నేను పెదవి విప్పకుండ సహించి కాలం డొల్లించు కొస్తు న్నాను" అని చెప్పుతున్నాడు ఫర్ఫిష్కా.

"నీ ఓర్పు మెచ్చుకో తగిందే" నంది మతిస్సా.

అదే సమయంలో ఫర్ఫిష్కా పెళ్ళాము దేకుతూం టూ తమ గుమ్మంలో కొచ్చి తదేక ధ్యానంతో నింగివంక చూస్తూ కూచుంది.

ఇలియా ఆమె వంక శ్రద్ధగా చూచాడు. వాని కా విడ ఆకాశంలో దేవుని పవిత్ర స్వరూపాన్ని గాంచి మూక భాషలో ప్రార్థించుచున్నట్లు తోచింది.

ప్రాంగణంలోనే మరో తట్టున పిల్లలు పోగయారు. వారిలో పాష్కా వున్నాడు. ఇలియా కూడ అక్కడి

వెళ్ళాడు. పాషా గొప్ప ధీరునిలాగ తన జనని హత్యావివరాలు చెప్తున్నాడు. బాలబాలికలు వానిచుట్టూ దడికట్టి నుంచుని వింటున్నారు.

"మొన్ననగా మా యమ్మ యిల్లొదిలిపెట్టెళ్ళింది. అప్పటినుంచి నాన్న కోపంతో మండిపడుతూనే వున్నాడు. అప్పుడప్పుడు ఆకోపాన్ని నామీద చూపేవాడు. ఇందాకనే మాఅమ్మ వచ్చిం దెక్కడినుంచో. ఇంటి తలుపుకు తాళం వేసివుంది. మేమిద్దరము కార్ఖానాలోనే వుండాము. అమ్మవచ్చి తాళంచెవి నిమ్మంది. నాన్న మాట్లాడకుండానే వున్నపాళంగా లేచెళ్ళాడు. నాకప్పుడే తెలిసిపోయింది ఆయనేంచేసేదీ. గాబరా పుట్టింది. నాకళ్ళు వాటంతటవె మూసుకొనిపోయినై. బిగ్గరగా కేకేసి అమ్మతో చెప్పేద్దామనుకున్నాను; కాని నానోట్లోనుంచి మాటే పెగల్లేదు. వెళ్ళీవెళ్ళటంతోనే నాన్న అమ్మపై కురికాడు. ఆమె పారిపోయింది; కాని, నాలుగడుగుల్లోనే ఆమెని లంకించుకున్నాడు. ఒక్క దెబ్బకే అమ్మ క్రింద పడిపోయింది."

పిల్లలందరు గజగజలాడారు. ఒకడూ నోరు తెరవలా. తర్వాతికథ వినాలన్నట్టు నిశ్శబ్దంగా వున్నారు; అయితే పాషా మళ్ళీ నోరు విప్పలేదు. క్రిందవున్న గడ్డిపరకలను తీసి వాళ్ళపైకెగజిమ్మి తలొంచుకుని కూచున్నాడు.

"ఆయన మీయమ్మ ప్రాణం తీశాడా?" అనడిగింది మాషా.

"ఎక్కడో అడ్డగాడిదలాగున్నావే!" అని పాష్కా కసిరాడు.

పాపమాపిల్ల చిన్నపుచ్చుకుంది. జాకోబు మాషాని తన వద్దకు లాక్కొని పుసలాయించాడు.

"నీకు విచారంగా లేదూ?" ఇలియా అడిగాడు.

"నీకెందుకోయ్ చవట!" అని పాష్కా గుడ్లురిమి చూశాడు.

అందరి చూపులు పాష్కామీది కెళ్ళాయి.

పగలంతా పాష్కాతల్లి వీధుల్లో తిరుగుతుండేదని మాషా అనాలనుకుంది. కాని జాకోబామె నోరుమూశాడు. "సావెలు స్వభావాన్నిబట్టి జరిగింది అసంభవమేమీ కాదు. ఆయన కళ్లెప్పుడూ జ్యోతుల్లాగుండేవి. చిరబురలాడుతుండేవాడు. ఆమె యెప్పుడూ నవ్వుతూనే వుండేది. మరి ఆ యిద్దరకీ యెల్లా కలుస్తుంది!" అన్నాడు తాను.

పాష్కా శిరమెత్తి చూచి విసుక్కుంటూ అగిందావతె "ఎప్పుడో కోపమొచ్చినప్పుడు అకాత్తుగా నాన్న చంపేస్తాడని నేను లోగడే అమ్మతో చెప్పాను. కాని, నా మాటని లెక్కజేస్తేగా. పైగా జాగ్రత! మళ్ళీ నోరెత్తావంటె మక్కెలు విరగ్గొడతానని నన్ను కోప్పడింది. నాకు మంచి మంచి బొమ్మలూ చిరుతిండీ తెచ్చిపెట్టేది. మేజరుగారుకూడ నాకేదైన యిస్తూండేవాడు. నన్ను ప్రేమతో చూచేవాడు కూడాను" అని చెప్పాడు.

"ఆయనవద్ద కత్తి వుండేదా?" మాషా అడిగింది.

"ఆ, పెద్దకత్తి. ఒకసారి ఒరలోనుంచి లాగిచూశాను కూడాను. చాలా బరువుంది."

"పాపం! నువ్వుకూడా ఇలియాలాగా అనాథుడ వయ్యావు" అన్నాడు జాకోబు సానుభూతి సూచకంగా.

"అల్లా ఎన్నటికీ కాను. నేను వాడికిమల్లె సందు గొందుల్లో మురికి గుంటలు కెలుకుతా ననుకున్నావా?" అన్నాడు పాష్కా.

"ఎబ్బే! నావుద్దేశమది కాదు పాషా!" జాకోబు అన్నాడు.

"ఇప్పుడు నేను సర్వస్వతంత్రుణ్ని. ఇక నేను యథే చ్ఛగా తిరగొచ్చు. ఇదివరకు నాన్న నన్ను చదువుకో నిచ్చాడుకాడు. ఇక నిరభ్యంతరంగా చదువుకుంటాను."

ఇలియాకు నవ్వొచ్చింది. "నీకు దుస్తు లెక్కడివి? పాతగుడ్డలతో బళ్ళోకి రానియ్యరుగా" అన్నాడు.

"ఓస్! నా కార్ఖానా అమ్మితే బోలెడంత డబ్బు. నా కేమిటోయ్!"

అందరూ పాష్కా నభినందించసాగారు. ఇలియా ముఖం తెల్లబడింది. వాడికిప్పుడు డబ్బు మహిమ బాగా బోధపడింది. పాష్కా విజయదర్పంతో ఇలియావంక చూచి యిలా అన్నాడు— "నేనొక మంచి గుర్రాన్ని కొను క్కుంటాను. రో[illegible] గుర్రమెక్కి వెళ్తా" ఈమాట

చెప్పాడు కాని, మరుక్షణంలోనే యేమితోచిందో భయ మావరించి వాని వుల్లాసమంతా మాయమయిపోయింది.

మాషా వాని కళ్ళలోకి చూస్తూ "ఇక నిన్నెవరూ కొట్టరు కూడాను" అన్నది.

"అదేమన్నమాట? కొట్టేవాడెవడో ఒకడు వుండనే వుంటా" డన్నాడు ఇలియా.

పాష్కా వానిని మిరి మిరి చూచి "ఎవడికుంది గుండె? నీకా? రా మరి, కుస్తీపడదాము" అని దండ చరిచాడు.

జాకోబు కలుగజేసుకుని ఇద్దరినీ శాంతపరిచాడు. విషయం మార్చాలని "ఎంత గమ్మత్తుగా వుందో చూడండి! ఇంతకుముందె కులాసాగా నవ్వుతూ ప్రేలుతూ మాట్లాడుతోంది. ఇంతలోనె ఒక్క దెబ్బతో క్రింద పడి గిలగిల కొట్టుకుని ప్రాణం విడిచింది. అందరూ ఆమె చచ్చిపోయిందన్నారు. ఒక గంట క్రితం సజీవిగావున్న మనిషి అంతలోనే విగతజీ వెల్లా అయి●నో!" అన్నాడు.

ఈ సంగతి పిల్లలందరికీ వింతగానే వుంది. వాళ్ళు ఆశ్చర్యంగా జాకోబువేపు చూశారు. వాడు నవ్వుతున్నాడు.

"నేనూ అదే ఆలోచించుతున్నాను. బలే తమాషాగా వుం"దన్నాడు ఇలియా

"జనం ఆమె చచ్చిపోయిందనీ, జీవితం చాలించిందనీ అన్నారు. అంటే ఏమిటో" నన్నాడు జాకోబు మళ్లీ.

"ఆమె ఆకాశమార్గాన స్వర్గాని కెళ్ళింది" అని మాషా జాకోబు చెయ్యిలాగి తాను వినువీథిని చూడసాగింది.

అంతరిక్షాన తారలు బయలుదేరాయి. ఒక చుక్క భూతలానికి దాపులో దివ్యతేజంతో ప్రకాశించుతోంది. పిల్లలందరు తలలు పైకెత్తారు. పాష్కా ఒక్క క్షణం పైకి చూచి గమ్మున అక్కడినుంచి లేచిపోయాడు. ఇలియా రెప్ప వాల్చకుండా ఒకే చుక్కమీద దృష్టి నిల్పాడు. కాని మోమున భయ చిహ్నాలు కనపడుతున్నై. జాకోబు దృష్టి దేనినో అన్వేషించుతూన్నట్టు అంబరతలాన పరుగు లెడుతోంది.

"జాకోబ్!" ఇలియా ఆతురతగా పిలిచాడు.

అందరూ అదరిపడి వాని వైపు చూచారు. "ఏమి" టని జాకో బడిగాడు.

"నేననుకు నేది—" అని ఇలియా ఆగాడు.

"ఏమిటీ?" జాకోబు మళ్ళీ ప్రశ్నించాడు.

"ఎంత పెద్ద ఘటన జరిగిపోయిందో చూచావా! ఒక వ్యక్తి నిలువునా హత్య చేయబడింది. పెద్ద గొడవ యింది; కాని ఒక్కని కళ్ళనుండయినా రెండు కన్నీటి చుక్కలు రాలిన పాపాన పోలేదు చూడు!"

"అదేమిటి, జర్మియా తాత కంట తడి పెట్లలా?"

"ఆయన విషయం వేరు. తాత హృదయంలో యెవరి విషయంలోనయినా సరే జాలిపుడుతుంది. కాని పావ్కా సంగతే చూడు. వాడికి దిగులున్నట్టే లేదు. వాడా విషాద ఘట్టాన్ని ఏదో వినోద కథ చెప్పినట్టు చెప్పేశాడు."

"వాడికి దుఃఖం లేకపోలేదు. కాని, మన యెదుట వెల్లడించేందు కిష్టంలేదు అంతే. నిజానికి వాని గుండె పగిలి పోతోంది. చూచావుగా యెలా పారిపోయాడో! లోలోపల కుమిలిపోతున్నాడు."

కొంచెంసేపటివరకు యెవరూ మాట్లాడలా. మాషా జాకోబు తొడమీద తల్పెట్టుకుని నిద్రపోయింది.

"నీకు భయంగా వుందా?" జాకోబు ఇలియా గాడు.

"అవును."

"ఆమె ప్రేతాత్మ యిక్కడే సంచరించుతూంటుంది."

"ఇక వెళ్ళిపోదాం పదండి."

తతిమ్మా పిల్లలందరూ వెళ్ళిపోయారు. ఇలియా కూడ లేచాడు.

"మాషా నిద్రపోతోంది. ఇద్దరం తీసికెళ్దాం" అన్నాడు జాకోబు

ఇలియా "సరే" నన్నాడు.

ఇద్దరూ బాలిక నెత్తుకుని బయలు దేరారు. ఇలియా వెనకాల వున్నాడు. వాడికి తన్నెవరిదో ఛాయ వెంబడించు

తూన్నట్లు తోచింది. భీతి చెంది గబగబ రెండడుగులు ముందుకేసి జాకోబు భుజంమీద చెయ్యివేసి "త్వరగా నడు" అన్నాడు మెల్లగా.

:

5

పై సంఘటన జరిగిన కొద్దిరోజులకే జర్మియా మంచంపట్టాడు. వృద్ధుని దేహము రుగ్మతతో మరింత క్షీణించి పోయింది. పని-పాటు లాగిపోయాయి. గడపదాటి వెళ్ళడమే అసంభవ మయింది. పిల్లలు విసిగించితే కథ మొదలుపెట్టినా దగ్గుతెర వచ్చి మధ్యలోనె ఆపివేయక తప్పేది కాదు. వృద్ధుడు దగ్గుతో ఉక్కిరి బిక్కిరై గ్రుడ్లనీరు పెట్టి పిల్లలవంక దీనంగా చూచేవాడు. వాళ్ళు భయపడి పారిపోయేవాళ్ళు. దగ్గి దగ్గి జర్మియా ప్రాణం కడతేరేది.

జబ్బుపడిన జర్మియాకు పెట్రుహా, ఓరెన్నులు తమ సంతాపాన్ని తెలుపుతూండేవారు. పెట్రుహా ఆప్తునివలె పదే పదే జర్మియా కడకుపోయి పరామర్శ చేసేవాడు.

ఇలియా పెట్రుహా నెప్పుడూ చీదరించుకొనే వాడు. అతను జర్మియా పట్ల సద్భావంతో లేడని గ్రహించినప్పటి నుంచి వానిని మరీ యీసడించుకుంటున్నాడు. "ముసలిపీనుగ మహా పీనాసి. జీవితమంతా డబ్బు దిబ్బెంలో వేసిఉంచాడు.

ఇంకెన్నాళ్ళో జీవించడు. వాడికి నా అన్నవాళ్లు కూడా లేరు. నువ్వంటే యెంతో ప్రేమగా వుంటాడు. ఎప్పుడు గుటుక్కు మంటాడో! జాగ్రతగా కనిపెట్టివుండు. బంగారు పిచ్చుకను చేయి జారిపోనిచ్చేవు సుమా!" అని పెట్రుహా ఔరెన్సు చెవిలో వూదటం ఇలియా విన్నాడు.

జర్మియా లేవలేని స్థితిలోకూడ సంజవేళల హోటలు ముందు కూర్చుని ఔరెన్సుతో ఆధ్యాత్మిక విషయాలు చర్చించుతూండే వాడు. ఔరెన్సు యిక్కడికి వచ్చి యుతు క్రమంగా యెండిపోయాడు. వాని ముఖం కోతగా తయారయింది. కళ్ళు లోతుకు దించుకొని నవి. జర్మియాతో చర్చించేటప్పుడు చిల్లులుపడి మురికి పట్టిన చొక్కా చేతుల్ని మాటిమాటికి పైకెగదోసేవాడు. రెండు చేతుల్లో తన గూని పట్టుకొని కూచున్నప్పుడు వెనకాల యేదో దాస్తున్నట్టుండేవాడు. జర్మియా మంచమెక్కి నప్పటినుంచి ఔరెన్సు వాని ఆలనా పాలనా కనుక్కుంటూ "ఏం కావాలి బాబా?" అనడుగుతూండేవాడు.

వృద్ధుడు కంట నీర్పెట్టి "వద్దు నాయనా, నా కింకేమి కావాలి, యేమీ వద్దు" అనేవాడు.

ఔరెన్సు తనపనిమీద వెళ్ళేవాడు.

జర్మియా స్థితి నానాటికి తీసి కట్టుకొచ్చింది. ఒక రోజున ఇలియాను దగ్గర కూచోబెట్టుకుని "బిడ్డా! నాకు కాలమాసన్న మయింది. భగవంతుని కచేరీకి రమ్మని పిలుపొచ్చింది; కాని,......" ఆపైని ఇలియా చెవిలో చెప్పాడు-

ఇలియా కెవ్వుమని కేకపెట్టాడు. కింకర్తవ్యతా మూఢుడై హొటల్లోకి లగెత్తేశాడు. రొప్పుతూ రొజుతూ పోయి "శా...శా...య్! జర్మియా తాత చచ్చిపోయాడు; దబ్బున రా" అని పిలిచాడు ఓరెన్నును.

ఓరెన్ను యీ విషాదవార్తవిని ఏమాత్రం ఆశ్చర్యపడలా. కేవల మొక నిట్టూర్పు వదిలాడు. అంతలోనె వెనుక తలుపు తెరచుకొని పెట్రుహా వచ్చాడు. ఓరెన్ను భావాత్మకంగా వానివైపు చూచి చొక్కా చేతులు పైకి దోపుకుంటూ బయలు దేరాడు.

ఇలియా పినతండ్రిని అనుసరించబోయాడు. పెట్రుహా "పాపం, పోయాడూ? దేవుడాయన ఆత్మకి శాంతినిచ్చుగాక! ఇలియా! నువ్వూ జాకోబూ యిక్కడే వుండండి. నేనుకూడా పోయి ఆపుణ్యాత్ముని తుది దర్శనం చేసుకొస్తాను. ఎవరైనా బేరానికి వస్తే యిప్పుడే వస్తానుండమని చెప్పండి" అని ఇలియా నాపి తాను ఓరెన్ను ననుసరించాడు.

"ఓరెన్స్! నువ్వు శుద్ధమూర్ఖుడివి. అంతా నిముషాల మీద జరగాలని చెప్పలా. ఇంతసేపా?" అని పెట్రుహా హాలుబయట ఓరెన్ను ననటం బాలు లిద్దరూ విన్నారు.

జర్మియా గదిలో చూచిన దృశ్యము, విన్న మాటలు ఇలియాను భయభ్రాంతుని గావించినయి; అయినా వాని చైతన్యం లుప్తం కాలేదు. వాడు తన చుట్టూ జరుగుతున్న ఘోరాన్ని గమనించుతూ ఆకళింపు చేసుకుంటూ వున్నాడు.

"ఆయన చనిపోవటం నీకళ్ళారా చూచావా?" జాకోబు అడిగాడు.

ఇలియా వినిపించుకోకుండానే "పిళ్ళక్కడి కెందు కెళ్ళారో!" అన్నాడు.

"ఎందుకేమిటి? తాతని చూడటానికి. నువ్వేగా చచ్చిపోయాడని చెప్పావు?"

ఇలియా కళ్ళు మూసుకొని "చాలా భయంకర దృశ్యం! తాత వాడి నెంతవిసురుగా తోశాడు!" అన్నాడు.

జాకోబు విస్మయంగా అడిగాడు— "ఎవర్ని?"

ఇలియా కళ్ళు తెరిచాడు. మాట జారాననిగ్రహించి "సైతానునులే" అన్నాడు.

"అయితే నువ్వు స్వయంగా సైతానును చూచావన్నమాట?"

ఇలియా తిరిగి కళ్ళు మూసుకున్నాడు. జవాబివ్వనే లేదు.

జాకోబు వానిని దగ్గరకు లాగుకొని "నువ్వు జబ్బుగున్నావా?" అనడిగాడు.

ఇలియా కళ్ళువిప్పి "ఇప్పుడే వస్తానుగాని, నువ్విక్కడే వుండు. నే నిక్కడినుంచి వెళ్లానని మీనాన్నతో చెప్పకూడదు సుమా!" అన్నాడు నిమ్మళంగా.

"చెప్పను గాని దబ్బున రా."

జాకోబు నోటినుండా మాటలు వచ్చి రాకమునుపే ఇలియా ఆదరాబాదరా జర్మియా గదివద్ద కెళ్ళాడు. పిల్లి అడుగులతో ద్వారం వద్దకుపోయి సందుగుండా లోపలికి చూడ్కి నిగిడ్చాడు. వృద్ధుని కళేబరము నేలమీద పడి వుంది. శుకెన్ను జర్మియా తలగడను పట్టుకొని సూది దారంతో కుట్టును సరిచేస్తున్నాడు. పెట్రుహా అతని వెన కాల నిలబడి "త్వరగా కానియ్యి. అన్నీ సిద్ధంగా వుంచు కొని యెవరూ రాకపూర్వమే చక్కబెట్టాలని యెన్ని తడ వలు చెప్పాను. సరిగా వెతకటానికైనా అవకాశం లేకపోయె ......సరే, తొందరగా పూర్తిచెయ్యి" అని చెబుతున్నాడు.

ఇలియా వారి చేష్టలు చూస్తూనే వున్నాడు. వానికి తల తిరుగసాగింది. ఇకనక్కడ నిలుచుండ లేక పోయాడు. చప్పుడూ లేకుండా తిరుగు మొగ మయ్యాడు. గుండె బరు వెక్కింది. దుఃఖం పొంగి వస్తోంది. కాళ్లీడ్చుకుంటూపోయి జాకోబును చూడగానే గావురుమన్నాడు. కుమిలి కుమిలి విలపించడం చూచి జాకోబు మిత్రుని వూరడించసాగాడు. అప్పుడే " ఎందు కేడుస్తున్నావు?" అంటూ ఫర్ఫిషాక్ వచ్చాడు అక్కడికి.

జాకోబు జర్మియా మరణించాడని చెప్పగా"నిజంగా చచ్చిపోయాడా!" అంటూనే ఫర్ఫిషాక్ మెట్లుదిగి వెళ్లి పోయాడు.

పెట్రుహా శుకెన్నులు వాని కెదురు వచ్చారు. ఫర్ ఫిషాక్ వెనుదిరిగి వారి ననుసరించి వచ్చాడు. విలపించు

తూన్న ఇలియా వారికి కనపడకుండ కన్నీళ్ళు తుడుచుకో ప్రయత్నించాడు; కాని, ప్రయోజనం లేకపోయింది.

"జాకోబ్! త్వరగాపోయి జర్మియా మరణించాడని పోలీసు స్టేషనులో చెప్పిరా, పో" అన్నాడు పెట్రుహా.

"మీరు ఇప్పటివరకు ఆయన గదిలోనే వున్నారు కాబోలు" నన్నాడు ఫర్ఫిష్కా ప్రశ్నార్థకంగా.

పెరెన్కు గప్‌చిప్‌గా అక్కడినుంచి జారుకున్నాడు. ఇలియాకు ముఖం తప్పించడానికే అతనల్లా వెళ్లాడు. పెట్రుహా ఇలియా తల నిమురుతూ "పాపం జర్మియా నిన్నెంతగానో ప్రేమించేవాడు. అటువంటి మనిషి పోతే దుఃఖంగానే వుంటుంది; కాని, ఏడిస్తే పోయినవాడు తిరిగొస్తాడా? వూరుకో. ఇక నీవిక్కడనుంచి నీగదికి పో. పోలీసులు వస్తారు: వాళ్ళ కెదురుగా వుండటం మంచిది కాదు" అని ఇలియాను అక్కడ్నుంచి నెట్టాడు.

ఇలియా కళ్ళుతుడుచుకొని చుట్టూ చూచాడు. పెట్రుహా హాలులోనుంచి లోపలికి వెళుతున్నాడు. ఫర్ఫిష్కా అక్కడే నిలబడి నవ్వుతున్నాడు; అయితే వానికళ్ళలో నిరాశ తొలుకుతోంది. వాని నవ్వులో ఏదో మర్మమున్నదని గ్రహించి ఇలియా గోడ ప్రక్కనె ఆగిపోయాడు.

పెట్రుహా వెనక్కితిరిగి "ఫర్ఫిష్కా! ఎందుకు నవ్వుతున్నా"వని అడిగాడు.

"ఆరి, నువ్వేరగని దేముందిలే. సరేగాని, నా జేబుకూడ నిండదా యేం?"

"అంటే"

ఫర్ఫిష్టా గట్టిగా నేలనుతన్ని "మిత్రమా! నాకడుపు మాత్రం చిన్నదా యేమిటి? కాకపోతే అదృష్టం నాకెదురు తిరిగింది. పోనీలే, దేవుడు నీకైనా మేలుచేశాడు!"అన్నాడు.

పెట్రుహా వెకిలిగా నవ్వి "నువ్వనేదేమిటో నాకు బోధపడలా" అన్నాడు.

"నే నసలు బోళామనిషిని. నా కడుపులోగుట్టు యిముడకుండా వుంది. ఇక నీ యిష్టం."

"ఓహో! త్రాగుడు కోసమా? ఒక గ్లాసు బ్రాందీ కావాలన్నమాట. దానికి ఇంత డొంక తిరుగు డెందుకు?"

ఫర్ఫిష్టా బిగ్గరగా నవ్వాడు.

ఈ సంభాషణ వింటూంటే ఇలియాకు నెత్తిమీది బరువు దించుతూన్నట్టుంది. కీనీడలా అక్కడినుంచి కదలి పోయాడు.

నాటి రేయి ఇలియా నెన్నో ఆలోచనలు చుట్టు వేశాయి. మామూలుగా నిద్రించే చోటుకు వెళ్ళక హోటలునందే ఒకమూల పడివున్నాడు. జర్మియా ఆత్మ టెరెన్సును వెంబడించుతూన్నట్టు తోచింది.

ఇలియాకు భయం వేసింది. నేల చెమ్మ వాని ఒంటి కెక్కింది. చలికి వడవడ వణుకుతున్నాడు. టెరెన్సు కూడ తన గదికిపోక హొటల్లోనే వుండిపోయాడు. అతనిని తన వద్దకొచ్చి పడుకోమని పిలవాలనుకున్నాడు. కాని,

ఆవాళ తామిద్దరికిమధ్య అపూర్వమగు తెర ఒక టేర్ప డింది. జర్మియా తన చెవిలో యేదో చెపుతూన్నట్టుగా వుంది ఇలియాకు.

ఒరెన్సుకీ శాంతిలేదు. పిచ్చివాడివలె అటూ యిటూ పచారు చేస్తున్నాడు. ఇలియా వాని మానసిక ఆందోళనను గ్రహించాడు. "మీ రివాళ పడుకోరా యేమి" టన్నాడు ఒరెన్సు నుద్దేశించి.

ఒరెన్సు త్రుళ్ళిపడ్డాడు. నడుస్తున్నవాడల్లా టక్కున ఆగి "ఏమి"టన్నాడు.

"మీరు నిద్రపోరూ? పొద్దుపోయిందిగా."

"ఆఁ, వెళతాను" అని చెప్పాడు; కాని, ఒరెన్సు మళ్ళీ అక్కడే చక్కర్ కొడుతున్నాడు. అతని హృదయము పశ్చాత్తాపంతో వుడికిపోతోందని తలచి "నీవీ శిక్షను అప్పుడివేలే" అనుకున్నాడు మతిలో.

వాన తుంపరగా పడుతోంది. గాలి తాకిడికి లాంతరు వెలుగు వూగులాడుతోంది. బల్లమీది సనాలు, గ్లాసులు కట కట ధ్వని చేస్తున్నై. మూల పడుకొనియున్న ఇలియా ముఖంమీద తుండుగుడ్డను కప్పుకొని నిద్రించటానికి ప్రయత్నించాడు. కాని అంతలో తనపైనేదో నీడపడింది. ఇలియా చప్పున ముసుగుతీసి చూచాడు. ఒరెన్సు మోకాళ్ళమీద కూర్చొని దీనంగా దైవానికి మ్రొక్కుతుండడం గమనించాడు.

ఇలియా ఇక కోపంపట్టలేక పోయాడు. "ప్రార్థన కూడా యెందుకండి? మీ కా యోగ్యత యెక్కడిది? దేవుణ్ణికూడా దగా చేద్దామనా?" అని అడిగేశాడు తెగించి.

"నువ్వింకా మేలుకొనే వున్నావూ? పోయి పడుకో" అన్నాడు పెరెన్ను యేమీ వినిపించనట్టు.

"సరేగాని, మీరు మాత్రం ప్రార్థన పవిత్రతని చెడగొట్టకండి."

"అయితే నేనిక ప్రార్థన చెయ్యనులే."

క్రింది తేమ, పై చలీ ఇలియాను పీడించ సాగాయి. వానికి వూపిరి పీల్చడం కూడ కష్టమనిపించింది. ఒక ప్రక్కన వాడిని భయం సతాయించుతూంటే, మరో వేపున జర్మియా జ్ఞప్తితో వాని కోమల హృదయం విలపించుతోంది. పినతండ్రి అఘాయిత్యం మాటిమాటికి వాని పసిహృదయంలో కలత వేస్తోంది. కొంత సేపటివరకు విచారాతిరేకంచే కూరుకు పట్టక అవస్థపడ్డాడు. తర్వాత లేచికూచున్నాడు.

వాని స్థితి పెరెన్నును కలవర పెట్టింది. దగ్గరకుపోయి ఇలియా చెయ్యి పట్టుకొని "ఏమిటి సంగతి? నీ ఒంట్లో సరిగా లేదా?" అనడిగాడు.

ఇలియా వానిని విదలించి ఒక్క త్రోపు తోశాడు. ముఖం ప్రక్కకు త్రిప్పుకొని కన్నీరు కార్చుతూ అత్యంత వేదనా సహితంగా "భగవాన్! నేను వీళ్ళకి దూరంగా దాక్కోటాని కేదయినా తావు చూపించు" మని ప్రార్థించాడు.

వాని కంఠం రుద్ధమయింది. రెండు చేతుల్తోనూ ముఖాన్ని కప్పుకొని వెక్కి వెక్కి యేడ్వసాగాడు.

6

జర్మియా మృత్యు ఘటన ఇలియాలో గొప్ప పరివర్తన కలిగించింది. అతడదివరకు తన సహపాఠులను మాత్రమె అసహ్యించుకునేవాడు. అందుకు వాళ్ళప్రవర్తనే కారణం; కాని, ఇలియా యిప్పుడు నీడలను చూచి కూడ భయపడుతున్నాడు. వానికి మనుషులందరు మహాపాతకులుగ కన్పించసాగారు. సదా గంభీర ముద్ర వహించి వుంటున్నాడు. ఎవరితోను విస్తారంగా మాట్లాడటంలేదు. పూర్వం వానికి వృద్ధులయెడ గల భక్తిభావం కూడ నశించిపోయింది. ఎవరేమి చెప్పకుంటున్నా చెవియొగ్గి వినేవాడు. జర్మియా మరణ విషయం స్మరణకొచ్చి పరితపించేవాడు. పెట్రూహా, ఒరెన్సులతో పాటు తానున్నా ఆపాపానికి భాగస్వామేనని వాని హృదయం ఘోషించుతూండేది. జర్మియా తన నిక్షేపం సంగతిని తన కొక్కనికే చెప్పాడనీ, ఆ విషయం తన ద్వారానే పెట్రూహా, ఒరెన్సులకు తెలిసి వుంటుందని వృద్ధుడు అవసాన సమయంలో తలచి వుంటాడనీ భావించుకొని ఇలియా విపరీతంగా వ్యధ చెందేవాడు.

వాని హృదయము సంతతము విషాదభరితమయి వుంటోంది. కనపడిన ప్రతివ్యక్తిని సందేహాస్పదంగా చూడ

సాగాడు. ఎవరయినా యేదేని పాపకార్యం చెయ్యడం కళ్ళబడితే తన హృదయ భారం కొంతమట్టుకు తగ్గుతూన్నట్లు భావించేవాడు. కనుచూపు మేరలో వానికితరుల దురితములు మాత్రమె దృగ్గోచర మయ్యేవి.

ఆ వాడకట్టున వున్న వాళ్ళందరూ పెట్రుహాను దుష్టుడని దూషించేవారు; కాని, వాని ముందు మాత్రం స్తుతించేవారు. ఎదుటబడి వాని కెదురు చెప్పడాని కెవరూ తెగువ చేసేవారు కాదు. మతిస్నాని తిట్టని వాళ్ళే లేరు. నిషా తలకెక్కి తెయితక్క లాడుతూంటే ఆమె ననరాని మాట లనేవారు; కాని, తమ కామెతో పని కలిగినప్పుడు లేని సుగుణాలు కల్పించి యింతదాన వంతదాన వని పొగిడే వాళ్ళు. ఇరుగు పొరుగు వాళ్ళందరూ ఆమెతో యేదో ఒక పని చేయించుకునేవాళ్ళే; అయితే కానిడబ్బిచ్చి సహాయ పడిన వాళ్ళెవరూ లేరు. మతిస్నా నెప్పుడు చూచినా ఆడుతూ పాడుతూ హుషారుగా వుండేది. ఎవరేపని చెప్పినా చేసి పెట్టేది. జబ్బు పడ్డ వారికి పరిచర్య చేయుట లోను, పిల్లలను చేరదీసి ముద్దులాడి, ఆడించుటలోను ఆమె అనిర్వచనీయానంద మనుభవించేది.

ఫర్ఫిషాక్ శ్రమజీవి. లోకులు వాని నెగతాళి, యెద్దేవ చేసేవారు. అతడు తప్పతాగొచ్చి సితారువాయించుతూంటే చుట్టూ జనం మూగి హాయి హాయి యని ఆనందించేవారు. అతడే కనుక కాళ్ళు పడిపోయిన భార్య. అమాయిక తనయుల ఆలన - పాలనలో నిమగ్నుడయి వుంటే

ఒకడూ పల్కరించిన పాపాన పోయేవాడు కాడు; మాట మాత్రం సాయమయినా చేసేవారు కారు,

పావెలు నిర్బంధముతో పాష్కా పెద్దదిక్కు లేని వాడయ్యాడు. ఫర్‌ఫిష్కా జాలి తలచి వాడిని చేరదీసి తన అజమాయిషీలో వుంచుకున్నాడు. ఫర్‌ఫిష్కా చెప్పులు కుట్టి జీవనం చేసేవాడు. పాష్కానికూడ తన పనిలో వుంచుకొని తర్ఫీతు నివ్వసాగాడు. పాష్కా గత్యంతరం లేక ఫర్‌ఫిష్కా చెప్పుచేతల్లో వుంటున్నాడు.

ఫర్‌ఫిష్కా కొక తెగులుంది. ఆదివారంనాడు తప్పతాగేవాడు. మర్నాపొద్దున కైపు దిగిన తర్వాత పెళ్లాంతో అంటూండేవాడు— "దూనియా! నన్ను మన్నించవూ? నేను అలవాటుకొద్దీ తాగటం లేదని నీకూ తెలుసు. ఏం చెయ్యను చెప్పు! వారం పొడుగున ఎముకలు ముక్కలయ్యేట్టు కష్టపడు తున్నానా. ఆ బడలికను బాపుకుంటానికి వారాని కొక్కసారి మాత్రం తాగు తున్నాను. పని చేసి చేసి ఒళ్ళు హూనం అవుతోంది. మరి సెలవు నాడయినా తాగకపోతే యెల్లా చెప్పు?"

"నేను మాత్రం యేమన్నాను? నీస్థితికి నాకూ జాలిగానే వుంది నాకు మాత్రం కళ్లు లేవూ? నీ కష్టం చూచి నాగుండె తరుక్కుపోతోంది. భగవంతుడు నన్ను కూడ నీకు భారం చేశాడు. యమధర్మరాజయినా దయ తలచడయ్యే" అనేది ఆ యిల్లాలు.

"నువ్విల్లాంటి మాటలు నోటిపైకి రానివ్వకు దూనియా! నువ్వా మాటలంటూంటే నాకు చాలా బాధగా వుంటుంది; హృదయం క్షోభిస్తుంది. నీవల్ల నాకొచ్చిన కష్ట మేముంది? పాపం! నేనే నిన్ను సుఖపెట్ట లేక పోతున్నాను. అదయినా దుర్బుద్ధితో కాదసుమా! నా బలహీనత వల్లనే. ఎక్కడికైనా కొత్త చోటుకు పోయి నూతన పద్ధతిలో వృత్తి సాగించితే బాగుపడే యోగ ముండవచ్చునని ఆలోచించు తున్నాను. అదృష్టదేవత ప్రసన్న మయ్యెనా మన వద్ద నాలుగు డబ్బులు చేరవచ్చు కూడాను" అని అర్ధాంగితో ప్రస్తావించేవాడు ఫర్ఫిషాక్.

ఫర్ఫిషాక్ స్థితిగతులు ఇలియాకు సాకల్యంగా తెలుసు. అతనంటే వానికి సానుభూతి వుండేది. చెమ టోడ్చి జీవితాన్ని గడుపు కొస్తున్నప్పటికి ఫర్ఫిషాక్ నిత్య సంతోషియని ఇలియా మెచ్చుకునేవాడు.

ఇక పెట్రుహా సంగతి: అతను యేపనీ ముట్టడు. దుకాణంలో కూచొని మూడుముక్కలాట మొదలైనవి ఆడుతుంటాడు. పదేపదే తేనీరు తాగేవాడు. తప్పనిసరి లేకపోయినా నౌకర్ల నదమాయించేవాడు. జకోయా మరణించిన పిమ్మట సారా, బ్రాందీలను విక్రయించడానికి టెరెన్సును నియమించాడు. తాను పైపెత్తనం చలాయించు తూండేవాడు.

ఈ విషయాలన్నీ ఇలియా హృదయాన్ని కలవర పెట్టేవి. అందుచే వాడక్కడివారికి వైదొలగి వుండే

దుకు ప్రయత్నించేవాడు. తన మనోవ్యథ నెవరిముందయినా వెళ్ళగ్రక్కా లనుకునేవాడు; కాని, ఆత్మీయుడగు పిన తండ్రితో చెప్పుకోటానికి కూడ మనస్కరించడం లేదు. జర్మియా నిర్యాణం చెందిన లగాయతు ఇలియా జెరెన్సుకు ముఖం తప్పించి తిరుగుతున్నాడు. ఇద్దరి మధ్య భేదమేర్పడింది. ఇలియా తనకు తానై జెరెన్సు యెదుటికి వెళ్ళడం మానేశాడు.

జాకోబయినా ఇలియాతో అంతగా మాట్లాడటం లేదు. అసలు కనబడటమే అరుదయింది. తనగొడవలో తానుండే వాడు. జర్మియా మరణానికి వాడూ చాలా దుఃఖించాడు. వృద్ధుని అవసానంతో ఆకొంపల్లో శోక దేవత తాండవించుతూ న్నట్టుగా భావించారు మిత్రు లిద్దరూను.

జాకోబు ఒకనాడు ఇలియావద్ద కొచ్చి అన్నాడు—
"మిత్రమా! నీ కొక తమాషా చూపించుతాను; గాని, యెవరితోను చెప్పకుండ వుంటావా."

"చెప్పనని ఒట్టు పెట్టుకుంటున్నాను."

జాకోబు స్నేహితుడిని ఆవరణంలో పెరుగుతున్న పేప చెట్టు మొదట్లో సొరంగంలాగ తొలిచి రంగు పీలికలతోను కాగితాలతోను అలంకరించిన తొర్రను చూపెట్టాడు. అందులో చిన్న యిత్తడి బొమ్మ ఒకటుంది. దానిముందు కొవ్వొత్తి కూడవున్నది.

ఆ సరంజామా అంతా చూచి "ఏమి టిదంతా?" అనడిగాడు ఇలియా.

"నాకోసం చర్చిని తయారు చేసుకున్నానోయ్. రాత్రిపూట యిక్కడికొచ్చి ప్రార్థన చేద్దామనుకున్నాను. మరి నువ్వు కూడ వస్తావా?"

జాకోబు చేసిన ఆ సృష్టికి ఇలియా చాలా సంతోషించాడు; కాని, వానికొక సందేహం కలిగింది. "ఎవరయినా చూస్తారేమో! మీ నాన్నకు తెలిసిందంటే చావ బాదక మానడు" అన్నాడు.

"రాత్రివేళ యెవరు చూస్తారులెద్దూ. అందరూ నిద్ర పోయినాక వద్దాం. పగలంతా గలభాగా వుంటుంది కూడాను. మనం చిన్న వాళ్ళం కావటంవల్ల ఆ గంద్ర గోళంలో మన ప్రార్థన దేవుడికి వినపడదు. రాత్రి పూట అయితే నిశ్శబ్దంగా వుంటంవల్ల తప్పకుండ వినపడుతుంది.

ఇలియా వానిముఖంలోకి చూచాడు. జాకోబు కళ్ళు మెరుస్తున్నాయి. "దేవుడు తప్పక మన ప్రార్థన నాలకించు తాడనే మన మాశించుదాము" అన్నాడు.

"మరి నువ్వు వస్తావా లేదా?"

"వస్తాగాని, ప్రార్థన యేమని చేసేది?" అని ఇలియా పక్కున నవ్వాడు. జాకోబుకూడ నవ్వులో నవ్వు కలిపాడు.

"నాకు జ్ఞానం ప్రసాదించమనీ, నా కోరిక లీడేర్చమనీ నేను దేవుని ప్రార్థిస్తాను" అని చెప్పాడు ఇలియా.

"నేనూ అల్లాగే చేస్తాను. (కొంచెమాగి) ఇదివరకు యేదో వూరికినే ప్రార్థన చెయ్యాలనుకున్నాను. ఆయనే

యేదో ఒకటి యిస్తాడనుకున్నాను; కాని, ఇప్పుడు నువ్వు చెప్పినట్టే చేద్దామనుంది."

"సరే, మంచిదేలె"మ్మన్నాడు ఇలియా.

ప్రతిరాత్రి ప్రార్థన చేయాలని నిశ్చయించుకున్నారు కాని, వాళ్ళొక్కనాడయినా రాత్రివేళ అక్కడికి పోనే లేదు. క్రమేపి వాళ్ళా బాలచర్చిసంగతే మర్చిపోయారు.

ఆ పిల్లచర్చి పాష్కా పిట్టలను కొట్టుకోటానికి బాగా వుపయోగ పడుతోంది. వాడందులో గింజా-గిటారిచల్లి వుచ్చు పన్నేవాడు. వెనకటికిమల్లె వాడికిప్పు డాడుకోటానికి తీరిక వుండటంలా. పొద్దుగూకులు ఒళ్ళువంచి పని చేయాల్సి వస్తోంది. వాని స్థితి యెత్తుభారంగా వుంది. జీవితము కష్టంగా వుంది. శరీరం శుష్కించి పోయింది. వాడి యెచ్చు మచ్చుకులేకుండా పోయింది. ఆదివారంనాడు మాత్రం విశ్రాంతి లభించేది. సెలవురోజున ఇలియా జాకోబుల వద్ద కొచ్చి వాళ్ళ చదువును గూర్చిన కబుర్లు విని వుళ్ళేవాడు." గప్పాలు కొట్టకండోయ్! నేనూ చదివేస్తాను యిప్పుడో" ననేవాడు పుక్రోషం పట్టలేక.

"నిన్ను ఫర్‌ఫిష్కా వదిత్తే గద!" అని జాకోబు వుడికిలించేవాడు.

"నే నెప్పుడో తుర్రున పారిపోతా చూస్తుండ" మన్నాడు పాష్కా.

ఒక నా డంతపనీ జరిగింది. తర్వాత రెండు రోజులకు ఫర్‌ఫిష్కా కనపడిన వాళ్ళందరితోను "పాష్కా

పారిపోయాడు. వాడికి ఒళ్లొంగితేనా? బాగుపడే రాత లేందే" అని చెప్పాడు.

ఆ రోజున తెల్లవారగట్లనుంచీ జల్లు పడుతోంది. పాషా వానలో తడిసి యెంత అవస్థ పడుతున్నాడో నని ఇలియా విచార పడ్డాడు. వరండాలో చేరిన వాళ్ళు వర్షం జోరవడం చూచి ఆ పాత కొంప యెప్పుడో కూలి పోతుం దనుకున్నారు. ఇలియా కా యిల్లు భూమిలోకి క్రుంగిపోతున్నట్లు, యీ కాలంలోని పాపభారాన్ని ప్రాచీన యుగంనాటి ఆభవంతి మరి మోయలేక భూపతనం కా గోరుతూ కిటికీల గుండా భగవంతుని వంక దీనంగా చూస్తు న్నట్లూ తోచింది.

"ఇది ఎల్లాగూ పడిపోక తప్పదు. అది జరిగిన నాడు మన మందరము తలకొక దారి పట్టాల్సి వస్తుంది. చాలా కాలంనుంచి వుంటూ వచ్చినందువల్ల ఒక విధంగా మమత యేర్పడినా, మొత్తం మీద యీ కొంపలోని జీవి తం మీద రోత పుట్టింది" అన్నాడు ఫర్ ఫిషా.

కాని, అల్లాంటి ప్రమాదమేమీ సంభవించనే లేదు. తర్వాత కొద్ది రోజుల్లోనే పెట్రుహా ఆ ఇల్లు, తోటలు కూడ కొని వేశాడు. అవసరమైన మరమ్మతు చేయించి రంగులు వేయించాడు. ఇంటి ముందు గిల్టు అక్షరాల బోర్డు తగిలించబడింది.

ఫర్ ఫిషా యీ మార్పులతో నైనా సంతృప్తి పడలా. "పై మెరుగులతో యేం లాభం? రేపటినుంచీ

లోపలి చవుడు రాలుతూనే వుంటుంది" అన్నాడు ఫర్ఫిషాక్ నలుగురిలో. ఇలియూ నవ్వి అతన్ని బలపరిచాడు. పై పూత రంగులు కన్ను గప్పి దగా చేయడానికే గదా అనుకున్నాడు.

పాషాక్ యెక్కడో ఒకచోట సుఖంగానే జీవించుతూ వుండి వుంటాడని ఇలియూ భావించాడు. కూపస్థమండూకము వలె తన జీవితంలో యెల్లాంటి మార్పు జరుగలేదు కదా యని దిగులు పడ్డాడు. అసలిక ఆ కొంపలో నుంచి తనకు మోక్షమే వుండదేమో ననుకున్నాడు. ఇంటికి మరమ్మతు చేయించుటతో పాటు ముందావరణలోని చెట్లన్నిటిని కొట్టించి క్రొత్త పాకలు కూడ వేయబడినై. విశాలావరణ అంతా సంకీర్ణమయి పోయింది. సావెలు కార్ఖానా ముందు కొద్దిపాటి ఖాళీస్థల మున్నా ఇలియూ ఆ వేపుకు పోవడానికే జంకేవాడు. సావెలు భార్య రక్తసిక్తమై యింకా అక్కడే పడివున్నట్లు భావించేవాడు.

పెట్రుహా హోటలుకు సర్వాధికారి అయిన తర్వాత టెరెన్నుకు గదిని మార్చి యిచ్చాడు. ఈ క్రొత్త గది శుభ్రమయిందే. వెలుతురుకు లోటు లేదు; కాని అది హోటలు ప్రక్కనె వుంటంవల్ల దుర్వాసనతో నిండి వుండేది. కిటికీ లెన్నివున్నా నిర్మలాకాశ సందర్శనానికి అవకాశం లేదు.

టెరెన్ను పూర్వపు మనిషి కాడు. వాని కట్టు—జుట్టు, ఆచార—వ్యవహారాలు, నడక, మాటల తీరు

పూర్తిగా మారి పోయినయి. శుభ్రమైన బట్టలు కట్టు కుంటున్నాడు. 'నీవు'ను మారు 'మీ' రనిపించు కుంటు న్నాడు; అయితే అస్తమానం హోటలు సామగ్రిని వెయ్యి కళ్లతో కనిపెట్టుకొని వుండాల్సి వస్తోంది. ఇలియాసు కూడ కొత్త బట్టలు వగైరా కొన్నాడు; కాని. ఇలియా వాటిని సంతోష పూర్వకంగా పుచ్చుకోలేక పోయాడు. వాడు జర్మియా సంగతిని విస్మరించలేక పోతున్నాడు. వాని జీవిత మొక్కపెట్టుగ నీరసము, దుఃఖభాజనము అయి పోయింది. ఈడుకు మించిన గాంభీర్యత వహించాడు. నిరంతరము హృదయ భారంచే దిగనారి పోసాగాడు. మాటి మాటికి వానికి స్వగ్రామము తలపు కొస్తోంది. పల్లె టూరి బ్రతుకె శాంతి దాయకము, సుఖ ప్రదము ననిపిం చేది. గ్రామంలోని ప్రశాంతత, నిరాడంబరము, సుహృ ద్భావాలు వెతకి చూద్దామన్నా పట్టణంలో కానరాకున్నవి. అంటాయిప్ కర్జనారణ్య వాసము తరచుగా స్మృతి పథం లోకి వస్తోంది. పాషాకా రూపంకూడ కళ్లముందు మెదులు తూండేది. పాషాకా యే అడవిలోనో, గుహాయందో నివాస మేర్పరుచుకొని వుంటాడని అనుకునేవాడు. క్రూర మృగాల భీతి వున్నప్పటికి కాంతార వాసమె వాంఛనీయ మనుకున్నాడు.

అల్లా అనుకొనక మాత్రం యేం చేస్తాడు! పట్ట ణంలో శాంతి యేదీ? అహర్నిశలు ఒకటే గంద్ర గోళ మయ్యె. ఒకడు గావు కేకలు వేస్తుంటే మరొకడు పాట పాడుతూ యాచన చేస్తుంటాడు. ఒక వేపున బండ్ల బడ

బడు మరో ప్రక్కన మోటార్ల బుర్ బుర్. ఇలాంటి రొద లతో ఝల్లదిరి పోతూండేది; మనసు చీకాకయ్యేది. ఇంట్లో శాంతి లేదు సరికదా, బడిలో అసలే హుళ్లక్కి. బడి పిల్లల ఆగడములతో హృదయం కలత చెందేది. ఇంటికి వస్తే పిల్లలు—పెద్దవాళ్ళు, ఆడ-మొగ భేదం లేకుండా తప్ప తాగి తందనాలు తొక్కడము, పరస్పరము కీచులాడు కోవడము, కొట్లాడు కోవడమే కన్పించేవి. ఎంత నికృష్ట దృశ్యాలు! అందరూ నీచులు, పాపులే. ఎవరిని కలుసు కున్నా శాంతి, సంతోషాలు చేకురుతాయన్న ఆశే లేదు.

ఒక రోజున ఇలియా పుస్తకాలు చేతబట్టి బడికి పో నుద్యుక్తు డవుతూండగా ఫర్ఫిషాక్ హోటలులో ప్రవేశించాడు. వాని క్రాపు చెదిరి వుంది. వస్తూనే ఔరెన్బు వంక వింతగా చూచాడు. వాని వుద్దేశం ఔరె న్బుకు బోధ పడలా. మాట్లాడకుండా గ్లాసులో బ్రాందీ గ్రుమ్మరించి అందిచ్చాడు. ఫర్ఫిషాక్ గట గట తాగేసి మళ్లీ వెనుకటి రీతినె చూడసాగాడు.

ఫర్ఫిషాక్ వాలకం చూచి ఔరెన్బు విస్తుపో యాడు. "ఏమిటి సమాచారం?" అనడిగాడు.

ఫర్ఫిషాక్ కళ్లు నలుముకుంటూ—"నా భార్య చచ్చి పోయింది" అని యే మాత్రం చీకూ చింతా లేనట్టు చెప్పేశాడు.

ఔరెన్బు సానుభూతి పూర్వకంగా చూస్తూ "పాపం! చనిపోయిందా? భగవంతు డామె ఆత్మకు శాంతిని చే కూర్చుగాక!" అన్నాడు.

ఫర్ఫిషాక్ మాట్లాడకుండానే వెళ్ళిపోయాడు.

అతని వెనకాల పెరెన్సు "తమాషా మనిషి!" అని నసిగాడు. ఇదంతా గమనించుతూన్న ఇలియా కూడ విచిత్ర వ్యక్తే ననుకున్నాడు తనలో.

ఇలియా ఫర్ఫిషాక్ వాకిలిముందు నుంచే బడికి వెళ్ళాలి. అక్కడికి పోగానే టకటన ఆగిపోయాడు. ఇరుగు పొరుగు అమ్మలక్కలు డూనియా శవం చుట్టూ చేరి కళ్ళు తడిచేసుకొని దుఃఖం ప్రదర్శించుతున్నారు. మతిస్నా మాషాని చంక నెత్తుకొని వూరడించుతోంది. ఫర్ఫిషాక్ నిశ్చలంగా కూచుని కూతురు వంక చూస్తున్నాడు. ఆ శోక దృశ్యాన్ని చూచి ఇలియా గుండె తరుక్కుపోయింది. గ్రుడ్ల నీరు కమ్మింది. ఇక నక్కడ నిలుచుండలేక దారి పట్టాడు.

ఇలియా బడినుండి తిరిగి వచ్చేసరికి ఫర్ఫిషాక్ హోటలు ముందు కూర్చొని సితారు వాయించుతున్నాడు. మధ్యలో దానాపి ఆడవాళ్లు 'తన్ను తాగుబోతనీ, పనికి మాలిన వాడనీ' తిట్టి తరిమేశారని చెప్పాడు. అందుకు తన కేమీ చింత లేదట గాని; తిట్టినా, దుమ్మెత్తి పోసినా శాంతిగా బ్రతకనిస్తే అంతే చాలనీ, ప్రతి జీవికి సుఖంగా జీవించాలని కోరిక వుంటుందనీ, అందరి ఆత్మలు ఒకటేననీ యింకా యేమేమిటో వాగుతున్నాడు.

వాని ముఖంలో విషాద చిహ్నాలే లేవు. ఏమీ జరుగనట్లె ఖులాసాగా వున్నట్లు కనపడుతున్నాడు. వాని

హుషారు చూచి ఇలియా చీదరించుకున్నాడు. "ఒక ప్రక్కన పెళ్ళాం చనిపోతే వీడికీ కేరింత లేమిటి? భగవంతుడు వీని దౌష్ట్యానికి తగ్గ శిక్ష విధించక పోడులే" అనుకున్నాడు.

మర్నాడు కర్మ. ఫర్‌ఫిసా్క పత్తుకదాక తాగి వచ్చాడు. నిలువెల్ల నిషా యెక్కి వున్నది. తలాతోక లేకుండ బడబడ లాడుతున్నాడు; తూలి పడబోతున్నాడు. వాని ప్రవర్తనను అందరు యేవగించుకున్నారు. ఒకరిద్దరు చూచి వూరుకోలేక అనరాని మాటలని రెండు తగల నిచ్చారు కూడాను.

సాయంత్రం ఇలియా జాకోబుతో అన్నాడు—నీ నెత్తిన కొత్త బరు వొచ్చి పడింది.........ఫర్‌ఫిసా్క పరమ దౌర్భాగ్యుడని నా వుద్దేశం. నీ అభిప్రాయ మేమిటి?"

"నా ముందాయన వూసెత్తవద్దు ఇలియా!" అని జాకోబు పెడమొగం పెట్టాడు.

అప్పట్నుంచి జాకోబులో విచిత్ర పరివర్తన కన్పించుతోంది. ఎక్కడికీ రాడు; ఎవరితోను మాట్లాడడు. ఇలియాను కూడ ద్వేషించ సాగాడు. ఆ సంగతి ఇలియా సులభంగానే పసిపట్టాడు. చదువులో తన చురుకుతనాన్ని చూచి వాడసూయ పడుతున్నాడనీ, తన్ను మించి పోవటానికి రాత్రింబగళ్ళు పుస్తకాలు ముందేసుకొని రుబ్బుతున్నాడు కాబోలనీ మొదట్లో తలపోశాడు; కాని, బళ్లో వాడు నిత్యము వుపాధ్యాయునిచే చీవాట్లు

పడుతూండడము, దెబ్బలు తినటము చూచి ఇలియా అభి ప్రాయం మార్చుకున్నాడు. మరి అసలు కారణ మేమిటా యని ఆలోచన కలిగింది. జాకోబు ఫర్‌పిష్టాలకు స్నేహ మేర్పడింది; కాని, వాని ధ్యాన మటులేదు. ఇలియా అసలా యింటిలోని వారి జోక్యం పట్టించు కోవడమే మాని వేశాడు. అయితే తన మిత్రుని నిజస్థితిని కనుక్కోవాలని మాత్రం తహ తహ పడ్డాడు. ఒక రోజున "బాగున్నావా? నాకు కన్పించటమే లేదే? నాతో జతగా వుండటానికి యిష్టంలేదా?" అని యెదురు పడిన జాకోబు మొహం మీద అడిగేశాడు.

జాకోబు నివ్వెర పోయాడు. "అల్లా అంటున్నా వేమిటి? నీ కా సందేహ మెందుకు కలిగింది? ఇంటికి పద; నేను నీ వెనకాలే వస్తాను. గదిలో కూచుని తాపీగా మాట్లాడు కుందాము" అని ఇలియా సమాధానాని కయినా వేచి యుండకుండా గబగబా వెళ్ళాడు ఇలియా నోటమాట లేక వాని వంక చూస్తూ వుండిపోయాడు. మెల్లగా తన గదిలోకి వెళ్లి కూచున్నాడు. మరుక్షణం లోనె జాకోబు వచ్చాడు. వస్తూనే లోపల గడియ వేసి చొక్కాలోపల్నుంచి యెర్రట్ట పుస్తకాన్ని బయటికి లాగాడు.

ఇలియా వాని చర్యలకు చకితుడయ్యాడు. "ఏమి టది?" అనడిగాడు.

"కథల పుస్తకం. బలే మజాఅయిన కథ లున్నాయి. చదువుతాను విను" మని చదువ సాగాడు.

"ఆ వీరుని కెదురుగా మిన్నంటుతూన్న పర్వత మొకటున్నది. దానికి మధ్య కవాటం వున్నది. అతని రక్తనాళములందు వీర రుధిరము ప్రవహించు తున్నది. అతడు బల్లెమును సంబాళించుకొని గుర్రమును కొరడాతో అదలించాడు. ఒక్క దూకులో తలుపు వద్దకు చేరాడు. వీరుడు శక్తికొద్దీ తలుపు కేసి తన్నాడు. అది ఆ ఒక్క తాపు కే విరిగి ముక్కలయి పడింది. లోపలినుంచి గుప్పున పొగ రాసాగింది. దిక్కుల నదరజేసే బుస వినపడుతోంది. పర్వతము అండలండలుగా విరిగి పడుతోంది. "రే మూర్ఖా! వచ్చావూ! రా, ఎన్నాళ్ళనుంచో నేనూ, మృత్యుదేవతా నీకోసం యెదురు చూస్తున్నాము" అన్నమాటలు మేఘగంభీర ధ్వనితో వినవచ్చినయి.

ధూమ తీవ్రతచే వీరుని కన్నులు మూతపడినవి.

ఇలియా కథను కుతూహలంగా వింటున్నాడు. "ఆ వీరుడెవ" రని ప్రశ్నించాడు.

"నువ్వెరగవూ? ఇటు చూడు, యీ చిత్రంలో గుర్రానెక్కి చేతిలో బల్లాన్ని కలిగి వున్నాడే, అతడే. పేరు 'రాల్' అతని భార్యని డ్రెగన్ యెత్తుకుని పోయాడు. తరువాతి ఘట్టం కూడ చెప్తాను, విను."

"చెప్పు. అయితే ఆ డ్రెగన్ ఎవడు?"

"డ్రెగన్ ఒకరకం సర్పం. దానికి కాళ్ళు, పంజా వుంటయి. దానివి వుక్కుగోరలు. మూడు శిరస్సులుంటై. నిప్పులు కక్కు తూంటుంది."

ఇలియూ జాకోబును తేరిచూచాడు. "సరేగాని, అది ఆ వీరుని ప్రేయసిని తిరిగి యివ్వదా?" అని మళ్ళీ అడిగాడు.

"నువ్వు మధ్యలో వెర్రి మొర్రి ప్రశ్నలు వేయక విను, చదువుతాను."

ఇద్దరూ ఆనుకొని కూర్చొని కథ చదువుకుంటు న్నారు. ఈ ర్ష్యా ద్వేషాలకు తావులేని-కుచ్ఛితులు, దుర్మార్గులు వాసముండని అద్భుత దేశాల్లో పరిభ్రమించ సాగారు. వారికక్కడ సుందర హర్మ్యాలు, వివిధ సుమ సంశోభిత విశాలోద్యాన వాటికలు కనబడుతున్నవి. అక్కడి ప్రజలు పరస్పర ప్రేమానుబంధంకల సుఖజీవులు. ఆ ప్రదేశాల్లో తాగుబోతులు లేరు; దైన్య జీవితమే కానరాదు. అంతా ఆనంద మయం!

కాని, చిన్నగా వాగుతున్న గది కవతలి ప్రక్క గ్లాసు తరువాత గ్లాసును ఖాళీ చేస్తున్నారు. ఫర్‌ఫిష్కా సితారు మీద పాడుతున్నాడు. ఒకేచోట యెట్టి పరస్పర వైరు ధ్యం! ఒక వేపున నిర్మల హృదయ ద్వయము స్వర్గజీవితాన్ని భావన చేస్తుంటే, సూటిగా రెండో ప్రక్కన నరక, సృష్టి జరుగుతోంది.

"చాల్లే, ఇక నక్కడ ఆపు"మన్నాడు ఇలియూ.

"విను, విను." ఆ వీరుడు డ్రెగన్‌ను పట్టుకొని విసరి నేలకేసి కొట్టాడు. అది బాధచే మూల్గుతోంది" అని ముగించి జాకోబు పుస్తకాన్ని మూశేశాడు.

7

ఇశ్రాయిలు జాకోబులు పుస్తకం తర్వాత పుస్తకం చకాంపికి చదివేస్తున్నారు. ఒకటి పూర్తయ్యే సరికి మరొక దాన్ని సంపాదించు తున్నారు. చేతిలో డబ్బులు లేక పోతే యింట్లో దొంగిలించయినా పుస్తకాలు కొనేవారు. ఈ విధంగా యిద్దరికి పుస్తక పరిజ్ఞానం అభివృద్ధి అవుతోంది. గ్రంథ కాలక్షేపంతో వాళ్ళు దుఃఖమయ ప్రపంచాన్ని మరచి సుఖస్వప్నాలు కంటూండేవారు.

ఒక నాటి పుదయానె ఫర్ఫిషాక పేర సమను వచ్చింది. అతడు తొందరపాటున దాన్నందుకొని, గజ గజ లాడుతూ కోర్టు కెళ్లాడు; అయితే తిరిగి వచ్చినప్పుడు మాత్రం వాని ముఖము కళకళ లాడుతోంది. కుడిచేత్తో పాషాక చేయి పట్టుకొని తీసుకొచ్చాడు. సరాసరి హోటల్లోకి వచ్చి "ఇదుగో, దొరగారు దిగారు! నాకు పిలుపు వచ్చిన దీయనగారి కోసమే. పోలీసు లితగాణ్ని 'పెంసా' నుంచి తీసుకొచ్చారట. ఈ కాలపు కుర్రాళ్ళకి పుట్టే వన్నీ పితప కాలపు బుద్ధులే. ఉట్టి కెగరలేనమ్మ స్వర్గాని కెగర బోయినట్టు వీళ్ళు శ్రమ పడకుండ ఒక్కసారిగా అదృష్ట శిఖరాన్ని అందుకోబోతారు" అన్నాడు అక్కడున్న వాళ్ళతో.

పాషాక పక్కనె నిలబడి వున్నాడు. వాడి ఒంటి మీది గుడ్డలు చినిగి మాసి వున్నయి. చేతిని విడిపించు కోటానికి గింజు కుంటున్నాడు. కూడెప్పుడు తిన్నాడో యేమో కళ్లు లోతుకు పోయినై.

"మెత్తగా నాలు గంటించి తే సరి, అబ్బాయికి బుద్ధొ స్తుంది!" అన్నా డో పెద్ద మనిషి.

"ఎబ్బె! అంత పనెందుకు? ఇల్లాగే ఒకటి రెండు డక్కా — ముక్కలు తింటే తనంతట తానే దారికొస్తా డన్నాడు ఫర్ఫిషాక.

"పాపం! గొదగొని వున్నాడల్లే వుంది" అని పెరెన్ను పాషాక కొక రొట్టెముక్క నందిచ్చాడు.

పాషాక దానిని పుచ్చుకొని మెల్లగా హోటలు బయటి కెళ్లాడు.

ఫరఫిషాక వానివంక చూచి "అప్పుడే వుడాయించు తున్నావ్రా?" అన్నాడు.

ఇలియా తమ గది గుమ్మంలో నిలబడి యిదంతా చూస్తూనే వున్నాడు. రెండడుగల్లో పాషాక నందు కున్నాడు. ఇలియాను చూచి వాడు ప్రశ్నార్థకంగా "ఏమి" టన్నాడు.

"నమస్తే!"

"నమస్తే!"

"కూర్చో."

"ఎందుకు?"

"చాలా రోజులకు కల్సుకున్నాం. మంచి—చెడ్డలు మాట్లాడు కుందాము."

ఇలియా స్నేహితుని కష్ట-సుఖాలు తెల్సుకుందామని యెంతో ఆతురతగా వెళ్లాడు; కాని, వాని కర్కశ స్వరము, సౌజన్య హీన ప్రవర్తన ఇలియా ఉత్సాహాన్ని భంగ పర్చాయి. ఇంకే మడగటానికి చొరవ చేయలేకపోయాడు. పాషా అరుగు మీద తిష్టవేసి రొట్టె నములుతూ "నీ చదువు సాంతమయిందా?" అనడిగాడు.

"రెండు నెలల్లో పూర్తవుతుంది."

"నేను అంతా చదివేశానోయ్!"

"నిజంగా!"

"మరేమి టనుకున్నావ్? నాకే విద్య అయినా సునాయాసంగా అబ్బుతుంది" అన్నాడు పాషా సగర్వంగా.

"ఎక్కడ చదువుకున్నా వేమిటి?"

"జైలులో"

"జైల్లోనా?" నువ్వు జెయిలు కెందుకెళ్ళావు? పాషా! నువ్వక్కడ భయపడలా?"

"భయ మెందుకోయ్? అక్కడ భయానికీ, గాభరాకీ కారణమే లేదు. ఈ రెండేళ్ళలో నే నెన్నో జైళ్ళకి చక్కర్ కొట్టాను. అక్కడ యెల్లాంటి పెద్దమనుషులు,

యెటువంటి ఆడవాళ్ళు వుంటారనుకున్నావ్! వాళ్ళ లోక జ్ఞానము, అనుభవము చూస్తే దంగై పోతావు. వాళ్ళ మాటల తీరే విచిత్రంగా వుంటుంది. అందరూ ఖయిదీలే; కాని, పరమభక్తులూ, ఆనంద జీవులూను. వాళ్ళమధ్య నాకీ రెండు సంవత్సరాలు ఖులాసాగా గడిచి పోయినై.

"అందరూ దొంగలూ, దగాకోరు లేనా?"

"ఓ, పక్కా దొంగలు!"

ఇలియా పాష్కా ముఖంలోకి చూచి "అంతా రష్యనులేనా?" అనడిగాడు.

"కొందరు యూదులూ వున్నారు. అందరూ వెలి వేయబడిన వాళ్ళే. దొంగతనం చేయడంలో ఆరితేరిన చేతులే; కాని, దురదృష్టవశాత్తు పట్టుపడ్డారు. కేడీలు కావటంవల్ల సైబీరియాకు పంపబడ్డారు."

"సరేగాని, నీకు చదవడానికి అవకాశము, వ్యవధానము వున్నయ్యా?"

"కావలసినంత అవకాశం. అక్కడివాళ్ళే చదువు చెప్పుతారు."

ఇలియాకు కుతూహలం యెక్కువయింది. "చదవటం వ్రాయటం కూడ నేర్చుకున్నావా?" అనడిగాడు.

"రాయటం కొద్దేగాని, చదవటంలో తక్కువు కొనక్కరలేదు."

చదువును గూర్చిన సంభాషణతో ఇలియా వుత్సాహం రెట్టించింది. "నేనూ, జాకోబు కలిసి రోజూ కొత్త

కొత్త పుస్తకాలు చదువుతున్నా"మని చెప్పి పుస్తకాల పేర్లు ఏకరువు పెట్టసాగాడు. తాము చదివిన పుస్తకాలలో ఒకొక్కక్క దాన్ని గురించి తన అభిప్రాయం కూడ చెప్పు కొని పోతున్నాడు. పాప్కా వాని నోటి కడ్డుపడి "మీరు చదివిన గ్రంథాలు మంచిరకాలే. నేను ఆధునిక పద్య కావ్యాలు మాత్రమే చూచాను. జైలు గ్రంథాలయంలో వున్న వాటిలో నాకవి మాత్రమే నచ్చినయి" అని చెప్పాడు.

అంతలో జాకోబు కూడ అక్కడికి చేరుకున్నాడు. పాప్కాను చూచి విస్మితుడై నవ్వుతూ నమస్కారం చేశాడు.

ఎదురు దణ్ణం పెడుతూ "ఏంరా కుంక! నవ్వుతా వెందు" కన్నాడు పాప్కా.

"ఊరికే నే. ఇన్నాళ్ళనుంచి నువ్వెక్కడ ఉన్నావేమిటి?"

నువ్వు కలలో కూడ చూడని చోట."

పాప్కా పుస్తకాలు చదివేస్తున్నాడని ఇలియా జాకోబుతో చెప్పాడు. జాకోబు సంతోషం వెలిబుచ్చాడు. మిత్రులు ముగ్గురూ కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. పాప్కా స్వాభిమానంతో వుద్రేకంగా చెపుతున్నాడు—

"వర్ణింప నలవికాని వెన్నో చూచాను. ఒక తడవ రెండు రోజుల వరకు ఒక్క కబళ మయినా దొరక లేదు.

కూడూ, నీళ్లూ లేక యేకాకిగా అఖ్ఖాన్నపు అడివిలో పడి వుండను."

"నువ్వూ జడుసుకోలా?" జాకోబు అడిగాడు.

"మీరు కూడ ఒకటి రెండు రోజులాసితిలో వుంటే సులువుగా అర్థమవుతుంది. మరోకప్పుడు కుక్కలు మీద పడి కరవటం వల్ల నేను బ్రతుకుతానన్న ఆశే లేకపోయింది. అప్పుడు నేనున్నది 'చజాన్'లో. అదొక స్మృతి చిత్రం! చజాన్ ఒక మహాకవి పేర నిర్మింపబడ్డ పట్టణం. అతడు చాలా గొప్ప కవి లెండి.........చెప్పటం మరిచాను. నేనూ కవనం చేస్తున్నానర్రోయ్" అని నాలుగు చరణాలు చదివాడు. తరువాత మిత్రులవంక సగర్వంగా చూచాడు.

"ఇదేనా కవిత్వమంటేను?" అన్నాడు ఇలియా.

పాష్కా అప్రతిభుడయి "ఇంకేమిటనుకున్నావు? పాదాంతాల నెంత చక్కగా పొందుపరిచాను! అయినా శుద్ధ మొద్దుకు నీకేం తెలుస్తుంది?" అన్నాడు.

"నిజమే. ఇలియా యెప్పుడూ రంధ్రాన్వేషణ చేస్తుంటాడులే" అని జాకోబు పాష్కాని సమర్థించాడు.

"నేను కొన్ని పద్యాలు కూడ రాశాను."

"నీ కవనం మధురంగా వుం"దని జాకోబు మెచ్చుకున్నాడు.

"వాస్తవిక భావాలు కూడా" నన్నాడు ఇలియా.

మిత్రుల మెచ్చుకోళ్ళతో పాష్కా మురిసిపోయాడు. "నా పద్యాలెంత రసవంతంగా వుంటయ్యను కున్నారు?

కవిత్వం రాయటం యేమంత కష్టంకాదు. మాటల కూర్పు, పదాల పొందిక—అంతే. కొండ—ముండ, ఈల—గోల. కవిత్వమంటే యిదే."

"సరేగాని, యిక ముందేమి చెయ్యాలని?" అనడిగాడు ఇలియా.

పాషా కళ్ళు మూసుకున్నాడు. ఒక చిటికపాటాలోచించి "ఏమో! మళ్ళీ నేను పారిపోతానేమో" నన్నాడు.

*　　*　　*　　*

పాషా ఫర్ఫిషా చెప్పు చేతల్లోనే వుంటున్నాడు. ఫర్ఫిషా పత్నీ వియోగం సంభవించి నప్పటినుంచి దుఃఖోపశమనానికి తాగుడు జోరు చేశాడు. ఒకటొకటిగా యింటిలోని సామానులన్నీ కుదువబెట్టీ, తెగనమ్మివేసీ సురాపానానికి కైంకర్యం చేశాడు. స్వంతంగా జోళ్లు వగైరా కుట్టి అమ్ముకొనే ఆస్కారం కూడా లేకుండా పోయింది. వేరే దుకాణంలో నౌకరుగా కుదిరాడు. పగలింటి వద్ద వుండేవాడు కాదు; కాబట్టి పిల్లలు వాని గదిలోక చేరుతూండేవాళ్ళు. పెద్దవాళ్ళ భయం లేకపోవుటచే వాళ్ళక్కడ స్వేచ్ఛగా కాలక్షేపం చేసేవాళ్ళు.

ఫర్ఫిషా తన కూలిలో సగం మాత్రం కూతురుకిచ్చేవాడు. అంతటితో తన సంసార బాధ్యత తీరిపోయిందనుకునేవాడు. మాషా తన సంసారానికి యేకైక

సామ్రాజ్ఞి. ఇప్పుడామె అబోధ బాలిక కాదు. ఒడ్డూ పొడుగూ పెరిగింది. శిరోజాలు నలుపెక్కి పిరుదులంటినయి. లోచనాలు చంచలాలయినవి. ఆమె ముగ్ధ నాయిక రీతి నభినయించ సాగింది. గృహకృత్యాల్లో మనసుంచి పని చేసుకుంటోంది. పుల్లా పుడకా యేరి తెచ్చి వంట చేసేది. ఇల్లూ వాకిలీ వూడ్చి బట్టలుతికి, కుట్టుపని చూచుకుంటోంది.

అప్పుడప్పుడు మతిస్నా వచ్చి మాషాకి తోడ్పడుతూండేది. కూరా–నారా తెచ్చిచ్చేది. ఒకసారి కొత్త చీర కొని తెచ్చి వద్దు వద్దంటున్నా బలవంతంగా మాషాకి కట్టబెట్టింది.

మాషా మతిస్నాను గౌరవ భావంతో చూచేది. ఇద్దరూ తేనీరు కాచుకొని తాగేవారు. మతిస్నా ప్రతిదినమూ ఘర్షిష్కాని సాధించుతూండేది. మాషా ఆవిడ ఆఁలో ఉఁ కలిపేదేగాని, క్రోధ, విషాదాలేమాత్రం కనపర్చేది కాదు. దుష్ప్రవర్తనల్లో దిగబడిపోయిన నాగిముందూ గృహ సంరక్షకురాలు చూపేజాలినే మాషా తన జనకుని యందు కలిగి వుండేది. "తాగుడు కలవాటుపడిన వాని నుంచి మంచి నపేక్షించడం తెలివితక్కువ. ఆయన ఆనందం కోసం, దుఃఖాన్ని మరచేటందుకు తాగుతున్నారు. అమ్మ బ్రతికుండగా యెన్నడు యింతగా తాగి యెరుగరు. కష్టకాలం వచ్చింది. ఏంచేస్తారు?" అనేది కష్ట–సుఖాలన్నీ వడపోసిన ఆరిందాలాగా.

మతిస్నా అనేది— "పిడి జిమ్మడ! తన పోషణలో ఒక ఆడపిల్ల వున్నదనయినా, తోచదేం!"

"నేను గడిదేశానన్నీ, ఇల్లు చక్కబెట్టుకో గల్ననీ ఆయనకి తెలుసు పిన్నీ!'' అనేది మాషా.

"నువ్వూ తగిన దానివే నే" మతిస్సా విసుక్కునేది.

మాషాకి మతిస్సా అంటే మహా యిష్టం. ఇద్దరూ తల్లీ బిడ్డల్లాగా వుండేవారు. ఒక్కొక్కప్పుడు మాషా ఆవిడ ఒడిలో పడుకొని మతిస్సా మెడకి రెండు చేతులూ లంకె వేసేది.

మతిస్సా నిత్యము వుదయంపూట తప్పకుండా వచ్చేది. పిల్లలు సాయంత్రం చేరేవాళ్ళు.

జాకోబు మాషాయందు మక్కువ చూపేవాడు. వాడు తరచుగా టీ, పంచదార, రొట్టె, మాంసం వగైరా తెచ్చి యిస్తుండేవాడు. మాషా వాటని నిస్సంకోచంగా పరిగ్రహించేది. అంతేకాదు, యెప్పుడేది కావలసివచ్చినా జాకోబుతో చెప్పటము, వాడు తక్షణమె వాటిని తెచ్చి యివ్వటం కూడాకద్దు.

జాకోబు ఒకనాడు బజారునుంచి పలక, బలపం తెచ్చి మాషాచే ఓనమాలు దిద్దించాడు. కొద్ది రోజుల్లోనే ఆమె వర్ణక్రమమంతా నేర్చుకొని చదువసాగింది.

మాషా జాకోబుల ప్రేమ బాంధవ్యానికి ఇలియా కూడ యథాశక్తిని దోహదం చేస్తుండేవాడు. సమయా సమయాల్లో యేదో ఒకటి తెచ్చి మాషాకి సమర్పించేవాడు. వానికి మాషాయందమిత ప్రేమ. తనవలె ఆమె కూడ మాతృవిహీన కావటము, ఒళ్ళొంచి పని చేసుకునేది అవ

టంవల్ల వానికామె యందభిమానాదరాలు కలిగాయి. మాషాని సంతోష పెట్టేందుకు యెన్నోతిప్పలు పడేవాడు.

ఆఁ, అప్పుడప్పుడు వాళ్లిద్దరికి కీచులాట జరుగుట కూడా మామూలే. మాషా కోపావేశంతో తనమీదికి రాబోతే ఇలియా దూరంగా పారిపోయి నవ్వేవాడు. మాషా కోపం చల్లారి పోయేది.

ఒక రోజున కీచులాట గుద్దులాట దాకా వచ్చింది. ఇలియా, జాకోబు, మాషా పేకాట ఆడుతున్నారు. ఆటలో ఇలియా గెలిచే ఛాన్సు వచ్చింది. జాకోబును గెలిపించాలని మాషా బుద్ధిపూర్వకంగా తప్పాడింది. ఆ విషయం ఇలియా గ్రహించాడు. మాషాపైన కోపం వచ్చి "జాకోబు పెళ్ళాం!" అని యెగతాళి చేశాడు.

అంతటితో వూరుకోలా. కసితీరక యింకా యేసే మాటో . అనేశాడు పరిస్థితి విషమించుతుందేమోనని నాడు వాళ్ళ దృష్టిని మరో విషయం మీదికి మార్చాలను కున్నాడు; కాని, మాషా ముఖం జేవురించి కళ్ళనీళ్ళ పర్యంతం కావటం చూడగానే కోపంతో తోక త్రొక్కిన త్రాచునలె ఇలియామీద విరుచుకొని పడ్డాడు. ఆవేశంలో గబీగుబీమని ఇలియాను గుద్దాడు. మాషా సరసకుపోయి యేడ్వసాగాడు.

ఇలియా ఒళ్లు దులుపుకొని లేచాడు. హుంకరిస్తూ జాకోబుపైకి వురకబోయాడు; కాని, వాడేడుస్తూ వుండటం చూచి తమాయించాడు. మాషా జాకోబు భుజంమీద

చెయ్యేసి వూరడించుతూ "ఊరుకో జాకోబ్! ఇక వాణ్ణి మనజతకి రానివ్వొద్దు. వాడు పరమ దుర్మార్గుడు. వంశంలో వున్న దెక్కడికి పోతుంది? అబ్బ దొంగ, పిన్నబ్బ మరుగుజ్జు. వీడూ గూని వాడవుతాడు." అని ఇలియా నుద్దేశించి "ఒరే తుచ్ఛా! ఇక్కడికిరా, నీపని పడతాను!...... సిగ్గూ-శరమూ లేక యింకా చూస్తూ నుంచున్నావెందుకు? పో, పో"మ్మంది.

ఇలియా నిలువునా నీరయి పోయాడు. జాకోబు మీద వానికి జాలి కలిగింది. సిగ్గుచే కృంగి పోయాడు. మాట్లాడకుండ వెళ్ళిపోయాడు. వేదన, అనుతాపాలతో దహింపబడుతూ పిచ్చెత్తినట్టు అటు నిటు తచ్చాడాడు. మనసు శాంతించిన తర్వాత మెల్లగా ఫర్షిష్టా గది వేపుకు వెళ్ళాడు. కిటికీ గుండా లోపలికి తొంగిచూచాడు. మాషా జాకోబులు నవ్వుకొంటూ చీట్లాడుతున్నారు. ఇలియా దిగాలు పడ్డాడు. అడుగులో అడుగేసుకుంటూ లోపలికెళ్ళి "నన్నుకూడా ఆడనివ్వరూ?" అనడిగాడు దీనంగా.

వాని గుండె కొట్టుకుంటోంది. ముఖంలో కళలేదు. కళ్లు వాలి వున్నయి.

వాళ్ళిద్దరూ ఒకరి ముఖ మొకరు చూచుకున్నారు.

"నే నిక ఎన్నడు అసభ్యంగా ప్రవర్తించను. క్షమించండి" అని ఇలియా బ్రతిమాలాడు.

"సరే. రా, వచ్చి కూచో" అంది మాషా.

జాకోబు ముఖం చిట్లించి పళ్లు నూరుతూ అన్నాడు- "వెధవ! ఇంకా మనం చిన్నపిల్లలమేనా? నోరు సంబాళించుకొని మాట్లాడాలి."

"మనం చిన్నవాళ్ళం కాబట్టే దురలవాట్లు చేసుకోకూడదు" అన్నది మాషా.

ఇలియా స్వాభిమానంతో "మీరు మాత్రం నన్ను చెడామడా తిట్టలా?" అనడిగాడు.

"కానిమాట నే నేమన్నాను? అనవసరంగా కోపం తెచ్చుకోక నువ్వే చెప్పు" మాషా అన్నది.

"కోప మెందుకు? తప్పు నాదే లెండి" అని ఇలియా జాకోబువంక చూచి నవ్వి "నువ్వుకూడ జరిగింది మర్చిపో; మనసులో యేమీ వుంచుకోకు" అన్నాడు.

"అందరము మర్చిపోవడమే మంచిది. ఇకరా, కూచుని చెయ్యి కలుపు" మని మాషా వాని చెయ్యి పట్టుకొని లాగి ఇలియాకి కూడ ముక్కలు పంచింది. జాకోబు ప్రక్కకు జరిగి చోటిచ్చాడు.

ఇలియా పేక ముక్కలు తీసుకున్నాడు. ఈసారి మాషా నోడించాలని పట్టుదలతో ఆడాడు; కాని, ఆమె అసలా ఆటలో గట్టి ప్రవీణ. మాషాకూడ జాగ్రత్తగా ఆడింది. ప్రతి ఆటలోను జాకోబే ఓడిపోతున్నాడు. తన పంతం చెల్లనందున ఇలియా విసుగు చెందాడు. "కాకికెంత తెల్లరంగు పూసినా అసలు నలుపెక్కడికి పోతుంది!" అన్నాడు.

వరుసగా ఓడిపోతూండడం వల్ల జాకోబుకూ విసుగెత్తింది. ఇక చాల్లెద్దురూ. కాస్సేపు చదువుకుందాము'' అన్నాడు.

ముగ్గురూ చదవడాని పూనుకున్నారు.

ఆ విధంగా వాళ్లు చదువుకుంటూంటే ఒక్కొక్కప్పుడు పాషా పుట్టిపడి పుస్తకాన్ని లాగేసేవాడు. "ఎప్పుడూ ఒకటే చదువా? మీరీ చదువులోనే చచ్చిపోతారు. జాకోబ్! నువ్వు మాషాని పెళ్లి చేసుకోవోయ్" అనేవాడు.

మాషా కోపా న్నభినయించేది. ముగ్గురు మిత్రులూ నవ్వుకునేవారు.

చదుమీంది విసుగుదలతో అప్పుడప్పుడు పాషాని యాత్రానుభవాన్ని గూర్చి చెప్పమనేవారు. వాడూ యేదో ఒక విషయానికి చిలవలు-పలవ లల్లి లబ్జుగా చెప్పేవాడు. వాడు చెప్పేది పుస్తకంలోని కథకంటె మనోరంజకంగా వుండేది. ముగ్గురూ తన్మయులై పుస్తకాల మాటే మర్చి పోయేవారు.

ఒక దఫా పాషా ఇల్లా చెప్పాడు—

"రాధారి చీటి లేకుండా ఒక వూరునుంచి మరో చోటుకు వెళ్తే పట్టుకుంటారని తెలిసింది. పోలీసుల్ని మభ్య పెట్టడానికి నేనొక యుక్తి పన్నాను. కాన్‌స్టేబిలు కనపడగానే అత్యవసరమైన కార్యార్థం వెడుతున్నవాని వలె బిజబిజ నడిచేవాణ్ని; లేదా, దారిలో యెదురు వచ్చిన

యేరైతు వద్దనో నిలబడి అతను నా తండ్రో, అన్నో, చుట్టమో నన్నట్టు బాతాఖాని మొదలు పెట్టేవాడిని. అల్లాంటప్పుడు పోలీసులు నా జోక్యం పట్టించుకునేవారు కాదు. పల్లెటూళ్ళలో అయితే నిశ్చింతగా వుండేది. అక్కడ పోలీసులే వుండరు. 'ఎందుకొచ్చా'వని యెవరయినా అడిగితే 'దిక్కులేని వాణ్ని; భిక్షాటనతో బ్రతుకుతున్నా' నంటేచాలు. వాళ్లొట్టి పిచ్చి మారాజులు! పిల్చికెళ్లి తిండి పెడతారు. అక్కడ స్వేచ్ఛగా తిరగొచ్చు. బాధించే వాళ్లుండరు. ఒక్క పొట్టరందే లేకపోతే స్వేచ్ఛగా యీ భూమి నంతను చుట్టిరావచ్చు. దేశాటన యెంత సరదాగా వుంటుంది! కాని, ఒక్కొక్కప్పుడు వేళకి నాలుగు మెతుకులు దొరక్కపోవటం కూడ కద్దు. అల్లాంటప్పుడు ఆకలి దహించివేస్తుంది; పేగులు మాడిపోతై. అప్పుడు యేదో ఒకటి కడుపులో కుక్కా లనిపిస్తుంది. తల తిరిగిపోతుంది. అదృష్టవశాత్తు యేరొట్టిముక్కో చేతికి చిక్కితే నమిలేటప్పుడు యెప్పుడూ అల్లాగే తింటూండా లనిపించుతుంది. ఏమయి నప్పటికి నాకు మాత్రం జైల్లోనే బాగుంది. మొదట భయపడుతూండే వాడిని; కాని, అనుభవంమీద అక్కడిదే సుఖజీవితంగా తోచింది. పోలీసువాళ్ళు పట్టుకున్నప్పుడు లాఠీలతో చావగొట్టి ప్రాణం తీసేస్తా రనుకొనేవాణ్ని; కాని, ఒకనాడు పోలీసొకడు గప్‌చిప్‌గా వెనక నుండొచ్చి నా మెడ లంకించుకున్నాడు. 'నువ్వెవరవు? ఏవూ'రని యెంత మర్యాదగా అడిగాడు! అబద్ధమాడటం యెందుకని నేను

యదార్థమే చెప్పాను. నేను బొంకినా వాళ్ళు నిజం తెలుసుకోగలరు. వాడు నన్ను పోలీసు స్టేషనుకు తీసి కెళ్లాడు. అక్కడ అదివరకె పెద్దమనుషులు చాలమంది వున్నారు. వాళ్లు నా చుట్టూ చేరి 'నేరమేమి' టని అడిగారు. 'ఊరకే తిరుగుతూండగా పట్టుకున్నా'రని చెపితే అందరూ పక్కుమన్నారు. తర్వాత కొద్దిరోజులకు నన్ను పెద్దజైలుకు పంపారు. అక్కడా నన్నందరూ గేలిచేశారు. వాళ్లరితేరిన గజదొంగలయ్యో!"

ఇల్లాగే తన స్వానుభవాన్ని చిత్రవిచిత్రంగా వర్ణించి పాష్కా తన ప్రభావాన్ని మిత్రులపైన ప్రసరింప జేసేవాడు.

పాష్కా మళ్లీ అనతి కాలంలోనే పరారయ్యాడు. ఈ పర్యాయం వాడొక అచ్చాఫీసులో నౌకరుగా చేరినట్టు తెలిసింది.

పాష్కా పారిపోయాడని విన్నప్పుడు ఇలియా జాకోబుతో యిల్లా అన్నాడు—"మన బతుకంతా యీ పాడు కొంపలోనే గడిచిపోయేలాగుంది. మనం కూపస్థమండూకాల వలె వుండిపోతాం."

8

పాష్కా పలాయనంతో ఇలియా రెండురోజుల వరకూ తెరపు మరపుగా వున్నాడు. మూడోనాడు గాని మనసు పుస్తకం మీద నిలవలా. ఆ తర్వాత వాడు పాష్కాను బొత్తుగా మర్చిపోయాడు. ఒక రోజున బడినుంచి రాగానే ఇలియాను పినతండ్రి పిల్చి "నువ్వీక చదువుమాని యేదో ఒక పనిలో ప్రవేశించరా అబ్బాయి! పద్యాలుగెళ్ళు నిండి పెద్దవాడి వయావు, ఏదో ఒక బ్రతుకు దెరువు చూచుకోక పోతే యెల్లా?" అని చెప్పాడు.

పెట్రుహా ఆ మాటలు విని టెరెన్సుతో అన్నాడు— "నీకు అనేక మందితో పరిచయముంది. నువ్వు కోరితే యెవరో ఒకరు వాడిని నౌకరుగా పెట్టుకోనకపోరు. నా సలహా నచ్చితే ఒక రోడాదిపాటు బాగా పని నేర్చి నీ స్థానంలో వాడినుంచు. నే నింకొక హోటలు కూడ పెట్టా లనుకుంటున్నాను. దాని అజమాయిషీ నువ్వు చూస్తుందువుగాని."

ఇలియా వాళ్ళమాటల కంతగా ప్రాముఖ్యత నివ్వలా. మామూలుగా తన చదువును సాగించుతున్నాడు.

అయిదోనాడు తెల్లవారకముందే టెరెన్సు ఇలియాను నిద్రనుంచి లేపి "త్వరగా తానం చేసి ముస్తాబయి సిద్ధంగా వుండు" అని చెప్పాడు.

"ఎందుకూ? ఎక్కడికైనా వెళ్ళాలా?" అని ఇలియా కళ్ళు నలుపుకుంటూ అడిగాడు.

"నీకు నౌకరీ కుదిర్చాము. ఇప్పుడే వెళ్ళాలి."

"ఏం పని?"

"చేపల దుకాణంలో నౌకరీ" అని చెప్పి టెరెన్సు వెళ్ళిపోయాడు. ఇలియాకు దిగులు పుట్టింది. ఇన్నాళ్ళనుంచీ యే దుర్వాసనకు ముక్కు మూసుకుంటున్నాడో, యే పాడు కొంపని విడిచిపెట్టి పోవాలని వుత్కంఠ వెలిబుచ్చుతున్నాడో వాటిని వదలిపెట్టడానికే నేడు వాని యాత్మ విలపించ సాగింది. మమత పొంగి వచ్చింది. పడక మీద నుంచి లేవడానిక్కూడ వానికి త్రాణ లేకపోయింది.

అప్పుడు హడావుడిగా జాకోబు వచ్చాడు. వాడికీ విచారంగానే వుంది. జుట్టు విడబడి వున్నది. తడబడుతూన్న కంఠంతో "త్వరగా లేచిరా నాన్న నిన్ను పిల్చుకొని రమ్మన్నారు. నువ్విక్కడినుంచి వెళ్ళిపోతున్నావని కూడా చెప్పారు. ఒకసారి మాంసం చూచిరా. మమ్మల్ని మర్చిపోవు కదూ!" అని బడబడ లాడాడు.

ఇలియా గొంతు బిగుసుకుంది. కళ్ళలో గిర్రున నీళ్ళు నిండినయి. "నే నిక్కడి నుంచి శాశ్వతంగా వెళ్ళి పోవటం లేదులే" అన్నాడు.

ఇలియా వెళ్ళిపోతున్నాడని తెలిసి మాషా అక్కడికే లగెత్తుకొచ్చింది. "నువ్వెళ్ళి పోతున్నావటగా? మేము జ్ఞాపక ముంటామా ఇలియా?" అన్నది.

ఇలియా బిక్క మొగంతో మాటరాక తలొంచుకున్నాడు. లోలోపల పినతండ్రిని తిట్టుకుంటూ గుడ్డా గుడుసూ అటూ యిటూ గిరాటేస్తున్నాడు.

మిత్రుడు తమ్మొదిలిపెట్టి పోవాల్సి వచ్చినందుకు మాషా జాకోబులకు వంతగానే వుంది. "అప్పు డప్పుడు చూంచి పోతూండేం" అన్నాడు. జాకోబు

"తప్పకుండా వస్తాను."

"అబ్బో! అప్పుడే దుకాణదారు దర్జా వచ్చేసిందే! ముక్కు విరిచి యెల్లా మాట్లాడుతున్నాడో చూడు జాకోబ్!" అని మాషా పరియాచకమాడి నవ్వింది.

"పోవే గాడిద!" ఇలియా కుళ్ళుతూ అన్నాడు.

స్నేహితుల వద్ద సెలవు తీసుకొని ఇలియా పెత్రుహా వెంట బజారుకు బయలు దేరాడు. "నిన్ను మంచి చోటుకే తీసికెడుతున్నాను నీకు కాబోయే యజమాని పేరు-ప్రతిష్టలు కలవాడు. ఉదారుడూ, వదాన్యుడూను. నగర ప్రముఖుల్లో ఒకడు. నువ్వు బుద్ధిమంతుడివి. ఒళ్లొంచి [illegible]కంగా పనిచేస్తే బాగుపడతావు. నీ అదృష్టం పండుతుంది" అంటూ పెత్రుహా దారిపొడుగునా ఇలియాకి వుపదేశించాడు.

ఇలియా తన భావి యజమాని హృదయాన్ని, ఆకారాన్ని వూహించుతున్నాడు. జర్మియా ఒక్కడే దయార్ద్ర హృదయుడనీ, సాధుశీలియనీ వాడి కదివరకు తెలుసు.

పెట్రుహా వర్ణనవల్ల తాను ముఖ మెరుగని వర్తకుడు కూడ జర్మియాలాగా బక్క—పల్చగా, నవ్వు ముఖంతో వుంటాడని భావించుకొన్నాడు; కాని, దుకాణంలో అడుగు పెడుతూనే వాని వ్యూహా సౌధము కూలిపోయింది. దుకాణం మధ్య పోతకలాగున్న మనిషి కూచుని వున్నాడు. బట్టతల, బవిరి గడ్డం, పిల్లి కళ్లూను. అతడి రూపమే భీతిని గొల్పుతోంది.

ఇచ్ఛా పూర్వకంగా కాకపోయినా ఇలియా వానికి వంగి నమస్కరించాడు. ఆ తుందిలుడు ఇలియా నెగాదిగా చూచి "వీడి పేరేమి"టని పెట్రుహా నడిగాడు.

"ఇలియా"

"ఇలియా! మూడు కళ్లతో, నాలుగు చేతుల్తో పని చెయ్యాలి, తెలిసిందా? మా వాళ్ళని మర్చిపోవాలి. నీకు సర్వము నేనే." ఇవీ ఇలియాతో యజమాని ముందుగా చెప్పిన మాటలు.

ఇలియా దుకాణంలో నాల్గు వేపులా పరికాయించి చూచాడు. ఒకాయన కూచుని [illegible]న్నాడు. ఒకడు తక్కెడతో తూస్తున్నాడు. చేపలు—చచ్చినవీ, జీవంతో వున్నవీ—పోగులు పోగులుగా వున్నాయి. బుట్టల్లో యెగిరేవి, తొట్లల్లో ఆడేవి, క్రింద పడివుండి అంత్యాని కెదురు చూస్తున్నవీ—రకారకా లున్నాయి. దుర్వాసనకు ముక్కు పగిలి పోతోంది. తాను రాత్రిం బగళ్ళు పని చేయాల్సింది అందులోనే!

పాపం! ఇలియా కొపని సరికొత్త. చేప నెక్కడ యెల్లా పట్టుకోవాలో కూడా తెలియదు. తలకు బదులు తోక పట్టుకునే వాడు. వెన్నుమీద చెయ్యి వేసేవాడు. అందుచే అవి గిలగిల కొట్టుకొని చేతిలోనుంచి జారిపోయేవి. తీసి అందించుటలో జాగయి ఇలియా యజమాని చివాట్లకు గురి అయేవాడు.

ఒకనాడు దుకాణానికి వెనుకనున్న వసారాగదిలో ఇలియా మంచుగడ్డను ముక్కలుగా నరుకుతున్నాడు. చిన్ని చిన్ని రవ్వ లెగిరిపడి వానిగుడ్డ తడిసిపోయింది. గొడ్డలి తగిలి గోడ చెక్కూడింది. తిరిగి వచ్చినాక ఇలియా తన చేతగానితనం వల్ల కొద్దిగా మంచుగడ్డ పాడయి పోయిందనీ, గోడ పెచ్చూడిందనీ యజమానితో నిజం చెప్పాడు. ఖామందు కళ్ళెర్రజేసి "నిజం చెప్పావు కాబట్టి మొదటి తప్పుగా యీసారికి వదిలి పెడుతున్నాను. ఇకనుంచి జాగ్రతగా పని చెయ్యి. లేకపోతే తన్నులు తగుల్తయ్" అని కోప్పడ్డాడు.

ఇలియా జీవితం యింజను చక్రంలాగ తిరిగిపోతోంది. తెల్లవారుజామున అయిదు గంటలకే లేచేవాడు. యజమాని కుటుంబములోని వారందరిపీ శాండిల్సు, బూట్లు పాలిష్ చేసేవాడు. అమ్మగారు, అయ్యగారి కూతుళ్ళు చెప్పిన పన్లు చేసి మరీ దుకాణానికి వెళ్ళాలి. అక్కడ బల్లలు, తక్కెడ, రాళ్ళు తుడిచి శుభ్ర పరిచేవాడు. తర్వాత తట్టలు, బుట్టలతో చేపల్ని జేర వెయ్యాలి. చిల్లర మల్లర

పనులన్నీ అయినాక మధ్యాన్నం మాత్రం కాస్త విశ్రాంతి చిక్కేది. తీరుబడిగా వున్నప్పుడు దుకాణంముందు నిలబడి బజారున వచ్చేపోయే జనాన్ని చూస్తుండేవాడు. ఏమేమో ఆలోచించేవాడు. ఒకనాడు "చేపలన్నీ అయిపోతే జనం యేమి తింటారండీ!" అనడిగాడు యజమానిని.

యజమాని మొహం వాచేటట్టు చీవాట్లు పెట్టాడు. ఇలియా ముడ్డీ,నోరూ మూసుకొని అవతలికి జారుకున్నాడు.

మర్నాడు అదే వేళ తీరుబడికాగా ఇలియా వార్తా పత్రిక తీసి చదువసాగాడు. వెంటనే మేనేజరు ఆ పత్రికను లాక్కొని "ఎవర్నడిగి తీశావురా వెధవాయ్?" అని కసిరాడు.

ఇలియా కసలె ఆ మేనేజరంటే ఒళ్ళుమంట. ఎదుట అనక పోయినా చాటున దూషించేవాడు. తండ్రి లేకుండా చూచి యజమాని కూతుళ్ళు దుకాణానికి వచ్చి నచ్చిన చేపలను పట్టించుకొని పోతూండేవాళ్ళు. మేనేజరు వారు కోరిన వాటిని తన స్వంతముల్లె నిచ్చినట్లిచ్చి వారితో సరాగాలాడుతూండేవాడు. వాని యీ ప్రవర్తన ఇలియాకు గిట్టేది కాదు.

మేనేజరు మహా దుష్టుడు. వాని దుష్కృత్యాలకు అంతులేదు. బిచ్చగాండ్రను యేడ్పించడమంటే వాడికి మహా సరదా. యాచనకొచ్చిన వాడెవడయినా దుకాణం ముందు నిలబడితే మేనేజరు చేపముల్లుతో బిచ్చగాని

చేతిలో గుచ్చేవాడు. వాడు లబోలిబో మంటూ పోతూంటే "ఇంకా చాలకపోతే మరో దుకాణాని కెళ్ళు" మని మేనేజరు పరిహాసం చేసేవాడు.

ఒక రోజున తిరిపెకత్తె ఒకతె పోతూ పోతూ వీరి దుకాణంముందున్న ఒక యెండు చేపని చేత్తో తీసి పుచ్చుకొన్నది. మేనేజరది చూచి లేచెళ్ళి ఆమె మెడ పట్టుకొని మెలి తిప్పాడు. ఆ యెండు చేపని లాగి వేసుకొన్నాడు. నోటినుంచి రక్తం పడుతున్నా ఆ దరిద్ర దేవత మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

మేనేజరు దుకాణం లోపలికివచ్చి అసిస్టెంటు కార్ప్‌తో యిల్లా అన్నాడు— "నాకీ బిచ్చగాళ్లనుచూస్తే ఒళ్ళు మండుకొస్తుంది. వీళ్ళు లోకుల కష్టార్జితం తిని పొట్టలు పెంచుకొని సోమరులుగా తిరుగుతూంటారు. మతిలేని వాళ్ళుకొందరు వీళ్ళని క్రీస్తుదేవుని బంధువులని పేర్కొంటున్నారు. మరి మనమందరము భగవంతునికి శత్రువులము కాబోలు! జీవితమంతా యెండనక, వాననక పని చేస్తున్నా మన కొకన్నాడూ శాంతిలేదు; కమ్మని తిండే లభించదు."

కార్ప్ మేనేజరును మించిన దగుల్బాజీ. వాడెప్పుడూ ధార్మిక సూక్తులను వుచ్చరించు తూంటాడు. శనివారం నాడు చర్చికి వెళ్ళడానికి యేమాత్రం విలంబమయినా ప్రాణంమీది కొచ్చినంత ఆరాటం చూపేవాడు. మంత్ర

గాళ్ళని, ఐంద్రజాలికులను పిలిచి పూజించేవాడు. దుకాణంలో పాములాగ ప్రాకులాడు తూంటాడు. యజమాని వున్నంతసేపూ యెంతో శ్రమజీవిలాగా, వ్యాపారాభివృద్ధి కోసం శక్తిని ధారపోస్తున్నట్లు నటించుతాడు. వాడు రాటుదేలిన మోసగాడని గ్రహించి ఇలియూ వానిని కంట గించుకోనసాగాడు.

ఆ సిబ్బందిలో యజమానిపట్ల భక్తి-శ్రద్ధలుగలవాడొక్క ఇలియూయే. యజమానికూడా వాడిని ప్రేమగానే చూసేవాడు.

ఒకప్పుడు తీరుబాటు సమయంలో దుకాణంముందు కూచొని బజారువంక చూస్తున్న ఇలియూను కూకలేసి పిల్చి "నిద్ర పోతున్నావా?" అనడిగాడు యజమాని.

"లేదండి."

"నువ్వెప్పుడూ యేదో ఆలోచించుతూన్నట్లు గంభీరంగా వుంటున్నావే?"

"ఏమోనండి."

"విచారపడటం లేదుగద?"

"కొంచెం బెంగగానే వుంటోంది."

"అల్లాగే వుంటుందిలే నువ్వైదు సంవత్సరాలు వచ్చేంతవరకు నాకూ అల్లాగే వుండేది అంతవరకు నేనూ ఇంకొకరి చేతిక్రింద పని చేస్తూండేవాణ్ని. ఇప్పుడో యిరవై సంవత్సరాల నుంచి స్వంత వ్యాపారం నడుపుతూ యితరుల

మీద జాలి చూపుతున్నాను. ఎందరికో జీవనోపాధి కల్పిస్తున్నాను."

అది ప్రాపంచిక ధర్మమేగా అన్నట్లు ఇలియా తలూపాడు.

క్రమంగా ఇలియాకొక సందేహం కలిగింది. 'ఇంత చక్కని భవనము, చేతినిండా ధనము కలిగివుండికూడ యజమాని యీ గబ్బు కంపులో కుళ్ళడం యెందుకో! ఇంటి పట్టున వుండే ఆ శాంతి-ఆనందా లెక్కడ! యీ కల కల మెక్కడ! ఈయన కసలా ప్రశాంత వాతావరణము, సంసార సుఖాలు మనస్కరించ వేమొ! ననుకు నేవాడు. చేపల దుకాణం కంటె పెట్టుకునే హోటలు యెన్నోరెట్లుత్తమంగా తోచింది. ఒకనాడు అవకాశం చూచి ఇలియా తన సందేహాన్ని యజమాని ముందె వెల్లడించాడు. "ఈశ్వరుడు మీకు తగినంత సిరి - సంపద లిచ్చాడుగదా; మరి మీరు స్వసుఖానుభవం చూసుకోనక యీ మురికికూపం లోనే పడివుంటా రెందు కండీ?"

యజమాని ఇలియా అమాయకత్వానికి నవ్వుకున్నాడు. చెంతకు పిల్చి "ఇది నీకే తోచిందా, యెవరయినా నేర్పారా?" అనడిగాడు.

"కొన్నాళ్ళనుండి నాకీ సందేహం వుంది. ధైర్యం చేసి మిమ్మల్నే అడిగాను తెలుసు కుందామని."

"నేను నీకు యజమానిని కద, యిల్లాంటి ప్రశ్నలు అడుగవచ్చా? ఇది అవిధేయత కాదూ?"

అని యజమాని మృదువుగా మందలించే టప్పటికి మేనేజరు, కార్ప అక్కడికి వచ్చారు. ఆయన వారిని చూచి "మానవుడు శక్తికొద్దీ యేదో ఒక పని చేస్తూనే వుండాలి. ఒక్కనాడయినా అలసత్వంతో పోనివ్వకూడదు. ఈసంగతి నెటువంటి మూర్ఖుడు కూడ గ్రహించగలడు" అన్నాడు.

"అందుకు సందేహమా?" అని మేనేజరు యేదో పని చేయబోయే వానివలె దుకాణంలో అటు నిటు తిరుగ సాగాడు. ఇలియా వానిని చూచి నవ్వుకున్నాడు.

ఇలియా రోజులు యధారీతిని గడిచిపోతున్నాయి. జీవితంలో యెలాంటి మార్పుగాని, పరివర్తన గాని లేదు. ఆశ లేదు; అభివృద్ధీ లేదు. ఏకునుంచి దార మేకరీతిని వచ్చు నట్లు వాని జీవితమంత్రం సాగిపోతోంది. వాడు తన జీవితంలో మరే ఆశకు ఆస్కారం లేదనుకున్నాడు. చేపల్ని పోగులు బెట్టడం, అదీ యిదీ అందించడంతోనె తన జీవితం కాస్తా సమాప్త మయిపోతుందని భావించాడు. వాని కాఠిన్య జీవితంలో అదివరకున్న కొద్దిపాటి అక్షరజ్ఞానమే తోడుగావుంది. తన కళ్ళముందు జరుగుతున్న ప్రతి ఘట నను తన విద్యాజ్ఞానంతో పరిశీలించి ఆయా ఘటనల కేదో హేతువులను కనుకొని తృప్తిపడేవాడు. హృద

యంలో చెలరేగుతూన్న సమస్యలను, సందేహాలను చెప్పుకొనేందు కెవరూ లేకపోవడం వాని కెంతో బాధాకరంగా వుంది. అన్నిటిని తనలోనే అణచి వుంచుకోవాల్సి వచ్చుటచే వాటిభార మధికమై ఇలియా అణగారిపోసాగాడు. ఒక్కొక్కసారి పాషావలె తానుకూడ యే అపరిచిత ప్రదేశానికో పారిపోతే బాగుండు ననుకొనేవాడు. సెలవురోజున చర్చికి వెళ్ళినప్పుడు మాత్రం వాని హృదయభారం కొంతమట్టుకు తేలిక పడినట్టుండేది.

నౌకరుగా చేరిన తరువాత గతించిన ఆరు మాసాల్లోను ఇలియా రెండు పర్యాయాలు మాత్రం పినతండ్రి వద్దకు వెళ్ళివచ్చాడు. అక్కడా చెప్పుకోదగ్గ మార్పేమీ జరగలేదు. టెరెన్సు దినదినం దిగజారిపోతూంటే పెట్రుషా నానాటికి బలుస్తున్నాడు. తండ్రి సతాయింపుతో జాకోబు బేజారయ్యాడు. ఇలియా అక్కడికి వెళ్ళినప్పుడు ఒంటరిగా వాని [illegible] ఇల్లా చెప్పుకున్నాడు — "నాన్న నన్ను నిత్యము నానామాటలు అంటున్నాడు. ఇక నన్ను యేదో ఒక వృత్తిలో ప్రవేశించ మంటున్నాడు. నే నిప్పటవలెనే పుస్తకాల పురుగునై వుండటం తా నేమాత్రం సహించనని చెప్పేశాడు. నాకీ హోటలు వృత్తి అంటేనే యేవగింపుగా వుంటుంది. ఈ రద్ది భరింప శక్యంగానిది. ఏ రొదా లేక, యెక్కువ జనంతో పనివుండని ఏ వ్యాపారంలో నయినా సరే పని చేస్తానని ఆయనతో చెప్పాను."

జాకోబులో హుషారు లేదు. ఉసూరుమియాం లాగు న్నాడు.

"నువ్వింకా పుస్తకాలు చదువుతున్నా వన్నమాట?" అనడిగాడు ఇలియా.

"నాకున్న తోడు అవేగా. చదివేటప్పుడు నే నీ ప్రపంచాన్నే మర్చిపోతాను. అవి లేకపోతే విచారం న న్నింకా పీడించేది. అసలు ఎవరయినా పుస్తకాలు చదవ కుండా యెల్లా వుండగలరో!"

ఇలియా వానివంక తేరిచూచి "నువ్వెంత అదృష్ట వంతుడివి; నాకా గతీలేదు......మాషా యెల్లా వుంది?" అన్నాడు.

"మాషా యిప్పుడిక్కడ లేదుగా. ఆమెని అనాధ శరణాలయంలో చేర్చారు. మా నాన్న నామీద కన్ను వేసి వుండడం వల్ల నే నామెని చూచి వచ్చేందుకైనా వీలు చిక్కడం లేదు. ఫర్ఫిషాక్ సుస్తీగా వుంటున్నాడు. ఆయనకు మృతిస్నాయే సోకుతు వస్తోంది."

"అయితే మీ స్థితీ అధ్వాన్నంగానే వున్న దన్నమాట?"

"ఏం, అక్కడ నీపని బాగుండలేదా యేం?"

"ఇంత కంటె అయోమయంగా వుంది. మిత్రమా! నీ కిక్కడ పుస్తకాల తోడయినా వుంది. అక్కడ నాకు సర్వం శూన్యంగా వుంది. మేనేజరు దగ్గర పుస్తకాలున్నా చదువుకో నివ్వడు. నా జీవితం నిస్సారంగా వుందనుకో."

జాకోబు నిట్టూర్పు వదిలాడు.

ఇలియా అన్నాడు—"భగవంతుడు మన ల్నీవిధంగా శిక్షించు తున్నాడు, ఏం పాపం చేశామో!"

9

అకాత్తుగా ఇలియా అదృష్టరేఖ బయట పడింది. ఒకరోజున దుకాణం ముందు జనం తొక్కిసలాడుతున్నారు; మహా సందడిగా వుంది. అమ్మకము జోరుగా సాగుతోంది. అంతకు ముందునుంచి అవతలనున్న యజమాని గల్లాపెట్టి ముందున్న మేనేజరును లెమ్మని కూచుని అమ్మకంసొమ్ము లెక్క పెట్టుకుంటున్నాడు. ఉన్నట్టుండి అతని కళ్ళు పెక్కినయి. దుమదుమ లాడుతూ ఇలియాను పిల్చి "క్రింద పదిరూపాయల నోటుగాని పడిందేమో చూడు!" మన్నాడు.

ఇలియా వెదకిచూచి "లే" దని చెప్పాడు.

"బాగా గాలించి వెతుకు?"

"వెతికాను, కనపడ లేదండి."

యజమాని అప్పటి కంతటితో సరిపెట్టుకొని వ్రాసు కున్నాడు. జనసమ్మర్దం తగ్గిన తరువాత ఇలియా రెండు

చెవులూ పట్టుకొని గట్టిగా మెలి వేస్తూ "వెతకమంటే యింకోసారి జాగ్రతగా వెతకాలిగాని, యెదురు చెపుతావా?" అని గద్దించాడు.

ఇలియా రెండు చేతులూ యజమాని బొగ్రమీద వేసి గట్టిగాత్రోసి చెవులు వదిలించుకున్నాడు. దూరంగా పోయి నుంచొని 'వెతకాలంట! ఏమిటి వెతికేది నాబూడిద. ఆనోటు అప్పుడే మేనేజరుగారి జేబె చెక్కేను!'' అన్నాడు బిగ్గరగా.

మేనేజరు అదిరి పడ్డాడు. వెనుక పాటున వచ్చి ఇలియా వీపుమీద రెండు గుద్దులు గుద్దాడు. వాడు వెక్కి వెక్కి యేడుస్తుంటే మరో వేపుకు వెళ్ళబోయాడు. అంతలో వుగ్రుడైవున్న యజమాని "ఎక్కడికి? ఆ నోటిచ్చి మరీ పో" అని వురిమాడు.

మేనేజరు మొఖం మాడిపోయింది. "ఈ వెధవాయి బొంకాడండి" అన్నాడు ముఖం పక్కకు తిప్పుకొని.

"ఏదీ యిటురా"

"నా కేమీ తెలియదండి. ఒట్టు పెట్టుకుంటున్నాను."

"ఇంతకూ నీ జేబులో నోటు వున్నదంటావా, లేదా?"

"బజార్లో నెచ్చాలు కొందామని యింటివద్దనుంచి తెచ్చుకున్నాను. వీడబద్ధం చెప్పినంత మాత్రాన నమ్ముతారా?''

"చాల్లే, నోరుముయ్."

అంతా నిశ్శబ్దంగా వుంది. యజమాని లేచి వికటంగా నవ్వి మళ్ళీ కూచున్నాడు. గల్లాపెట్టె మీద వ్రేళ్ళాడించు తున్నాడు. ఇలియా నెత్తిమీద చేతులు పెట్టుకొని గోడనాని కూచున్నాడు. మేనేజరు వంక తిరస్కార భావంతో చూస్తున్నాడు.

మేనేజరు మైకేలు దొంగతనం పట్టుబడినందుకు అవమానితుడై క్రుంగిపోయాడు. కోపాతిరేకంచే పళ్ళు నూరుతూ "శుంఠ! ఇంకా చాలలా? చాడీలు చెపుతావా? నీకు బుద్ధి చెపుతానుండు" మని బెదరించుతూ ఇలియామీది కెళ్ళాడు.

ఇలియా లేచి నిలబడ్డాడు. సమీపంలో నేవున్న చేపలను నరికే కత్తిని తీసుకుని "ఏమిటి, మహా యెగిరెగిరి పడుతున్నావు! రా, చూస్తాను నీబడాయి!" అని మోటు చరిచాడు.

మైకేలుకు యిక నడుగు ముందుకు పడలా. ఇలియా బలిష్ట శరీరాన్ని, వాని తెగువ చూచి డంగయి ప్రాన్పడి పోయాడు.

మేనేజరు వెనుకంజ వేయడంలో ఇలియా సాహసం యినుమడించింది. యింకొంచెం ముందుకెళ్ళి "రా వే" అని దబాయించాడు. వాని శరీరం కంపించుతోంది; అయినా అజ్ఞాతశక్తి యేదో తన్ను ముందుకు నెట్టుతున్నట్టు తోచింది వానికి.

అంతలో "కత్తి నక్కడ పెట్టు"మన్న యజమాని కేక వినపడింది. ఇలియా మెడ త్రిప్పి ఆయనవేపు చూచాడు. ఆయన కళ్లు, ముఖము రక్తిమ దాల్చివున్నై. కోపంచే గడ్డము అదురుతోంది. ఇలియా ఆయన్ను చూచికూడ వెనుకాడలా. మేనేజరుమీదికి తొడ చరుస్తూనే వున్నాడు.

"నామాట విని కత్తి నవతల పారవెయ్యి ఇలియా!" అని యజమాని మరొకసారి హెచ్చరించాడు.

ఇలియా కిక్కురుమనకుండ తక్షణం కత్తిని క్రింద పడవేశాడు. చతికిలబడి కూచుని యేడుపు సాగించాడు. వాడికి అంతా అయోమయంగా కనపడింది. ఆత్మరక్షణ చేసుకోటానికూడ స్వేచ్ఛలేదని తలచుకున్నంతనె దుఃఖము ముమ్మరమయి కించపడుతున్నాడు.

యజమాని మైకేలు నుద్దేశించి "నీవు రావలసింది లెక్కచూచుకొని పట్టుకొనిపో. నువ్విక ఒక్క క్షణంకూడ నా దుకాణంలో వుండతగవు" అని చెప్పాడు.

"మీరు నిక్కచ్చిగా వెళ్ళిపొమ్మంటే యిప్పుడే వెళ్లిపోతాను; కాని, మీరీ దుండగీడుమీద కన్ను వేసి వుండండని చెప్పుతున్నాను. వీడి తండ్రి పక్కా బద్మాష్! వీడూ అంతే. ఊపలువ కత్తి తీసుకొని తిరగబడటం మీ కళ్ళతోనే చూచారుకదూ" అని నెత్తిమీద టోపీ పెట్టుకొని వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోయాడు.

కొంతసేపటివరకూ దుకాణం నిరవంగా వుంది. ఇలియా దుఃఖాక్రాంతుడై వున్నాడు. మైకేలు నిర్గమించిన పిమ్మట బుగ్గలమీదికి కారిన కన్నీటి చుక్కలను తుడుచుకొని యిటూటూ చూచి లేచి బయటకు దారిపట్టాడు.

అంతవరకూ వానివంకే దీక్షగా చూస్తున్న యజమాని వెళ్లిపోతున్న ఇలియాను దగ్గరకు పిలిచాడు.

"నిజంగా నీవాతణ్ని కత్తితో పొడిచేవాడివేనా?" అని ప్రశ్నించాడు.

"నామీది కొస్తే పొడవకేంజేస్తాను?" అన్నాడు ఇలియా తొణుకూ బెణుకూ లేకుండా.

"నీతండ్రికి శిక్ష యెందుకు పడింది?"

"కొంపలకి చిచ్చు పెట్టాడని"

"పెద్ద నేరమే!"

అప్పుడక్కడికి కార్ప వచ్చాడు. ద్వారబంధము ప్రక్కగా నున్న చిన్న బల్లమీద కూచొని బజార్లోకి చూడసాగాడు.

"కార్ప! మైకేలును పనిలోనుంచి తొలగించి వేశాను" అని యజమాని చెప్పాడు.

కార్ప మొహం త్రిప్పి విస్మయంగా "యెందువల్లనండీ?" అనడిగాడు.

"అతను దొంగతనానికి అలవాటుపడ్డాడు. అందువల్ల సాగనంపాను.

"ఆఁ అంతపని చేస్తున్నాడా?" అని కళ్ళు పెద్దవి చేసి కార్ప్ ఆశ్చర్య మభినయించాడు.

యజమాని గడ్డం సవరించుకొని వికటాట్టహాసం చేస్తూ "నువ్వు శుంఠలాగున్నావే!" అన్నాడు. మరుక్షణం లో గాంభీర్యత వహించి దీర్ఘంగా నిశ్వసించాడు. "హోదాకు తగినట్లు ప్రవర్తించడమే తెలియదు. ప్రతివాడూ గొప్పవాడు కావాలనుకుంటాడు. ప్రక్కవాడొక చొక్కా తొడుక్కుంటే తాను రెండు తగిలించుకోవాలనుకుంటాడు. కాని ఎక్కడనుంచి వస్తయి? అందరి కోరికలు యిల్లాగే వుంటయ్." ఇలియా నుద్దేశించి "ఏఁరా! మైకేలు జేబులో వేసుకోవడం యింతకు ముందెప్పుడయినా చూచావా?" అనడిగాడు.

ఇవాళ క్రొత్తేముంది. వాని కది నిత్యకృత్యమేనండి." అని ఇలియా చెప్పాడు.

"మరి నాకెప్పుడు చెప్పనేలేదేఁ?"

"ప్రయోజనం లేదనే."

"అయితే యివాళ యెందుకు చెప్పావు?"

"తప్పు నా నెత్తిన వడుతూంటే యేంచెయ్యను?"

"మరి నువ్వెప్పుడూ దొంగిలించలా?"

"నాకా బుద్ధి కలలోకూడా లేదు"

"కావచ్చు, కాని, మరి కార్ప్?"

"ఈయన నీడకూడ మీా యింటివాసాలు లెక్కపెడు తుంది"

కార్ప్ ఇలియావంక కొంటెకొంటె చూచి ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

యజమాని సంభ్రమాశ్చర్యాలతో మౌనం దాల్చాడు. కనుబొమలు యెగిరి పడుతున్నై. "హుఁ" అని తల పంకించాడు.

ఏదో రాద్ధాంతం జరిగి తీరుతుం దనుకున్నాడు ఇలియా దుకాణమం దంతటా యీాగలు ముసురుకుని బుఁయ్ మని ధ్వని చేస్తున్నాయి. తొట్లలోని మత్స్యాలు యెగిరి పడు తున్నయ్.

కార్ప్ నోట మాటలేక నిశ్చేష్టుడై రెప్ప వాల్చ కుండ రోడ్డుమీాదికి చూస్తున్నాడు. "కార్ప్!" అన్న యజ మాని పిలుపు అదాటుగా వినపడింది. ఏం మునుగుతుందో నని మెదురు చూస్తున్న వానివలె కార్ప్ మెల్లగా లేచి యజమాని ముందుకెళ్ళి నుంచున్నాడు. "ఏమి సెలవు?" అని వినయ విధేయత లుట్టి పడేటట్టు అడిగాడు.

"విన్నావా?"

"చిత్తం"

"మరి సంజాయిషీ యేమి చెపుతావు?"

"చెప్పడాని కేమున్నదండీ?"

"ఏం?"

"వీడు వచ్చి అబద్ధాలకోరు. అపనింద వచ్చిందని ఉద్రకుంత మాటల్ని లెక్కచేస్తూ కూచుంటే ప్రపంచంలో బతకటమే కష్టం."

"నీ బుకాయింపులు నా ముందు కట్టిపెట్టవోయ్. అసలు వీడు చెప్పినది నిజమో అబద్ధమో సూటిగా జవాబిమ్మని అడుగుతున్నాను, తెలిసిందా?"

"నిజా నిజములంటే యేమిటండీ? మన మనసులోని వూహాలేగా. మీరీ వెధవ మాటల నెల్లా భావించదలిస్తే అట్లే చేయండి. నిజమనుకున్నా, అబద్ధమని యెంచినా అది మీ యిచ్ఛాధీనంకదా!"

"అయితే అంతా నా ఇష్టంలో వున్నదంటావు; ఇలియా చెప్పింది నాతప్పేనంటావా"

"ముమ్మాటికీని. వీడు ఒట్టి మసురుగాడిద!"

"అల్లాగా? అవున్లే. ఆక్కుపక్షి గాకపోతే నీకుమల్లె మీదే నీదొంగతనాన్ని యెల్లా బయట పెట్టగలుగుతాడు."

పై మాటలని యజమాని నవ్వాడు. ఇలియా ద్వారం వద్ద నిలబడి యిద్దరి సంభాషణ వింటున్నాడు. నిజం పల్కటముకూడ తంటాయే కాబోలు ననుకున్నాడు. యిలాంటి సమాజంలో తాను యెల్లా మసలు కోవాలోనని చింతించాడు. యజమాని నవ్వుతో వాని హృదయారాటం

కొంతవరకు చల్లారింది. ఒకసారి కార్ప్ వంక జయించిన వానిలాగా చూచి, యజమాని వేపుకు కృతజ్ఞతాభరితమగు చూడ్కిని విసిరాడు. కార్ప్ మళ్ళీ మాట్లాడనేలేదు.

సాయంత్రం దుకాణం మూసివేసి వెళ్ళేటప్పుడు కార్ప్ ఇలియాతో "వెర్రిమొగమా! యజమాని అనుగ్రహం సంపాదించడానికి యిదేనా వుపాయము? మైకేలు, నేను వీలు చిక్కినప్పుడల్లా కక్కుర్తి పడుతున్నామని ఆయనకు తెలియదూ? ఆయన మాత్రం యెల్లా సంపాదించాడనుకున్నావ్? మైకేలు బండారం బయటపెట్టి మంచి పనే చేశావు; కాని, నామీద కూడ చెప్పావెందుకు? నువ్వీరీతిని యెక్కులు చెప్పి యేమి బావుకుందామని? ఇప్పుడు నాకొచ్చిన నష్టమేమీ లేదులే. నీ దొబ్బుడాయి తొందరలోనే వదుల్తుంది. కించిత్తైనా గౌరవం చూపకుండా నా యెదుటే నన్ను దొంగవని చెపుతావా?" అన్నాడు.

ఇలియా తల ఒంచుకొని పెదవి విప్పకుండ విన్నాడు. అయినా వాడికి కార్ప్ వుద్దేశమేమిటో బోధపడలా. గుట్టు బయటపెట్టినందుకు కార్ప్ తనపై కోపించి అవకాశం చూచుకొని చావమోదుతాడని తలిచాడు! కాని, పై మాటల ధోరణి మరోమాదిరిగా వుంది; అందుకు ఇలియా ఆశ్చర్య పడ్డాడు. ఇక తనకు వచ్చే ముప్పేముంది లెమ్మనుకుంటూ సాగిపోయాడు.

ఇంటికి వెళ్ళగానే యజమాని ఇలియాను మేడపైకి పిలిచాడు.

ఇలియా వూపిరి బిగబట్టి పైకెళ్ళాడు. హాలుమధ్య మేజాబల్ల, కుర్చీలు వున్నై. ఇంటిల్లిపాది బల్లచుట్టూ పరి వేష్టించి వున్నారు. ఇలియాను చూచి ఆడపిల్లలు ముగ్గురూ మూతులు ముడుచుకున్నారు.

"అంత పనీ చేసింది వీడే!"నని యజమాని భార్యతో చెప్పాడు.

ఆవిడ అంతకు ముందెన్నడు చూడనట్లు ఇలియాను వింతగా చూడసాగింది. యజమాని మందహాసంతో బల్ల మీద వ్రేళ్ళాడించుతూ "నువ్వు నావద్ద పనిచేయటానికి పనికిరావు ఇలియా! మూటా-ముల్లె తీసికొని పొమ్మన టానికే పిలిచాను" అన్నాడు.

ఇలియా నిర్ఘాంతపోయి, మారాృట లేకుండానే యజమాని కళ్ళలోకి చూచాడు. ఏ మడగటానికీ సాహసం లేకపోయింది! నిమ్మళంగా లేచి దారిపట్టాడు.

యజమాని లేచి వెళ్ళి ఇలియా చేయిపుచ్చుకొని వెనక్కి తీసుకొచ్చి యిల్లాచెప్పాడు— "నీకు నేనొకసలహా చెప్పదలిచాను. నువ్వునాకేమీ యెగ్గుచేయలేదని నేనెరుగుదును. చదువుకున్న వాడివి; ఒళ్ళు దాచుకోకుండా పని చేస్తావు. విశ్వాస పాత్రుడివే; అయినా నీవల్ల నాకు ప్రయోజనం లేదు."

ఒకవంక ఇలియా మెచ్చుకో బడుతున్నాడు. తోడ్తో డనే తరిమివేయ బడుతున్నాడు కూడాను. ఈ ద్వంద్వార్థ

మేమిటో వాని కవగతం కాలేదు. "అయితే నేను కత్తితో యెదురొక్కన్నందువల్ల నేనా నేను తమకు పనికిరానిది"? అని టక్కున అడిగేశాడు.

"ఉద్దండ పిండం! అన్నది యజమానురాలు.

యజమాని ఇలియా వెన్ను చరచి "నువ్వు చాలా దుడుకు మనిషివి. నీ ఆగడం సహింపరానిది అది సామాన్య విషయం కాదు. నౌకరెప్పుడూ అణకువకలిగి ఆజ్ఞాను వర్తియై వుండాలి. యజమాని కనుసన్నలలో మెలగుతూండాలి. తన స్వంత వుద్దేశమనేది వుండ కూడదు. మరి నీవో! స్వాభిమానివి. యథేచ్ఛగా ప్రవ ర్తించా లనుకుంటావు. ఎవరిని గాని బాహాటంగా దొంగ వని అనవచ్చా? అందువల్ల యెన్ని లకలుకలు వస్తాయి! ఎవరిని గురించయినా చెప్పాల్సివుంటే నాతో చాటుగా చెప్పాలి. యజమానిని కాబట్టి కావలసిన యేర్పాట్లు చేసుకుంటాను. నువ్వు వీడు దొంగ, వాడు మోసగాడని కుండ పగులగొట్టినట్లు సులువుగా మొహం మీదనే అనేస్తు న్నావు. యిది ప్రపంచం! లెక్కప్రకారం నడుచుకోవాలి. ఉన్న ముగ్గురిలో యిద్దరు దొంగలు కదాయని వెళ్ళగొట్టితే నాపని సాగ్గా కావద్దూ? పదిమందిలో ముగ్గురు మోసగా ళ్ళయితే వాళ్ళను సాగనంపి యేడుగురితో వ్యాపారం నడుపుకోవచ్చు. పదిమంది అన్నదే—అది భ్రాంతియే కావచ్చు—అనుసరణీయం. అది రాణిస్తుంది కూడాను. నిజానిజాలకు గీటురాయి కూడఅదే. భవిష్యత్తులో నువ్వి

విషయాన్ని లెస్సగా ఆలోచించుకొని నోరు విప్పమనేదే నా సలహా. నోటికి వచ్చినట్లు, వున్నదున్నట్లు వాగవద్దు ......మరొకసంగతి: నువ్వు చీటికీ మాటికీ కత్తి-కఠారులు తీసుకొని తిరుగబడుతావు" అని చెమటను చేరుమాలతో తుడుచుకుంటూ నవ్వాడు.

కత్తిపేరు వినగానే అక్కడున్న ఆడంగులు భీతి చెందారు.

"కత్తి చేబూనినవాడు తన్నే గాయపర్చుకుంటాడని బైబిలులో రాసివుంది; కాబట్టి జాగ్రతగా మసలుకో. నిన్ను విడిచి పెట్టాల్సి వచ్చినందుకు నేనూ విచారపడుతున్నాను; అయినా తప్పదు. నా మనసులో వున్నదంతా విప్పి చెప్పాను. నువ్వు మరోలా అనుకోవద్దు. నువ్వు నాకు చేసిన నష్టమూ లేదు; నేను నీకు చేస్తున్న హానీలేదు. (జేబులో నుంచి నోట్లుతీసి) ఇదిగో! యాభై రూపాయల బహుమానం! (ఇలియా చేతిలో పెట్టి) నీవిక వెళ్ళవచ్చు" నని కుర్చీవద్దకుపోయి కూచున్నాడుయజమాని.

ఇలియా నోరు తెరచి మాట్లాడలేదు; కాని, కృతజ్ఞతా పూర్వకంగా యజమానికి వంగి నమస్కరించి మెట్లు దిగిపోయాడు.

"నౌకరీ పూడిందని వాడి కళ్ళనుంచి రెండు చుక్కలయినా కారలేదు. వాడికా విచారమే లేనట్టుంది." అంది యజమానిభార్య.

ఇలియా రోడ్డు మీద నడుస్తున్నాడు. "యజమానికి కార్పు అవసర మవడంవల్లనే నా కుద్యోగం చెప్పాడు. అదీ నిజమే; మరి అందరికీ స్వస్తి చెపితే దుకాణం సాగించే దెవరు?" తనలో అనుకున్నాడు. నిజాయితీకి యీ సమాజంలో స్థానం లేక పోబట్టే తన కాగతి పట్టినదని తలకు కొన్నప్పుడు ఇలియా కెనలేని దుగ్ధ కలిగింది. యజమాని నిరాడంబరత, సరళహృదయము, సాధు స్వభావాలు తలపుకొచ్చి అభినందించాడు.

10

ఇలియా ఔరెన్బు వద్దకు చేరాడు. ఇంటిపట్టునే వుంటున్నాడు. అక్కడినా రిప్పు డతనిని కుర్రవానిగా యెంచక కాస్త గౌరవించుతున్నారు. ఇరుగు పొరుగు జవరాండ్ర దృష్టిని కూడ ఆకర్షించుతున్నాడు. మాటలుకూడ పెద్దవారివలె మాట్లాడుతున్నాడు.

ఫర్ఫిషాక్ కలిసినపు డొకసారి యిల్లా చెప్పాడు— "నీ విషయమంతా విన్నాను. ప్రపంచం స్వార్థమయం! ఒకరి మేలుతో మరొకరి కగత్యంలేదు. పద భ్రష్టుడై చెడిపోయ్నే వాడిని చూచి నవ్వేవారే కాని, బాగుచేద్దామనే భావన ఒకడికీ వుండదు. న్యాయం యెవరికాక్కాలి! నువ్వు త్రాగుతూ వున్నన్నాళ్ళూ చుట్టూ చేరి ఆడించుతారు."

ఇలియూ యెవరితో మాట్లాడినా అన్నీ కాచి వడ పోసినవానివలె నీతులు చెప్పేవాడు.

ఇలియా పునరాగమనంతో మాషా, జాకోబులు అత్యంతానందం పొందారు. "మళ్ళీ మనం చదువు సాగించు దాము. నావద్ద చాలా మంచి పుస్తకాలున్నై." అన్నాడు జాకోబు.

ఇలియా నౌకరీ వూడిందని పెట్రుహా విన్నాడు. వానిని దగ్గరకు పిల్చి "నువ్వు ఒట్టి వెర్రిబాగుల వాడి వోయ్. వాళ్ళ బటారం బాగానే బయట పెట్టావు; కాని, నీ జీవనోపాధిని గంగలో కలుపుకున్నావు. సమర్థులైనవారిని వ్యాపారంలోనుంచి తొలగించితే ఆయన బండి నడవ వద్దూ? నిన్ను వుంచుకున్నా తిరంగా వుండలేవు. లోక్యం తెలిసి నడుచుకొనకపోతే ప్రక్కవారితో యెల్లా కలిసి మెలసి వుండగలవు? చేతులారా బోలి బోర్లించుకున్నావు." అని మందలించాడు.

మరునాడు టెరెన్సు అన్నకొడుకును ఒంటరిగా చూచి చెప్పాడు- "ఇలియా! పెట్రుహాతో అధికప్రసంగం చెయ్యబోకు. అతడికి నీయందు సదభిప్రాయం లేదు. అదే పనిగా నిన్ను దూషించుతున్నాడు. నువ్వు గబ్బిలాయివనీ న్యాయంతో ముడెట్టుకొని ముక్కుసూటిగాపోయి నోట్లో మన్ను కొట్టుకున్నావనీ యెగతాళి చేస్తున్నాడు.

ముగ్గురు మిత్రులు

నువ్వాయన మాటలను లక్ష్యపెట్టొద్దనుమ హెచ్చరించాడు

ఇలియా యెవరేమన్నా హతాశుడు కాలా. వానికి తన ప్రవర్తనపట్ల అభిమాన మెప్పటియట్లె అచంచలంగా వుంది. తానానాడు ప్రదర్శించిన సాహసోద్రేకాలు, సత్యప్రకటన సబబైనవేనని వాని దృఢవిశ్వాసం.

రెండు మాసాల పర్యంతం యెంత ప్రయత్నించినా ఇలియాకు మళ్ళీ నౌకరీ కుదరనేలేదు. ఒకరోజున టెరెన్సి నౌకరీని గురించి ఇలియాను కదిలించేడు. "నేను చాలా ప్రయత్నించాను. కాని, నిన్ను నౌకరీలో వుంచుకోటానికెవరూ యిష్టపడటంలేదు. ఇక ముందు కర్తవ్యమేమి"టని ఖిన్న వదనంతో ఇలియా నడిగాడు.

"నా కొకరివద్ద వూడిగము పొసగదు బాబాయ్. ఒకరి కణగి మణగి వుండే స్వభావంకాదు నాది. ప్రపంచం ముఖస్తుతితో నిండివుంది. అది నాకు చేతగాదు." అన్నాడు ఇలియా.

"మరి యీవిధంగా పనీ-పాటూ లేకుండా యెన్నాళ్ళని కూచుంటావు? అయిదు వేళ్ళూ లోపలి కెళ్లే మార్గమేదయినా చూచుకోకపోతే యెల్లా?"

"ఊరకే కూచోవాలని నాకూ లేదు. మారు బేరం సాగించి చూడాలనుంది.

ముగ్గురు మిత్రులు

"ఏమో నబ్బాయి! జీవితమంతా దాస్యం చేసిచేసి నా మెదడు మొద్దుబారింది. నీ వుద్దేశం నాబుర్ర కెక్కటం లేదు. ఏది యెల్లా జరుగుతుందో నాకేమీ తోచకుండా వుంది."

"నిజమే!"

గూనివాడు తనలో యేదో గొణుక్కున్నాడు. విచారోద్వేగాలకు నిరాశ తోడై ముప్పిరిగొనగా ఓరెన్సు వేళ్లపైన యేమిటో లెక్క పెడుతున్నాడు.

"అది స్వేచ్ఛా వృత్తి. లాభించేదీ లేనిదీ చేసిచూస్తే గాని తెలియదు. కృషి చేస్తే కృతకృత్యుణ్ని కావచ్చుననే నా యాశ" అన్నాడు ఇలియా.

"దేవుడు నీకు మేలు చేయుగాక! నువ్వు పెద్దవాడవయితే నేను నిశ్చింతుడనై పాప పరిహారార్థం ప్రయత్నం చేసుకుంటాను. అందుకు నీవే అడ్డంకిగా వున్నావు. నేనీ యమయాతన పడుతున్నది యెల్లాగైనా నిన్నొక యింటి వాడిని చెయ్యాలనే. నీగురించిన తాపత్రయమే లేకపోతే యే ఋష్యాశ్రమానికో పోయి పాప విముక్తికై భగవంతుణ్ని ధ్యానించుకుంటాను."

ఓరెన్సు కాపైన మాటరాలా. కళ్లు నీరు కమ్మాయి. పినతండ్రి యే పాపాన్నిగురించి అంతగా కటకట పడుతున్నాడో ఇలియా క్షణంలో గ్రహించాడు. జర్మియా మృత్యు ఘటనా దృశ్యం స్మృతి పథంలోకి రాగానే వాని

ఉండే గ్రుబుళ్ళమంది. ఓరెన్సు దీనస్థితికి ఖేదపడ్డాడు; కాని, సానుభూతి తెలిపే విధం తోచలా. "మీ రింతగా కాతరులు కావద్దు. వ్యాపారంలో కుదురు ఏర్పడగానే మీకు నాధారం తగ్గిపోతుంది. తరువాత మీరు నిర్విచారంగా ఆశ్రమవాసానికి వెళ్ళిపోవచ్చును." అన్నమాటలు వాని నోటినుంచి వెలువడినై.

కొంత సేపటివరకు దీర్ఘాలోచనా తత్పరుడైవుండి "మీరు సంక్షోభించకండి. భగవంతుడు మిమ్మల్ని తప్పక మన్నించుతాడు" అన్నాడు.

ఓరెన్సు శిరమెత్తి ఆశాదృష్టితో ఇలియాం వంక చూచి "నన్ను నిజంగా క్షమించుతారంటావా?" అనడిగాడు.

"దేవుడు దీన దయాళువు. మిమ్మల్ని తప్పకుండ క్షమించుతాడు. ఘోరాతి ఘోర పాపాత్ములను కూడ క్షమించినట్లు నేను పుస్తకాల్లో చదివాను".

♦ ♦ ♦ ♦

ఇలియాం మారుబేర మారంభించాడు. పొద్దుపొడిచిన లగాయతు సాయంత్రమయ్యేవరకు వీధుల్లో, సందు-గొందుల్లో 'సబ్బులు, సూదులు, అద్దాలు, దువ్వెనలు, సెంట్లు, తలనూనె' అని కేకలు వేస్తూ తిరిగేవాడు. ఎదురుగా వచ్చే పెద్దమనుషుల చెంతకుపోయి వస్తువులను ఓపికతో చూపెట్టి కొనుడని ప్రార్థించేవాడు.

ఇలియా జీవితమిప్పుడు శరత్కాల నదీప్రవాహం వలె శాంతమై, గంభీరగతిని గడచిపోతోంది. పగలంతా తిరిగి తిరిగి అమ్మకుంటూ, ఆకలయినప్పుడు యే హోటలులో పోయి రొట్టెముక్కో, పరోటాయో తిని, ఒక కప్పు తేనీరు తాగి క్షుద్బాధను తీర్చుకునేవాడు. ఇదే మోస్తరుగా అతను రోజులు వెళ్ళబుచ్చుతూ, భావి సుఖజీవితాన్నూహించుకుంటూ తృప్తిచెందేవాడు. అంగళ్ళవీధిలో తాను స్వంతంగా దుకాణం పెట్టి, మడత విప్పిన శుభ్ర వస్త్రాలను దాల్చి గల్లాపెట్టెముందు కూర్చొని వుంటే క్రయదారులు వచ్చి మర్యాదగా బేరమాడి ఖరీదు చేసే రోజు నూహించుకొనేవాడు. నీటుగా వుండాలని ఇలియాకు మహా అభిలాషగా వుండేది.

తానుకూడ గౌరవనీయ వ్యక్తి నవుతాననీ, తన్నెవరూ అవజ్ఞ చేసి అవమానించరనీ, మర్యాదగా జీవితంగడిపే రోజులు వస్తాయనీ తలచుకొన్నప్పుడు ఇలియా మొహం చాటంత అయ్యేది.

కాని, అమ్మకము తమాము లేనినాడు ఇలియా మ్లానముఖంతో యే హోటలులోనో కూచుని తన దరిద్ర జీవితాన్ని గురించి వితర్కించుకొనేవాడు. నిరాశ భయంకర రూపంతో వాని నావరించేది. పోలీసుల అత్యాచారాలు, కొనుగోలుదారుల పేచీలు, తోడి బేరగాండ్ర పోటీలు మొదలయినవన్నీ వాని బుర్రలో గిర గిర తిరిగేవి. మానవులందరొకే విధమగు కాంక్షలతో, ఒకే లక్ష్యంతో

ముందుకు పరుగు తీస్తున్నట్లు తోచేది. ఆ పరుగులాటలో యెవని గొడవ వానిదే. అవకాశం చిక్కితే ప్రక్కవానిని పడద్రొబ్బి ముందుకు దాటిపోవడానికెవడూ సందేహించడు; తటపటాయించడు. జీవితమంతా పరస్పర సంఘర్షణామయము. ప్రతిహింసాభరితము. అందుచేతనే పొరుగువాని కెగ్గు చేయటము. దురాగతం చేసినవానికి కించిత్తయినా పశ్చాత్తాపము కలుగకుండడము మరీ శోచనీయము

ఈ భావపరంపరతో ఇలియా వ్రూహః నిర్మిత సౌధ మొక్కసారిగా నేలకూలేది. వాని యాశలన్నీ అడుగంటేవి. తానీవిధంగానే కాళ్లీడ్చుకుంటూ పెట్టె మోస్తుండగానే తన జీవితం కాస్తా సమాప్తమయిపోతుందనీ, నాలుగు డబ్బులు కూడబెట్టడమసలే వుత్తదనీ నిరాశ చెందేవాడు; అయితే మళ్ళీ అమ్మకం జోరుగా జరిగినప్పుడు వాడి, యెండిపోయిన ఆశాలత తిరిగి చిగిర్చేది.

ఇలియా కొకనాడాకస్మికంగా బజారులో పాష్కా కనిపించాడు.

వాడి గుడ్డలు మసిపాతల్లాగా వున్నై. దేహం శుష్కించి పోయింది. పాష్కా ఇలియాను చూచి నవ్వాడే కాని, ముందుకు రానేలేదు. చూచీ చూడనట్లు వున్నచోటే తచ్చాడుతున్నాడు.

ఇలియా మిత్రుని కలసికొని క్షేమసమాచారం కనుక్కొనేందుకు తహతహలాడాడు. పాష్కా విముఖత్వాన్ని

గ్రహించికూడ తన వ్యగ్రతను నిగ్రహించుకో లేకపో యాడు. చరచర పోయి కరస్పర్శ చేసి "ఏమోయి మిత్రమా! ఖులాసాగా వున్నావా? ఎక్కడ వుంటున్నావు? ఏంచేస్తున్నావు?" అని పలకరించాడు.

"భేషుగ్గా వున్నాను. దొరికిననాడు సుష్టుగా మెక్క డము, లేనిపూట కడుపులో కాళ్ళెట్టుకుని హాయిగా పడు కోవడమూను. ఇంతకంటే క్షేమ సమాచారం యింకేం కావాలిరా?'' అన్నాడు పాష్కా వెటకారంగా.

"నువ్వు మమ్మల్ని చూడటానికి రావడం బొత్తుగా మానివేశావేం?"

"నీమకాము నాకేం తెలుసు?"

"ఎప్పటింట్లోనేగా''

"నువ్వెక్కడో చేపల దుకాణంలో నౌకరీ చేస్తు న్నావని విన్నానే?"

ఇలియా తన కథను సవిస్తరంగా చెప్పాడు.

"బలేపని చేశావు! సరిగా నాకూ అల్లాగే జరిగింది. మొదట నేనొక అచ్చాఫీసులో జేరాను. అక్కడ సవ్యంగా జరగలా. తరువాత ఒక పెయింటరువద్ద కుదిరాను. అక్కడ యేదో చిన్న పొరపాటుకు స్పృహ తప్పి పడేదాకా కొట్టారు. ఈమధ్యనే పంపులు దింపేవాని చేతిక్రింద నౌకరీ సంపాదించాను. నెలకి అయిదు రూపాయ లిస్తున్నాడు.

ఇప్పుడు ఫోంచేసి. ఆపనికే వెళుతున్నాను. ఇంతలో నీ దర్శనమయింది."

"తొందరగా వెళ్ళాలా?"

"పగలనక, రాత్రనక, బద్ధకించకుండా చాకిరీ చేసినా మెప్పులేదు. కొంచె మాలస్యమయితే చీవాట్లూ, చెప్పు దెబ్బలూను ఈ గొడ నీకెందుకులే. నేనొకసారి మీదగ్గరకు వస్తాలే."

"తప్పకుండా రావాలిసుమా."

"మీరింకా పుస్తకాలు తిరగేస్తున్నారా?"

"ఆ, మరి నువ్వో?"

"నేనా! నాకంత యెసులుబా టేదీ?"

"అయితే పద్యాలు రాయటంలేదా?"

"రాయకేం. కవనం మానానూ?" అని పాష్కా నవ్వాడు.

"వచ్చేటప్పుడు నీపద్యాల పుస్తకం తీసుకొనిరా."

"పుస్తకం సంగతి యెల్లావున్నా బుడ్డి తెస్తాలేరా"

"ఓరి బడ్డు! తాగుడికి అలవాటు పడ్డావూ?" అన్నాడు ఇలియా విస్మయంగా.

"ఎబ్బే! కొద్ది కొద్దిగా గుమ్మరించుతున్నా నంతే. సరే పోయివస్తా" నని పాష్కా వెళ్ళిపోయాడు.

ఇలియా దారిపొడుగునా పాష్కానుగురించే ఆలోచించుతున్నాడు. తన స్వంత వ్యాపార–స్వేచ్ఛా వృత్తులను

గూర్చి విన్నప్పుడయినా పాషాకు ఈర్ష్య పడకుండడం ఇలియా నాశ్చర్యపరచింది. తన్ను చూచి వా డసూయ పడకపోవటము వానికసాధారణ విషయంగా కనపడింది. ప్రజలందరిలాగా పాషాకు పరస్పర సంఘర్షణతో కూడు కున్న త్రోపులాటలో పాల్గొనటమే లేదాయని సందేహం కలిగింది.

ఇలియా క్రమము తప్పకుండా చర్చికి వెళుతున్నాడు ఒక మూల నిలబడి అక్కడ చేరిన జనాన్ని నిశ్చల దృష్టితో పరికించేవాడు. ప్రార్థనలో అత్యంత శ్రద్ధా భక్తులతో పాల్గొనేవాడు. చర్చికి వచ్చేవారందరూ స్థిర దృష్టితో యేదో ఒకే అవ్యక్త ఆకారాన్ని ధ్యానించుతూన్నట్టు భావించేవాడు. ప్రార్థనా సమయంలో గాన ఝరి తరంగాల వలె లేచి సాగిపోతూండేది. చర్చిలో మూల మూలల కూడ ప్రార్థనారవము ప్రతిధ్వనించేది. ఒకొక్కప్పుడు తానా గానవాహినిలోపడి కొట్టుకొనిపోతున్నట్టు, తన అస్తిత్వాన్నే కోల్పోతున్నట్లూ తోచేది ఇలియాకి. చర్చిలో సంప్రాప్తించిన శాంతి వానికి జీవితరంగంలో మరెక్కడా పొడకట్టేదికాదు. ఆదిలో అదేదో భావ్యాభావనగా తలిచేవాడు; దానితో జీవిత సంఘర్షణ కెట్టి సంబంధము లేదనుకున్నాడు; కాని, ఆభావ మనవరతము తన అంతరంగంలోనే అణగివున్నట్టు ఇలియా అనతికాలంలోనే గ్రహించగలిగాడు. జీవిత పోరాటంలోమాత్రం దాని చిహ్నమయినా కన్పించేదికాదు. చర్చిలో అడుగు పెట్ట

గానే వెనకటిభావం తుపానువలె చెలరేగేది. అప్పుడు వానికి బాహ్య ప్రపంచంమీద జుగుప్స కలిగేది. భావి జీవితాన్ని గురించిన కల్పనా జగత్తు నిస్సారంగా తోచి అదృశ్యమయ్యేది. అంటాయిప్, జర్మియా మొదలగు పుణ్య పురుషుల పవిత్రసూక్తులు జ్ఞప్తికొచ్చేవి. 'భగవంతుడు సర్వ వ్యాపితుడు. సమస్తాన్ని ఆయన గమనించుతూనే వుంటాడు. ఆయనకు అగోచరమన్నది లేదనుకొని సంతృప్తి పొందేవాడు.

చర్చిలోనుంచి బయటకి వచ్చి రావటంతోనే అదో విచిత్ర మనస్థితి యేర్పడేది. ఊహాలు పుంఖాను పుంఖాలుగా రేకెత్తేవి. అంతకు ముందు కలిగిన విరక్తి - వైరాగ్య లెటుపోయేవో మళ్ళీ మామూలు వ్యవహారాల్లో నిమగ్నుడవుతూండేవాడు.

ఇలియా తన జీవిత వివరాలన్నీ జాకోబుతో చెప్పేవాడు. కాని తన అంతరంగంలో నిత్యము జరుగుతున్న యీ ద్వంద్వ యుద్ధాన్ని గూర్చియెన్నడూ బయట పెట్టేవాడుకాదు. అసలావిషయంలో తానైనా సావధానంగా ఆలోచించి యదార్థాన్ని తెలుసుకొనటానికి ప్రయత్నించనేలేదు.

సాయం సమయాన్ని ఇలియా కులాసాగా గడిపేవాడు. అమ్మకం చాలించి తిన్నగా మాషా గదికి వెళ్ళడం అలవాటయింది. వెళ్ళగానే ఒక కప్పు తేనీటి నపేక్షించే

వాడు. ఆమెకూడ టీని సిద్ధంచేసి వుంచేది. ఇలియా ప్రతి రోజూ బజారునుంచి వస్తూ యేదో ఒక చిరుతిండి తెచ్చే వాడు. మిత్రులు ముగ్గురూ కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ అల్పాహారం ఆరగించేవారు.

ఇప్పుడు మాషాకూడ ఆర్జించుతోంది. మతిస్సా ఆమెకి కాగితపు పువ్వులు కత్తిరించి కట్టడం నేర్పింది. మాషా రంగు కాయితాలతో గులాబీ, చామంతి వగైరా పూలు తయారుచేసి అమ్ముతోంది. రోజు కేడెనిమిది అణాలకు లోటు లేకుండా తెచ్చుకుంటోంది. ఈ పని చెయ్యడంలో ఆ మించుబోడి మనసుకూడ లగ్నమయ్యేది.

సంధ్యా సమావేశా లెప్పుడూ మాషా గదియందే జరుగుతూండేవి. ఇలియా జాకోబులు బల్లమీద తనాయించి కూర్చొనేవారు. పొద్దు పోయేదాకా టీకప్పులు చేత్తో పట్టుకొని పిచ్చా-పాటీ మాట్లాడుకొంటూ కాలక్షేపం చేసే వారు. ఇలియా తన అమ్మకాన్ని గురించీ, తాను చూచిన విశేషాలూ వర్ణించి చెప్పేవాడు. జాకోబు గ్రంథ విమర్శ చేస్తూండేవాడు. హోటలు సంగతులుకూడ చెప్పేవాడు. నిత్యము వాడు తన తండ్రి నేదో ఒక కారణంతో నిందించ కుండా వుండేవాడు కాదు. అప్పుడప్పుడు మాషా ఇలియాల కర్థంగాని జటిల సమస్యల్ని చర్చకు తెచ్చేవాడు. మాషా పగలంతా గృహ కృత్యాలోను, పువ్వులు కట్టి

ముగ్గురు మిత్రులు

అమ్మ కోనటంలోను నిమగ్న అయి వుండుటచే గుమ్మం దాటి యెక్కడికీ వెళ్ళేది కాదు. మరి తానేం చెపుతుందా గోల! వారిద్దరి మాటలు వింటూ మధ్య మధ్య నవ్వేది. తనవంతు పనిని—తేనీరు కాచి యివ్వడం మాత్రం అతి శ్రద్ధగా నిర్వహించేది.

ఆచిన్న గది - ఎన్ని లోపాలున్నా - ఆనందానికి నిలయం. వారి కందులో చేకూరిన శాంతి-సుఖాలు మరెక్కడా దృగ్గోచరమయ్యేవి కావు. అక్కడ కూర్చొని పౌర పౌచ్చాలెరుగని యీ మిత్ర త్రయం యెన్నెన్నో పవిత్ర సుఖచిత్రాలు చిత్రించుతూ వుండేవారు.

ఘర్ఫిషా ఎప్పుడయినా వస్తే వారికి యెడంగా కూచునేవాడు. మాషా రొట్టె, టీ వాడిముందు పెట్టేది. కూతురు చూపే దయను మూక భాషలో కృతజ్ఞతను ప్రకటించేవాడు.

ఘర్ఫిషా పిల్లల్తో ఆట్టే మాట్లాడేవాడు కాడు. కాని, ఆరంభించి తేమాత్రం కోడి కూయవలసిందే. ఒక నాడు సాపాటు అయినతర్వాత పిల్లలతో చెప్పనారంభించాడు—

మానవ జీవితము నానాటికి సుఖప్రద మవుతోంది. మీ వయసులో వుండగా నాకు సుఖం స్వప్నంలో కూడా గోచరించేది కాదు. నిత్యము తగిలే చెప్పు దెబ్బలతో వీపు

అట్టకట్టింది. మొదట్లో పెడబొబ్బలు పెట్టేవాణ్ని; కాని, క్రమంగా అలవాటయి ఒళ్ళు బండబారిపోయింది. ఆచెప్పు కెప్పుడూ విశ్రాంతి వుండేదికాదు. అప్పటి నా జీవితానంద మంతా ఆ పాదరక్షతోనే. ఇదీ నా బాల్యస్మృతి. మీరు పెద్దవాళ్ళయితే మీచిన్ననాటి స్మృతి చాలా ఆనంద దాయకంగా వుంటుంది. నాకిప్పుడు ముప్పై ఆరేళ్ళు వచ్చి నయి. నా యీ గతజీవితంపైకి దృష్టిని సారించితే యెక్కడ కాంతిరేఖ కన్పించదు. ఆదినుండీ అంతం వరకు గాఢాంధ కారమే. కళ్లు, చెవులు వుండిన్నీ నేను గుడ్డివాడినే. చలి క్షుద్బాధలచే నాదంతాలు కటకటలాడటము దెబ్బలబాధ కోర్వలేక యేడ్చినందున ముఖం కంది వాడిపోవటము-మాత్రం నాకిప్పటికీ జ్ఞాపకమున్నై. నా ఒంటిమీద కొరడా మాత్ర మెప్పుడూ పడలా. ఇక తతిమ్మా దండనలేవీ తప్ప లేదన్నమాటే. మావాళ్లు దయా దాక్షిణ్యాలు లేకుండా బాదేవారు. వాతలుకూడా పెట్టారు. అయినా మొండినై బ్రతికాను. నిజంగా మానవుడు బలే విచిత్రజీవి! పిండి-పిల్చి పిప్పిచేసినా ప్రాణాన్ని వుంచితే చాలు; లేచి నిలబడతాడు. నన్నే చూడండి! చిత్రహింసలకు, కఠిన దండనలకు గురి అయ్యాను! మళ్ళీ యెప్పటి రీతినే గుక్కలాగా తయా రయ్యాను......... నే నెందుకూ పనికిరాను; కాని, కేవలం పొట్టకోసం పరుగులు తీస్తాను. భగవత్కృప నాపై నుంది. నన్ను చూచి నవ్వి పడిలేశాడు."

ఫర్‌ఫిషాక్ మాటలు వింటూ పిల్లలు కడుపుబ్బ నవ్వారు. ఇలియూ హృదయంలో మళ్లీ ఆలోచన మొలకెత్తింది. "నీ కోరిక యేమి?" టని ఫర్‌ఫిషాక్ నడిగాడు.

"బ్రాంది కావాలనుంది. దానికోసం తహ తహలాడుతున్నాను."

"నవ్వులాట కాదు. నిజంగా నీ మనసులోవున్న కాంక్ష యేమిటో చెప్పు" మని మళ్ళీ అడిగాడు.

"నిజం చెప్పమంటావా? అయితే విను—— నాకొక మంచి సితారును సంపాయించుకోవాలని కోరికవుంది. పది రూపాయలు యెల్లాగయినా చేతికివస్తే కొనుక్కొని ఆనందంగా గడిపేస్తాను."

ఈ మాటలని ఫర్‌ఫిషాక్ కిలకిలా నవ్వాడు. నవ్వాపుకొని మళ్లీ యిల్లా చెప్పాడు:

"కాదు ఇలియూ! నాకు సితారు అక్కర్లా. అసలే తాగుబోతును. ఎప్పుడో కక్కుర్తిపడి దాన్ని అమ్మివేయననే నమ్మక మేమిటి? అదీగాక కొత్తది యిప్పుడున్న సితారు కంటె బాగా మోగుతుందని మాత్రం పూచీ యేముంది? ఈ సితారుమీద నా వ్రేళ్ళాడితే చాలు; దాన్నుంచి వెలువడే మధురధ్వని మనసు కూరట కలిగించి ఉద్రూతలూపుతుంది. ఇల్లాంటిదీ ప్రపంచంలో యింకొకటుండదని ఘంటాపథంగా చెప్పగలను. ఈ సితారు కూడ నా ప్రియ సతి లాంటిదే. అదృష్టవశాత్తు పతిభక్తి పరా

యణ అయిన భార్యే నాకు లభించింది. ఆమె అందరు స్త్రీల లాంటిది కాదు; దేవీ సమానురాలు; కాని, 'బ్రతుకని బిడ్డ బారె' డన్నట్లు నడికారులోనే చచ్చిపోయింది. కావాలనుకుంటే నా కిప్పుడయినా మరొక పిల్ల దొరకక్కపోదు; అయితే నా దానియూ గుణాలు కలది ప్రాప్తించటము కలలో మాటే ఎవతెకో పుస్తెకట్టి తెచ్చుకోవడం నా మెడకి డోలు తగిలించుకోవడమేగా."

ఫర్ఫిషాక్ సితారుఅల్లాంటిదే; కాని, యీవిషయాలేవీ ఇలియా మనసుకు పట్టలా. వాడేదో జిజ్ఞాసతో సతమత మవుతున్నాడు. ఫర్ఫిషాక్ హృదయంలోనే ఆ కాంక్షా లేదంటే నమ్మలేక పోతున్నాడు. కాంక్షా రహితుడై కేవలం తాగుడుతో యెల్లా జీవించగల్గుతున్నాడా యని వానికి సందేహం కలిగింది. కోరిక లేకపోవటమే వాస్తవమయితే వానిని పిచ్చివాడుగా భావించ వచ్చును కున్నాడు. అయినా ఫర్ఫిషాక్ యెందువల్లనో వానిని నాకర్షించు తున్నాడు. తాగుబోతయినా కూడ చాల మంది కంటె ఫర్ఫిషాక్ యే విశాల హృదయుడనీ, సాధు స్వభావం కలవాడనీ ఇలియా భావించుతూ వుండటమే ఆ ఆకర్షణకు హేతువేమో?"

ఇలియా, జాకోబు, మాషా లొక్కొక్కప్పుడు అసాధారణ విషయాలను చర్చించేవారు. అవన్నీ జాకోబు మస్తిష్కంలోనుంచే దిగుమతి అయ్యేవి. "మన మందరము నిద్రలో వున్నప్పుడు మనస్సు లెక్కడికి పోతాయో!" నని

జాకోబు కొత్త సమస్య నొకదానిని లేవదీశా డొకనాటి రాత్రి.

ఇలియా కిల్లాంటి చర్చలంటే తలనొప్పి. వాటి మూలంగా తన హృదయం యెక్కడ కల్లోల మవుతుందో నని వాని బెదురు. అందుచే "నాకు తెలియ"దని తప్పించుకో జూచాడు.

"నిద్రించేటప్పుడు మనసు సంచారం చేస్తుందని చాలామంది చెపుతూంటారు.'' అన్నాడు జాకోబు.

"నిజమే"నంది మాషా.

"అందుకు నిదర్శన మేమిటి?" ఇలియా అడిగాడు.

"మనస్సు కోతిలాంటిది. ఎప్పుడూ దౌడు తీస్తుంది. అందువల్లనే మనకి రకరకాల కలలు వస్తుంటాయి." అని జాకోబు చెప్పాడు.

ఇలియా జాకోబు అన్నదానిని కాదనాలనుకున్నాడు; కాని, ఏం చెప్పాలో తోచక తూష్ణీం భావము వహించాడు. ఒకక్షణం నిశ్శబ్దంగా వుంది. అక్కడున్న దీపం ఒయట నుంచి లోపలికి చొరబడి రాబోతున్న గాఢ తిమిరాన్ని వెనక్కి తరిమి వేస్తోంది. ఆ నిస్తబ్ధతను చీల్చుకొంటూ జాకోబు కంఠస్వరం మళ్లీ వినవచ్చింది.

''మన కళ్లముందు జీవిచలించుతున్నా, పని చేస్తున్నా ప్రాణ ముందంటాము. ఆ జీవే మరుక్షణంలో అచేతనస్థితిలో పడివుంటే ప్రాణం పోయినదంటాం. దీని భావమేమిటో!''

"ఏముంది, వృద్ధాప్యంలో ప్రతి జీవీ మృతిచెందడం సహజమేగా" అన్నాడు ఇలియాా.

"మరి పిల్లలూ, పడుచువాళ్ళూకూడ చచ్చిపోతుంటూరే? దానికేం చెపుతా"వన్నాడు జాకోబు.

"వాళ్ళకి జీవించటానికి తగ్గ శక్తి-సామర్థ్యాలు లేక మృత్యుముఖంలో పడుతున్నారు."

"అయితే అంతవరకు ఎందుకు బ్రతుకుతారు?"

ఇలియాాకు కోపం వచ్చింది. అయినా "వాళ్ళకు జీవితంమీాద మోజు వుంది. అందుచే జీవిత పోరాటంలో ముందుకు వురకటానికి కృషి చేస్తూనే వుంటారు." అన్నాడు విసుగ్గా.

"పేదల విషయంలో అంతే కావచ్చు; కాని,ధనికులు భాగ్యవంతులు కూడ నిరంతరము తాపత్రయ పడుతారెందుకు? భగవంతుడు వారికి సిరి-సంపదలు సమృద్ధిగా యిచ్చాడుగా!"

"ఏం చిత్రమైన ప్రశ్న! నువ్వన్నట్లు శ్రీమంతులు విరాగులే అయితే పేదవాళ్ళకు బ్రతుకు తెరువేదీ? వాళ్ళెవరి పన్లు చేస్తారు?"

జాకోబు కేమీా స్ఫురించలా. ఆలోచనలో పడ్డాడు. కొంచెమాగి "అయితే మానవులు పని చెయ్యడానికే బ్రతుకుతున్నారంటావా?" అనడిగాడు.

"ఆ, అంతే; కాని, అందరూ అందుకే కాదు. కొం దరు పని పూర్తిచేసుకొని కష్టార్జితాన్ని అనుభవించ తూంటారు. అందుకోసమే వారు జీవించుతారు."

"అల్లా యెందుకు జీవించాలి?"

"ఓరి తిక్కశంకరా! అందరూ జీవించాలనే కోరు తారు; జీవిస్తున్నారు. ఎందుకు జీవించాలనే ప్రశ్నేమిటి? నువ్వెందుకు జీవించుతున్నావో చెప్పు?"

జాకోబు ప్రశ్నలతో ఇలియాను ఒళ్ళుమండుతోంది. వాని కోపానికి కారణం అనూహ్యాము. ఏమయినప్పటికీ వాని హృదయం మాత్రం ఆ చర్చతో వికలమయింది.

"నే నెందుకు జీవించు తున్నానో కారణం చెప్ప లేను. చావంటె నాకు భయమే; కాని, దూరంగా పారి పోను. మొత్తంమీద యీ విషయాలన్నీ బలే మజాగా వుంటై." అని ఒక చిటిక పాటాగి జాకోబు నిమ్మళంగా మళ్లీ సాగించాడు— "నీకు కోపం వచ్చి నట్లుంది; కాని, అందుకు నాకేమీ హేతువు కన్పించటం లేదే. సావధా నంగా ఆలోచించు. మానవులు పని చేసేందుకే జీవించు తున్నారు; పని మానవుల కొఱకే యేర్పడుతోంది. ఈ చక్రం నిరంతరము గిరగిర తిరుగుతూనే వుంది; సరే మరిదానికి అంత మెప్పేదు? దాని ప్రయోజనం యేమిటి? అసలన్నిటికి మూలాధారము పరమేశ్వరుడు గద! ఆయన యెక్కడున్నాడు? దేవుడు 'మీరు పెరిగి పెద్దవాళ్ళయి

ఫలించి వృద్ధిచెందండి' అని ఆదం, హవ్వాలకు సెలవిచ్చాడు; కాని, ఆ వృద్ధికావట మెందుకో స్పష్టం కాలేదు. భగవంతు డదికూడ చెప్పాడు. కాని, ఆ వాక్య మధ్యలోనే హరించ బడింది. దాన్ని మింగివేసిన చోరుడు సైతానే. అందు వల్ల ఆ పై వివర మెవరికీ తెలియకుండా పోయింది."

జాకోబు వాదనకి పూర్వాపర సందర్భం లేదు. అయినా ఇలియా మనసు నది కల్లోల పర్చింది. అంతా విన్నాడేగాని మాట్లాడ లేదు. జాకోబు వాగ్ధోరణి ఇంకా సాగుతూనేవుంది.

"భగవంతుడు మననుంచి కాంక్షించేదేమిటి?" అని ఆవేశంతో జాకోబు లేచి నిలబడ్డాడు. అంతలో శాంతించి మెల్లగా చెపుతున్నాడు. మాషా వానివంక వింతగా చూస్తోంది. ఇలియా అక్కసుతో వికార చేష్టలు చేస్తు న్నాడు. జాకోబు చెప్పేది అర్థంకానప్పుడు విసుక్కుంటు న్నాడు. వాడు జాకోబు నెప్పుడూ తనకంటె మందబుద్ధిగా యెంచేవాడు. తా నెంత కుశాగ్రబుద్ధి ననుకున్నా జాకోబు వాక్పటిమ చూచి డంగయిపోతున్నాడు. కడుపుబ్బు పట్ట లేక "రాత్రింబగళ్ళు యెన్ని పుస్తకాలు రుబ్బితేమాత్రం మట్టిబుర్ర కేం తెలుస్తుంది? అడివి దున్నపోతు!" అని కాండ్ర మాడాడు.

"నేను మేధావంతుడి నన్నానా? నాకేమీ తెలి యకనేగా యింతగా నీతో చర్చించటం!" అన్నాడు జాకోబు.

ఏమీ తెలియదని స్పష్టంగా చెప్పేసి వూరుకో రాదూ? చర్చించి తేమాత్రం శుద్ధ మొద్దుకి నీకేం తెలుస్తుంది కూజాలో నీళ్ళొలికినట్టు బడబడ యీ వాగుడెందుకు? వినే వాళ్ళకు విసుగు కలుగుతుందేమో నన్న జ్ఞానమే లేదు."

అదీ ఒక సమస్యే. ఏవిషయంగాని తెలుసుకోవటం అనుకున్నంత సులభం కాదు. ఉదాహరణకు ఈదీపాన్నే తీసుకోండి. దాని జ్యోతి రెప్పపాటులో ప్రకటితమవుతుంది. మళ్లీ క్షణంలో అదృశ్యమయిపోతుంది. అగ్గిపుల్ల గీసి ముట్టించితే కన్పిస్తుంది; నోటితో ఉఫ్ అంటే మాయమవు తుంది. కాబట్టి జ్యోతి యెప్పుడూ వుండివుంటుందనే సంగతి స్పష్టమే. కాని, అది యెక్కడుంటుందో యెవరయినా చెప్పగలరూ?"

ఇలియా ఆలోచనలో పడ్డాడు. వాని విసుగు, కోపం యెగిరిపోయినయి. తదేక దృష్టితో దీపంవంక చూస్తూ యోచించసాగాడు.

"జ్యోతి అగ్గిపుల్లలో వుంటుం"దని మాషా చులాగ్గా చెప్పేసింది,

ఆమె మాట నిద్దరూ పెడచెవిని పెట్టారు. జీవిత రహస్య విషయాలు, వైజ్ఞానిక విషయాలను చర్చించే సంద ర్భాల్లో వాళ్ళామె మాటల నెప్పుడూ లక్ష్యపెట్టరు. అందుకు మాషాకూడ నామోషీగా భావించదు.

"జ్యోతి యెందులో అంతర్భూతమై వుంటుందో నేను చెప్పలేను. తెలుసుకోవాలన్న కుతూహలం కూడ

నాకు లేదు. జ్యోతివల్ల ప్రయోజనమున్నదనీ, దాన్ని ముట్టు కుంటే కాలుతుందనీ తెలిసిన మట్టుకు సంతృప్తి పడు తాను." అన్నాడు ఇలియా

"నీసమాధానం అతి పేలవంగా వుంది. ఇల్లాంటి జవాబు నెవరయినా యివ్వగలరు; అయితే ఇది అసలు సమస్యకు సమాధానమేనా? మంట యెక్కడనుంచి వస్తుం దన్న సమస్య అల్లాగే వుంది. రొట్టె సంగతి తీసుకో! దాని విషయంలో అలాంటి శంకలకు అవకాశమే లేదు. దాని మూల పదార్థాలన్నీ స్పష్టంగా కనపడుతాయి. విత్తులో అంకురము, దాన్నుంచి మొక్క, మొక్కవల్ల గోధుమలు, వాటిమూ లంగా పిండి, పిండితో రొట్టెలు తయారవుతాయి. మరి మనిషి యెల్లా తయారవుతున్నాడో!" అని జాకోబు యిం కొక సమస్య నెత్తాడు.

ఇలియా తెల్లపోయి చూచాడు. ఇల్లాంటి అపూర్వ ఆలోచనలు జాకోబు బుర్రలో యెల్లా పుడతాయా అని ఆశ్చర్య పడ్డాడు. తనకేమీ సమాధానం తోచక "నువ్వు నా బుర్రనుకూడ పాడు చేస్తున్నావు. పనీ-పాటూ లేక వెర్రిమొర్రి విషయాలాలోచించుతావు ఒళ్లొంచకుండా కూడూ, గుడ్డా దొరుకుతున్నాయిగా! నీకు చింతేముంది? నా మాదిరిగా నువ్వూ నెత్తిమీద బరువెత్తుకొని వీధివీధి తిరిగితే మెదడు పాటునబడి తలాతోకాలేని యీ ఆలోచనలు నట్టవు. గొప్పవాడి నెప్పు డయిపోదామా అని ఆరాట

పడుతున్నావులే. నీ ఆస లేదు పదీ!" అని చెడామడా అనేశాడు.

వాళ్ళిద్దరూ అర్థంకాని నిగూఢ విషయాలనుమాట్లాడు కొంటూంటే మాషాకి నిద్ర జోకింది. మెల్లగా లేచి పోయి పక్కమీద వాలింది.

"చాలా ప్రొద్దు పోయింది. ఇక పోయి పడుకుందా" మన్నాడు ఇలియా.

"కొంచెం మాగు; మాషాకు దుప్పటి కప్పి, దీప మార్పేసి వెళ్దాం" అని జాకోబు లేచాడు.

ఇలియా తలుపు దగ్గరకు వెళ్ళటంచూచి "నేనూ వస్తున్నా నుండు; కటిక చీకటిగా వుండల్లే వుంది; నాకు భయమేస్తుంది" అన్నాడు జాకోబు

ఇలియా హేళనగా నవ్వుతూ "పదహారేళ్ళ పడుచు కుర్రాడివి; ఇంకా భయమేనా? ఎక్కడికైనా సరే నేనొక్క డినే వెళ్తా" నన్నాడు ఇలియా.

జాకోబు మాట్లాడలా. మౌనంగా మాషాకి పచ్చడము కప్పి, దీపమార్పాడు. తలుపును [illegible] ఇలియా చెయ్యి గట్టిగా పట్టుకొని బయల్దేరాడు.

అరేబియన్ గ్రంథాలయం తెలుప్రో లు

11

ఒకనాటి మునిమాపు వేళ ఇలియూ క్షుభిత హృదయంతోను, విషణ్ణ వదనంతోను యింటి కొచ్చాడు. వానికి తల తిరుగుతోంది. మేను కంపించుతోంది. ఏదో చేటు మూడివుంటుందని వాని ముఖమే చెపుతోంది.

ఆ రోజున ఇలియూ సర్కసు మైదానములో వస్తువులమ్ముకుంటున్నాడు. బీటు జవాను తన మామూలు చేతిలో వేసికొని ఇలియూను విడిచి పెట్టాడు. కొంత సేపటికి పోలీసు ఇనస్పెక్టరు అనూహ్యంగా తనిఖీకి వచ్చాడు. అతడు ఇలియూను నాలుగు లెంపకాయలిచ్చి, బండ బూతులు తిడుతూ సామానులను అటూ యిటూ గిరాటేశాడు. చాలా వస్తువులు దుమ్ము కొట్టుకొనీ, విరిగీ, పగిలీ పాడయి పోయినయి. ఇలియూ బిక్క మొగం వేసి అతి కష్టంతో అన్నిటిని యేరుకొని అధికారితో "మీ రీ విధంగా చెయ్యటం ధర్మం కాదు. తప్పుంటే లా ప్రకారం నన్ను శిక్షించాలి; గాని, యిల్లా చేయి చేసుకోటానికీ, నా వస్తువులను విరజిమ్మి నష్ట పరచటానికీ న్యాయ శాస్త్రం మీకు అధికార మిచ్చిందా?" అనడిగాడు ధైర్యం చిక్కబట్టి.

ఒక చిల్లర బేరగా డా విధంగా జంకు గొంకు లేకుండా పొగరు బోత్తనంతో యెదిరించి మాట్లాడు తూంటే

పోలీసు ఇన్స్పెక్టరులాంటి హోదాగల అధికారి యెల్లా సహించ గలడు! అతనికి అరికాలి మంట నెత్తి కెక్కింది. ఇలియూ జుట్టు పట్టుకొని బూటుకాలితో మళ్ళీ రెండు తాపులు తన్ని కానిస్టేబిలుకు వప్పగించాడు. అంతకు ముందు లంచం పుచ్చుకున్న బీటు జవానే ఇలియూను తీసికొనిపోయి 'లాకప్పు'లో నిర్బంధించాడు. పగలంతా కూడా నీళ్ళు లేకుండా కొట్టులో వుంచి సాయంత్రం వదిలేశారు. ఇలియూ తల వ్రేలాడ వేసుకొని, కాళ్ళీడ్చుకొంటూ యింటికి చేరాడు.

ఇంతకు పూర్వంకూడ అనేక తడవలు ఇలియూకు పోలీసులతో ఘర్షణ జరిగింది; అయితే యిప్పటిలాగా లోగడ యెన్నడు నిర్బంధింపబడి యెరుగడు. ఇంతగా అవమానింపబడినదీ లేదు. నేడు వాని హృదయము పరాభవాగ్ని జ్వాలలచే భగభగ మండు తోంది. పక్క మీద పడుకొని నాటి సంఘటనను గురించి పరి పరివిధాల తలపోస్తున్నాడు.

ఇటు ఒక సామాన్య సంఘటన కారణంగా ఇలియూ కినమస చెందుతున్నాడు. సరిగా అదే గోడ కవతలి ప్రక్కన హోటలులో అంతకంటె క్షోభింప జేసేదీ, భీభత్సము నైన అభినయము జరుగుతోంది.

హోటలు గంద్రగోళంతో చెవులు చిల్లులు పడు తున్నై. 'రొట్టెతే, మాంసం తీసుకొనిరా, బ్రాంది యియ్యి' అనే కేకలు ప్రతి ధ్వనించు తున్నాయి. సర్వత్ర

చకచకా అందిస్తూనే వున్నారు. టేబిలుమీద డబ్బులు ధ్వని చేస్తూనే వున్నై.

ఒకడు రాగాలాపన సాగించాడు. పక్కనాడు కూడ స్వరం మేళవించాడు. ఇద్దరూ స్వరంలో స్వరం కలిపి

"జీవిత మందలి అనుపమ ఘడియలు
చింతతో చీకుతు గడిపేశాం" అని పాడారు.

"అంతా అబద్ధం! పచ్చి అబద్ధం!! 'నా ఆజ్ఞలను ధైర్యంతో అమలు జరిపితే మిమ్మల్ని కష్టాలనుంచి కాపాడుతా' ననలా యేసుక్రీస్తు" అని యెవడో మూడో వ్యక్తి కర్కశ కంఠంతో అరుస్తూ పాట కడ్డొచ్చాడు.

నాలుగో మనిషి అందుకున్నాడు— "నీ వసలె శుద్ధ అబద్ధాల కోరువు. 'మీ రొకసారి అటు, ఒకపరి యిటు తిరుగు తున్నారు; అందుచేతనే మిమ్మి దూరంగా తన్నే స్తున్నా'నని నువ్వు చెప్పినమాటలను దిగువనే రాసిలేదూ?"

రెండో వ్యక్తి వికటంగా నవ్వి "నా కిష్టమయిన చోటునల్లా ముద్దెట్టు కున్నాను; లెక్క లేనన్ని ముద్దులు!" అన్నాడు.

నాలుగో మనిషి కిలకిలా నవ్వాడు.

"ఆముద్దుగుమ్మ క్రిందపడినా నేను వదల్లా. ముద్దులాడుతూనే వున్నాను."

"వహ్వా! ఏం మొనగాడివోయ్!" అన్నాడు మరో తాగుబోతు.

మూడో వ్యక్తి అన్నాడు—"అందులో తప్పేముంది? ఎవడయినా అల్లా చేయవలసిందే. ప్రేయసిమీద సర్వ హక్కులూ వుంటయ్.

"దాని పర్యవసానం యేమిటో తెలుసా? కఠిన శిక్ష తప్పదు. డేవిడ్ రాజు శాసనాన్ని మర్చిపోయావా? అని నాలుగో మనిషి అడిగాడు.

ఇలియా తన గదిలోనుండి యీ సంభాషణ నాల కింమతూనే వున్నాడు; కాని వాని ధ్యాస అటు లేదు. ఇలియా కళ్ళముందు పోలీసు ఇన్స్పెక్టరు భయంకరాకృతి వికటాట్టహాసం చేస్తోంది.

ఉన్నకొద్దీ హోటలులో గల్లంతు, పాటలు రెచ్చి పోతున్నై. "ఇప్పుడు కమ్మని పాటలే పాడుతున్నారు. ఆధ్యాత్మిక విషయాలు చర్చించుతున్నారు. కాని, కైపు తలకెక్కినతరువాత ఒకరినొకరు తిట్టుకుంటారు; నాదులాడి గుద్దుకుంటారు. ఏమిటీ దౌర్భాగ్యపుస్థితి!" అనుకున్నాడు ఇలియా తనలో.

మళ్ళీ పాటవినపడింది.

"చర చర మేఘాల్ తరుముకు రాగా
చాటుకు పోయెను మా భాగ్యం"

ఇలియా కాపాటలో 'నాజీవితమంతా వెతికినా యెక్కడా కాంతి రేఖ కనపడలే''దన్న జర్మియా మాటలు జ్ఞప్తికొచ్చాయి.

'ముసలి జర్మియా దైవభక్తి కలిగివుండిన్నీ డబ్బును కూడబెట్టుటలో యెవరికీ తీసిపోలేదు. బాబాయికి పాప భీతి వున్నా జర్మియా సొమ్ము నపహరించాడు. దీనినిబట్టి ప్రతిమనిషికి రెండు రూపాలున్నట్టు విదితమవుతోంది. మనిషి మనస్సు ఒకసారి ఒక వేపుకు, మరోసారి వేరొక ప్రక్కకు మొగ్గుతుందన్నమాట. అదే పాప-పుణ్యాల బరువును తెల్పేముల్లు.

ఈవిధంగా ఇలియా వితర్కించుకుంటూండగా హోటలులో యేదో గచ్చుమీద పడి ఖంగుమని మోగింది. ఆధ్వని హాలులో ప్రతి ధ్వనించింది. అందరూ నివ్వెరపడి అటువేపు చూచారు.

హోటలులో మళ్లీ కిలకిలలు-కేరింతలు, గంతులు-తందనాలు అతిశయించాయి.

ఇలియాకు నవ్వొచ్చింది. తాననుకున్నట్టె జరుగుతోందనుకున్నాడు. ప్రక్క కొత్తిగిలి ఆలోచనలో మునిగాడు.

"అంటాయిప్ తాత చేసినపాపం చాలా ఘోరమైనదయి వుంటుంది. మహాపాతకు డయినందువల్లనే యేక దీక్షతో యెనిమిదేండ్లు తపస్సు చేయాల్సి వచ్చింది.

మొత్తంమీద తుదకు ప్రజ లాయన్ను క్షమించారు; ఆయన దురాగతాలన్నీ మర్చిపోయి వారి నామధేయాన్ని భక్తితో స్మరించసాగారు; కాని, ఆయన సంతానాన్ని సర్వనాశనం చెయ్యకుండా వదల్లేదు పెద్దకొడుకును దేశ బహిష్కారం చేయించి, రెండో కుమారుని వూళ్ళోనించి తరిమేశారు. విధివిలాస మెంత చిత్రంగా వుంది!"

ఇలియూ ఈవిధంగా భావనా వీధిలో విహరించు తూండగా చేపల దుకాణపు యజమాని 'లెక్క ప్రకారం నడుచుకోవాలి. తొమ్మండుగురు దుష్టులై ఒక్కడే మంచి వాడయితే వాడు రసాతలానికి పోవలసిందే. అట్టివానికి లోకంలో స్థానం లేదు. బహుజనాభిప్రాయమే అనుసరణీయము, విధాయకమూ'నని వుగ్గడించిన పల్కులు స్మృతి పథంలోకి వచ్చినయి.

న్యాయానికి కూడు, ధర్మానికి తావు, నిజానికి ఆదరణా లేని యీ తుచ్ఛ సమాజంపైని ఇలియూకు రోత కలిగింది. కాండ్రించి వుమ్మివేశాడు. వాని హృదయము పగబట్టిన త్రాచువలె బుసకొడుతోంది. కళ్ళముందు జరిగిన ఘటన లొకటొకటిగా వాని మనోవీథిలో సంచరించసాగాయి.

ఇంటి మొగదల అరుగుమీద కూచొని మతిస్సా కుమిలి కుమిలి యేడుస్తోంది.

షర్ఫిష్కా ఆమె కెదురుగా నిలబడి వెకిలిగా

నవ్వుతూ ఈ రంకులాడి తనకీ గతిని చేజేతులా తెచ్చుకొన్నదే” నంటున్నాడు

పెట్రుహా దూరాన్నుంచే వారిద్దరిని గాంచి పక పకా నవ్వుతున్నాడు.

ఇలియా దృక్పథంలో యిల్లాంటి చిత్రాలొక దాని వెనుక మరొకటిగా దొర్లిపోతున్నై. వని గుండె కరుడుగట్టి శిలా సదృశమయింది.

కొంతసేపటికి హోటలులో సద్దణిగింది. ఒకరిద్దరు మాత్రం గుసుస్తున్నారు. ఒకడు హార్మోనీ వాయించుతున్నాడు. దాని నుంచి గార్దభస్వరం వినవస్తోంది. అదయినా ఎంతోసేపు లేదు. ఇలియా వున్న గదిగోడ నానుకొని యిద్దరు వ్యక్తు లేదో మాట్లాడుతున్నారు. వారి సంభాషణ ఇలియాకు వినపడుతోంది.

“మన జీవితాలిల్లా గడిచిపోవలసిందేనా? రెక్కలిరగ్గొట్టుకుని చాకిరీ చేసినా ఫలితమేమీ దక్కదయ్యె. కొందరు కోట్లు మూలుగుతుంటే హాయిగా అనుభవిస్తూ కులుకుతున్నారు. మరి మన కర్మమేమిటో, మనస్థితి రోజురోజుకూ దిగనారిపోతోందిగదా!” అన్నాడు ఒకడు.

“అవును, నిజమేరా” అని రెండోవ్యక్తి పైవానితో మేకీభవించాడు.

“ఈ అనంత ప్రపంచంలో జీవిత సంఘర్షణవల్ల యేదీ స్పష్టంగా తెలియకుండా వుంది. నీతిగా బ్రతకాలనుకొనే

వాడు బాగుపడటం సున్నా అనిమాత్రం స్పష్టమవుతోంది. నమ్మకంగా పనిచేసే మనిషి నిరంతరము సావధానుడై జాగ్రత వహించాల్సివస్తోంది.

"అయినా మనకు గత్యంతరమేమున్నది?"

"దారి లేకేం గాని, స్వామిద్రోహం చెయ్యటానికి సర్వసామాన్యుల్లో అరుదుగా వుండే ధైర్య-సాహసాలు కావాలి. యుక్తికూడా అవసరమవుతుంది.

"ఓయి దేవుడా!" అని రెండో వ్యక్తి నిట్టూర్చాడు. ఇలియాకూడ దీర్ఘంగా నిశ్వసించాడు.

అప్పుడే హోటలులో ఫర్ఫిషాప్కేక వినపడింది. "ఒరేయి, నికిటా! జాడీలోదంతా గుమ్మరించి యివ్వరోయ్! రేపటి సంగతి ఆలోచించేవ్! ప్రాణం గుటుక్కుమనేదాకా కులాసాగానే వుండాలి. మద్యము, ఆనందము యివేగా జీవిత సారాలు! జేబు గలగల లాడుతున్నంతసేపు మస్తుగా తాగి మజా చెయ్యాలి."

ఈ మాటల కక్కడి వారందరు పకాలున నవ్వారు. "భేష్, భేష్! శెభాష్! బలే, బలే!" అన్నారు.

గోడ నానుకొని కూచున్న మనిషి మళ్ళీ ప్రారంభించాడు.

"నేను గోచీపెట్టి నప్పటినుంచి కష్టపడు తున్నాను. చూస్తూ చూస్తుండగానే నలభైయేళ్ళు దాటిపోయాయి;

ఇన్నాళ్ళలో ఒకనాడూ సుష్టుగా కమ్మని పదార్థం తిని యెరుగను. ఆపదలకు అంతూ పొంతూ లేదు. సుఖమనేది యెల్లా వుంటుందో! కొంప నరక కూపమే. పిల్లలు బీరకాయ పీచు. వాళ్ళ యేడుపులు-బొబ్బలు, భార్య విసుగూ—సాధింపులతో నిలువునా నీరయి పోతున్నాను. ఎవడయితే మాత్రం యెన్నాళ్ళని యివన్నీ అనుభవించగలడు? దారిద్ర్యాంధకారంలో దారీ - తెన్నూ గానక మానవుడు దుఃఖోపశమనానికి, మనశ్శాంతికి తప్పుదారి తొక్కి, దురలవాట్లకు లోనవుతున్నాడు. ఈ విధంగా పతనమై సర్వనాశనం చేసుకొంటున్నాడు."

"నువ్వు చెప్పింది అక్షరాలా నిజం."

"మనము పగలూ, రాత్రీ దేవుణ్ని స్మరించుతున్నాము; మన యిక్కట్టులను మొర పెట్టుకుంటున్నాము; కాని, ఆయన మన గోడు నాలకించుతున్నట్టే లేదు."

"అవును, అలాగే కన్పిస్తోంది."

నిరాశతో నిండియున్న యీ సంభాషణ ఇలియాకు మనస్తాపం కలిగించింది. పక్కమీద దొర్లుతున్నాడు. ఆ నిస్పృహలో వాని కాలు గోడకు తగిలింది. అంతే, ఆపైన మళ్ళీ వారి సంభాషణ వినపడలేదు.

ఇలియా యిక పక్కమీద పడివుండలేక పోయాడు. లేచి బయటికి వెళ్ళాడు. ఎక్కడికయినా పోవాలనిపించింది; కాని, యెటు వెళ్ళడానికీ తోచలేదు. అప్పటికి

చాలా ప్రొద్దుపోయింది. మాషా నిద్రలో వుండి వుంటుంది. జాకోబు తలనొప్పితో పడి వున్నాడు. అసలు వానివద్దకి పోవాలనే లేదు ఇలియాకి; వెళ్తే పెట్రుహా ముక్కు పట్టు కుంటాడని భయం! శీతరాత్రి. కొరుక్కుని తినే చలి. ఓరుగాలి వీస్తోంది. గగన మండలము మేఘావృతమయి వుంది. కన్ను పొడుచుకున్నా కనపడని కారుచీకటి.

ఇలియా చలికి వణికిపోతున్నాడు; అయినా గదిలోకి వెళ్ళి పడుండటానికీ యిష్టం లేదు. "ఈ రకంగా జీవించడము అసంభవము, దుస్సహము. ఇంతకంటె నర సంచారంలేని చోట నేకాంత వాసమే నే" లనుకున్నాడు.

ఉన్నట్టుండి "ఎవరా నిలబడింది?" అని కేక విన్పించింది.

ఇలియా అదిరిపడి "నేను, నువ్వెవరు?" అని యెద రడిగాడు.

"నేనే మతిస్సాను" అని ప్రత్యుత్తరం వచ్చింది.

"ఇంత రాత్రివేళ బయట గేం చేస్తున్నా" వని ఇలియా అడిగాడు.

"కాలిమీద వుండు లేచి బాధగా వుంది. చుట్టూ వాచింది. బాధ భరించలేక బయటికొచ్చాను."

"అంత బాధగా వుంటే ఆస్పత్రికి వెళ్ళకపోయావూ?"

"దగ్గిరా దాపా? నడవలేక మానుకున్నాను."

"బండిమీద వెళ్ళొచ్చుగా?"

"చేతిలో చిల్లిగవ్వ లేంది యెట్లా వెళ్ళేది."

అంతలో హోటలు తలుపు తెరువ బడింది. ఎవరో ఒక వ్యక్తి తూలుతూ వెళ్ళిపోయాడు. లోపలి నుంచి కొద్దిగా సవ్వడి వినిపించింది. కా, వాయు వీచిక లా ధ్వనిని తరుముకొని పోయినై. హోటలు తలుపులు మూసిన చప్పుడయింది. ఆ తర్వాత మళ్ళీ నీరవంగా వుంది.

"నువ్విక్కడ నిలబడి వున్నావేం?" మతిస్సా తిరిగి పల్కరించింది.

"నిద్ర పట్టక వచ్చాను."

"సరే, నీ స్థితీ నాలాగానే వుందే! ఈదురు గాలి వేస్తోంది; నా గదిలోకి వెళ్ళి కూర్చుందాం రా."

ఆమె నిట్టూర్చడం విని ఒక క్షణమాగి "సరే, పద" అన్నాడు ఇలియా.

ఇద్దరూ బయలుదేరారు. కాలు నొప్పిగా వుండటం వల్ల మతిస్సా అడుగులు నిమ్మళంగా వేస్తోంది. ఇలియా అనాలోచితంగానే ఆమె ననుసరించాడు. వెళ్ళి గదిలో కిటికీ చెంతనున్న కుర్చీలో కూచున్నాడు. గోడకు వ్రేలాడుతున్న పటంమీద వాని దృష్టి పడింది "ఎవరి దది?" అనడిగాడు.

"అనీ సాధుది" అని మతిస్సా శ్రద్ధా - భక్తు లుట్టిపడేట్టు చెప్పింది.

"నీ పేరేమిటి?"

"ను వ్వెరుగవూ? నా పేరు అనీమే" నంది మతిస్నా.

"మతిస్నా అని మాత్రమే నాకు తెలుసు."

"నీకే కాదు, నా అసలు పేరిక్కడ యెవరికీ తెలియదులే!"

ఇలియా ఆమె ముఖంలోకి చూశాడు; కాని, యేమి మాట్లాడాలో తెలియలా. మతిస్నాకూడ మౌనంగానే వుంది. కొంచెం సేపయిన తర్వాత "ఏం చేద్దాము?" అని తానే ప్రారంభించింది.

"ఏమో నాకేం తెలుసు?" అన్నాడు ఇలియా.

మతిస్నా పేలవంగా నవ్వి "నిజమేలే, నీకేం తెలుసు!" అన్నది.

"మరి?"

"ముందు నాకొక బుడ్డి బ్రాంది తెచ్చిపెట్టు. తింటానికూడ యేదయినా తెస్తే మరీ మంచిది. ఆకలి నన్ను దహించి వేస్తోంది. కాలిమీద పుండులేచి నప్పటి నుంచి దమ్మిడీ సంపాదన లేదు. ఉన్నది కాస్తా అయిపోయింది. రెండు రోజులనుంచి పచ్చి మంచినీళ్లు మినహా తిన్నదేమీ లేదు" అని మతిస్నా దీనంగా ఇలియావంక చూచింది.

మతిస్నా పడుపు వృత్తితో పొట్ట పోసుకుంటోందని ఇలియా కిప్పుడు స్ఫురణకు వచ్చింది. ఆమె వంక తేరి చూచాడు. మతిస్నా నేత్రాలు నిలకడ లేనట్లున్నై. ఏదో చప్పరించుతున్నట్లు ఆమె పెదిమలు చలిస్తున్నాయి. మతిస్నా

దీనస్థితికి ఇలియా హృదయం ద్రవించింది. "ఇప్పుడే తెస్తా నుండు"మని లేచాడు.

గబగబా పాటలు ముందుకెళ్ళాడు; కాని, లోప లికి వెళ్ళటానికి తటపటాయించాడు. వాకిట్లో నిలబడి ఒక క్షణం ఆలోచించాడు. హృదయంలో ద్వంద్వయుద్ధం సాగింది. తరువాత తెంపు చేసుకొని తలుపు తన్ని లోపలకి వెళ్ళాడు. భోజన పదార్థాలన్నీ పుచ్చుకున్నాడు. బ్రాంది నిమ్మనటానికి సందేహించాడు. ఎన్నడూ తాగి యెరుగని తాను బ్రాంది నడుగుతే సర్వరు యేమనుకుంటాడోనని వెరిచాడు. తుదకు "నేనొక స్నేహితునికి విందు చేస్తు న్నాను; ఒక బుడ్డి బ్రాందికూడ యియ్యి" అని అడిగే శాడు.

సర్వరు మాట్లాడకుండ బ్రాంది సీసా నందిచ్చాడు.

ఈమాత్రానికే అబద్ధమాడకపోతే వచ్చే ప్రమాద మేమీ లేదని ఇలియాకు తెలుసు. అనవసరంగా అనృత మాడినందుకు ఇలియా ఖేదపడ్డాడు. బిల్లు చెల్లించి బయటి కొచ్చాడు. సవ్వడికాకుండా అడుగులేస్తున్నాడు. ధ్వని అయితే యెవరయినా చూచి పల్కరించుతారేమోనని జంకు; కాని అప్పుడా సమీపంలో నరసంచారమే లేదు. నిర్విఘ్నంగా మతిన్నా గదిలోకి చేరుకున్నాడు. అయినా యెందుకో తెలియని అజ్ఞాతశంకచే వాని మన స్సాందోళన చెందుతోంది.

మతిస్సా తృప్తిగా పీడితలాగా ఇలియా తెచ్చిన పదార్థాలపైన విరుచుకొనిపడి లొట్టలేస్తూ బొక్కసాగింది.

ఇలియా తృషిత నేత్రాలతో ఆమె మోము నవలోకించుతున్నాడు. ఆ మత్తకాసినిని బాహు బంధంలో బంధించే దెప్పుడాయని ఆరాట పడుతున్నాడు. "ముద్దు పెట్టుకుంటూంటే యెల్లా వుంటుందో! నాకీ విషయంలో బొత్తుగా తెలియదే! నాకేమాత్రం అనుభవము లేదనీ రసికత్వం తెలియదనీ చుల్కన చేస్తుందేమో!"నని మదనపడుతున్నాడు. మనసు వూగిస లాడుతోంది. మెదడుకు వేడెక్కింది.

గాలి యథారీతిని హోరుమంటోంది. దాని తాకుడుకు కిటికీ రెక్కలు కొట్టుకుంటున్నై. ధ్వని అయినప్పుడల్ల ఇలియా వులిక్కిపడి ద్వారం వేపు చూస్తున్నాడు. ఎవరయినా వస్తారేమో, తన గుట్టు బయటపడుతుందేమోనని భయంగా వుంది. "తలుపుకు గడియ వేసెయ్యనా?" అని మతిస్సా నడిగాడు.

ఆ జారిణి కూడ తలాడించింది.

మతిస్సా భోజనం ముగించి చెయ్యి కడుక్కున్నది. మెల్లగా అసీయోగ్ని పటం ముందుకెళ్లి నమస్కరించి "దేవుని దయవల్ల నా ఆత్మ తృప్తి పడింది. ప్రొద్దుటినుంచి యెంత తల్లడిల్లి పోయాను!" అని ఇలియావంక చూచింది.

ఇలియా గుండె టకటక కొట్టుకొంటోంది. చూపులో వేగిరపాటు కన్పిస్తోంది. మతిస్సా వాని మనోగతాన్ని

గ్రహించి పెద్ద నిట్టూర్పు విడిచింది. ఆ తరువాత అన్నది—"ఎంత కోర్తే వారంతా యివ్వాల్సి వస్తుంది."

"ఎవరికి?" ఇలియా ప్రశ్నించాడు.

"ఇదికూడా తెలియదూ? ఇంకెవరికి? దేవునికి!"

ఇలియా యిక మాట్లాడలా. ఈశ్వర స్మరణతో కంపించాడు. ఆ నిముషంలో వాడూహించుతున్న భావనలన్నీ దూది పింజల్లాగా యెగిరిపోయినై. మతిస్సాని కౌగలించుకొని ముద్దు పెట్టుకోవాలనుకున్న కోరిక అయిపు లేకుండా పోయింది.

మతిస్సా గోడకానుకుని నుంచొనివుంది పరధ్యానంగా అంటోంది—"పాపం! ఫర్ఫిషాకా కూతురు గతి యేమవుతుందో! నాకెప్పుడూ ఆపిల్లను గురించిన యావే. అది తరుచుగా నీతోను, జాకోబుతోను కలసి మెలసి వుంటోంది. మీరిద్దరు ఆపిచ్చిపిల్లని సర్వనాశనం చేయకుండ వదలరనే నా అనుమానం. దానికూడ నాగతే పడుతుందేమోనని నేను భయపడుతున్నాను. ఈ రొంపిలో అడుగు పెట్టిన ఆడుదానికిక ముక్తిలేదు. పడుపు వృత్తికంటె పతితము హేయమునైన మార్గము మరేదీ లేదు.

మతిస్సా ఒకక్షణమాగి తన చేతుల్ని చూచుకొని మళ్ళీ చెపుతోంది— "మాషాకి ఈడు వచ్చింది కూడాను. ఆ పిల్లకెక్కడయినా నౌకరీ కుదురుద్దామని యెందరివద్దకో పోయొచ్చాను. కాని, యెక్కడా ఒనగూడనేలేదు. పిల్లని

అమ్మేయటానికి ఒప్పుకుంటే కొంటామనీ, మాపాకి మంచి తిండి, బట్టలకు లోపముండదనీ, నాకు డబ్బు బాగానే ముట్ట జెప్తామనీ చాలమంది చెప్పుకొచ్చారు. పిల్లలను అమ్మ టం ప్రాయికమే లే. శ్రీమంతులు చాలమంది యీ పడుపు వృత్తినే పోషించుతున్నారు. వాళ్ళకి వృద్ధాప్యంలో జవ సత్వాలుడిగి యింద్రియ పటుత్వం లేకపోయినా కామతృష్ణ చల్లారదు. వాజీకరణం లాంటి ఔషధాలకోసం దేవులాడు తూంటారు. సాధారణంగా స్త్రీలు పసందుచేసే ఆకర్షణ వారిలో వుండదు. ఆ వృద్ధ జంబుకాలు మందభాగ్యులగు యువతుల్ని డబ్బిచ్చి కొని సర్వనాశనం చేస్తుంటారు. వారి వల్ల దోసిళ్ళాదిగా ధనం లభిస్తుందన్న మాటేగాని, ఈపాపపు వృత్తి ఆద్యంతాలు మహా భయంకరాలు. అంత కంటె పస్తులతో మగ్గి చావటమే మేలు! చూడరాదూ! నా బ్రతు కెంత నికృష్టము- పాప భూయిష్టమూనో!"

ఇలియూ మానసిక స్థితి విచిత్రంగా వుంది. వానిపై నెక్కిన కామభూతం దిగనని యెదురు తిరుగుతోంది; కాని, ఇలియూ తన వాంఛను వెలిబుచ్చ లేక పోతున్నాడు. పైగా ఆ టక్కులాడి చెపుతున్న ప్రతిమాటా నిరాశతోనిండి కర్ణ కఠోరంగా వుంది. ఆమె పొందుకు నాడెంత వేగిరపడు తున్నాడో ఆమె ధోరణి అంత తిరస్కృతిని తెల్పుతోంది. అందుచే వానికి కోపంకూడ వస్తోంది.

"దయామయూ! కరుణానిధీ! పవిత్రజననీ!" అంటూ మణిస్నా కళ్లు మూసుకొని చేతులుజోడించి ప్రార్థించుతోంది.

ఇలియా విసుక్కున్నాడు. కోపం పట్టలేక "ఒక ప్రక్క పతిత నయ్యానని వాపోతూ, నిరంతరము యీశ్వరోపాసనలో లీనమయి వుండే పరమ భక్తురాలివలె మళ్ళీ యీ భగవన్నామ సంస్మరణ దేనికి? ఏమిటీ బూటకము?" అని అడిగేశాడు.

మతిస్నా ఖేదసూచకంగా నిట్టూర్చి అధోముఖియై "నాకు నీమాటలు అర్థంకాలే" దంది.

ఇలియా లేచి నుంచున్నాడు. "తెలియక పోవడానికేముంది? నువ్వు రాత్రిం బగళ్ళు వ్యభిచరించుతూనే దేవుణ్ణికూడ తలుస్తున్నావు. ఇవి రెండూ పరస్పర విరుద్ధాలు. ఈ రెండింటికి పొత్తు యెల్లా కుదురుతుంది? ఏదో ఒకదాన్ని వదులుకోవాలి. అంతేగాని, నీతిలేని నీకు భగవద్ధ్యాన మేమిటి?" అని ఆక్షేపించాడు.

"నాబోటి పతితలకు ఆ పరమాత్మడే దిక్కు. మా కాయనకు మించి యింకెవరుంటారు స్మరించటానికి?" అంది మతిస్నా.

ఇలియాకు అరికాలి మంట నెత్తి కెక్కింది. అంతవరకు వాని నావేశించియున్న భూతం దిగి పోయింది. వాడికా మదవతి నవమానించాలన్న కోరిక కలిగింది. "అదంతా నాకు తెలియదు గాని,నీలాంటి కులటల కా పవిత్రమూర్తిని స్మరించటానికి అర్హత లేదని మాత్రం చెప్పగలను నువ్వు చేసిన పాపాలన్నిటిని దేవుని చాటున మరుగు పరచాలని

చూస్తున్నావు. ఎవడిని చూచినా తన సొదను వెళ్ళ గ్రక్కేవాడే; కాని, తన పొరుగువాడి గొంతు నులిమే టప్పుడు మాత్రం వానికి దేవుడు జ్ఞప్తికిరాడు. జీవితమంతా వంచనతోను, వ్యభిచరించీ గడిపి, చరమదశలో కంట నీరు పెట్టి చేతులు జోడించి సాష్టాంగపడి 'దేవా! కరుణానిధీ! ఈ పాపాత్ముని కరుణించు' మని ప్రార్థించుతారు. నోటి మాటలేగా! సామాన్య మానవుల కనుగ్రామినట్టే భగవం తుడిని కూడ వంచించాలనేగా మీ వుద్దేశం?" అన్నాడు.

ఈ మాటలతో ఆమెను బాగా పరాభవించానను కున్నాడు. ఇక నొక్క క్షణంకూడ ఆగక దభాలున తలుపు తెరచుకొని బయట పడ్డాడు. మతిసాన విస్మయ విస్ఫారిత నేత్రాలతో వానివంకే చూస్తోంది.

ఇలియా పైమాటలన్నీ ఒక్క మతిసాన నుద్దేశించి మాత్రమే అన్నవికావు పెట్రుహా, ఇరెన్ను ప్రభృతులను దృష్టిలో పెట్టుకొనే అన్నాడు. గడప దిగుతూ మళ్ళీ యిల్లా అన్నాడు:

"ఛండాలులారా! మీరు పరమ పాతకులు. మీ సం పర్కంలో వుండటంకూడ పాపమే. మహా పాతకం!"

12

ఇలియా పతన మారంభమయింది. కామినీ గోష్ఠిలో దిగి వేశ్యా సంపర్కంలో పడ్డాడు. బేరములో వచ్చే ఆదా వెలయాండ్ర కివ్వడానికే చాలటంలేదు. ధనాభావంవల్ల వేశ్యా తిరస్కారానికి గురి అయినప్పుడు ఈ బోగం పొత్తు బాగా లేదు. ఇల్లూ-ఒళ్ళూ కూడ గుల్లవుతున్నై. గౌరవానికా కళంకం. ఈదారి త్రొక్కి సుఖపడిన వాడెవడు; అని కుక్క దాలిగుంటలో బ్రహ్మజ్ఞాని అయినట్లు ఆలోచించేవాడు.

డబ్బు సంపాదనకు కొత్తమార్గ మేమిటాయని ఆలోచించసాగాడు. తోటి బేరగాండ్రవలె తానుకూడా అనుమతి పొంది లాటరీ వేసి, చర్ బొప్పాయి గుండులాంటి కొత్త కొత్త ఆటలు పెట్టి ధన మార్జించవచ్చు ననుకున్నాడు; కాని, ఆమోసపు వృత్తి వానికి మనస్కరించలా. ఏమయినా సరే, అల్లాంటి వృత్తిలో దిగకూడదనుకున్నాడు. పైగా పోలీసువాళ్ళ బాధ పడాలి. అసలొకరి ముందు చేతులు నలపటం వాని స్వభావానికే విరుద్ధం. ఇలియాకి పరిశుభ్రత, నిజాయతీ ప్రవర్తనలందు అతిశ్రద్ధ. యెవరితోనయినా సరే మోర పైకెత్తి, ఱొమ్ము ముందుకు చాపి మాట్లాడుతాడు. వాని మాటలలో అహంభావం తొలుకుతూంటుంది.

అయినా డబ్బు గడించాలన్న కాంక్ష వానిని వదలకుండా వుంది. ఎలాగయినా ఒక వెయ్యి రూపాయలు చేజిక్కితే దర్జాగా వ్యాపారం చేసుకోవచ్చు ననుకునేవాడు.

బందిపోటు వార్తలంటే ఇలియా చెవి కోసుకునే వాడు. దొంగలు పట్టుబడిందీ లేనిదీ తెలుసుకోటానికి ఆరాటపడేవాడు. ఎప్పుడయినా దొంగలు పట్టుబడినట్లు వింటే తన కొంప మునిగినట్లు విచారపడుతూ జాకోబుతో "తప్పించుకోనే నేర్పులేని వెధవలు అసలు చోరీ కెందుకు కెళ్ళాలో" అనేవాడు.

మరొకప్పుడు దుర్మార్గుడై, మోసకారిగా జీవించు టెంత సుఖమో. ధర్మ పథానువర్తియై నిజాయతీగా బ్రతకటం అంతే కష్టం!" అన్నాడు జాకోబుతో ఇలియా.

జాకోబు తన సహజ సరళ స్వభావంతో "నిన్న మీ తాతాయివద్ద కొక ముదిమనిషి వచ్చాడు. బాగా చదివినట్టున్నాడు అచ్చంగా ఆయనకూడ నీలాగే అన్నాడు" అని చెప్పాడు.

"ఏమన్నాడు?"

"దొంగల కత్తికి పదునెక్కువట. దేవునికి ఆగ్రహం కలిగించేవాళ్ళే సుఖపడతారనీ, భగవంతుడల్లాంటి వారికే సర్వసంపదలను సమకూర్చుతాడనీ బైబిలులో వుందని చెప్పాడు.

"నువ్వే యీ మాటలను కల్పించి చెపుతున్నావేమొ?"

"ఇవి నామాటలు కావు. అసలీ మాటలు బైబిలులో వుంటాయన్న విశ్వాసంకూడ నాకు లేదు. ఆవృద్ధుని కల్పనే కావచ్చు. నేను రెట్టించి అడిగినా తిరిగి ఆ ముక్కలే చెప్పాడు. బైబిలులో చూస్తేగాని నిజం తెలియదు. అయినా ప్రపంచ పరిస్థితిని చూస్తేమాత్రం ఆయన చెప్పినదంతా వాస్తవంగానే కనపడుతోంది." ఇలియా చెవివద్ద నోరు పెట్టి "మానాన్ననే చూడు! ఆయన భగవంతుని కయిష్టముగు పనుల్లో దేన్ని చెయ్యటంలేదు? అయినా ఆయన వైభవము వృద్ధి చెందుతూనేవుంది. ఆయన సుఖభోగాలకు లోపంలేదు, అన్నాడు జాకోబు.

"అందులో సందేహం లేదు. పేరు – ప్రతిష్టలకు కూడా కొరతలేదు. పురపాలక సంఘంలో సభ్యుడు కూడాను."

జాకోబు తలొంచుకొని చెప్పాడు—"మానవ హృదయానికి మచ్చ లేకుండా వుండాలంటే స్వచ్ఛము-నిర్మలమునైన నడత కలిగివుండాలి. కాని, మానవుడి నేటి ప్రవర్తనను గమనించితే మనస్సు చివుక్కుమంటుంది. ఇల్లాంటి సమాజంలో బ్రతుకే భారమనిపించుతోంది. పూటకూళ్ళ వృత్తి పాతకమని నా వుద్దేశం. కాని నాన్న నన్ను నిత్యము సతాయించుతున్నాడు. నేను బడుద్ధాయిలాగా తిరుగుతున్నా

నని, యికనయినా తెలివిగలిగి వ్యవహారం చూచుకోమనీ గోజాడుతున్నాడు. పైరెన్ను లేనప్పుడు బ్రాంది షాపులో నేనే కూచుంటున్నాను. ఆపని నాఆత్మకు విరుద్ధమయినా ఎల్లాగో సహించుతున్నాను. నేను స్వతంత్రుడ నయితే యీ తగులాటంలో చిక్కుకొనేవాణ్ని కాదు."

"నీకంతకంటె గత్యంతరం లేదు; ఏం జేస్తావు?" ఇలియూ సానుభూతి చూపుతూ అన్నాడు.

"జీవిత సమస్య మహా జటిలమయినది!"

"నీ యేడుపు అనవుసరము. నాజీవిత మల్లాకాదు. నీకేమోయ్! ఎప్పుడో మీబాబు ఠారుమని చస్తాడు. అంతటితో ఆయన యావదాస్తి నీకు సంక్రమిస్తుంది. తర్వాత నువ్వు కాలిమీద కాలేసుకుని కూచుని సుఖంగా అనుభవించుతావు. నేనో! కష్టాలన్నీ నాపాలు. బజానునపోతూ దుకాణాల్లోని విలాస వస్తువుల్ని చూచినప్పుడల్లా నామనసు వాటికోసం వువ్విళ్ళూరుతుంది. ఆ వ్యామోహాన్ని అణచుకోటానికి యెంతో ప్రయాస పడుతాను. ఇంక జీవితములో నాకోరికలు తీరవని నిరాశ చెందుతాను. అప్పుడప్పుడు మంచి మంచి బట్టలను చూచి కొనా లనిపిస్తుంది; కాని, చాలినంత డబ్బు లేక వ్యథ ననుభవిస్తాను. నాకా మేలు రకం దుస్తులను ధరించే యోగ్యత లేదేమోనని సిగ్గుపడ నవుతూంటాను. సుఖాలన్నీ పాపాత్ములకు, ఉచ్ఛితులకే. గౌరవ - మర్యాదలుకూడ వాళ్ళకే. వాళ్ళా దురహం

కారంతోనే. మన పైన పెత్తనం చెలాయించుతూ మిడిసి పడుతున్నారు. అదృష్టదేవత ఆదుర్మార్గులకు ప్రత్యక్షమై మనకు దూరంగా పారిపోతుంది. ఈవిపరీత మెందువల్లనో!"

"దేవుడు నిన్నా కోరికలకు దూరంగా వుంచుగాక!" అన్నాడు జాకోబు.

"ఎందువల్ల?" అనడిగాడు ఇలియా.

"నీ కోరికలకు అంతుండదు. నీ పిపాస వుపశమించేది కాదు."

ఇలియా వికటంగా నవ్వి "జర్మియా వద్ద అపహరించిన సొమ్ములో సగం నాకియ్యమని మీయబ్బతో చెప్పు. అల్లా యిప్పించినాక అంతటితో నేను తృప్తి పడేదీ, లేనిదీ చూడు! నాసంగతి నీకేం తెలుసు. నేను కాదు లోభిని, దురాశాపరుడిని; మీ నాన్నే" నన్నాడు ఇలియా నిరసన భావంతో.

జాకొబు లేచి నిదానంగా ద్వారం వేపుకు నడిచాడు. వాని తల దించుకొని పోయింది. ఇలియా మాట వాని హృదయానికి కుఠారాఘాతమై తగిలింది. అవమానంచే క్రుంగిపోతున్నాడు ఇలియా వెంటనే లేచిపోయి మిత్రుని చేయిపట్టుకొని ఆపి "ఆగు, వెళ్ళిపోతున్నావేం?" అనడిగాడు.

"ఏమీ లేదు, నన్ను పోనివ్వు" మన్నాడు. జాకోబు ఆగి, ఎండు ఇలియా కళ్ళలోకి చూడసాగాడు. ఇలియా ముఖం తెల్లబడింది.

"విచారించకు జాకోబ్! రా, కూర్చో. నేను మీ నాన్నమీద లేని అభాండం కల్పించలా. నీకు కోపం రావలసిన కారణం కూడ లేదు" అని ఇలియా జాకోబును లాక్కొనిపోయి కుర్చీలో కూర్చుండబెట్టాడు.

"చాటుమాటుగా యితరులు చెప్పుకోవటము నేనూ విన్నా"నన్నాడు జాకోబు.

ఇలియా "ఆ చెప్పుకున్నవాళ్ళు అల్లాంటి వాళ్ళే" నన్నాడు.

జాకోబు దీనంగా చూస్తూ అన్నాడు—"ఈర్ష్యలో అల్లా చెప్పుకుంటున్నారేమో ననుకున్నాను మొదట్లో; కాని వినగా వినగా నిజమే నేమోనని సందేహించాను. ఇప్పుడామాట నీ నోటినుంచికూడా విని నిజమే......"

ఇక వాని నోటినుంచి పలుకు బయటికి రాలా. ఇలియా మౌనంగా కూచుని వున్నాడు. వానికి తానే మనాలో తోచలా. ప్రక్క గోడ కవతలివైపునుంచి యేదో గల్లంతు వినపడింది.

"అబ్బ! ఈ రొదలో నిద్ర యెల్లా పడుతుంది?" అని ఇలియా విషయాన్ని మార్చాడు.

"అయితే మాత్రం తప్పుతుందీ! నేను జీవించక తప్పనట్లు నీకు నిద్ర పట్టక మానదు."

"నీకీ వాతావరణంలో సుఖ-శాంతుల్లేవు; కాని, చేసేదీ లేదు. మనందరి గతీ ఒకలాగే వుంది. అదే సంతోషకరమగు విషయము"

"ఇంతకూ అసలా సంగతి నిజమేనంటావా? అని జాకోబు వెనుకటి విషయాన్ని లేవనెత్తాడు.

"నిజమేనా అని నీకింకా సందేహ మెందుకు? నేను స్వయంగా చూశేను! అప్పుడు నీ దగ్గర్నుంచి నేను పరుగెత్తు కెళ్ళటం నీకు జ్ఞాపకం లేదూ? నేను వెళ్ళేసరికే జర్మియా గదితలుపుకు లోపల గడియ బిగించారు. నేనూరుకోలేక తలుపు సందుగుండా లోపలికి చూచాను. తాత క్రిందపడి వున్నాడు. మీ నాన్న తొందర పెడుతూంటే మా బాబాయి వూడదీసిన తలగడ దిండు కుట్లు సరి చేస్తున్నాడు. వాళ్ళ గుసగుసలుకూడ విన్నాను."

జాకోబు శిలా విగ్రహంలాగా కూచుని శ్రద్ధగా వింటున్నాడు. నోరు తెరవటానికి ధైర్యం లేకపోయింది.

ఇలియా అంతవరకు చెప్పి వూరుకున్నాడు. జాకోబు మెల్లగా లేచి దారి పట్టాడు. ఇలియా వాడిని పోనిచ్చి దడాలున తలుపు వేసి పక్క మీద పడి చింతించసాగాడు. జాకోబుపట్ల వాని కెంత సానుభూతి వుందో, పెట్రుఖా, కిరెన్నుల యెడల అంత కోపముంది. శాంత స్వభావి, సరళ హృదయుడునైన జాకోబు వంటి దుర్బల మనస్కుడు కటిలాత్ముడైన పెట్రుఖా పోషణలో యెంతోకాలం నిలువ

జాల డనుకున్నాడు. ఈ విషయాన్ని గురించి ఆలోచించిన కొద్దీ వానికి మానవ సమాజంపైన రోత కలుగుతోంది వానికందరు దుర్మార్గులు, నీచులు, పాపాత్ములుగా కన్పించారు. ఎల్లరు యేవగించుకోదగ్గవారే నని తోచింది. ఉన్న కొద్దీ వాని యాందోళన అతిశయించుతోంది. ఒంటిమీద చీమలు, జెర్రులు ప్రాకినట్లుంది. మరి పక్కమీద పడుకొని వుండలేక బయటి కెళ్ళాడు. ఆ అర్థరాత్రివేళ నిశాచరునివలె బజారుల్లో గ్రుమ్మరుతూ ద్వంద భావాలతో పోరాడుతున్నాడు.

శత్రువులు రహస్యంగా వెన్నాడుతూ తన్నగాధ సాగర గర్భంలో పడద్రోయ జూస్తున్నట్లు తోచింది ఇలియాకి. క్రోధావేశంతో మండి పడ్డాడు. "ఈ లోకమంతా చెడ్డతోనే నిండివుందా? మంచి లేనే లేదా? ఉంటే దాని చిన్నలే కనపడ వేమి? నా కెప్పుడు చెడుగే యెదురవటానికి హేతు వేమిటి? న న్నాపదల వేపుకి నెట్టుతున్న దెవరు?" యిల్లాంటి ప్రశ్నలెన్నో ఇలియా అంతరంగంలో చెల రేగినయి.

హృదయంలో రేగిన తుపాను తీవ్రతచే బాహ్యజ్ఞాన శూన్యుడై పట్టణ బహిఃప్రదేశ మందున్న చర్చిదాపులో కెళ్ళాడు. అప్పు డంబర వీధిని కారుమేఘాలు పరుగులు తీస్తున్నై. ఆ జలధారల మధ్య మధ్య నీలాకాశం కనపడుతోంది. అందు మిణుగురు పురుగుల వలె చుక్కలు తళుక్కుమని మెరసి అంతలో అదృశ్యమవుతున్నై.

చర్చిలోని ఘంటారవము నిశీథమందలి నిస్తబ్ధతను చీల్చు కుంటూ వస్తోంది. మంచు దట్టంగా కురుస్తోంది. ఆ పెంజ కటిలో మిట్ట-పల్లాలను గానక ఇలియూ తూలిపడ్డాడు. అప్పుడుగాని వానికి బాహ్యస్మృతి కలుగలేదు.. తా నెక్క డున్నదీ తెలిసికొని భయంచే గజగజ లాడాడు. మరి వెనుక ముందులు చూడక గృహోన్ముఖుడై దౌడుతీశాడు.

13

దీపాలు వెలిగించే వేళ. మంచు పడుతోంది. పాష్కా కమీజు తొడుక్కొని అన్యమనస్కుడై రోడ్డుమీద నింపా దిగా నడిచి పోతున్నాడు. ఇలియూ చూపు వానిమీద పడింది. వెంటనే గబగబా వెళ్ళి చటుక్కున మిత్రుని చేయి లంకించు కున్నాడు.

పాష్కా వెనక్కి తిరిగి చూచి "ఓహో, నువ్వా!" అన్నాడు.

"బాగున్నావా?" అని ఇలియా అడిగాడు.

"ఆఁ యేంబాగులే! మీరు?"

"బాగానే వున్నా మనుకో."

"నీ మొహం అల్లా చెప్పటం లేదే!"

"దానికేం గాని, యెన్నిసార్లు చెప్పినా నువ్వు రాకనే పోయావు."

"తీరుబడి లేదోయ్."

"నువ్వు రావాలనుకుంటే వ్యవధానమే దొరక్క పోతుందీ?"

"ఒరేయ్! నేను రాలేదు రాలేదని నెపమేస్తున్నావు. సరే గాని, మరి నే నెక్కడుంటున్నానో, ఏమి చేస్తున్నానో, యెల్లా వున్నానో, మాట మాత్రమయినా అడిగావూ?' అన్నాడు పాపా్క నిర్మొగమాటంగా.

"పొరపాటే; యీ తప్పు నావల్ల జరిగిందని ఒప్పు కుంటున్నాను

"తమాషాకి అన్నాన్లేవోయ్. నేనీమధ్య కాయిలా పడి మూణ్ణెల్లు ఆసుపత్రిలో వున్నాను. నాజబ్బు యెల్లా వుందని అడిగినవాడే లేకపోయాడు."

"అరె! జబ్బా! నాకు తెలియనేలేదే. ఏం జబ్బు!" అని ఇలియా వ్యగ్రత చూపాడు.

"చలీ, జ్వరమూ. కొంచెం తగ్గి కోలుకునేటప్పుడు ఒంటరిగా మంచంమీద పడి వుండటము మరీ కష్టమయింది. కుంటి - గుడ్డివాళ్ళలాగా పగలూ, రాత్రీ మంచంమీద పడి వుండాను. పలికేవాడు, ఉలికేవాడు లేకపోయాడు. డాక్టరు చాలామంచివాడులే. ఆయనే పుస్తకాలు తెచ్చిచ్చి చదువుకోమనేవాడు; లేకపోతే యీపాటికి పిచ్చివాడి

నయ్యేవాణ్ణి." అని చెప్పేటప్పటికి పాషా గొంతు అవరుద్ధమయింది.

"ఏం పుస్తకాలు? వైద్యశాస్త్రాలా?"

"కాదు, చాలా మంచి గ్రంథాలు. పేరు మోగిన కవుల కావ్యాలు. ప్రతి పాదము కలకండ ముక్కలాగా మధురంగా వుంటుంది. ఆపద్యాలు చదువుతూంటే కలిగే ఆనందం ప్రేయసీ పరిష్వంగంలో కూడ లభించదు."

ఇలియా "నాకిప్పుడు పుస్తకాల పొత్తే లేదు" అని చెప్పాడు.

"ఏమిటీ! నిజంగానా?" పాషా ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు.

"పుస్తకాలు చదివినందువల్ల నాకేమీ ప్రయోజనం కన్పించలా. వాటిలో వుండేది ఒకటి, లోకంలో జరుగుతున్నది మరొకటీను."

"అదే వాటి ప్రత్యేకత. నడివీధిలో నిలబడి యీ చర్చ యెందుగ్గాని, హోటల్లోకి పోదాం పద; సరదాగ కబుర్లు చెప్పుకొంటూ భోంచేద్దాము."

"అయితే పద" అని ఇలియా దారితీశాడు.

పాషా ఇలియా వెనక నడుస్తూ "మన యిద్దరికీ యెన్నడూ ఆంతర్యం లేకపోయినా నిన్ను కలుసుకొన్నందుకు చాల సంతోషంగా వుంది" అన్నాడు నవ్వుతూ.

"నన్ను కలుసుకొన్నంత మాత్రాన నీకు సంతోషం కలుగుతుందని నే ననుకోను. నా ఆలోచన యెప్పుడూ అందుకు ప్రతికూలమే; కాని,......"

పాషా మధ్యలో ఇలియా కల్పించుకొని "అల్లాకాదు మిత్రమా! నిన్ను నేను తలచుకొన్నప్పుడే సరిగా నువ్వు సాక్షాత్కరించుతున్నావు." అన్నాడు.

మిత్రులిద్దరూ హొటలులో ప్రవేశించి భోజనానికి కూచున్నారు. దీపం వెలుతురులో పాషా ముఖం పాలిపోయి వుండటము, కళ్ళు దించుకొని పోయి వికృతంగా వుండటము, చూచాడు ఇలియా. అతడే సంభాషణ ప్రారంభించాడు:

"ప్రస్తుతం పని చేసే దెక్కడ?"

"మళ్ళీ అచ్చాఫీసులోనే చేరాను."

"శక్తికిమించి పని చేయాల్సి వస్తోందా?"

"ఆ శ్రమ తనివిచార విచారాలముందు లెక్కలోది కాదులే."

ఒకానొకప్పుడు కన్ను మిన్ను గానక త్రుళ్ళిపడిన పాషా యిప్పుడు తలబిరుసు తగ్గి నిరాశతో దీనుడై వున్నందుకు ఇలియాకి సంతోషంగానే వుంది; అయితే వానికి పాషా విచార హేతువును తెలుసుకోవాలన్న ఆతురత హెచ్చింది. "కవిత్వం రాస్తున్నావా?" అనడిగాడు.

"ఇప్పుడన్నీ వదిలేశాను. లోగడ రాసిన వాటిని డాక్టరు చదివి చాలా మెచ్చుకున్నాడు. ఒక శీర్షికను పత్రికకు పంపించాడు. సంపాదకుడు దాన్ని ప్రకటించి నాకు పారితోషికం కూడ పంపాడు."

"అల్లాగా! ఏదీ, ఆపద్యాలు చదువు.''

"ఇప్పుడు జ్ఞాపకం లేవు. వెమ కేసి తెచ్చుకోవాలి. కవిత్వం రాస్తుంటే ఒక్కొక్కసారి హృదయం నీరయి కంటా నీరు కమ్ముతుంది."

"కారణం?"

"హృదయంలో ఏదో జ్వాలలేచినట్లుంటుంది. దాన్ని కాయితంమీద పెట్టాలనుకుంటాను; కాని, తగిన మాటలు దొరకవు. మనసులో రేగిన భావా లన్నిటిని పదరూపాలలో వెల్లడించడం అసంభవం. పద్యరూపంలోకి వచ్చేసరికి వాటి సారమే పోతుంది."

పాషాని చూచిన కొద్దీ ఇలియా హృదయం తరుక్కు పోతోంది. వానికి పాషాయం దిదివరకు లేని ఆదరాభిమానాలు కలుగసాగాయి. "ఒకటి రెండయినా వినిపించుమరూ" అన్నాడు.

"స్వవిషయాన్ని గురించి తమాషాకి నేనో కాగానుకవి చదవనా!''

"పోసీ, అదే చదువు."

పాషా ఒక పద్యం చదివాడు. అంతలో యేదో స్మృతి కొచ్చినట్లు వేదనపడుతూ కుర్చీలో వూగులాడ సాగాడు.

ఇలియా సంభ్రమాశ్చర్యాలతో పాషావంక చూచాడు. ఆ పద్యం పాషా రచించిన దేనని నమ్మలేక పోయాడు· "ఇది తమాషాకు రాసిందిగా లేదే. ఎంత గంభీర భావ మిమిడి వుంది! మానవుని వాస్తవిక స్థితి కళ్ళకు కట్టినట్లు చిత్రింపబడింది, నిజానికీ పద్యం నా హృదయాన్నూపి వేసింది. మళ్ళీ చదువు వినాలి."

"ఇలియా! నిజంగా నీకంత బాగుందా?" పాషా వుత్సాహంగా అడిగాడు·

"లేకపోతే నిన్ను కోడిగ మాడుతానా పాషా"

"నీవిషయంలో అల్లా అనుకోటానికి వీలులేదు. నీ వెప్పుడూ యదార్ధవాదివే. అందువల్లే నీవంటే నాకు ఇష్టం. మరి విను ఇంకోటి చదువుతాను."

పాషా చదివిన రెండోపద్యం విన్నాక ఇలియా సందేహం మరింత బలపడింది.

పాషా పద్యం పూర్తిచేసి "నాకు ఆలస్యమయి పోతోంది. కవితా గ్రనంతికి అంతేముంది? రాతపుస్తం తెచ్చి అన్నీ చదివి విన్పించుతాలే. ఇప్పుడు ఒకదాని మొదలు జ్ఞాపకం వుంటే మరొకదాని తుది అందుతుంది. ఇంకో పద్య భావం చెబుతావిను—— నేను ఒక అరణ్యంలోకి

వెళ్ళాను. అక్కడ దారి తప్పాను. ఆ కీకారణ్యంలో అంధకార బంధురంగా వుంది. దరి-దాపుల్లో నరసంచారం లేదు. తెన్ను తెలియక నా దురదృష్టాన్ని నిందించుకో సాగాను! దీనికి తరువాయి కూడ వుందిలే" అన్నాడు.

"ఏం చక్కని భావం! అద్భుతంగావుంది. జీవిత రహస్యమంతా యిమిడివుంది. మానవుని బ్రతుకు అల్లాగే వుందిగా. దారి కనపడదు. యెటుచూచినా అగమ్య గోచరంగా వుంటుంది. వెలుగు చిన్నెలయినా కనపడవు. మార్గాన్ని కనుక్కోవడమె దుస్తరము" అన్నాడు ఇలియా.

పాష్కా లేచాడు. ఇలియా చేయిపట్టుకొని "నేనిక పోవాలి. నువ్వు కూడ లేచి రా, కొంత దూరం కలిసి వెళ్ళొచ్చుగా" అన్నాడు.

"వెళ్దాం గాని. నువ్వు చదివిని పద్యాలు చాలా బాగున్నై; అవి నీ రచనలేనని నాకు విశ్వాసం కలగటం లేదు; కాని, నిన్ను నమ్మకుండాను లేను."

"ఓశ్, అదా సంగతి; రాత ప్రతి తెచ్చి చూపిస్తాగా; అప్పుడే నమ్ముదువుగానిలే."

"నిజంగా వాటి రచయితవు నువ్వే అయితే నిన్నెంతగా కొనియాడినా తనివి తీరదు పాష్కా! ఆదర్శ జీవితాన్ని గురించి రాసిన దేదయినా ఒకటి చదువు, వెళ్ళి పోదాము."

"ముందు నన్ను ఆదర్శంగా జీవించడం అలవాటు చేసుకోనీ. ఆతర్వాత యెన్నయినా రాసేస్తాను. అప్పుడైనా సుషుప్తిలో వున్నవాళ్ళని లేపకూడదు."

"అల్లాకాదు, తప్పకుండా వాళ్ళని లేపవలసిందే. వాళ్ళ కాళ్లు లంకించుకుని యీడువు."

"కొందరు మితిమీరిన డాబు - దర్పాలతో విర్రవీగుతూంటే, మరికొందరు......"

"అది ఆలోచించాల్సిన విషయమే. అందరూ పరబ్రహ్మ స్వరూపాలే మళ్ళీను!" అన్నాడు ఇలియా వుత్సాహంగా.

"ఇవతలి పుల్ల నవతల వెయ్యనివాళ్ళకు సర్వభోగాలు, రెక్కలు ముక్కలు చేసుకొని శ్రమ పడేవారికి పొట్టకూటికయినా గతిలేకపోవటం యెంత అన్యాయం! దాన్నే సమాజ ధర్మమంటారు మన పెద్దలు!"

"అందరూ దేవుని బిడ్డలే; మరి సమాజంలో యేమిటీ హెచ్చు - తగ్గులు! అంతా మోసం!"

"నేను బాగా చదువుకోలేదే అని యిప్పుడు చింతిస్తున్నాను."

ఇద్దరూ యిల్లాగే మాట్లాడుకొంటూ నడుస్తున్నారు. పరస్పరభావాలు కలుస్తున్నందున యిద్దరు హుషారుగా వున్నారు.

"ప్రజ లిప్పుడిప్పుడే యీ వాస్తవిక విషయాలను గ్రహించుతున్నారు." అన్నాడు పాష్కా.

"ఈ హెచ్చు తగ్గుల సమాజ మింకెన్నాళ్ళో నిలవదు." అన్నాడు ఇలియా.

"ఎంత హాస్యాస్పదమో చూడు! కుల వంశాలెంత హీనమైనవయినా సరే చేతినిండా డబ్బుండి సభ్యసమాజంలో తిరిగితే చాలు, గొప్పవాడయిపోతాడు!"

"ఎన్ని వున్నా డబ్బులేనివాడు దుబ్బుకు కొరగాడు"

ఎదురు దెబ్బ తగిలి ఇలియా ఒరగబోయాడు.

దారిని నడవమన్నాడు పాష్కా.

"అరె! మాటల గొడవలో నేనుకూడ నీవెంట బడ చాల దూరం వచ్చేశానే!" ఇలియా ఆగిపోయి అన్నాడు.

"అయితే యేంలే. ప్రొద్దున్నే వెళ్ళొచ్చు; నాతో రా."

"మన జీవిత వాహినులు భిన్నముఖాలుగా ప్రవహించుతుంటే యిద్దరికి ఒకే మార్గం యెల్లాసరిపడుతుంది?" అన్నాడు ఇలియా పాష్కాని వదలిపెట్టి పోవాల్సివచ్చిందే అని.

"నే నక్కడికి పోయితీరాలి. పోనీ నువ్వుకూడా వస్తా" అని పాష్కా మరోసారి ఆహ్వానించాడు మిత్రుణ్ని

"సరే, పద" అని ఇలియా పాష్కా ననుసరించి నడుస్తూ "అయితే నువ్వుండేది యెక్కడ? వెళ్ళక తప్పదన్నావు; యెవతెకయినా అంటుపడలేదుగద? అనడిగాడు.

"మరదేనోయ్ వ్యవహారం! 'సిదోరిహా'లో ఒక యువతి వుంది. చాలా మంచిదిలే. రూపసికూడాను. నువ్వు చూచావంటే దంగయిపోతావు. డాక్టరువద్ద మంత్రసానిగా వుండేది, పుస్తకాలకోసం నేనాయన ఇంటికెళ్ళినప్పుడు చూచి కన్నుగీటాను. చూపులో చూపు కలిసింది. ఇంకేముంది, యిద్దరి హృదయాలు కలిసాయి. నేను చేతులు చాచాను. ఆమె వచ్చి నా బాహువుల్లో వాలింది. ఇప్పుడు కామె లేని జీవితమే నిరర్ధక మనిపిస్తోంది. ఆమె నాహృదయ జ్యోతి. నాప్రాణంలో ప్రాణం!"

పాష్కా తన ఆత్మకధను చెపుతూంటే ఇలియా కుతూహలంగా వింటున్నాడు. పాష్కా యింకా చెపుతూనే వున్నాడు.

"ఒక పర్యాయం మేమిద్దరము ముద్దులాడుతూండగా డాక్టరుగారి భార్య చూచింది. ఆమె స్వభావసిద్ధగా మంచిదేగాని, సంసారుల యింట్లో సరాగాలేమిటని మా మీద కోపించింది. మేరీ వేరా - ఇది ఆచిగురుబోడి-అంటే నా ప్రేయసి పేరు-ను వెళ్ళగొట్టింది. నన్నుగూడ తమ గడప తొక్కవద్దని చెప్పేసింది. నౌకరీ ఊడిపోవటంవల్ల వేరా నామెడకు తగులుకుంది. అప్పట్లో నేను నిరుద్యోగినే. దగ్గర వున్నమట్టుకు వస్తువులన్నీ తెగనమ్మి తిన్నాము.

అతర్వాత ఆకలితో అటమటించి పోయాము. ఆ స్థితిలో ఒకనాడు వేరా నాతో చెప్పకుండా పారిపోయింది. రెండు వారాలు వరకూ అయిపూ—అజా లేదు. తదుపరి ఒక రోజున వేరా సిల్కు—చీర - జాకెట్టూ సింగారించుకొని కొంత డబ్బుతో సహా కులుకుతూ వచ్చింది వేరా వాలకము, ప్రవర్తనా చూచి, నా రక్తం వుడికిపోయింది. ఆ నాడామె వొళ్ళు హూనంచేసి మరీ వదలి పెట్టాను.

"ఆమె మళ్లీ వుడాయించి వుంటుంది." అన్నాడు ఇలియూ.

"ఆమె నన్ను విడిచిపెట్టిపోతే యెప్పుడో ఆత్మహత్య చేసుకొని వుండేవాణ్ని." అన్నాడు పావ్కా—అతి ధీమాగా.

"అయితే అన్నిదెబ్బలూతిని యింకా నీతోనే వుంటోందా?" అనడిగాడు ఇలియూ.

"తన్నొక్క—సారిగా చంపేసినా యిష్టమేనటగాని, చెయ్యి చేసుకోవద్దని బ్రతిమాలింది. నాకు తానుకూడ భారమయినందువల్లనే గత్యంతరం లేక డబ్బుగడించటానికి పెడతోవ తొక్కిందంది. తన హృదయాన్ని మాత్రం యింకెవరికీ అమ్ముకోనని చెప్పి కన్నీరు మున్నీరుగా యేడ్చింది."

"మరి నువ్వేమన్నావు?"

"బుద్ధికి తోచినట్లు చేశాను. తిట్టాను; కొట్టాను. ఇంకేంచేస్తాను? ఆమెకి తిండి పెట్టేందుకైనా నా వద్ద రాగి దమ్మిడీ లేదాయె?"

"మళ్లీ మంత్రసానిగా పని చెయ్యడం ఆమె కిష్టం లేదా? "ఇలియా అడిగాడు.

"ఏమో! నేనా సంగతి అడుగనూ లేదు, ఆమె చెప్పనూ లేదు. నా ఒక్కనితో నే వుంటే తన బరువేకాక, పుట్టే సంతానంకూడ నాకు భారమవుతుందట. తనకు స్వేచ్ఛనిస్తే తన భారంగాని, సంతాన బాధగాని నాకుండ దనీ, కేవలం డబ్బుకోసం వ్యభిచరించినా తాను నన్నుదప్ప అన్యుని ప్రేమించననీ నొక్కి నొక్కి చెప్పింది."

"ఊఁ హుఁ, అయితే జాణయే నన్నమాట!"

పాష్కా వెనక్కితిరిగి ఇలియా కభిముఖుడై" కాని, —ఇలియా!— నా ప్రియవేరా యితరులను ముద్దుపెట్టు కొంటోందని తలచుకొన్నప్పుడు హృదయం దహించుకొని పోతోంది; కాని, యేంచెయ్యను?" అన్నాడు.

"అయితే నువ్వామెను వదిలెయ్యరాదూ?" అన్నాడు ఇలియా.

పాష్కా మౌనందాల్చాడు.

అంతలో వారొక యింటి ముందాగారు. ఇంటి చుట్టూ ప్రహరీ గోడవుంది. పాష్కా మెల్లగా తలుపు తట్టాడు.

పాషాకా తలుపుకొట్టి యువతికొచ్చి "ఈ యిల్లొక సత్రంలాగుంటుంది. ఇందులో వేరాలాంటి జవరాండ్రింకా వున్నారు. గృహయజమాని పేరు సిదోరిహా. అతడే అందరికి

తిండి, బట్ట నిస్తాడు. ప్రతి ఒకతె వద్ద నెలకు నూరురూపాయలు పుచ్చుకుంటాడు. ఎవరిపైనా యెల్లాంటి నిర్బంధమూ లేదు. ఏ పడుచుగాని యథేచ్ఛగా సంచరించవచ్చు, ప్రస్తుతం యిక్కడ నలుగురు మాత్రమే వున్నారు. అందరికి తగినంత రాబడి వున్నది. పదినుంచి పాతిక రూపాయల వరకు రోజువారీ రేట్లు వుంటయి." అని ఇలియా చెవిలో చెప్పాడు.

"నీ తాలూకూ ఆమె రేటెంత?" అనిడిగాడు ఇలియా.

"నా కాసంగతి తెలియదుగాని, వేరాది గిరాకి జేరమే అయివుంటుంది."

లోపట్నుంచి "ఎవరారు?" అని యెవరో అడిగారు.

"నేను, పాష్కాని"

తలుపు తెరువబడింది. ఒక ముసలామె ముందుకొచ్చి "రా, నాయనా!" అని పాష్కా నాహ్వానించింది. పక్కనే ఇలియాను చూచి "ఇంకెవ్వరో వున్నారే?" అంది.

"నా స్నేహితుడేలే" అని పాష్కా గమిడి యెక్కుతూండగా "ఎవరా వచ్చింది?" అని లోపలినుంచి ఒక కోకిల కంఠం అడగటం వినబడింది.

"వేరా [illegible]" వృద్ధాంగన సత్రి పల్కింది. ఈ మాటలు విని వేరా తనగదితలుపు తెరచుకొని వచ్చింది. ఆ జవ్వని పాష్కా భుజంమీద చెయివేసి "ఇవాళ యింత ఆలస్యం చేశావేం? ఎక్కడి కెళ్లావు?" అనడిగింది ప్రేమ పూర్వకంగా.

పాష్కా నడుస్తూనే ఇలియూను చూపుతూ చెప్పాడు— "ఈయన నా బాల్య స్నేహితుడు. పేరు ఇలియా లూనఫ్. దారిలో యీయన కనపడ్డాడు. అందు వల్లనే ఆలస్యమయింది. వేరా గౌరవ పురస్సరంగా ఇలియాకు నమస్కరించింది. తగులబడిన తోటలో మిగిలి వున్న పచ్చని చెట్టును చూచినట్లు వేరా ఇలియావంక చూడసాగింది.

వేరా వారిద్దరిని తోడ్కొని గది ద్వారం వద్దకు వెళ్ళగానే ప్రక్కకు తప్పుకొన్నది. పాష్కా గదిలోకి వెళ్ళాడు. వేరా నవ్వుతూ "మంచి మర్యాదస్తుడివే. ముందు అతిథుల్ని ఆహ్వానించాలా, మీ మట్టుకు లోపలికి చొర బడాలా?" అంది.

పాష్కా కూడా నవ్వి "ముందుగ రావటానికి ఆయన కిష్టముంటేగా! మధువు వెంటబడ్డ భ్రమరంలాగా నీవెంటే వున్నాడుగా?" అన్నాడు.

"మీ స్నేహితుడు అంటున్నది నిజమేనాండి?" అని వేరా ఇలియా వంక చూస్తూ కిలకిలా నవ్వింది.

"నీ చక్కదనం నాకు మతి పోకుండా చేస్తున్నమాట నిజమే" నన్నాడు ఇలియా.

"ఏయ్, వేరా! నువ్వీయన్ను ప్రేమించావా నీ పీక నొక్కేస్తా సుమా!" అని పాష్కా పకపకా నవ్వాడు.

తన ప్రియురాలి సౌందర్యం ఇలియాను ఆకర్షించి నందువల్ల పాషా పొంగిపోయాడు. వేరాకి కూడ తన అందం పైన అభిమానం కలిగింది. ఆమె పెదాలమీద చిర్నగవు చిందులు తొక్కుతోంది. పల్చని జాకెట్టును పగలదీసు కొస్తోన్నట్టున్నాయి ఆమె వక్షోజాలు. పసిబిడ్డ అద్దంలో పాపని చూచి కేరింతలు కొట్టినట్లు వేరా తన రూపానికి తానే మురుసుకొంటోంది.

ఇలియా ఈర్ష్యతో నలువేపులా చూస్తున్నాడు. అప్పుడు పాషా ఒక పద్యం చదివాడు.

"ఎంత మధురంగా వుంది!" అంది వేరా ఆనందంతో.

"ఈ మాధుర్యానికేంగాని, వేరా! ఆయన్ను చూడు! ఇప్పుడే కొలిమిలోంచి బయట పడ్డట్లు మెల్లా వుడికి పోతున్నాడో!" అని పాషా ఇలియా వంక చూస్తూ "మిత్రమా! గుటకలేస్తూ యీమెవంక చూస్తే యేంలాభం? నువ్వుకూడ ఒకదాన్ని చూచుకో!" అన్నాడు.

వేరా ఇలియా కళ్ళలోకి చూచి "నాకంటె సొగసుకత్తెనా?" అని పరియాచకమాడింది.

ఇలియా నవ్వి "నీకంటె అందగత్తె యింకెవరు?" అన్నాడు.

"మీరు చూడకుండానే అల్లా అనడం న్యాయమేనా?"

పాషా ఇలియా వంక భావయుక్తంగా చూచి "మా నాడికి కథంతా తెలుసులే. నా అదృష్టంకొద్దీ నువ్వు దొరికావు; కాని, నీ ప్రవర్తన తలుచుకుంటే మాత్రం నాకు భరించరాని వేదన కలుగుతోంది. వెయ్యి తేళ్ళొక్కసారిగా పొడిచి నట్టుంటుంది" అన్నాడు.

"పో నిద్దురా! ఆసంగతి యిప్పుడెందుకు మర్చిపొమ్మంటేను?" అంది వేరా తలొంచుకొని.

వేరా ముఖంలో పొడకట్టిన దైన్యాన్ని ఇలియా గమనించాడు. ఆమె యింకా చెపుతూనేవుంది- "ఒక్కరోజే కావచ్చు; నేను మాత్రం నీ దాన్నే. నాకూ ఆ విషయం దుస్సహంగానే వుంది. అయితే యేం చేయగల్ను? సుఖ దుఃఖాలు రెంటినీ నేనొకేసారిగా అనుభవించా లనుకోవటం లేదు. దుఃఖాన్నీ, వేదన నేను ఒంటరిగానే అనుభవిస్తాను. సుఖానందాలను మాత్రం నీతో కలసి పొందాలని నా కోరిక.

పాషా మౌనంగా ఆమె మాటలు వింటున్నాడు.

ఇలియా వాళ్ళిద్దరికీ పూరటకల్గించే మాట చెప్పదలచి యినా అందా మనుకున్నాడు. "మీరిద్దరు యిల్లా అనుకొంటే యేం లాభం? నావద్ద డబ్బే వుంటే మీ చేతుల్లో పోసి సుఖంగా బ్రతకండి. ప్రేమజీవులగు మిమ్మల్ని చూచి నేను ఆనంద మనుభవించుతా నని చెప్పేవాణ్ని. మీరు పరస్పరం ప్రేమించు కొన్నారు. వాస్తవిక ప్రేమ అంటే మీదే. నాకు సర్వత్ర కృత్రిమత, పాపమే కన్పించాయి."

ఇలియా ఆవేశ భరితుడయ్యాడు. ఏదో అవ్యక్త ఆందోళిత హృదయుడయి కుర్చీలోనించి లేచి పచారు చేయసాగాడు.

వేరా కృతజ్ఞతా దృష్టితో వాని వంక చూస్తోంది. పాష్కా నవ్వుతూ తరువాత యేమి టన్నట్లు చూశాడు.

ఇలియా చెప్తున్నాడు—"నే నింతవరకు యిల్లాంటి అపురూప సౌందర్యాన్ని చూడనేలేదు. మీలాగా పరస్పరం నిష్కల్మషంగా ప్రేమించుకోవటం కూడా చూ చెరుగను. పాష్కా! ఇప్పుడు నా హృదయంలో యేముందో చెప్పనా? నీ అదృష్టాన్ని చూచి నా కీర్ష్య కలుగుతోంది. మిమ్మల్ని చూచి సంతోష-విషాదాలు రెండూ నా కొకేసారి కల్గుతున్నాయి. సర్వేశ్వరుడు తన కరుణా దృష్టిని మీపైన ప్రసాదించుగాక! ఈ సందర్భంలో నేనొక విషయం చెప్తాను, వినండి—కేవలం కురూపి అయినంత మాత్రాన యే వ్యక్తినీ అసహ్యించుకో కూడదు. సర్వమానవులు ఆ దేవ దేవుని సంతానమే ననీ, భగవంతుడు తన సృష్టిలో లోటు చేయడు కాబట్టి, అందరిని సౌందర్యవంతులుగానే సృజించుతాడనీ మరువరాదు."

"నువ్వు చెప్పింది వాస్తవమే" నన్నాడు పాష్కా.

"మీరూ ఆ ప్రేమ జీవుల్లో ఒకరేగా" అంది వేరా.

"నాకా అదృష్టం లేదు......" అని నిటూర్చి

"ఒక కప్పు టీ యిద్దూ" అంటూ ఇలియా కుర్చీలో కూల బడ్డాడు.

ఇలియా మాటలతో పాషా హృదయం ఆనంద సందోహమయింది. అప్పుడు వాని ముఖం వుజ్వలంగా వుంది. కళ్ళు మెరుస్తున్నాయి. మంచం మీదినుంచి దిగి అటూ యిటూ నడయాడుతున్నాడు. భావావేశంతో యిల్లా అన్నాడు—

"ఈ సమాజాన్ని పూర్తిగా అవగాహన చేసుకొనే టంతవరకె యెవరికయినా యీ లోకంమీద మోజుంటుంది. ....నిన్నుకూడ యిక్కడికి తీసుకొని రావడం మేలే అయింది. నాకు చక్కని తోడు దొరికావు."

వేరా ఇలియా నుద్దేశించి చెప్పింది— "పాషా స్థితి యెప్పుడూ యింతే. ఇంద్ర ధనుస్సులాగా మెరుస్తాడు. మళ్ళీ అంతలోనే ఆలోచనలోపడి దిగులు పడుతాడు."

"విచారపడితే యేం ప్రయోజనం?"

తరువాత వేరా తేనీరు తెచ్చింది. ముగ్గురూ తాగారు. అందరికీ వుషారెక్కింది. ముఖాలు ఆనందంలో కళకళ లాడుతున్నై.

"వేరా! నేనుకూడ రావచ్చా?" అని బయటనుండి యెవరో అడిగారు.

"రా" అంటూనే లేచెళ్ళి వేరా తలుపు తీసింది. ఒక చక్కని చుక్క లోపలికి వచ్చింది. "ఈమె నా స్నేహి

తురాలు లీసా" అని వీరా ఆ వచ్చిన యువతిని ఇలియాకి పరిచయం చేసింది.

గుమ గుమ లాడుతూ వచ్చిన ఆయువతిని ఇలియా తలెత్తి చూశాడు. ఒకక్కపల్చగా వుంది. కురులు మోకాళ్ళు దాటుతున్నై. ఒచ్చీ రావటంతోనే "ఒంటరిగా వుంటే యేమీ తోచలే దక్కా! మీరు మాట్లాడుతూంటే కాస్సేపయినా కాలక్షేప మవుతుందని చక్కా వచ్చాను. ఇక్కడ ఈయన ఒక్కడే కూచున్నాడే? (ఇలియాతో) ఏమండీ! నేను కూర్చోనా మీ సరసని?" అంది కొత్తన్నా లేకుండా.

లీసా కుర్చీని ఇలియా దగ్గరకి లాక్కొని కూచుంది. అతనేమీ మాట్లాడకపోయినా మళ్ళీ తానే యిల్లాఅన్నది. "వాళ్ళిద్దరూ సరస సల్లాపా లాడుకుంటూంటే మీరు వాళ్ళ మొహాలు చూస్తూ కూచున్నారా? పాపం! మీకెవరూ జత లేకపోయూకు కామోను!"

ముక్కూ - మోహం మెరుగని ఒక పడుచు మొక్కొరికమయినా లేకుండా తనతో ఆవిధంగా మాట్లాడుతూంటే ఇలియా విస్తుపోయూడు. ఇక మాట్లాడకపోతే మర్యాదగా వుండదని "వీరిద్దరితో మాట్లాడుతూంటే నాకు బాగానే కాలక్షేప మవుతోంది" అన్నాడు.

"చిత్రంగా వుందే! అయితే మీరు ఒట్టే తమాషా మనిషన్నమాట. (వేరా వేపుకు తిరిగి) నిన్న నేను 'నర్గిస్

చర్చి' కెళ్లావక్కా! అక్కడ బోధకురాలుగా వున్నామె యెంత చక్కని దనుకున్నావు! ఆవిడ అందులో చేరినందుకు నేను చాలా విచార పడ్డాను.'' అన్నది లీపా.

"నేనయితే విచారించను లీపా!''

"అల్లా అంటే యెవరు నమ్ముతారు?''

లీపా పైట చెంగు నుంచి గుమాయించుతున్న పరిమళంతో ఇలియా మైమరచి వారి సంభాషణ వింటున్నాడు. లీపా నెమ్మదిగా మాట్లాడుతోంది. వినేవారి నిట్టే ఆకర్షించగల మాధుర్యముందామె స్వరంలో.

"పోలటోవ్ ను రానిద్దామా, వద్దా అన్న సమస్య నాకింకా తెగలేదక్కా!''

"అందులో వకరు చెప్పేదేముంది? నీయిష్టం'' అంది వేరా.

''ఆయన నిప్పుడే తగిలెయ్యకూడదనిపిస్తోంది. ఆయన ముసిలాడే; గాని, బాగా డబ్బున్నవాడు. అయితే పరమ లోభిలే. చెయిజారి రానటం మహా కష్టం. ఇప్పుడు నా పేర నాలుగు వేలు బాంకిలో వేసి నెలకి నూట యాభై రూపాయ లిమ్మంటున్నా. ఆయన వందకు మించి యివ్వనంటున్నాడే.''

"ఈ సొదంతా నాతో చెప్పటమెందుకే? నువ్వే ఆలోచించుకో.'' వేరా విసుగ్గా అన్నది.

"పోనీలేవే అక్కా!" అని మొహం ఇలియా వేపుకు తిప్పుకొని "మీ కళ్ళెంత పెద్దవండి! తొణక్కుండా బెణక్కుండా ముంగిలా కూచున్నారేం? పలుకే బంగారమా" అంది లీసా.

ఈ లయ తన్ను వల్లో వేసుకోటానికే ననుకున్నాడు ఇలియా. "ఏముంది మాట్లాడ్డానికి?" అన్నాడు వెక్కసంగా.

లీసా నిరుత్సాహపడలా. "ఏమీ లేకపోతే మీరాలోచించేదేమిటి? పోనీ మీరేంచేస్తుంటారో చెప్పండి."

"వీధుల్లో చిల్లర వస్తువు లమ్ముతూంటాను."

"అల్లాగా! ఏ బ్యాంకులోనో, దుకాణంలోనో గుమాస్తా అయివుంటారేమో ననుకున్నానండి! మీ సీటు చూచి అల్లా అనిపించింది."

"సీటో—గోటో పరిశుభ్రతగా వుండడం నాకిష్టం."

"అది మంచి పద్ధతేలెండి. సరే గాని, మీకు కించిత్తైనా వివేకం ఉన్నట్టు లేదే."

"నీ ఉద్దేశం!"

"ఒక ఆడుదానివద్ద యిద్దరు మగాళ్ళు. ఇది సమంజసంగా వుందీ?" అని లీసా పరిహాసం చేసింది.

"అల్లాగా! అయితే నేనిప్పుడే వెడుతున్నాలే." అని ఇలియా లేచాడు.

"ఆగండి, ఇందాకటినుంచి లేంది యిప్పుడంత తొందరేం" అని లీసా ఇలియా చెయ్యట్టుకొని వేరా నడి

గింది— "ఈయన్ను నా గదిలోకి తీసికెళ్ళనా అక్కా?"

వేరా నవ్వి "ఆయన వస్తానంటే నేను వద్దన్నానా? తీసుకెళ్ళు పిల్లా!" అంది

ఇలియా "ఎందుకూ?" అనడిగాడు.

"ఆమె కొంగు పట్టుకొని వెళ్ళవోయ్, నీకే తెలుస్తుంది!" అన్నాడు పాషా నవ్వుతూ.

ఇలియా కళవళ పడ్డాడు. అతను తటపటాయించుతూంటే లీపా లాక్కొని పోతోంది. దారిలో "మీకి దే మొదలల్లే వుంది. సిగ్గుగా వుందా? పర్వాలేదులే. నా వెంట రండి; అన్నీ నేర్పుతాను. నాకు వెనకా ముందూ యెవరూ లేరు. (పైన చంద్ర బింబాన్ని చూపి). ఆ చందమామని పట్టుకోవాలన్నా యెగిరి పోతాను. నన్ను నద్దనే వాళ్ళెవరూ లేరు. ప్రాణం పోయినా నాకు లెక్కలేదు." అని చెపుతూ లీపా ఇలియాను వొరుసుకొని నడుస్తోంది.

ఇలియా మారు పలక్కుండా ఆ జవ్వని ప్రక్కను నడుస్తున్నాడు. ఆమె మాటలు అతనికి విన్పించటమే లేదు. ఆ సుందరి తనూలత స్పర్శతో పరవశు డయ్యాడు. ఆమె తీయని తేనె పలుకులతో ముగ్ధుడయ్యాడు. ఆ తలిరుబోణి చూపులు వాడి తూపులయి సమ్మోహితుని గావించునై. ఆ విలాసిని పూసుకొన్న సెంటు-అత్తర్ల సువాసనలతో ఇలియా గుమ్మెక్కి పోయాడు.

14

ఆ ఆకస్మిక సమాగమము ఇలియాకెంతో సుఖదాయక మనిపించింది. వాని కళ్ళముందు జరిగిన ఘటనల కారణంగా ఇలియా హృదయములో పడిన వేదనా పూరిత గాయాని కది పట్టీ లాగా పనిచేసింది. సర్వాంగ సుందరి యగు పడుచొకతె సర్వస్వము తన కర్పించుట గాంచి ఇలియా హృదయ మభిమాన భరిత మయింది. లీపా అను రక్తితో అత డానంద సాగర మందు మున్కలు వేయసాగాడు.

ఇలియా తలమీద చేతితో నిమురుతూ, పెదవు లాని లీపా అన్నది— "ప్రియా! నిన్ను చూచేకొద్దీ నా అనురాగం అతిశయించుతోంది. నీ హృదయము నిర్మలము, నిశ్చలమూను. నీవు స్వేచ్ఛా స్వభావివి. నా కా గుణమం దత్యంతాభిమానము. మన యీ సన్నివేశ మింతకు పూర్వమే తటస్థమయి వుంటే, నేను నిన్ను పెళ్లాడి దేశ దేశాలు పరిభ్రమించుచూ జీవితానందాన్ని అనుభవించేదాన్ని.

ఇలియా ఆమెను మనసార ప్రేమించాడు. ఆమె సరళ స్వభావము వానికి పూర్తిగా సంతృప్తిని కలిగించింది. లీపా ఆ పతిత జీవితంలోకూడ తన ఆత్మ గౌరవాన్ని

కాపాడు కుంటోంది. వయసుకు చిన్నదే అయినా అను భవంలో జాణ. అన్య వారకాంతల వలె అసభ్యంగా ప్రవ ర్తించేది కాదు. కండ ఆట్టే లేకపోయినా గట్టి శరీరం. స్వరం మధురమై శ్రావ్యంగా వుండేది. స్వభావ ముదా త్తము. నీటుగా వుండటం ఆ యెలనాగ అభిమాన గుణా లలో ఒకటి. పనిముట్లు దగ్గిరా వస్తువు లెక్కడెక్కడ వుండాలో చక్కగా సర్ది గదిని గలీజుగా లేకుండా ఆకర్షణీ యంగా వుంచేది. ఆమెకి నిగ్రహశక్తి కూడ మెండే; కాని, ఒకొక్కప్పుడు జుట్టు చెదరి, ముఖం యెలా తెలా పోయి, కన్నులు కాంతి దప్పి వుండేవి. అల్లాంటప్పుడామె మూర్తిని గాంచి ఇలియా హృదయము కరుణా ప్రపూరిత మయ్యేది. ఆమె నప్పుడు పల్కరించటానికే వెరిచేనాడు.

ఆమె ఇలియా మనోభావాన్ని కనిపెట్టి తన మొహాన్ని చేతుల్లో కప్పుకొని వేరా గదిలోనుంచి మంచినీళ్ళో, యేదో తెచ్చిపెట్టుమని వంక పెట్టి అక్కడినుంచి పంపించేసేది.

వేరా ఇలియా మ్లాన ముఖం చూచి అతని కెల్లా గైనా సంతోషం కల్గించాలన్న తలంపుతో నవ్వుతూ, ప్రేలుతూ మాట్లాడేది. వేరా ఒకసారి "అప్పుడప్పుడు నీ హృదయాని కేదో దెబ్బ తగులు తున్నట్టుందే?" అనడిగింది.

"మీ మనసు మంచుగడ్డ లాంటిది. చిన్నగవు చిందు లతో కరిగి పోయేదేగా!" అన్నాడు ఇలియా.

"అమ్మ దొంగా! మీరిద్దరూ బలే మోసగాళ్ళే నే!"

ఈ విధంగా యిద్దరూ చాల చనవుగా వుండేవాళ్లు. ఇలియాకు వేరాయందు వల్లమాలిన అభిమానం. ఆమె స్థితి కతను జాలి పడేవాడు. పాషా- చీటికీ-మాటికీ కీచులాడుతున్నందుకు బాధ పడేవాడు ఇద్దరి మధ్య తాను చేరి వాళ్ళని సమాధాన పరిచేవాడు. వేరా తలంటు పోసుకొని జుట్టార బెట్టుకొంటున్నా, పాడుతున్నా, కుట్టుకొంటున్నా ఇలియా యెదురుగా కూచుని రెప్పలు వాల్చకుండా ఆమె ముఖా న్నవలోకించు తూండేవాడు. అప్పట్టున వానికి కలిగే ఆనందం వర్ణనాతీతం. ఆమెముఖాన విషాద చిన్నె లగపడినా, నవ్వులో వుదాసీనత తొలికినా ఇలియా హృదయం తపించేది. ఆమెని అనునయించేందు కెన్నెన్నో తంటాలు పడేవాడు.

"సోదరా! ఈ నికృష్ట జీవిత మెన్నాళ్ళని గడుపగలను? చుక్కాని లేని నా జీవిత నౌకని అగాధ సాగర తరంగాల్లో వదిలేశాను. అది తెలిసిన్నీ పాషా నాతో పాటు మునిగి పోటానికే సిద్ధ మవుతున్నాడు యెందుకో?" అన్నది వేరా ఒకప్పుడు ఇలియాతో.

"మునిగినా, తేలినా నిన్నొదల కూడదనే వాని వాంఛ" అన్నాడు ఇలియా.

"పాషా- నిజంగా నాయం దంత అనురాగంతో వున్నా డంటావా?"

అని వేగా అనుకుంటూండగానే లీసా వచ్చింది. ఇద్దరూ మౌనముద్ర వహించారు. లీసా ఇలియా చెయ్యి పట్టుకొని తీసికెళ్ళింది. ఇలియా లీసా వెంటబడి వెళ్తూ 'ఒక గంట క్రితం నేను చూచిన ఆ దీనమూర్తేనా ఈబిడ! యింతలో యెంత మార్పు!? అనుకున్నాడు.

మరొకప్పుడు లీసా ఇలియాతో "నువ్వు సామాన్య రైతుబిడ్డ వైపోయావు! విద్యావంతుడివి కాదే అని నేను కించ పడుతున్నాను. మన యీ జీవితము యేం జీవితము! నువ్వు పెట్టె బేరం మానేసి యింకేదైనా వృత్తిలో ప్రవేశించు; లేకపోతే యేదయినా వుద్యోగం సంపాదించు. సీక్షిప్రమైతే పోలటోవు నడిగి చూస్తాను" అని చెప్పింది.

"వాడు నీకిస్తానన్న ఐదు వేలు యిచ్చాడూ?" అని అడిగాడు ఇలియా.

"ఇంకా చేతికి రాలేదు గాని, యిస్తాడని నమ్మకం వుంది."

"నా కెప్పుడయినా తారసిల్లితే వాడి నేం చేస్తానో చూడు!"

"నీ కాయన యేం చెరుపు చేశాడు?"

"ఏం చేశాడా? ఇంకేం చెయ్యాలి? వాడు నా లీసా..."

లీసా మధ్యలో ఆపి "ఎంత పిచ్చివాడివి! ఆయన శరీరం కృశించి, జవ-సత్వా లుడిగిన ముసలి తొక్క! నీ కెందు కంత కచ్చి?" అంది.

"ఏమైనప్పటికి వాడు నీ వద్దకు రావడం నేను సహించలేను. వాడి ప్రాణం తీయకుండ వదల్ను. ఆ వృద్ధ జంబుకాన్ని చంపినా పాపం వుండదు" అన్నాడు ఇలియా కోపంతో పళ్ళు పటపట నూరుతూ.

"నన్ను డబ్బయినా గుంజుకో నియ్యి" అని లీపా నవ్వింది.

ఈ సంభాషణ జరిగిన దర్మిలా కొద్ది రోజుల్లోనే పోలటోవ్ చాలా మట్టుకు లీపాకి ముట్టజెప్పాడు. ఆమె కోసమని ప్రత్యేకంగా వక యిల్లేర్పాటు చేశాడు. అందులో అధునిక పద్ధతిని ఫర్నీచరు వగయిరా లమర్పజేసి సర్వాలంకార సుశోభితం గావించాడు. అయితే అందువల్ల లీపా కే మాత్రం వుల్లాసం కల్గలా. యెప్పటి లాగా వుదాసీనంగానే వుంటోంది.

కొత్త యింట్లో కెళ్ళిన తర్వాత ఒకరోజున లీపా ఇలియాతో యిల్లా చెప్పింది—"నా కిప్పుడు యిరవై యేడేళ్ళు. మరి మూడేండ్లలో యింకో పది వేల రూపాయిలు చేజిక్కించుకొని ఆ ముసలాయనకు స్వస్తి చెప్పేస్తా. అప్పుడు నేను సర్వ స్వతంత్ర నవుతాను. ఆ తర్వాత మన మిద్దరము స్వచ్ఛంద జీవితం గడుపుతూ హాయిగా సుఖపడొచ్చు. ఈ ప్రపంచంలో జీవితా న్నెల్లా నెట్టుకొని పోవాలో నావద్ద నేర్చుకో."

నిజానికి లీపా ఇలియాకెన్ని విధాలుగానో హితాన్ని బోధించేది. అతడామెను చూపుల్లో కృతజ్ఞతని వెల్లడించే

కాదు; కాని, తన లీసాని మరొకడు కౌగలించుకొని, ముద్దాడే దృశ్యాన్ని తలచుకొన్నప్పుడు వాని హృదయం వదా-వద లయ్యేది. అయితే, అంతలోనే లీసా సంపర్కం వల్ల భావిలో తాను స్వంతంగా ఒక షాపు పెట్టుకొని జీవితాన్ని హాయిగా వెళ్ళబుచ్చ వచ్చనే భావం కలిగి అది మర్చిపోయేవాడు. ఈ ఆశాభావనతో వాని విషాద మదృశ్యమయ్యేది. ఇదే విధంగా ఇలియా మరో మూడు మాసాలు దొర్లించాడు.

ఒక నాడు ఇలియా బేరం చాలించుకొని యింటికి చేరాడు. పెట్టెను గదిలో దించి మాషా గదికి దారి తీశాడు. గది మధ్యలో బల్ల కిరు ప్రక్కలా కూర్చొనివున్న ఫర్ఫిషాక, జాకోబులతోపాటు బల్లమీద కార్కు తీసివున్న బ్రాంది సీసాకూడ ఇలియా కంట పడింది. జాకోబు చెపుతున్నాడు— "ఈశ్వరుడు సర్వాంతర్యామే అయితే నన్ను చూచి తీరుతాడు. మిత్రు లందరు నన్ను వదిలేశారు. ఈ లోకంలో నాకు నా అన్నవాళ్ళెవరూ లేరు. నా తండ్రికి నేనంటే అసలే గిట్టదు. ఆయన కుత్సితుడు, మోసకారి, అన్నిటికీ మించి కర్కోటకుడు!"

"నిజమే, నీకు పట్టిన గతి యెవరికయినా విచారం కల్గిస్తుంది; కాని, చేయగల దేముంది?" అన్నాడు ఫర్ఫిషాక.

"ఎవర్ని నమ్మేది? అంతా అయోమయంగా వుంది. ఈ ప్రపంచంలో బ్రతికే దెల్లాగో తోచకున్నది. మా

నాన్న సంగతి చెప్పనే అక్కర్లేదు గద! ఇలియూ నన్ను విడిచి వెళ్ళేశాడు. మాషా అమాయకపు పిల్ల. ఇక నా కెవరున్నారు?"

ఇలియూ ద్వారం వద్ద నిలబడి పై మాట లన్నీ విన్నాడు. వానికి దుఃఖం పొంగి వచ్చింది. మిత్రుని పెదిమలు తడారి, మోము వాడిపోయి వుండడం చూచాడు. జాకోబు కంఠ స్వరంలో నయినా పటుత్వం లేదు. ఆ మంద భాగ్యుని మాటలను ఫర్ ఫిషాక్ మెడతో సహా తలూపుతున్నాడు. భావ రహితంగా నవ్వుతున్నాడు. వాని ధ్యాస అసలు జాకోబు మాటలయందే వున్నదో, లేక బల్లమీద బ్రాంది బుడ్డి మీదనే వుందో చెప్పలేము. ఇలియూ మెల్లగా గదిలో ప్రవేశించుతూ "ఏమిటీ పని?" అని జాకోబును గద్దించాడు.

జాకోబు త్రుళ్ళి పడ్డాడు. మిత్రుని వంక దీనంగా చూచాడు. "మా నాన్నెమో నని కంగారు పడ్డానోయ్" అన్నాడు.

ఇలియూ వెనుకటి ప్రశ్ననే రెట్టించాడు.

ఫర్ ఫిషాక్ లేచి నుంచున్నాడు. వానికి కాళ్ళు తేలిపోతున్నై. "ఇలియూ! వీని విషయం వదిలేద్దూ. వీడి కిందులోనే శాంతి వుంది. వీడికి తాగుడు అలవాటవడం భగవంతుని కృపా ఫలితమే సుమా! అన్నాడు.

జాకోబు బిక్క మొగంతో "నాన్న నన్ను చావగొట్టాడు ఇలియూ!" అన్నాడు.

ఫర్ఫిషా్క మెదరొమ్మ మీద గుద్దుకొని బిగ్గరగా అరిచాడు— "నా కళ్ళముందే నోయ్! వీడి పళ్ళు కదిలి పోయినై. ముక్కునుంచి రక్తం వరదలై పారింది."

జాకోబు ముఖమంతా వాచి పోయింది. "నాకు పందొమ్మిదేళ్ళు కూడా వచ్చినై. ఇంకా దెబ్బలు పడాల్సిందేనా? నేను తప్పేమీ చేయకుండానే రా" అని చెబుతూంటే జాకోబు కళ్ళలో గిర్రున నీళ్ళు నిండినై.

స్నేహితుని యేమాటలతో ఓదార్చాలో ఇలియాకు స్ఫురించలా. జాకోబు కుర్చీ కోడు పట్టుకొని యేడుస్తున్నాడు. ఫర్ఫిషా్క వాణ్ని కుర్చీలో కూచోబెట్టి, తాను సీసాను గ్లాసులోకి వంచుకొని ఇలియాతో అన్నాడు— "జాకోబును బాగా యేడ్వనీ. ఏడిస్తే గుండె తేలికవుతుంది. మా మామ యిల్లాగే యేడుస్తూంటే మతిస్నా దగ్గరకు పంపేశా."

"అసలేం జరిగిందేమిటి?" ఇలియా అడిగాడు.

"మీ బాబాయి యెక్కడికయినా పోయి యేకాంతంగా తపస్సు చేసుకుంటాననీ, తనకు సెలవిచ్చి పంపాల్సిందనీ పెట్రుషా నడిగాడోయ్. అసలదివరకునుంచే టెరెన్సు ఉద్వాసనం చెప్పాలనుకుంటున్నాడు. సెలవిమ్మని అడిగిందే తడవుగా "సరే" నన్నాడు. తనకోసం కూడా భగవంతుని ప్రార్థించమని టెరెన్సుతో చెప్పాడు. ఆమాట విని జాకోబు తానుకూడ టెరెన్సు వెంట పోయి తండ్రి పాప పరిహా

రార్థం తపస్సు చేస్తానికి అనుజ్ఞ నిమ్మన్నాడు. ఇందుకే నయ్యా పెట్రుహా కొడుకుని పట్టుకొని చితుక బాదింది” అని ఫర్ఫిమ్కా జరిగిన వైనం టూకీగా చెప్పాడు.

“ఇక నే నీకొంపలో బతకలేను; ఎక్కడి కయినా పారిపోతా; లేకపోతే యెందులో నయినా పడి చస్తాను. నేను నిజం చెప్పినందుకేగా ఆయన నన్ను కొట్టింది. ఇక బ్రతికి యేం లాభం చెప్పు!” అని జాకోబు వాపోయాడు.

ఇలియా దుస్సహమైన వ్యథ చెందాడు; వాని కేమీ పాలుపోలా. మెదలకుండా అక్కణ్నుంచి వెళ్ళి పోయాడు. టెరెన్సు యీ స్వార్థమయ సమాజాన్ని, లౌకిక ప్రపంచాన్ని వదలి అరణ్యవాసానికి పోదలిచాడన్న సంగతి వానికి సంతోషాన్నే కల్గించింది. తానుకూడా యెక్కడైనా పోతేనే బాగుండు ననుకున్నాడు.

గది ద్వారం వద్దే టెరెన్సు యెదురయ్యాడు. అతని కళ్లు మెరుస్తున్నై. ముఖం కళకళ లాడుతోంది. నే నీ కామాటం వదిలించుకొని తీర్థ యాత్రలకు వెళ్లా లనుకుంటు న్నారా అబ్బాయ్! ఇవాళ నౌకిరీ వదిలేసిన తర్వాత నాకు బందిఖానాలో నుంచి బయట పడ్డట్టుగా వుంది. ఇన్నాళ్ళకు దేవుడు నాపైన దయ తలిచాడు. ఆయన నా ప్రార్థనకూడ తప్పక వింటాడు” అని చెప్పాడు.

ఇలియా గంభీరంగా అడిగాడు— “జాకోబు సంగతి మీకు తెలిసిందా? వాడు తాగుడు మొదలెట్టాడు.”

"చిన్నతనంలో తాగటం తప్పే."

"పెట్రుషా వాడిని కొట్టినప్పుడు మీరున్నారా?"

"నా ముందే బాదాడు. ఏం?.

"అదే వాడి దుర్వ్యసనానికి కారణమయింది."

"అదేనా?" అని ఔరెన్సు నవ్వాడు.

జాకోబు దుర్వ్యసన లోలుడైనట్టు విని ఔరెన్సు యేమాత్రం విచార పడటం లేదని ఇలియా గ్రహించాడు. వాని హృదయం ద్వేషభావంతో నిండిపోయింది. ఔరెన్సు అప్పుడున్నంత ఆనందగా వుండటం వాడిదివర కెన్నడు చూచి వుండలేదు. తోటి మానవుడొకడు అధఃపతన మవుతూంటే ఔరెన్సు సంతోషంతో వుప్పొంగి పోతున్నం దుకు ఇలియా చింతించాడు. కిటికీలో కూర్చొని "పాటలుకు వెళ్ళరేం" అన్నాడు.

"నీతో మాట్లాడాలి."

"ఏమిట?"

ఔరెన్సు ఇలియా దగ్గరకెళ్ళి "నేను త్వరలోనే వెళ్ళిపోతాను. నువ్వింక యేకాకి వయిపోతావు. అందువల్ల..."

"మీరు చెప్పదలచిన దేదో స్పష్టంగా చెప్పరాదూ?" అన్నాడు కర్కశంగా.

ఔరెన్సు మొహం ప్రక్కకు తిప్పుకొని "చెప్పాలనేగా! కాని, అదే చెప్పలేక పోతున్నాను." అన్నాడు.

"నా విషయంలో యేమైనా చెప్పదలిచారా?"

"నీ విషయంలో కూడాను. ముందు నేను చెప్పేది విను: నేను కొంత డబ్బును వేరే తీసి వుంచాను."

ఈ మాటలు వినగానే ఇలియా నవ్వాడు.

"నవ్వుతా వెందుకు?" టెరెన్సు అడిగాడు.

"నాకు తెలుసులెండి. సరే, ఆ మొత్తమెంత?"

"మఠం కట్టించేందుకు రెండొందలు, నీకు వంద"

"ఒంద రూపాయలా!"

ఇలియా తన కంతకంటె పెద్ద మొత్తా న్నిస్తాడని ఆశించాడు. అస లాయన ధనాని కెందు కాశించానా అని తనపైనా,తకు్కవగా యిస్తున్నందుకు పిన్నబ్బమీదా కోపం వచ్చింది. కిటికీలోనించి దిగి ముఖం చిట్లిస్తూ "నా కా పాపపు సొమ్ము అక్కర్లా" అన్నాడు.

టెరెన్సు తెల్లపోయాడు. కొడు కావిధంగా మొహమ్మీద అనేసేటప్పటికి నిలువునా నీరయ్యాడు. నుంచోలేక పక్కమీద కెళ్ళి చతికిల పడ్డాడు. టెరెన్సు ఆలోచనలో పడ్డాడు. విషాద మతణ్ని ఆవరించింది. జంకుతూనే ఇలియావంక చూశాడు.

"ఎందు కల్లా చూస్తారు? నేను మీ దొంగ డబ్బును ముట్టుకోను." అన్నాడు ఇలియా నిర్మొగమాటంగా.

"ఇలియా! కోప్పడకు. నా మాట వినవూ?"

"ఏమిటి? చెప్పండి."

"నిన్ను కన్న కొడుకులా పెంచాను. నేనా పాపాని కొడిగట్టింది కూడా నీకోసమే. నా పైన జాలిలేదూ? నువ్వా డబ్బు పుచ్చుకొనక పోతే దేవుడు నన్ను క్షమించడు. నాకిక నిష్కృతి వుండదు." అని ఔరెన్ను అతి దీనంగా బ్రతిమాలాడు.

"పాపాన్ని మూట కట్టుకొని భగవంతుని శరణ్యాంలోకి వెళ్తున్నారా? నాకోసం ధనాన్నపహరించమని నే నెప్పుడు చెప్పాను? మీ రెవరి సొమ్ము నపహరించు తున్నారో అప్పు డాలోచించారూ?"

"నువ్వు పుట్టాలని మాత్రం కోరుకున్నావా? ఇదీ అంతే. నా మాట విని డబ్బు పుచ్చుకోరా అబ్బాయి! నా మనశ్శాంతి కోసం, నా మోక్షం నిమిత్తం దేవుని పేర యీ సొమ్ము తీసికో. ఇప్పు డింత మట్టుకే గాని, తిరిగి వచ్చిన దర్మిలా తతిమ్మా దంతా నీకే యిచ్చేస్తాను."

ఔరెన్ను బ్రతిమాలుతూంటే ఇలియా అతని దీన వదనాన్ని చూచాడు. పిన తండ్రి పట్ల తన హృదయంలో లేశ మాత్రమయినా జాలి వున్నదీ లేనిదీ నిశ్చయించుకో లేక పోయాడు. కా స్సేపాలోచించి "సరే, తీసుకుంటా లెండి." అన్నాడు.

ఆ మాట చెప్పి యిక నక్కడ ఒక్క క్షణమైనా వుండలా. చివాలున లేచి పోయాడు.

ఆ పైకం తీసుకోటానికి అంగీకరించా డే గాని, ఇలియా హృదయంలో దేవుతూనే వుంది. తాను కూడ పతన

మయినట్టే భావించాడు. 'అదయినా స్వల్ప మొత్తం. ఒకటి రెండు వేలయినా బాగుండేది. షాపు పెట్టుకొని ఈదుర్భర దారిద్ర్యాన్నుంచయినా విముక్తి పొందేవాణ్ని. విధం చెడినా ఫలం దక్కాలి గదా! జర్మియా సొమ్ములో అసలు బాబాయి వంతు కెంత వచ్చిందో అడగాలి' అని తలపోశాడు తనలో తాను.

లీసా తోడి సంపర్కం యేర్పడిన లగాయతు వానికా హోటలు గది మానవ నివాస యోగ్యంగా కనపడటం లేదు. నేడది మరీ అసహ్యంగా తోచింది. ఎక్కడ కూర్చోటానికీ మన సొప్పలేదు. హృదయం అల్లకల్లోలంగా వుంది. అనాలోచితంగా నడుస్తూ మతిస్సా గది వేపు కెళ్ళాడు. గడ పెక్కేటప్పుడు తన్నూ, ఆమెనీకూడ ఆకొంప అధఃపాతాళానికి తొక్కేస్తుం దనుకున్నాడు.

మతిస్సా కుర్చీలో కూర్చొని వుంది. "నిద్ర పోతోంది" అని మెల్లగా చెప్పింది.

మాషా మతిస్సా పక్కమీద నిశ్చింతగా నిద్రిస్తోంది.

"ఈ కాలంలో కన్న తండ్రులే తమ సంతానాన్ని చీల్చుకొని తినేస్తున్నారు; గొంతులు నులుము తున్నారు. వీళ్ళ జిమ్మడ! వీళ్ళ నెత్తిమీద యేదయినా విరుచుకొని పడదేం!" అంది మతిస్సా.

ఇలియా మాషా భవిష్యత్తునుగూర్చి ఆలోచించు తున్నాడు. భగవంతు డామె నొష్టన యేమి రాసిపెట్టాడో

ననుకుంటూ మూసా మొహంమ్మదనే దృష్టి నిల్పి చూస్తున్నాడు.

"ఆ కర్కోటకుడు దీని జుట్టు పట్టుకొని యీడ్చాడు. తన కొడుకును కొట్టుకోవడమే గాక, పరాయిపిల్లని కూడ తన్ని, యిద్దర్నీ బయటికి గెంటుతానని బెదరించాడు. పాపం! తల్లిలేని పిల్ల!" అని మతిస్నా ఇలియావంక చూచింది.

లీసా తన చేతిక్రింద పనిచెయ్యటాని కొక ఆడపిల్ల కావాలన్న సంగతి ఇలియా కిప్పుడు జ్ఞప్తి కొచ్చింది.

"నే నీమెకు నౌకరీ కుదుర్చుతాన్లే" అన్నాడు ఇలియా.

మతిస్నా కళ్ళెర్రజేసి వెక్కసంగా అంది— "నీవా! బలే పెద్దమనిషివి! నువ్వేనా మేలుచేసేది? అంత దయకల వాడివి యిన్నాళ్ళనుంచి యెందు కూరుకున్నావు? ఈపిల్లను చూచి నీకు జాలైనా కల్గటం లేదూ?"

"పిచ్చి పిచ్చిగా వాగకు. మూసాకు వయస్సెంత వుంటుంది?"

"పదిహేనేగా! ఎం తనుకుంటున్నా వేమిటి?"

"నీ తలకాయ! పన్నెండుకు మించి వుండవు. నిన్న మొన్నటి పిల్లేగా! జోకొడితే నిద్ర పోతుంది, లేపితే లేస్తుంది. అభమూ శుభమూ తెలియని కసుగాయ కదూ!"

ఇలియా ఆట్టేసేపు అక్కడా వుండలేక పోయాడు. సరాసరి లీసా యింటి కెళ్ళాడు. వెళ్ళి తలుపు తట్టాండు; కాని

ప్రత్యుత్తరం లేదు. కొంత సేపటికి "ఎవరా మనిషి?" అన్న కీచు గొంతుక విన్పించింది.

ఇలియా నిర్ఘాంత పోయాడు. "నేనే" నన్నమాట మాత్రం వాని పెదవులను దాటిపోయింది.

ఆ కంఠధ్వని వానికి బొత్తుగా అపరిచితము.

ఒక అనాకారి వృద్ధ తలుపు తెరిచింది. "ఎవరి కోసం?" అనడిగింది.

"లీపాతో పనుంది."

అని ఇలియా చెపుతూండగానే లోపల్నుంచి ఒక వృద్ధుడు వచ్చాడు. పొట్టిగా లావుగా రుబ్బు పాత్రంలాగున్నాడు. ముక్కు ఎంటుకొని వుంది. బట్టతల. గడ్డం పాతిక పాలు నెరిసింది. అతడు ఇలియాను తేరి చూచి "ఎవన్నువ్వు? ఎందుకొచ్చా"వని తీవ్రంగా అడిగాడు.

ఇలియా తడబడి ఒకడుగు వెనక్కు వేశాడు. తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు. ఆ ముసలాత డెవరో క్షణంలో గ్రహించాడు. లజ్జావమానాలతో వుడికి పోతున్నాడు. క్రోధావేశంచే కళ్ళు మెరుస్తున్నె. అతడే తన ప్రతిద్వంద్వి యని తెలిసిపోయింది. "చిల్లర బేరగాణ్ణి" అని జవాబిచ్చాడు.

వృద్ధుని ముఖం విప్పారింది. లాంత రెత్తి పట్టుకొని ఇలియా ముఖాన్ని పరికించి "ఏమేమి అమ్ముతా" వని అడిగాడు.

"సెంట్లు, అత్తర్లు, అద్దాలు, దువ్వెన్లు, లేసులు, రిబ్బన్లు వగైరా."

అని చెప్పాడు; కాని, ఇలియా వుడికి పోతున్నాడు. అవమానంచే కృంగిపోతున్నాడు.

"ఆఁహాఁ! విటులకు విలాస వస్తువులు, పడుచులకు షోకేళా సరుకులూనా? అయితే యిక్కడికేం పనిమీద వచ్చావ్?"

"బాకీకోసం."

వృద్ధుని చూస్తున్న కొద్దీ ఇలియా హృదయంలోని మంట మరింత రగుల్కొంటోంది. అతని బోసినోటి నవ్వు చూచి కుళ్ళిపోతున్నాడు.

"బాకీయా? ఎంత? బిల్లేదీ?"

"బిల్లేమిటి?"

"లీపా పుచ్చుకొన్న నాటికి బిల్లు లేదూ? ఎంతో చెప్పు. యిచ్చేస్తాను. ఊఁ, దబ్బున తేల్చుకొని పో."

అని ముసలాయన యింకా ముందుకొచ్చాడు. ఇలియా మరో అడుగు వెనక్కి తగ్గాడు. వానికి కొంచెం జంకు కూడా కలిగింది. అయినా కడుపు మంటాగక "నా దగ్గర బిల్లూ—గిల్లూ వుండదు. నోటి లెక్క" నన్నాడు తీవ్రంగా.

అప్పుడే వృద్ధుని వెనక్కి వచ్చిన లీపా కన్ను గిల పటం చూచాడు.

"ఏమిటీ గడబిడ?" లీపా కంగారుతో వృద్ధుని అడిగింది.

"నువ్వీ బేరగాడి వద్ద యేమిటో అరువు పుచ్చుకొన్నావటగా? డబ్బుకోసం వచ్చాడు" అని చెప్పి వృద్ధుడొకసారి లీపా ముఖంలోకీ, ఒకసారి ఇలియా కళ్ళల్లోకీ చూచాడు. లీపా అతని భుజం పట్టుకొని వెనక్కి లాగి ముందు కొచ్చింది. "ఏం, యిదేనా సమయం? మరొకప్పుడు రాకూడదూ?" అని దబాయించి నట్టభినయించింది.

"మూర్ఖుడికి వేళా పాళా తెలిస్తేగా. బుర్రలో పుట్టింది; ఎగడి తగూ కొచ్చాడు!" అన్నాడు వృద్ధుడు.

లీపా "మీ కెందు కూరుకుందురూ" అని వృద్ధుణ్ని ఆపి "ఎంత? మూడున్నర కాదూ?" అని ఇలియా నడిగింది.

"ఈ ముష్టి భాగ్యానికేనా యిప్పు డొచ్చాడు! ఆ డబ్బువతల పారేసి తలు పేసెయ్యి" అన్నాడు ముసలాతడు.

తలుపు మూత పడింది.

ఇలియా నిర్విణ్ణుడయి యింకా ఆ తలుపు కేపే చూస్తున్నాడు. ఇదంతా నిజమా, కలా అని నివ్వెర పడుతున్నాడు. చేతిలో వెండి బిళ్ళలు మెరుస్తున్నై. మరి నిజంకా దను కొనే దెల్లా?

చల్లగాలి తెరతో వానికి స్పృహ వచ్చింది. నిలువెల్ల దహించి వేస్తున్న అవమానాగ్ని తీవ్రమై దుస్సహంగా వుంది.

15

ఇలియా హృదయము విషాదాగ్నిచే వుడికిపోతోంది. ముఖాన కత్తివాటుకు నెత్తురు చుక్క లేదు. క్రితం నాటి రాత్రి జరిగిన ఘటనా దృశ్యము వాని కళ్ళముందల్లే నిల్చి వుంది. వృద్ధుడు గుడ్లు తిప్పుతూ దబాయించటం మరువలేక పోయాడు. పెట్టె నెత్తి కెత్తుకొని బజారున పడ్డాడేగాని, అమ్మకంమీద దృష్టి లేదు. వెర్రివానిలాగా—కాలు కాలిస పిల్లివలె అటూ యిటూ తిరుగుతున్నాడు.

ఒక దుకాణం ముందున్న బోర్డుపైన దృష్టి పడేప్పటికి ఇలియా టక్కున ఆగిపోయాడు. 'పోలటోవ్ అండ్ సన్స్, వడ్డీ వ్యాపారం' అన్న పెద్ద తాటికాయంత అక్షరాలకింద 'ఇక్కడ పాత నాణాలు మార్చబడును' అని చిన్న టైపులో చెక్కబడి వుందా బోర్డుమీద. ఏమనుకొన్నాడో యేమో ఇలియా గప్‌చిప్‌గా లోపలికి చొరబడ్డాడు. పోలటోవ్ మొఖమల్ మెత్తమీద పద్మాసనంలో కూర్చుండి ఖాతా పుస్తకం పుటలు తిరగేస్తున్నాడు. అప్పు డక్కడ గుమాస్తాలు గాని, ఖాతాదార్లుగాని లేరు. సాహుకారు ఇలియా వంక చుర చుర చూచి "ఏం కావాలి?" అనడిగాడు.

"మీరు నన్నానవాలు పట్టలా?" ఇలియా అన్నాడు.

"చిల్లర బేరగాడివని కనపడుతూనే వుందిగా. అప్పు కోసమా?" అన్నాడు.

"కాదు, పాత నాణాలు మార్చుకోటానికి వచ్చా."

" ఏవీ? చూపించు."

ఇలియా పెట్టె కిందకిదించి డబ్బుకోసం అందులో వెతక సాగాడు. లోపల వాని గుండె దడదడ కొట్టుకుంటోంది. బయట చేతులు వణుకుతున్నై. సంచి దొరక నేలేదు.

"ఏవీ? త్వరగా నీపని చూచుకొని వెళ్ళు."

"ఇదిగో! తీస్తున్నా" నంటూ ఇలియా సంచి నెల్లాగో వెతికి బయటికి తీశాడు. అందులో వున్న నాణాలన్నీ షాహుకారు ముందు దిమ్మరించాడు. పోలటోవ్ వాటి నన్నిటిని పరిశీలించి చూచి రెండుతీసి ఇలియాకు చూపుతూ "ఇవి బాగా అరిగి పోయాయి" అని వేరుగా వుంచాడు.

"చాలా పాత నాణాలు. బాగా పురుంగా వున్నై కూడాను" అన్నాడు ఇలియా.

"వీటికి సగానికి మించి యివ్వటానికి వల్లపడదు. తతిమ్మా వాటికి మామూలు పాతిక విరగ్గోతే. ఇష్టమైతే చూడు" అని పోలటోవ్ ఖాతా, పుస్తకం తీసి చూచుకో సాగాడు.

ఇలియా కోపం ఆపుకో లేకపోతున్నాడు. ప్రతీకార భావము వాని నున్మత్తుని గావించింది. రెప్పపాటులో వృద్ధుని పై కురికి మెడ లంకించుకున్నాడు. రెండు చేతుల్తో

గట్టిగా పీక నొక్కాడు. తర్వాత వెనక్కి పడద్రోసి గబగబా ఇనప్పెట్టి సొరుగు లాగాడు. చేతికి చిక్కిన నోట్ల కట్టొకటి తీసి లోపలి జేబులో కుక్కుకున్నాడు. తన పెట్టె నెత్తుకుని రోడ్డుమీంది కెళ్ళాడు. అటిటు చూచి ముందుకు సాగాడు; కాని, వానికి తల తిరుగుతోంది. కళ్లు మంటగా వున్నై. ముసలాడు కళ్ళలో చేరి కెలుకుతున్నట్లనిపించింది. రెప్పలు మూత పడటం లేదు. ప్రయత్నించినా ప్రయోజనం లేక పోయింది. 'ఇల్లా అయితే సులువుగా పట్టుబడతా' ననుకున్నాడు. రోడ్డుకి పక్కగా పోయి నిలబడి రెప్పలువాల్చేందుకు తిప్పలు పడుతున్నాడు. అప్పుడే వెనక నుంచెవడో తోసుకొచ్చాడు. ఇలియా వెనక్కి తిరిగి చూచేసరికి వాడు ముందుకు దూసుకెళ్ళాడు. ఈలోగా రెప్పలు వాలినయి. తోసుకెళ్ళిన వాణ్ని తిట్టుకుంటూ ముందుకు నడిచాడు. చౌకులో బీటు కానిస్టేబులు కనపడ్డాడు. ఇలియా వణుకుతూ వాడి ముందుకెళ్ళి "అబ్బ! ఏం మంచు కురుస్తోంది" అన్నాడు.

"దేవుని దయవల్ల యీ త్వరలోనే చలి తగ్గిపోతుంది" అన్నాడు పోలీసు.

"ఇప్పుడెన్ని గంట లవుతుంది?" అని ఇలియా టయిమడిగాడు.

"చూచి చెపుతా" నని కానిస్టేబిలు చేతిమీదనున్న మంచును దులుపుకుంటున్నాడు. ఇలియా కప్పుడు భయము,

సంతోషం కూడ కలుగుతున్నై. వెర్రివాడివలె పెద్దపెట్టున నవ్వాడు.

కానిస్టేబిలు విస్మయంగా "ఎందుకు నవ్వుతావు?" అ నడిగాడు.

"పాడు మంచు మిమ్మెల్లా ముంచేసిందో చూడండి!"

పోలీసు గడియారంలో చూచి "ఒంటిగంట అయిం" దని చెప్పి "నువ్వే హొటల్లోనో కూర్చొని తర్వాత గూటికి చేరుకుంటావు. వెచ్చగా హాయిగా పడుకుంటావు. నే నిక్కడ యిదే విధంగా ఆరు గంట లయ్యేదాక యీ మంచులో నిలువుగాళ్ళమీద నిలబడుండాలి" అని తన బాధ చెప్పాడు.

"వెళ్ళి వస్తా" నని ఇలియా అక్కణ్నుంచి సాగారాడు.

సమీపంలోనే వున్న ఒక హోటల్లో దూరి గవాక్షాని కెదురుగా కూచున్నాడు. అక్కడికి పోలటోవ్ కొట్టు చక్కగా కనబడుతుంది; కాని, అప్పుడు మంచు జోరుగా పడుతున్నందున యేమీ కన్పించటం లేదు. వాని గుండె దడదడలాడుతూనే వుంది. ఏం జరుగుతుందో అక్కడే వుండి చూడా లనుకున్నాడు. సర్వరు టీ తెచ్చియిచ్చాడు,

ఇలియా కప్పు నందుకొని "మంచు తగ్గేటట్టు లేదే" అన్నాడు సర్వరుతో.

"ఇప్పుడిప్పుడే కొంచెం తగ్గి యెండ పోడ వస్తోంది" అని వాడు చక్కా పోయాడు. ఇలియాకు కునుకు వస్తున్నట్టుగా వుంది. టీసి సాసరులోకి ఒంపుకున్నాడు; కాని, తాగలా. అప్పటికప్పుడె వానికి వుక్కగా వున్నట్టు తోచింది. కోటు గుండీలు విప్పివేస్తున్నాడు. మెడ క్రింద బొత్తామును విప్పబోయే సరికి ఒళ్ళు ఝల్లుమంది. చేతులు కంపించినై. అవి యింకెవరి చేతులోననీ, తనగొంతు పిసుకబోతున్నట్టూ కలవర పడ్డాడు.

చేతివ్రేళ్ళను కళ్ళతో పరీక్షగా చూచుకున్నాడు. అన్నీ శుభ్రంగానే వున్నై. అయినా ఒకసారి సబ్బునీళ్ళతో కడగాలనుకున్నాడు.

అదే సమయంలో "పోలటోవ్ హత్య! ఎవరో చంపేశారు" అన్న కేకలు విన్పించాయి.

ఇలియా అదిరి పడ్డాడు. హోటలులోకూడ గందరగోళం వ్యాపించింది. అందరూ హత్యా స్థలానికి పోవాలన్న హడావుడిలో వున్నారు. ఇలియాకూడ లేచి సిద్ధమయ్యాడు.

పోలటోవ్ దుకాణం ముందు జనం పోగయారు. పోలీసులు జనాన్ని వొత్తిగించి ముందు కెళ్తున్నారు. తర్వాత పహరా కూడ యేర్పాటు చేయబడింది. ఇలియా పంచ పంచల బడి తిరుగుతూ యెవ రెవ రేమేమి చెప్పకొంటున్నదీ వింటున్నాడు.

"గుమాస్తాలు, నౌకరూ కూడ సమయానికి లేకపోయారు. ముందుగా నౌకరు వచ్చి చూచేప్పటికి యజమాని

కింద పడిపోయి వున్నాట్ట. మూర్ఛ కాబోలని వాడు కంగారుతో పరుగెత్తు కెళ్ళి బ్యాంకి నుంచి తిరిగి వస్తున్న పీటరు స్టెఫినోవిచ్ (హెడ్ గుమాస్తా) తో చెప్పాడు. పీటరు వచ్చి తీరా చూస్తే ప్రాణమే లేదు. "ఎంత సాహసం! మిట్ట మధ్యాహ్నం రాజవీధిలోని దుకాణంలో యిల్లాంటి ఘోరం జరగటం యెన్నడు యెరగము" అన్నా డొకాయన.

"అంతా భగవదేచ్ఛ. ఆయన కల్లా రాసిపెట్టి వుంది కాబోలు!" యింకొకాయన అన్నాడు.

ఇలియా రెండడుగులు ముందు కెళ్ళాడు. ఒక వర్తకుని రాచుకోవటం జరిగింది. అతడు ఇలియాని వెనక్కి నెట్టి "ఎక్కడికీ, తోసుకొస్తున్నావ్?" అని దబాయించాడు.

ఆ పక్క నెవరో "ఈశ్వ రాజ్ఞ లేనిదే యీగైనా కుట్టు" దన్నాడు.

"నిజ మంతేగాని, భగవంతుడా అపరాధాన్ని యెవరో వొకరి నెత్తిని రుద్దుతాడు" అన్నాడు మరో అనుభవశాలి.

ఇలియా కీ మాటలు కొంత శాంతిని చేకూర్చినయి. వాని గుండె కుదుట బడినట్టుంది. అప్పు డెవరయినా తన్నడగటమే సంభవించితే ఆ హత్య చేసింది తనే నని నిర్భయంగా చెప్పేద్దా మనుకున్నాడు.

ఆ తృప్తితో నిశ్చింతుడై తొంబను చీల్చుకుంటూ ముందు కెళ్లాడు. తనకు పరిచయమున్న కానిస్టేబిలును

చూచి వాని దగ్గరలో కెళ్ళి నుంచున్నాడు. "ఎక్కడికి? వెనక్కి పో" మ్మని వాడు కసిరాడు.

ఇలియా తొట్రుపడ్డాడు. సరిగా అప్పుడే యిం కెవడో ఘట్టిగా తోసి "తగలనియ్యి రెండు తాపులు" అన్నాడు.

ఇలియా గుంపులో నుంచి బయటపడి యెడంగా పోయి నిలబడ్డాడు. "దుర్మార్గుడు, నా డ్యూటీ సమయం లోనే యీ పని చేశాడు" అని బీటు కానిస్టేబులు అంటున్న మాటలు ఇలియా చెవిని పడ్డయి.

"వడ్డీ గుంజటంలో కాబూలువాడి తాతరా" అన్నాను ఆ సమూహంలో ఒకడు.

"మంచు బాగా పడుతూండడం కూడ హంతకుడికి బాగా అనుకూలపడింది."

"బాకీలు వసూలు చెయ్యడంలో దయా - దాక్షిణ్యాలు లేకుండా రక్తం పిండేవాడు."

"అయినా మనిషేగా!"

"అందువల్లే ఆయనకు పట్టిన గతికి విచారం కలుగుతోంది."

"అందరూ ఎదటి వాడిని మ్రింగి వేయాలనేగా!"

ఇదే విధంగా తలకొక మాట అంటూండగా "పాపం! ఆయన భార్య కూడ వస్తోంది" అన్నాడొక వ్యక్తి.

ఇలియా శిరమెత్తి చూచాడు. ఒక అంధ స్త్రీ యిద్దరు నౌకర్ల సాయంతో వస్తోంది. ఆమె గోలు గోలున యేడుస్తోంది. ఆవిడను చూచినప్పుడు ఇలియాకు లీపాష్టిపికి వచ్చింది.

"పిల్లా-జెల్లా వున్నారా?" ఎవరో అన్నారు.

"ఒక్కడే కొడుకు. అతడైనా మాస్కోలో వుంటున్నాడు" అని మరెవరో అన్నారు.

"అతను కూడ తండ్రి చావు కెదురు చూస్తూ వుండి వుంటా"డన్నాడు యింకో మనిషి.

"అయితే కావచ్చు. ఎంత వుండి యేం లాభం?"

ఈ తుది మాట విని ఇలియా కూడ విచారపడ్డాడు. పోలటోవ్ పట్టపగలు హత్య చేయబడి నందుకెవరికీ విచారము, సానుభూతి లేనందుకు సంతోషించినా, పై సంభాషణ వానికి బాధగానే వుంది. ఆ గుంపులో ఒక్క నావికుడు మినహా అందరూ తమ తమ కడుపు మంటను వెళ్ళగ్రక్కిన వాళ్ళే. నోటికి వచ్చినట్లు తలకొక విధంగా ఆడి పోస్తున్నారు.

16

అందరూ వెళ్ళే వరకూ ఇలియా అక్కడే వున్నాడు. గదికి చేరుకొనేప్పటికి గాసి చెందాడు. గది తలుపులు బిడాయించుకొని నోట్ల కట్ట విప్పి లెక్క పెట్టాడు. వాటి నెక్కడ దాచాలా అని ఆలోచించాడు. కొంత సేపాగి నోట్ల కట్టతో బయలు దేరాడు. వాకిటి ముందే జాకోబు తారసిల్లాడు. "ఇవ్వాళ యింత పెందలాడే వచ్చావేం? ముఖం వాడిపోయి వుందేమిటి?" అని వాడడిగాడు.

''ఒంట్లో సరిగా లేదోయి'' అని ఇలియా మెల్లగా చెప్పాడు.

"చేతిలో దేమిటి?"

ఇలియా త్రుళ్ళి పడ్డాడు. చేతిలో కట్ట వున్నట్టు అప్పుడు గాని వానికి స్ఫృహ రాలా. గుట్టు బయట పడి పోతుందేమో నని భీతి చెందాడు. నోట్లకట్టని చప్పున జేబులో దాస్తూ " ఏమీ లేదురా. గోటు కట్టలే " అన్నాడు.

"టీ తాగివద్దాం రా."

"నువ్వు పద, నేను వెనకాల వస్తాలే" అని ఇలియా ముందున్న ఖాళీస్థలంలోకి దారి పట్టాడు. జాకోబు తన దారిని పోయాడు. చుట్టూ పారజూచి యెవరూ లేక పోవటంవల్ల ఇలియా చాకుతో చిన్న గొయ్యి త్రవ్వి

తున్నాడు. ఎవరో చాటునుంచి తన్ను చూస్తున్నట్టు కల్లింత పడ్డాడు. మనిషి వున్నాడనుకున్న వేపుకు రాయి విసరా లనుకున్నాడు; కాని, మరుక్షణంలో తన భ్రమేగాని, అక్కడ తానుగాక యింకెవరూ లేరని నిశ్చయించు కున్నాడు.

నోట్లకట్టను గోతిలో పూడ్చిపెట్టి తిన్నగా మాషా గదికి వెళ్లాడు. ఇలియా అప్పటికి కొంత తేరుకున్నాడు; అయినా వాని మొహంలో వుద్విగ్నత, గాభరా ప్రస్ఫుట మవుతూనే వున్నై.

"నే ఓంత ముందుగా వచ్చావేం?" అన్నది మాషా వానిని చూచీ చూట్టంతోటే.

"మంచు యెక్కువగా కురుస్తోంటే వచ్చా. అయినా మీరు అప్పుడే వచ్చానని సతాయించు తున్నారేంవిటి? నే మామూలు వేళకే వచ్చానే!"

"మంచువల్ల మసగ్గా వుందిగాని, యింకా పొద్దు లేక పోలేదులే. సరే గాని, కంగారుగా మాట్లాడు తున్నా వేమిటి?"

"అబ్బ! ఏమిటీ కుంటి ప్రశ్నలు? 'ముందొచ్చావేం; ఎక్కడికెళ్తున్నావ్, చేతిలో దేమిటి' అని నన్ను వేధిస్తా రెందుకు?"

మాషా వాడి వింతధోరణికి విస్తుపోయింది. "మాటి మాటికి యివాళ యిల్లా శృతిమించి పోతున్నావేమి" టని మళ్లీ అడిగింది.

"భేష్! అయితే యిక నేను మాట్లాడనులే" అని ఇలియా కుర్చీలో కూచున్నాడు. మాషా వింతగా ఒక సారి వాని వంక చూచి టీ కాచేందుకు అవతలికి పోయింది. ఇలియా రెప్పలు వాల్చకుండా ఆమెపైనే దృష్టినిల్పి 'ఈ అమాయిక పిల్ల వొక్కతే తోడులేకుండ యెల్లా వుండ గల్గుతోంది దబ్బా! పాపం! రోజంతా కష్టపడి పొట్ట పోసుకో వాల్సి వస్తోంది' అని ఆలోచించుతున్నాడు. "ఈమెకు జీవితంలో సుఖం లేశమాత్రంలేదే! నేనో! కావాలను కుంటే సుఖంగా గడుపగలను" అనుకున్నాడు.

ఈ విధంగా వూహా పథంలో విహరించుతూంటే ఇలి యాకి వుల్లాసంగానే వుంది; కాని, మాషాని ఆమెగతికి వొదిలిపెట్టడం తా నన్యాయం చేయటమే ననుకున్నాడు. ఆయోచనలోనుంచి "మాషా!" అని మెల్లగా పిల్చాడు.

"ఏమిటి?"

"నీకు తెలుసా నేనెంత ఘోర......" అని టక్కున ఆగాడు. తన రహస్యాన్నామెతో చెపుదామా, వద్దా అని సంధిగ్ధావస్థలో పడ్డాడు ఇలియా.

"నిన్నదమాయించే వాళ్లెవరూ లేరనా?" అంది మాషా.

"అంత తురుతుగా అనెయ్యకు."

మాషా లేచి ఇలియా దరికొచ్చింది. "నన్ను త వెంట తీసికెళ్ళమని మీ బాబాయితో చెప్పవూ?" అంది.

ఇలియా పరధ్యానంగా "ఎక్కడి" కనడిగాడు.

"ఆయన తీర్థయాత్రలకు వెడుతున్నారటగా?"

మాషా భక్తురాలివలె చేతులు జోడించి ఇలియా ముందు నుంచొని వుంది. ఆమె నేత్రాలనుండి కన్నీటి చుక్కలు టపటప కింద పడుతున్నై. "దేశాటన బలే సుఖ దాయకంగా వుంటుంది. పల్లెటూళ్ళ ప్రకృతిశోభ, అరణ్య వృక్షాలు వసంతఋతువులో మనోహరంగా వుంటాయి. నా కవన్నీ చూడాలనుంది. నా కోర్కె తీర్చవూ? నువ్వు చెపితే ఆయన కాదనరు. నే నాయనకు భారమవన్లే. బిచ్చ మెత్తుకొని పొట్టపోసుకుంటాను" అని అతి దీనంగా చెప్పు తున్నది. ఆమె ఇలియా చెయ్యి పట్టుకొని ముద్దు పెట్టుకో బోయింది.

ఇలియా త్రాచుపాముని తొక్కినట్టు యెగిరి గంతేసి యెడంగా పోయి నుంచున్నాడు. ఆ వుద్వేగంలో "మాషా! నువ్వేమి చేయబోతున్నావో తెలుసా? ఈ చేతుల్తో నే నింతకు ముందే ఒక హత్య చేసి వచ్చాను. అల్లాంటి అప విత్ర హస్తాన్ని నిన్నెలా ముద్దెట్టుకో నిస్తాను?" అన్నాడు.

మాషా మళ్ళీ అతన్ని సమీపించింది. ఓస్! పర్వా లేదులే. నేను నిత్యము యెన్నెన్ని అపవిత్ర హస్తాల్ని ముద్దు పెట్టుకోవటం లేదు. కానీ దానం చేసిన ప్రతి వాడు చెయ్యి నందిస్తాడు. ఇష్టమున్నా, లేకపోయినా చాచిన చేతి నందుకొని పెదా లానించక తప్పదు" అంది.

తన పాప కృత్యాన్ని గురించి కొంత వరకు చెప్పేశాను గదా అనీ, తన మాటల్లోని యదార్థాన్ని గ్రహించి మాషా రహస్యాన్ని తెలుసుకోజాల నందుకు ఇలియా చాల సంతోషించాడు. మందహాసం చేస్తూ "నే నంతా యేర్పాటు చేస్తానే మాషా! నువ్వు విచార పడ నక్కర్లే నీ దారి ఖర్చులకు కూడా నేనే యేర్పాటు చేస్తాను సరే" అన్నాడు.

మాషా సంతోషంతో చంకలు కొట్టుకుంది. ఇలియాను గట్టిగా కావిలించుకుంది.

ఇలియా ఆ అబోధ బాలిక బాహువల్లరినుంచి తప్పించుకొని "ఇప్పుడు నన్నేమీ విసిగించమాకు మాషా! నీ ప్రయాణ సన్నాహ మంతా చేస్తానన్నానుగా. అయితే ఒక సంగతి నా కోసం కూడ ప్రార్థించే?" అన్నాడు.

"ఓ, తప్పకుండాను."

అప్పుడు "ఎందు కలా అరుస్తావు? నీ మాటలు బజార్లోకి విన్పిస్తున్నై తెలుసా?" అంటూ జాకోబు గదిలో కొచ్చాడు.

మాషాకి సంతోషం పొంగివస్తోంది. అ హుషారుతోనే "నేను కూడ వెళ్లిపోతున్నాను జాకోబ్! ఇలియా పెరెన్నుతో చెప్పి నా యాత్రకి యేర్పాటు చేస్తానని మాట యిచ్చాడు" అని చెప్పింది.

"పెరెన్ను వొప్పుకుంటాడనేనా నీ వుద్దేశం?" జాకోబు ఇలియా నడిగాడు.

"ఆయన కొచ్చే యిబ్బంది యేముంది? మాషా ఆయన కేమయినా బరువైతేగద!......మాషా ముఖం చూడు! మానవి కాదు, దేవీ స్వరూపం!" అన్నాడు ఇలియా.

జాకోబు వుదాసీను డయాడు.

"నువ్వెంత విచారంగా వున్నావే?" ఇలియా అడిగాడు.

"నన్నందరూ వొదిలిపెట్టి పోతున్నారుగా." జాకోబు బిక్క మొగంతో అన్నాడు.

"దాసీ నుంచుకోవోయ్!" అని ఇలియా అపహసించాడు.

"బ్రాంది, గ్లాసు, దాసీ—మూడూ కావాలి" అన్నాడు జాకోబు.

మాషా జాకోబువంక చూచి తలొంచుకుంది. "ఇంత దుర్బల హృదయుడవే? "అంది.

"అవున్లే! నన్నొదిలేసి పోతూన్నందుకు నేను విచార పడుతూంటే పైగా మనోదండి లేనివాడినంటున్నావుకదూ? స్నేహితుణ్ని యీ విధంగా ఒక్కడినీ వొదిలిపెట్టి పోవటం నీకు న్యాయమేనా?"

ఈ మాటలని జాకోబు ఇలియా పార్శ్వంలో చతికిల బడ్డాడు. "నేను కూడ పెరెన్క వెంట వెళ్తే యెంత బాగుంటుంది!" అన్నాడు మళ్లీను.

"రా, నువ్వుకూడ వస్తే మరీమంచిది! నేను మాత్రం వెళ్లితీరాలి" అన్నది మాషా.

"ఒకవేళ నేను బయల్దేరి వచ్చినా మానాన్న నా వెనకాలే పోలీసుల్ని తరుముతాడోయ్!"

అందరూ మౌనం వహించారు. కాస్సేపాగి జాకోబు లేనినవ్వు తెచ్చుకొని "తాగుడువల్ల మేలు ఛాలావుంది. దానివల్ల చైతన్యం లుప్తమైపోతుంది. మంచి–చెడ్డల విచక్షణా జ్ఞానమే వుండదు. చీకూ–చింతా లేక నిర్వి చారంగా పడుండొచ్చు" అన్నాడు.

"సిగ్గులేని శిఖండి!" అంది మాషా.

జాకోబు కోపంతో "నోరుముయ్! పైన సతాయించే వాళ్లెవరూ లేకపోతే శ్రీరంగనీతు లెన్నయినా చెప్పచ్చు. మీనాన్న నిన్నేన్నడైనా వొక్కమాట అన్నాడూ? బ్రతికే వున్నాడుగా!" అన్నాడు.

"నా కల్లాంటి బాధేమీ లేదు. నా జీవితం చాలా సుఖంగావుంది. లేకపోతే యెప్పుడో పారిపోయి వుండే దాన్ని. మళ్లీ వెనక్కి తిరిగ్గూడ చూచేదాన్ని కాదు."

"ఏం సుఖం, నీ బొంద సుఖం! అసలు మన్లో యెవ రికీ సుఖంలేదు" అన్నాడు ఇలియా.

"ఈ తగులాట యేమీ లేకుండా యే అరణ్యానికో, నదీ తీరానికో పోయి యేకాంతంగా జీవించటమే సుఖం" అని జాకోబు తన వుద్దేశాన్ని వెలిబుచ్చాడు.

"ఓరి పోచికోలురాయుడు! అందులో యేముం టుందిరా ఆనందం?" అన్నాడు జాకోబు.

జాకోబు కొంచెమాగి "నాకు బలే పుస్తకం దొరి కిందిరోయ్!" అన్నాడు.

"ఏం పుస్తకం?"

"మొరాకో బైండుచేసి వుంది. యేదో ధార్మిక గ్రంథ మయివుంటుంది. చవగ్గా యిస్తుంటే కొన్నా."

ఇలియాకు మాట్లాడాలని లేదు; కాని, మౌనంగా వుంటే భావపరంపర చెలరేగి పీడించవచ్చుననే భయంతో "పుస్తకం పేరేమిటి?" అనడిగాడు.

"అట్ట చిరిగిపోయింది. అందులో భూమ్యాకాశాలు, నీరు, మనిషి మొదలైన విషయాలు చాలాచాలా వున్నై. గ్రంథకర్త నాస్తికు డయివుంటాడు."

ఇలియా లేచి నిలబడి "ఏదీ, ఆపుస్తకం? చించి ముక్కలు చేస్తా. నీ చెవులు పట్టుకొని మెలేస్తానుండు" అని మిరి మిరి చూచాడు.

"ఎందుకోయ్?"

"నువ్వు యింకెప్పుడూ ఆపుస్తకం చదవకుండా వుండ టానికి. దాని రచయిత శుద్ధ మూర్ఖుడై వుంటాడు. ఈశ్వ రుడు సృష్టికర్త—సంహర్త కూడాను; ఆయన సర్వాం తర్యామి, సర్వజ్ఞుడు. ఆయనకు మించినది లేదు. పరీ క్షార్థమై మనకీ జన్మ నిచ్చాడు. మనం పాపానికి దూరంగా,

పారిపోతామో, లేదో చూస్తుంటాడు. పాపం వేపుకే పోతే శిక్షిస్తాడు. ఇదంతా మానవ మాత్రునికి సాధ్య మేనా?''

"కాని, నా అభిప్రాయం అదికాదు" జాకోబన్నాడు.

"నీ వుద్దేశం యెవడి కా్కవాలి? అసలు ఆలోచిం చేందుకు నువ్వెవరివి? ఆ పరమేశ్వరుని ఆజ్ఞ లేనిదే వొకడు యింకొకని వెంట్రుకైనా కదిలించలేడు. నేను పాపం చేశానూ అంటే– ఆయన ప్రేరేపణతోనే."

ఇలియా స్పృహ తప్పి యేమేమిటో అసందర్భంగా వాగేశాడు. వాని దేహం వొణుకుతోంది.

"నీకు పిచ్చిగాని యెత్తిందా యేం? నువ్వు చేసిన పాపమేమిటి?''

అని జాకోబడిగిన ప్రశ్నతో ఇలియా మేలుకొ న్నాడు. నెత్తిమీద అదాటుగా కొత్త కడవలోసి చన్నీళ్లు గుమ్మరించినట్లు వాని మెదడు చల్లబడింది. మాషా, జాకో బుల వంక అనుమానంగా చూశాడు. ఇద్దరూ భయ భ్రాం తులై విస్మయ పడుతున్నారు.

" నేను వుదాహరణకి అన్నానులే " అన్నాడు ఇలియా.

"నీ ఒంట్లో బాగా లేదల్లే వుందే" అంది మాషా.

"అలా వెర్రి చూపు చూస్తున్నావేం ఇలియా?" అ నడిగాడు జాకోబు.

చప్పున చేతుల్తో కళ్లు తడుపుకొని "నిజంగా ఒంట్లో బాగా లేదోయ్" అని ఇలియా మొహం పక్కకు తిప్పుకున్నాడు.

ఇక నక్కడ వుండటం ఇలియాకి భారమనిపించింది. మాషా కాచి యిచ్చిన టీ నయినా ముట్టలా. మెదలకుండా లేచి పోయాడు.

వెళ్ళి పక్కమీద వాలాడో లేదో టెరెన్సు వచ్చి పక్కనె కూచున్నాడు. పాపవిమోచన అవుతుందనే వుజ్వలానందంతో ప్రఫుల్ల హృదయుడయివున్నాడు టెరెన్సు.

"నీతో మాట్లాడాలని వచ్చారా అబ్బాయ్!" అని టెరెన్సు సంభాషణ ప్రారంభించాడు.

"మీ రిక్కడి నుంచి వెళ్ళే దెప్పుడు?"

"ఎండలు ముదిరినాక వెళదా మనుకుంటున్నాను."

"మాషాని కూడ మీ వెంట తీసికెళ్ళండి."

"ఏం, మీ దగ్గరే వుంచుకోరాదూ?"

"ఇక్కడ వుంటే ఆమె పతనమై పోతుంది. మాకా—ఆమె పైన యే ఆశా లేదు. మా అందరి స్థితీ ఒకలాగే వుంది. మీతో తీసికెళ్ళండి.

"నే నెల్లా తీసికెళ్ళగలను? అయినా నాకీ తగులాట మెందుకు చెప్పు?"

ఆమె బరువు మీ రేమీ యెత్తుకోవద్దు లెండి. మీరు

నా కిస్తానన్న నూరు రూపాయలు ఆమెకోసం ఖర్చు పెట్టండి. అనాథకు సాయం చేస్తే మీకు పుణ్యం కూడ దక్కుతుంది.

"నువ్వు చెప్పింది నిజమే. కాని, నీ కిచ్చిన సొమ్ము మళ్ళీ నేను తీసుకోలేను. మాపా సంగతి ఆలోచించి చెపుతాలే...... నిన్న పీటరు వాసిలోవిచ్ లీనఫ్ వచ్చారు. ఆయన చాలా ప్రసిద్ధి కెక్కిన పరివ్రాజకులు. వారి వుపదేశంతో నాకు చాలవరకు శాంతి చేకూరింది. వారి దర్శనం అయాచితంగా లభించటం నా అదృష్టమే!"

ఇలియా పెదవి విప్పనే లేదు. కాస్సేపు ఒంటరిగా వుంటే బాగుండు ననుకున్నాడు. టెరెన్సు చెపుతున్న మాటలు వాని బుర్ర కెక్కటం లేదు. పినతండ్రి అవతలి కెళ్ళిపోతే బాగుండు ననుకున్నాడు; కాని, టెరెన్సు చెపుతూనే వున్నాడు— "పాప - పుణ్యాలు, జీవుడు - ఆత్మ మొదలయిన విషయాలను గురించి చర్చించాము. కత్తికి పదును పెట్టేందుకు రాయి అవసరమైనట్టె ఆత్మని మేల్కొల్పటానికి పాపం కూడ అవసరమే నని ఆయన సెలవిచ్చారు."

"మీ వుపదేశకుని మొహం సైతాను ముఖంలాగే వుందా?" ఇలియా అడిగాడు.

టెరెన్సు విస్తుపోయాడు.

''తప్పు, అల్లా అనకూడదు నాయనా! ఆయన గొప్ప

పుణ్యాత్ముడు. నీ తాతగారి కీర్తికంటె ఆ మహానుభావుని యశం గొప్పది.

"ఉఁహూఁ, అలాగా! మంచిదే. ఇంకేం సెల విచ్చారు?"

ఇలియా ధోరణి యివాళ యెందువల్లనో వింతగా వుందని టెరెన్సు కంగారు పడుతూ "నీ మనస్సు బాగా లేదా?" అనడిగాడు.

"బాగా లేకేఁ. మీ గురువుగారి భావాలు నా వుద్దేశాలతో కలుస్తున్నె. ఇంతకు ముందు నేనూ అలాగే ఆలోచించుతున్నాను."

ఇలియా మరి మాట్లాడలేదు. మొహం గోడవేపుకి తిప్పుకొన్నాడు.

"మానవునికి ధైర్యం కలిగించగలది పాపమేననీ, దాని సహాయం వల్లనే దైవసన్నిధికి తేలిగ్గా చేరుకోవచ్చనీ కూడ వారు చెప్పారు."

"మీరు సైతాను లాగున్నారే!" అని ఇలియా పకప్పున నవ్వాడు.

టెరెన్సు బిత్తర పోయాడు. ఇలియా లేచి కూచుని మళ్లీ యిలా చెప్పాడు:

"నేను ప్రాయశ్చిత్తం చేసుకుంటేనో! నాకసలు పాపం చేయాలన్న వుద్దేశమే లేదు. అదంతా భగవదేచ్ఛతో దానంతటదే జరిగిపోయింది. ఈ మాత్రానికి నే నెందుకు చింతించాలి? దేవునికి అంతా తెలుసు. ఏది

జరిగినా ఆయన ప్రేరణ వల్లనేగా. ఆయన కా పని యిష్టం లేకపోతే నన్నాపి వుండాల్సింది; కాని, ఆపలేదుగా మరి. కాబట్టి నేను చేసింది సబబే.........అసలా లెక్కకొస్తే పాపంచేయని దెవరు? ప్రాయశ్చిత్తం చేసుకోవాలని యేడ్చే దెవరు?"

"ఏమిటో, నీ మాటలధోరణి నాకు అర్థంకాలా."

"తెలియక పోతే మరి యీ వాగుడంతా దేనికి?" అని ఇలియా పక్కమీద ఒరిగాడు. "నా ఒంట్లో బాగా లేదు బాబాయ్!" అన్నాడు నిమ్మళంగా.

"నేనూ అలాగే అనుకుంటున్నాన్లే."

"నేను నిద్రపోవాలి. ఇక నన్నొదిలిపెట్టి పొండి."

టెరెన్సు లేచి వెళ్ళిపోయాడు. ఇలియా ఒక్కడే పడుకొని వున్నాడు. మధ్యాన్నపు ఘటన వాని కళ్ళ ముందాడుతోంది. పోలటోవ్ తన ముందు నిలబడి దీన వదనంతో యేదో చెప్పబోతున్నట్లు తోచింది.

ఇలియా వ్యాకులచిత్తుడై కళ్ళు బలవంతంగా మూసుకున్నాడు.

17

నిద్ర పట్టక ఇలియూ పక్కమీద యిటూటు దొర్లు తున్నాడు. అప్పు డెవరో నౌకరు ఒక చీటీ తెచ్చి యిచ్చాడు. అది లీసా రాసింది.

"రాత్రి సరిగా పది గంటలకు కనెస్కీ రోడ్డు మీద చౌకులో నీకోసం యెదురు చూస్తుంటాను."

అని రాసివున్న ఆ చీటీని చదవగానే ఇలియూకు గత రాత్రి తనకు జరిగిన అవమానం జ్ఞప్తికి వచ్చింది. క్రోధ - ద్వేషాలచే వాని మో మెరుపెక్కింది. "నువ్వు మరొకప్పుడు రాకూడదూ?" అన్న లీసా తిరస్కార వచనం వాని చెవుల్లో గింగురు మంటోంది.

"లీసా నాకోసం యిప్పు డేల కబు రంపిందో! నాతో ఆమె కేంపని? అని ఆలోచించ సాగాడు.

ఆదేశానుసారం పది గంటలకె నియమిత స్థలానికి ఇలియూ చేరుకున్నాడు. లీసా అప్పటికే వచ్చి కాచుకొని వుంది. ఆమెని చూచి ఇలియూ కంపించాడు. కళ్లు మినహా యింకేమీ కనపడకుండేలాగున లీసా ముసుగు వేసు కొచ్చింది. ఇలియూ మాట్లాడకుండా పోయి ఆమె ముందు నిలబడ్డాడు.

"మొహం కన్పడకుండా కప్పుకో" అని లీసా వానిని

సందు—గొందులు తిప్పి తిప్పి దొడ్డిగుమ్మాన తన యింట్లోకి తీసికెళ్లింది. ఒక గదిలో కూర్చోబెట్టి "మనిద్దరిని కోర్టు కీడుస్తారు" అంది.

"ఎందుకు?" ఇలియా ఆతురతగా అడిగాడు.

"సాయంత్రంనుంచి గూఢచారి ఒకడు యిక్కడే తచ్చాడుతున్నాడు."

"అయితే నాకేం? ఇంతకూ నువ్వు నన్నెందుకు పిల్చినట్టు."

"నా మీద కోపంగా వుందా? తొందర పడక నా మాటలు శ్రద్ధగా విను. కోర్టులో మన యిద్దరి సంబంధాన్ని గురించి అడిగితే యదార్థం చెప్పేశెయ్యి; కాని, వృద్ధుని విషయంలో యేమడిగినా సరే, జాగ్రత్తగా సమాధానాలివ్వు. ఆయన్ని నువ్వెన్నడు చూడలేదనీ, అతణ్ని గురించి నీకేమీ తెలియదనీ చెప్పాలి."

లీపా తన్ను చూచి భీత హరిణేక్షణలా బెదురుతోందని ఇలియా కనిపెట్టాడు. తన కామె భయపడుతూన్నట్టు గ్రహించాడు. ఆమె స్థితి వానికి సంతోషాన్నే కలిగించింది. లీపాని ఇంకా కలవర పెట్టాలని వికటంగా నవ్వసాగాడు.

లీపా కంపించి పోయింది. ముఖంలో కళ—కాంతు ల్లేవు. ఒకడుగు వెనక్కి తగ్గి "ఎందుకల్లా వెర్రిగా నవ్వుతూ చూస్తున్నావు?" అన్నది.

"నేను అబద్ధ మెందుకు చెప్పాలి? నేను పోలటోవ్‌ను నీ యింటి దగ్గర చూళ్లేదూ?"

ఇలియా హృదయంలో ద్వేషాగ్ని గప్పు మంటోంది. గోడ నానుకొని మళ్లీ యిల్లా అన్నాడు—"నా ప్రతి ద్వంద్వి వాడేనని నే నప్పుడే అనుకున్నాను. నేను వాడి గొంతు పిసక్క పోతే........"

లీపా బల్లమీద చేత్తో కొట్టి చెప్పింది—"నువ్వు అబద్ధ మాడుతున్నావు. అతడు నీ దారిలో కంటకంగా యెన్నడూ లేడు. మన అవసరంకోసమే........

"ఆఁ, అల్లాగా!" అని ఇలియా మధ్యలో దీర్ఘ శ్వాస తీశాడు.

"నువ్వు స్వస్తి చెప్పమని యెప్పుడు చెప్పితే అప్పుడే తోలేస్తానని నీతో యెన్నిసార్లో చెప్పాను. ఎప్పటి కప్పుడు నువ్వు నవ్వుతూ వూరుకున్నావే గాని, ఆయన్ను రానివ్వొద్దని ఒకసారి స్పష్టంగా చెప్పనైతివి. అతని రాక—పోకలకు నువ్వూ యిష్టపడ్డావు. నీకు నాయందు నిజమైన ప్రేమ యెప్పుడూ లేదు."

ఇలియా అసలే వుద్రేజితుడై వున్నాడు. లీపా యెత్తి పొడుపు అగ్ని కాజ్యం తోడైనట్టు ఇలియా హృదయానికి కశాఘాతమై చురుకుమంది. కళ్లెర్ర జేస్తూ లేచి కూచుని "చాల్లే, వూరుకో. ఒళ్లు దగ్గర వుంచుకొని మాట్లాడు" అన్నాడు.

"నేనెల్లా వూరుకోగల్ను? నిన్ను మనసార ప్రేమించాను; కాని, అందుకు ప్రత్యామ్నాయంగా నువ్వు నాకిచ్చిన దేమిటి? 'లీపా, నువ్వు నాతోనయినా వుండు, లేదా, వానితోనే వుండు. ఒక వరలో రెండు కత్తు లిముడ' వని ఒక్కసారైనా నాతో చెప్పావూ? నీ ప్రవర్తన మామూలు బజారు మనిషి వ్యవహారంలా లేదూ?"

ఇలియా వుడికిపోతున్నాడు. పిడికిలి బిగించి "నువ్వెందు కూరుకోవో చూస్తానుండు" మని పొడవ బోయాడు.

లీపా తప్పించుకొని యెడంగాపోయి "నువ్వాతణ్ని చంపుతా నన్నావుకదూ యిదివరకు? సరే, యిప్పుడు నా వొంటిమీద దెబ్బ పడనియ్యి; పోలీసోళ్ను నువ్వే హత్య చేశావని కేకలేస్తాలే" అని బెదిరించింది.

ఇలియా నిజంగానే బెదరిపోయాడు. తనకే మూడుతుందని జంకాడు. ఊపిరి సలపలా. తన పీక నెవరో నొక్కుతున్న ట్లనిపించింది. చతికిలపడి వెర్రిగా నవ్వాడు. లీపా పెదిమ కొరుక్కుంది. నోరుజారినందుకు పశ్చాత్తాప పడుతోంది. ఆ కారుచీకటిలో దేనికో తడుముతూ "నవ్వు, బాగా నవ్వు!" అంది.

"నవ్వకేం, దొబ్బొచ్చిందా?" అన్నాడు ఇలియా.

"తొలిసారి చూచినప్పుడు నన్నుద్ధరించేవాడివి నువ్వే ననుకున్నాను; కాని......"

"లీపా!" ఇలియా మెల్లగా పిల్చాడు.

లీపా పలకలా.

ఇలియా మళ్ళీ పిలిచాడు. వాని హృదయంలో తుపాను చెలరేగింది. "పోలటోవ్‌ను చంపింది నేనే లీపా!" అన్నాడు.

లీపా గజగజలాడింది. తలెత్తి ఇలియా వంక చూచింది. అతి కష్టంతో "నువ్వు భయపడుతున్నావా?" అనడిగింది.

కాని, అసలు తానే భయంతో కంపిస్తోంది.

ఇలియా ఆమె దరికి పోయి కూర్చొన్నాడు. లీపా అతని చెయ్యి పట్టుకొని "ప్రియా! నువ్వు నన్ను వుడికించుతావెందుకు? అతడు చచ్చిపోయాడని నాకేమీ దిగుల్లేదు. మంచి పనే జరిగింది" అన్నది.

"ఆ పని చేసింది నేనే లీపా!"

"హుష్! ఊరుకో. మళ్ళీ ఆమాట నోటి పైకి తేవొద్దు ప్రియా!" అంది లీపా వాని నోరు మూస్తూ.

ఇలియా ఆమెని రెండు చేతుల్లో లాక్కొని యెద కదుముకున్నాడు. ఈ ప్రపంచంలో తన కష్ట సుఖాల్లో పాల్గొంటున్న సహచరి ఆమె ఒక్కతే. ఇప్పుడామె అవసరం మరింతగా కనపడుతోంది.

లీపా వేడి కన్నీటి బొట్టులు ఇలియా మీద పడుతున్నై. ఇక ఇలియాకు కూడ కట్ట తెగడింది.

లీపా ఇలియాను తన ఒళ్ళో పడుకో బెట్టుకొని తల నిమురుతూ "నీకు నా రూప-సౌందర్యా లంటే మోవగింపు లేదని నాకు తెలుసు; కాని, నువ్వు నన్ను హృదయపూర్వకంగా ప్రేమించటం లేదు. ఆ ముసలాయనతో సంపర్కం కలిగి వున్నానని నన్ను ద్వేషించు తున్నావు కూడాను. నువ్విప్పటికీ నన్ను క్షమించనే లేదు" అన్నది.

"వాడి వూసెత్తకు లీపా!" కళ్ళు తుడుచుకొని "కాకున్నది కాక మానదు. భగవంతుడు శిక్షించ దలచిన వాడికిక ముక్తి లేదు. నా ప్రియ లీపా! నువ్వన్న దంతా నిజం. నా హృదయంలో ద్వేషం అంకురించిన మాట వాస్తవమే; కాని, నీ వెప్పటి లీపావే. నేనే అపరాధిని" అన్నాడు ఇలియా రెండు చేతులూ ఆమె మెడకి లంకె వేసి.

ఇలియా స్వరం చలించుతోంది. పెదా లదరుతున్నై. కళ్ళు చెమ్మగిల్లాయి. "దోష మంతా నాదే నీ తప్పేమీ లేదు! నేనే దోషిని" అన్నాడు మళ్ళీ.

లీపా కూడ ఏడ్చింది. ఇద్దరూ ఏడ్చుకొని పడుకున్నారు. "వాడిని చంపింది నేనే, నేనే" నని ఇలియా ప్రలాపించాడు.

"ఈ విధంగా ప్రలాపించటం క్షేమం కాదు. ఇక నా సంగతి మర్చిపో. ఇక నేం చెయ్యాలనీ నీ వుద్దేశం?" అనడిగింది లీపా.

"నే నుద్దేశ పూర్వకంగా చేసింది కాదు లీపా. పోతూ పోతూ దుకాణంలో కూచుని వున్న పోలటోవ్‌ని

చూచాను. అత డొంటరిగా వుంటంవల్ల కా స్నేహ వేధవని యేడిపించాలని లోపలి కెళ్ళాను. వెళ్లేటప్పుడు వానికి హాని చెయ్యాలన్న తలంపే లేదు నాకు. కాని, తీరా యెదుటికి పోగానే సైతాను నా నెత్తి నెక్కి కూచున్నాడు. అది భగవదేచ్ఛ కాబోలు!......కాని, వాడి సొమ్ము నపహ రించటమే మహా పాపం! నేనా నోట్లకట్ట తేవాల్సింది కాదు.''

అని కడుపులో వున్నదంతా వెళ్ళగ్రక్కేసరికి ఇలియా హృదయం వొక్కసారిగా తేలిక పడినట్లయింది. పెద్ద నిట్టూర్పొకటి విడిచాడు. లీపా భయంతో కంపించింది. గట్టిగా వానిని పెనవేసుకొని "డబ్బు తెచ్చి మంచిపనే చేశావు. అందువల్ల ధనాశచే యే దొంగలో హత్యచేసి వుంటారని యెంచుతారు. నువ్వు డబ్బు తెచ్చి వుండకపోతే పగవల్లనో, ద్వేషం వల్లనో హత్యజరిగి వుంటుందని నిశ్చ యించేవారు'' అన్నది.

"కాని, నేనీ పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవా లనుకోటం లేదు. దేవుడు నాకు తగిన శిక్ష విధించుగాక! మానవుడికొకని పాప-పుణ్యాలను విచారించలేదు. అస లందరూ పాపులే. నాకింతవరకు నిర్దోషి అయిన వాడెవడూ అగపడనే లేదు."

"నాకంతా అయోమయంగా వుంది. ఈశ్వరు డేమిచేయనున్నాడో!......మనం యిక్కడినుంచి పారి పోతేనో?'' అంది లీపా.

ఆమె లేచి నిలబడింది. కాళ్లు తడబడుతున్నై. మళ్లీ ఇలియా ప్రక్కనే పడుకొని శరీర మంతటా శాలువా కప్పుకుంది. "ఏ మవుతుంది? మన ప్రాణాల కేమీ ముప్పు రాదు గద?" అనడిగింది.

"పర్వా లేదు లే" అని ఇలియా ధైర్యం చెప్పాడు.

"ఒక వేళ కోర్టుకీడ్చి అడిగితే నేను చెప్పినట్టే చెప్తావు గదూ?"

"ఓసి పిచ్చిదాన! నా కామాత్రం కూడా తెలియ దనుకుంటున్నావా? ఈమాత్రానికే నా మెడకి వురి తగి లించు కొంటానూ? అదెన్నటికి జరుగదు. నేనీ విష యంలో జాగ్రత్తగానే వున్నాన్లే."

"అయితే సరే; గాని, యెన్ని రూపాయలు?"

"రెండు వేలకు పైనే."

"ఒక్, ఇంతేనా? విథం చెడ్డా ఫలం దక్క లేదన్న మాట?" లీపా నిరుత్సాహంగా అంది.

"నేను డబ్బు కోసమే ఆ పని చేస్తేగా!" అని ఇలియా వెళ్ళటానికి లేచాడు.

"మామూలుగా వస్తూ వుండు. మనం దాక్కోవా ల్సిన పని లేదు. వస్తావు కదూ?" అని లీపా ఇలియా గడ్డం పట్టుకొని అడిగింది.

లీపాతో మాట్లాడినందువల్ల పెద్ద బరువు తగ్గిపోయి నట్టుంది ఇలియాకి. వాని కామె యం దదివర కున్న ద్వేష

మంతరించి అనురాగ మతిశయించింది. హంతకుడని తన్నామె యేమాత్రం చెరుకుగా చూడలా తిరస్కరించనూ లేదు. పైగా సానుభూతి చూపి తన కష్టంలో సమభాగిని అవడానికి లీపా ముందుకొచ్చింది కూడాను. కాని, అంతకు ముందె ఒక సారి తన్ను పట్టిస్తానని కూడ బెదిరించింది. ఇవన్నీ తలచుకొని ఇలియా నవ్వుకొన్నాడు. అప్పుడు ఇలియా మానసిక స్థితి మధు మురళీ స్వనము నాలకించిన గంగిగోవులా గుంది.

18

ఇలియా హత్యజరిగిన మూడో నా డుదయాన మామూలుగా హొటల్లోకి వెళ్లాడు. పెట్రుహా వాని వంక తీక్షణంగా చూచాడు. టెరెన్సుకూడ అదోమాదిరి చూపు విసిరాడు. ఒక్కరూ పల్కరించలా. ఇలియా కేమీ బోధపడలేదు. జాకోబు చే సైగతో మాషా గదికి దారిపట్టాడు.

"నిన్న సాయంత్రం పోలీసు వా డొచ్చి నిన్ను గురించి దర్యాప్తు చేసికెళ్లాడు. వాడు మానాన్నను చాలా చాలా ప్రశ్న లడిగాడు. ఇదంతా యెందుకొచ్చింది ఇలియా" అన్నాడు జాకోబు జంకుతూ.

"ఏమేమి టడిగాడు?"

"నువ్వేమి చేస్తుండేది, తాగుబోతు వవునా కాదా అనీ, నీకేయే ఆడవాళ్లతో సంబంధ మున్నదీ, యింకా యేమేమిటో అడిగాడు. అసలు సంగతేమిటి చెప్పవూ?"

"నాకేం తెలుసు?" అని ఇలియూ అక్కడినుంచి వెళ్లిపోయాడు.

సాయంకాలం లీపా వద్దనుంచి ఇలియాకు మళ్లీ జాబు వచ్చింది. "పోలీసులు నిన్ను గురించి చాలా వివరాలు అడిగి రాసుకున్నారు. నే నన్నిటికి జాగ్రత్తగానే జవాబు లిచ్చాను. భయపడాల్సిన అవసరమేమీ కన పడదు" అని రాసింది లీపా.

పట్టణంలో యేమూల విన్నా పోలటోవ్ హత్యా చర్చలే. పరిపరి విధాలుగా చెప్పుకుంటున్నారు. ఆ మాటలు విని ఇలియూ నవ్వుకొనేవాడు. ఒకొక్కప్పుడు తాను కూడ ఆ చర్చలలో పాల్గొనేవాడు. వివిధ వూహా గానాలు విని నవ్వాపుకో లేక పోతున్నాడు. హంతకుడు బలే చతురుడు, చురుకైన వాడనే ప్రశంసలు కూడ ముట్టు తూండేవి.

"సైము లేకపోయింది; గాని, లేకుంటే పెద్ద మొత్తాన్నే కొట్టేశేవాడు, అని ఒకరంటే, 'పాపం! పట్టు బడకుండ ఒడుపుగా తప్పించుకున్నాడు; అదీ మేలే' నని యింకొక డనేవాడు. అంతేగాని మృతుని పట్ల సానుభూతిని ప్రకటించిన నాడొక్కడూ లేడు. లోకుల యీ నిష్ఠుర

స్వభావాన్ని ఇలియా యేవగించుకోకుండా వుండలేక పోయాడు.

ఇలియాకు పాపం చేశానన్న మనస్తాపం యేమాత్రం లేదు. ఇతర భారాలవలె యిది కూడ వాడి హృదయకోశంలో ఒక మూల యిమిడిపోయింది. ఒత్తిడి తగలనిదే నొప్పి కలుగని వాపులాగా అదికూడ ఇలియా యెదలో వుండి పోయింది. భగవంతుడు విచారణనాడు తన పాపాలకు తగిన శిక్ష నెల్లాగూ విధించక పోడని ఇలియా దృఢ విశ్వాసం. ఆ శిక్ష యెప్పుడు విధించబడినా అనుభవించేందుకు సంసిద్ధంగానే వున్నాడు. మరి యిప్పటి నుంచి ఆరాటపడి నందువల్ల కలిగె ప్రయోజన మేమి టనుకున్నాడు. ఈ విధంగా వాని యాత్మకు శాంతి చిక్కింది. ఇక వాడితరుల పాపకృత్యాలను గమనించుతూ నవ్వుకొనేవాడు.

హత్య జరిగిన నాటినుంచి ఇలియా అతి గంభీరంగా వుంటున్నాడు. మామూలుగా వస్తువు లమ్ముకుంటూ, హొటల్లో తింటూ, లోకం చెప్పుకొనే మాటల నాలకించుతూ రోజులు వెళ్ళబుచ్చుతున్నాడు. ఒకనాడు వానికి పూడ్చిపెట్టిన ధనం సంగతి జ్ఞాపకం వచ్చింది. పెళ్ళగించి తెచ్చుకుందా మనుకున్నాడు; కాని, మళ్లీ ఆలోచించి ఒకవేళ పోలీసులు వచ్చి సోదా చూస్తే పట్టుపడ వచ్చునని ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

పోలీసులు రానూలేదు, సోదా జరగనూ లేదు; కాని, కోర్టుకు హాజరు కావలసిందని సమను మాత్రం

వచ్చింది. వేళకు కచేరీకి వెళ్ళాడు. ప్రభుత్వ న్యాయవాది "నీ పేరేనా ఇలియా?" అనడిగాడు ప్రమాణం చేయించి నాక.

"అవును" ఇలియా సమాధాన మిచ్చాడు.

"నిన్ను రప్పించడానికి గల కారణమేమిటో నీకు తెలుసు గదూ?"

"నాకు తెలియదు."

ఇలియా కోర్టుహాలు పరిశుభ్రత, అలంకరణ చూచి "ఇక్కడి జీవితమే జీవితం! ఎంత ఆనందంగా వుంటుంది! దొంగల్ని, హంతకులను పట్టుకోటంలోనే వుంది సరదా. వీళ్ళకి జీతా లెంతెంత యిస్తారో!" అని యోచించు తున్నాడు.

"ఏం? లీపా నీతో యేమీ చెప్పలా?" అని ప్రభుత్వ న్యాయవాది మళ్లీ ప్రశ్నించాడు.

"కొన్ని రోజులనుంచి నే నామెని కలుసుకోనే లేదు."

"ఎన్నాళ్ళ నుంచి?"

"ఖచ్చితంగా చెప్పలేను. ఏ పెనిమిది రోజులు కావచ్చు."

"లీపా యింటివద్ద పోలటోవ్‌ను యెన్ని దఫాలు చూచావు?"

"ఎవరు? హత్య చేయబడిన మనిషా?"

"అవును, ఆయన్ను చాలాసార్లు చూచావు కదూ?"

"నే నాయన్ను యెన్నడు కలుసుకొని వుండలేదు."

"ఎప్పుడూ కలియనే లేదా?"

ప్రాసిక్యూటింగ్ యిన్స్పెక్టరు నిర్లక్ష్యాన్నభినయించుతూ ఇలియాను వెంట వెంటనే ప్రశ్నించుతున్నాడు. ఇలియా తాపీగా జవాబిస్తున్నాడు. అది ప్రా॥ ఇన్స్పెక్టరుకు కంటకంగా వుంది. మధ్య మధ్య బల్లతో ముష్టి యుద్ధం చేస్తున్నాడు. ముక్కు-ద్దాల్లోనించి ఇలియా వంక చూచి మళ్లీ అడిగాడు.

"పోలటోవ్ లీపాతో సంపర్కం కలిగి వున్న సంగతి నీకు తెలుసుగా?"

"నాకు తెలియదు."

ఇలియా ప్రతిదీ నిరాకరించడం వానికి వుడుకెత్తిస్తోంది. "ఆయనకు లీపాతో సంబంధమున్న మాట వాస్తవమేలే. ఆ పొత్తు వార్షించ తగ్గది కాదు."

"కావచ్చు."

"నేను చెప్పింది నిజమే కదూ!"

ఇలియా మాట్లాడడు.

"నీకు లీపాతో యెన్నాళ్ళనుంచి పరిచయ ముంది?"

"సుమారొక యేడాది నుంచీను."

"కాబట్టి పోలటోవ్కు పూర్వంనుంచీ నీకు లీపాతో సంబంధ మున్నట్టేగా?"

ఇలియా "నాకేం తెలుసు" అన్నాడు.

ప్రా॥ ఇన్స్పెక్టరు ఔౕడు కరచుకున్నాడు. ఈల వేస్తూ ఫయిలొకటి తీసి చూచుకో సాగాడు. ఇలియా ఎదురుగా గోడను వేలాడుతున్న పటాన్ని తదేక ధ్యానంతో చూస్తున్నాడు.

"ఆ చిత్రం అంత బాగుందా?" అనడిగాడు ప్రభుత్వ న్యాయవాది.

"ఎందుకు బాగుండదు? క్రీస్తు దేవుడా పోవుచున్న దెక్కడికో? అన్నాడు ఇలియా భక్తి పూర్వకంగా.

ప్ర॥ న్యాయవాది హతాశుడై "మానవులు తమ కర్తవ్యాన్నెంత వరకు పాలించుతున్నారో చూచేందుకు భూలోకానికి వేంచేస్తున్నారు" అని చెప్పాడు.

"ఆయన స్వర్గాన్నుంచే యిదంతా చూడలేరూ?"

"దీనినే వుత్ప్రేక్ష అంటారు. మానవ హృదయాల పైన ప్రభావం కల్గించటానికే యిది చిత్రింప బడింది. మానవు డేవిధంగా ఈశ్వరాదేశాలను తిరస్కరించి పాపాచరణ చేస్తున్నదీ బోధించటానికే యీ పట ముద్దేశింప బడింది. సరే, నిన్నింకా రెండు — మూడు ప్రశ్న లడగాల్సి వుంది" అని చెప్పి ప్ర॥ న్యాయవాది ఆగాడు.

ఇలియా అతని వేపొకసారి చూచాడు. ప్ర॥న్యాయవాది ప్రశ్నమీద ప్రశ్న వేస్తున్నాడు. జవాబు లిచ్చి

యిచ్చి యిలియా గాసి చెందాడు. అతడు బుద్ధి పూర్వకం గానే తనకు విసుగు కలిగించి, మనస్సు కలవరపరిచి అనుకూల సమాధానాలు లాగజూస్తున్నాడని ఇలియా గ్రహించాడు.

"గత బృహస్పతి వారంనాడు పగలు వొకటి-రెండు గంటల మధ్య నువ్వెక్కడున్నావో చెప్పగలవా?"

"హోటలులో టీ తాగుతూ కూచున్నాను."

"ఏ వీధిలో?"

"ప్లేనా స్ట్రీటులో."

"నీకు వేళ విషయంలో ఇంత ఖచ్చితంగా జ్ఞాపకం వుండడానికి కారణం?"

ప్ర॥ న్యాయవాది బల్లమీదకి వొంగి సులోచనాల గుండా ఇలియాను చురచుర చూస్తున్నాడు. ఇలియా రేమాత్రం చలించక మెల్లగా యిలా చెప్పాడు:

"హోటలులోకి వెళ్తూ చౌకులో వున్న కానిస్టేబులును సైమ అడిగాను. అతను వొంటిగంట అయిందని చెప్పాడు. అందువల్లనే యింత రూఢిగా చెప్పగలిగాను."

ప్ర॥ న్యాయవాది కుర్చీలో వెనక్కి చేరగిల బడి పెన్సిలుతో గోళ్ళమీద గిలుకుతూ "ఆ జవాను నిన్నెరుగునా?" అనడిగాడు.

"అవును."

"నీ వద్ద గడియారం లేదూ?"

"లేదు."

"నీ వా కానిస్టేబిలు నంతకు పూర్వంకూడ టైమడుగుతూ వుండేవాడవా?"

"అప్పుడప్పుడూ."

"అక్కడికి సమీపంలోనే టౌను హాలు టవర్ క్లాక్ వుందిగా?"

"దాన్ని చూచి టైము తెలుసుకోవాలన్న విషయం చాలా మందికి గుర్తుండదు."

"నీ వా హోటలులో యెంత సేపటివరకువున్నావు?"

"కేకలు విని బయట కెళ్లాను."

"ఎక్కడికి కెళ్ళావు?"

"హత్యా ప్రదేశానికి."

"అక్కడ నిన్నెవరైనా యెరిగిన వాళ్లు చూచారా?"

"నాకు టైము చెప్పిన కానిస్టేబిలు చూశాడు. నన్ను ముందుకు పోనీకుండ వెనక్కి గెంటివేశాడు కూడాను."

ప్రాసిక్యూటింగ్ ఇన్స్పెక్టరు పరధ్యానంగా వున్నట్టు ప్రకటకు చూస్తూ "సరేగాని, నువ్వు కానిస్టేబిలును టైమడిగింది హత్యకు ముందా, తర్వాతనా?" అనడిగాడు.

ఈ ప్రశ్న నడగటంలో గల వుద్దేశాన్ని ఇలియాసులభంగానే వూహించాడు. వాని మొహం జేవురించింది.

'చూడటానికి పెద్ద మనిషిలా కనపడినా నల్లత్రాచులా వ్యవహరించు తున్నాడే' అనుకున్నాడు ఇన్స్పెక్టరును గురించి.

"నే నెల్లా చెప్పగలను?" అని జవా బిచ్చాడు.

ప్రా॥ ఇన్స్పెక్టరు ముఖం నల్లబడింది. మళ్లీ ప్రశ్నించాడు.

"ఆ కానిస్టేబిలు పే రేమిటి?"

"మ తేయి ఇవానో విచ్."

అధికారికి ఆశాభంగ మయింది.

"ఆరోజున ను వ్వెవరయినా పొడుగాటి వ్యక్తిని కలుసుకున్నావా?"

"లేదు."

"సరే, నీ వాఙ్మూలం చదువుకొని దస్కత్తు చెయ్యి."

ఇలియా కోర్టునుంచి సరాసరి లీపాయింటికి వెళ్ళాడు. జరిగిన వైనమంతా లీపాకు విన్పించాడు. లీపా వాని వీపు తట్టుతూ "పక్కా కిలాడీవి!" అని అభినందించింది.

.. టక్కరి ముండాకొడుకు వల బాగా పన్నాడు. బోల్తా కొట్టించడానికి మహా తిప్పలు పడ్డాడు" అన్నాడు ఇలియా.

"వాళ్ళ వృత్తే అదాయె" అంది లీపా.

"ఫలానా ఘటన జరిగింది. అందులో నీ చెయ్యుం దని అనుమానంగా వుందని స్పష్టంగా అడగ్గూడదూ?"

లీసా నవ్వుతూ అన్నది—“నువ్వు మాత్రం నిజం చెప్పావు?”

“నువ్వన్నది సత్య దూరం కాదులే; కాని, అక్కడ వాళ్ళ యెదుట వున్నంత సేపూ నేను చెప్పింది ప్రతి అక్షరము నిజమే ననిపించింది.”

“దేవుని దయవల్ల అంతా సజావుగానే జరిగిందిలే.”

”నేనొక్క మాట కూడ అబద్ధం చెప్పాల్సిన అగత్యం లేకపోవడం అన్నిటికంటె ముఖ్య విషయం.”

“సి. ఐ. డి. వెధవలు మనిద్దరి పైన బాగా నిఘా వేశారు.”

“నాకు తెలుసు. నన్ను చుట్టుముట్టేందుకు వేట కుక్కల్లాగా ప్రతి అంగుళం నేల పసిపడుతున్నారు. కాని, వాళ్ళకేనా అంత చిక్కేది?......నే నెవరికీ అపకారం తలపెట్ట లేదు; అయినా కాని దురదృష్ట దేవత నా గొంతు పిసకటానికే పూనుకుంది· అస లందరి స్థితీ యింతేలే.”

“ఇక మనం భయ పడాల్సిన అవసరం లేదనుకుంటాను. ఇక మనం నిశ్చింతగా కాలం వెళ్ళబుచ్చ వచ్చు” అంది లీసా.

ఇలియా లేచి కిటికీ వద్ద కెళ్ళాడు. బయటికి చూస్తూ “నేను యెల్లప్పుడు పాపాచరణకె నడుం గట్ట వలసి వస్తోంది. నా కిచ్ఛ లేకపోయినా అల్లాంటి విషయాల్లో చెయి చేసుకోక తప్పటం లేదు. నాకు శాంతిని చేకూర్చి, ఆనందింప

జేయగల వ్యక్తి కన్పించటమే లేదు. నేనా వృద్ధుని గొంతు పిసికి చంపానే గాని, అందువల్ల నేను బావుకున్న దేమిటి? నా చేతుల్ని పాప పంకిలం గావించుకొని, హృదయాన్ని కళంకితం చేసుకున్నాను. నేనా పాపపు సొమ్మునైనా తీసుకోకుండా వుండ వలసింది'' అని దురపిల్లాడు.

లీసా సమవేదన ప్రకటించుతూ యిల్లా అంది.

ఆ పిసనిగొట్టు కోసం విచార మెందుకు?"

"వాడిని గూర్చి నా కేమీ విచారం లేదు; కాని, నేను చేసిన పని వుచితమో, అనుచితమో నిశ్చయించుకో లేకపోతున్నాను. ఎవని ప్రవర్తన వాడికి పవిత్రంగానే తోస్తుంది. ఆ ప్రభుత్వ న్యాయవాది యెవడిని యేమీ చేయలేడు. అతడు కంబళి బొచ్చులో దాగి వుండే నల్లి లాంటివాడు. వాని జీవితము పవిత్రము, సాత్వికము కావచ్చు''

"మనం త్వరలో యిక్కణ్నుంచి వెళ్ళిపోదాము.''

"నే నిక్కడినుంచి కదలను. యిక్కడే వుండి యీ నాటక మంతా చూడాలి."

లీసా దిగులు పడింది.

ఇలియా పచారు చేస్తూ చెప్పాడు——"నే నీ జీవిత పోరాటాన్ని యిక ముందుకూడ సాగించ దలిచాను."

లీసా దెబ్బ తిన్నట్టయింది. "నువ్వు నా విషయంలో సందేహించు తున్నావు. అందువల్ల నే నాతో రానంటు

న్నావు. నీ రహస్యం తెలిసి నందువలన నేను నిన్నలుసుగా చూస్తానని జంకుతున్నావు; కాని, అది పూర్తిగా పొర పాటు; నీ కిష్టం లేనిదే నిన్నొక క్షణమైనా బలవంతంగా వుంచను'' అన్నది లీసా.

ఆమె శాంతంగానే చెపుతోంది; కాని పెదవు లదరుతున్నై.

"అనవసరంగా వాగబోకు" మని ఇలియా గదురుకున్నాడు.

"నేను నిన్ను నిర్బంధించి వుంచను. నీ యిష్టం వచ్చిన చోటుకు పో" అన్నాడు.

ఇలియా లీసా చెంతకు పోయి కూచున్నాడు. ఆమె చేయి పట్టుకొని "నీ బుర్రలో కిల్లాంటి ఆలోచనలు ఎందుకు కలుగుతున్నాయో నాకు బోధ పడటంలే" దన్నాడు.

లీసా తనచేతిని విదలించుకొని "నువ్వెంత ఆత్మాభిమానివో అంత కఠినాత్ముడవని నాకు తెలుసు. ఆ ముసలాతడితో సంపర్కం కలిగి వున్నానని యింకా నన్ను ద్వేషించుతునే వున్నావు. నీ యీ యిడుము లన్నిటికి కారణం నేనే ననికూడ అనుకుంటున్నావు''అంది రోషంతో.

"ఎందుకీ పోచికోలు కబుర్లు? నేను నీ కేవిధంగాను దోష మారోపిచటం లేదు. నావంటి దౌర్భాగ్యుడికి పవిత్ర-నిష్కళంక స్త్రీ సాహచర్యం లభించే అదృష్టం వుండదని నే నెరుగుదును. అది అందరాని పండు; చాల గిరాకీ

చేరం! అల్లాంటివారి దర్శనము సంసారుల యిళ్ళలో మాత్రమే లభిస్తుంది. ఇల్లు—వాకిలి యేర్పరచుకొని సలక్షణంగా కాపురము చేయగలవారికే అలాంటి గృహిణులు ప్రాప్తమవుతారు. అసలు పవిత్రమైన దేదైనా సరే, ధనికులకు మాత్రమే అందుబాటులో వుంటుంది. నా బోంట్లకు యెంగిలి కూడే గతి!"

"నీకు నేను యెంగిలి మంగలంగా కనపడుతూంటే యిప్పుడే వదిలేసెయ్యి" అని లీసా చాల తీవ్రంగా అంది. ఆమె కళ్ళనుండి కన్నీరు ప్రవాహం కట్టింది. ఆ కోమలి హృదయం ఇలియా నిష్ఠురంగా మాట్లాడటంతో కాఠిన్యత వహించింది. ఇక నామె ఇలియాపైకి వాక్బాణాలు వదల్ల సాగింది.

"నేను యిచ్ఛాపూర్వకంగా నే యీ మురికి కూపంలోకి దూకాను. నా హృదయ స్వరూపాన్ని చరితార్థం చేసుకొనే టందు కుపకరించే వస్తువు నిందులో పొందగలనన్న ఆశతోనే ఆ పని చేశాను. నీవు నా కిందులో తోడ్పడ్డావు. నీ సుగుణాలను చూచి నేను మోజు పడలా. పాల పొంగులాగున్న నీ నవయౌవనమూ, కండలు తేరిన శరీరము, ముచ్చటైన క్రాపు, మిలమల మెరిసే కళ్లు. నీ స్వాభిమానము, అన్నిటికి మించి శూలంలా హృదయాన్ని దూసుకొని పోయే నీ చీవాట్లంటే వ్యామోహపడ్డాను. నే నాజన్మాంతం నీకు కృతజ్ఞనయి వుంట

దలిచాను. నీ అడుగుజాడల్లో మెలగుతూ నీ పాద ధూళిని కళ్ళ కద్దుకుంటాను."

ఇట్లని లీపా ఇలియూ పాదాలమీద పడి వాటిని ముద్దు పెట్టుకుంది. ఆమె యింకా చెపుతోంది.

"నేను విముక్తి కొరకె యీ పాప కూపంలో దిగబడి పోయానని భగవంతునికి కూడ తెలుసు. దేవుడు నన్నిందులోనే శాశ్వతంగా వదిలేయడు. తప్పకుండ నేనుద్ధరింప బడుతాను. ఎప్పుడో నే నిందులో నించి బయటపడి తప్త కాంచనంలాగా ప్రకాశించుతాను. నే నామరణాంతం యిందులోనే కుళ్లిపోను. ఒకనాటికి నేనూ ప్రాయశ్చిత్తం చేసుకొని క్షమా ప్రార్ధన చేసే ఘడియ వస్తుంది......... ఇప్పుడు నన్నంటియున్న పాప పంకిలము జీవితమంతా కన్నీళ్లతో కడిగినా వదలదు."

ఇలియూ ఒక సారి లీపాను దూరంగా త్రోసి వేయా లనుకున్నాడు. కాని, ఆమె గట్టిగా వాని పాదాలను పట్టు కొని వుంటంవల్ల ఆ కాఠిన్యత కరగిపోయింది. అమె వెన్ను మీద చేయి వేసి నిమురుతూ ఆలింగనం చేసుకున్నాడు. వాని పరిష్వంగంలో కూడ లీపా అనర్గళ వాగ్ధార ప్రవహించుతూనే వుంది.

"ఒకసారి కాలు జారి పడితే యిక శాశ్వతంగా పతిత మవక తప్పదన్న స్థితిలో నా దోష మేముంది? నేను మిస మిసలాడే యౌవనంలో వున్నప్పటి సంగతి: నా సవతి

తండ్రి నా వెంట పడ్డాడు. పశు ప్రాయుడై నన్ను చెరచటానికి ప్రయత్నించాడు. నే నెన్ని సార్లో మొహం వాచేటట్టు చివాట్లు పెట్టినా ఆయన తన మంకు పట్టు వొదల్నేలేదు. పవిత్రము, నిర్మలము నైన నా అవయవాలను నలిపి మలినం చేసివేశాడు. నేను కడవలాది కన్నీరు కార్చాను. గాని, ప్రయోజనం యేముంది? జరిగిన దానికి ప్రతీకారం లేకపోయింది. అప్పటినుంచి పురుషులపైన అంతు లేని ద్వేషం కలిగింది. నే నిక మగజాతి నెత్తినెక్కి ఆనందంగా అట్టహాసం చెయ్యాలని నిశ్చయించు కున్నాను. కళ్లు మూసుకుని డబ్బును దూబరాగా ఖర్చుపెట్టసాగాను. రాత్రింబగళ్లు త్రాగి మైకం కమ్మి, వివేక హీననయి వుండే దాన్ని. నేటి వరకు నిన్నొకడిని తప్ప యింకెవరిని హృదయంతో ప్రేమించి యెరుగను. కేవలం మగవారిని మోసగించుతూ నా ఆత్మనే విధ్వంసం చేసుకుంటూ వచ్చాను."

లీసా యింత వరకు చెప్పి ఇలియా బాహు బంధంలోనుంచి విడిపించుకోటానికి గింజుకుంది. కాని, వాడామెని గట్టిగా గుండె కదుముకొని వున్మత్తుని పగిది ముద్దులాడుతున్నాడు.

"నువ్వు నన్నవమానించావు. వొదులు, యీ యెంగిలి కూడును పోనివ్వు" మని లీసా స్వాభిమానంతో చాల తీవ్రంగా అన్నది.

ఇలియా యే మాత్రం చలించలా. లీసా యెత్తి

పొడుపును లక్ష్యపెట్టకుండా ఆమె కళ్ళలోకి చూస్తూ యిలా అన్నాడు.

నువ్వు నన్నెన్ని అన్నా సమాధాన మివ్వనులే. మన యీ దుస్థితికి కనీసం రెండు కన్నీటి చుక్కలయినా కార్చే వాడెవడూ లేడనిమాత్రం చెపుతున్నాను. మన మైనా యింకొకరిని గురించి ఖేదపడాల్సిన అవసరం లేదు. నువ్వింత వరకు మంచి పనే చేశావు.......పుండు, నన్ను ముద్దు పెట్టుకోనివ్వు. నీకు నేనిచ్చే జవాబిదే. లీసా! నన్ను నమ్ము. అంతకంటె నీపట్ల నా హృదయంలో యెల్లాంటి ప్రేమ వున్నదో వ్యక్తం చేయలేను.

లీసా వాక్ప్రవాహంతో ఇలియా హృదయం ప్రేమా భరిత మయింది. వారి కీచులాట ముద్దులాటగా మారి, భేద భావాలు ముద్దుల వర్షంలో తడిసి ముడుచుకొని పోయినయి. ఆ తరవాత వారిద్దరు ప్రేమ సూత్రంలో చిక్కుకున్నారు.

"మన జీవితములో సుఖపడే అదృష్టం లేసట్టుంది" అన్నది లీసా.

ఇలియా లీసాని దగ్గరకు లాక్కుంటూ అన్నాడు— "ప్రేయసీ! రా, యీ విచార సాగరంలోనే తరచి ప్రేమామృతాన్ని తీసి తాగుదాము. మన జాతకంలో నిర్వాస-ప్రవాసమే రాసిపెట్టి వున్నా యిద్దరము కలిసే అనుభవించుదాము. ప్రేమ మినహా యీ జగత్తునే మర్చి

పోదాము, రా. భవిష్యత్తును గూర్చిన చింత నాకు లవ లేశమైనా లేదు. నేడు నా హృదయంలో అనంత ప్రేమ వాహిని పొంగి పొర్లుతోంది. నీ కిష్టమయితే అందులో తానమాడు. నేను గతమంతా విస్మరించాను. నేనిక అనవసర వ్యధకు లోనై కుమిలి పోదలచ లేదు.

19

ఇలియా న్యాయాలయానికి వెళ్ళివచ్చిన కొద్దిరోజుల కొకనాడు పోలటోవ్ హత్యాసందర్భంలో ఆడూ అన్నే ఒక పొడుగాటి వ్యక్తికోసం పోలిసు లన్వేషించు తూన్నట్టు వానికి తెలియవచ్చింది. ఆడూ అప్పు నిమిత్తం పోలటోవ్ వద్దకు తరుచుగా వస్తూ పోతూ వుండేవాడట. ఆ వ్యక్తి హత్య జరిగిననాడు, ఆ క్రింతం రోజున వేశ్యాగృహంలో వున్నట్టు గూఢచారులు కూపీతీశారు.

హంతకుడిని కనిపెట్టుటలో పోలీసుల దృష్టి పెడదారి బట్టినదని తెలిసినప్పటినుంచి ఇలియా నిర్విచారంగా వుంటు న్నాడు. ఇక పోలీసు లెంత హంగామా చేసినా అసలు రహస్యం కనుక్కోవటం వాళ్ళతరంకాదని నిశ్చింతు డయాడు.

ఇలియాకు తన ప్రస్తుత జీవితముమీద రోత కలిగింది. వాని స్థితి యుద్ధరంగానికి వెళ్లిన కొత్త సైనికుని లాగుంది.

ఎక్కడైనా ప్రశాంత ప్రదేశంలో ఏకాంతంగా తన జీవిత సమస్యని గూర్చి దీర్ఘంగా ఆలోచించుకోవా లనుకున్నాడు; కాని, వాని చుట్టూర అశాంతి కొలిమిలాగా భుగభుగ మండుతోంది. ప్రతినిత్యము యేదో వొక సంఘటన వాని దృష్టి నాకర్షించుతూనే వుండేది. క్రమంగా వాడు బక్క-చిక్కి పాలిపోయాడు. జాకోబు కూడ వానిని కలవర పెడు తూండేవాడు. కన్పించినప్పు డెల్లా "మిత్రమా! కాస్సేపు తీరికగా కూచుని కబుర్లు చెప్పుకుందాము వస్తావా" అనే వాడు. "ఇప్పుడు తీరిక లే" దంటూ ఇలియా తప్పించుకు నే వాడు.

ఒకసారి "చాలా జరూరైన విషయం మాట్లాడాలి" అంటూ జాకోబు ఇలియా వెంటపడ్డాడు.

"ఏమిటా జరూరు?" అని ఇలియా తరచి అడిగాడు.

"నాకు చాలా మంచి గ్రంథమొకటి లభించింది. అందులో బలే బలే విషయా లున్నాయి."

"నీ మంచి పుస్తకాన్ని పట్టుకెళ్లి పొయ్యిలో పెట్టు. ......సరేగాని, మీ నాన్న నా వేపు అంత గురగురగా చూస్తా డెందుకు?" అనడిగాడు ఇలియా.

"నాకేం తెలుసు? కాని, ఒక ... నువ్వేవో దొంగనాణాలు మారుస్తున్నావని ఆయన ...యితో చెపుతూండగా విన్నాను."

"ఊఁహుఁ, నా పైన యీ ప్రచారం ... చాడూ?"

"పోనిద్దూ, ఆయన మాటలకు విలువేముంది! ఇంతకూ కాస్సేపు కూచునేది వుందా లేదా?"

"పుస్తకం చదవటానికేగా?"

"మరేనోయ్! నే నీ పుస్తకంలో ఒక కొత్త సంగతిని కనిపెట్టాను."

జాకోబు దీనవదనాన్ని చూస్తున్నకొద్దీ ఇలియూవాసి దుస్థితికి వగచాడు. నిజానికి జాకోబు జీవితం భూమికి బరువు చేటుగా తయారవుతోంది. వాడి బాబు పెట్రుహాయింకో హోటలుకు యజమానిని అయిన ఒక ముసలాపిడను పెళ్ళి చేసుకోటానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఆ సంగతి ఇలియూ చెవిని కూడ పడింది.

"పెళ్ళెప్పుడు?" ఇలియూ జాకోబు నడిగాడు.

"ఎవరిది?"

"మీ నాన్న పెళ్ళోయ్."

"నాకేం తెలుసు. ఈయన ఎంత నాలిముచ్చో, ఆవిడా అంత పతివ్రతురాలే. గంతకు తగిన బొంత!"

"నీ కొక తమ్ముడు కూడా వస్తాడోయ్; వాడు చదువుకుంటున్నాడటగా?" అని ఇలియూ నవ్వాడు.

"కాబోలు" అన్నాడు జాకోబు యూదాలాపంగా.

"వాడే నటగా మీ నాన్నకు వారసు?"

జాకోబు ఊంకొట్టి వూరుకున్నాడు. మళ్లీ యేం

తోచిందో గాని మరుక్షణంలోనే "ఆమె కొరకే కొట్టుకుంటున్నాడన్నావుగదూ?" అనడిగాడు.

"అవును."

"అయితే నే నదృష్టవంతుణ్ణే! నాన్న వాడికే బ్రాందీ షాపును ఒప్పగించుతాడు. నాకీ పితలాటకం తప్పుతుంది" అని సంతోషాన్ని వెలిబుచ్చాడు.

తన భావిని తలచుకోవటంతో జాకోబు ముఖంమీద మెఱుపు మెరిసినట్టయింది. వాని అమాయకత్వానికి ఇలియా జాలిపడ్డాడు." మరి నీ జీవితం యెల్లా గడుస్తుంది?" అని అడిగాడు.

జాకోబు చెవులు నిక్కపొడుచుకున్నై. ఇలియా వంక తేరి చూచాడు.

"నే నా విషయం కూడ ఆలోచించుకున్నాను. ప్రతి మానవుడు ముందు మెదడును స్వాధీనంలో వుంచుకోవాలి. తర్వాత భగవంతుడు తన్నెందుకు సృష్టించాడో గ్రహించాలి. ఇప్పుడు సమాజంలో భీషణ సంఘర్షణ జరుగుతోంది. ప్రతి వాడూ త్రాడు పట్టుకొని తన వేపుకు లాగుతున్నాడే గాని, తానెటు పోవాలో యెవడికీ తెలియదు. మానవు డీ ప్రపంచంలో జన్మిస్తున్నాడు; జీవించుతున్నాడు; కాని, ఆ రెండింటిలో యేది యెందుకో యెరుగడు. అసలిదంతా తెలుసుకోటానికి ప్రయత్నించక పూర్వమే మృత్యువాసన్నమౌతోంది. కాన నేను ముం

దూగా యిప్పట్నుంచే ఆ విషయం తెలిసికోటానికి ప్రయత్నిస్తాను."

"నీ నెత్తిమీద మళ్లీ యిదో కొత్త భూతం సవారి చేస్తోందీ? ఇంతకూ అందువల్ల ప్రయోజనం ఏమిటి?" అని ఇలియా అడిగాడు. జాకోబు వాగ్ధోరణి వాని హృద్గంత భావాలను మరొకసారి రేపింది. అవి అంకెకు రాక విదో హాని కాయత్త మౌతున్నట్టుగా తోచింది. జాకోబు సమస్యలు తన కయిష్టంగా వున్నా వాటి పీడ వదిలించుకోలేక పోతున్నాడు.

"ఇదే జీవితసారం. ఆ విషయం తెలిసికొనకపోతే జీవన్మృతుని వలె పడివున్నట్లే. మానవ జీవిత లక్ష్యం నిర్దిష్టంగా వుండాలి. అనిర్దిష్ట పథం వేపుకు యెన్నడు ఒక్క అడుగైనా పడనివ్వ కూడదు" అని జాకోబు వచించాడు.

"నీ మాటలు జీవిత సారమంతా వట్టిపోయి, కాటికి కాళ్లు చాచిన వృద్ధులకు రాణిస్తాయి. సరే, యిక నేను పోయి వస్తా"నని ఇలియా తన దారిని పోయాడు.

ఇలియా యిలాంటి సంభాషణతో వ్యాకుల చిత్తుడయ్యేవాడు. వాని నేదో ఆర్పరాని పిపాస పీడించేది. భగవంతుడు తన్ను శిక్షించటాని కప్పుడే యేర్పాటు చేస్తున్నాడనే భావంకూడ కలిగేది. వాని యాత్మ భగభగ మండుతూన్నట్టుండేది. శాంతికోసం పరితపించేవాడు; కాని, ఇలియాకు ఏకాంతము లభించేదే కాదు. అటువంటప్పుడు

విసిగి వేసారి లీపా వద్దకుపోయి మనోవినోదం కల్గించుకొనేవాడు.

ఇలియూ అపుడపుడు వేరాను చూచి వచ్చేవాడు. ఆ పతిత జీవితంలో ఆమె మరింత అధోగతికి సమీపించుతోంది. వేరా తన ఆత్మకథా ఘట్టాలను సాభిమానంగా చెప్పుతూ వుండేది. విటులు తెచ్చి యిచ్చిన బహుమతు లన్నిటిని విడిచిపెట్టకుండా ఇలియూకు చూపెట్టేది. తన ప్రేమను సంపాదించటానికి తన్ను అనుకూలవతిని గావించుకొనుటకు విటులు పరస్పర మెట్లు కయ్యానికి కాలు దువ్వేదీ, దుయ్య బట్టుకొనేదీ, స్పర్థ నెట్లు పెంచుకొనేవారో నవ్వుతూ వర్ణించేది.

వేరా ఆ రీతిని వర్ణించుతూంటే ఇలియూ ఉల్లాసంగా వుండేవాడు కాదు. విషణ్ణ హృదయంతో "వేరా! ఒక నాటికి నీవు పశ్చాత్తాపించ వలసి వస్తుంది సుమా!" అన్నాడు ఒక నాడు.

"పర్వాలేదు. నా నొసటన యిదే రాసిపెట్టుంది. సాగినంత కాలం సుఖ మనుభవించితే, తర్వాత చూచుకోవచ్చు"నంది వేరా.

"మరి పాషాకు నేమి చేయ దల్చావు?"

"ఆమె ముఖం కళా విహీనమయింది. నవ్వు అదృశ్య మయింది. "నన్ను విడచి పెట్టటంలోనే ఆయనకు మేలుంది. నా సంపర్కం వల్ల వ్యథ చెందటమే గాని, సుఖ ముండదు.

లభించిన దానితో తృప్తి చెందక అంతా తనకే దక్కాలని తాపత్రయ పడి నిరాశతో దిగులు పడుతాడు. కాని, నే నెలాగూ చెడిపోయాను. చెడ్డ చేనుకు మంచెందుకు? నేనిక మధ్యలో ఆగదలచలేదు.

"అయితే నువ్వు పాషాను ప్రేమించటం లేదా?"

"అట్టి వ్యక్తిని ప్రేమించకుండా వుండ గల్గటం నా వశంలో లేదు."

"అయితే మీ రిద్దరూ ఒక ఇంటివాళ్ళై కాపురం చేసుకోరాదూ?" అని అడిగాడు ఇలియా.

"నే నాయనకు భారం కావటం నా కిష్టంలేదు. పాషా తన స్వంత ఖర్చులకే సంపాదించుకో లేడు. మరి నన్నెలా పోషించగలడు చెప్పు?" అంది వేరా తలొంచు కొని.

"అతని స్వభావాన్ని బట్టి ఎప్పుడైనా యేదో భయంకర సంఘటన జరుగుతుందేమోనని నేను భయపడు తూ వుంటాను" అన్నాడు ఇలియా.

వేరాకు నవ్వొచ్చింది. "అతని హృదయం అతి మెత్తనిది. నేను మీ మిత్రుణ్ణి కీలు బొమ్మలా ఆడించ గలను."

"వాడిని వదిలెయ్యవు గద?"

వేరా హృదయానికి సూది గుచ్చుకున్నట్లు బాధ పడి అంది— "మరి నేనేం చెయ్యగలను? నే నొకరి దాననై

జీవించటానికే జన్మించా ననుకుంటున్నారా? ప్రతి ప్రాణికీ సుఖ పడాలని వాంఛ వుంటుంది. ప్రతి వ్యక్తీ సుఖంకోసం మార్గాన్ని వెతుక్కోవటం సహజం. అందరూ యింతే."

"నీవు చెప్పింది అంతా సత్యం కాదు. మానవుడు ఎల్లప్పుడు తన సుఖానికే దేవులాడడు."

"మరి ఎవరికోసం?"

"ఇతరుల సుఖానికి. నీ సుఖానికి మల్లేనే"

వేరా కిలకిల నవ్వింది. "ఓహో! నా సుఖం!" అన్నది.

ఇలియా విషాద హృదయంతోనే అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

ఇలియాకీ మధ్య పాషా ఒకటి రెండు పర్యాయాలు మాత్రమె అగపడ్డాడు. వాడు వేరావద్ద ఇలియాను చూడటం తటస్థించితే మండిపడేవాడు. ఇలియా మౌనంగా వున్నా వాని కళ్ళెర్ర బడేవి. పాషా అనుమానపడి ఈర్ష్యానలంతో కుములుతూవుంటే ఇలియా కొసందంగా వుండేది. పాషాని కీ యీపతిత జీవితాన్నుండి వుద్ధరించటం అసంభవమనుకున్నాడు. ఏదో గట్టిదెబ్బతగలని దే వాడు కళ్ళు తెరచి చూడడని ఇలియాకు విశ్వాసం కలిగింది. వాళ్ళిద్దరిని గూర్చి ఇలియా యెంతో బాధపడేవాడు. అందుకే పాషాకు శాంతి కలిగించాలని వేరా వద్దకు పోవుటకే మానుకున్నాడు.

లీసా సంపర్కంతో ఇలియా జీవిత మానందంగానే గడిచిపోతోంది; కాని, కారు మబ్బులు కమ్ముకొచ్చి అప్పుడప్పుడు వారి సన్నివేశాల్లో తుపాను చెలరేగుతుండేది. వాని హృదయం క్షోభించేది. లీసా వాని గాంభీర్యతను గాంచి "వృధాగా గతించిన దానికి వగచి ప్రయోజన మేమిటి? అందరూ మనలాంటి వాళ్లే. ఎవరి హస్తాలు కళంకితం కాకుండా వున్నాయి?" అని ఊరట కల్గించేందుకు యత్నించేది.

"ఆ విషయం నా ముందు ప్రస్తావించకు. నేనిప్పుడు ఆలోచించేది చేతుల కళంకాన్ని గురించి కాదు. నీవు నా మనోభావాన్ని గ్రహించలేవు. నేనెవ్వరికీ చెరుపు చెయ్యకుండా సుఖ-శాంతులు కలిగి జీవించే వుపాయమేమిటా యని అఘోరిస్తున్నాను". అని ఇలియా చెప్పేవాడు.

వాడెంత విముఖత చూపినా మృతుడైన పోలటోవ్ విషయం ప్రస్తావించకుండా వుండేది కాదు లీసా. ఇలియా సహించలేక అక్కడినుంచి వెళ్ళిపోయేవాడు. మరునాడు మళ్ళీ వచ్చినపుడు లీసా వానిని పరుష వాక్యాలతో నొప్పించేది.

"నీవు జాలి, భయాలవల్లనే నా వద్దకు వస్తున్నావు; కాని, నీ హృదయంలో నా యందు రవంతయినా ప్రేమ లేదు. నేనిక యిలాంటి వ్యక్తితో వుండలేను. యెక్కడికైనా లేచిపోతాను.

లీసా నిత్యము ఇలాంటి వాగ్బాణాలను ఇలియా పైకి విసిరేది; కాని, మరుక్షణంలోనే ఆ వగలాడి ఇలియా పాదాల మీద పడి తన రూపంమీద ఒట్టు పెట్టుకొని వానిని ప్రసన్నుని గావించుకొన ప్రయత్నించేది.

అట్టి తరి నామె కన్ను లరమూత లడి, పెదవు లది రేవి. వాని కౌగిలిలో ఇమిడిపోవటానికి ఆసక్తి కలిగి యున్నట్లు ఆ మిటారి వక్షముబికేది. అంతట ఇలియా ఆమెను బాహుపాశంలో బంధించి వుద్రిక్త మానసుడై ముద్దులాడేవాడు. ప్రేమరసాన్ని వెల్లువగా ప్రవహించే హృదయం గల లీసా బోసినోటి పోలటోవ్ చుంబనా న్నెట్లు సహించ గల్గిందా యని అక్కజ పడేనాడు. ఆ విషయం స్మృతికి వచ్చినప్పుడు లీసా కూడా అసహ్యంతో వుమ్మి వేసేది.

ఒక నాడు ఇలియా లీసా నడిగాడు.— "ముసలి పీనుగను హతమార్చి నప్పటినుంచి నీకు నా పైన అను రాగం అధిక మౌతోంది కదూ?"

"ఏం?"

"ఏముంది? కొందరు తాజా సరుకును వదలి, కుళ్ళి కంపు కొట్టే వస్తువునే పసందు చెయ్యటం చూచి నాకు నవ్వు వస్తోంది."

"ఒక్కొక్కరి అభిరుచి ఒక్కొక్క విధంగా వుం టుంది. రుచులను బట్టి ఆచరణ కూడా భేదించు తుంది" అంది లీసా.

ఒక నాడు ఇలియూ బజారునుంచి తిరిగి వచ్చి బట్టలు మార్చుకొంటూండగా పెరెన్సు వచ్చి "నిన్ను గురించి అనేకు లనేక విధాలుగా చెప్పు కొంటున్నారు. ఏమిటీ గొడవ?" అన్నాడు.

"ఏమని?"

"ఆ హత్యలో నీ చెయ్యి కూడా వుందనీ, దొంగ నాణాలు మార్చుతున్నావనీ, ఇంకా యిలాగే చెప్పు కొంటున్నారు."

"అయితే నన్నందరూ అసహ్యించు కొంటున్నారా?

"సి. ఐ. డీ.లు వచ్చి నిన్ను గూర్చి ఎన్నెన్నో ప్రశ్న లడుగుతున్నారు."

"అడగ నివ్వండి, ఏం పోయింది?"

"అసలు కారణం లేకుండా వాళ్ళెందుకు వేధించు తారు?"

ఇలియూ అట్టహాసం చేసి వూరుకొన్నాడు.

"ఇప్పుడు పోలీసు వాళ్లు రావడం లేములే. పెట్రుహ మాత్రం నిన్ను గూర్చి వున్నవీ, లేనివీ చెప్తుంటాడు. నీ విక్కడినుంచి వెళ్ళిపోతేనే మంచిది. తాను మ్యూని పాలిటీ మెంబరు నసీ, నీ వంటి అనుమానింప దగిన వాళ్ళను తన గృహంలో వుండ నివ్వననీ ఖండితంగా చెప్పేశాడు."

ఇలియూ ముఖం కందగడ్డ లాగైంది. కళ్ళెర్ర జేసి "వాడికి ప్రాణం మీద తీపి వుంటే నోరు సంబాళించు

కొమ్మని చెప్పు. నే నెల్లాంటి వాడనైతే తను కెందుకు? ఇక ముందు అవమానకరంగా మాట్లాడినట్లు తెలిస్తే వాడి తల త్రుంచేస్తా. నాకిష్టమైనప్పుడే ఇక్కడ నుంచి వెళ్తాను. ఇంకా నే నీ పుణ్యాత్ములతో కొంత కాలం వుండ దలచాను" అన్నాడు.

ఇలియా రౌద్రరూపం చూచి పెరెన్సు భయ కంపితుడైనాడు. రెప్ప వాల్చకుండా ఇలియా వంక చూస్తూ మెల్లగా అన్నాడు— "నీకు పెళ్ళీడు వచ్చింది. నీ అంద చందాలు చూస్తే పల్లెటూరి కన్యలంతా వెంటపడతారు. నీవు మన వూరికి వెళ్తేనే బాగుంటుంది.

ఇలియా ప్రత్యుత్తర మివ్వలా.

"నేను మరి కొంత డబ్బిస్తాను. నువ్వు అక్కడ ఒక దుకాణం పెట్టుకొంటే జీవితం సుఖంగా వెళ్లిపోతుంది. అన్నాడు పెరెన్సు.

"నేను అంతకంటె వుచ్ఛదశకు వెళ్ళా లనుకొంటున్నాను."

"మంచిదే; గాని పల్లెటూళ్ళో అయితే రెండూ సమకూడుతాయి. ఉన్నతీ పొందొచ్చు; సుఖమూ ప్రాప్తిస్తుంది."

"ఆ తర్వాతనో?"

"ఈ ప్రశ్నతో పెరెన్సుకు నవ్వు వచ్చింది. ఏదో చెప్పబోయాడు; కాని, ఇలియా చెవిని పెట్టలా. వాడు గత

విషయా లన్నిటిని స్మరించుకొని ప్రపంచ మొట్లు వల వలె చిక్కులతో కూడు కొని వుందో ఆలోచించు కొంటు న్నాడు. రక్షక భటులు నేరస్తుణ్ని పట్టుకొని యిచ్ఛ వచ్చి నట్లు త్రిప్పునట్లే, ప్రాపంచిక ఘటనాక్రమము మానవుని అనిర్దిష్టమార్గంలో తీసుకొని పోతోందని భావించుకున్నాడు. తా నదివరకే ఆ కొంపను వదలిపెట్ట గోరుతున్నాడు. పరి స్థితులు కూడ అల్లాగే సంఘటిల్లుతున్నై.

ఇట్లాలోచనా నిమగ్నుడై వుండగానే తలుపు తట్టిన చప్పు డయింది. "త్వరగా తెరవండి" అని ఇలియా టెరె న్సను హెచ్చరించాడు.

జాకోబు లోనప్రవేశించాడు. వాని చేతిలో పచ్చట్ట పుస్తక మొకటుంది. "మాషా యింటికి పోదాం రా" అన్నాడు వస్తూనే.

"ఎందుకోయ్? ఇలియా అడిగాడు.

"మాషా కన్పించలా; ఎక్కడికి పోయిందో ఏమిటో!"

"ఎక్కడి కెళ్తుంది?" టెరెన్సు అడిగాడు.

"మతిస్సా గది కెళ్తుంది తరుచుగా."

"మతిస్సా సావాసం మాషాకి శ్రేయస్కరం కాదు."

"పోదాం, పద"మని ఇలియా చెయ్యి పట్టుకొని గుంజ సాగాడు జాకోబు.

"నువ్వు ఇంటివద్దనుంచి పలువు తప్పించు కొచ్చిన ట్లున్నావే!" అని ఇలియా వాడి ముఖంలోకి చూచాడు.

జాకోబు "ఇందులో యింద్రజాల మహేంద్రజాల ముంది తెలుసా?" అన్నాడు.

"ఎందులో?"

"ఈ పుస్తకంలోనే. రా, నీ కిస్తాను. బలే చిత్రమైన పుస్తకం! చదువుతూంటే నాకు భయంకలుగుతోంది".

ఇద్దరూ మాషా గదికి వెళ్ళారు.

జాకోబు చేయి చలించుతోంది. కళ్లు లోతుకు పోయి వున్నై.

"తాగి వచ్చావా?" ఇలియా అడిగాడు.

"లేదు. నేనివేళ వాసనే చూల్లేదు. ఇప్పు డసలు రోజూ తాగటం లేదుగా. మా నాన్న యింటి వద్ద వున్నప్పుడు మాత్రం నాకు ధైర్యసాహసా లవసరమై ఒకటె రెండు గ్లాసులు తాగేస్తున్నాను" అని చెప్పి జాకోబు కుర్చీలో కూర్చొని పుస్తకం తెరచి చదువసాగాడు.

"మూడవ అధ్యాయం. మానవుని ప్రారంభ దశ, మానవుని ఆదిమదశ రెండు విధములుగా వున్నదని కొందరి వూహ. ఈ జగత్తుకు వినాశమే లేదని మరికొందరి భావన. వారి వుద్దేశంలో మానవ జాతికి ఆద్యంతాలే లేవు."

అని చదివి జాకోబు పుస్తకంలో నుంచి దృష్టి మరల్చి సాభిప్రాయంగా ఇలియా నడిగాడు-"శ్రద్ధగా వింటున్నావా? మానవుడికి తుది మొదలు లేవు."

ఇలియా సంశయాత్మకంగా పుస్తకం వంక చూచి "తర్వాత చదువు" అన్నాడు.

"సిసెరో, పైథాగరస్ మొదలైన వాళ్లీ విశ్వంలో ప్రస్తుత మున్నదానికి, కానున్న దానికి ఆది లేదని నమ్మి అదే వుద్దేశాన్ని వెల్లడించారు. కాని, మన కళ్లముందే అనేక జీవు లుద్భవించి అంత రిస్తున్నై. వాటి జనన-మరణాలు రెండూ మనకళ్లతో చూస్తూనే వున్నాము."

ఇలియా గభాలున పుస్తకం లాక్కొని మూసి వేశాడు. "ఈ బూతుల బుంగని దూరంగా పారెయ్యి. వీళ్లంతా యేదేదో రాసి పారేస్తారు అర్థంకాని తుక్కు" అన్నాడు.

జాకోబు విస్తుపోయి అడిగాడు, "నీ ఆది నీకు తెలుసా?"

ఇలియా తీవ్రంగా "ఏమిటి?" అన్నాడు.

"కోప్పడకు. ప్రతి మనిషిలోను ఆత్మ వుంటుంది."

"అయితే ఏమంటావ్?"

ప్రతివాడూ తన పుట్టుకను గూర్చి తెలుసుకోవాలి. ఆత్మకు చావు లేదనీ, అది అవినాశకరమైనదనీ తత్వవేత్తలంటారు. అది సర్వదా జీవించే వుంటుంది............... కాని, మానవునికి తన జననాన్ని గూర్చి తెలియ వలసిన ఆవశ్యకత లేదు. వాడు తెలుసుకో వలసింది తనలో ప్రాణం ఎప్పుడు ప్రవేశించిందా అని మాత్రమే. కారణం ప్రతివాడు

జీవంతోనే పుడతాముగా. మరి ఆ శరీరంలోకి ప్రాణం ఎప్పుడు ప్రవేశించిందో కనుక్కోవాలసిందే. తల్లి గర్భంలోనా? అయితే పూర్వజన్మ విషయం ఏల జ్ఞప్తికి రాదో! ఆత్మ ప్రత్యేక పదార్థమైతే అది శరీరంలోకి ఎప్పుడు చేరుతోంది?"

జాకోబు కళ్లు మెరుస్తున్నై. ఏదో ఇలియాంకు తెలియని నిగూఢ రహస్యాన్ని తాను బయట పెట్టినట్టు విజయ గర్వంతో వుబ్బిపోయాడు. హర్షాతిరేకంతో "ఇంతే, ఆత్మ సమస్య నిప్పుడు విడగొట్టు చూద్దాం" అని అరిచాడు.

ఇలియా వాని వంక చూచాడు. "ఎందుకోయ్, ఆ మిట్టిపడటం?" అన్నాడు.

"ఏమీలేదు. వుల్లాసం!"

"నా సలహా విని ఈ పుస్తకాన్ని ఎప్పుడూ చదవకు. యిందులో భగవద్విరుద్ధ విషయాలున్నై. నాలో ప్రాణం ఎప్పుడు ప్రవేశించిందో తెల్సుకోవాల్సిన అవసరం లేదు. ఎవరికీ యే యిబ్బంది లేకుండా నా జీవితం శాంత్యుతము, సుఖప్రదము యెలా అవుతుందో, అందునిమిత్తం నేనెట్లా ప్రవర్తించుకోవాలో తెలుసుకోవటం మాత్రం జరూరు. ఇలాంటి సంగతు లున్న పుస్తక మేదైన వుంటే వెతికి పట్టుకొనిరా."

జాకోబు ఆలోచనలో పడ్డాడు. నెత్తిమీద చేతులు పెట్టుకొని యోచించుతున్నాడు. ఇలియా ప్రత్యుత్తరంతో వాని ఉత్సాహమంతా అణగారి పోయింది. కొంచెమాగి అన్నాడు—

"నీలో నాకు నచ్చని గుణ మేదో వున్నట్టుంది. నీవు చెప్పినది నాకేమీ బోధపడకుండా వుంది. నీకు దేన్ని గురించో అహంభావ ముంది. ఎప్పుడూ మహాపుణ్యాత్ముని వలె మాట్లాడు తుంటావు."

ఇలియా నవ్వుకున్నాడు.

"ఎందుకూ నవ్వుతావు? నేను యదార్థమే అన్నాను. నువ్వు అందరినీ నిందించుతావు. ఎవరితోను చెలిమి కలిగి వుండవు."

"నీవు చెప్పేది నిజమే; కాని, నే నెవరితో మాత్రం స్నేహంగా ఎందుకుండాలి? నే నొకరి సొమ్ము తింటు న్నానా? ప్రతివాడు స్వలాభంకోసం ప్రక్కవాడికి గోయ్యి తవ్వటానికే తయారవుతున్నాడు. అయినా, నాడి కితరుల ప్రేమ కావాలేం? నేను తెలివితక్కువ దద్దమ్మను కాను. నీవు గౌరవా న్నాశించితే, ముందు యితరులను గౌరవిం చటం నేర్చుకో. అందరూ సుఖం కోరేవాళ్లే, ఎవరివంతును నారనుభవించాలి. అప్పుడే అంతా ప్రేమమయ మాతుంది."

"అందరూ సాంసారిక సుఖం కొరకే తాపత్రయ పడుతున్నా రంటావా?"

"ఖచ్చితంగా అవు నంటున్నాను. ఎటుచూచినా మోసము, వంచనలే. మానవుని ప్రతి చర్యలోను స్వార్థ మిమిడి వుంది. భృత్యుడు యజమానికి జమాఖర్చులను ఒప్పజెప్పునట్లె మా పినతండ్రి భగవంతునికి పాప పుణ్యాల

జమా ఖర్చులను చెప్పబోతున్నాడు. మీ నాన్న చర్చిలో గంట కట్టించాడు. దాని అంతరార్థంగా ఆయన యితరినో వంచించి వుంటాడనీ, లేదా మోసగించ నున్నాడనీ నేను భావించుతున్నాను. సర్వత్ర యిదే తంతు. ఒక రూపాయి యిచ్చిన వాడు అయిదు రూపాయ లపేక్షించు తున్నాడు. అంతేకాదు; తన ప్రవర్తన సబబైనదనీ, న్యాయయుక్తమనీ ఒప్పించటానికి ప్రయత్నించుతున్నాడు. ఇంతకూ నేను చెప్పే దేమంటే తప్పు చేసినవాడు దాన్ని ఫలితాన్ని అను భవించటానికి బుద్ధిపూర్వకంగా సిద్ధపడాలని."

"నిజమే. విధాత మనల్ని బలే విషమదశలో సృష్టించాడు. నీవు యితరులను నిందించి, వారి దుష్కార్యాలను విమర్శించి నీ హృదయానికి శాంతిని చేకూర్చుకొంటు న్నావు; కాని, ఆపని నావల్లకాదు. నే నెక్కడికైనా పారిపోతే మేలేమో!"

"ఎక్కడికి వెళ్తావు?"

"ఏమో! ఎక్కడికని చెప్పను?"

ఇద్దరూ మౌనంవహించారు. పరస్పరం ముఖాలు చూచుకొంటున్నారు. ఎదుట వచ్చేట్ల బొక్కు పడివుంది.

ద్వారంవద్ద పదధ్వని విన్పడింది. ఫర్ ఫిషాక్ సిగా రుతో వచ్చాడు. వాని వెనకనే మతిస్సావుంది. ఫర్ ఫిషాక్ తూలి పడబోతుంటే మతిస్సా చేతులుచాచి పట్టు కొనబోతోంది. వాడామె చేతుల్ని త్రోసివేసి "దూరంగా

పో, నాకేం పర్వాలేదులే' అని కసరుతున్నాడు.

జాకోబు వానివంక చూచి నవ్వాడు.

"ఎక్కడినుంచి వస్తున్నారు?" అని ఇలియా అడిగాడు.

"స్వర్గాన్నుంచి" అని పకపకా నవ్వి ఫర్‌ఫిష్కా రాగం తీయసాగాడు.

ఇలియా మళ్లీ అడిగాడు—"మాషా ఏదీ?"

ఈ ప్రశ్నతో జాకోబుకు మాషా సంగతి స్ఫురణకొచ్చింది. వాడూ ఆ ప్రశ్ననే రెట్టించాడు.

కాని, యెవరూ ప్రత్యుత్తర మివ్వలేదు. ఫర్‌ఫిష్కా వ్రేళ్ళు సితారుమీద ఆడుతున్నై. మతిస్సా ఆలాపించుతోంది.

ఇలియా కూర్చున్న చోటునుంచి లేచాడు. ఫర్‌ఫిష్కా మెడను గట్టిగా లంకించుకొని వూపుతూ "నీ కూతురెక్కడుంది?" అని గద్దించి అడిగాడు.

మెడ వదిలించుకొంటూ "ఎక్కడో తిరుగుతూ వుంటుందిలే" అన్నాడు ఫర్‌ఫిష్కా.

జాకోబు మతిస్సా నడిగాడు. ఆమె "నేను చెప్ప" నంది.

ఇలియా పళ్లు పటపటా నూరుతూ "ఈ దుర్మార్గులామెను అమ్మివేసి వుంటా"రన్నాడు.

జాకోబు అలజడి చెంది "మాషా ఏమైనట్లు?" అని ఫర్ఫిషాక్ నడిగాడు.

"ఊఁహూఁ, యిప్పుడు జ్ఞాపకం వచ్చిందేఁ?" అంది మతిస్సా.

"ఏమిటి కర్తవ్యం?" జాకోబు ఇలియూ నడిగాడు.

"పోలీసు స్టేషన్లో రిపోర్టు చేద్దాం."

"ఒసి నీ దుంప తెగ! వింటున్నావా? వీళ్ళు రిపోర్టు చేస్తారంట!"

మతిస్సా ఒకసారి జాకోబువైపు, ఒక పర్యాయం ఇలియూ వంక చూచి గుడ్లు తిప్పుతూ, చేతులు ఝాడించి ఫర్ఫిషాక్‌తో అన్నది—"నీవే పోయి స్టేషన్లో చెప్పి రారాదూ. వెళ్ళు. వీళ్ళస లికక్కడి కెందుకు రావాలి? యిది నా యిల్లు. నేను నిన్ను పెళ్లి చేసుకోబోతున్నాగా."

ఫర్ఫిషాక్ నవ్వుకుంటున్నాడు.

"ఈ దుష్టులు మన కేమీ చెప్పేట్లులేరు. పోదాం, పద"మన్నాడు ఇలియూ.

"ఆగు, వెడదాం. మాషా యీడొచ్చిన పిల్ల. ఏం చేశానో!" మతిస్సా వేపుతిరిగి "ఏమిటి సంగతి? చెప్పవా?" అనడిగాడు జాకోబు.

"ప్రియా! వీళ్లిద్దరిని పట్టుకో, రక్క, కొరుకు" అని ఫర్ఫిషాక్ అరిచాడు. నాలిక వెళ్ళబెట్టి యీల వేయ

జోగయాడు; కాని, ధ్వని రాలా. జాకోబుకు నాలుక చూపి నవ్వసాగాడు.

మతిస్సా ఇలియా వద్దకు పోయి బిగ్గరగా "ఎవడవురా నువ్వు?" అని కేక పెట్టింది.

ఇలియా మతిస్సాను ఒక తోపు తోసి గదిలోనుంచి బయటికి వెళ్ళాడు. జాకోబు నాడి ననుసరించాడు. దారిలో "మామా ఏమైపోతుందంటా? పీళ్ళు మెను అమ్మివేసి వుంటారనేనా నీ నమ్మకం?" అని ఇలియా నడిగాడు బిక్క ముగంతో.

ఇలియా కసరుకొని "ఊరుకోరా ఎంబన్న! ఇప్పుడు గగ్గోలుపడి ప్రయోజన మేముంది? నువ్వు మొదటినుంచి జాగ్రత్తగా వుండవలసింది. ఇన్నాళ్ళనుంచి కంటికి రెప్ప వలె కాపాడుతూ వచ్చింది నీవు, తగులుకొని పోయింది మరొకడు" అన్నాడు.

"ఇందులో నా తప్పేముంది చెప్పు? పగటి వేళ ఒక్కడి కైనా పనికి వెళ్ళిందేమో ననుకున్నాను."

"నీ దోష ముందా లేదా అని నేను విమర్శించా ల్సిన పని లేదు. నేనిక ఈ కొంపలో ఒక్క క్షణం కూడా వుండను. దీనికి నిప్పెట్ట వలసిందే" నని ఇలియా గబగబా నడక సాగించాడు.

జాకోబు వ్యాకుల చిత్తుడై అటూ యిటూ చూస్తూ నిలబడి పోయాడు.

ఇలియూ వెనక్కి తిరిగి చూచి "ఏడువు; నీ కర్మ!" అని అంధకారంలో కలిసిపోయాడు.

మాషాకు నిజంగానే వివాహమైనట్లు మర్నాడు షర్ఫిషాక్ చెప్పాడు. వరుడు పెళ్ళాం చచ్చిన విదురుడు. వయస్సు యాభైకి పైనే. వాడికి యిద్దరు కొడుకులు కూడ వున్నారు. పిల్లల పోషణకు ఆడుది కావలసొచ్చింది. అది వరకున్న పనిమనిషి చెయ్యాడించేది కావటం వల్ల పెళ్ళి చేసుకోటానికి సిద్ధమై పిల్ల ఎక్కడా కుదరక మతిసాన్ వెంట పడ్డాడు. ఆ మాయలాడి తన వాక్చాతుర్యంతో మాషాని షర్ఫిషాక్‌ను బుట్టలో వేసింది. అంతా మూడు రోజుల్లో ముగిసింది ఆ వృద్ధ జంబుకం మతిసాన్ షర్ఫిషాక్ లిద్దరికీ చెరి అయిదు రూపాయలు చేతిలో పెట్టాడు. క్రితం రాత్రి వాళ్ళిద్దరు ఆ పైకంతోనే తప్ప తాగారు. తాగటంలో మతిసాన్ ఆరితేరిన చెయ్యి!

ఇలియూ యీ వృత్తాంతం అంతా విన్నాడు. మాషాకు యేదో ఒక ఆశ్రయం లభించింది గదా యని సంతృప్తి పడ్డాడు; కాని, ఆమె లేని యీ కొంప వాడికి ప్రేతాలయంగా కనుపించ సాగింది.

మాషాభర్త షర్ఫిషాక్ నెప్పుడూ తన యింటికి రావద్దనీ, బ్రాంది షాపుకు వస్తే తృప్తిగా బ్రాందీ నిప్పించు తాననీ చెప్పాడట. అందుకు తాను సరే నని సమ్మతించా నని కూడ షర్ఫిషాక్ ఇలియాతో చెప్పాడు. "ఇప్పుడు

తాగటానికి లేక అల్లాడి పోతున్నాను. తల తిరిగిపోతోంది; నాలు గణాలు యి”మ్మని ఫర్ఫిషా— చేయి చాచాడు.

“ఇక ముందేం చెయ్యాలని?” ఇలియూ అడిగాడు.

“ఇక నేను హాయిగా తాగుతాను. ఇది వరకు మాంసాను పోషించే బాధ్యత వుంటం వల్ల తృప్తిగా తాగనే లేదు. ఆమెను గూర్చిన చింత వేధించుతూ వుండేది. ఇప్పుడిక యే బాదర బందీ లేదుగా.”

“నీవు తాగుడు మాన్లేవూ?”

“అమ్మో! అసంభవం. అయినా ఎందుకు మానాలి?” అని పర్ఫిషా— అడిగాడు.

“ఇంతకంటె నీకే కాంక్షా లేదూ”

“ఈ గొడవంతా యెందుకు? ఒక పావలా యిచ్చా పోతాను.”

“ప్రపంచంలో ఏ ఆశయమూ లేకుండా ఎల్లా జీవించ గలరో నాకు అవగాహన కావటం లేదు.”

“ఏం? నే నున్నానుగా అలాంటివాణ్ని. మానవుడు ఏమేమో చెయ్యా లనుకుంటాడు; కాని, అదృష్ట దేవత వాని మార్గంలో అడ్డుతగులుతుంది. నా విషయమే చూడు! నేను జర్మియూ డబ్బు మీద కన్ను వేశాను. నేను కాక పోయినా ఎవడో ఒకడా ధనాన్ని అపహరించుతాడని నాకు తెలుసు. అయినా భాగ్యదేవత నన్ను చూచి ముఖం

ముడుచుకున్నది. నేను దేబెమ్మలా చూస్తుండగానే వాళ్లిద్దరూ ఆ మొత్తాన్ని కొట్టేశారు. అనుకున్నంత మాత్రాన ఏపనీ జరుగదు......సరే గాని, నన్ను పంపవూ? ప్రాణం కొట్టుకొంటోంది."

ఇలియా జేబులోనుంచి డబ్బు తీసియిచ్చి "నువ్వు పనికి మాలినవాడ వైపోయావులే" అన్నాడు.

"నిజమే."

"కాని, నేను అపుడపుడు నీ యంత మంచి వాడు లే డనుకొంటాను."

"నన్నెగతాళి చేస్తున్నావా?"

"నేను నిన్ను ముఖస్తుతి చెయ్యటం లేదు. నా హృదయంలో వున్నదే అన్నాను. నువ్వు నమ్మ, నమ్మకపో."

"నీవుద్దేశం యేమిటో తెలియటం లేదు."

"సరే గాని, నువ్వు భగవంతునికి భయపడుతున్నావా? లేదా?"

"నే నెందుకు భయపడుతాను? నే నెన్నడూ ఎవర్నీ బాధించలేదే. ఒకరి కపకారం చేయాలనే తలంపే నాకు లేదు."

"నీవు ప్రార్థన చేస్తుంటావా?"

"అప్పు డప్పుడూ"

ఫర్‌ఫిషా్క్ దృష్టి గ్రాంథీ సాపు వేపే వుంటం గమ నించి ఇక వానిని వదలి పెట్టటమే వుచితమనుకొని ఇలియూ మగో అర్ధరూపాయి వాని చేతిలో పెట్టి అన్నాడు— ఏమని ప్రార్థించుతాడు!

ఫర్‌ఫిషా్క్ ముఖం తెల్ల బిర్క్ దర్శనంతో కళకళ లాడింది.

"ఏ ముంది, మామూలుగానే. విగ్రహం ముందు నిలబడి భగవాన్! నా పైన దయ వుంచుమని ప్రార్ధిస్తాను." కొంచె మాగి "ఇక వెళ్ళనా?" అన్నాడు ఫర్‌ఫిషా్క్.

"వెళ్ళు; కాని, ఒక మాట చెప్పి పో. చా వెప్పుడైనా తప్పదు. విచారణ సమయంలో, భగవత్ సాన్నిధ్యంలో పాప పుణ్యాల జమా ఖర్చు లడిగితే ఏం చెప్తావు?"

"నేను అధమ జీవిని. నా జీవిత మంతా తాగుడు తోనే గడిపేశానని యదార్థం చెబితే ఆయన నవ్వి నన్ను క్షమించుతాడు" అని ఉల్లాసంతో వెళ్ళి పోయాడు.

ఇలియూ అక్కడే వుండిపోయాడు. ఇక నక్కడ మాషా కన్పించదనీ, ఎప్పుడో ఒకప్పుడు ఫర్‌ఫిషా్క్ కూడ ఆ కొంప వదిలి వెళ్ళిపోతాడనీ విచార పడ్డాడు.

20

ఇలియా తిరిగి తిరిగి వచ్చాడు. ఒరెన్సు గదిలోనే వున్నాడు. ఇలియా గదిలో అడుగు పెట్టగానే "ఇలియా! నీ విప్పుడే ఇక్కడినుంచి వెళ్ళిపోవటం మంచిది" అన్నాడు.

ఒరెన్సు ముఖం కలవరపాటును తెలుపుతోంది. స్వరం కంపించుతున్నది.

"ఏమిటి సంగతి?" అని ఇలియా ఆతురతతో ప్రశ్నించాడు.

"సాయంత్రం నాలుగు గంటలకు జాకోబు తాగి స్పృహ తప్పి వచ్చాడు. అదాటుగా పెట్రుహా పైన బడి దబా దిబా గుద్ది తిట్టసాగాడు. అంతట పెట్రుహా వాణ్ని చావమోదాడు. ఇప్పుడు జాకోబు చాల ప్రమాద స్థితిలో వున్నాడు. ఆ కోపంలో పెట్రుహా కొడుకును నేలకు కదేసి నా వైపు తిరిగి ఇలియా నిప్పుడే ఇక్కడ్నుంచి వెళ్ళగొట్టు. యిక ఒక్క క్షణం కూడ నా యింట్లో వాడు వుంటానికి వీల్లేదు. ఈ రగడ కంతటికీ వాడే కారకుడు" అన్నాడు.

ఇలియా చొక్కా చేతులు పైకి దోపుతున్నాడు.

ఒరెన్సు వణకిపోతూ "ఏమిటా హడావుడి?" అని అడిగాడు.

"నీ కెందుకు పూరుకో. వాడి పొగరు రోజు రోజుకు ముదురుతోంది" అని ఎకాఎకీని హోటలుకు వెళ్ళాడు.

"అక్కడికి వెళ్ళకు. అతడు పోలీసుల్ని పిలిపించి నిన్ను అరెష్టు చేయించుతాడు. నా మాట విను" అంటూ పెరెన్ను గోల చేశాడు.

ఇలియా తిన్నగా హోటల్లోకి వెళ్ళాడు. పెట్రుహా ద్వారం వద్ద ఎవరితోనో నవ్వుతూ మాట్లాడు తున్నాడు. వాడు ఇలియాను గాంచి కనుబొమ లెగరవేసి "దా, నీ కోరకే చూస్తున్నా" నన్నాడు.

"ఇలియా వాని మాటలను లక్ష్య పెట్టలేదు పోయి ప్రక్కకు తొలగు" మని గద్దించాడు.

"ఎక్కడికి? నుంచో."

"తప్పుకో. నేను జాకోబును చూడాలి."

"ఆగు, నేను నీ కిక్కడే జాకోబును చూపిస్తా నుండు."

ఈ మాట పెట్రుహా నోటినుంచి వెలువడిందో లేదో ఇలియా ముష్టి బిగించి వాని ముక్కు మీద బలం కొద్దీ గ్రుద్దాడు. పెట్రుహా ఆ దెబ్బ కదిరిపడి కేక పెట్టాడు. నౌకర్లు, సర్వర్లు, యితరులు అన్ని వేపులనుండి అక్కడ కొచ్చి పడ్డారు. 'పట్టుకో పట్టుకో' మన్న కేకలు ప్రతి ధ్వనించాయి. అయినా ఇలియా నిర్భయంగా జాకోబు గదిలో కెళ్ళాడు. లోపల గడియ బిగించాడు.

గది గాఢతిమిరావృతమై వుంది. ఏమీ కన్పించటం లేదు. బ్రాందీ వాసనతో ముక్కు పగిలి పోతోంది. ఇలియా దీపం వెలిగించాడు. జాకోబు నేలమీద పడి మూల్గుతున్నాడు. వాని వొళ్ళు హూనమై వుంది. కళ్లు వాచాయి. ఇలియా అడుగుల సవ్వడి విని "ఎవరు?" అని మెల్లగా అడిగాడు.

"నేను."

"దాహం."

బయట వున్న వాళ్ళందరూ ద్వారం వద్ద మూగారు. కొందరు తలుపు తట్టుతున్నారు. "పారి పోనివ్వకండి. పోలీసు వారికి చెప్పిరండి. నేను వాణ్ని తాకనైనా లేదు. వాడి తల బిరుసు మీరంతా చూచారు గాదూ?" అని పెత్రుహా నోరు చించుకొని అరుస్తున్నాడు.

పెత్రుహాను కొట్టినందుకు ఇలియాకు సంతోషంగా నే వుంది. తలుపు దరికి పోయి "ఏమండోయ్! ఎందుకీ గల్లంతు? నా గ్రుద్దుతో వాడు చావ లేదుగా. నేను చేసిన దానికి కేసు పెట్టుకో మనండి; కాని, అనవసరంగా మీరు గడబిడ చెయ్యట మెందుకు! నే నిప్పుడే తలుపు తీస్తున్నాను" అని బయట వారి నుద్దేశించి అన్నాడు.

తలుపు తెరచి పిడికిలి బిగించి ద్వారం పక్కగా నిలబడ్డాడు ఇలియా. అందాకా పరవళ్లు తొక్కిన వాళ్లెవరికీ ముందుకు రావటానికి దమ్ము లేక పోయింది. పెత్రుహా

క్రోధోన్మత్తుడై "వెధవల్లారా! పిరికి పందలైతే పోండి, నేనే వాడి పని పడతాను" అని డాబులు కొట్టాడు.

"అయితే రా" అని మిగతా వారితో "వీడు తన కొడుకును యెల్లా చావగొట్టాడో లోపలి కెళ్లి చూడండి" అని ఇలియా దారి యిచ్చాడు.

హోటలుకు భోజనానికి వచ్చిన పెద్దమనుషులు కొందరు లోపలి కెళ్ళారు. జాకోబు స్థితి చూచి విచారపడి "అరె! పాపం చంపేశాడే!" అన్నారు.

"ముందు కొంచెం మంచినీళ్ళివ్వండి. తరువాత యెవరైనా వెంటనే స్టేషనుకు పోయి రిపోర్టు చేసిరండి" అన్నాడు ఇలియా.

జాకోబు స్థితిని చూచిన తర్వాత అక్కడున్న వారిలో పలువురు ఇలియా పక్షం వహించారు. పెత్రుహాను తలొక మాట అంటున్నారు. ఇలియా బలం యినుమడించింది. "మీ రంతా పెత్రుహా నెరుగుదురు. ఇంతకంటె కర్కోటకు డింకెవ డుంటాడు. జాకోబు అమాయకుడని మీకు తెలుసు. మీరు వాని కనుకూలంగా వాఙ్మూలమివ్వాలి......ఈ దుష్టుడు కన్నకొడుకు కెట్టి గతి కల్పించాడో చూడండి! నేనా పాపిని ఒక్క గుద్దు గుద్ది నందుకే మీరు వానికి మద్దతుగా వచ్చారు. ఇది న్యాయమేనా? ఒకడు పొగరెక్కి యిష్టంవచ్చినట్లు హింసించినా చూచి నోరు విప్పకూడదా?'' అన్నాడు గంభీరంగా.

కొందరు పెట్రుహాను నిందించుతున్నారు; మరి కొందరు మౌనం దాల్చారు. ఇలియా యింకా యేమో చెప్పబోతున్నాడు; కాని, అంతలో పెట్రుహా గదిలో చేరబడి "పొండి యిక్కడినుంచి, వాడు నా కొడుకు. నా యిష్టం వచ్చినట్టు చేసుకుంటాను. ఇందులో మీకేమి సంబంధం? పోలీసుల లెక్కేమిటి? వెళ్లరేం యిక్కడి నుంచి?" అని అంగరిసి నానా మాటలు అన్నాడు.

ఇలియా జాకోబు నోటినుండి కారుతున్న రక్తాన్ని తుడుస్తున్నాడు మిత్రుని గతికి వాని హృదయం తరుక్కుపోతోంది." అబ్బ! బాధ......నన్నిక్కణ్ణుంచి తీసికెళ్లు" అని, అతికష్టంతో అన్నాడు జాకోబు.

వానికళ్ళనుండి కన్నీరు ధారగా ప్రవహించుతోంది.

ఇలియా పెట్రుహా వంక చూచి "చూచావా నీ ఘనకార్యం? ఇప్పుడైనా వెంటనే హాస్పిటలుకు పంపు" అన్నాడు.

పెట్రుహా కొడుకువంక చూచి మెల్లగా గొణిగాడు. ఇలియా గుద్దుతో వాని కన్నుకూడా వాచింది.

"ఏం వినపడిందా" అని ఇలియా మళ్ళీ వురిమాడు.

గోల చెయ్యకు. వీణ్ణి ఆసుపత్రికి పంపటానికి వీల్లేదు. అందరికీ తెలిసి అల్లరవుతుంది. నేను నలుగురిలో తిరిగే వాణ్ణి కూడాను."

"దుర్మార్గుడా! సిగ్గులేదూ? నేను చెప్పినట్టు చెయ్యి

టంలోనే నీకు మేలుంది. లేకపోతే యింకా పేరు మోగు తావు. కన్నకడుపు కాదూ నీది?"

"పెద్దగా తగల్లేదు. వాడు నాటక మాడుతున్నాడు అంతే."

ఇలియా కళ్ళెర్ర జేసి లేచి నిటారుగా నిలబడ్డాడు. పెట్రుహా శారుకొని బయటికి పోయి నౌకరును పిల్చి "ఒక బండి తీసుకొనిరా, ఆసుపత్రికి వెళ్ళాలని చెప్పు. బాడుగ పది అణాల కంటె యెక్కువ మాట్లాడేవు" అని చెప్పి తిరిగి వచ్చి జాకోబుతో అన్నాడు—"వెధవా! వేషం వెయ్యకు. నిన్నెవరూ పరాయి వాళ్ళొచ్చి కొట్టలేదులే. నేను నీయంత వున్నప్పుడు నా పైన యింతకంటే యెక్కువే పడేవి. లేచి కూర్చో."

జాకోబుతో ఇలియా హాస్పిటలుకు పోయి మందు మాకులకు యేర్పాటు చేశాడు. జాకోబు కళ్ళతో కృతజ్ఞతను తెలిపాడు. ఇలియాకు తిరిగి పెట్రుహా యింటిలో అడుగు పెట్టటాని కిష్టం లేకపోయింది. హాస్పిటలు నుండి సరాసరి లీపా వద్దకి వెళ్ళాడు. నాటి ఘటనను గూర్చి ఆలోచించినకొద్దీ వాని క్రోధ దుఃఖములు ప్రకోపించ సాగాయి.

మరునాడు మకామును మార్చటానికి కృత నిశ్చయుడై గృహాన్వేషణకు బయలుదేరాడు. అద్దె కివ్వబడు నన్న యిల్లిల్లు తిరిగాడు. ఒక యింటివద్ద లేత వయసులో వున్న సుందరి గది అద్దె బేరం చెప్పింది ఆ గది సౌక

ర్యాన్ని వర్ణించుతూ "ఇంత శుభ్రంగావుండి ధారాళంగా గాలివచ్చే గది నెల కయిదు రూపాయలలో దొరకనే దొరక"దని చెప్పింది.

ఇలియా రెప్పవాల్చకుండ ఆ ఎమ్మెలాశీని చూస్తూ "నీ వీ యింటి పని మనిషివా?" అని అడిగాడు.

ఇలియాను తన రూప మాకర్షించినట్టు గ్రహించి ఆ జవ్వని యేదో ఆలోచన అభినయించింది. ఇలియా ప్రశ్నకు విస్మయం చెంది "నే నే యీ గృహ యజమానురాలిని. నా భర్త......"

అని చెపుతూంటే ఇలియా మధ్యలో అందుకొని "మీకు వివాహం కూడ అయిందీ!" అని ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు.

ఆమె నవ్వి "మీరు చిత్రమైన మనిషి లా గున్నారే! మొదట నన్ను దాసిగా భావించారు. ఇప్పుడు నేను వివాహిత నైనందుకు కూడ అబ్బుర పడుతున్నారే" అంది.

మీ ప్రాయాన్ని బట్టి అప్పుడే వివాహ మయి వుండ దనుకున్నాను."

"నా పెళ్లయి మూడేళ్లయింది. నా భర్త పోలీసు ఇన్స్పెక్టరు."

ఇలియా ఆమె వంక చూచి నవ్వి "అలాగా!" అన్నాడు.

"మీరు వచ్చిన పనే మరచిపోయి నట్టున్నారు.

త్వరగా తేల్చండి; గది కావాలా, వద్దా?" అని ఆ విలాసిని ఇలియూ కళ్ల లోకి చూచింది.

"గది విషయం ముందే ఖాయమైంది. బజానా యివ్వాలా?"

"రెండు రూపాయ లిచ్చి వెళ్ళండి. ఎప్పుడు ప్రవేశించుతారు?"

"ఎప్పుడో నా! రేపే. బజానా ఒక గంట సేపట్లో వచ్చి యిస్తాను"

"సరే, అలాగే యివ్వండి. మీరు మంచివారుగా కన్పిస్తున్నారు. మీ బోటి వారికే మా గదిని అద్దె కివ్వటం మా కిష్టం."

ఇలియూ నవ్వుతూ "చాలా మంచి కాదులెండి" అని అక్కడినుంచి కదిలాడు.

ఆ గది విషయంలో ఇలియూ రెండు లాభాలు చూచాడు. గదిలోకి గాలి, వెలుతురు ధారాళంగా వస్తై. అంతకంటె ముఖ్యం యింటియజమానిని రసికురాలు కావటం సంసారుల పొత్తులో వుంటే నూతనానుభవం చేకూరగలదని ఇలియూ సంబరపడ్డాడు; అయితే గృహ యజమాని పోలీసు అధికారి యన్న తలంపుతో కొంత అదటు కూడా కలుగకపోలేదు.

ఒక గంట సమయం మించక పూర్వమే బజానా యిచ్చి పోస్పిటలుకు వెళ్ళాడు. జాకోబు నిద్రించుతూ

వున్నందున పంచాదిలో నిలబడి తిరిగి వెడదామా వద్దా అని తటపటాయించుతున్నాడు.

కుంటివాళ్ళు, గుడ్డివాళ్ళు వాని ప్రక్కనుండి వస్తూ పోతున్నారు. ఆ దృశ్యం ఇలియూ హృదయాన్ని జాలితో నింపింది. ఇక వెళ్ళిపోదా మనుకొంటూండగానే కుంటివా డొకడు వెనుక పాటుగా వచ్చి ఇలియూ భుజంమీద చెయ్యి వేశాడు. ఇలియూ వులికిపడి వెనక్కి చూచాడు. ఆ కుంటి వా డెవరో కాదు; పాష్కాయే. నిలబడి నవ్వుతున్నాడు.

"అరె! నీవుకూడా యిక్కడా!" అన్నాడు ఇలియూ ఆశ్చర్యంగా.

"నీవుకూడా అంటున్నావు; ఇంకెవరు?"

"జాకోబు. పెట్రుషా వాడి బొమికలు విరగ్గొట్టాడు. సరేగాని, నీ కీగతేమిటి? ఎండి పుల్లైపోయావే?"

పాష్కా నిట్టూర్చాడు. వేదనాభరిత స్వరంతో "ఏం చెయ్యను? కర్మ" అన్నాడు.

"అసలు విషయం ఏమిటి?"

"నీ కేం తెలియనట్టు?......" అని సిగ్గుతో తలవొంచు కొన్నాడు పాష్కా.

"ఈ ప్రసాదం వేరా వర్షించిందేనా?"

"మరి?"

"అయితే యెప్పుడో ఒకప్పుడు నేనూ దీనికి గురి అవుతా నన్నమాట" అని ఇలియూ పక్కుమని నవ్వాడు.

"నన్ను చూచి నువ్వు చీదరించు కుంటావనను కొన్నాను. అందువల్లనే ఇంతవరకు నీ యెదుట పడటానికి వెరిచాను."

"నా విషయంలో నీ వల్లా భావించటం న్యాయమేనా?"

"మహా చెడ్డ రోగం! ఎవరు అసహ్యించుకోరు? నేనిక్కడికి వచ్చి రెండు వారాలు దాటింది బాధ దారుణంగా వుంది. ప్రతి నిముషంలోను యిదే వేధించుతోంది. కాలం మహా పర్వతములాగున తరుగకుండా వుంది ఒళ్ళంతా మంటలు. సహాయం చేయ్యటానికి దగ్గర యెవరూ లేరు."

పాషా మెల్లగా చెపుతున్నాడు. వానిశరీరం కంపించుతోంది. ఎడంచేత్తో కమీజు కాలరు మెలిపెడుతున్నాడు. "అదృష్టం దయారహితమై దెబ్బకొడితే దాని గాయం భరించరాని బాధను కలిగిస్తుంది."

"వేరా రావటం లేదూ?"

పాషా లజ్జితుడై "ఆమె వచ్చింది; కాని నేనే వెళ్ళగొట్టాను. ఆ పాతకి ముఖం చూడకూడ దనుకొన్నాను" అన్నాడు.

"ఇదే నీ దుర్బుద్ధి. ఒట్టి స్వార్థపరుడివి. నీకు న్యాయం జరగా లనుకుంటే నీ వితరుల పట్లకూడ న్యాయంగానే ప్రవ

క్షించాలి. ఇందులో ఆమె దోష మేముంది? నీవే ఆలో చించు."

ఇలియా వాదనతో పాష్కా కుపితుడయ్యాడు; కాని, పైకి మెల్లగానే అన్నాడు..."అయితే ఈ దోషాన్ని యెవరికి రుద్దాలి? నాకీ గతి యెందుకు కలిగిందో నని రాత్రి అంతా ఆలోచించాను. వేరా సాహచర్యం వల్లనేగా! నే నామె భర్తన్ణి. ఆమెయే నా సర్వస్వం."

వాసకళ్లు ఎరుపెక్కాయి. కన్నీటి చుక్కలు వాని బుగ్గల పైనుంచి దొర్లిపోయినై. చొక్కా చేతితో కన్నీరు తుడుచుకొన్నాడు.

"ఆమె నా మార్గంలో శిల లాగుంది. ఎదురుదెబ్బ తగిలి పడిపోయాను.

ఇలియా హృదయంలో వేరాయందు అమిత సాను భూతి వుంది. పాష్కాతో యిలా అన్నాడు—"నీవు చాల అన్యాయం చేస్తున్నావు పాష్కా! నీ కసలు మార్గ మెక్కడుంది? నీ వే త్రోవలోను అడుగు పెట్టనేలేదు. నీ వన్నీ గప్పాలు! నువ్వు గ్లాసును పెదవి కాన్చి చవి చూచావు; చాలా మధురమని ప్రశంసించావు. కొంచెం ఘాటుగా వున్నప్పుడు నీ కది స్పృహ లేకుండా చేస్తోందని నిరసింను తున్నావు. ఆమె విషయం మాత్రం ఏమిటి? ఆమెకీ యెవడో నీలాంటి ప్రబుద్ధుడే అంటించి వుంటాడు. అవునా?

"ఆమెనుగూర్చి నాకు మాత్రం విచారం లేదను కున్నావా?"

"ఉండి తీర వలసిందే."

"నేను మాత్రం యెవరిని నిందించగలను? నేను తిట్టి, వెళ్లిపొమ్మంటే వేరా వెక్కి వెక్కి యేడ్చింది. నా హృదయం తుత్తునియ లయింది. నేనూ యేడ్చేవాడినే; కాని, నా గుండె కరుడుగట్టింది. ఏం మిత్రమా! మాకింతకంటె సుగమ మార్గ మేదీ లేదూ?"

"దారి లేదు, లేదు. ఈ సమాజ మనే తిరుగలిలో పడి అందరము పిండికాక తప్పనట్టె తోస్తోంది. జాకోబు స్థితీ యింతే. వాడి తండ్రే వాని యగచాట్లకు కారకుడు. అమాయక మాషాను ఆమె జనకుడే యేబదేళ్ల ముసలి వాని మెడకు అంటగట్టాడు. మన వర్గంలో నే నొక్కడినే అదృష్టవంతుణ్ణి. నేను తలచుకొన్నది యిట్టే అయి పోతోంది."

"అదైనా నిజమేనా?"

"నిస్సందేహంగా. భాగ్యదేవత నాకు ప్రత్యక్ష మయింది. అది కాగడా పట్టుకొని దారి చూపిస్తూ నన్ను ముందుకు పొమ్మని ప్రోత్సహించుతోంది."

"నవ్వులాట కలా చెపుతున్నావులే."

"నేను కాదు; గాని, మనల నెవరో హేళన చేస్తూనే వున్నారు. ఈ సందర్భంలో నే నెంతైనా చెప్పగలను. స్వానుభవాన్నిబట్టి నా కెక్కడా న్యాయం కన్పించనే లేదు.

"నా అనుభవంకూడా అంతే. పద, మరో ప్రక్కకు పోయి కూర్చుందాము" అని పాషా ఇలియాతో వేరొక చోటుకు వెళ్లాడు.

"మన జీవితంలో సుఖపడే అదృష్టం లేదు. మనం యెందులో చెయ్యిపెట్టినా చురుక్కు మంటోంది'' అన్నాడు పాషా.

"అవును."

"మన బ్రతుకంతా శూన్యమే. ఉదాహరణకు నేనొక స్త్రీని ప్రేమించా ననుకో. ఇద్దరి హృదయాలూ కలిసాయి. కేవలం తాళి మాత్రం కట్టలేదు. మనఃపూర్వకంగా కావా లనుకున్నా ఆమె దక్కటం లేదు. ఆమె యేమీ యివ్వ లేకున్నది; తానూ పొందజాలక పోతోంది. ఇంతకూ కారణం నా దరిద్రమే. నేను శ్రమపడ లేదా? పదేళ్ళప్పటి నుంచి కఠిన పరిశ్రమ చేస్తూ వచ్చాను; కాని, నా కందుకు లభించిన ప్రతిఫల మేమిటి?

"అంతే కాదు. పెట్టుహాను చూడు! వా డన్ని భోగాలు అనుభవించు తున్నాడు. తలచుకొన్నది చేయ గలుగుతున్నాడు. కోరినది తింటున్నాడు; తాగుతున్నాడు; నచ్చిన బట్ట కడుతున్నాడు" అని చెపుతూ చెపుతూ ఇలియా ఆవేశభరితు డయ్యాడు. వాని హృదయం ద్వేషంతో నిండిపోయింది.

"డాక్టరు నన్ను అపరాధివలె చూస్తున్నాడు. నేనేం చేశాను చెప్పు? చదువుకొన్నవాడు పెద్దమనిషివలె ప్రవ

ర్తించాల్సింది...... నేను మానవుల్లో గణనకే రానా? నేను వేరాను తిరస్కరించిన మాట వాస్తవమే; కాని, వేమీ తెలియని గబ్బిలాయిని కాను. ఇందులో నా తప్పేమీ లేదని యెరుగుదును."

"కర్రను చేతబట్టినవాడు దాన్ని విసరకుండా అది స్వయంగా యెవరిపైనా పడదు."

వాళ్లిద్దరూ ఒక గది కిటికీవద్ద నిలబడి మాట్లాడు తున్నారు. గదిలోనుంచి రోగి మూలుగు స్పష్టంగా విన్పడు తోంది. ఆ సంకటావస్థలో తనకు సహాయపడగల సుహృదయు డెవడూ లేడని నిరాశతో చెవుతున్నట్టు ఆ ధ్వని క్రమంగా తీవ్ర మౌతోంది. జీవిత సంఘర్షణలో తగిలిన దెబ్బ పాషా హృదయాన్ని బాధించుతోంది. అందు వల్లనే వాడు కఠినోక్తులతో తన వేదనను వ్యక్తం చేస్తు న్నాడు. పాషా హృదయం మండుతున్నదనీ, దాని నుండి వెలువడుతున్న మంటలే వాని హృదయాంధకారాన్ని పటాపంచలు గావించి దాని కనంత శాంతిని ప్రసాదించు తాయనీ ఇలియాకు తోచింది.

"కేవలం శ్రీమంతుడైనంత మాత్రాన పాపం చెయ్య డనటంలోను, చదువుకొన్నంత మాత్రాన ఆనోటి మాటలు సర్వజనమాన్యాలవటంలోను న్యాయ మెక్క డుంది? నేను మూర్ఖుడి నైతే నూత్ర మేమిటి? నా ఆత్మ నశించి పోయింది. క్షుదార్తుని కసలు ఆత్మే వుండదు. నాకీ

లోకమే శూన్యం. నా జీవిత సూత్రం త్రెంచి వేయబడింది. నా కోరికలు అణచి వేయబడిన్నై. నా చుట్టూ జైలు గోడ లాంటిది నిలబెట్టబడింది" అన్నాడు పాష్కా.

"మన గోడు నాలకించి జవాబిచ్చే వాడెవడు? మనయందెవరికీ సానుభూతి లేదు. ఈ సమాజంలో మన మందరి దృష్టికీ పరాయి వాళ్ళమే" నన్నాడు ఇలియా.

"ఆ మాట నిజమే. మన మ్మేమైపోతే యెవరికొక్కవాలి?"

ఇలియా యీ మాటవిని చుట్టూ చూచాడు. పెద్ద నిట్టూర్పు వదిలాడు. గదిలో మూలుగు మరింత తీవ్ర మయింది.

"లీపాతో నీ సంపర్కం యథాప్రకారమే వుంది గాదూ?" పాష్కా అడిగాడు.

"ఆ, యింతవరకూను" అని ధ్వని మార్చి "జాకోబు చదివి చదివి ఈశ్వరుని అస్తిత్వాన్నే అనుమానించ సాగాడు" అన్నాడు ఇలియా.

"ఏమిటీ? నిజంగా నేనా?"

"వాడివద్ద అలాంటి పుస్తకాలున్నై. నీ వుద్దేశం యేమిటి?"

"ఈ విషయాన్నిగూర్చి నే నెన్నడూ ఆలోచించనే లేదు; అసలు నే నింతవరకు చర్చికి కూడ వెళ్లి యెరుగను."

"నేను దీర్ఘంగా ఆలోచించుతూనే వున్నాను. భగవంతుడు యిదంతా యెందుకు సహించి మౌనం వహించుతున్నాడో నాకు బోధపడలా."

మిత్రులిద్దరూ యీ విధంగా చర్చించుకొంటూ సమయ విచక్షణే మర్చిపోయారు. హాస్పిటలు జవానొకడు వచ్చి "విజిటర్సు అందరూ వెళ్లిపోతే నీ విక్కడ దాకొన్నావేందు" కని ఇలియాను దబాయించాడు.

"అరె! నేను మాటల్లో మరిచిపోయ్యాను. ఇప్పుడే వెళ్తున్నానుండు. పాషా! జాకోబును తప్పకుండా కలుసుకో" అన్నాడు ఇలియా.

"రేపు నీవు రావాలి సుమా!"

"త్వరగా పోతావా లేదా?" అని జవాను ఇలియాను నెట్టబోయాడు.

ఇలియా వానివంక చురచుర చూచాడు. వాడు భయంతో వెనక్కి తగ్గాడు. ఇలియా నవ్వుకొంటూ హాస్పిటలు కాంపౌండు దాటిపోయాడు.

ఇలియా దారిపోడుగునా తన మిత్రవర్గం దుస్థితిని గురించే ఆలోచించాడు. పోల్చిచూస్తే ముగ్గుర్లో తానే సుఖంగా వున్నట్టు తోచింది; కాని, తన చుట్టూ కారు మేఘాలు భీకరగర్జనలతో నడయాడుతున్నట్లె కన్పడింది.

21

ఇలియూంకు గది నద్దకిచ్చిన విలాసిని పేరు లాసినా. ఆమె ప్రఫుల్లముఖి. చంచలాక్షి. సంభాషణ అంటే చెవి కోసుకుంటుంది. లాసినా క్రమంగా తన జీవితకథ, కుటుంబ విశేషాలు ఇలియూతో చెప్తూండేది. ఇలియూ రోజు లక్కడ ఆనందంగా గడచి పోతున్నాయి.

ఉదయం వేళ ఇలియూం గదిలో వుండగా లాసినా వచ్చి తొంగిచూచేది. తరువాత యేదో హస్కు ప్రారంభించేది. ఒకరోజున యిల్లా చెప్పుకొచ్చింది:—"మేము శ్రీమంతు లం కాము; కాని, చదువుకొన్నవాళ్లం. మాకు సభ్యత తెలుసు. ధనికులము కావాలని మా కోరిక. అది నెర వేరుతుంది కూడాను. ఇంతవరకు నిస్సంతుగా వుంటంకూడ మేలే పిల్లాజెల్లా వుంటే డబ్బంతా ఖర్చయి పోతుంది. కావలసిన వస్తువులన్నీ మేమే స్వయంగా ఖరీదు చేసు కొంటాము. ఇల్లూ—వాకిలీ వూడ్చటానికి, అంట్లు తోమ టానికి వొక పనిమనిషిని పెట్టాము. దానికి నెలకు రెండు రూపాయలిస్తాము. మా నెలసరి ఖర్చు మొత్తం యెంతో తెలుసా?"

అని వ్రేళ్ళమీద లెక్కపెట్టి "వంటమనిషిని కూడ పెట్టుకుంటే నెలకు నాలుగు రూపాయలకు తక్కువ పుచ్చ

కోదు. దాని భోజనానికి యెంతలేదన్నా యెనిమిది, పది రూపాయ లవుతుంది. పైన నాలుగైదు రూపాయలకు తక్కువ కాజేయదు. ఉండటానికి ఒక గదికూడ ఇవ్వాల్సి వస్తుంది. అందువల్లకూడ నాలుగైదు రూపాయల అద్దె లుగసానే. మొత్తంమీద వంటలక్క నుంచుకుంటే కనీసం యిరవై రూపాయల ఖర్చు. ఇదంతా మా కిప్పుడు మిగులే. ఇంతేకాక సంసారానికి కావలసిన సంబారాలన్నీ ఒక్క సారే టోకుగా కొని తెస్తాను. అందువల్ల కొంత కలిసి వస్తుంది. నేను వేరే నౌకరీ చెయ్యకపోయినా యింట్లో ఇంత నష్టాన్ని తప్పిస్తున్నాను. నే నెంతో జాగ్రత్తగా నేర్పుతో సంసారాన్ని యీదుచ్చుకుంటూ, పొదుపుగా నడుతున్నాను. ఎవరైనా కాపురం చెయ్యటం మావద్ద నేర్చుకోవాల్సిందే."

అని చెప్పి లజ్జ నభినయించుతూ ఇలియావంక చూచింది. ఆమె నవ్వుతోంది; కాని. ఇలియా ఏమాత్రం ఉత్సుకత చూపించలా. అత డామె యెడల అత్యంతాదర భావం చూపేవాడు. ఆవిడ శుభ్రత, నిరాడంబరత్వం. పూనికలు ఇలియా నాకర్షించాయి. వాని కా సతీ-పతుల దాంపత్యం సుఖప్రదంగాను, ప్రేమమయంగాను కన్పించేది. ఒంటరిగా వున్నప్పు డామె కూనరాగం తీస్తూవుంటే ఇలియా తన గదిలో కూర్చుండి వింటూండేవాడు.

ఆమె భర్త నికోడిమిచ్ యిరవై ఆరేళ్ళ యువకుడు. ఒడ్డూ పొడుగూ కలిగిన ఆజానుబాహుడు. అందుకు తగిన

కండ పుష్టికూడా వుంది. నిడివైన ముక్కు, చక్కని పలు వరుస ముఖమెప్పుడూ కళకళ లాడుతూండేది. ఠీవిగా నడిచేవాడు.

అతడు తొలిసారి కలసుకొన్నప్పుడే "మీకు పక్షుల కిలకిలా రావములంటే యిష్టమేనా?" అని ఇలియా నడిగాడు.

ఇలియా "అవు"నని సమాధాన మిచ్చాడు.

"పిట్టలను పట్టుకొని పెంచే సరదా మీకూ వున్న దన్నమాట?"

"నే నెన్నడూ పట్టుకో లేదండి."

నికోడిమిచ్ ఇలియా వేపు వింతగా చూచాడు. "అయితే మీకు వాటియందు నిజమైన మక్కువ లేదన్న మాట. నా కవంటే చాలా ప్రీతి. ఒకప్పుడు నేనా అపరాధానికే సైనిక శిక్షణాలయాన్నుంచి బర్తరఫ్ చేయబడ్డాను. పై అధికారుల దృష్టికి గురికావటం యిష్టంలేదు; కాని నే నిప్పుడుకూడ పిట్టలను పట్టుకోటానికి తహ తహలాడుతూంటాను. అభిజాతుల మనుకొనే వాళ్ళాపని నేవగించుకుంటారు; అయినా నేను మీవలె రికామీ మనిషినైతే యెప్పుడూ వాటితోనే కాలం గడిపేవాణ్ణి" అన్నాడు నవ్వుతూ.

అతడు ఇలియాపైన దృష్టి నిగిడ్చి చూస్తూంటే ఇలియా అలజడి పడ్డాడు. ఆ పోలీసు వుద్యోగి పిట్టనవే

వంకతో మాట్లాడుతున్నాడు; గాని అంతరార్థం వేరని భీతిల్లాడు. వాడిగుండె కొట్టుకోసాగింది; కాని, నికోడిమిచ్ చూపులోని ప్రశాంతిని గాంచి వాని అదటు కాస్త తగ్గింది. ఆ అధికారి మంచివాడేనని నెమ్మదిమీద గ్రహించాడు. తరువాత కలుసుకొన్నప్పుడు అతణ్ణి కపట మెరుగని సాధు మూర్తిగా భావించి నవ్వుతూ మాట్లాడేవాడు. ఇలియా స్వభావానికి నికోడిమిచ్ కూడ సంతృప్తి చెందాడు.

ఒకనాడు "అప్పుడప్పుడు మాతోపాటు టీ తాగటానికి వస్తూవుండు. మేము స్నేహపాత్రుల మలే. మాముందు బిడియ పడాల్సిన అగత్యం లేదు. ఇక్కడికి కొత్తవాళ్లెవరూ రారుకూడాను. మేము చీట్లాటకూడ ఆడుతుంటాము. తప్పక రావాలిసుమా" అని నికోడిమిచ్ ఇలియాను ఆహ్వానించాడు.

పరిచయము యెక్కువైనకొద్దీ ఇలియా వారితో చనువుగా మెలగుతున్నాడు. సాయంత్రం గదిలో కూర్చొని వున్నప్పుడు ఆదంపతుల పరస్పర ప్రేమాలాపాలు ఇలియాకు వినపడేవి. "సుఖమంటే వీరిదే" ననుకొనేవాడు. తనకట్టి సుఖజీవితము సంప్రాప్తమైనప్పుడు అనంద మనుభవించ వచ్చని భావినిగూర్చి ఊహాసౌధాన్ని నిర్మించుతూండేవాడు. లాసినా తన పొదుపునుగూర్చి వర్ణించుతూంటే భర్త ఆమె వెన్నుచరచి "నువ్వు బలే చతురమతివి!" అని ప్రశంసించేవాడు.

నికోడిమిచ్ నిత్యము పట్టణంలోని సంఘటనలను గూర్చి భార్యకు సవివరంగా తెలిపేవాడు. వాటినిగూర్చి తన రిపోర్టులు, పై వుద్యోగుల అభిప్రాయాలుకూడ చెప్పేవాడు. ఒకొక్కప్పుడు తన అభివృద్ధిని గురించి ముచ్చటించి, ప్రమోషను జరిగిన తర్వాత ఆ చిన్నయింటిని వదలి పెద్ద బంగళాలో కాపురం పెట్టాలని కూడ చెప్పేవాడు. ఇలియా తన గదిలో నేవుండి వారిమాట లన్నీ ఆలకించేవాడు. అప్పుడప్పుడు ఆ దంపతుల సంభాషణ విని తన మొండి బ్రతుకుకు వగచి యిక నక్కడ వుండలేక లీపా యింటికి చేరుకొనేవాడు.

లీపా యిప్పుడు వెనుకటి మనిషిగాలేదు. ఇలియా వద్దనుంచి డబ్బెక్కువగా గుంజటానికి ప్రయత్నించుతోంది. ఇద్దరిమధ్య కీచులాటలు తరుచైనవి. ఆమె ముఖం పాలిపోయి కళ్లు లోతుకుపోయినై. శరీరంలో పూర్వపు బిగువు లేదు. ఆమె క్రమక్రమంగా ధార్మికవిషయాలు, భగవద్భక్తిని గూర్చి చర్చించసాగింది. ఈ మార్పు ఇలియా కన్నిటికంటె దుస్సహమైంది. లీపా "యోగినినయి యే మఠంలోనో చేరిపోతా" ననికూడ చెప్పేది; కాని, ఆమె పురుష సంపర్కం లేనిదే వుండలేదని తెలిపివుంటంవల్ల ఇలియాకామె మాటలయందు విశ్వాస మేర్పడలా.

ఒకపర్యాయం ఇలియా లీపాతో "నీవు సన్యసించినా నా కోసం ప్రార్థించవద్దులే" అన్నాడు హేళనగా.

"ఏం, యెందువల్ల?"

"నేను నా పాపఫలితాన్ని అనుభవించాలనే."

"నీ వల్లా అనకూడదు."

"సరేలే."

"నీకు నాయందు విశ్వాసంలేదు. ఒకనాటికి అంతా నీ కళ్లతోనే చూస్తావుగా."

"విశ్వసించక పోటానికి కారణంలేదులే. ద్వేషంతోను, సంసారం యీడ్వలేకా సన్యసించినవాళ్లు చాలా మంది వున్నారు."

లీసా కోప మాపుకోలేకపోయింది. ఈ విషయాన్ని గురించే యిద్దరికీ వాదన ముదిరి తగాయిదాపడ్డారు

"దుర్మార్గుడా! నీ బుద్ధి పోనిచ్చావుగాదు! మిట్టిపడుతున్నావు; కాని, యీ మిడిసిపా టెన్నాళ్లో వుండదు. నీ గర్వ మేమిచూచుకొని? కండకావరమా? అదెన్నాళ్లుంటుంది? నీటిబుడగలాంటిది. నీవు సందుగొందులు తిరిగి లోకుల దయాదాక్షిణ్యాలను దేవురించుగానే గతితప్పదు. అందరూ నీ ముఖంమీదనే వుమ్మివేస్తారు" అన్నది లీసా ఒళ్లూపై తెలియకుండా.

ఆమెకళ్లు రక్తం చిమ్ముతున్నట్లు యెఱ్ఱబడినై. అయినా లీసా హత్యావిషయంమాత్రం యెత్తలా.

మరొకప్పుడు యిద్దరూ ఖులాసాగామాట్లాడు కొంటున్నప్పుడు ఇలియా "లీసా! నీకు కోపంవస్తే యెన్నైనా తిను

శావు; గాని, పోలటోవ్ హత్యనుగురించి యెత్తిపొడవ్వేం”
అనడిగాడు.

“ఆ విషయం అనవసరమని నా వుద్దేశం. నీవు నిమిత్త మాత్రుడవు. వాని కల్లా రాసిపెట్టి నుంది; చచ్చాడు.”

లీసా జవాబు విని ఇలియా వికటంగా నవ్వాడు.

“ఎందుకు నవ్వుతావు!” అని లీసా అడిగింది.

“మానవ స్వభావ మెంత లౌకికము! మానవుడు స్వార్థంకోసం అంతా న్యాయయుక్తము, సబబే నంటాడు. తన కయిష్టమైన దాన్ని మాత్రం అతి సులువుగా నిందించు తాడు.”

“నీ మాటల భావ మేమిటి?”

“నేను చెప్పినది అతిసామాన్య విషయం. ప్రపంచంలోనిందాస్తుతులు రెండింటికి పాత్రంకాని దేదీవుండదనే దే నేను చెప్పిన దాని భావం! అంటే ఒకే వస్తువు మంచిదనీ, చెడ్డదనీ కూడ చెప్పబడుతుందన్నమాట. ప్రతి వస్తువుకు రెండు రూపా లుంటై. మానవ హృదయం కూడ ద్విరూపమే.”

లీసా వూం కొట్టి వూరుకున్నది. ఒక క్షణమాగి “ఇప్పటికీ నేను నీ వుద్దేశాన్ని గ్రహించనేలేదు” అంది.

“నేను నుడివినదే మూలతత్వం· అందులోనే మనం మసి అవుతున్నాము.”

తరువాత కొన్నాళ్ళకు ఇలియా లీసాతో జగడ మాడి చక్కా వచ్చాడు. నాల్గు రోజుల వరకు ఆమె యింటి ముఖం చూడనేలేదు. నాల్గో నాడు లీసా వద్దనుంచి వానికొక జాబు వచ్చింది. అందులో యిల్లావుంది.

"ప్రియతమా!

ఇదే నా అంతిమ ప్రణామ మందుకో. ఈ జీవితంలో నా పాపపు ముఖాన్ని మరి చూడలేవు. నన్ను వెతక టానికెంతమాత్రం ప్రయత్నించినా వృథా శ్రమ అవు తుంది. నేను ముందుగా యే ఓడనో యెక్కి యీ చండా లపు బస్తీ విడిచిపెట్టి యెక్కడికైనా వెళ్ళిపోతాను. ఈ నగరమే నా సర్వనాశనం చేసి, అధఃపతనం గావించి, యీ స్థితిలో కూడా నా హృదయం అద్దపు పెంకుల్లాగా ముక్క చెక్కలయ్యేటట్టు గట్టిదెబ్బ కొట్టింది. కాబట్టే దీన్ని చండాలపు నగర మంటున్నాను. నీవు నాకోసం నిరీ క్షించవద్దు. నీ దయ, స్నేహ, వాత్సల్యాలను మరువలేను. నీ క్రూర—అత్యాచారాల స్మృతిని మాత్ర మిచటనే వదలి. పెట్టిపోతున్నాను నేను అననాయిన్‌తో వెడుతున్నాను; అతడు కొంత కాలం నుంచీ నాపై మరులుగొని వున్నాడు. కాని, నేను అంగీకరించలా. అతను సామ, దాన, భేదో పాయలతో విఫలుడై నిరాశ చెంది తుదకు నన్ను చంపి వేస్తానని బెదరించాడు. నేను భయపడి అతనికి లొంగి పోయాను. ఇప్పు డతనితోనే వెళ్ళిపోటానికి సిద్ధపడ్డాను. ఎక్కడో సముద్ర తీరాన ఒక పట్టణంలో షాపు పెట్టాడు.

మేమిద్దరము అక్కడే ఆ వాస మేర్పరచుకొని వుండ బోతున్నాము. నా అపరాధా లన్నీ మన్నించు. నేను నిన్నెంతగా ప్రేమించానో నీ విప్పుడు గ్రహించ గలిగినా యింకేమి ప్రయోజనం? మన మందరం క్షుద్ర జీవులం. మన మెవరినీ ద్వేషించ కూడదు. నా కొరకు విచారించకు. వాస్తవిక వేదన యేదో నా కిప్పుడు తెలుస్తోంది. హృదయం కృంగిపోతోంది. ఇక నది చీలికలై పోతుంది. పోస్టులో నా స్మారక చిహ్నాన్ని పంపుతున్నాను. నా తుది బహూకరణగా దాన్ని స్వీకరించు.

నీ

లీసా"

ఇలియా ఆ జాబును చాల సార్లు చదువుకొన్నాడు. ప్రతిసారీ వానికి నూతన నానందం లభించింది. లీసా తన్ను హృదయ పూర్వకంగా ప్రేమించు తున్నదని నేటి వరకు ఇలియాకు విశ్వాసం కలుగ నేలేదు. వాని హృదయం విషాద భరిత మయింది. "ఇక నే నెవరి వాకిట నిలబడాలి? నన్ను ఓదార్చే వారెవరు!" అని తలచుకోవటంతో వాని కన్ను లశ్రు పూరిత మైనాయి. కిటికీ గుండా బయటికి చూస్తు న్నాడు. "కృతజ్ఞతతో తనకు అణగి వున్నప్పటికి స్వాతంత్ర నే' నని లీసా చెప్పినమాట జ్ఞప్తికి వచ్చింది. కృతజ్ఞత వుంటే యెల్లా వెళ్ళ గలిగింది? తనపట్ల ఆమెకున్న శ్రద్ధ అంతంత మాత్రపుదే ననుకున్నాడు. లీసాపై చేసిన అన్యా-

యత్యాచారాలను తలచుకొని తానే అపరాధి ననుకొన్నాడు మళ్లీ.

అప్పుడే పక్కగదిలోనుంచి లాసినా పాట విన్పించింది. వెంటనే ఆమె భర్త పకపక నవ్వటంకూడ వినవచ్చింది. తరువాత లాసినా వంటగదిలో కూనరాగం తీస్తోంది. మరొకప్పుడైతే వెంటనే లేచి వెళ్లి ఇలియా లాసినాతో బాతాఖానీ వేయకుండా వుండేవాడు కాదు; కాని యిప్పుడు యెకసక్కము లాడే స్థితిలో లేడు. వాడు తన గతిని కూర్చి తలపోసుకొంటున్నాడు.

ఉన్నట్టుండి "ఇలియా! టీ తాగుదువుగాని రా." అని కేక వేసింది లాసినా.

"ఇప్పుడొద్దు" అని వుదాసీనంగా సమాధాన మిచ్చాడు ఇలియా.

చర్చిలో గంట కొట్టిన ధ్వని వినపడింది. ఇలియా కప్పుడు తాను కొన్ని రోజులనుండి చర్చికి పోని సంగతి తలపుకొచ్చింది. గదిలోనుంచి బయట పడాలని చర్చికి బయలుదేర బోతూంటే లాసినా గది ద్వారం వద్దకొచ్చి నిలబడింది.

ఇలియా నిర్లక్ష్యంగా యిచ్చిన ప్రత్యుత్తరంతో ఆమె చిన్నపుచ్చుకొన్నది. అక్కడికి వచ్చి లాసినా విస్మయ భావంతో ఇలియా నవలోకించ సాగింది. ఇలియా ఆమెను గమనించి "నేను చర్చికి వెళ్ళబోతున్నా" నన్నాడు.

"వెళ్లొచ్చు; కాని, టీ తాగి పోదువు గాని రా."

ఇలియా "వద్దు" అని తలాడించుతూనే బయల్దేరాడు. దారిలో వానికి అననాయిక్ తలపుకొచ్చాడు. అతడు శ్రీమంతుల యింటిబిడ్డ. బక్కపల్చగా, అందంగా వుంటాడు. విలాస ప్రియుడు, భోగలాలసుడు. 'మానవుడు కూడా గ్రద్దవలె కాచుకొని వుండి అవకాశం చూచుకొని వేటపైన విరుచుకొని పడతా' డనుకొన్నాడు ఇలియా.

ఇలియా కలవర పాటుతోనే చర్చిలో ప్రవేశించాడు. అప్పుడు వాని మొఖం వికృతమై వుంది. మౌనంగా నిలబడ్డాడు. అందరూ ఐక్య కంఠంతో ప్రార్థించుతున్నారు; కాని ఒక తుంగణా స్వరం కలుపలేక పోయాడు. వాని కంఠం గార్దభ స్వరాన్ని పోలి శ్రోతల శ్రవణేంద్రియాలను బ్రద్దలు చేస్తోంది. ఇలియా అసహ్య భావంతో ముందుపడి వానికి రెండు చఱువు లంటించా లనుకొన్నాడు; కాని, అంతలోనే ఒక వృద్ధ మహిళ వచ్చి "యువకుడా! ఇది నీవు నిలుచుండే తావు కాదు. వేరొక చోటుకు పొ"మ్మని హెచ్చరించింది.

ఇలియా ఆమె ఆడంబరాన్ని పరికించాడు. "దేవుని సన్నిధిలో కూడా శ్రీమంతులకు ప్రత్యేక స్థానమా!" అని మరోపక్క కెళ్ళాడు.

పోలటోవ్ హత్యానంతరం ఇలియా చర్చికి రావటానికిదే మొదలు. ఆ విషయాన్ని స్మరించుకొని ఇలియా

గడగడ వణికిపోయాడు. ఆ ఆందోళనతో సర్వం విస్మరించాడు. వాని కే భయము లేదు; కాని, వాని ముఖ మండలంమీద విషాద ఛాయ అలముకొని వున్నది. "పరమేశ్వరా! నాపై కరుణించు" మని మదిలో ప్రార్థించాడు.

ప్రార్థన జరుగుతూనే వుంది. హెచ్చు-తగ్గు స్థాయిలలో ఇలియా కది వినపడుతూనే వుంది. గణగణ మోగే ఘంటారవం ప్రతిధ్వనిస్తోంది. ఆ వాతావరణం విచిత్రంగా వుంది.

అంతా అయిపోయింది. నిస్తబ్ధత వ్యాపించింది పెద్ద నిట్టూర్పు వదలుటతో ఇలియా హృదయం శాంతించింది. చిత్త చాంచల్యం దూరమయింది. సంకోచ మంతరించింది. తన యీ ఆకస్మిక మానసిక పరివర్తనకు ఇలియా విస్మయ పడ్డాడు.

ఇంతలో వాని కొకవిషయం జ్ఞప్తి కొచ్చింది 'లాసినా గదిలో చొరబడి నోట్ల కట్టను చూస్తే!' ఇది తలచుకొన్న తరువాత అక్కడ ఒక్క క్షణంకూడ ఉండలేక పోయాడు. గుంపును త్రోసుకొంటూ బయటపడి ఒక జట్కా నెక్కి యింటి ముఖం పట్టాడు. బండి ఎంత వేగంగా పోతున్నా వాని కది మందగతిగా నే తోచింది. దారిలో పరిపరి విధాల ఆలోచించాడు. ఒక వేళ ఆమె ఆ కట్టను చూచినా ఆ ధనాన్ని అపహరించి గప్ చిప్ గా వూరుకుంటుం దే గాని రిపోర్టు చెయ్యబోదని మనసు కూరట కల్గించుకున్నాడు.

అయినా ఆందోళన తగ్గలా. ఆబిడ ఆ నిక్షేపాన్ని అపహరిస్తే తానే స్వయంగా స్టేషనుకు పోయి యదార్థమంతా చెప్పివేసి, తన అపరాధాన్ని అంగీకరించాలను కొన్నాడు. తా నికట్టుల పాలై దరిద్ర మనుభవించుతూ యమయాతన పడుతూంటే, తన ధనంతోనే యితరులు కాలుమీద కాలేసుకొని సుఖించటం సహించ కూడదని నిశ్చయించు కొన్నాడు.

బండి యింటి ముందుకు వచ్చి ఆగింది. ఇలియూ గబుక్కున క్రిందికి దూకి ద్వారం వద్ద కెళ్ళాడు. తలుపు మీద దబాదిబ గుద్దాడు. లాసినా వచ్చి తలుపుతీసి "ఏమిటీ హడావుడి?" అని అడిగింది.

కాని, ఇలియూకు సమాధాన మివ్వటానికి అవకాశ మేదీ! గభాలున గదిలోకి కెళ్ళాడు. ఆ దూకుడులో లాసినాను తోచుకొని పోయాడు.

గదిలో కెళ్ళి చూచుకొంటే యెక్కడి దక్కడ చెక్కు చెదరకుండా వున్నై. ఇలియూ ఆరాటం తగ్గింది.

లాసినా వచ్చి "ఒంట్లో బాగా లేదా?" అని మృదువుగా అడిగింది.

"అవును. మిమ్మల్ని రాచుకొని వచ్చాను; క్షమించాలి."

"పర్వాలేదు లే. బండివాడికి బాడుగ యివ్వవద్దా?"
"దయచేసి యిచ్చి పంపండి."

ఆమె గజ్జెల గుఱ్ఱంలాగా కాళ్ల స్లిప్పర్సు టకటక లాడించుకొంటూ వెళ్లింది. ఇలియా నోట్లకట్ట తీసి చూచు కున్నాడు. యథాప్రకార మున్నందుకు తృప్తి చెంది జేబులో గోపురుకున్నాడు. తన అకారణ ఆందోళనకి, అనవసర భీతికి, అసాధారణ ప్రవర్తనకు సిగ్గు పడ్డాడు.

లాసినా తిరిగొచ్చి "వాడికి అరణా లిచ్చి పంపే శాను; ఎల్లావుంది? కళ్లు తిరిగాయా?" అని అడిగింది.

"అవును. చర్చిలో నిలబడి వుంటే అకస్మాత్తుగా–"

"అయితే మెదలకుండ పడుకోండి. కాస్సేపు మీకు పరిచర్య చేస్తాను. ఇవాళ మావారు పొద్దుపోయి గాని రారు."

ఇలియా పక్క మీద పవళించాడు. లాసినా కుర్చీలో కూచుంది.

ఇలియా దరహాస వదనంతో "నా మూలంగా మీ కెందుకీ శ్రమ?" అన్నాడు.

"ఇంత మాత్రానికేనా?"

తరువాత యిద్దరూ మౌనం వహించారు. ఏ మనాలో ఇలియాకు తోచలా. లాసినా వాని ముఖంలోకి చూస్తూ నవ్వుతోంది.

ఇలియా దృష్టిని మరల్చి "నవ్వుతా రెందుకు?" అన్నాడు.

"చెప్పనా?" లాసినా అంది.

"తప్పకుండా."

"మీకు నెపాన్ని కల్పించటంలో కూడ నేర్పు లేదనే."

ఇలియూ చకితుడై ఆమెవేపు దృష్టిని సారించాడు.

"నేను నిజమే చెపుతున్నాను. మీకు సుస్తీగా వున్నదని వంక పెట్టారు; కాని, దాన్ని నిర్వహించలేక పోయారు. మీకే జబ్బూ లేదని నాకు తెలుసు. ఇవాళ అందిన వుత్తరంవల్లనే విచారపడుతున్నారు. నే నా వుత్తరాన్ని చదివాను లెండి"

లాసినా లీసా తనకు రాసిన జాబును చదివిందని ఇలియూ గ్రహించి "నిజమే" నని వొప్పుకున్నాడు.

ఆ విడ ఒకసారి కిటికీలోనుంచి బయటికి చూచి అన్నది—"నేను ప్రౌఢను కాను; అయినా మీకిష్టమైతే నా సలహా వినండి: ఆ లేఖను చించి పారవెయ్యండి. ఆమె తిరస్కరించి మీకు వుపకారమే చేసింది. అప్పుడే మీవయస్సెంత! అంతేకాక, మీవద్ద తగినంత ధనం కూడ లేదు. ధనహీను డెన్నడూ వివాహ బంధనంలో చిక్కుకో కూడదు. తరుణము వస్తే మీ కర్ధాంగి దొరక్క పోదు. మీవంటి అందగాణ్ణి, బలసాలిని యే అతివ కోరదు! మీరు ముందు బాగా కష్టపడి సంసార సాగరాన్ని యీదటానికి చాలినంత డబ్బును మూట గట్టండి. మీ భావి వుజ్వలంగా

వుంటుంది. మీరు శ్రమశీలురు, వ్యసనం లేని వారు. మీ శాంత స్వభావము, వుత్సాహాలే మీకు వున్నతిని కలిగిస్తాయి."

ఇలియా ఆబిడ మాటలు వింటూ మధ్య మధ్య నవ్వుకుంటున్నాడు.

"ఈ విధంగా నవ్వి తప్పుకుంటే లాభంలేదు. ఇది పడుచు తనపు పొంగు. అది త్వరలోనే అణగి పోతుంది. దానికి చికిత్స సుళువైనదే పెళ్లికి పూర్వం నేను కూడ మూడు దఫా లీ ప్రేమ జాలంలో చిక్కుకున్నదాన్నే. ఒకసారి నేను ఆత్మహత్యకు కూడ సిద్ధమయ్యాను; కాని, క్రమంగా ఆమత్తు విడిపోయి సుఖపడ్డాను. అసలు ప్రేమ సాగరలో పడకుండానే తరుణము వస్తే వివాహం దానంతటదే అయిపోతుంది."

ఇలియా తలెత్తి లాసినా వంక చూచాడు.

"క్రమ క్రమంగా మా ప్రేమ వృద్ధి కాజొచ్చింది. ఇప్పుడు మేము ప్రేమ సామ్రాజ్యా న్నేలుతున్నాము. స్త్రీలు తఱచుగా వివాహానికి ముందు ఉన్మాదినులవుతూంటారు."

"మీ వుద్దేశం నాకు బోధపడలా."

"నవ్వులాట కంటున్నాన్లే; కాని, వివాహ పర్యంతం తమ భర్తల విషయంలో యేమీ యెరుగ నటువంటి వనితలే యెక్కువగా కవ్వించుతారు. అయినా అలాంటి వాళ్లు

ముడిపడిన తర్వాత పతి ప్రేమతో సమ్మోహిత లవుతారు.”

లాసినా యిల్లే చాలాసేపటివరకు వుపన్యసించింది. ఇలియా తుదివరకు అతి శ్రద్ధాళువై విన్నాడు. ఆమె మాట్లాడుతున్నంతసేపు వానికి శాంత్యానందాలు సంప్రాప్తమైనై. ఆమె అల్పవయస్సులోనే అంత నైపుణ్యాయు, అనుభవ జ్ఞానము కలిగి వున్నందుకు మెచ్చుకొన్నాడు. అట్టి పడతిని భార్యగా కలిగి వున్న వానికి దుఃఖము దరికైనా చేరలేదు. అదృష్టమన్న వారిదే ననుకొన్నాడు.

అతని ప్రక్కన శీలవతి అయిన ఒక గృహస్థ నారీమణి కూర్చుండి మనసిచ్చి మాట్లాడుతోంది. ఆవిడ ప్రతివాక్కు వాత్సల్యాన్ని ప్రతిబింబించుతోంది. ఇలియా హృదయం కృతజ్ఞతా భరిత మయింది. లాసినా వెళ్లటానికి లేచినప్పుడు అతడు నత మస్తకుడై “మీ వుపదేశంతో నాకు శాంతి చేకూరింది. నేను మీ కెప్పుడూ కృతజ్ఞుడనై వుంటాను” అన్నాడు.

“నిజంగా నేను మీకు శాంతిని కల్గించ గలిగానా?” అని అడుగుతూ వుంటే లాసినా పెదాలపైన చిరునవ్వు దొంతరలు పరుగు తీశాయి. ఆమె కపోలా లెరుపును దాల్చాయి. ఇలియా వేపు ఒరగా చూస్తూ “మళ్లీ వస్తా” నంటూ వెళ్లి పోయింది.

ఇలియా కామెపై ననురక్తి అంకురించి దినదినాభివృద్ధి చెంద సాగింది. అతడా ఆలు-మగల పరస్పర

ప్రేమానుబంధము, శాంత్యుత జీవితాన్ని గాంచి ఈర్ష్య పడేవాడు. పోలీసు వుద్యోగుల పేరు వింటే ఇలియా హృదయంలో ద్వేషాగ్ని రగుల్కొనేది. పోలీసుల క్రూరత్వం, స్వార్థ, లోభాలు ఇలియాకు చిరపరిచితాలే; కాని, నికోడిమిచ్ పట్ల మాత్రం ప్రత్యేకాభిమాన మేర్పడింది. ఇలియా కతడు శ్రమశీలి, న్యాయప్రియుడు, ఉదాత్తుడుగా కన్పించేవాడు. భర్త శరీరంగాను, భార్య ఆత్మగాను తోచింది ఇలియాకు. నికోడిమిచ్ యింటి పట్టున చాల తక్కువగా వుండేవాడు. లాసినా ఇలియాల మైత్రి వృద్ధి అవుతూ వచ్చింది. అతడామెకు చిన్న-పెద్ద పనులు చేసి పెడుతూండేవాడు. అందువల్ల వాని కానందం లభించేది. కొన్నాళ్ళకు లాసినా పనులు నిర్వర్తించటం ఇలియా దిన చర్యలో ఒక భాగమయింది. లాసినా చనువుకొద్దీ వానికి పనులు చెపుతూండేది.

22

అప్పుడప్పుడు కర్స్కోవ్ అనే మరో పోలీసు అధికారి నికోడిమిచ్ గృహానికి వచ్చి పోతూ వుండేవాడు. అతడు ఒక్క పలుచని మనిషే గాని, మహా ముక్కోపి. వక్రబుద్ధి వాడి సొంతసొమ్మే. ఆ ఘనుడు బళ్ళవాళ్ళను చూచి మండిపడేవాడు. వాళ్ళ నెప్పుడూ నోరు చించుకొని తిట్టేవాడు. బళ్ళవాళ్ళు పట్టణశోభను నాశనం చేస్తున్నారనీ, యెంత చెప్పినా వాళ్ళబుర్ర కెక్కదనీ, వచ్చేవారు యెడం నెపుగాను, వెళ్ళేవాళ్ళు కుడినైపుగాను నడవాలని ఒక బోర్డు తగిలించితే బాటసారులు తూ. చ. తప్పకుండ నియమాన్ని పాటించుతారనీ, బళ్ళవాళ్ళకు మాత్రం బుద్ధి రాదనీ యేమేమో చెపుతూండేవాడు.

ఎప్పుడూ బళ్ళవాళ్ళను కసురుతూనో, విసుగుతూనో వచ్చేవాడు. ముఖం చిటపట లాడుతూండేది. సౌమ్యత వానికోశంలోనే లేదు.

ఆ యింటికి వచ్చే వారిలో స్కూళ్ళ ఇన్స్పెక్టరు ఒకడు. అతని పేరు గ్రాలివ్. మితభాషి; కాని, అతిగా పాడేవాడు. అతని కళత్రం తిండిపోతు. ఆబిడ వచ్చినప్పుడెల్లా లాసినా చేసిన వంటకాలన్నీ స్వాహా చేసేది. లాసినా ఆమె వెనుకనే ఆడిపోసేది.

"వట్టి పందికుక్క. మంచి పదార్థాలే యేరి తింటుంది. ఆ పొట్టలో యే తుక్కో తొక్కా గాదూ?" అనేది లాసినా.

అక్కడ చేరే వారిలో యింకో వ్యక్తి కూడా వున్నాడు. అతనికి ఆబ్కారీ యిలాకాలో యేదో వుద్యోగం. అతడెప్పుడు వచ్చినా వాని అర్ధాంగి అలెగ్జాండ్రా వెంట వుండేది. అత డేదో ధర్మసమాజంలో సభ్యుడు కూడాను. సతీ-పతు లెప్పుడూ ఆ సంస్థ విషయం ప్రస్తావించేవారు. ఒకనాడు వారి సంభాషణ యిల్లా నడిచింది

"అక్కడేమి జరుగుతున్నదీ తెలుసా?" అన్నాడు భర్త.

"నాకు తెలుసు"నంది భార్య.

భర్త అక్కడున్నవారి నుద్దేశించి చెప్పాడు. ప్రతి రోజూ యేదో ఒక దరఖాస్తు వస్తూనే వుంటుంది. భర్త చనిపోయాడనో, కాలు విరిగి పోయిందనో, దిక్కులేని శవానికి దహన సంస్కారం జరిపించాలనో, యిల్లాగే వేన వేలు విజ్ఞప్తులు. అందరికీ కాస్తో కూస్తో సహాయం చేస్తూనే వున్నాం; కాని, నా దృష్టిలో అందువల్ల లాభానికి మారు నష్టం వాటిల్లుతోంది. సోమరితనం పెచ్చుపెరిగి ప్రజలు భ్రష్టులై పోతున్నారు. ఈ మధ్యనే ఒక వినతి పత్రం వచ్చింది. ఒకావిడ భర్త చనిపోయాడట. అక్కరకు రాని పిల్లలు ముగ్గురున్నారట; కాని, వాళ్ల పాలన-పోషణకు

దారి లేదట. ఇదీ ఆ దరఖాస్తులో వున్న విషయం. కమిటీ సమావేశమై అయిదు రూపాయలు మంజూరు చేసింది; కాని, మా ఆవిడ ఆ దరఖాస్తులో వ్రాసుకొన్న సంగతులను విశ్వసించ లేకపోయింది. తాను స్వయంగా వెళ్లి విచారించుతానంది. పోయి దర్యాప్తు చేయగా, దరఖాస్తుదారిణి భర్త కొన్ని సంవత్సరాల క్రితమే మృతి చెందినాడనీ; ఆవిడ కిద్దరు కొడుకులు మాత్ర మున్నారనీ, వాళ్లందరూ పనిచేసి పొట్టపోసుకొనే స్థితిలోనే వున్నారనీ తేలింది. అంతట నేనా విధవను పిలిపించి "మోసగించటానికి ప్రయత్నించిన నేరానికి నీ మీద కేసు పెట్టిస్తే యేం మవుతుం" దని అడిగాను. ఆమె నా కాళ్లా వేళ్లా పడి బ్రతిమ లాడింది."

పోలీసు ఆఫీసరు పకపక నవ్వాడు. అందరూ అలెగ్జాండ్రా సేముషీ విశేషాన్ని శ్లాఘించారు. తరువాత పాటకపు జనం మీద అనేక విధాల ఆక్రోశించారు.

ఇలియా తన గదిలో వుండి వారి వాదోప వాదాలు వింటూ, వాటి నవగాహన చేసుకోటానికి ప్రయత్నించేవాడు; కాని, వానికేమీ బోధపడేది కాదు. అయితే వాళ్లు మానవ జీవిత సమస్యలను బాగా తరచి తరచి ఆలోచించి శాశ్వత నియమాలు కొన్నిటి నేర్పరచినట్లు మాత్రం ఇలియా గ్రహించాడు. ఆ కట్టుబాట్ల నతిక్రమించి నడిచే వారిని విమర్శించి, దూరుటే వారి కర్తవ్యం కాబోలు ననుకొనేవాడు. సాధారణంగా ఉద్యోగస్తుల యిళ్లూ-వాకిళ్లు, చర్చి, ప్రార్థన, అలగాజనం అసభ్యత, పరిచిత స్త్రీ-పురు

షుల వ్యభిచార, భోగ-విలాసాలు వారి చర్చనీయాంశాలయి వుండేవి.

ఈ రకం సంభాషణలు వినివిని ఇలియా విసుగు చెందాడు. అప్పుడప్పుడు గృహమేధి ఇలియాను తమ గోష్ఠిలోకి ఆహ్వానించేవాడు. ఇలియా మౌనంగా ఒక పక్కన కూర్చొని అందరిని పరీక్షగా పరికించేవాడు. లాసినా యెప్పుడూ నవ్వుతూ కులుకుతూ వుండేది; కాని, ఆమెభర్త ధనలక్ష్మిని జుట్టుపట్టుకొని యీడ్చుకొచ్చి తమ యింట్లో బందీని చేసే దెట్లాగా అని తపన పడేవాడు.

ఒక పర్యాయం నికోడిమిచ్ యిల్లా అన్నాడు—
"దేశ దేశాల్నుంచి వివిధ పక్షిజాతులను తెప్పించి వుంచాలని ఆలోచిస్తున్నాను. వృత్తి చెడ్డదికాదు; ఆదాయం కూడ తగినంత రాకపోదు. ఈ భాడకావు నౌకరీకంటె అదే మంచిది.

పతి ప్లానుకు లాసినా నవ్వేది. ఇలియా వేపు భావయుక్తంగా చూస్తూ "నేనీ వేసంగిలో క్రిమియాకో, కకేషస్‌కో వెళ్తాను. చలికాలం వచ్చిన తర్వాత దాన సమాజ సభల నేర్పాటు చేస్తాను. ఆడంబరం లేని చక్కని సాదా దుస్తులే ధరిస్తాను. ఒక బ్రోచి, లోలకులు మినహా తతిమ్మా ఆభరణ లేవీ పెట్టుకోను. పేదల రక్తము, కన్నీళ్లే పునర్జన్మలలో రత్నాలు, మణులుగా సంప్రాప్త మవుతాయని

యేదో ధార్మిక గ్రంథంలో చదివినట్టు జ్ఞాపకం" అని నిట్టూర్చింది.

ఇలియా వారి మాటలకు నవ్వుకొనేవాడు. ఆ గది లోని సరంజామా, అలంకారాలను గాంచి ముగ్ధుడయ్యే వాడు; కాని, వాని నేదో అజ్ఞాతవేదన వ్యాకుల పరిచేది. అమ్మకం తగ్గి ఫాయిదాకు లోటు వచ్చిననాడు ఇలియా మనస్సు బాగుండేది కాదు. ప్రతి వస్తువు పామై తన్ను కరవ వస్తున్నట్టుండేది. అటువంటప్పుడు లాసినా గృహా లంకారము వాని కప్రియంగా వుండేది. చేతికందిన ప్రతి వస్తువును గిరాటు వెయ్యాలనిపించేది. ఇంతకూ కారణం మాత్రం వానికి తెలిసేదికాదు.

అటిస్థితిలో మౌనము ద్రిసహించేవాడు. పెదవి విప్పితే పరుల నొప్పించే మాట లేమి వెలువడునో యన్న భయంవల్ల యెవరితోను మాట్లాడే వాడు కాదు.

ఒక రోజున ఇలియా ఆ దంపతులతో కలసి చీట్లాడు తున్నాడు. మాటల సందర్భంలో "మీరు పోలటోన్ హంతకుడిని పట్టుకోనే లేదు గదూ?" అని నికోడిమిచ్‌ను అడిగాడు.

లాసినా భర్త ఆటలో తన్మయుడై వున్నాడు. అతడు నిర్లక్ష్యంగా "మేము పట్టుకోవాలన్న ఆత్రంలేదు. అసలు ప్రయత్నించి తేగా! [భార్యతో] ఆటీన్ రాణి యెవరి దగ్గ రుంది? నువ్వు ఇస్పేటు రాణి నిచ్చావు గదూ?" అన్నాడు.

"జ్ఞప్తికి తెచ్చుకోండి. నేను చెప్ప"నంది లాసినా.

ఇలియూ మళ్లీ ప్రశ్నించాడు—"హంతకుడు తప్పించుకొన్నట్టేగా?"

నికోడిమిచ్ పరధ్యానంగానే జవాబిచ్చాడు—"ఆ, తప్పిపోయినట్టే. మేముకూడా ఆ వ్యవహారాన్ని ముగించేశాము."

"ఇంత ఆలస్య మేమిటి? మీకు కావలసింది అడగండి" అని లాసినా భర్తను తొందర పెట్టింది.

"అడుగుతా నుండు."

ఇలియూ తనకు సరియైన సమాధానం రానందున మళ్లీ మళ్లీ హత్యా సంబంధమైన ప్రశ్నలనే వేస్తున్నాడు.

"హంతకుడు పక్కా చతురుడై వుంటాడు" అన్నాడు ఇలియూ.

"చతురుడా? ఏడ్చాడు! మా కంటే నేర్పరా?"

అని పోలీసు ఇనెస్పెక్టరు సెట్టు (రాణీలు) తీసి బల్ల మీద పెట్టాడు. ఇలియూ కొక్క సెట్టయినా రాలేదు. ఓడిన వాణ్ని 'గాడిద' అవటమే గెల్చినవారి ప్రయోజనం. భార్యా భర్త లిద్దరూ ఇలియూను పరిహాసం చేయసాగారు. వానికి రోషం పొడచు కొచ్చింది. చేతిలోని పేక ముక్కల్ని బల్లపైన విసరికొడ్తూ "పట్టపగలు నడిబజార్లో హత్యచేసి తప్పించుకోవడం సామాన్య మనుకున్నారా?" అని పౌరుషం ప్రదర్శించాడు.

"అది సాహసం కాదు; అదృష్టం!" అంది లాసినా.

ఇలియా యిద్దరి ముఖాలు చూస్తున్నాడు.

నికోడిమిచ్ "హత్య చేయటం అదృష్టమా!" అన్నాడు.

"ఎందుకాకూడదు? హత్యచేసి తప్పించుకోవడమే అదృష్టం" అంది లాసినా

ఇన్స్పెక్టరు లాసినా నుద్దేశించి "ఈసారి నాకు డైమను ఆసుకూడా యివ్వు" అన్నాడు.

లాసినా యిచ్చింది, ఆమె ఇలియా నేదో అడిగితే వాడు "లేద"ని చెప్పి "నాకు రావాల్సిన ఆసును మీ ఆయన కిచ్చావుగదూ" అన్నాడు.

"ఏ వర్తకుడినో చంపు; అదే వస్తుంది" అంది లాసినా.

నికోడిమిచ్ ఆసును, రెండు చుక్కల ముక్కను యిస్తూ ఇలియాతో అన్నాడు—"ముందీ పేకముక్కలు తీసుకో. హత్యచేసి తర్వాత యింకేదైనా సంపాదించు దువుగాని."

ఇలియా అతడి కళ్ళల్లోకి చూచాడు. హత్యా విషయంలో ప్రశ్నించాలన్న కుతూహలం మరి లేక పోయింది. వారితో కలసి మెలసి వుండటం యెప్పటికైన ప్రమాద మనుకొన్నాడు. పెద్ద బరువు నెత్తుకున్నట్టుంది. వాని

కప్పుడు భగవంతుడంతా యెరిగివుండీ కూడ శిక్ష విధించ టానికి జాగేల చేస్తున్నాడోనని సంశయాత్ముడైనాడు. ఇలాంటి సందేహం కలిగినప్పుడేదైనా ధార్మిక గ్రంథం తీసి చదివేవాడు. బాల్యంలో వానికి అద్భుత చమత్కార కథలు మాత్రమే రుచించేవి. ఇప్పుడు వాస్తవిక జీవిత సమస్యలకు సంబంధించిన గ్రంథాలు చదువ సాగాడు; కాని, క్రమంగా వాటిపైన కూడ రుచి తగ్గిపోయింది. అవన్నీ మానవుడికి ధైర్యం కల్గించటానికే రాయబడినాయని తోచింది. అయినా అనుభవం అధికమైనకొద్దీ జీవితంలోని యదార్థాన్ని గ్రహించాలనే జిజ్ఞాస కలిగింది. తన కళ్ళ ముందు జరిగిన ప్రతి చిన్న ఘటనకు ఆద్యంతాలు తెలిసి కొన ప్రయత్నించేవాడు.

పాషాను చూడటానికి హాస్పిటలుకు పోయినప్పుడెల్లా ఇలియా వాని కానాటి ఘటనలను వర్ణించి చెప్పుతూండేవాడు.

"నిన్న వొక వడ్రంగి, కొందరు గోడ కట్టువాళ్ళు రోడ్డున నడిచి పోతున్నారు. కానిస్టేబిలు వారి నటకాయించి 'పక్కదారిని నడువలేరూ? ఈ రాస్తా శ్రీమంతుల కోసమని తెలియదూ? మీ గాలు వారికూడ గుమాయించాలా?' అని గద్దించాడు. భాగ్యవంతులకు సర్వ సౌఖ్యాలు చేకూర్చుతున్నదా శ్రమజీవులే; అయినా వారు వాళ్ళప్రక్కన నడవటానికూడ అర్హతలేదు. ఎందుకో యీ హెచ్చు తగ్గులు?"

ఇల్లాంటివే అనేక విషయాలు విమర్శనా పూర్వకంగా పాషాకుతో చెపుతూండేవాడు ఇలియా. పాషాకు ఊః కొట్టేవాడు. వాడికి హాస్పిటలు బందిఖానాగా వుంది. శాంతిలేదు; సుఖం సున్నా. వేరా యోగక్షేమాలు తెలియక మరీ విచార పడేవాడు. ఆ చింతే వానిని కృశింపజేసింది. జాకోబును ఏవగించుకొనేవాడు. ఒంటరిగా దుఃఖించటానికైనా సిద్ధపడేవాడు; గాని, జాకోబు యెదుట పడటానికి వాని మన సొప్పేది కాదు.

జాకోబు పళ్లూడటమే కాక రెండు పక్కటెకలు కూడ చిట్లాయి. వానికి యింటివద్దకంటె హాస్పిటలులోనే సుఖంగావుంది. ప్రక్కనున్న రోగితో పరిచయం చేసుకొన్నాడు. వాడొక చర్చిలో ప్రతిహారి. వాని కాలికేదో వ్రణం లేచి అక్కడ చేరాడు. ఇలియా వెళ్లినప్పుడెల్లా జాకోబు వాని వద్దనే కూర్చొని వుండేవాడు. వాళ్లిద్దరూ బైబిలు చదువుతూండేవాళ్లు.

జాకోబు స్వరం మందగించింది. వాడు మాట్లాడుతూంటే కీచు కీచు మన్నట్టుండేది. చదివేటప్పుడు చేతులాడించుతూంటే రోగులందరినీ తన వద్దకు రమ్మన్నట్టుగా వుండేది. ముఖంమీద దెబ్బలమచ్చ లింకా కనిపించుతున్నై. వాని రూపం భయంకరంగా తయారైంది. ఒక రోజున ఇలియా రాగానే పుస్తకం మడిచి చంకలో పెట్టి "మాషా నెప్పుడైనా చూచావా!" అని అడిగాడు.

ఇలియా "లే"దన్నాడు.

"అంతా యింద్రజాలంగా అయిపోయింది. ఉదయం కన్పించింది; సాయంత్రానికి మాయమై పోయింది."

"మీనాన్న వచ్చి చూచాడా?"

"వచ్చాడు."

తండ్రి ప్రసక్తితో జాకోబు ముఖం రంగు మారింది. భీతిగొన్నవాడివలె చూస్తూ మళ్లీ చెప్పాడు—"ఇవాళ పుదయం కొన్ని పండ్లు కూడ తెచ్చిచ్చాడు. హాస్పిటలులో చేరి చాలా దినాలైందట. ఇక నన్ను యింటికి వచ్చెయ్యమన్నాడు. నేను డాక్టరు గారితో నన్నిప్పుడప్పుడే పంపవద్దని బ్రతిమ లాడుకున్నాను. నా కిక్కడే చాలా బాగుంది. ఇక్కడే నా కీయనతో (ప్రతిహారిని చూపి) పరిచయ మయింది. పేరు నికిటా. ఈయన వద్ద బైబిలు వుంది. మేము నిత్యము దాన్ని పారాయణం చేస్తున్నాము. ఎనిమిదేళ్ళనుంచి మననం చేసి చేసి నికిటా "అంతా ఆకళింపు చేసుకొన్నాడు. చక్కగా వ్యాఖ్యానంచేసి చెప్పగలడు. బాగుపడిన తర్వాత నికిటాతో నేను కూడ చర్చిలోనే వుంటాను. ఇక యింటికి మాత్రం పోను."

నికిటా తలెత్తి ఇలియా వంక తేరిపార జూచాడు. ఇలియా అక్కడనుంచి వెళ్లిపోడానికి వేగిర పడ్డాడు.

బైబిలును గురించి ముచ్చటించాలని జాకోబు ఉబలాట పడుతున్నాడు. గద్గద కంఠంతో "బైబిలు యెంత మంచి గ్రంథం!" అన్నాడు.

వాడు బైబిలు పైనుంచి దృష్టిని ఇలియాపై నిల్పాడు. "బైబిలులో సర్వవిషయాలు రాసివున్నై. భగవంతుడు పాప కార్యాల నెట్లు ఖండించేది, పాపుల నే విధంగా శిక్షించేది, పుణ్యాత్ములపై నే రీతిని కృపాదృష్టిని బరపేదీ మొదలైన విషయా లెన్నో యిందులో వున్నా" యని చెప్పాడు.

"అందులో వున్నదంతా నిజమేనా?" ఇలియా అడిగాడు.

"అక్షరాలా" నని ఆ తైనాతి దృఢంగా అన్నాడు.

"మీ వుద్దేశం సరికాదని నా తలంపు" అన్నాడు ఇలియా.

నికిటా రెప్పలు వాలాయి. కళ్ళుమూత పడ్డాయి. వాని గడ్డం వూగులాడింది. "సత్యాన్వేషణలో నిమగ్నుడవటం పాపాచరణ కాదు. భగవంతుడే అందుకు ప్రేరేపించుతున్నాడు."

ఇలియా అదిరి పడ్డాడు· ప్రతిహారి నిట్టూర్పు విడిచి మళ్లీ అన్నాడు— "సత్యమే తన్ను వెదకుమని చెవిలో వూదుతోంది. సత్యమే భగవంతుడు. భగవదన్వేషణ చేయటంలో నే వాస్తవికానందం లభ్యమవుతుంది."

అతని ముఖం తేజోవంత మయింది. ఇలియా కూడ ఆకర్షింప బడ్డాడు.

"దశమాధ్యాయం చదివి వీరికి వినిపించు" మని ఆ తైనాతి జాకోబు నుద్దేశించి అన్నాడు.

జాకోబు గబగబా పుటలు తిరగేసి చదువ నారంభించాడు.

"నా ఆత్మ యీ జీవితంతో విసిగిపోయింది. అందుకు బాధ్యత నాదే. నే నెప్పుడూ నా ఆత్మను నిందించు కుంటాను. నన్ను శిక్షించ వద్దని దేవుణ్ని ప్రార్థించుతాను. నీ కభిప్రాయ భేద మెక్కడో ముందే చెప్పమంటాను. నీ చేతుల్తో చేసింది చెడగొట్టడం నీకు న్యాయమేనా అని అడుగుతాను."

ఇలియా పుస్తకం వేపు చూచి కళ్ళు నలుపుకో సాగాడు.

"నీవు దీనియందు విశ్వాస మేర్పడటం లేదు కదూ? బలే చిత్రమైన మనిషివి!" అన్నాడు జాకోబు.

"దాన్ని విచిత్ర మనటానికి వీల్లేదు. అది పిరికితనం. భయమనికూడా అనొచ్చు. భగవంతుని మోాల కన్నెత్తి చూట్టానికే వీరికి సాహసంలేదు" అన్నాడు నికిటా నిమ్మళంగా.

పై మాటలని అతడు పైకప్పు నుంచి దృష్టిని ఇలియా పైకి మరల్చి తన మాటలతో వాని హృదయాన్ని చీల్చ గోరుతున్నట్లు మళ్లీ అన్నాడు..."ఇదేమిటి! ఇంతకంటె తీవ్రము, స్పష్టమైన సంగతులు యిరవయ్యో అధ్యాయంలో

వున్నై. అందులో నీ సత్ప్రవర్తన, అభ్యున్నతుల వల్ల భగవంతుని కేమీ ప్రయోజనంలే” దని రాసివుంది. కాని యీ విషయాలు సులభంగా బోధపడవు. బాగా మననం చేస్తేనే అవి గ్రాహ్య మవుతాయి.”

“మీరు వాటి అంతరార్థాలను పూర్తిగా గ్రహించి వుంటారనుకుంటా” నన్నాడు ఇలియా.

జాకోబు అందుకున్నాడు— “ఈయన కవన్నీ కొట్టిన పిండే.”

“నేను తెలిసికొనే రోజులు గతించాయి. ఇక నేను తెలిసికో వాల్సింది మృత్యురహస్య మొక్కటే. నా కాలు నరికి వేయబడింది; అయినా వాపు పైకెక్కుతూనే వుంది. రెండో కాలుకూడ వాయ నారంభించింది. గుండె కూడ ఉబ్బరింపుగానే వుంది. నే నిక యెన్నాళ్లో జీవించను.” నికిటా నిరాశాభావంతో అన్నాడు.

వాని దీన దృక్కులను గాంచి ఇలియా జాలి చెందాడు.

నికిటా మళ్ళీ ప్రారంభించాడు.

“నా కిక బ్రతకాలని లేదు. నా జీవితమంతా దుఃఖ భాజనమే. సదా వేదన, పరితాపాలకే గురి అవుతూ వచ్చాను. సుఖం నామమాత్రంగా నైనా నాకు దర్శన మివ్వనేలేదు. నా తండ్రి జాకోబు జనకుని వలెనె క్రూరుడు, దయా రహితుడూను. ఒక్క త్రాగుబోతు; ద్విపాద పశువు.

నా తల మూడుసార్లు పగుల గొట్టాడు. ఒక పర్యాయం పొంగుతున్న నీళ్ళు నా కాళ్లమీద గుమ్మరించాడు. నా పుట్టుకతోనే నా తల్లి మరణించింది. నా భార్య నా ముఖం చూచి యెరుగదు. ఆమె బలవంతంగా నా కంటగట్ట బడింది. పెళ్లి అయిన మూడోనాడే ఆవిడ వురి పెట్టు కుంది. మా అక్క మొగుడు నా ఆస్తిపాస్తులన్నీ అపహ రించాడు. నా భార్య పెళ్లికి పూర్వమే తన హృదయాన్ని మరొకడికి అర్పించుకున్నదట. నాపై నిష్టములేకనే ఆత్మ హత్యకు పాల్పడింది. నేనామెను తాకటానికైనా ప్రయ త్నించి యెరుగను. అయినా కూడ నా అక్క, యిరుగు పొరుగువాళ్లు ఆవిడ మరణానికి నన్నే బాధ్యునిగా యెంచి నానా అల్లరి చేశారు. తరువాత తొమ్మిదేళ్ళు యేకాకి గానే వుండిపోయాను. ఆ రోజులెంత దుఃఖదాయకములు, భయానకములో చెప్పలేను. నేను ప్రతిదినం సుఖంకోసం ప్రతీక్షించుతూ వుండేవాణ్ని; కాని, అది లభ్యం కానే లేదు. ఇప్పుడిక్కడ మృత్యు ఘడియలు లెక్కపెడు తున్నాను. ఇదే నా జీవిత చరిత్ర."

అని ముగించి నికిటా కళ్లు మూసుకొన్నాడు. ఒక క్షణమాగి "ఇంకా నేనెందుకు జీవించాలో మీరే చెప్పండి" అన్నాడు.

వాని జీవితగాథ వినటంతో ఇలియా ముఖం వాడి పోయింది. వానికి వొణుకు పుట్టింది. జాకోబు భయంతో

గజగజ లాడాడు. వాని కళ్లనుంచి బాష్పబిందువులు జల జల రాలసాగాయి. మిత్రులిద్దరూ మౌనం వహించారు.

అతడు మళ్లీ సాగించాడు—"నా జీవిత పరమావధి యేమిటా అన్న సమస్య రాత్రింబవళ్ళు నా హృదయంలో కలక వేస్తోంది దేవుడు నాకు దురన్యాయం చేశాడు. నా కింక జీవించాలన్న అభిలాష లేదు. ఏమి చెప్పటానికి మాటలే స్ఫురించటంలేదు. నేను జీవించి వుండు టెందుకనే ఆలోచించుతూంటాను."

అతని గొంతు గద్గదకమైంది. మరి మాట పెగల టమే కష్టమైంది. అతి ప్రయత్నంతో చెప్పాడు—"ప్రపంచంలో నా అన్నవాళ్లింటే బ్రతికడంలో అర్థమున్నది. ఎందు వల్లనంటే, చచ్చిన సింహాంకంటె ప్రాణంతో వున్న శునకం మేలు. సుఖసమయంలో సంతోషించు. ఆపత్కాలంలో విచారపడు' మని ఒకచోట రాసివుంది. ఈశ్వరుడే రెండు తర్వాత ఒకటి నుంచటం వల్ల తొందరు మానవుని చేతికి చిక్కేదేమీ వుండదు"

ఇక వినటానికి ఇలియూసు సాహసం లేకపోయింది. లేచి జాకోబు కరస్పర్శ చేశాడు. దేవునికి చేమోడ్చినట్లు ఆ తైనాతికి చేతులు జోడించి అక్కున్నుంచి కదిలాడు. వాని అంతరంగంలో కల్లోలంగా వుంది. హృదయంలో మరొక గాయ మేర్పడింది. నికటా ప్రతి శబ్దం ఇలియూ అంతరాళంలో అంకితమైంది. వాటని గురించే ఆలోచించు

తున్నారు. వాటి భావాన్ని గ్రహించటానికి ప్రయత్నించు తున్నాడు. కొత్త సమస్యలు వాని హృదయంలో తుపాను రేపి ద్వంద్వ యుద్ధాన్ని లేవదీశాయి. ఇలియా మరింత కలవర పడ్డాడు.

అంతకు పూర్వం భగవంతుడు మానవులను వారి కర్మానుసారమే శిక్షించుతాడని ఇలియా విశ్వసించేవాడు; కాని, నేడు వాని విశ్వాసానికి ఆఘాతం తగిలింది. అది కూకటి వేళ్లతో కదిలింది నికిటా దీనచరిత ప్రభావం ఇలియాపైన పని చేసింది. వాని హృదయంలో పరస్పర విరుద్ధభావనలు రెండు జాగరితమైనై. ఒకటి అగ్ని శిఖ లాంటిదైతే రెండోది మంచుగడ్డ నంటిది. తన గత జీవితం మీద. సమాజంపైన జుగుప్స కలిగింది. నిత్యము నూతన భావాలు, ఆలోచనలు స్ఫురించుతూండేవి.

ఇలియా పాత భావాలన్నిటినీ త్రోసి రాజని యిక ముందు శాంతిమయము, సుఖప్రదము నైన చక్కని జీవితాన్ని గడపాలని ఆలోచించ సాగాడు. ఇకముం దెవరినీ కలుసుకో వద్దనుకున్నాడు. గతంలో వలె జీవితాన్ని వెళ్ళబుచ్చటాన్ని తెలివి తక్కువగా భావించాడు.

ఈ ఆలోచనలతోనే యింటికి చేరుకొన్నాడు. తిరిగి తిరిగి రావటంవల్ల అలసిపోయాడు. లోపలికి అడుగు పెట్ట గానే గృహయజమాని తటస్థపడ్డాడు.

“మీరు జీవితాన్ని దుర్వ్యయం చేసుకుంటున్నారు. మీ బోటి యువకులకు వున్నతాశయా లుండాలి. నేను

పోలీసు కమీషనరును కాగల పక్షంలో ఇన్స్పెక్టరుగానే యెందుకుండాలి?" అని నికోడిమిచ్ సలహా నిచ్చాడు.

ఇలియగా కా దంపతు లిద్దరూ సలహా లిస్తూ వుండే వారు. లాసినా వాని శాగోగులను గూర్చి తెలుసు కోవటంలో చాలా శ్రద్ధ చూపెట్టేది.

"నెల కెన్ని రూపాయల సరకు నమ్ముతున్నావు? ఖర్చులు పోను ఆదా యెంత వస్తోంది?" ఇల్లాంటి ప్రశ్న లడిగేది లాసినా.

లాసినా మాట్లాడుతూంటే ఇలియాకు పరమా నందంగా వుండేది. ఆమె నేర్పు, వ్యవహార కుశలత, కలుపు గోలుతనం వున్నత వంశ సంజాత కుండ వలసిన లక్షణాలని లాసినా యందెంతో గౌరవం కలిగి వుండేవాడు.

ఒకనాడు ఇలియా వుదాసీనంగా కిటికీవద్ద కూర్చుండి బజార్లోకి చూస్తున్నాడు. మాటి మాటికి వానికి లీపా జ్ఞప్తికి వస్తోంది. అదే సమయంలో లాసినా వానిని తేనీటి కాహ్వానించింది. ఇలియా కిష్టంలేక పోయినా వెళ్ళక తప్పిందికాదు. వెళ్లి మెదలకుండా కూచున్నాడు. ఆ దం పతు లేదో గంభీరాలోచనా ధీనులై వున్నట్టున్నారు.

లాసినా శాంతి భంగంచేస్తూ "మే మొక వ్యాపా రాన్ని గురించి ఆలోచింము తున్నాము. ఆ విషయంలో నీతోకూడ మాట్లాడా లనుకొన్నాము" అని ఇలియాతో చెప్పింది.

నికోడిమిచ్ పకపకా నవ్వుతున్నాడు ఇలియా విస్మయంగా అతనివంక చూశాడు.

లాసినా "మీకు సమయాసమయ విచక్షణా జ్ఞానమే లేదు. ఏమిటా నవ్వు?" అని భర్తను కసురుకొన్నది.

"తప్పే, తప్పే." ఇలియావేపు తిరిగి "మేమొక వ్యాపారాన్ని గురించి యోచించాము. బలే వ్యాపారం!" అన్నాడు నికోడిమిచ్.

"మా దగ్గర కొంత డబ్బుంది" అంది లాసినా.

"అవు నవును. మేము కొంత మొత్తాన్ని నిల్వ చేశాము" ఆమె భర్త అన్నాడు.

"మీరు మాట్లాడకుండా వుండలేరూ?" లాసినా విసుక్కుంది. ఇలియా చెవిలో "బ్యాంకులో పదిహేను వందలు నిల్వ చేశాము. సంవత్సరానికి నూటికి నాలుగు రూపాయల వడ్డీ వస్తోంది" అని వానివంక రెప్ప వాల్చకుండ చూస్తోంది.

ఇలియా మౌనంగానే వున్నాడు. వాని హృదయం మాత్రం అల్లకల్లోలంగా వుంది.

లాసినా భర్త బల్లమీద గుద్ది "ఆ మొత్తం చాలదు; అందువల్ల మేము......" అని చెప్పబోతూంటే ఆమె చుర చుర చూచింది. ఆ భార్యాదాసుని నోట మరి మాట రాలా.

"నాలుగు రూపాయల వడ్డీకూడ తప్పవలసింది కాదు; కాని, మేము నీ మేలును గురించి కూడ ఆలోచించాము. నీవు అభివృద్ధిలోకి రావాలని మా కోరిక. నువ్వు కష్టజీవివి. సమర్థుడివి కూడాను. ఫాన్సీషాపు పెట్టితే నూటికి ఇరవై రూపాయల లాభ ముంటుందని నువ్వే చెప్పావు. గుజిలీలో కొట్టుదొరికి, పేరు పడితే అంతకంటె అధికంగా కూడ లాభించవచ్చు. దస్త్రం మా పేర పెట్టి హుండీలు వగైరా మా పేరనే జరిపే పద్ధతిని నువ్వు వ్యాపారం నడుపుతానంటే మాడబ్బు నీ కిచ్చేస్తాం. షాపు మా అజమాయిషీలో నడవాలి. లాభాన్ని సమవాటాలుగా పంచుకొందాము. నువ్వు మాకొక ఖరారు నామా మాత్రం రాసివ్వాలి. నీవు బాగా ఆలోచించుకొని చెప్పు" మని లాసినా అంది.

ఇలియా ఆవిడ మాట లన్నిటికీ బుర్రూపుతున్నాడు. మధ్యమధ్య గోడను వేలాడుతున్న క్రీస్తుపటంవంక చూస్తున్నాడు. లాసినా ప్రస్తావనలో వాని కాశ్చర్యం కలుగలేదు; గాని, గాబరా, భయమూ కలిగాయి. నేడు తన చిరవాంఛితము ప్రత్యక్షరూపాన్ని దాల్చబోతోందని సంతోషించుటతోపాటు స్తంభితు డయ్యాడు. విచిత్రంగా నవ్వి ఆ సుదతి మోము నవలోకించుతూ 'నిజంగా నా భాగ్య దేవత ప్రత్యక్ష మవుతోందా!' అనుకున్నాడు.

"అన్ని అంశాలూ సాకల్యంగా ఆలోచించుకో. నీ వా పనిని నిర్వహించగలవో లేదో కూడ యోచించు; ఇంకో విషయం; పెట్టుబడికి మా మొత్తమే చాలదు.

కాబట్టి నీవు కూడ యెంత తేగలవో చెప్పు" మని లాసినా తన వాక్చాతుర్యాన్నుపయోగించింది.

"నేను నాలుగైదు వందలు తేగల్ను. మా బాబాయి కొంత మొత్తం మిస్తానన్నాడని మీ కిదివరకే చెప్పాను. అయిదు వందలకు పైగా యిచ్చినా యివ్వొచ్చు" నని ఇలియా వారి పథకానికి తన సుముఖతను తెలిపాడు.

కిరిక్ (నికోడిమిచ్ మరో పేరు) సంతోషంతో కుర్చీలో యెగిరి కూచున్నాడు.

"అయితే మాతో జాయింటు వ్యాపారానికి సంసిద్ధుడ వన్నమాటేగా?" అని లాసినా అడిగింది.

"అవును, నాకిష్టమే."

కిరిక్ వుత్సాహంతో అన్నాడు—"ఎందుకు తయారు కావు! లాభసాటి బేరమయ్యె! (రెండు చేతులూ జేబుల్లో పెట్టి) యివ్వాళ నీకు విందు చేయదలిచాము. శ్రమ అనుకోక బజారుకెళ్లి ఒక బుడ్డి బ్రాందీ తీసుకొనిరా. నా పేరు చెపితే యే షాపులో నయినా సరే మంచిదే యిస్తారు.

ఇలియా ఒకసారి ఆ దంపతుల నెగాదిగ చూచి దరహాస వదనంతో బజారుకు బయలుదేరాడు. దారిలో మళ్లీ ఆలోచనలు వానిని చుట్టవేశాయి. తనలో యిలా అనుకున్నాడు: "ఇంతవరకు అదృష్టం నాకు ప్రతికూలంగానే వుంది. నన్ను తప్పుదారి కీడ్చి అనేక యిబ్బందులు కలుగ

జేసింది; కాని, యిప్పుడది నా కనుకూలంగా వున్నట్టు కన్పిస్తోంది. నా బాధలు, వెతలను బాపి సుఖమార్గంలోకి తీసుకొని పోగోరుకున్నట్టుంది. ఇక నేను వెల్తురు కన్పించి సుఖప్రదము, శాంతిదాయకమునైన చక్కని జీవితాన్ని గడుపగలనని ఆశ కలుగుతోంది. నేను ఒక ప్రాణాన్ని తీసింది నిజమే; కాని, అందుకు బదులు నేనిక యెందరికి జీవనోపాధి కల్పిస్తాను! ఈ విధంగా బదులు తీరిపోదూ? నా అపరాధానికిక అంతగా శిక్ష వుండదు. ఈశ్వరుడు సర్వజ్ఞుడు. నే నా హత్యకు కారణమాత్రుడనని లీసా అన్నది సత్యమే. దానికి కారకుడు పరమేశ్వరుడే. ఆయనే సర్వకార్య నిర్వాహకుడు. ఆ పరమేశ్వరుడే నాకు ప్రాయశ్చిత్తానికి అవకాశం కల్పిస్తున్నాడు. నేనిక నిర్మలమైన స్వచ్ఛంద జీవితాన్ని గడవాలనే భగవదేచ్ఛ." ఈ భావనలతో వానిలో విచిత్ర సాహస మంకురించింది.

ఈ ఆలోచనలతో ఇలియా బజారుకు పోయి విలువగల మేలురకం బ్రాందీ బుడ్డిని కొని తెచ్చాడు.

ఇలియా చేతిలోని బుడ్డిని చూచి కిరిక్ యెగిరి గంతేశాడు. లాసిచా మూతి ముడుచుకుంది. ఆ సీసా లాక్కొని మూక్కుచూచి ఇలియాతో "నువ్వు వట్టి దుబారా మనిషిలాగున్నావు. ఇంత ఖరీదు పెట్టి కొనవచ్చా?" అంది.

ఇలియా ఆవిడ కభిముఖుడై నిలబడి నవ్వుతున్నాడు: "నే నిదివర కెన్నడూ తాగి యెరుగను. ముందుగా నే నకిలీ

కెందుకు? ఇంతవరకు నేను కృత్రిమ జీవితాన్నే గడుపుతూ వచ్చాను. అందులో సుఖంలేదు, శాంతిలేదు, ఆనందమూ లేదు. అవమానము, అనాదరము, వేదనలే గత జీవితంలో నా సహచరులు. ఇదేనా మానవుడికి రాసిపెట్టి వుంది?" అన్నాడు.

వాని హృదయం మళ్లీ వేదనాభరిత మయింది. విషాద రేఖలు వాని ముఖంమీద తాండవమాడ సాగాయి. కళ్ళముందు చీకటి కమ్మింది. పెద్దగా నిట్టూర్చి అన్నాడు— "నేను బాల్యమూదిగా సత్యపథాన్వేషణలోనే నిమగ్నుడనై వున్నాను; కాని, సుడిగాలి నన్ను గిరగిరా తిప్పి ఊబిలోకి గిరాటు వేసింది. నాకెన్నడూ యెక్కడా సుఖ శాంతులు లభ్యంకాలా. నా కీ జీవితంలో వేదన, అవమానము, నిరాదరణ, అన్యాయము. మోసము, దోపిడి, విశ్వాసఘాతుకత్వాలే తప్ప యింకేమీ కనపడలా. శాంతి ప్రేమలను మొట్టమొదటి సారిగా మీ జీవితంలోనే చూడ గలిగాను."

ఈ మాటలని ఇలియూ వారివంక చూడసాగాడు. ఆ దంపతులకు ప్రణమిల్లి తిరిగి చెప్పాడు—"మీ సావాసంతో నా హృదయభారం చాలవరకు తగ్గిపోయింది. మీ సహాయం వల్లనే నా జీవిత నావ ఒడుదుడుకు లేకుండా ముందుకు సాగిపోగలదు. నాకు వున్నతపథంలో కాంతి కిరణం కనుపిస్తోంది. ఇక ముందు వున్నతాశయంతోనే కృషి చేస్తాను. ఎవరికీ యెలాంటి కీడు కలిగించబోను.

ప్రపంచంలో దీనులు; దుఃఖితుల సంఖ్యే అధికం. అను దినము అకారణంగా యెందరు నాశనం కావటంలేదు! ఇదంతా నాకు అనుభవమే."

పాడుతున్న పిట్టమీద మార్జాలం పొంచి కన్ను వేసినట్లు ఇంతసేపూ లాసినా ఇలియూ వంక చూస్తోంది. ఆమె కళ్లు మెరుస్తున్నె. పెదవు లదరుతున్నె.

నికోడిమిచ్ సీసా మూతతీసి పాన పాత్రలు నింపు టలో నిమగ్నుడై వున్నాడు. లాసినా, ఇలియూలకు చెరి వొకటి అందించి తా నొకదాన్ని పెదాల కానించుతూ "కొత్త కంపెనీకీ జై! కొత్త వ్యాపారం వర్ధిల్లాలి!" అని జయనాదం చేశాడు.

23

ఆ యింట్లో కొన్నాళ్లపాటు జాయింటు వ్యాపారాన్ని గురించిన చర్చ సాగుతూండేది. లాసినా తన గత జీవితమంతా ఆ వ్యాపారంలోనే మునిగి తేలినట్లు అనేక విషయాలు చెపుతూండేది. ఇలియా నాగస్వరం విన్న కోడె త్రాచువలె తలూపుతూండేవాడు. త్వరలో కొట్టు కుదుర్చుకొని వ్యాపారం ప్రారంభించాలని ఇలియా ఆతురత చెందేవాడు ఆ వేగిరపాటు వల్లనే అతడు వెనక-ముందు లాలోచింపక లాసినా కోరిన నియమాలన్నిటికి ఒప్పుకున్నాడు.

లాసినా అద్దె మాట్లాడి ఒక కొట్టును కుదిర్చింది. అది చిన్నదైనా మంచి గుజిలీలో వుంది. వెనుక వుంటానికి ప్రత్యేకంగా గది వుంది. ఇలియాకా కొట్టు చిరపరిచితమే. అది అతనికి బాగా నచ్చింది.

ఇలియా తాను చేయబోతున్న జాయింటు వ్యాపారాన్ని గురించి మిత్రులతో చెప్పాలని హాస్పిటలుకు వెళ్లాడు. పావ్కా అతణ్ని చూడగానే నమస్కారమైనా చేయకుండా "రేపు నేనిక్కణ్నుంచి వెళ్లిపోతున్నాను. వేరా వొద్దనుంచి జాబొచ్చింది. ఆమె దోషమంతా నాపైనే రుద్దింది." అని చెప్పాడు.

ఇలియా మొహం చిట్లించి "జాగ్రత్తగా మాట్లాడు" మన్నాడు.

"నేనొక నిశ్చయానికొచ్చాను. వేరా వద్దకు పోయి నన్ను పెళ్లి చేసుకోమంటాను. ఆమె నిరాకరించు తుంది. అప్పుడు నేనామె గుండెలో బాకుతో పొడుస్తా నని చెపుతూంటే పాషా శరీరం వణికింది.

"బాగా పదనుగల బాకేనా?" అని ఇలియా హేళన చేశాడు.

"ఇంకేన్నా వ్వొర్వగలను!" నేనామె లేసిదే జీవించలేను. ఆమె అయినా నేను లేకుండా బతకాల్సిన అవసరంలేదు. ఇంతవరకు ఆమె పతిత జీవితం గడిపింది. ఇక ముందైనా ఆమె ఆ కలుష మార్గంలో నుంచి బయట పడాలి. రేపు అమీ తుమీ తేలిపోతుంది."

'ఈ ఉలిపికట్టె అంతపని చేసినా చేయవచ్చును కున్నాడు ఇలియా. ఒక క్షణమాగి చిరునవ్వుతో "పాషా! తుదకు నా సుఖ స్వప్నం ప్రత్యక్షరూపాన్ని దాల్చబో తోంది" అన్నాడు.

తరువాత తన నూతన వ్యాపారాన్ని గురించి సవిస్త రంగా చెప్పాడు.

అంతా విన్న తరువాత పాషా ఒక వేడి నిట్టూర్పు వదలి "నువ్వు అదృష్టవంతుడివి ఇలియా!" అన్నాడు.

"నీకు ఈర్ష్యగా వుందా?"

"ఎందు కుండదు?"

"నా ఒక్కడి బాగును గురించి చెప్పటానికి సిగ్గు గానే వుంది."

"భేష్! ఎందుకూ సిగ్గు?"

"నేను చెప్పింది అతిశయోక్తి కాదు. ఎందుకో చెప్పలేను; గాని, సిగ్గుగానే వుంది."

పాషా అతని ముఖంలోకి చూచి తలొంచు కొన్నాడు.

"మనం కష్టకాలంలో కలసి వున్నట్టే సుఖ దినాలు కూడ జతగా గడపుదా" మన్నాడు ఇలియూ.

"నాతోనా? ఒక్క ప్రేయసితో తప్ప మరెవరితోను సుఖానందాలు అనుభవించటం సంభవం గాదని నా వుద్దేశం."

"కావచ్చు; అయినా మనస్నేహం చిరస్థాయిగా వుండాలని నా కోరిక. నీవు కూడ వ్యాపారంలో కృషి చేయ్యాలని కోరుతున్నాను. నువ్వు సుగంధ ద్రవ్యాల బేరం చెయ్యి. అంచనా వేసి చెప్పితే పెట్టుబడికి కావలసిన డబ్బు నే నిస్తాను."

పాషా పకపకా నవ్వాడు. ఇలియా వాని చెయ్యి పట్టుకొని నొక్కి "నీ కనుమానంగా వుందా? నేను నిజంగానే యివ్వదలచాను" అని చెప్పాడు.

ఇలియా తనకు డబ్బిస్తాడని పాష్కా నమ్మలేక పోయాడు. "అది అసంభవమా!" అని సందేహాన్ని వెలిబుచ్చాడు.

ఇలియా చేతిలో చేయి వేసి చెప్పిన మాటల పాష్కాకు నమ్మకం కలిగింది. గద్గద కంఠంతో "మిత్రమా! నీకు కృతజ్ఞత నే విధంగా తెలుపగలను! నీవు మునిగి పోతున్న నన్నుద్ధరించా లనుకుంటున్నావు; కాని నేను వ్యాపారం గీపారం చేయదలచటంలేదు. చేసి లాభంలేదు. నీవు నా కివ్వదలచింది యిచ్చేస్తే వేరాతో యిక్కణ్నించి యెక్కడికైనా వెళ్లిపోతాను. నీకు కూడ మా తగులాటం వదలి పోతుంది. పెద్దమొత్తంకూడ అవుసరముండదు. సాకూ ఆ విధంగా చేస్తేనే మేలుంది. మరో పట్నానికి చేరుకొని నౌకరీ చేసుకొంటా" నన్నాడు దీనంగా.

"అల్లాకాదు. నువ్వు శ్రద్ధగా వ్యాపారంచేసి క్రమంగా యజమానివై పదిమందితో పనిచేయించు కోవాలని నా అభిలాష."

"నేనా? యజమానినా? పనివాళ్ళతో కలసి మెలసి వుండటం నా వల్లనయ్యే పనికాదు. నేను సొంతంగా వ్యాపారాన్ని నిర్వాహం చేస్తానన్నమాట అబద్ధం. నా కా యోగ్యత లేదు. సున్నం పూస్తే కాకి తెలుపవుతుందా?"

పాష్కా వ్యాపారం చేయటాని కేల నిరాకరించు తున్నాడో ఇలియా గ్రహించ లేకపోయాడు. ఏదో ఒక

విధంగా వాడినొక వృత్తిలో దించా లనుకున్నాడు. అయినా అప్పటికిమాతం యిక నా విషయాన్ని వదలి పాష్కా స్వభావాని కనుకూలంగా అన్నాడు. అవున్లే. నీకు రంగుపూసి మార్చటం పనికిమాలిన పనే. అసలు నీ రంగు తెలుసాయె! కాకపోతే కాలగతిని యిల్లా అయిపోయావు. పర్వాలేదులే. రేపు వచ్చి పైకం తీసికెళ్లు. నేను జాకోబును కూడ చూచి వస్తా.”

“సరేలే.”

“జాకోబుతో సరసంగా మాట్లాడుతున్నావా?”

“ఏదో నీవు చెప్పావని.”

“వాడు అదో తరహా మనిషి. వాడితో మనసు కలవటం కష్టమే!”

“వాడి మెదడుకు చెదలు పట్టిందని నా వుద్దేశం.”

తర్వాత యిద్దరూ విడిపోయారు. పాష్కా నాలుగడుగులేసి తిరిగి వచ్చి ఇలియా చేతులు పట్టుకొని “నన్ను మర్చిపోకేం? నీకు నా జన్మాంతం కృతజ్ఞుడనై వుంటా” నన్నాడు.

ఇలియా నవ్వి జాకోబు వద్దకు వెళ్లాడు.

జాకోబు స్థితి విచిత్రంగా మంచంమీద పవళించి రెప్ప లార్పకుండా పైకప్పును చూస్తున్నాడు. ప్రక్కనేమి జరుగుతున్నదీ వానికి తెలియదు. ఇలియా వచ్చిన అలికిడికూడ వానికి విన్పించనే లేదు.

ఇలియా పలకరించిన మీదట "నికిటాను వేరే వార్డులో చేర్చారు" అని చెప్పాడు.

"మంచిపనే జరిగింది. అతడి మాటలు భయం కల్గి స్తాయి. యిక్కడే వుంటే నిన్ను మరీ పాడుచేసేవాడు."

జాకోబు కా మాట మనస్కరించలా. మాట్లాడక వూరుకున్నాడు.

"ఇప్పుడెలాగుంది నీకు?" ఇలియా అడిగాడు.

"ఏం చెప్పను? నేను యిచ్ఛాపూర్వకంగా రోగిష్టి వుండటానికూడ వీల్లేదు. నిన్న మా నాన్న వచ్చాడు. ఆయన యీ మధ్య యింకో యిల్లు కొన్నాడట. అందుకో కూడ హెూటలు పెట్టి ఆ భారం నా నెత్తిని వేయదల చాడు."

ఇలియా తన భావినిగురించి జాకోబుతో చెబుదా మనుకున్నాడు; కాని, మళ్లీ యేంతోచిందో ఆ ప్రశక్తి తేనే లేదు. శూర్యుని స్వర్ణకిరణాలు కిటికీగుండా లోపలికొచ్చి హాస్పిటలు గోడల రంగును కాంతివంతం చేస్తున్నై. ఆ కాంతి గోడల జీర్ణావస్థను మరింత స్పష్టం చేస్తోంది. యెదు రుగా కుంటివాళ్లిద్దరు పేకాడుతున్నారు. బక్కపల్చ మనిషొకడు పచారు చేస్తున్నాడు. జాకోబు ముఖం కళా విహీనంగా వుంది.

"నేను చచ్చిపోయినా బాగుండును. ఇక్కడ వు కొని చావెంత సుఖదాయకమని ఆలోచించుతున్నాను

ఈ నికృష్ట జీవితం కంటె అదే మేలు! శాంతి—వి శాంతు లకు కొదవ వుండదు. (ఇక్కడ జాకోబు స్వరం మంద గించింది) స్వర్గంలో అంతా వెలుగే. దేవతలు దయా స్వరూపులు అన్ని సంగతులూ తెలియ జేస్తారు" అని చెప్పి ఆగాడు. వాని కళ్ళు మూత పడినై.

"స్వర్గాన్ని గురించి నీకు తెలుసా?" అనడిగాడు ఇలియాం.

జాకోబు విన్పించుకోకుండా "మాషా ఆమెకే మేమైనా తెలిసిందా?" అనడిగాడు.

"తెలియలా."

"ఆమె జాడ తెలుసుకొని కలుసుకోవాల్సింది."

"నాకు కల్సుకోవాలని లేదు."

"స్నేహితురాలిని చూడాలని లేదూ?"

ఇలియాం సిగ్గుపడ్డాడు. పక్కమీద అటూ యిటూ దొర్లుతున్న జాకోబు "నికిటాకి చావాలని లేదు; కాని, అతనిక బ్రతికే ఆశలేదు. డాక్టరింతకు ముందే నాతో చెప్పిపోయాడు. మృత్యుదేవతని కౌగలించుకుందా మను కున్నా అది నా దాపుకే రావటంలేదు. కోలుకున్న దర్మిలా నేను మళ్లీ ఆ నరకతుల్యమైన హోటలుకే పోవాలి. గత్యం తరం లేక నేను మళ్లీ తాగుడు ప్రారంభించాల్సి వస్తుంది. తర్వాత సర్వనాశనమే నాకు గతి" అని వేదనా పూర్వ కంగా చెప్పాడు. కొంచెమాగి "ఈ లౌకిక సమాజంలో

జనసామాన్యం కోరేదికాక విశిష్టజీవితం గడపాలంటే ఉక్కు శరీరము, రాతిగుండె వుండాలి; లేదా అసలు హృదయమనే లేకుండాలి" అన్నాడు.

ఈ గొడవంతో ఇలియా విసుగు చెందాడు.

"నా స్థితి రాళ్ళమధ్య నున్న అద్దంలాగుంది. ఏ రాయి కదిలినా పప్పు - పప్పయి పోతున్నా" నని జాకోబు మళ్లీ అన్నాడు.

"నీ కెప్పుడూ మొర పెట్టుకోవటంలోనే ఆనందమున్నట్లుంది."

"మరి నీకో?"

ఇలియా పెడమొగం పెట్టి మౌనం వహించాడు. జాకోబు కూడ మిన్నకుండడం చూచి "యిందులో ఒకరికీ సుఖం లేదు. మనందరి స్థితీ అధ్వాన్నంగానే వుంది. పాష్కానే చూడు!" అన్నాడు.

"వాడి పేరు వింటేనే నాకు రోత."

"కారణం?"

"ఏమో! కారణం చెప్పలేను"

"నాకు పాష్కా యందభిమానమే."

"మంచిదేగా!"

"ఇక వెళ్తా" నని ఇలియా లేచి నిలబడ్డాడు. జాకోబు కరస్పర్శ చేస్తూ "దేవుడు నీకు మేలు చేస్తాడు; మామా

యోగ - క్షేమాలు తెలుసు కుంటూండు" మన్నాడు దీనంగా.

"సరే లె" మ్మని ఇలియా బయల్దేరాడు.

వచ్చేటప్పు డున్న సంతోషం ఇలియా కిప్పుడు లేదు. జాకోబు తోడి సంభాషణతో వాని వుల్లాస మదృశ్య మయింది. హాస్పిటలు గేటు దాటిన తర్వాత మాత్రం కొంత శాంతి కలిగింది. మాషా విషయంలో తన అల క్ష్యాన్ని తలచుకొని సిగ్గు పడ్డాడు. మాషాకి మనువు కుదిర్చింది మతిస్సా నయే. ఆమె కన్ని వివరాలు తెలిసి వుంటై. కాబట్టి మతిస్సా ద్వారా మాషా మంచి - చెడ్డలు తెలుసు కోవాలని నిశ్చయించు కున్నాడు.

24

మతిస్సా యథాప్రకారం పెట్రుహా కొంపలోనే అఘ్ద కుంటోంది. ఇలియూ ఆమెని కలుసుకోటానికి బయల్దేరాడు. నడుస్తూంటే గత విషయాలన్నీ స్మృతి పథంలోకి వచ్చి పరుగు తీస్తున్నై. స్మృతి చిత్రాల తరుములాటలో ఇలియూ గమ్యస్థానాన్ని దాటి పోయాడు. పొరపాటును తెలిసికొన్నప్పుడు టక్కున ఆగాడు; కాని. వెనుదిరిగి పెట్రుహా యింటికి వెళ్ళడానికి యిష్టం లేకపోయింది. సరాసరి ముందుకే సాగిపోయాడు. సంధ్యారుణ కాంతులు మనోజ్ఞమై ఆహ్లాదాన్ని కల్గిస్తున్నై. ఎదుట విశాలమగు బయ లుంది. ఇలియూ తిన్నగా వెడుతూనే వున్నాడు. ఒకసారి తన ప్రజ్వలభావి నూహించుకున్నాడు. తనకు వృచ్ఛస్థితి కలిగిన తర్వాత పెట్రుహా తలదన్న వచ్చనుకున్నాడు. మళ్లీ అంతలోనే తాను పెట్రుహాను జయించి నట్లూ, వాడు తలవంచి ప్రాధేయ పడుతున్నట్లూ, తను జాలిపడుతూ 'యింతవరకూ నువ్వెవరి కొరకైనా జాలిపడ్డావా అనీ, కన్న కొడుకును దురవస్థల పాలుజేసి యేమి బావుకుంటావనీ, నా పినతండ్రి అధోగతికి కారకుడివి నువ్వే కదా అనీ, నీ కొంపలో యెవరూ సుఖపడ లేదనీ. అక్కడ వలపన్ని ప్రంచావనీ, అటు వచ్చిన వాడందులో చిక్కుకుంటాడనీ' చెపుతున్నట్టుగా భావించుకున్నాడు.

పెట్రూషా తన్ను దీనంగా ప్రార్థించుతూంటే తాను కోపంతో మండిపడుతూ 'నీ కోరిక విషపూరితం; దానికి నిప్పంటించి మసి చేస్తా నీవల్ల నాశనమైన వాళ్ళ, వాళ్ళ ముందు నిలబడి క్షమాపణ కోరుకుంటూ, నీ పాపాలను ప్రాయశ్చిత్తం చేసుకుంటూ చావు' అని అంటున్నట్లు ఇలియాకు మరో తలంపు కలిగింది.

చీకటి పడబోతోంది. నిశాదేవి తన మసక దుప్పటి నెల్లెడల కప్పివేసింది. గబ్బిలాలు కీచు కీచుమని అరుస్తున్నై. అంధకారం క్షణక్షణము దట్టమవుతోంది. నదిలో పల్లెకార్లు గడలు వేసిన ధ్వని పిట్టలు రెక్కల్ని రెప రెప లాడించుతూన్నట్లుగా విన వస్తోంది. ఇలియా తన పతనానికి కారణభూతులైన వారందరి పేర్లు జ్ఞాపకం వచ్చి వారిపైన పగ తీర్చుకోవాలని సంకల్పించుకున్నాడు. ఈ నిశ్చయంతో వానికి కొంత శాంతి కలిగింది. వాడా నిస్తబ్ధాంధకారంలో కూనరాగం తీయసాగాడు.

అప్పుడు కుళ్లిన చెత్తలోనుంచి వచ్చే గాలి వాని ముక్కు పుటాల్లో ప్రవేశించింది. ఆలాపన ఆగిపోయింది. ఆ కంపు వానికి వృద్ధ జర్మియా వెంట తిరిగి ముక్కు-చెక్కు లేరిన దినాలను స్మృతికి తెచ్చింది. అప్పుడీ గాలు యింత తీవ్రంగా తోచేదికాదు. జర్మియాతో కలసి విశ్రమించిన తావును కనుక్కునేందుకు ఆ చీకట్లోనే దృష్టిని దౌడాయించాడు; కాని అంతు చిక్కలా. ఇప్పుడది చెత్త పోగుల్లో అదృశ్యమైపోయింది.

ఇలియా కప్పు డాకస్మికంగా పోలటోన్ను హత్య జ్ఞాపకానికి వచ్చింది. ఆ హత్య చేసేవుండకపోతే తన జీవితం సుఖవంతంగా వుండి వుండేదని స్ఫురించింది. మళ్లీ అంతలోనే 'నువ్వే పాపమూ చేయలా. అదొక దురదృష్ట సంఘటన మాత్రమే' నని చెవిలో యెవరో చెప్తున్నట్లనిపించింది.

అదే సమయంలో కాయ్ కాయ్ మంటూ నక్కొకటి వాని పక్కగా పరుగుతీసింది. ఇలియా త్రుళ్లిపడ్డాడు. నిశాదేవే ఆ రూపంలో గుర్రుమంటూ వచ్చి అంతర్ధానమైనట్లు తలిచాడు.

పోలటోన్ను చంపి యుండకపోయినా తన జీవితంలో శాంతి వుండేది కాదనుకున్నాడు మళ్లీ. 'రాత్రింబగళ్లు ఒకే రీతిని అవమానం జరుగుతూ వుండేది! ఒకసారి హృదయానికి దెబ్బ తగిలితే అది యిక నెప్పుడూ బాధించుతూనే వుంటుం' దనుకున్నాడు.

అడుగులో అడుగేసుకుంటూ ముందుకు సాగిపోతున్నాడు. పెట కప్పుల్లో. కర్రలలో కాలు తగుల్తోంది. కొంతదూరం వెళ్లినాక శుభ్రమైన జాగా కన్పించింది. ఇలియా చతికిలబడి కూచున్నాడు. నదీ ప్రవాహమక్కడి కెంతో దూరంలేదు. అందులో పడవలు నడుస్తున్న ధ్వని, పల్లెకార్ల కేకలు వినపడుతున్నై. పొడుగైన మైదానంకూడ నిశ్చల నదీ ప్రవాహాన్నే పోలిస్తుంది. చెట్లా-

చెదారం మురికాల్వల్లో పారుతున్న మురుగు నీటి కష్ట
పడి ఢీకొంటోంది.

"ఇంతకుముందు యెంతో ప్రశాంతంగా వుంది. హృదయం తేలిగ్గా వుంది. ఇంతలోనే ఆ హుషారు పోయి యీ వేదనా పూర్వక భావ తరంగాలేమిటి? మానవుడు తన కిష్టంలేని మార్గంలోకి నెట్టబడుతున్నాడు. జీవితం యావత్తు అన్యాయ-అసమానత్వాలతో నిండివుంది. 'తన్ను తాను తెలుసుకోవా'లన్న జాకోబు మాటల్లోకూడ సత్యముంది; అయితే యితరులను అవగాహన చేసికోవాల్సిన అవసరం కూడా వుంది. చుట్టుపక్కల వాళ్ళెలా వుంటున్నారు? వాళ్లు పాటించుతూన్న నియమాలేమిటి మొదలైన వన్నీ తెలుసుకొని తీరాలి." అనుకున్నంతలో మరో భావ తరంగం లేచింది. ఒకో బానాడు తనతో వుదాసీనంగా మాట్లాడిన సంగతి తలపుకొచ్చి మరింత ఖిన్నుడయ్యాడు. ఏదో చప్పుడుకాగా తలెత్తి చూచాడు. మింట చుక్కలు కనపడుతున్నై. జాబిల్లి చెట్లపైకి లేస్తోంది. ఆ గుడ్డి వెన్నెల మసక చీకట్లో గబ్బిలాలు లేచి యెగురుతున్నట్టు ఇలియా హృదయాంతరాళంలో ప్రయోజనం లేనిభావాలెన్నో లేచి అంతర్ధాన మవుతున్నై. వాటి వెనకనే అంధకారం వాని హృదయంలో రాజ్యాన్ని స్థాపించుకుంటోంది. "ఒకడు మరొకడిని దోచుకుంటున్నాడు, పీడించుతున్నాడు, యేడ్పించుతున్నాడు. చంపివేస్తున్నాడు. ఎవనికీ యింకొకని పొత్తు గిట్టదు. అందరికి దూరంగా వుండాలనుకుంటాడు. మరి

వానికి శాంతి యెల్లా లభిస్తుంది? నేనూ అదేవిధంగా ఒక మూల బ్రాకులాడుతున్నాను. ప్రపంచంలో వాస్తవమైనదీ, నిర్వివాదమైందీ యేది?" అని ఇలియా మనసులో విచారించు కున్నాడు.

వాడదేవిధంగా కొంతసేపటివరకు వ్యాహాంతరంగాల్లో తేలియాడుతున్నాడు. ఒకసారి మైదానంలోకి, మరొక తడవ ఆకాశంవేపు చూస్తున్నాడు. అన్ని వేపులా నిశ్శబ్దంగా వుంది. వెన్నెలరేడు తన సైనికులనే కిరణజాలాన్ని పంపి అంధకారాన్ని తరిమి తరిమి కొట్టి తన రాజ్యాన్ని విస్తరింప జేసుకుంటున్నాడు. పొదలు, చెట్ల ఛాయలు, భూమీ భయంకరాకృతులుగా కనబడుతున్నై. చలి తీవ్రత హెచ్చుతోంది. ఇలియా లేచి నగరాభిముఖంగా నడక సాగించాడు. అప్పుడు వాని హృదయం వికల మయివుంది.

ఇలియా యింటికి చేరేసరకి చాలా ప్రొద్దుపోయింది గడపలో నిలబడి తలుపు తట్టుదామా వద్దా అని తటపటాయించాడు. ఇంట్లో వెల్తురున్నట్లులేదు. అందరూ నిద్రించి వుంటారని తలిచాడు. అతడెప్పుడు వచ్చినా లూసినాయే తలుపు తీసేది. ప్రొద్దు పోయిన తర్వాత యిప్పుడామెను మేల్కొల్పటం భావ్యం కాదనుకున్నాడు; కాని, అంత రాత్రివేళ పీక్కుతినే చలిలో తలదాచుకునే దెక్కడ? తప్పని సరియై మెల్లగా గొలుసు లాగాడు. వెంటనే తలుపు తెరువబడింది. మల్లెపువ్వంటి తెల్లబట్ట చుట్టుకొని లూసినా

యెదురుగా నిలబడుంది. "త్వరగా తలుపు వేసెయ్యి. నేను పడుకుందామని దుస్తులు మార్చి గుడ్డ చుట్టుకున్నాను. ఈదురుగాలి కూడ వేస్తోంది. ఆయన క్యాంపుకెళ్ళారు కూడాను" అని ఇలియాను త్వరపెట్టింది.

"సరే, అల్లాగే లెండి."

"ఇంత సేపెక్కడున్నావు?"

ఇలియా తలుపు గెడవేశాడు. ఆమెకు జవాబిచ్చేందుకు వెనక్కి తిరిగాడు. లాసినా వానిముందు నిటారుగా నుంచోనుంది. దారిలోనుంచి తొలగకపోగా యింకా ముందుకు వస్తోంది. వెనక ద్వారం-ముందు లాసినా, యెటు తప్పుకుంటానికీ వీల్లేదు. లాసినా నవ్వుతోంది. ఆ నవ్వులో మాధుర్యముంది. ఇలియా ఆమె చూపులో చూపు కలిపాడు. వ్యవహారం హాటంగా వున్నట్టు గ్రహించి ఆ కులులాడి మెడకు చేతులు పెనవేశాడు. లాసినా కూడ వాని యెదపైన వాలింది.

"నువ్వింత రాత్రివేళ యెక్కడెక్కడో తిరుగుతావెందుకు? నాణ్యమైన పరుపు యింట్లోనే వుందిగా!" అంది లాసినా ఇలియాను ముద్దాడుతూ.

ఇద్దరూ కండగావరంతో వున్న యువతీ-యువకులు. మోహాంధులై కామపిపాస నార్పుకుంటూ గడిపారు ఆ రాత్రి అంతా.

ఇలియూ వుదయాన తాను రాత్రి చేసిన పనికి పస్తాయించాడు. "నే నిక వీరి మొహాలు చూచేదెల్లా? స్నేహితునిలా నటించి నికోడిమిచ్‌కి విశ్వాసఘాతం చేశాను. అతడిప్పుడు కాకపోయినా నెమ్మదిమీద తన భార్య జారత్వాన్ని గ్రహించకపోడు· అప్పుడు నాగతి యేమవుతుంది? ఈ దుశ్శీల నాకు దాపురించిందేం? నా కెన్నడూ అల్లాంటి తలంపే లేదే!" అనుకున్నప్పుడు ఇలియూం తన ప్రవర్తనకు తానే లజ్జపడ్డాడు· లాసినా బజారు లంజ కాదనీ, అభిజాతయనీ, సుందరాంగియగు సంసారిణి తనకు పాల్పడిందనీ తలచుకున్నప్పుడు వాని కానందమే కల్గింది. పోలీసు యిన్స్పెక్టరు అర్ధాంగి తన్ను కామించటం సామాన్యం కాదనుకున్నాడు. తనలో యేదో ప్రత్యేకత వుండబట్టే ఆ తరుణి తన్ను వలచిందని తలచుకొన్నప్పుడు హర్షాతిరేకంచే ఇలియూ కళ్లు జిగాలుమన్నై'. నేను చేసింది తప్పే; కాని, చేయగల దేముంది? వర్షించిన విస్తరిని వద్దని త్రోసివేయగల వాడెవ'డని తన చెయిదాన్ని సమర్ధించుకున్నాడు.

"ఇప్పటివరకు నా కిల్లాంటి ఆలింగన సౌఖ్యంగాని, ముద్దులో మాధుర్యంగాని లభించనే లేదు. ఈమె పొందువల్ల నాకు లాభం కూడ వుంటుంది. నన్ను ప్రేమిస్తోంది కాబట్టి, నా మేలునే కోరుతుంది" అనుకున్న మరుక్షణంలోనె అందుకు ప్రతికూల భావంకూడ కలిగింది. "నేను మళ్లీ యీ కొత్త పితలాటకంలో చిక్కుకున్నానే! నే నీమెవల్లో పడాల్సింది కాదు. ఈమె నింతవరకు హృదయ

పూర్వకంగా గౌరవ భావంతో చూస్తూ వచ్చాను. నా మనసులో యెన్నడూ దురాలోచన కలుగనేలేదు; అయినా తుదకు పర్యవసాన మిల్లా తేలింది."

ఆ నా హృదయం చాల ప్రొద్దెక్కేవరకు ఇలియా పక్కమీద పడుకొనే వున్నాడు. "లాసినా! మాంసం కమ్మగా వుండాలి సుమా! బాగా నేతితో వేల్చు" మని నికోడిమిచ్ భార్యతో చెప్పడం పడుకొని వుండే విన్నాడు.

"పెద్దబ్బా, మీ రుచి నాకు తెలియదా?" అంటోంది లాసినా.

నికోడిమిచ్ పోతూపోతూ 'ప్చ' అని ముద్దు పెట్టుకోవటం కూడ ఇలియా ఆలకించాడు.

భర్త వెళ్లగానే తలుపు బిగించి లాసినా ఇలియా గదిలో దూరబడింది. పక్కమీద పడుకొని వున్న ఇలియా సరసనె ఒరిగి లాసినా యెదగొడ్డులా "లేలే, త్వరగా కాని" మన్నని వానికి చక్కిలిగిలి పెట్టసాగింది.

"ఇప్పుడేగా నీ మొగుడు ముద్దులాడింది!" అన్నాడు ఇలియా.

"అయితే యేం? నీ కీర్ష్యగా వుందా? అదీ మంచిదే. ఈర్ష్యకలవాళ్లే బాగా ప్రేమించ గల్గుతారు" అంది ఆ సిగ్గులేని శిఖండి.

"నే నీర్ష్యతో అనలా......" లాసినా వాని నాపైన మాట్లాడ నివ్వలా.

ఇలియా ఆమె నాలింగన-చుంబనాదులచే తృప్తి పర్చి నవ్వుతూ అన్నాడు—"నువ్వు బలే జాణవి! పతి వుండగా పర కూటమి కెవరిల్లా సాహసించుతారు?"

కోపంతో లాసినా కళ్ళు ప్రజ్వలించినయి. "నువ్వు శుద్ధ మూర్ఖుడివి. నీ కేం తెలుసు? ఈ విధంగా ప్రేమ విహారం చేయని దెవతె? అనాకారి స్త్రీలను మినహాయిస్తే అంతా యీ వ్యాపారంలో దిగినవాళ్లే" నంది సగర్వంగా.

లాసినా ఆ నాటి పగలంతా స్త్రీ లేవిధంగా భర్తల కనుబ్రామి స్వైర విహారం చేస్తారో వివరించి చెప్తూనే వుంది. ఆమె తనకున్న వాటిలో విలువైన వలువ ధరించి సువాసనలు విరజిమ్ముతూ, సరస-సల్లాపాలతో ఇలియాకి మైమరపు కలిగించింది. సాయంత్రం మాంసం వేపుడు వేసి వచ్చి ఇలియా పక్కలో కూచుని యిల్లా చెప్పింది—"స్త్రీ పతి ఒక్కనితోనే సంతృప్తి పడుతుందని తలుస్తున్నావా! ఒకొక్కప్పుడు భర్తలెందుకూ పనికిరాని దద్దమ్మ లవుతారు. వాళ్ళు భార్యల నిర్మల ప్రేమనే లక్ష్యపెట్టరు. ఏ కాంతో కన్ను గిలిపితే చాలు, జర్రున జారి పోతుంటారు. అదీకాక, యే స్త్రీ మాత్రం ఆజన్మాంతం పతినే ఆరాధించుతూ యేం సుఖపడుతుంది? పర పురుషులతో సయ్యాట లాడుతూంటే కలిగే ఆనందమే ఆనందం! ఆ విధంగా వివిధ జాతుల పురుషుల స్వభావాలు పరిచయమై కావలసినంత అనుభవము గడించవచ్చు. నిత్యము ఒకే కూర రుచించుతుందీ? మనస్సు విరక్తి చెందకుండా యెల్లా

వుంటుందో చెప్పు? జిహ్వాని తృప్తి పర్చటానికి దినదినము వేర్వేరు పక్వాలవసర మైనట్లే మానసిక సంతృప్తికి రకరకాల మగవాళ్ళ పొందుకూడ ముఖ్యమే"

ఇలియా ఆమె మాటల్ని ధ్యానంతో వింటున్నాడు. లాసినా వాదనతో ఒక్కొక్క ప్పుడు వాసి మనసు చివుక్కుమంటోంది. ఆ ధోరణి వానికి రోత గలిగించింది. 'లీసా పడుపు వృత్తిలో వున్న యింతగా సిగ్గు-బిడియాలు విడిచి బరితెగి మాట్లాడేది కాదే!' అనుకున్నాడు. మారు చెప్పటానికి యేమీ తోచలా. నవ్వి "నీ జీవితంలో కూడ యిల్లా జరుగుతుందని నేను కలనైనా తలచలేదు సుమా!" అని వూరుకున్నాడు.

"జీవితక్రమం అన్నియెడల అందరిపట్ల ఒకేరీతిగా వుంటుంది. ఆ క్రమము మానవులు యేర్పరచుకున్నదే. మానవు లందరూ సుఖజీవితం గడపాలనే కోరుతారు. ప్రతి వ్యక్తి శాంత్యుతంగా, సంతుష్టాంతరంగుడై ఆనందమయ జీవితాన్ని గడపాలని వాంఛిస్తాడు. అయితే అందుకు పుష్కలంగా డబ్బుండాలి. 'ధనమూల మిదంజగత్' అన్నట్టు అన్నిటికి డబ్బే ప్రధానం. ధనార్జన కున్నవి మూడే మార్గాలు. పూర్వార్జిత ఆస్తి వుండాలి; లేక అదృష్ట వశాత్తు బేవార్సు ఆస్తి రావాలి; లేదా కష్టపడి కూడ బెట్టాలి. లాటరీ పిచ్చి వున్నవాళ్ళు అదృష్టాన్నే నమ్ముకుంటారు. స్త్రీకి రూపమే అదృష్టం. అందమైన ఆడుదానికి అన్నీ అరచేతిలో వున్నట్టే. ఏ ఆధారమూ లేని

వాళ్ళు రెక్కలు విరుచుకోవాలి. జీవితం పొడుగునా సంపాదించుతూ వెళ్ళబుచ్చటం తెలివిమాలిన పని. నా అదృష్టానికి రెండు బీగాలున్నై. నే నా రెండింటిని మన వ్యాపారంలో ప్రయోగించ దలిచాను; కాని, అంతటితోనే నాకు తృప్తి లేదు. కేవల మాయన ఒక్కనివల్లనే నా కానందం కలుగదు. నే నెవర్నీ ప్రేమించలా. కాబట్టే నీకు పాలుపడ్డా" నని చెప్పి లాసినా ఒకక్షణమాగి ఇలియా నడిగింది—"ఎందుకల్లా మిరి మిరి చూస్తావు? నా మాటలు బాగా లేవా?"

ఇలియా గది ద్వారంలో నిలబడి కనొ్బమలు ముడిచి లాసినా వంక చూస్తున్నాడు. లాసినా లేచి వెళ్ళి రెండు చేతులూ వాని మెడకు లంకె వేసి ఇలియా కళ్ళలోకి చూడ సాగింది. ఇలియా ఆమెను ముద్దుపెట్టుకొని కావిలించుకున్నాడు.

లాసినా కిలకిల నవ్వి "నీ హృదయ మెంత మెత్తనిది!" అంది.

"నువ్వు చెప్పినదంతా నిజమే కావచ్చు; కాని, అవి నోటితో వుచ్చరింప తగ్గ మాటలు కావని నా వుద్దేశ" మన్నాడు ఇలియా.

"చిత్రమైన మనిషివి! అందులో యేది బాగుండ లేదో చెప్పు."

ఇలియాకి జవాబు స్ఫురించలా. ఆవిడ చెప్పినదాన్లో తా సనభ్యంగా భావించినదేదో వివరించలేక పోయాడు. లీపా యీావిడ కంటె జోరుగానే కబుర్లు చెప్పేది; కాని ఆమె మాటలు వాని కెప్పుడూ యింతగా రోత కల్గించలా. ఆ నా డంతా వాడు తన యీ నూతన సంపర్కం భావిలో యెల్లా పరిణమిస్తుందో ననే ఆలోచించాడు; కాని, యేమీ నిశ్చయించుకో లేక పోయాడు.

డ్యూటీనుంచి తిరిగివచ్చి నికోడిమిచ్ భోజనానికి కూచునే ముందు "ఇలియూ! నా భార్య నెంతని ప్రశంసిం చను! మాంసం యెంత బాగా వండిం దనుకున్నావ్! నోరూరు తోంది. వారెవా! కాళ్లూ చేతులూ కడుక్కోనిరా; నువ్వు కూడ రుచి చూద్దువుగాని" అని ఆహ్వానించాడు.

ఇలియా అపరాధివలె భరింపలేని నవ్వు తెచ్చుకొని "కృతజ్ఞతా వందనాలు. మీా రెంత వుదా రులు!" అని నిట్టూర్చాడు.

"ఏమిటీ? ఇంత మాత్రానికేనా? నేను పోలీసు కమీషనరు నయితే చూచేవాడివి! కాని, నా కా అదృష్టం లేదు. నే నీ నౌకరీ కూడ వదిలెయ్యా లనుకుంటున్నాను. ఏ కంపెనీలోనో మేనేజరుగా చేరిపోతాను. దీనికంటె అదే నయం" అన్నాడు నికోడిమిచ్.

లాసినా వంట గదిలో కూనరాగం తీస్తోంది. ఆమె భర్తను చూచి ఇలియా విచిత్రమైన అలజడి పడు తున్నాడు. అయితే కాస్సేపటికి కుదుటపడ్డాడు.

రోజులు గడుస్తున్న కొద్దీ ఇలియా ఆవేగం అణగిపోయింది కొత్త వ్యాపారాన్ని గూర్చిన ఆలోచనతో అది అడుగున పడింది. ఇలియా లాసినా ప్రేమవాహినిలో బుటకలు వేస్తున్నాడు. వాని కది వరకామె యందున్న గౌరవ భావం మాసిపోయింది. ఇద్దరూ ప్రేయసీ ప్రియులయ్యారు; కాని, ఇలియా నపుడపుడు అజ్ఞాత భయమేదో పీడించుతూండేది. లాసినా భర్తను సాగనంపుతూనే వచ్చి ఇలియాతో సరస-సల్లాపాలు సాగించేది. ఆమె నిత్యము వానికి మానవ జీవితంలోని అనేక వాస్తవిక సంఘటనలను చెపుతూండేది. అవి అతి సరళంగా వుండేవి. ఆ ఘటనలు కేవలము కామ పిపాసుల కావాసంగా వున్న దేశంలో మాత్రమే జరిగివుంటాయని ఇలియా తలిచేవాడు వానికామె మాటలయందు విశ్వాసం కలిగేది కాదు. ఊకొట్టి వూరుకునేవాడు. ఒక పర్యాయం "నువ్వు చెప్పేవన్నీ నిజమేనా?" అని సందేహం వెలిబుచ్చాడు.

ఆమె పక్కున నవ్వింది. తాను చెప్పినది నిజమేనని సమర్థించటానికి పూనుకుంది.

"ఉదాహరణకు యే అధికారినో తీసుకో. అధికారి తన సహోద్యోగి సతిపైన కన్ను వేస్తాడు. ఆ సహోద్యోగి తన గుమాస్తా భార్యని చేరదీస్తాడు. గుమాస్తా బంట్రోతు పెళ్ళాన్ని వుంచుకుంటాడు. ఎక్కడ చూచినా యిదే తంతు."

లాసినా యిల్లాగే విసుగూ-విరామం లేకుండా చెప్తుతూండేది. శ్రీమంతు లేవిధంగా పేద కన్యల్ని కొని వాళ్ళ సర్వనాశనం చేసేది. భ్రూణ హత్యలకు నిర్బంధించేది, ఆ భోగ పరాయణుల భార్యలే, విధవ కన్యలే నౌకర్లు జవాన్లతో కూడి చరించేదీ, పశువుల పాకల్లో, మురుగు దొడ్లలో కోడెకాండ్రతో సరాగాలు సాగించేది వర్ణించుతూండేది.

ఇవన్నీ వింటూంటే ఇలియాకీ జీవిత మొక మురికి గుంటగాను, మానవు డందలి క్రిమిగాను తోచేది. "ఈ ప్రపంచంలో మంచి దనేది, పవిత్రమైనదీ లేనే లేదా?" అని ఒకసారి లాసినా నడిగాడు.

లాసినా ఆశ్చర్యపడి "ఇంతకూ నీ వుద్దేశ మేమిటి? నేను చెప్పినది నిత్యము మన కళ్ళముందు జరుగుతున్నదే. ఇందులో నా కల్పిత మేమీ లేదే" అంది.

"నా అభిప్రాయ మదికాదు లాసినా! నే నింతకంటె పవిత్ర విషయాలను వినాలని అడుగుతున్నాను."

లాసినాకి వాని వుద్దేశం బోధపడలా. నవ్వి వూరుకుంది.

ఆమె అపు డపుడు "నీవు తొలిసారి రతి సుఖం లభించిం దెవరివద్ద?" అని ఇలియా నడుగుతుండేది. ఇలియా సిగ్గుతో తలొంచుకునేవాడు. వాని కసహ్యంగా వుండేది. అల్లాంటప్పుడు దృష్టిని పక్కకు మరల్చి "ఏమిటీ అసభ్యపు

కూతులు? నీ బోటి విద్యావతి నోటితో అడుగ తగ్గ మాటేనా?" అని ముఖం చిట్లించేవాడు.

అంతటితో ఆమె విడిచి పెట్టేది కాదు. మళ్ళీ మళ్ళీ అడుగుతూనే వుండేది. ఆ ప్రసక్తితో ఇలియా కమిత వేదన కలిగేది. అది గ్రహించి లాసినా వెంటనే చేజేతలా వాని కామ తృష్ణను రేకెత్తించేది. ఇలియా యిక నా విషయాన్నే విస్మరించేవాడు.

ఒక రోజున ఇలియా బజారునుంచి తిరిగి వచ్చేసరికి మతిస్సా లాసినాతో మాట్లాడుతోంది. ఆమె నక్కడ చూచి ఇలియా విస్తుపోయాడు. లోపలికి అడుగు పెట్టాండగానే "ఈమె మధ్యాహ్నం నుంచి నీకోసం యెదురు చూస్తోం"దని లాసినా చెప్పింది.

"కులాసాగా వున్నావా?" అని ఇలియా మతిస్సాని పలకరించాడు.

"యముడు కూడ నన్ను మరిచిపోయాడుగా" అంది మతిస్సా.

చాలా రోజుల నుంచి ఇలియా పెట్రుహా హోటలు వేపుకే పోలా. ఇంత కాలానికి పరిచితురాలొకతె కనపడినందుకు వాడు సంతోషించాడు. ఆమె దుస్తులు చిరిగి వున్నై. కాళ్ళకు జోడయినా లేదు. మతిస్సా చాల చిక్కిపోయింది. మెల్లగా లేచి ఇలియా గదిలోకి వెళ్ళింది.

కుర్చీలో కూలబడి బొంగురు గొంతుతో యిల్లా చెప్పింది. "నాకు రోజులు దాపురించుతున్నై. కాళ్ళలో సత్తువ క్షీణించింది. ఇక పట్టు తప్పి పోవచ్చు. అప్పుడాకలితో మాడి చచ్చిపోతాను."

మతిస్సా ముఖం వుబ్బరింపుగా వుంది ఒళ్ళంతటా మచ్చ లున్నై. కళ్లు చెట్టు తొర్రలో వున్న పిట్టల గుడ్లున్నట్టున్నై. ఇలియూ రెప్ప వాల్చకుండ ఆమె వంక చూస్తున్నాడు. మతిస్సా మళ్ళీ అంది— "ఎందుకల్లా మిరిమిరి చూస్తావు? నన్నెవరూ పీక్కొని తిన లేరులే. జబ్బు వల్ల యిల్లా అయిపోయాను."

"ఉరుసుబా యెల్లా వుంది?" అనడిగాడు.

"బిచ్చ మెత్తుకొని యెల్లాగో బ్రతుకుతున్నాన్లే. నీ వద్దకొక పని మీద వచ్చా. నువ్విక్క డుంటున్నట్టు ఫర్ఫిషాక్క చెప్పాడు."

ఆమె దుస్థితికి ఇలియూ జాలి పడ్డాడు. తను తాకుగా తిరుగుతుండే మతిస్సా నా స్థితిలో చూచి దురపిల్లాడు. "టీ తాగుతావా?" అనడిగాడు.

"నీ టీ నీ దగ్గరే వుంచుకో. నా కేమీ అక్కర్లేదులే. ముందు నే వచ్చిన పని సంగతి విను."

మతిస్సా పూర్వ మొక సారి ఇలియూ నిల్లాగే అవమానించింది. వాని కిప్పుడా సంగతి జ్ఞప్తి కొచ్చింది. ముఖం పక్కకు తిప్పుకొని "చెప్పు" అన్నాడు.

"మాషా జ్ఞాపక ముందా? ఎందు కుంటుందిలే. నువ్విప్పుడు భాగ్య మంతుడి వయ్యావుగా!"

"జ్ఞాపకం లేకేం! అయితే యేమిటి సంగతి?"

"జ్ఞాపకం వుంటే మాత్రం యేం లాభం? ఆమె కష్టాలు తేలిగ్గా తీరేవి కావు"

"అసలు విషయ మేమిటో చెప్పు. మాషా యెల్లా వుంది?"

"ఇంకా వురిమాత్రం పెట్టుకోలా."

ఇలియా మండిపడుతూ అన్నాడు— "నా పైన నిష్ఠూరం వేస్తున్నావు గాని, మాషా నయిదు రూపాయల కోసం అమ్మింది నువ్వు కాదూ?"

"నన్ను కూడ నేను తిట్టుకుంటూనే వున్నాను. చేసిన దానికి పస్తాయించుతున్నాను. ఆ దురదృష్టవతి స్థితి దుర్భరంగా వుంది. మొగుడామెని నానా తిప్పలు పెడుతున్నాడు. గడప దాటి కదలనివ్వడు. బయటి ముఖం చూచే ప్రాప్తి లేదు. రాత్రిం బగళ్ళు నిఘాలో వుండాల్సి వస్తోంది. మొదటి పెళ్ళాం పెడ తోవ్క్రటం, పుట్టిన పిల్లలు కూడ క్షేత్రజులు కావటం వల్ల మాషా కాళ్ళూ-చేతులూ కట్టి హింసిస్తున్నాడా దుర్మార్గుడు. ఆ పిల్ల రెండు సార్లు పారిపోయింది; కాని వెంటనే పట్టుబడింది. తర్వాత ఆమె బాధలు మరీ మితి మీరినయి. ఇదీ మాషా స్థితి."

ఇలియా దుఃఖా వేగం వల్ల గద్గద కంఠంతో "అది మీ రామెకు చేజేతలా తెచ్చి పెట్టిన బహుమానా మేగా" అన్నాడు.

"అప్పట్లో మే మామె మేలు కోశే ఆ పని చేశాము. అతని ప్రాపున పవిత్రంగా నైనా బ్రతుకు తుందని ఆశించాము. కాక. యే ధనికునికో అమ్మితే మా కెక్కువ గానే డబ్బు ముట్టేది. ఆమె తర్వాత వదిలెయ్యబడినా జీవితాని కేదో మంచి యేర్పాటే జరిగేది."

ఈ మాటల నామె చీకూ – చింతా లేనిదానివలె చెప్పింది. ఆమె హృదయం కఠిన శిలా నిర్మిత మేమో నను కున్నాడు ఇలియా. "ఇంతకూ యిప్పు డిక్కడి కెందుకు వచ్చా" వని అడిగాడు.

"నువ్వు పోలీసు వారి పొత్తులో వుంటున్నావు. మాషా పారిపోయి నప్పు డెల్లా వారే పట్టుకొని ఆ నర పిశాచానికి వొప్పగించుతున్నారు. నీ వామె స్థితిని వారికి చెప్పి యిక ముందు పట్టి యివ్వొద్దని చెప్పు. ఆ ప్రాణానికి ప్రపంచంలో అంతకంటె చల్లని చోటే దొరకదా?" అంది మతిసా.

"నిజంగా నువ్వు నా దగ్గర కొచ్చింది యిందు కేనా?"

"నిజంగా యిందుకే. నువ్వు చెప్పితే పోలీసువారు వింటారు. ఇక ఆమెని బాధించ వద్దని చెప్పు యిలియా!"

ఇలియా నిట్టూర్చాడు. మాషాని తా నే విధంగా వృద్ధరించ గలనా అని ఆలోచించు తున్నాడు.

మతిస్సా లేచి మెల్లగా వెడుతోంది. చూచే వారి కామె మానవాకారంగా లేదు. పెళ్ళిగిలి కూలిపోతున్న చెట్టులాగుంది." ఇదే ఆఖరు చూపు. నే నింకెన్నాళ్ళో బ్రతకను అంటూనే మతిస్సా వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళగానే లాసినా గబగబా ఇలియా గది లోకి వచ్చింది. వాడి భుజం మీద చెయ్యేసి "ఊబిజేనా నీకు తొలి పొందు సౌఖ్య మిచ్చింది?" అని అడిగింది.

ఇలియా మాషాని గురించి ఆలోచించుతూ "ఎవరు?" అని పరధ్యానంగా అడిగాడు.

"ఇప్పుడు నీతో మాట్లాడి పోయినావిడ."

ఇలియా తన భుజం మీదనుంచి లాసినా చేతిని త్రోసివేసి "కుళ్ళి రాలిపోయే పండు లాగున్న మనిషిని గూర్చి వెరపు లేకుండా మాట్లాడుతున్నావా? ఒంట్లో త్రాణ లేకపోయినా కష్టాల పాలయిన ఒక యువతికి సహాయం చేసేందు కింకా కృషి చేస్తూనే వుంది" అన్నాడు తీవ్రంగా.

"ఓహో! అయితే ఆ యువతిని నీతో కలిపే దూతిక కాబోలు!"

"ఛీ, యిక నీ వాగుడు కట్టిపెట్టు. పరిహాసానికి

యిదేనా సమయం?'' అని ఇలియా మాషా కథ యావత్తూ లాసినాతో చెప్పాడు. "ఇప్పుడేం చెయ్యాలో తోచటం లే''దని లాసినా సలహా కోరుతున్నట్లామె వంక చూచాడు.

"ఏమిటి చేసేది. న్యాయ శాస్త్ర ప్రకారం భర్తకి భార్యపైన సర్వాధికారం వుంటుంది. భార్యా-భర్తల తగవుల్లో యితరులు వేలెట్ట కూడదు. ఆమె నోరు మూసుకొని ఒక్కచోట వేనులా పడి వుండాల్సిందే. అయినా వృద్ధుడింకెన్నాళ్ళు జీవిస్తాడులే. వాడి ప్రాణం గుటుక్కు మనేదాకా ఓర్చుకుంటే ఆస్తి అంతా ఆమెకే దక్కుతుంది. ఆ తర్వాత నువ్వా ధనిక వితంతువుని చేపట్టొచ్చు."

లాసినా పై మాటల్ని న్యాయ శాస్త్రం తనకు కరతలామలక మైనట్లూ, యిల్లాంటి విషయాల్లో తన కెంతో అనుభవ మున్నట్లూ చెప్పేసింది. నవ్వుతూ యింకా యిల్లా అన్నది— నువ్వు నీ పూర్వ పరిచితు లందరినీ మర్చిపోవటం మేలు. వాళ్ళకీ నీకూ సామ్యం లేదు. వాళ్ళు నీచులూ, పతితులూను. నీవద్దకు డబ్బుకోసం వస్తూంటాడే వాడి రూపం యెంత మోటుగా వుంటుంది!"

"నువ్వనేది పావ్కాని గురించేనా?"

"అవును, వాడే. అసలు మీ పేర్లే చిత్రమైనవి. మీకీ పేర్లు యెల్లా పెడతారో!"

ఇలియా అవమానంచే కుమిలి పోతున్నాడు.

పెటుహా హోటలు జీవితము భావిలో కూడ తనశాంతికి అడ్డ మవుతుంది కాబోలనుకున్నాడు.

25

ఇలియా చిర మనోరథం యీడేరింది. కొత్త వ్యాపారం జోరుగా సాగుతోంది. వాడుదయం లగాయతు సాయంత్రం వరకు వ్యాపారంలో నిమగ్నుడై వుంటున్నాడు. దుకాణంలోని వస్తువులన్నీ బజారున పోయేవారికి చక్కగా కనపడే లాగున అమర్చాడు. ఇప్పుడు వానికితర వ్యామోహ మేదీ లేదు. ఒక్క వ్యాపార విషయాలు మాత్రమే వాని బుర్రలో మెదుల్తున్నయి. అమ్మకం బాగా సాగుతున్నందున కార్య భార మధికమై గ్రైబిక్ అనే కుర్రాణ్ని చేతికింద పెట్టుకున్నాడు.

నీటుగా వుండాలన్న వ్యసనం వుండనే వుంది. "దుకాణంలో వుండే వాళ్ళు శుభ్రతగా వుంటే గ్రాహకు లెక్కువవుతా" రని గ్రైబిక్‌తో చెప్పేవాడు.

గ్రైబిక్ పన్నెండేళ్ళ బాలుడు. గట్టి శరీరం. చక్కని కళ్ళు. నవ్వు ముఖం. లేవి వల్లనే వాడు నౌకరీలో ప్రవేశ పెట్టబడ్డాడు. దుకాణపు పని వాడికి సరదాగానే వుంది.

వచ్చిన వారికి కావలసిన వస్తువుల్ని వుత్సాహంతో చక చకా అందించే వాడు. మర్యాదగా ప్రవర్తించటాని కూడ ప్రయత్నించేవాడు. అయితే వాని దసలు చిటపట స్వభావం. అదొక్కటే వాడికి కళంకంగా వుంది, 'అది తే, ఇది చూపు' మని చివర కేమీ కొనకుండా యెవరైనా వెళ్ళి పోతూంటే వాడికి ఒళ్ళు మండేది. పెద్దవారితో వచ్చిన పిల్లల చిలిపి చేష్టల్ని సహించే వాడు కాడు. అపు డపుడు వాళ్ళని గద్దించి కసరుతూండే వాడు. ఇల్లాంటి ప్రవర్తన దుకాణంలో వుండేవాడికి తగదనుకొన్నా ఇలియా తాను చేపల దుకాణంలో వున్నప్పటి స్థితిని స్మరించుకొని గ్రైబిక్‌ను అదమాయించే వాడు కాదు. బుజ్జగింపుగా బోధించుతూ వాని యందు వాత్సల్యం చూపేవాడు.

"గ్రైబిక్! తీరికగా వున్నప్పుడు చదువుకుంటూండు. కాలమూ గడుస్తుంది; లాభంకూడాను" అన్నేవాడు. తన కా అదృష్టం కలిగిన తరువాత ఇలియా సరళ స్వభావీ, వుదార హృదయుడూ అయ్యాడు. 'నా అదృష్టం పండింది. మీరు ఓపిక పట్టండి. మీకూ మంచి రోజులు వస్తాయిలె' మ్మన్నట్టు వుండేవి వాని చూపూ, వ్యవహారమూను.

ఉదయాన యేడు గంటలకే దుకాణం తెరచి చీకటి పడేదాకా వుంచేవాడు. కొనటాని కెవరూ రాక పోతే ఇలియా కుర్చీ నారుబయట వేయించుకొని తన జీవితాభిలాషలన్నీ తీరిపోయినట్టు నిశ్చింతగా కూచునేవాడు.

గ్రైబిక్ దుకాణంలో కూర్చొని బజారున వచ్చి పోయే వాళ్ళని చూస్తుండేవాడు.

ఇలియా కిప్పుడు గ్రంథ పఠనాసక్తి లేదు. ఏకాంతంగా కూర్చొని ఆత్మ పరిశోధన చేయాలన్న కోరిక మాత్రం మిగిలింది. వాని కాత్మ విచారణలో ఆనందం కలుగుతూండేది. ఎప్పుడైనా మనసు వ్యాకులంగా వుంటే, గ్రైబిక్‌తో పిచ్చా-పాటీ మాట్లాడుతూ మనస్సు కుల్లాసం కల్గించుకో ప్రయత్నించేవాడు. గ్రైబిక్ తన వద్ద నౌకరుగా వున్నా వాత్సల్యంతో చనువుగా మాట్లాడేవాడు. ఒకసారి "మీ నాన్న యేం చేస్తుంటాం" అని గ్రైబిక్ అడిగాడు.

"పోస్టుజవాను."

"మీ కుటుంబంలో యెందరున్నారు?"

"బోలెడంత మందిమి. చిన్నా పెద్దా కలిసి మా నాన్న సంతానం యెనమండుగురం. అయిదుగురు పిల్లలు. ముగ్గురు పెద్దవాళ్ళము. పెద్దవాళ్ళం సంపాదించుతున్నాము. నేను మీవద్ద వున్నాను. వాసిలీ సైబీరియాలో టెలిగ్రాఫు మాష్టరు. మా అక్క బడిలో పంతులు. ఆమె నెలకి పాతిక రూపాయలు తెస్తోంది. మిషా నాకంటె పెద్దవాడు గాని, యింకా చదువు కుంటున్నాడు.

"అయితే పెద్దవాళ్ళు నలుగు రన్నమాట!"

"అదేమిటి! మిషా, చదువుకుంటున్నావుగా. సంపాదించే వాళ్లేగా పెద్దవాళ్ళు."

"నీకు జరుగుబాటు కష్టంగా వుందనుకుంటాను" అన్నాడు ఇలియా సానుభూతి సూచకంగా.

"అవును, యిప్పుడు దరిద్రంలోనే వున్నాం; గాని, నేను గడితేరితే యిల్లాగే వుండిపోము. వయసు రాగానే సైన్యంలో చేరి శత్రువులమీద దెబ్బ తీస్తాను. వాళ్ల జండా నూడలాగి తెస్తా. సర్కారువారు నన్ను బహూకరించి పెద్దవుద్యోగం యిస్తారు. మా పినతండ్రి కూడ అల్లాగే పతకం సంపాదించాడు."

ఇలియా గ్రైబిక్ ఆశాభరితమైన మాటలు విని వాడి ముఖాన్ని చూస్తూ లోలోపల నవ్వుకొనేవాడు. దుకాణం మూసివేసినాక యిద్దరూ ఒక్కసారే భోజనానికి కూచునేవారు. గ్రైబిక్ ఇలియాకు వడ్డించి తాను యెడంగా కూచుని తిని, దుకాణం ముందుకెళ్లి పడుకొనేవాడు. ఇలియా నింపాదిగా నమిలి మింగుతూ చాలాసేపు తినేవాడు. వెనక గదిలోనే పడుకునేవాడు. ఆ గది నన్ని విధాల పరిశుభ్రంగా వుంచటానికి ప్రయత్నించేవాడు. అద్దాలు, పటాలు, తెరలతో గదిని చక్కగా అలంకరించాడు. పటా లన్నిటిలోను 'మానవ జీవితావస్థ' లన్న చిత్రాన్ని వాడెంతో మోజుపడి తెచ్చుకున్నాడు.

ఆ చిత్రం ధనురాకారంలో వుంది. దాని వుపరి భాగంలో దేవుడు ఆదం-హవాలతో మాట్లాడుతున్న

దృశ్యం చిత్రపబడింది. ఆ పటంలో మానవుని వివిధ జీవితావస్థలు పదిహేడు చిత్రాలుగా చిత్రింపబడినై. తొలి దశలో ఒక పసిపాప తల్లి ఒడిలో ఆడుకుంటున్నాడు. మలి అవస్థలో ఐదేళ్ళ పిల్లాడు పిల్లగోవి వూదుతున్నాడు. ఏడు సంవత్సరాల బాలుడు వర్ణక్రమం దిద్దుకుంటున్నాడు మూడో దాన్లో. నాల్గో చిత్రంలో పదేండ్ల కుర్రాడు చంకలో పలక-పుస్తకాలు పెట్టుకొని బడికి పోతున్నాడు. ఐదో దశలో యిరవై వసంతాలు చూచిన తరుణుడు మీసాలు మెలివేస్తూ భుజాన తుపాకి ధరించి కవాతు చేస్తున్నాడు. ఆరో అవస్థలో పాతికేళ్ల పడుచువాడు ప్రేయసీ సందర్శనానికి ముస్తాబవుతున్నాడు. తరువాత దశలో ఆ యువకుడే ప్రియురాలితో చెట్టపట్టాలు పట్టుకొని వాహ్యాళి కెడుతున్నాడు. ఎనిమిదో అవస్థలో ధనార్జనకు మంచి-చెడ్డ వుపాయాలన్నిటిని ప్రయోగించుతున్నాడు. కుర్చీలో సుఖాసీనుడై పత్రిక చదువుకుంటూంటే పిల్లలు కాళ్ళవద్ద చెలగాట లాడుతున్నారు తొమ్మిదో చిత్రంలో. ఇది వాని జీవితంలో మధ్యమావస్థ. వాని ముఖంలో సంతుష్టి, ఆనందాలు ద్యోతమాన మవుతున్నై. అప్పటికి వాని కేబది యేండ్ల ప్రాయం వచ్చింది. పదో చిత్రంలో అతను కాషాయాంబరాలు దాల్చి కూరగాయలు తెచ్చుకుంటున్నాడు. అనంతర దశలో వానిని మనుమలు, మనుమరాండ్రు చుట్టుకొని వున్నారు. ఒకడు భుజంమీద గుర్రమెక్కాడు. ఒక పిల్ల గడ్డం లాగుతోంది. ద్వాదశావస్థలో వాని జవ-సత్వా

లుడిగి పోయాయి. కర్ర సూతగా గోచి తెచి కూర్చుంటు న్నాడు. పడమటింట్లో దుప్పటిలో పడక కుర్చీలో పడుకొని వున్నాడు. ఆటగా యిటువంటి చిత్రపటాలకి నక్కి లేదు. ఆల కృత్యాలన్నీ అక్కడే జరుగుతున్నై. పదునాలుగో చిత్రంలో మంచమెక్కి తుది ఘడియలు లెక్కించు కుంటున్నాడు. పదిహేనో దశంలో మరణాసన్నుడయి వున్నాడు. యమ కింకరులు వాని చుట్టూ చేరి వున్నారు. పదునారవ చిత్రంలో వాని ఆత్మ దేహాన్ని విడిచిపెట్టింది. పీనుగపైన గుడ్డ కప్పబడి వుంది. తుది దశలో వాని కంతము సంస్కారం జరుగుతోంది.

ప్రతి అవస్థను వ్యక్తం చేస్తూ చిత్రంక్రింద యెర్ర సిరాతో వివరాలు ముద్రితమై వున్నై. ఇలియా ఆ చిత్రం మీదనే దృష్టి నిల్పి చూస్తూ అవ్యక్తానంద మనుభవించే వాడు. "మానవ జీవిత మెంత చక్కగా చిత్రింప బడింది!" అనుకొనేవాడు. ఆ చిత్రదర్శనంతో వానికి శాంతి చేకూరు తూండేది. అందులో మానవ జీవిత పరిణామము సుబోధకం చేయబడింది. ఇలియా తన జీవిత రహస్యంకూడ అదే నను కున్నాడు. ముందు వృద్ధదశకు చేరి, తిప్పతిప్పలుగా ధన మార్జించిన తర్వాతే చదువుకున్న సుందరిని పెళ్ళాడటం వుచిత మని భావించాడు.

"బాగా వయసొచ్చిన మీదటనే వివాహం చేసు కోవాలి. భార్య రావటంతో అనేక బాధ్యతలు నెత్తిన

పడి లాయిలాసా యెక్కువవుతుంది. కాబట్టి కనీసం పెళ్ళి నాటికి నలభై సంవత్సరాల వయస్సైనా వుండాలి; అయితే వయసు మరీ మించితే పిల్లల చదువు-సంధ్యలకు ఏర్పాట్లు చెయ్యటం కష్టమవుతుంది; కాబట్టి ముప్ఫై యేళ్ళకే పెళ్ళి చేసుకోవా" లనుకున్నాడు ఇలియా.

ఒకనాటి రాత్రి టీకి పొయ్యిమీద నీళ్లు పెట్టాడు. అప్పుడు వాని కేవో ఆలోచనలు కలిగాయి. పొయ్యి మీద నీళ్ళు పొంగుతున్నై. ఇలియా పరధ్యానంగా వుండి వాటివంక చూడనే లేదు. కాస్సేపటికి మంటకూడ ఆరి పోయింది. గదిలో నిశ్శబ్దంగా వుంది. ఇలియా కప్పుడనేక భావాలు స్ఫురించనాగాయి. ఆ గదిలో మాదిరిగా యేకాంతంగా ఆలోచించుకోటానికి వానికింకెక్కడా అవకాశం చిక్కేది కాదు.

ఇలియా దృష్టి పైన చెప్పిన చిత్రం మీద పడింది. పతనావస్థను తెల్పే చిత్రాన్ని చూచి 'అసలు మానవు డెందుకు చావాలి?' అని ప్రశ్నించుకున్నాడు. 'మృత్యువులోనే ఆనందమున్న' దన్న జాకోబు మాట జ్ఞప్తి కొచ్చింది.

మరుక్షణంలోనే వానికి పాషా, వేరాలు జ్ఞాపకం వచ్చారు. వారే స్థితిలో వున్నారో నన్న చింత కలిగింది. అంతలో మళ్ళీ పోలటోవ్ హత్యాదృశ్యం ఇలియా స్మృతి పథంలోకి వచ్చింది. 'ప్రతివాని కర్మలు పరిశీలింప బడ

తాయి. నేడో రేపో ప్రతి మనిషీ తనతన కర్మ ఫలి తాన్ని అనుభవించి తీరాల్సిందే' అనుకున్నాడు నిర్వికార భావంతో. ఈ విధంగా ఆలోచనలు చెలరేగుతూంటే వాడికి విసుగు కలిగింది. లేచి బట్టలు మార్చుకొని దీప మార్పబోయాడు. దీపం వత్తి తగ్గించి మళ్ళీ పెంచాడు. అంధకారం దూకుతూ వచ్చి పారిపోయింది. ఆ విధంగా కొంతసేపటి వరకు దీపంతో ఆడుకుంటూ చీకటి-వెల్తురు లను ముందు వెనకలకు పరుగులు తీయించాడు. ఆ ఆట వానికి వినోదంగా వుంది. ఇలియా కది నిత్యము అలవా టైన ఆట అయింది.

కాస్సేపా ఆట ఆడి దీప మార్పేసేవాడు. నిశాదేవి రాజ్యం క్షణంలో నల్లిక్కలా విస్తరించేది. వెన్నెల రాత్రి అయితే కిటికీ చువ్వల మధ్యగా చంద్రిక లోపలికి జొరపడి మసక వెల్తురుగా వుండేది. ఆ నీరవ ప్రదేశంలో ఇలియా పక్కమీదికి చేరి గొంగళి ముసుగు పెట్టుకొని నిద్ర పట్టేదాకా చీకట్లో కళ్ళు తెరచి చూచేవాడు. పొద్దున నిద్రనుంచి లేచినప్పుడు రాత్రి తాను చేసిన బాల్య చేష్టకి నవ్వుకునేవాడు.

అప్పుడప్పుడు పాష్కా దుకాణానికొచ్చి ఇలియాను కలుసుకొని పోతూండేవాడు. వాడి మురికి గుడ్డలు, మడ్డి తనం చూచి ఇలియా చీదరించుకొనేవాడు. పాష్కా యెన్నడూ అక్కడ స్థిమితంగా కూచుని మాట్లాడేవాడు

కాదు. ఎప్పుడైనా ఇలియా మరి కాస్సేపుండమంటే "నా వ్యవహారం నీకు తెలియదుగాదే. నేనొక క్షణంగూడా వుండటానికి వీల్లేదు. పంజరం మూత తీసి వుంచితే పిట్ట యెగిరి పోతుందని నా అలంకా. వేరా యెప్పుడూ యేదో ఆలోచిస్తూనే వుంటుంది. ఒక బిడ్డ పుట్టినా బాగుండు" అని యిల్లాగే యేదో చెప్పి నిట్టూర్చి లేచి చక్కా పోయే వాడు.

ఒక తడవ పాషా వచ్చినప్పుడు "కవిత్వం సాగుతోందా?" అనడిగాడు ఇలియా.

"కాయితంమీద కాదు గాని, ఆకాశాన రాస్తున్నా" నని నవ్వి పాషా యింకా యిల్లా చెప్పాడు—"ఆరోజులు గతించాయి. మాకు సుఖపడే రాత లేదు. నా సర్వస్వం కోల్పోయాను. ఇక నాకు మిగిలిందేమీ లేదు. ఎప్పుడూ వేరాను గూర్చిన చింత వేధించుతోంది. ఏపని చేస్తున్నా యీ విచారం నన్ను వదలకుండా వుంది. నువ్వు అదృష్ట జాతకుడివి. నీ కన్నివిధాల సౌఖ్యముంది. నాకు స్వంతాన్ని గూర్చి చింత లేదు కాని, వేరా విషయంలోనే......"

"నన్ను గూర్చి యెందుకు లేదు?" ఇలియా మధ్యలో ఆపి అడిగాడు.

"నేనామెని సంతృప్తి పర్చ గల్గితే నాకేచింతా వుండదు. వేరా వల్లనే నాకీ దుఃఖమంతాను. ఆమె విలాసిని. దుబారా ఖర్చు చేస్తుంది. ఎంత డబ్బూ చాలదు

ఏవిధంగా నయినా డబ్బు లభిస్తుందని తెలిస్తే ఆమెలో విచిత్ర పరివర్తన కన్పిస్తుంది. ఒకొక్కప్పుడు నన్ను దొంగతనానికి కూడా పురికొల్పుతోంది. నేనొప్పుకోక పోతే పిరికిపందననీ, అప్రయోజకుడిననీ హేళన చేస్తుంది. ఆమెకీ జీవితం మహా దుస్తరంగా వుంది" అని చెప్పి పాషాక్ వ్యాకుల చిత్తంతో ప్రయాణించాడు.

అప్పుడప్పుడు షర్ఫిషాక్ కూడా ఇలియూను చూచి పోతూండేవాడు. ఎప్పుడూ సితారు వెంట వుండేది. పెట్రుషా పాటలు వార్తలు, జాకోబు స్థితిగతులూ చెపుతూండేవాడు. నవ్వుతూ కబుర్లు చెపుతూ నిశ్చింతగా కనపడేవాడు.

"పెట్రుషా మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. అతని కొత్త పెళ్ళాం వెదురు గడలా వుంటుంది. కొడుకు కూడా అమ్మ లాగానే వుంటాడు. ఆ ముసలి పెళ్ళికూతురును చూస్తుంటే మూడంతస్తుల మేడ తలపుకొస్తుంది. కళ్ళు బటానీ గింజలంత చిన్నవి. కొడుకు కళ్ళకు జోడు తగిలిస్తాడు. మహా పొగరుబోతు. ముక్కుతో మాట్లాడుతాడు. తల్లి యెదుట గడగడ లాడినా వెనకాల వెక్కిరిస్తూంటాడు. మొత్తం మీద పెట్రుషా కొంపలో బలే సజ్జు చేరిందిలే! ఇంతకూ జాకోబుకు చిక్కొచ్చింది. వాడికి నుంచోటానికి నీడ లేకుండా పోయింది. చాటు మాటుగా తాగుతూనే వున్నాడు. తండ్రి బాదినప్పుడు వూపిరి తిత్తులకు దెబ్బ తగిలిందో యేమో రోజు రోజుకు వాడు దగ్గుతో దిగజారి

పోతున్నాడు. వాళ్ళంతా కలిసి జాకోబు నెప్పుడో నమిలి మింగేస్తారు. వాడసలే యేబ్రాసి రకం. ఎవరితోను యేమీ చెప్పడు. ఎప్పుడో తప్పీమని యెగిరి పోతాడు...... మీ బాబాయి కీవ్ కు చేరుకున్నాడటగా! ఆయన లేని పోని యాతన పడుతున్నాడు; ఆయన కసలు మోక్షం సిద్ధించదనే నా నమ్మకం......మతిల్దా కాళ్ళు పట్టు తప్పిపోయినయి. ఒక గుడ్డివాణ్ని సహాయానికి కుదుర్చుకుంది. తానూ చక్రాలబండిలో కూచుని దారి చెప్తూంటే గుడ్డి వాడా బండి నీడుస్తుంటాడు. ఆ దృశ్యం బలే తమాషాగా వుంటుంది. పాపం! ఏదో విధంగా పొట్ట పోసుకుంటోంది. చాలా మంచి ముండ! నా పెళ్ళాం మంచిదే కాకపోతే నేను మతిల్దాని పెళ్ళాడి వుండేవాణ్ని. ఈ ప్రపంచంలో ముక్త కంఠంతో మెచ్చుకోతగ్గ ఆడవాళ్ళు యిద్దరే యిద్దరని నేను బల్లగుద్ది చెప్పగల్ను. ఒకతె నా భార్య, రెండోది మతిల్దా. మతిల్దా తాగుతుం దన్నమాట నిజమేగాని, అసలు మంచి వాళ్ళందరూ తాగాల్సిందే తాగనివాడు మంచివాడు కాలేడు." ఇదీ ఫర్డినాండు వాగ్ధోరణి.

ఒక రోజున "మాషా యెల్లా వుం" దని ఇలియూ వాడి నడిగాడు.

కూతురు పేరు విన పడటంతో ఫర్డినాండు నవ్వు చైత్ర మాసపు చెట్ల ఆకుల్లాగా యెగిరి పోయింది. వాని మొహం నల్లబడింది. "నా కామె సంగతులే తెలియవు. ఒకనాడు చూచి వద్దామని పోతే నానా తిట్లు తిట్టి కర్ర

పుచ్చుకొని వెంటపడ్డాడు........" అని మెల్లగా చెప్పి "ఇక వెళ్తాను, ఒక పావలా యి"మ్మని అడిగాడు.

"నువ్వు నానాటికి పతన మయిపోతున్నావు ఫర్ ఫిషా్క!" అన్నాడు ఇలియా.

"నువ్వన్న దాన్లో పొరపాటేమీ లేదు. నేను చచ్చిపోతే విచారపడే వాళ్లు ఎవరు? ఎప్పుడూ నవ్వు ముఖంతో నే నందర్నీ సమ్మోహించుతూంటాను. లేకపోతే మామూలుగా వాళ్ళేడుస్తూనే వుంటారు. ఎవర్ని చూచినా తాము చేసిన పాపాలు, దేముడు తమకు విధించే శిక్షలను గురించే చర్చించుతూంటారు; కాని, నేను పాటలు - పద్యాలతో వాళ్ళ కానందం కల్గించు తూంటాను. కొద్దో గొప్పో పాప ఫలితా న్ననుభవించక యెల్లాగూ తప్పదు. మరి అల్లాంటప్పుడు యిప్పట్నుంచీ అఘోరించటం యెందుకు చెప్పు" మని ఫర్ ఫిషా్క సమాధాన మిచ్చాడు.

ఈ విధంగానే జవాబు లిస్తూ నవ్వుతూ, పాడుతూ వెళ్ళి పోయేవాడు. వెళ్లేటప్పుడు ఇలియా పావలో అర్ధో వాడి చేతిలో పెట్టేవాడు. ఫర్ ఫిషా్క దుస్థితికి ఇలియా విచార పడుతూండేవాడు తన గత జీవితాన్ని కూడ తల్చుకొనేవాడు. ఆ స్మృతితో వాడు గిలగిల కొట్టుకునేవాడు. వాని ప్రస్తుత స్థితి విషయజీవితం మీాద విరక్తి కలిగి యేకాంత వాసం చేస్తున్నట్టున్నా నిత్యము అనేక నూతన సమస్య లెదురై వానికి శాంతి లేకుండా చేస్తున్నై. పాషా్క ఫర్ ఫిషా్కల మాటలు వింటున్నా వాళ్లెప్పుడు

వదలి పోతారా అని ఆత్రుత చెందేవాడు. పాషాగ్కతో మాట్లాడుతున్నప్పుడు వ్యాకుల మగ్గలమయితే చప్పున కొంత డబ్బిచ్చి వాడిని సాగనంపేవాడు.

ఒకసారి "నే నింకెంతని సహాయం చేయగలను? నువ్వికవేరాతోటి సంబంధాన్ని వదలుకోవటమే మంచి" దని ఇలియా పాషాగ్కతో చెప్పేశాడు.

"అది మాత్రం అసంభవం. అక్కర లేని దెల్లాగూ విసర్జింపబడుతుంది; కాని, వేరాతో నాకున్న అవసరం యింతింతని చెప్పలేను. ఆమె యితరుల కూ డ కావాలి. కొందరామెని నానుంచి లాక్కొని పోటానికి ప్రయత్నించుతున్నా రనేదే నా దిగులు. నాకైనా ఆమె యందు హృదయపూర్వకమైన ప్రేమ లేదు కాని, క్రోధ-ద్వేషాలు నన్నామె వేపుకే నెట్టుతున్నై. వేరాయే నా జీవితాశ. మరి నే నామెని విడిచి పెట్టే దెలాగో చెప్పు? ఇక నాకు మిగిలే దేముంటుంది? నా బొందిలో ప్రాణ ముండగా వేరాని తీసుకొని పోటానికి దమ్మెవరికుంది? నా గురించి నువ్వు నిశ్చింతగా వుండు. నేను దాని గొంతు పిసికి చంపనైనా చంపుతా గాని, వదలి పెట్ట"నని పిడికిలి బిగించాడు. వాడి ముఖం జేవురించింది.

"వేరా యింటి చుట్టూ కోడెగాండ్లెవరైనా పకీ గాపులు పడి వుంటున్నారా?"

"లేదు."

"మరి నీ నుంచి ఆమె నేవరో లాక్కొజూస్తున్నారన్నావు?"

"నానుంచి ఆమె నాకర్షించే శక్తి యేదో వుంది. నా తండ్రి స్త్రీ మూలంగానే అంతరించిపోయాడు. నేనూ అట్లాగే మాసిపోతాను" అంటూనే పాషా లేచి పోయాడు.

ఇలియా పాషాని గూర్చి చాల యిదయ్యేవాడు. ఒక్కొక్కప్పుడు వాని హృదయంలో అజ్ఞాత హింసాభావం పొడకట్టేది. పాషా జీవితాన్నా విధంగా నాశనం చేస్తున్న దెవరో ఇలియా వూహించలేక పోయాడు. అందువల్ల పరిహాసంతో ప్రయోజనం లేనట్టే కోపించటం కూడా వ్యర్థమని తోచింది ఇలియాకి.

మరొకప్పుడు మాటల సందర్భంలో పాషా ఇలియాతో యిల్లా అన్నాడు—"మిత్రమా! నన్నుద్ధరించటం నీ వల్ల కాదు. ఎవరు యెవరి నుద్ధరించగలరు? అందరం యీ లోకానికి వొంటరిగా వచ్చిన వాళ్ళమే. అందరి జాతకంలోను వొక్కటే రాసి వుంటుంది. 'పనిచేసి చావు, ఆత్మని సైతానుకు వప్పజెప్పు' మనేదే అందరి ముఖాల పైన రాసి వుంటుంది. (కొంచెమాగి) నువ్వు యేకాకివి; నిశ్చింతగా వుంటున్నావు; కాని, రాత్రింబగళ్ళు యెవడో ఒకడు నీ సర్వనాశనం కోరుతూ వుండడూ?"

"ఏమో! అయినా నన్ను కన్నెత్తి చూచేందుకు గుండె యెవడికుంటుంది? నడుం విరగ దన్ననూ?"

"బా స్లేగోయ్! గప్పాలు కొట్టమాకు. జీవితాంతం దాకా వ్యాపారం చేస్తూ యిల్లాగే కులాసాగా వుంటా వనేనా నీ వుద్దేశం?"

"ఎందు కాకూడదు."

"ఎప్పుడో ఒకప్పుడు నువ్వీ దుకాణంలో నుంచి తరిమేయబడతావు. అల్లా కాకపోతే నువ్వే స్వయంగా దీన్ని వదిలేసి పోతావు."

"చూద్దాంగా!"

పాషా అంతటితో వూరుకోక మళ్ళీ అన్నాడు— నువ్వెప్పటికైనా దుకాణం వదిలిపెట్టి పోతావని నేను ఘంటాపథంగా చెపుతున్నాను. నువ్వీ విధంగా ఒకేచోట స్థిరంగా వుండలేవు. అది నీ స్వభావానికే విరుద్ధం. నువ్వు తాగుబోతువైనా కావచ్చు; లేదా మరోరీతినైనా సర్వనాశనం చేసుకుంటావు. ఈ రెండింటిలో యేదో ఒకటి జరిగి తీరుతుంది."

పాషా జోస్యంతో ఇలియా ఆశ్చర్యాన్వితుడయ్యాడు. పాషా యే నమ్మకంతో అంత ధీమాగా మాట్లాడుతున్నాడో ఇలియాకి బోధ పడలా. "ఎందువల్ల?" అని ప్రశ్నించాడు.

"శాంతి నీ మనస్తత్వానికే సరిపడదు. నువ్వు బోళా మనిషివి. ఉదార హృదయుడివి. నీ లాంటి వాళ్ళు ఆనంద జీవితాన్ని గడపటం సహజమేగాని, ఆకస్మికంగా అంతరించి పోతారు."

"ఏ విధంగా?"

"మృత్యుగర్భంలో నిద్రపోయి."

ఇలియాకి నవ్వొచ్చింది. ఆవులింతతో ఒళ్ళు విరుచుకుంటూ "నీది వితండ వాదం పాషా! ఇవన్నీ అర్థంలేని మాటలు" అన్నాడు.

ఆ నాటి సాయంత్రం టీ తాగుతూండగా ఇలియాకి పాషా మాటలు జ్ఞప్తి కొచ్చాయి. అవి తన వుమ్మడి వ్యాపారానికి తగినట్టే వున్నయ్యనుకున్నాడు. ముందు దూరమాలోచించకుండానే తొందరపడి లాసినా షరతులన్నిటికి ఒప్పుదల అయాడు. అయిదారు వందలు పెట్టుబడిలో కలిపాడు. అయినా కూండ జీతగాడివలె చాకిరీ చెయ్యాల్సి వస్తోంది. ప్రతి పైసకు జమా ఖర్చు చెప్పితీరాలి. తన శ్రమ ఫలితాన్ని స్వాహా చేయటానికే లాసినా తన్ను బాహుపాశంతో బంధించిన దనుకున్నాడు. ఆమె పెట్టుబడి సొమ్మును లాభంతో సహా సుష్టాగా యిచ్చేసి స్వంతంగా వ్యాపారం సాగించాలని నిశ్చయించుకున్నాడు లాసినాతో యిక మొల్లాంటి సంపర్కం కలిగి వుండకూడ దనుకున్నాడు. ఆ విధంగా చెయ్యటంకూడ సులభమే. ఇలియా అసలు లాసినా నెప్పుడూ ప్రేమించనే లేదు. ఆమె పొందు వానికాది నుంచి భారంగానే వుంది. ఇప్పుడు వానికది మరీ అసహ్యంగా వుంది. ఆ టక్కులాడి ఆలింగన - చుంబనాదులచే వానికి వాస్తవికానంద మెన్నడూ లభించనే లేదు. పైగా యేవగించుకునే వాడు.

ఒక తేప "లాసినా! నీకు సిగ్గు-బిడియా లే మాత్రం వున్నట్టు లేదే!" అన్నాడు మొహం మీదనే.

కాని ఆ జాణ వాని మాటల్ని నవ్వులాట క్రింద త్రోసి పుచ్చింది.

ఆ కులట నిత్యము తనలాంటి మధ్య తరగతి స్త్రీలవే వేన వేల కథలు చెపుతూండేది. వాటిని విని విని ఇలియా అధీరుడయ్యేవాడు "నువ్వు చెప్పేవన్నీ నిజమే అయితే మీరు స్నేహానికి తగ" రని మరొకప్పుడు మొహమాటం లేకుండా అనేశాడు.

"అల్లా అంటున్నా వేమిటి? మా స్నేహంలో యెంత మజా వుం!ది" అంది లాసినా నవ్వుతూ.

"ఏమి టా మజా? పగలంతా డబ్బుకోసం టక్కులు, రాత్రు ళ్ళీ విధంగా వ్యభిచారం! ఇదేనా ఆనందం?"

"నువ్వు ఒట్టి పశు ప్రాయుడివి. నీకు ఆనంద మంటే యేమిటో యేం తెలుసు?" అని లాసినా మళ్ళీ మధ్యతరగతి కుటుంబాల్లోని వ్యభిచార లీలలను వర్ణించ సాగింది.

"సరే కాని, యిదంతా మంచి పనే నంటావా?" ఇలియా ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

"నేనిప్పుడు మంచి-చెడ్డల్ని విమర్శించేందుకు తీరిగ్గా కూర్చోలా. ఈ విధమైన విలాసాలే లేకపోతే జీవితం నిస్సారమూ, నీరసమూ అయిపోతుం దని నా వుద్దేశం" అంది లాసినా.

తర్వాత ఒకటి రెండు సార్లు "ఇప్పుడే నీ అభివృద్ధికి ప్రయత్నించు. పల్లెటూరి వేషాలు మార్చుకొని పట్టణ వాసుల ఫక్కీ నేర్చుకో" మని లాసినా ఇలియాను బోధించింది.

ఆ బోధ ఇలియాను మరింత బాధించ సాగింది. లీపా సంపర్కం వల్ల చేకూరిన శాంతి - సుఖాలు లాసినా పొందులో నామ మాత్రంగా నయినా లభించటం లేదు. అంత వరకు వాని హృదయంలో లాసినా యందు గల అభిమానాదర భావాలు లేశమయినా లేకుండా పోయినై. లాసినా ప్రార్థన చేస్తుండేది. ఆమె విగ్రహం ముందు ప్రణమిల్లి కళ్ళు మూసుకొని ప్రార్థించేది. ఆ సమయంలో పతి పల్కరించితే లాసినా కళ్ళెర్ర జేసి చీవాట్లు పెట్టేది. ఆవిడ ప్రార్థన ఇలియాకి నాటకంగా తోచింది. అయితే ఆ నటన కర్థం మాత్రం తెలియలా. ఒక రోజున లాసినానే అడిగాడు—"నీవు నిజంగా దేవుని యందు విశ్వాస ముందా?"

"ఎంత చక్కగా అడిగావు! భగవంతుని యందు నా కేల విశ్వాస ముండదు?"

"భేష్! నువ్వింత సులువుగా దేవుని మోసగించి నీ వాంఛ లీడేర్చుకో జూస్తున్నావా?" అని ఇలియా యెగతాళి చేశాడు.

"తప్పు, తప్పు! అపవిత్రంగా మాట్లాడకు...... నేను మోసమేమి చేస్తున్నాను? భగవంతుడు చూడటం లేదూ?

పగలేదో ఒక పనిలో మునిగి వుంటం వల్ల నేను పొరపడుతూ వుండవచ్చు. దేవుడు నన్ను క్షమించడూ? (కళ్లు మూసుకొని) ఆయన దయాళువు! ఉదారుడు! నన్ను తప్పకుండా క్షమిస్తాడు." అన్నది లాసినా అతి భీమాగా.

లీపా కూడ ఈశ్వరు నారాధించుతూండేది. కాని, లాసినా లీపాల దైవోపాసనలో పరస్పర విరుద్ధాంశాలెన్నో ఇలియాకు గోచరించినై. లీపా యేకాగ్ర చిత్తంతో మోకరిల్లి అర్ధ నిమీలిత నేత్రయై ప్రార్థించేది. చుట్టు-పక్కల యేమి జరిగినా చలించేది కాదు. యెవరైనా పెడబొబ్బలు పెట్టి పిల్చినా ఆమెకు వినపడేది కాదు. మరి లాసినాకో! ప్రార్థన సమయంలో కూడ అన్ని యావలూ వుంటున్నై. అల్లాంటప్పుడు లాసినా ప్రార్థన చేయటంలో అంతరార్థ మేమిటా అనే ఇలియా ఆలోచించేవాడు.

వ్యాపార విషయంలో లాసినా తన్ను వంచించిందని గ్రహించి నప్పుడు ఇలియా వుగ్రుడయ్యాడు. "పరాయి వ్యక్తి మోసం చేసినా క్షంతవ్యమే; కాని, ప్రేయసిగా నటించి నన్ను టక్కరి చేసిందే! అయినా కులటను నమ్మటం నాదే తప్పని పరి పరివిధాల తలపోశాడు. తద్దాది ఇలియా ఆమెను ద్వేషించి అసహ్యించుకో సాగాడు. క్రమంగా ఆమె వద్దకు పోవటం తగ్గించి వేశాడు.

ఆరోజుల్లోనే వానికి మరో యువతితో పరిచయ మేర్పడింది. ఆ పడుచు గ్రైబిక్ అక్క. తమ్ముణ్ణి చూచి పోయేందు కామె దుకాణానికి తరచుగా వస్తూండేది.

ఆ యువతి రూపసి కాకపోయినా సామాన్య దుస్తుల్లోనే నీటుగా వుండేది. మనిషి పొడగరి కావటం వల్ల ప్రాయానికి మించిన దానివలె అగపడేది. వచ్చినప్పుడెల్లా ఇలియా ఆమెని మర్యాద చేస్తూండేవాడు. ఆమె తమ్మునితో మాట్లాడుతున్నంత సేపూ ఇలియా తృషిత నేత్రాలతో ఆమె వేపే చూస్తూండేవాడు.

"జాగ్రత్తగా వుండు. యాగీలేమి తేకు" మని తమ్మునితో చెప్పి వెళ్ళటాని కుద్యుక్త అయ్యేది. వెళ్ళే ముందు ఇలియాకు అభివందనం చేసి ఠీవిగా నడచి పోయేది.

ఒక నాడు "మీ అక్క పేరేమి" టని ఇలియా గైబ్రిక్ నడిగాడు.

"సోంకా,"

"చక్కని పేరే! మీ అప్ప గడసరి లాగుందే?"

వాడు నొసలు విరిచి ఇలియా వంక చూచాడు.

"అవును, ఆది ఆమె తెచ్చి పెట్టుకున్న గుణమే" నన్నాడు.

"అందువల్ల ప్రయోజనం?"

"ఆమె కది యిష్టం. ఎవరి కిష్ట మైనట్లు వారు నడచుకుంటారు"

ఇలియాకి సోంకా మీద మనసుపోయింది. ఆదిలో లాసినా పట్ల యెల్లాంటి భావం కలిగిందో యిప్పుడట్టి తలంపే సోంకా విషయంలో అంకురించింది. "ఈబిడ నిష్క

పటి లాగుంది. ఈమెని పెళ్ళి చేసుకుంటే సుఖంగా గడ పొచ్చు" ననుకున్నాడు.

ఒక పర్యాయం సోంకా బైండు పుస్తక మొకదాన్ని తమ్ముని కిస్తూ "అది చాల మంచి పుస్తకం. చదువుకో" మని చెప్పింది.

"నేను దానిని చూడొచ్చా?" అనడిగాడు ఇలియా.

ఆమె గ్రైబ్రిక్ చేతిలోనుంచి పుస్తకం తీసుకొని ఇలియా కందించింది. "ఇది ఒక వీరుని జీవిత చరిత్ర" అని చెప్పింది.

ఇలియా నవ్వి "నేను వీర గాథలు చాలా చదివా" నన్నాడు.

సోంకా కనుబొమ్మ లెగరేసి టక్కున అన్నది— "మీరు భూత-భేతాళ కథలు, అప్సరసల కథలు చదివి వుంటారు. ఇది కల్పిత కథ గాదు. ఒక ప్రజా సేవకుని జీవిత గాథ. పేద ప్రజలకోసం, దీన జనోద్ధరణ నిమిత్తం జీవితా న్నర్పించిన యోధాగ్రణి సాహస చర్యలు యిందులో వర్ణింపబడ్డాయి. ఆ త్యాగ ధనుడు ప్రజలకు సహాయపడటానికి సదా సంసిద్ధుడై వుండేవాడు. రచనా సంవిధానం కూడ చాలా బాగుంది. అయితే దీన్ని కాకమ్మ కథలా కాక మనసుంచి చదవాలి."

"అయితే శ్రద్ధగానే చదువుతాలే."

సోంకా ఇలియాతో అధికంగా మాట్లాడటానికి కిడే

మొదలు. ఈ సంభాషణతో ఇలియా పరమానంద భరితు డయ్యాడు; కాని, సోంకా వుదాసీనంగా "మీ కీ పుస్తకం మనస్కరిస్తుందని నాకు తోచ"దని ప్రత్యుత్తరాని కైనా వేచి వుండకుండా వెళ్ళిపోయింది.

ఇలియా కీ తుది మాట వెగటుగా తోచింది. సోంకా తన్నవమానించే తలంపుతోనే అట్లన్నదని తలి చాడు. వాని ముఖం వికృత మయింది.

గ్రైబిక్ అతి ఉత్సాహంగా పుటలు తిరగేస్తున్నాడు. సోంకా తన్నవమానించి నందుకు ఇలియా తన వుక్రోషా న్ని ఆమె తమ్ముడి మీద వెళ్ళగ్రక్కాడు. "ఆ పుస్త కాన్ని దూరంగా పారెయ్యి. చదవటాని కిదేనా వేళ?", అని కసిరాడు.

గ్రైబిక్ చలించలా. దృష్టిని యథా ప్రకారం పుస్త కం మీదనే నిల్పి "కానే వా ళ్ళెవరూ రా లేదుగా?" అన్నాడు.

ఇలియా ఇక మాట్లాడలా.

సోంకా మాటలే వాని వీనుల్లో గింగురు మంటూ ప్రతిధ్వనించుచున్నై. ఖిన్నుడై "బలే తమాషా పిల్ల!" అను కున్నాడు.

26

కాలం గడిచి పోతోంది. ఇలియా వ్యాపారం చేస్తున్నాడే గాని, పూర్వంలాగ వాని మన సిప్పుడు వర్తకం మీద లగ్నం కావటం లేదు. ఒక్కొక్కప్పుడు విసుగెత్తి దుకాణం మూసేసి షికారు పోదా మనుకునేవాడు. మళ్లీ నష్టం వస్తుందని ఆలోచించుకొని అల్లాగే కూచునేవాడు. దుకాణం మూలంగా ఇలియా సాయంకాలపు వాహ్యాళి కూడ మానుకున్నాడు. దుకాణాన్ని గ్రిబిక్ మీద వదలి ఆదమరిచి వుండేవాడు కాదు

ఇలియా లాసినాల ప్రేమ బంధం క్రమంగా సడలి పోతోంది. లాసినా కూడ అందు కేమాత్రం చింత పడలా. ఆమె ముసి ముసి నవ్వులతో వచ్చి జమా ఖర్చులు చూచి పోతూండేది. ఇలియా కామె యందు ద్వేషం దిన దినాభివృద్ధి చెందసాగింది. కాని, లాసినా తన్ను మెచ్చుకొన్నప్పుడు వుబ్బిపోయి మళ్లీ ఆ కామిని మోహ వాగురలో చిక్కుకొనేవాడు.

అప్పుడప్పుడు నికోడిమిచ్ కూడ దుకాణానికి వచ్చి పోయేవాడు. వచ్చి నప్పుడు మాత్రం గంటల కొద్దీ తిష్ఠ వేసి బాతాఖాని దంచేవాడు. అత డీటీవల పోలీసు వుద్యోగం వదులుకున్నాడు. ఒక గొప్ప సావుకారు వద్ద మేనేజరుగా వుంటున్నాడు. జీతం నెలకి నూట పాతిక రూపాయలే

నట గాని, పై రాబడి అంతకు మించి వుంటుందని అతడే స్వయంగా ఇలియాతో చెప్పాడు. స్వామి ద్రోహానికి పూనుకుంటే యింకా సంపాదించే అవకాశం వుంటుందని కూడ వివరించాడు. పూర్వపు యిల్లు మార్చి యిప్పుడు పెద్ద బంగళాలో వుంటున్నారు. వంట మనిషిని కూడ పెట్టుకున్నారు. "మా వంట మనిషి పిండి వంట లెంత బాగా తయూరు చేస్తుందనుకున్నావు! వేసవిలో మా యింటికి అతిథులు చాల మంది వస్తుంటారు. చీట్లాటతో కాలం బలే మజాగా గడిచిపోతుంది. లాసినా కూడ పేకాడుతుంది. యెప్పుడూ మాలో యెవరో ఒకరు గెలుస్తూంటాము. గెలుపు సొమ్ముతో అతిథి సత్కారం జరిగి పోత్తోంది. చేతి చమురు యెన్నడూ వదల్లేదులే." యిల్లాంటి కబుర్లే చెబుతుండేవాడు నికోడిమిచ్.

ఒక సారి నే నొక పల్లెటూరు కెళ్ళాను. అక్కడ కావలసినంత మంది చక్కని చుక్కలు. సులువుగా లోబడి పోతారు. బేరం కూడ కారు చౌక! పావలా—అయిదణాల మిఠాయితో పని జరిగి పోతుంది." అని యిం కేమేమో చెప్పు కొచ్చాడు నికోడిమిచ్. ఇలియా మెదలకుండా విన్నాడు. పెళ్ళాం యితరుల కోసం యెద గొడ్డులా యెగబడుతూంటే పర స్త్రీలను గూర్చి చులకనగా మాట్లాడుతున్న కిరిక్ వైఖరికి ఇలియా జాలిపడి నవ్వుకున్నాడు.

నికోడిమిచ్ చెప్పిన దంతా నిజమని ఇలియా నమ్మ

లేక పోయాడు. ఎవరో చెప్పింది విని లేత సొరకాయలు తెగ్గోస్తున్నాడని తలిచాడు.

ఆ అమాయకుడు యింకా వాగుతూనే వున్నాడు. "మిత్రమా! పల్లె పడుచుల పొందులో వున్న సౌఖ్యాన్నం దాల నెంతని వర్ణించను!"

లాసినా కీ విషయం తెలిస్తే?" అన్నాడు ఇలియా.

"ఆవిడ కివన్నీ పట్టవు. ఆమె కంతా తెలుసు. లాసినా కీ విషయంలో పట్టింపు లేదు. సరే గాని, నువ్వె వర్నయినా ప్రేమించావా ఇలియా?"

"ఏమో! నే నెల్లా చెప్పగలను?"

"ఆ మిషను కుట్టే యువతితో సంబంధం లేదూ?"

"ఉఁహూఁ"

"ఏ వంట కత్తెనో ప్రేమించి వుంటావు లెద్దూ. వంట చేసే వాళ్లు చాలా బాగుంటారు."

కిరిక్ మాటలకు ఇలియా నవ్వాడు. అందువల్ల ఇలియా కే వంట కత్తెతోనో సంబంధ ముండి వుంటుందని నికోడిమిచ్ కి నమ్మకం కలిగింది. ఆ విశ్వాసం తోనే "రెండు నెలల కొకసారి వంటకత్తెను మారుస్తూండు. అల్లా అయితే పాత రోత లేకుండా యెప్పటి కప్పుడు తాజా సరుకు దొరుకు తూంటుంది." అన్నాడు.

"నేను దాసీలను, వంటకత్తెలనే ప్రేమించి వుంటానని మీ రెందు కనుకోవాలి? అంతకంటె వున్నత కుటుంబ స్త్రీకి

తగనా?" అని ఇలియూ అడిగాడు.

"నీ సంఘ స్థితి అల్లాంటిది. నువ్వు సామాన్య రైతు కుటుంబానికి చెందినవాడివి కదూ!"

ఇలియూ నవ్వాపుకుంటూ అన్నాడు—"మరి నా ప్రేయసి చదువుకున్నదీ, ఉన్నత వంశానికి చెందిన దేనే!"

నికోడిమిచ్ నమ్మలేక పోయాడు. హేళనగా "అసంభవం. బడాయికి అల్లా అంటున్నావులే" అన్నాడు.

కిరిక్ వెళ్లి పోయినా ఇలియూ అతని మాటల్ని మరువలేక పోయాడు. అవి వాని హృదయానికి శూలాలై గుచ్చుకున్నై.

ఇలియూతో స్నేహంగా వుంటూ, వాని శరీర శ్రమ తో అనేక రీతుల లాభం పొందుతున్న లాసినా, నికోడిమిచ్ లే వానిని తమ కంటె హీనునిగా యెంచుతున్నారు; గేలి చేస్తున్నారు. ఇలియూని పెట్రుహా అవమాన కరముకు మాట లంటున్నాడని ఫర్ఫిష్కా లోగడే చెప్పాడు. 'నీకు గర్వం బలిసింది. పూర్వపు సుహృద్భావం యిప్పుడు నీలో లేశమయినా లే'దని జాకోబు ఇలియూ మొఖం మీదనే అనేశాడు. ఇక గ్రెబ్రిక్ అక్కకీ వాని పైన చిన్న చూపే. ఒక సామాన్య తపాలా బంట్రోతు కూతురు - ఒళ్లు దాచు కోటానికి చాలినంత గుడ్డకే గతి లేని ఆడుది వానిని చూచి ముక్కు విరిచి మూతి ముడుచు కుంటోంది. ఇవన్నీ ఇలియూ హృదయంలో కలక వేస్తున్నై. ఇంతమందీ తన్ను

చులకన చేయడానికి గల హేతు వేమిటా అని వితర్కించుకోలేవాడు.

అయినా వానికి సోంకా యందు కలిగిన ఆసక్తి వృద్ధి అవుతూనే వుంది. ఆమె కంత అహంభావ మెందుకో, ఆవిడ యెదుట తా నేల అణగి వుంటున్నాడో ఇలియా గ్రహించలేక పోయాడు. మొదట్లో కొన్నాళ్ళ వరకు సోంకా వానితో మాట్లాడేదే కాదు. ఇలియా కది దుస్సహంగానే వుండేది. ఆమె తనవద్ద నౌకరుగా వున్నవాడి అక్కే! తనకు వినయ - విధేయత లేల చూపదని ఇలియా రోషంతో వుడికేవాడు.

ఒక రోజున సోంకా వచ్చి వెళ్ళబోతూండగా "మీరిచ్చిన పుస్తకం చదువుతున్నా" నని చెప్పాడు ఇలియా.

సోంకా వాని వేపు చూడకుండానే "ఎల్లా వుంది"దని అడిగింది.

"చాలా బాగుంది. కథానాయకుడు విచిత్ర వ్యక్తి!"

సోంకా ఇలియా వంక చూచింది. నల్లని విశాల నయనాల నతని ముఖం మీద నిల్పి "మీ రిల్లా అంటారని నాకు ముందే తెలుసులెండి" అంది.

ఈ మాటల్తో ఇలియాకు ఒళ్ళు మండింది. "నేను పల్లెటూరి గబ్బిలాయిని కదూ మరి!" అన్నాడు.

ఆమె మారు మాట్లాడలా. ఇలియా వుద్విగ్నుడయ్యాడు. సోంకా వెళ్ళి పోయింది. చాలా రోజులకు మళ్ళీ

నేను వెనకటి భావాలు ఇలియాను ముట్టడించినై. మానవు లందరి పైన వాని కసహ్య భావం కల్గింది. తన దురాగతాన్ని గూర్చీ, అందుకు పొందుతున్న శిక్షను గురించీ చింతించాడు. గతంలో కంటె ప్రస్తుత జీవిత మెంతో వ్యర్థమైనదిగా భావించాడు. కాని, "ఈ స్థితి యెన్నాళ్ళుంటుం"దని సందేహం కలిగింది. పగలూ రాత్రీ వ్యాపారంలోనే మునిగి తేలుతూండడం అసహ్య మనిపించింది. ఎవరితో నైనా మాట్లాడటాని గ్గాని, యెటైనా పోటాని గ్గాని యెసులుబాటు లేదు. ఎప్పుడూ పీఠం వేసుకొని కూర్చోటం కష్టంగా తోచింది. దుకాణదారు లందరి స్థితీ యింతే. అయితే వాళ్ళు ఒంటరిగాళ్ళు కారు. వాళ్ళకి మధ్య మధ్య తీరిక వుంటుంది. వాళ్ళకి భార్య, పిల్లలు, తల్లి, తండ్రి వుంటారు. ఇంటికి పోయి కొన్ని గంటల పాటైనా ఆనందంగా గడుపుతారు. ఇలియా జీవిత మో! పూర్తిగా వారి జీవితాలకి భిన్నం.

"నువ్వు పరమ లోభి వయ్యావు. భగవంతుడు నీకు మేలు చేయకుండుగాక!" అన్న జాకోబు మాటలు ఇలియాకు జ్ఞప్తి కొచ్చినై. నేడవి వాని హృదయంలో పోటు పొడుస్తున్నై. నిజానికి ఇలియా లుబ్ధుడు కాడు. శాంతి కలిగి సుఖంగా జీవితం వెళ్ళబుచ్చా లనేదే వాని ఆకాంక్ష. ప్రజా మన్ననకు పాత్రుడై కీర్తి పొందాలన్న అభిలాష కూడా వుంది. తన్నెవరూ హీనంగాను, అనాగరికునిగాను తలచరాదని ఇలియా తీరని వాంఛ.

ఇలియా తన భావిని గూర్చి తలపోయ సాగాడు. పోలటోవ్ హత్యా పరాధానికి శిక్ష ననుభవించక తప్పదో లేదో నని చింతించాడు. ఆ హత్య బుద్ధి పూర్వకంగా చేసింది గాదనీ, అది అనూహ్యంగా జరిగి పోయిందనీ, కాబట్టి తను శిక్షార్హుడు కాడనీ, శిక్షింపబడితే అంతకంటే దురన్యాయం వేరే ఉండదనీ భావించాడు. 'నే నా హత్యను ఉద్దేశ పూర్వకంగా చేయలే'దని కొన్ని వందల సార్లు గొణుక్కున్నాడు. "ఈ పట్టణంలో యెందరు దొంగలు, వంచకులు, హంతకులు లేరు! కాని, వాళ్ళని వేలెత్తి చూపే వాడొక్కడూ లేడే! వాళ్ళు సమాజంలో స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలు కలిగి నిరభ్యంతరంగా సంచరించుతున్నారే. వాళ్లని శిక్షించే వాడే లేడు. అపరాధిని పశ్చాత్తాప పడేట్లు చేసి బుద్ధి గరపడమే న్యాయశాస్త్ర సిద్ధాంతం. కక్షతో బాధించటం న్యాయ మెల్లా అవుతుంది?" ఇల్లా తర్క వితర్కాలు చేసి చేసి తెరపి చేసుకొని తన పతనానికి కారకులైన వారి పట్ల ప్రతీకార భావ ప్రేరితు డయ్యాడు. ఆ పళంగా పోయి పెట్రుహా కొంపను నిప్పంటించి మంటలు చెల రేగుతూండగా జనం పోగయితే "నేనే నిప్పంటించాను. పోలటోవ్‌ను చంపింది కూడ నేనే" నని బిగ్గరగా అరిచి చెప్పా లనుకున్నాడు. అప్పుడు వాళ్ళు తన్ను పట్టుకొని స్టేషనులో ఒప్పగించుతా రనీ, కోర్టులో తండ్రికి వలె తన కూ కూడ సైబీరియా ప్రవాసం విధింపబడి తీరుతుందనీ ఊహ కలిగింది. మానవ జాతిపైన వానికి కలిగిన ద్వేష

మహ్వాహం మరీ ప్రజ్వలించింది. ప్రతిహింసా భావం ప్రబలమయింది. ఆ భావోద్రేకంలో "నీ పెళ్ళాంతో నాకు రహస్య సంబంధ ముం"దని నికోడిమిచ్‌తో చెప్పి వేసూలనీ, మాషా భర్త ఆమెను నానా బాధలూ పెడుతున్నాడు కాబట్టి అతణ్ని హతమార్చి రావాలనీ అనుకున్నాడు.

ఒక్కొక్కప్పుడు రాత్రి వేళ ఒంటరిగా పక్కమీద పడుకొని త్వరలోనే భయంకర తుపాను రాబోతున్నదనీ, ఆ తాకిడికి తలుపూ — ద్వారబంధమూ, గోడలూ — పైకప్పూ కూలి పడతాయనీ సుడిగాలి తన్నెటో యెగరేసు కెళ్ళి గిరగిరా తిప్పి పార వేస్తుందనీ భావన కలిగి భీతి కొల్పేది. ఇలియా భయంచే గజ గజలాడేవాడు.

ఒక నాడు దుకాణం మూసివేసే సన్నాహంలో వృడగా పాష్కా వచ్చి "వేరా వృడాయించిం" దని చెప్పాడు.

తర్వాత కుర్చీలో కూలబడి చేతుల్లో గడ్డం ముంచుకొని బయిట్లోకి చూస్తున్నాడు. మధ్య మధ్య యీల వేస్తున్నాడు. అప్పుడు వాని ముఖంలో జీవకళే లేదు.

"ఒంటరిగానా? ఇంకెవరితో నైనానా?" అనడిగాడు ఇలియా.

"నాకా వివరాలేమీ తెలియవు. పోయి మూడు రోజులయింది,"

ఇలియా మిత్రుని వంక చూచాడు. పాషాŕ ప్రశాంత ముఖము, ధీమాగా వున్న మాటలను బట్టి వాని మనస్థితి యెట్లున్నదీ గ్రహించలేక పోయాడు. ఏదో ఒక నిశ్చయంతో గుండె రాయి చేసుకున్నాడని మాత్రం ఇలియా వూహించాడు. "ఇప్పుడేమి చెయ్యాలనుకున్నావ్" వని పాషా నడిగాడు.

పాషా నిశ్చలంగా కూచుని యీల వేయటం మాని "దాన్ని ఖూనీ చేసేస్తా" నని అతి సులువుగా చెప్పాడు.

"మళ్ళీ ఆ పిచ్చేనా!" అన్నాడు ఇలియా కోపంగా.

"నా హృదయం వదా వద లయింది ఇలియా! నే నన్నిటికి సిద్ధపడే బయల్దేరి వచ్చాను. ఇదుగో; చాకు! (చురకత్తి చూపుతూ) దీనితో వేరా పీక తెగ్గోస్తా''నని మంచినీళ్ళు తాగినట్లు లొడ లొడ చెప్పాడు.

ఇలియా వాడి చేతిలోని చాకును గబుక్కున లాక్కున్నాడు. దాన్ని లోపలికి విసిరేస్తూ "సింహం యీగమీద పడి చంపిందట. మహా వీరుడివి బయల్దేరావు!" అని పరిహసించాడు.

పాషా ఇలియా ముందుకు పోయి నుంచున్నాడు. వాడి కళ్ళు చింత నిప్పుల్లాగ వున్నై. ఒళ్లు కంపించు తోంది. ఒక క్షణమాగి మళ్ళీ కుర్చీలో కూచుని "నువ్వు ఒట్టి చవటవి!" అని సణిగాడు.

"నువ్వు మహా వీరుడివిలే."

"కాక? కత్తి లేకపోతే యేం? చేతుల్లేవూ?"

"అయితే చేసేదలచిందేదో పోయి త్వరగా కానీ" అన్నాడు ఇలియా.

"అది నా చేతికి చిక్కితేనా! పళ్ళతో పీకుతా."

"ఘన కార్యమే!"

పాష్కా కొంచెం మెత్తబడి "నాకిప్పుడు కోపం తెప్పించకు ఇలియా! విధి నన్నసలే వుడికిస్తోంది."

"తొందర పడక బాగా ఆలోచించుకోవోయ్ పిచ్చోడా!" అన్నాడు ఇలియా పాష్కా భుజం తట్టుతూ.

"రెండేళ్ళ నుంచి ఆలోచించుతూనే వున్నా. నాకంతా తెలుసు. అసలు నీతో వాగటం కూడ అనవసరం. దేవుడు నీ కన్నీ యిచ్చాడు. కాబట్టే నిమ్మళంగా నీ రెత్తినట్లున్నావు. నీకూ నాకూ సామ్య మేమిటి?"

"చాల్లే, ఇక నోరు ముయ్."

"నా ఆత్మ, హృదయం, శరీరం క్షుత్పిపాసల్తో గిలగిల కొట్టుకుంటున్నై. అదే నీకు పిచ్చిగా కనపడుతోంది."

ఇలియా భుజం యెగరేసి అన్నాడు— "మనుషుల మాటలు, వాళ్లు తమ చేతల్ని సమర్థించుకోటానికి పన్నే యుక్తులు వింటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆ పురుష శ్రేష్ఠులే స్త్రీలను పశు - పిక సమానంగా పరిగణించు

తున్నారు. స్త్రీయే ఒక్క సారి మగవానికి వ్యతిరేకంగా ప్రవర్తించినా, ఆ అబలకు అధోగతి తప్పదు. స్త్రీ కూడ మానవియే నని మగవాడు యెంచనే యెంచడు."

పాష్కా ఇలియాను చురచుర చూచి నవ్వాడు. "నే నెవర్ని? మనిషి నేనా?" అన్నాడు.

"మరి నువ్వు న్యాయంగా ప్రవర్తించ వద్దూ?"

పాష్కాకి కోపం వచ్చింది. "నీన్యాయ - ధర్మాలను నీ వద్దే వుండనీ కడుపు నిండుగా వున్నప్పుడెన్ని నీతులైనా స్ఫురిస్తై." అని పాష్కా లేచి తుఱ తుఱ వెళ్ళి పోతున్నాడు.

ఇలియా వాని నాపటానికి వెంట పడ్డాడు; కాని, పాష్కా అప్పటికే నడి బజార్లో కెళ్ళాడు. "పాష్కా! ఒక్క మాట విని పొమ్మని కేక వేశాడు; కాని; పాష్కా వెనక్కి తిరిగైనా చూడలా.

ఇలియా వుద్విగ్న హృదయంతో దుకాణంలోకి తిరిగొచ్చాడు. వాని హృదయం దహించుకొని పోతోంది. "భయంకర వ్యక్తి!" అన్న గైబ్రిక్ మాట ఇలియా చెవిని పడింది. వానికి నవ్వొచ్చింది.

"ఎవర్నండీ ఆయన చంపుతా నన్నాడు?" అనడిగాడు గైబ్రిక్.

"తన పెళ్ళాన్ని!"

గ్రైబిక్ ఏదో ఆలోచించుకొని "ఈ మధ్య మా పొరుగున వున్న ఒకామె మొగుణ్ణి చంపేశింది. ఎప్పుడూ తాగుతున్నాడని విషం పెట్టింది." అని చెప్పాడు.

"ఇల్లాంటివి నిత్యము జరుతూనే వుంటై." అన్నాడు ఇలియూ పాపాన్ని గూర్చి చింతిస్తూనే.

"నిజంగా నే చంపుతా డంటారా?"

"నీ కెందుకు పోదూ" అని ఇలియూ వాణ్ణి కసిరాడు.

గ్రైబిక్ గప్‌చిప్‌గా అవతలికి జారుకున్నాడు. "అయినాకూడా స్త్రీ-పురుషులింకా పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారే!" అన్నమాటలు వాడినోటినుంచి జారాయి.

కాస్సేపాగి "దుకాణం మూసివేసే వేళ దాటిపోయిం" దని గ్రైబిక్ ఇలియూను హెచ్చరించాడు.

ఎదురుగా వున్న మేడపై గది కిటికీలో నుంచి దీపం వెలుతురు వస్తోంది. కిటికీ అద్దాలు తళతళ లాడుతున్నై. ఇలియూ అటువేపే చూస్తున్నాడు. కిటికీ మధ్యలో పూల గుత్తొకటి వ్రేలాడుతోంది. కిటికీ రెక్కలు తెరచి నప్పుడు లోపల్నుంచి పాట విన వస్తోంది. ఆ సౌధంలో ఒకన్యాయమూర్తి వుంటున్నాడు. పేరు గ్రోమోవు. ఆయన సతి, చెల్లెలు అపురూప సుందరులు. చెల్లెల్ని చేపట్టాలని శ్రీమంతుల బిడ్డలు, అధికారుల తనయులు యెందరెందరో కాచుకుని తిరుగుతున్నారు.

నిత్యము సాయంకాలము ఆ మేషు వచ్చి - పోయే వారితో కిటకిట లాడుతూంటుంది. గ్రామోఫోను సంకీర్తనలు ఇలియూ దుకాణానికి వచ్చినప్పు డెల్లా యజమాని లుబ్ధత్వాన్ని గురించీ, వారి ఆడంగుల భోగ-విలాసాలను గురించీ చెబుతూండేవాడు. ఆ కుటుంబంలోని వారందరూ సుఖ జీవులని ఇలియూ భావించేవాడు.

వైట్రిక్ మరో దఫా హెచ్చరించిన మీదట దుకాణం మూసి వేశారు. చీకటి బాగా పడింది. అన్ని తావులా దీపాలు వెలుగుతున్నై. మామూలు వేళ దాటి పోయింది. "ఇంత కంటె వైతే నయం" అనుకున్నాడు ఇలియూ.

పాషా రూప మింకా వాని కళ్ళముం దాడుతూనే వుంది. ఆ రాత్రి మిత్రుని గురించే ఆలోచిస్తు తున్నాడు. పాషాను వేరాస చంప లేడనే నిశ్చయానికి వచ్చాడు. "అయినా నేను వేరా పక్షం వహించాల్సింది గాదు. వీళ్ళందరూ పోట్లో పడి చావనీ; నాకేం? పిల్లు తాము శాంతిగా జీవించలేరు సంగడా, పక్క వాళ్ళని కూడ శాంతిగా బ్రతక నివ్వరు" అనుకున్నాడు.

వైబిక్ టీకి నీళ్ళు కాస్తున్నాడు. బల్ల క్రింద కాళ్ళు ఊపుతూ వున్న ఇలియూ "ఈ పాటికే చాపేసి వుంటాడా?" అ నడిగాడు.

"నోరు ముయ్యి! టీ యిచ్చి, పోయి పడుకో"మని ఇలియా పురమాయించాడు.

పొయ్యి మీద నీళ్ళు పొంగుతున్నాయి. ఎగిరి బల్ల మీదకి దూకబోతున్నట్లు చిందు లేస్తోంది. ఎదురింటిలో మహా కోలాహలంగా వుంది. ఇలియా ఆలోచనామగ్నుడయి వున్నాడు. దుకాణం తలవాకిలి దగ్గ రెవరో "ఇలియా లూనెవ్ వుండేది యిక్కడేనా?" అని సన్న గొంతుతో అడిగారు.

ఇలియా నోరు తెరవక ముందే 'అవు'నంటూ గావ్రిక్ తలుపు తెరిచొచ్చి "ఆవిడ కాబో"లన్నాడు.

"ఎవరు?"

"ఇందాకటాయన భార్య."

అంతలో ఒక బక్కావిడ లోపలి కొచ్చింది. ఆమె ముఖానికి రుమాలు కప్పుకొని వుంది. ఏదో మాట చెప్పి వెళ్ళిపోతున్న దానిలా నిలబడింది.

తన కెదురు కొచ్చిన పీకలాట లని ఇలియా లోలోపల మండిపోతున్నాడు. ఆమె ఎవరో గుర్తించక పోయినా "రా, కూర్చో" మన్నాడు.

ఇలియా కంఠస్వరం కసిపెట్టి ఆ యువతి తలమీది ముసుగు తొలగించాడు. ఆమె వెరా కాదు, మాషా! ఇలియా అబ్బురపడ్డాడు. ఆమె చేసన్నతో బయటి తలుపు

మూసి యిద్దరూ వెనక గదిలోకి వెళ్ళారు. గది మధ్య నిలబడి "నువ్వు నన్ను గుర్తించనే లేదే!" అంది మాషా.

"నువ్వు ఆనవాలు పట్టలాగున్నావా మాషా! నీ ముఖం యెంత మారిపోయింది! నిన్ను గుర్తించటం చాలా కష్టం" అన్నాడు ఇలియూషా.

మాషా పూర్వపు మనోజ్ఞమూర్తిలా లేదు. ఎండి పుల్లయింది. నడుస్తుంటే తూలి పడిపోతుందేమో నన్నట్టుంది. ఇలియూషా తన చేతి ఆసరాతో ఆమెని తీసుకెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టాడు. రెప్ప వాల్చకుండా ఆమె మొహం వంక చూస్తున్నాడు." ఎక్కణ్ణుంచి వస్తున్నావు? ఇల్లా అయిపోయావేం? ఓయి దేవుడా! ఎల్లాంటి గతి పట్టింది! నిన్ను చూస్తుంటే గుండె చెరువవుతోంది మాషా!" అన్నాడు.

మాషా ఇలియూషా వంక చూచి "నిన్న బస్లో ఆయన ......" అని కంఠావరోధంతో యిక చెప్పలేక పోయింది.

ఇలియూషా హృదయం వేదనా భరిత మయింది. వెల్తురులో ఆమెని పరికించి చూచాడు. మాషా రూపం బొత్తుగా మారిపోయింది. ముఖం వాడి పాలిపోయింది. కళ్ళు నూతిలో వున్నట్టున్నై. పెదాలు యెండి బీటలువారి వున్నై. ఒంట్లో రక్తం ముచ్చుకైలేదు.

"నువ్వు సుఖంగా వున్నావా?" అనడిగాడు

''ఎన్నడూ తల నొప్పైనా యెరగను. ఆయనే నాకీ స్థితిని కల్పించాడు.''

"నీ భర్తా?"

"ఊఁ"

అంతవరకు గ్రైబిక్ మాషా పక్కనే నుంచున్నాడు. భయంతో వాడు పెదిమ కరుచుకుంటున్నాడు. ఇలియూష వాణ్ని చూచి "పోయి పడుకో" మన్నాడు.

గ్రైబిక్‌కు నిద్రపోవాలని లేదు. అక్కడి నుంచి పోయి ఆ గదికి దుకాణానికి మధ్యనున్న ద్వారాన్ని పట్టుకొని నుంచున్నాడు. మాషా నిశ్చలంగా కుర్చీలో కూర్చొనుంది. చూపు మాత్రం గది నాలుగు మూలలకు పరుగులెడుతోంది. ఇలియూష టీ తయారుచేసి కప్పు ఆమె ముందు పెట్టాడు. ఆమె నం కేమని పల్కరించాలో నాసిక పాలు పోలా.

"ఆయన నన్నన్ని విధాలా హింస పెడుతున్నాడు. ...." మాషా యిక చెప్పలేక పోయింది. కళ్ళు మూసుకొని కన్నీరు కారుస్తోంది.

"ఏడవకు మాషా! ముందు టీ తాగి నీ కథంతా నాతో చెప్పు, హృదయం తేలిక పడుతుంది" అన్నాడు ఇలియూష ఆమె ననునయించటానికి.

"నన్ను వెతుక్కుంటూ ఆయన యిక్కడికి కొస్తాడేమోనని భయంగా వుంది."

"ఇక్కడికి వస్తే తన్ని పంపుతా. నీకు భయ మొద్దు మాషా!"

"ఆయన సామాన్యుడు కాడు. అంతంత మాత్రంతో వదిలి పెట్టడు."

"ను వ్విప్పుడు వాడి వద్దనుంచే పారిపోయి వచ్చావా?"

"మరే. ఇది నాలుగోసారి. ఆయన పెడుతున్న బాధలు సహించలేక తెగించి పారిపోతున్నాను. క్రితం సారి నూతిలో పడి ప్రాణత్యాగం చేయటానికే సిద్ధపడ్డాను గాని, అంతలో ఆ దుర్మార్గుడు వచ్చి నా జుట్టు పట్టుకొని యీడ్చికెళ్లి చావబాదాడు."

తా ననుభవించిన కష్టపరంపరను తలచుకొని మాషా గజగజ లాడింది. భయంతో వెర్రిగా చూస్తోంది. తేరుకొని "ఆయన నన్ను ఎముకలు విరిగే ట్టు నిర్దాక్షిణ్యంగా కొట్టుతుంటా"డని చెప్పింది.

ఇలియా కోపోద్రిక్తుడై "నిన్ను హింస పెడుతున్నా డని కేసు పెట్టలా? శిక్ష పడేదిగా" అన్నాడు.

"కేసులు విచారించేదీ ఆయనేగా."

"నీ భర్త మేజిస్ట్రేటా?" అనడిగాడు ఇలియా ఆశ్చర్యపడుతూ.

"నా కదంతా తెలియదు. ఒక తడవ కేసు విచారించటానికని వరుసగా పదిరోజులు కోర్టు కెళ్లాడు. ఒకనాడు

కొట్టునుంచి ఆకలితో వచ్చాడు. వచ్చీ రావటంతోనే నా స్తనాల్ని గుప్పిలికల్లాగా నలిపేశాడు" అని మాషా తన గౌను గుండీ విప్పి చనుకట్టు చూపించింది. కొరికిన గంట్లు స్పష్టంగా కనపడుతున్నై.

పాషా సిగ్గికి ఇటుపూ నిలుస్తూ నీరయ్యాడు. "చెల్లీ! ఇక నీ ఒళ్లు దాచుకో" మన్నాడు మెల్లిగా.

కాని, మాషా ప్రతి అవయవాన్ని చూపుతూ "ఆ ఘటన నన్నెట్లా పిశాచిని చేసిందో చూడు!" అంది.

"ఇంతకూ వాడికా బుద్ధి యెందుకు పుట్టినట్టు?"

"తన్ను నేను ప్రేమించలేదని. అమాంతం మాటి మాటికి గొణుగుతూ నన్ను చెండుకొని తింటున్నాడు."

"నువ్వెలా పెళ్లినాటికి చిన్నపిల్లవి కావే. మరి మీ యిద్దరికీ మనసెందుకు కలవలా?"

"చిన్నప్పటినుంచి నేను నీతోను జాకోబుతోను కలసి మెలసి పెరిగేదాన్ని. నా ఒంటిమీద యెవరూ చెయ్యేసి యెరగరు. పైగా నాన్నకి బరువు తగ్గిపోతుందని ఆయన యిల్లాలిగా వుండటానికి వొప్పుకున్నాను; కాని, ఆయన నాపైన చెయ్యి వెయ్యటానికి సహించలేకపోయాను. ఆయన చేష్టలో నాకు ద్వేషము, అసహ్యం కలిగాయి. ఆయన్ను చూస్తేనే నా ఒంటిమీద చీమలూ-జెర్రులూ పాకినట్టుంటుంది."

"ఇక వినలేను. పూరాసకో మాషా!" అన్నాడు ఇలియా ఆమె ప్రశ్నాన్ని గ్రహించి.

మాషా కుర్చీలో వెనక్కి ఒరిగిలబడింది. ఆమె వక్షం మళ్ళీ అనాచ్ఛాదితంగా స్ఫురిపోయింది.

"నీ గాను నన్నుకో" గద్గదంతో మిళితమైన నిగ్రహంతో ఇలియా హెచ్చరించాడు.

"నీ ముందు నాకు సిగ్గెందుకు?" అని మాషా గుంజి పెట్టుకుంది.

అప్పు డవతలి (దుకాణంలోంచి) నుంచి పెద్దగా యేడుపు వినపడింది. ఇలియా మధ్యద్వారా దాటి వెళ్ళి గైబ్రికి వీపు తట్టుతూ "ఏడవకు" అని ఓదార్చాడు.

మాషా "ఆ అబ్బాయి ఏడుస్తున్నాడా?" అంది.

"అవును."

"చీకట్లో జడుసుకున్నాడేమోను."

"కాదు. నీ గుస్సై విని దుఃఖం ఆపుకో లేక పోయాడు."

మాషా మళ్ళీ పూర్తికాక టీ కప్పు తీసుకొని నోటి కందించింది. ఆమె చేతులు కంపిస్తున్నై. కప్పు పళ్ళతో ఢీకొని కటకట శబ్దం చేస్తోంది. ఇలియా ఆమె వెనక నిలబడి చూస్తున్నాడు.

ఇద్దరూ కొంతసేపటి వరకు మౌనంగానే వున్నారు. "ఇక యేం చేయాలని?" అని ఇలియూ కదిలించాడు.

"నే నేం చెప్పగల్ను? నన్ను మళ్లీ పట్టుకొని తీసి కెడుతారేమో" నంది మూషా భయంతో వణుకుతూ.

"నా మాట విని వాడిమీద కేసుపెట్టు. సి న్నెం దుకు బాధ పెట్టాలి? ఒకర్ని హింసించేందు కెంకొడి కధి కార మెక్కడిది?"

"ఆ దుష్టుడు తన మొదటి పెళ్లాన్నికూడ యిల్లాగే బాధించాడట. ఆవిణ్ణి మంచానికి కట్టేసి తొడపాశం పెట్టే వాడట. నే నొకనాడు గాఢ నిద్రలో వుండగా తేలు కుట్టినట్లు చురుక్కు మనగా అరుస్తూ లేచాను. తీరా చూస్తే ఆయన అగ్గిపుల్లగీసి నా శరీరాని కంటించుతున్నాడు."

ఇలియూ యెగిరి లేచి నుంచున్నాడు. "నువ్వు రే పుదయమే పోలీసు స్టేషనుకుపద. ఇన్స్పెక్టరుకు నీ గాయాలు, మచ్చలు చూపించి కేసు దాఖలు చేసి రావాలి" అని క్రోధావేశంతో బిగ్గరగా అరిచాడు.

వాని ఆవేశాన్ని చూచి మూషా గాబరా పడింది. "కేకలు పెట్టొద్దు ఇలియూ! చుట్టుపక్కలవాళ్లు వింటారు" అంది భయపడుతూ.

ఇలియూ గజగజ లాడుతున్న మూషాని మరొక సారి పరీక్షగా చూచాడు. తన చిన్ననాటి స్నేహితురాలు—చక్కని మనోజ్ఞమూర్తి అనతి కాలంలోనే అంత వికృత

రూపి కావటానికా నరపిశాచం యెట్టి హింసలు పెట్టి వుంటాడో ఇలియూ సుళువుగానే వూహించాడు.

"సరే, అంతా నేనే పూర్తి చేస్తాన్లే. ఈ వ్యవహారంలో నేను కలుగచేసుకోక తప్పదు. నువ్విక్కడే వుండు నా పక్కమీద నువ్వు పడుకో. నేను దుకాణంలో పడుకుంటాను. రేపువుదయమే......"

ఇలియూ చెబుతున్నాడుగాని, మాషా పూర్తిగా అలిసిపోయింది. వినటానిక్కూడ ఓపిక లేక "ఇక పడుకుంటా" నంది.

ఇలియూ పక్క దులిపేశాడు. మాషాని పవళింపజేసి కంబళి కప్పబోతూంటే "నాకు భయమేస్తోంది. ఒంటరిగా వుండలేను. ఆ భయంకర రూపం కళ్లముందు అట్టహాసం చేస్తుంది ఇలియూ!" అందిమాషా.

ఆమె గుండె చెదిరిందని ఇలియూ గ్రహించాడు. కుర్చీ నామె ప్రక్కకు లాక్కొని కూచున్నాడు. తదేక దృష్టితో ఆమెని చూడ సాగాడు. మాషా నిర్జీవ ప్రతిమలా పడివుంది. జాకోబు మతిష్కాలామెను గురించి చెప్పినాకూడా తానంత వరకు శ్రద్ధవహించనందుకు సిగ్గుపడ్డాడు.

"జాకోబుకు కూడ నాగతే పడుతోందని మతిష్కా చెప్పింది. పెట్రుఖా అతన్ని నానా హింసలు పెడుతున్నాడట. ఇక మా కర్మ మింతేనా?" అనడిగింది మాషా.

"అల్లాంటి తండ్రుల్ని దేశాన్నుంచి తరిమెయ్యాలి. మీయిద్దరి అబ్బలూ పశువులే" నన్నాడు ఇలియూ కోపంతో

న్నాతండ్రి దుర్బల హృదయుడు. ఆయన్నేమీ అన కూడ" దన్నది మాషా.

"పిల్లల్ని పెంచి పోషించలేని వా ళ్లసలు సంతానా న్నెందుకు కనాలి?"

ప్రక్క యింట్లో యువకుడు పాడుతున్నాడు. ఆ పాట కిటికీ గుండా వినపడుతోంది."....

"నాకు నిద్రవస్తోంది... ఇక్కడ ఎంత శాంతిగా వుంది! జనం యెంత సుఖంగా వున్నారు! ఎవరో పాడుకుంటున్నా" రని మాషా కన్ను మూసింది.

"సామాజిక రీతి-రివాజులివే. ఒకరి చర్మం ఒలుచబడు తూంటే యింకొకడు పాటలో తన్మయుడవుతుంటాడు."

ఇలియా యిట్లనుకుంటూండగా పాటకుడు స్వరం మార్చాడు. ఆ రాగం ఇలియాకి వెక్కసంగా వుంది. లేచెళ్లి కిటికీ రెక్కలు మూసి వేశాడు. ఆ ధ్వనికి మాషా వులిక్కి పడి కళ్లు తెరిచింది. "ఎవరు? నాకోసం వచ్చార్రా?" అనడిగింది.

"ఎవరూ లేరు. నేనే కిటికీ మూశాను,"

"నువ్విక్కడ్నుంచి వెళ్లిపోతావా?"

"వెళ్లను. నీకేమీ భయం లేదు, పడుకో" మని ఇలియా ఆమెకి ధైర్యం చెప్పాడు.

మాషా ఒత్తిగిలి పడుకొని నిద్రపోయింది. ఇలియా కాలు కదిపినా, దగ్గినా మాషా అదిరిపడి లేచి "వెళ్లిపోతు

నా్నవా?" అనో, లేక ఇలియా చెయ్యి గట్టిగా పట్టుకొని "నాకోసం వచ్చిపడ్డారా!" అనో భీతిని వెళ్లబుచ్చేది.

ఇలియా ఆమె ప్రక్కనే కూర్చొని తానామెకే విధంగా సహాయం చేయాలా అని ఆలోచించుకుంటున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేసేదాక మాషా నక్కడినుంచి కదల నివ్వరాదనీ, ఈ వ్యవహారంలో నికోడిమిచ్ సలహా తీసుకోవాలనీ నిశ్చయించుకున్నాడు.

పాటయింకా వినపడుతూనేవుంది. ఇలియా హృదయం నిరాశతో నిండివుంది. బయటికిపోయి అటూ యిటూ రాళ్లు గిరాటు వేద్దామా లేక, తుపాకితో ఫైర్ చేద్దామా అనుకున్నాడు. 'అప్పుడెంతో హుషారుగా వుంటుంది! గుండు దెబ్బలు తిన్న జనం రక్తం వరదలై పారుతూంటే కంగారుతో పరుగు తీస్తారు. అప్పుడీ "వెధవ గల్లంతు; పాటలు యెగిరి పోతా" యని తలచుకొని ఒక క్షణం ఆనంద పరవశుడయ్యాడు. 'ఏమిటీ పాటలు? అందులోవున్న మజా యేమిటో? వీళ్లకు తమ పక్కనే భగవంతుని సృష్టిలోని ఒక అమూల్యరత్నం స్వజాతి చేతుల్లో నలిపివేయబడి జీవచ్ఛవంలాగా పడి వుందని తెలియదు. ఎవరేమైపోతే యెవరికేం?' అనుకున్నాడు ఇలియా తనలో.

మాషా పలవరిస్తోంది. శరీరమంతా భగ్గుమని మండుతూన్నట్టు మూలుగుతూ పక్క మీద దొర్లుతోంది. కంబళీని కాళ్లతో తన్నేసి చేతులు యెడంగా పెట్టి, నోరు సగం తెరచి పడుంది. ఆమెను మరణ మాసన్నమైనట్టే భావించాడు

ఇలియా. అనుమానంతో లేచి ఆమెపైకి వొంగిచూచాడు. శ్వాస ఆడుతున్న ధ్వని విని ధైర్యం కలిగింది. మళ్లీ కంబళి కప్పి కిటికీదగ్గరకుపోయి గ్రోమోవ్ సౌధం కేసి చూస్తూ నుంచున్నాడు. అక్కడింకా కోలాహలంగానే వుంది. కిటికీల గుండా కనపడుతున్న సుందరాంగుల సిల్కుదుస్తుల నిగనిగలకు, హారాలు - ఆభరణాల తళతళలకు ఇలియా కళ్ళు జిగేలుమన్నై. అక్కడ కొంతసేపక్రితం ఆ దృశ్యాన్ని తిలకించుతూ నుంచున్నాడు. జడ్జిగారి చెల్లెలు జావళీ పాడుతోంది. మధ్య మధ్య యికయికలు పకపకలు విన్పిస్తున్నై.

ఇలియా తిరిగి మాషా మంచం దరికి వెళ్లాడు. ఆమెని చూస్తుంటే వాని కనేక తలపులు కలుగుతున్నై. "మాషాని చూచి లాసినా యేమనుకుంటుంది? నా పరిచితులేమనుకుంటారు?" అనుకున్నాడు. మాషా కలవరింతలు, యెదుటింటి సంగీతము, కేరింతలు వానిని వ్యాకుల పరిచాయి. కునికిపాట్లు రా సాగినయి. రెప్పలు వాలుతున్నై. ఇలియా యిక నిద్ర నాపలేక మంచందరినే నేలమీద కోటుపరుచుకొని మేను వాల్చాడు. కలతనిద్రలో మాషా చనిపోయినట్లూ, శవం చుట్టూ ఆడవాళ్లు చేరి శోకాలు పెడుతున్నట్లూ, వాళ్లొకసారి విలపిస్తూ మరొకసారి నవ్వుతున్నట్లూ కలగన్నాడు. తర్వాత సావెలు దిమ్మమీద సుత్తితో కొడుతున్నట్లూ; యింకేవన్ మిద్దెమీద పచారుచేస్తూ తన్ను పిలిచినట్లూ, తాను లేవబోయి కాళ్లూ చేతూలూ బంధింపబడి వుంటం వల్ల కదల్లేకపోయినట్లూ యింకో కలవచ్చింది.

27

"ఇలియా! ఇక లెగవోయ్!"

ఇలియా మెల్లిగా కళ్ళువిప్పి చూచాడు. పక్కన పాషా కూచొని వున్నాడు. ఉషఃకాంతులు అప్పు డప్పుడే కిటికీగుండా లోపలికొచ్చి పడుతున్నై. ఇలియా మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

"నన్ను చూచికూడ కళ్ళుమూస్తావేంరా? లే, లె మ్మన్నాడు పాషా.

వాడి గొంతు గద్గదికమైవుంది. జుట్టు చెదరివుంది. ఇలియా కంగారుగా లేచి కూచున్నాడు. "ఏమిటి విశేషం?" అనడిగాడు.

"ఆమెను పట్టుకున్నారు."

"ఎవర్ని? వేరానే! ఎక్కడుంది?"

"జైల్లో వుంది. నిన్న వుదయం పట్టుకున్నారు."

"ఎందుకు పట్టుకున్నా" రని ఇలియా ఆతృతగా అడిగాడు.

వారి మాటల సవ్వడితో మాషా లేచి కూచుంది. పాషా వాలకంచూచి ఆ ముగ్ధ భీతుగొన్నది. గైబ్రిక్ మధ్య ద్వారంవద్ద నిలబడి చూస్తున్నాడు.

"వేరామీద చోరీనేరం మోపారు. నిన్నరాత్రి యెవడో వర్తకుడివద్ద ఆరొందల్ల రూపాయల నగదు, డైరీ, చెక్కుబుక్కు కొట్టేసిందట!"

"ఏమిటీ! నువ్వు చెప్పేది నిజమేనా?" ఇలియా కలత చెందిన ట్టడిగాడు.

"సోదాలో అవన్నీ ఆమెవద్ద దొరికాయట. అప్పుడు నేనూ పోలీసు ఇన్స్పెక్టరుకు ఒక లెంపకాయ కొట్టిందట కూడాను."

"అంతేలే. పట్టుబడినాక యెన్ని నేరాలైనా మోపుతారు."

మాషానన్న "నేను జైలులో నిర్బంధించబడితే!" అనుకుంది మెల్లిగా. పాషా, మాషా వేపొకసారీ, ఇలియా వొకసారీ చూచాడు.

"నువ్వామెను గుర్తించనే లేదా? మన ఫర్‌ఫిషాకా సంతురోయ్! నేనామె సంగతిని నీతో చెప్పటమే మరిచాను" అన్నాడు ఇలియా.

మాషా పాషా స్నానవాలు పట్టింది. వాడి వంక చూచి నవ్వింది. పాషా ఇలియా అన్నదానికి "ఆఁ, జ్ఞాపకం వచ్చింది!" అని ఆపిడ సంగతి తన కెందుకన్నట్లు ముఖం పక్కకి తిప్పుకున్నాడు. మళ్లీ తన సోద ప్రారంభించాడు. "వేరా ఆ పని నాకోసమే చేసిందేమో! ఇదివరకల్లా చేస్తానని అప్పుడప్పుడు చెప్తూండేది."

...కి 'ఎవరికోసం చేసినా బకటే. ఇక ఆమె సుఖపడే రోజులు గతించాయనుకోవాలి.'' ఇలియూ నిద్రమత్తు పూర్తిగా వదల్లా. కళ్ళు మూత పడుతూనే వున్నై. కళ్ళు నలుపుకుంటూ "ఇదంతా మంచికేనా" అన్నాడు.

"వేరా నేను చెప్పినట్టు వినందే?'

"వినకపోతే నువ్వేం చెయ్యాల్సింది?"

"నా కామెయందు ప్రేమ. వృంగోయ్! వదిలి పెట్టలేకపోయాను."

"నీ వృత్తత ప్రేమవల్ల ప్రయోజన మేమిటి? నువ్వు వేరాని పరిపోషించ లేకపోయావు."

"అదీ నిజమే."

ఇలియూను మళ్లీ విషాద మావరించింది. పావ్కా... మాటలు... దుస్థితికి ... తలిసి... అది ... కోపంగా మారింది. ఇలియూ ఆ కోపాన్ని పావ్కా పైకి త్రిప్పి "ప్రతి వ్యక్తికీ సుఖపడాలనే వాంఛ వుంటుంది. ఆమెకూ అట్టి అభిలాషే వుంది; కాని, నీ వామె చెప్పినట్టు నీతో పాటు దరిద్రావస్థలో నే వుంచాలనుకున్నావు. ఆమె యీ వెత లన్నిటికీ కారణభూతుడవు నువ్వే'' నన్నాడు.

"నే నంతకంటే యేం చెయ్యగలను చెప్పు?" పావ్కా నిమ్మళంగా అన్నాడు. వాడి జవాబు ఇలియూను నిరుత్తరుని గావించింది. ఆలోచనలో పడ్డాడు. "ఆమెని నా చేతుల్తో చంపేసినా బాగుండేది!" అన్నాడు పావ్కా నిరాశా సంతప్త హృదయంతో.

"దుకాణం తెరువనా?" గ్రైబిక్ మెల్లిగా అడిగాడు.

"దుకాణానికి నిప్పెట్టు. ఈ గొడవల్లో బేరం యేమి సాగుతుంది?" అని ఇలియూ విసుక్కున్నాడు.

"నా మూలంగా నీ వ్యాపారానికి యిబ్బందేమో!" నన్నాడు పాష్కా.

ఇలియూ మోకాళ్ళమీద చేతులుపెట్టుకొని నేల మీద పాదమాడించుతూ "మీలో యెవరివల్లా నాకిబ్బంది లేదు. పైనుంచి యేదో అజ్ఞాతశక్తి మనందర్నీ ఆడిస్తోంది. అదే మనల్ని సరైన మార్గంలోకి రానివ్వటంలేదు. మన తప్పువల్లగాని, మరెందువల్లగాని మనం శాంతిగా బ్రతకడం కల్ల" అన్నాడు.

తర్వాత ఇలియూ అటూ యిటూ చూచాడు. మాషా వుదాసీనంగా వుంది. గ్రైబిక్ దుకాణంలో నిలబడున్నాడు. బజారు నిశ్శబ్దంగా వుంది. ఇలియూ మళ్లీ మొదలెట్టాడు— "జీవితము నా నాటికి దుస్సహ మవుతోంది. ఏ సావకాశమూ లేదు. అనుమానము, జంజాటము యెవర్నీ నిశ్చింతగా వుండనివ్వవు. ముందుకు పోదామన్నా దారీ— తెన్నూ కసపడదు. అంతటా కృత్రిమ విలాసమే. ప్రతిదీ చిక్కులు కల్పించటానికి సిద్ధంగా వుంటుంది. పాడుకొనే వాళ్లని చూచి వాళ్లు సుఖంగా వున్నా రనుకుంటాము. మనస్సు కలత చెందినప్పుడా పాటే హృదయానికి శూలమై గుచ్చుకొంటుంది."

"ఏమిటీ గొడవ?" అన్నాడు పాషా.

"ఏం చెప్పను! ఎటుచూచినా అంధకార బంధురంగా వుంది. మనం సుఖమార్గం కోసం దేవులాడుతున్నాంగాని, యెక్కడా వెలుతురే కన్పించటం లేదు." అని ఆగిపోయాడు.

"అయితే యేమంటావు?" అన్నాడు పాషా.

"నే నా పని నుద్దేశ పూర్వకంగా చెయ్యనే లే"దని ఇలియా అసందర్భంగా గొణిగాడు.

"ఏమో నీ గొడవేగాని........" అని పాషా యేమో అనబోతూంటే ఇలియా మధ్యలో "మరి నువ్వో? నీ సొద యెవర్ని గురించి? ఆ వేరాని గూర్చేగా. ఆమె యెవరిది? నీదా? నాదా? ప్రతివాడు తన బాధనే వెళ్ళబోసుకొని యేడుస్తాడు, మూల్గుతాడు, అరుస్తాడు. నేను నా సొదనే చెప్పటంలా. అసలందరి స్థితి యింతే. అందరూ నన్ను వేధించే వాళ్ళే" నన్నాడు.

"అయితే నీ కెందుకు బాధ? నేను పోతున్నాన్లే." అని పాషా లేచాడు.

"నా మీద కోపమెందుకోయ్! నన్ను సాంతం చెప్పనివ్వు. నేను మాత్రం తక్కువ పీడించబడ్డానూ! స్వయంగా శోకసంతప్త హృదయుడైతేనే గాని మరొకని వేదనని గ్రహించలేడు" అని ఇలియా దీనంగా చెప్పి వూరుకున్నాడు.

"నాలో చైతన్యం లుప్తమై పోయింది. ఎవడో నా బుర్రమీద బడితెతో బాదటంవల్ల మెదడు బయటికి కక్కి నట్టుగా వుంది. వేరాను గూర్చిన చింత నన్ను వదలకుండా వుంది. ఏమి చెయ్యటానికీ తోచటం లే"దన్నాడు పాష్కా.

"పాష్కా! నువ్వేమీ చేయనక్కర్లా. వేరా ధ్యాస మాత్రం వదిలి పెట్టు. ఆమె దగ్గర చోరీ ఆస్తి దొరికింది; కాబట్టి ఆమె కెల్లాగూ శిక్ష తప్పదు."

పాష్కా మళ్లీ కూచున్నాడు. "ఆమె ఆ దొంగ తనం నాకోసమే చేసిందని నే వెళ్లి చెప్పితే వేరాని వదిలి పెడ్తారేమో?" అన్నాడు.

"నువెక్కడి నుంచైనా దిగొచ్చిన దొరవా ఏం? ఆమెతోపాటు నువ్వుకూడ నేరస్థుడి వవుతావు. పిచ్చి భ్రమలో పడక జాగ్రత్తగా వుండు" మని మాషా నుద్దేశించి "మేము పోయి దుకాణంలో కూర్చుంటాము. నువ్వు మొహం కడుక్కొని టీ తయారుచెయ్యి" మని స్టౌ, తేయాకు వగైరా సామగ్రి చూపెట్టాడు.

"సరే గాని. నా గతేమిటి? నే నెక్కడికి పోవాలి?" అని మాషా అడిగింది.

"ఎక్కడికీ పోవద్దు. వ్యవహారం తేలేవరకు యిక్కడే వుండు. ఇది నీ యిల్లే ననుకో. నీ కెక్కడ శాంతి లభిస్తే అదే నీ కి"ల్లని చెప్పి ఇలియా దుకాణంలోకి వెళ్ళాడు.

అక్కడికిపోయి కూర్చున్న తర్వాత "మాషా చచ్చేదానిలాగుందే! నీ దగ్గ రెందు కుంది?" అనడిగాడు పాషా.

ఇలియా ఆమె విషాదగాథను సంక్షేపంగా చెప్పాడు. తనతోపాటు మరోవ్యక్తి కూడ దురవస్థలో వున్నందుకు పాషా తృప్తి చెందాడు. ఇలియా ఆశ్చర్యంగా వాని మోము నవలోకించ సాగాడు. పాషా నవ్వి "ఆ దురాత్ముడు.........."అని మాషాభర్త నుద్దేశించి యేమో తిట్టాడు.

ఇలియా దుకాణంలో బీరువాలో అమర్చిన వస్తువుల్ని చూస్తూ అన్నాడు—"మన జీవితాలు మోసము, వంచన, తాగుడు, వ్యభిచారాది అవలక్షణాలతో నిండి వున్నై. ఏ ఒక్కని మనస్సు అంతకంటె సత్పథం వేపుకు మొగ్గటంలేదు. అందరి హృదయాలు ఒకే రంగు పూత పెట్టబడిన ట్లున్నై. ఇష్టమున్నా లేకపోయినా తప్పని సరిగా మన మిల్లాగే జీవించవలసి వస్తోంది. మనకెక్కడా రక్షణ లేదు; ఆశ్రియ మసలే లభించదు. ఎప్పుడో ఒకప్పుడీ వ్యాపారం మీద రోతపుట్టి నేనీ దుకాణాన్ని వదిలేస్తానన్నావు జ్ఞాపకం వుందా? నీ జోస్యం యదార్థమే అయింది. నాకీ దుకాణంమీద నిజంగానే యేవగింపు కలిగింది. రాత్రిం బగళ్లు కళ్లుతూ యిందులో పడి వున్నందుకు నాకు లభించే దేమిటి? ప్రపంచంలోని శోక-దుఃఖాలకు నా స్వేచ్ఛా - స్వాతంత్ర్యాలను అమ్ముకున్నాను. ఇక్కడి

నుంచి ఒక్క నిమిషమైనా కదలటానికి వీల్లేదు. ఈ రొంపిలో కాలు పెట్టకముందు స్వేచ్ఛగా తిరుగుతూండేవాణ్ణి. పట్టణం బయటికి పోయి ప్రకృతి సౌందర్య శోభను తిలకించుతూ, మందమారుతాన్ని సేవిస్తూ పైమరచేవాడిని. ఇప్పుడో! కూపస్థ మండూకంలాగా యిందులో పడి కొట్టుకుంటున్నాను."

"నువ్వు వేరా నీ దుకాణంలో సహాయునిగా వుంచుకొని వుంటే బాగుండేదేమో!"

ఇలియా పాష్కావంక చూచి మౌనం వహించాడు. మాషా "టీ తయారైంది, రం"డని పిల్చింది.

ముగ్గురూ టీ తాగటానికి కూచున్నారు. ఎవరూ మాట్లాడటం లేదు. అప్పటికి యెండ బాగా వచ్చింది. అది వసంత ఋతువు. ప్రకృతి సౌందర్యం ఆహ్లాదాన్ని కలుగజేస్తోంది; అయినా అగదిలో మాత్రం శోక దేవత తాండవమాడుతోంది.

"మనం శవం ముందు కూచున్నట్టుగా వుం"దన్నాడు ఇలియా నిస్తబ్ధతను భంగపరుస్తూ.

"వేరా శవాన్నా?" అనడిగాడు పాష్కా. వాని హృదయం తూట్లు పడినట్టుంది. కాళ్ళు-చేతు లాడటం లేదు. స్వరం మందగించింది.

"పాష్కా ధైర్యంగా వుండవోయ్. ఈ విధంగా బేలు పడి ప్రయోజన మేముంది?" అన్నాడు ఇలియా.

"అంతరాత్మ నన్ను ధిక్కరిస్తోంది. నా మూలంగానే ఆమె వెతల పాలయింది కనక ధ్యానం నా హృదయంలో పదే పదే రేగుతోంది."

"అందులో నిజం లేకపోలేదులే"

ఈ మాట విని పన్కా తిరస్కార సూచకంగా ఇలియూవంక చూడసాగాడు.

"ఎందుకలా చూస్తావ్?" అన్నాడు ఇలియూ.

"నువ్వు చాలా నిష్ఠురంగా మాట్లాడుతున్నావు. నా యందు నీకే మాత్రం జాలి లేదు."

"నేను దయామయుడ్నని చెప్పలేదే. నేను దాగుడనుగా ఎందుకు నటించాలి? ఎవరైనా యెప్పుడుగాని నా కోసం జాలిపడిన వారున్నారా? ఇంతవరకు నా జీవితంలో నన్ను హృదయపూర్వకంగా ప్రేమించింది ఒకేఒక వ్యక్తి; కాని, ఆ మనిషి వెలయాలు! తల్లిదండ్రులు వాళ్ళ దయా నా రక్తాన్ని పీల్చుకుతిన్న వాళ్ళే. అటువంటి వాళ్ళకోసం నే నెందుకు జాలి పడాలి? ముఖప్రీతికి యిచ్చకాలాడటం నాకు చేతకాదు."

ఇలియూ ముఖం యెర్రబడింది. కూర్చున్న చోటు నుంచి లేచి మధ్య ద్వారాన్ని సమీపించాడు. వాని హృదయం అల్లకల్లోలంగా వుంది. బిగ్గరగా అరవాలనిపించింది. కుర్చీలు, బల్లలు, తలుపులు, గోడలు విరగదన్ని కూలద్రోయాలనిపించింది ఇలియూకి.

మాషా వాని మానసి కాందోళనను గ్రహించి గాబరాపడింది. చిన్నపిల్లవలె రోదన మారంభించింది. ఏడుస్తూనే "నే నిప్పుడే వెళ్లిపోతాను. నన్నిక పోని" మ్మంది ఇలియాంతో.

ఇలియా తన విషయంలో అందరికీ అసంతృప్తిగానే వుందని తెలుసుకున్నాడు. "ఏడుస్తా వెందుకు? నేను నిన్నేమీ అన్లేదే! వెళ్తా నంటున్నావు, యెక్కడికి? ఎవరూ యెక్కడికీ పో నక్కరలేదు. నేనే వెళ్లిపోతాను. నీతో పాటు పావెల్ కూడ యిక్కడే వుంటాడు. (గైబ్రికె వేపు చూచి) లాసినా వస్తే........."అని చెప్పి దుకాణంలో అడుగు పెడుతున్న సోంకా కనపడటంతో ఆపివేశాడు. "నమస్తే!" అని ఆమెకు స్వాగతం చెప్పాడు.

సోంకా వస్తూనే లోపలివారిని చూచింది. కొత్తవారిని వింతగా చూస్తూ కాస్సేపటి వరకల్లె నిలబడుండి ఇలియాకి ప్రతివందనం చేయాలన్న సంగతే మర్చిపోయింది. మొహం మురమురలాడుతోంది. మెల్లగా తమ్ముణ్ని దగ్గరకు రమ్మని పిల్చింది.

ఇలియాకు ఒళ్లు మండింది. దగ్ధహృదయంతో "ఏయ్! పడుచుపిల్లా! వందనానికి ప్రతినమస్కారం చేయకుండా అవమానించటం సముచితమేనా?" అని అడిగేశాడు.

ఆ మత్తకాసిని తలెత్తి చూచింది. మొహం చిట్లించి పెదవు కరచుకుంటూ ఇలియా నెగాదిగా చూచింది. గైబ్రి

క్లెను కూడ రోషం వచ్చింది. వాడు ఇలియా వైపు చుర చుర చూస్తున్నాడు.

"ఇక్కడ దొంగలు, తాగుబోతులు, రౌడీలు లేరు. నిన్నితరులు గౌరవించినట్లె నువ్వెదుటివారికి మర్యాద చూపాలి. విద్య, సభ్యతలు మనకు నేర్పేదిదే" నన్నాడు ఇలియా.

"నీకింత అహంభావం కూడ దక్కా!" అంటూ గైబ్రిక్ సోంకాదరికి పోయి చేయి పట్టుకున్నాడు.

ఒక్కసారిగా నిశ్శబ్దత అలముకుంది. ఇలియా సోంకా లిద్దరూ ద్వేషభావంతో పరస్పరావలోకనం చేసుకొంటున్నారు. మధ్య యీ మిడిసేల నేమి టనుకుంటూ మాషా ఒకమూల కొదిగింది. పావ్కా కళ్ళు నలుపుకుంటున్నాడు.

"సోంకా! మాట్లాడవేం? ఆయన నిన్నవమానించా లనుకొంటున్నారనా నీ తలంపు? (నవ్వు తెచ్చుకొని) వీరందరూ చాల మర్యాదస్తులు, తెలిసిందా?" అన్నాడు మళ్ళీ గైబ్రిక్.

సోంకా గైబ్రిక్ చొక్కా పట్టుకొని లాగి, ఇలియా వేపు తిరిగి "మీ వుద్దేశమేమి" టని అడిగింది.

"ఏమీ లేదు. కేవలం......" అని వాక్యం పూర్తి చేయక ముందే మనస్సులో నేమి తట్టిందో సోంకా చెంతను పోయి "మేము ముగ్గురము విద్యాహీనులమే! నువ్వే చదువుకొన్న దానివి" అన్నాడు.

ఏమేమో వెళ్ళగక్కాలని ప్రారంభించాడు; కాని ఆమె నిశిత దృష్టికి చల్లబడ్డాడు. కోపం అదృశ్యమయింది. సోంకా రెప్ప వాల్చకుండా చూస్తోంది. గ్రబిక్ చేతిని గట్టిగా పట్టుకొనే వుంది. ఆమె ముఖ భంగిమను గాంచి ఇలియా తలవూపుకున్నాడు. "నేను చెప్పవలసింది చాలా వుంది. మీరు శ్రమ అనుకోకుండా కాస్సేపు కూర్చుంటే బాగుంటుంది. లోపలి గదిలోకి రండి" అన్న ఇలియా అతి వినయంగా చెప్పాడు.

సోంకా గబగబా గదిలోకి వెళ్ళింది. ఇలియా కుర్చీ చూపించాడు. ఆమె కూర్చున్నది. సాషా చల్లగా దుకాణంలోకి జారాడు. మాషా ఒక మూలగా నుంచొనుంది. ఇలియా సోంకా కెదురుగా నిలబడ్డాడు; కాని, మాట్లాడేందుకు సాహసించలేక పోతున్నాడు.

"మీరు చెప్పదలచిన దేదో చెప్పండి" అంది సోంకా.

"అదిగో, ఆ మూలనున్న తాతకి కర్కటవునగు ఒక వృద్ధునికి అంటగట్టబడింది. వాడు దీనిని నిత్యము పీక్కొని తింటున్నాడు. ఒళ్ళంతా హరాయించేశాడు. ఆ యాతన పడలేక పారిపోయి వచ్చింది. మీకిది తప్పుగా తోచవచ్చు కాని, ఏం చేస్తుంది చెప్పండి!"

ఇలియా మాషా దీన చరిత్రమంతా సోంకా కెరింగించాడు. చివరకు తన ప్రశ్నలు చెప్పాలనుకున్నాడు; కాని, వాన్నికంటే తన నోట మిటాయించుండానే సోంకా ఇల్లా చెప్పింది—"నేను మీ అభిప్రాయాన్ని గ్రహించాను.

ముందు మీ రామెను డాక్టరుకు చూపించవలసి వుంటుంది. డాక్టరీమెను పరీక్షించి ధృవపత్రిక నిస్తాడు. నాకు పరిచితుడైన డాక్టరొకాయన వున్నాడు. మీ కిష్టమైతే నే నీమె నిప్పుడే తీసుకెళ్తాను. ఆయన యిప్పు డింటివద్దనే వుంటారు."

ఈ మాటలు చెప్పుతూంటే సోంకా ముఖం గాంభీర్యత దాల్చి వుంది. ఆమె నుదుట్లో జాలీ, ఔదార్యము యిమిడి వున్నై. ఇలియా విస్మయంగా ఆమె నవలోకించుతున్నాడు. అప్పుడు వానికి సోంకా మాషాలకు పరిచయం చెయ్యాలనైనా తోచలా.

సోంకా స్వతంత్రించి మాషావద్ద కెళ్ళింది. ఆమె కన్నీరు కార్చుతూ వుండటం చూచి "ఏడవకమ్మా! డాక్టరు చాలా మంచివాడు. నిన్ను పరీక్షించి నీ దెబ్బలకు ఋజుపత్రిక నిస్తాడు. మళ్ళీ నేను తీసుకొచ్చి దిగబెడుతా" నని సోంకా నానునయంగా మాషా భుజం మీద చెయ్యేసింది. ఆ హతభాగినిని తన వద్దకు లాక్కోవా లనుకున్నది.

కాని మాషా కెవ్వున కేకపెట్టి వెనక్కితగ్గి "అక్కడ వుండు వుం" దని చెప్పింది.

ఇలియా మ్రాన్పడి చూస్తున్నాడు.

"పాపం! ఆ దుష్టుడెంత కఠిన హృదయుడో!" నని సోంకా విచారాన్ని వెలిబుచ్చింది.

ఇలియా ఆవేశంతో "ఇది మా జీవితాలకు వుదాహరణ మాత్రమే. ఇప్పుడు మరొక నిర్భాగ్యునితో కూడ

మీకు పరిచయం చేస్తాను. అతని జీవితం కూడా సాక్షిగా లేదు" అని పాష్కాను పిలిచాడు. పాష్కా మెదలకుండా వచ్చి కరస్పర్శను చేయి జాచాడు.

"మీరు మరి కొంచెం సేపు ఓపిక పట్టి వీని కథకూడ వినం" డన్నాడు ఇలియా.

సోంకా పాష్కా చేయి వదలి వాని ముఖంలోకి చూడసాగింది. ఇలియా పాష్కా వేరాలను గూర్చి కొంత చెప్పాడు. పాష్కాని ప్రశంసించుతూ "ఈయన గొప్ప కవి కూడాను. అయితే యేం లాభం? సంసారం చిక్కులలో పడటం వల్ల కవితాధార కట్టడి పోయింది. ఇతడు వేశ్యా సంపర్కం కలిగి వున్నాడని హీనంగా చూడరనుకుంటాను. మంచి-చెడ్డలు కలిసే వుంటాయి కదూ!"

"అవును, నిజమే" నంది సోంకా. ఒక క్షణమాగి ఆమె పాష్కానుద్దేశించి "మీరు వ్యాకులపడితే ప్రయోజనం లేదు. వెంటనే ఆమె తరఫున ఒక న్యాయవాదిని యేర్పాటు చెయ్యండి. సమర్థుడైన వకీలును నియమించి ఆమె కొరకు బాగా వాదించేటట్లు చూడాలి. నేను మాట్లాడి యేర్పాటు చేస్తాలెండి. ఆమె తప్పకుండా విడుదల కావచ్చు" నన్నది.

"ఇదివరకు ముక్కూ-మొహం ఎరుగని నాకు మీరీ విధంగా సహాయ పడుతున్నందుకు యెంతైనా కృతజ్ఞుణ్ణి. మీ యీ ప్రయత్నం ఫలిస్తుందన్న ఆశ నాకే మాత్రం లేదు; అయినా ప్రస్తుతం మీరు చెప్పినట్లు చెయ్యటంకంటె గత్యంతరం లేదులెండి" అన్నాడు పాష్కా నమ్రభావంతో.

"సాయంత్రం యేడు గంటలకు నన్ను కలుసుకోండి. గైబ్రిక్ మిమ్మల్ని మాయింటికి తీసుకొస్తాడు."

"మీ కింకొకసారి నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు."

"అవన్నీ అనవుసరం. మీరు హుషారుగా వుండండి."

"మీ వుపకారానికి కృతజ్ఞత తెలుపకుండా యెలా వుండగలను?"

"అందరము పరస్పరసహాయం చేసుకోవలసిందేగా" అని సోంకా చెపుతూండగా గైబ్రిక్ తన సోదరి నుద్దేశించి "నువ్వు మాటల ధోరణిలో వేళ మర్చిపోతావు. ఇప్పుడెన్ని గంటలయిందో చూచావా?" అని హెచ్చరించాడు.

"చెల్లీ! వెళ్దాం రా" అని సోంకా మాషాను పిల్చింది.

"బయటికి వచ్చేందుకు తగిన దుస్తులైనా నా వద్ద లేవని మాషా బిక్కమొగంతో చెప్పింది.

"పర్వాలేదులే రావమ్మా! ఆపళంగా రా, పోదాము, (పాషాతో) మీరు సాయంకాలం తప్పక వస్తారు కదూ?" అన్నది సోంకా.

బయల్దేరేటప్పుడు సోంకా ఇలియాను నమస్కరిస్తూ అంది—"ఇందాక నేను మీకు ప్రతి నమస్కరించి వుండవలసింది. నేను చేసినది అనుచితమే. మీరు నన్ను క్షమించాలి."

ఆమె సిగ్గుతో తల వంచుకున్నది. ఇలియా యేదో అజ్ఞాతభావ ప్రేరితుడై "నేనూ లజ్జపడుతున్నాను. అప్పుడు నన్ను మీరవజ్ఞ చేశారన్న తలంపుతో చాల పరుషంగా మాట్లాడాను" అన్నాడు.

"మీ స్వాభిమానం ప్రశంసార్హమైనది. అన్యుల తిరస్కారాన్ని సహించలేక పోవడం తప్పు కాదు. మీ వంటి వారితో యింతసేపు మాట్లాడే సదవకాశం లభించినందుకు నాకానందంగా వుంది" అని సోంకా వెళ్ళడానికాయత్త మయింది.

ఇలియా మోము వికసించింది. సోంకా మాషాని తోడ్కొని వెళ్ళిపోయింది. చెలికాండ్రిద్దరు మిగిలిపోయారు. వాళ్ళిద్దరూ సోంకాను గురించే లోలోపల ఆలోచించుకొంటున్నారు. సోంకా తలబిరుసు తగ్గించుకొని చక్కగా కలిసిమెలసి మాట్లాడిందని ఇలియా సంతృప్తి చెందాడు. "మీ అక్క బలే చిత్రమైన మనిషోయ్!" అన్నాడు ఇలియా గ్రైబ్రిక్‌తో.

"ఇంతకూ యివాళ దుకాణం తెరిచే వుంటావా లేదా?" అనడిగాడు గ్రైబ్రిక్.

"ఇవాల్టికి సెలవే లే. సరదాగా తిరిగొస్తాను."

"నేను స్టేషనుకు పోయి పీట్రైతే వేరాను చూచి మాట్లాడి వస్తా" నని పాష్కా లేచాడు.

"సరే, పోయి ర"మ్మని ఇలియాకూడ లేచి బయటికి వెళ్ళాడు.

28

ఇలియా చాలా రోజులకు మళ్లీ నేడు దుకాణం విడిచి బయల్దేరాడు. నడుస్తున్నాడేగాని మనసులో సోంకాను గురించే ఆలోచిస్తున్నాడు. తన పరిచితురాండ్రతో ఆమెను పోల్చి చూస్తున్నాడు. వాని దృష్టి కామె సుశీలగాను, వుదాత్త హృదయినిగాను కన్పిస్తోంది. 'ఆదిలో నాపట్ల తిరస్కారభావం చూపినా, తరువాత యెంత సౌమ్యంగా మాట్లాడింది!' అనుకున్నాడు.

బజారు మహా సందడిగా వుంది. విద్యార్థులు యీలలు-కేకలతో పాఠశాలలకు పోతున్నారు. బిచ్చగాండ్ర పాటలు, అరపులు సరేసరి. బండ్ల బడబడ. సైకిళ్ల బాబాల ధ్వని కర్ణకఠోరంగా వుంది. కాఫీ హోటళ్లు, క్షౌరశాలల్లోని గ్రాంఫోను పాటల్తో చెవులు చిల్లులు పడుతున్నై. ఎండ తీక్షణంగా వుంది. పైన గ్రద్దలు, డేగలు యెగురుతున్నై. చాలా రోజుల బయల్దేరిన ఇలియాకు పరమానందంగా వుంది. బజార్లోని ప్రతి దృశ్యము వానికి వింతగా అగపడుతోంది. ఇలియా పక్కగా ఒక యువతి [illegible] తారాజువ్వలా దూసుకొని పోయింది. ఆ పడుచు చూపు వాని అందాన్ని మెచ్చుకుంటున్నట్టుంది. ఆమెని చూచి ఇలియా నవ్వుకున్నాడు.

ఒకొక్కొక్క దృశ్యమె చూస్తూ ఇలియా స్మశాన వాటికను చేరుకున్నాడు. అతడక్కడికి వుద్దేశ రహితంగానే వెళ్ళినా అందలి ప్రతి సమాధిని పరిశీలనగా చూస్తూ వాటిపైన అంకితమైయున్న అక్షరాలను శ్రద్ధగా చదువుతున్నాడు. ఒక సమాధిమీది రాతను మాడగానే ఇలియా [illegible]యకంపితుడయ్యాడు. వాని గుండె దడదడ లాడింది. సంధించి పోయినవాడు మెల్లగా అడుగుతీసి అడుగేస్తూ [illegible] సమాధి దాపులో కెళ్ళాడు. "నణిక్ష్ంగవ్రుడు పోలటోవ్ మృత దేహము యిందుంచబడిన"దని దానిమీద వ్రాయబడింది.

ఇలియా కొంత సేపటికి తేరుకున్నాడు. తాను భయకంపితుడవటం యెవరైనా గమనించుతున్నారేమో నని [illegible]లుగైపులా పారజూచాడు; కాని, ఆ చుట్టుపక్కల యెవరూలేరు. దూరాన మాత్రం యెవరో ఒక సమాధిముందు మోకరిల్లి ప్రార్థనలో లీనమై యున్నట్లు కనబడింది.

పోలటోవ్ సమాధిమీద రెండు శిక్షలు వేటవాళ్ళ-[illegible] దాని క్రింది అడ్డంగా చిత్రించబడినై. అక్కడే [illegible] పుస్తకము. ఒక పుర్రెకూడ అంకితం చేయబడినది. సమాధికి పార్శ్వమందింకొక సమాధికూడ వుంది. [illegible]నిమీద 'యూఫ్రోషియా పోలటోవ్, వయస్సు 22 సంవత్సరాలు' అని చెక్కబడింది.

అది పోలటోవ్ ప్రథమ సతి దయివుంటుం దనుకున్నాడు ఇలియా. అప్పుడు వానిని గత సంఘటనల స్మృతి

చుట్టవేసింది. పోలటోవ్‌ను మొదటిసారి తా నెప్పుడ
చూచినదీ, బజారున పోతూ వాని దుకాణం ముందాగి
మెల్లా ఠటస్థించినదీ, ఆ సమయంలో తన మన
వీథి నెట్టి భావాలు సంచరించినదీ, తలవని తలంపుగా తా
నెట్లు పోలటోవ్‌ను హత్య చేయుట సంభవించినదీ తలపు
కొచ్చాయి. ఈ తలంపుతో వాని హృదయం ఉట్టి వికారము
కాగిలా. కళ్ళెదుట సమాధి యందే చూడిక్కి ...
...బడి వున్నాడు ఈశ్వర విచారణ, తన పాప ఫలితంగా
పిశాచపడవలసిన శిక్షలను గూర్చి ఆలోచన కలిగింది. "ఓ మానవ
రూప పిశాచములారా! మీ మూలంగానే నా జీవితము
ధ్వంసమైపోయింది. మీ కౌర్యము శాంతి ప్రదము ...
వల్లనే నేను అధఃపతన మయ్యాను. నా బ్రతుకు నరక
తుల్య మయింది" అని మానవ సమాజంపైన ఆక్రోశించ
సాగాడు.

తన తిట్లు మానవులందరికి వినపడేటట్టు నోరు చించు
కొని అరవా లనుకున్నాడు. ఇలియా పళ్ళు నూరుతూ
సమాధి వేపు చూస్తున్నాడు. పోలటోవ్ స్మరణతో వానికి
ఒళ్ళు మండుతోంది. బొజ్జనిమురుకొంటూ దొంగచూపుతో
వాడు తన కళ్ళముందు నాట్యమాడు తున్నట్టుంది. మాషా
ముసలి మొగుడు లాసినా భర్త పోలటోవు కిరుప్రక్కల
దరువు వేస్తూ, తన పైకి హుంకరించుతున్నట్టు తోచింది.

ఇలియా తా నానుకొనివున్న చెట్టు ఆసరాను వదలి

నిటారుగా నిలబడ్డాడు. వాని టోపీ జూరి క్రింద పడింది. దాన్ని తీసుకోటానికి క్రిందికి వొరిగాడు. అయినా సమాధి పైన నిలిచివున్న దృష్టిని మరల్చుకోలేక పోయాడు. టోపీ నందుకొని అక్కడి నుంచి కదిలాడు; ఎల్లాగో ఒలుకులు దాటి బయట పడ్డాడు.

దుకాణానికి వెళ్ళడానికి ఇలియూ కిష్టంలేక పోయింది. ఉద్దేశహీనంగా రోడ్డువెట పోతున్నాడు. వాని దృష్టి వచ్చే-పోయే వారి మీద లేదు. చుట్టుపక్కల యేమి జరుగుతున్నదీ వానికి పట్టలా. పోయి పోయి పెట్రిహ హోటలు ముందుకు చేరాడు. ఇష్టంలేకపోయినా జాకోబు నొకసారి చూచిపోదా మనుకున్నాడు. గేటులో అడుగు పెడుతూనే "సోదరులారా! దయుంచి నన్నొదలి పెట్టడి. నా యెముకలు విరిచెయ్యకం"డంటున్న ఫర్ఫిస్టా దీనాలాపాన్ని విన్నాడు.

ఇలియూ హోటలు ద్వారంలో నిలబడి లోపలికి చూచాడు. జాకోబు గల్లాపెట్టె ముందు కూచునివున్నాడు. ఎవరిక్కావలసినవి వారి కిప్పించుతూ బిల్లులను సొమ్ము పుచ్చుకొని సొరుగులో వేసుకుంటున్నాడు.

జాకోబా రీతిని వ్యాపారంలో లీనమై వుండటం చూచి "వీడికి వ్యాపారం బాగానే పట్టుబడింది!" అనుకున్నాడు ఇలియూ.

ఇలియూను చూచి జాకోబు సంతోషంలో యెగిరి [illegible] ఇలియూ చేతిని గట్టిగా నొక్కి కౌ[illegible]

లిచుకున్నాడు; కాని, అంతలో మళ్లీ యేం తోచిందో వెనక వేపు ద్వారం కేసి బిత్తరపోయి చూచాడు. అది మూసి వుండటం చూచి కుదుటబడి "ఏమిటి విశేషాలు!" అనడిగాడు.

"సరేగాని, నీ పని యెలా వుంది?" అని ఇలియా ప్రశ్నించాడు.

"చూస్తున్నావుగా !"

"చివరకు నిన్నుందర్నీ కలిసి వుంచారన్నమాట?"

"ఇంతకంటె దారేముంది?"

అని ఇలియా వంక దీనంగా చూస్తూ చాలా రోజులకు కలుసుకున్నాము. మా నాన్న యింట్లో లేడులే. అమ్మ నిక్కడ కూర్చోబెట్టి వస్తానుండు. కాస్సేపు ఖులాసాగా కబుర్లు చెప్పుకుందాం" మకిజాకోబు వెనక ద్వారం వద్దకు పోయి అమ్మా కొంచెం సేపిక్కడ కూర్చో నేనిప్పుడే వచ్చేస్తానని అతిగౌరవంగా సవతి తల్లిని పిల్చి చెప్పాడు.

ఇలియా పూర్వం తాను పినతండ్రితో నివసించిన గదిలోకెళ్లి కూచున్నాడు. గది నాలుగు మూలలా పరికించాడు. గోడరంగు వెలిసిపోయింది. ఒక మంచం వాల్చి వుంది. పుస్తకాలతో ఒక బీరువా కూడ వుంది. ఇలియా పడుకొనే చోట ఒక చెక్కల పెట్టె వుంది.

జాకోబు గబగబా వచ్చి "ఒక గంటసేపు వ్యవధానం చిక్కింది. టీ తెప్పించనా?' అని ఒక సర్వరును తేసుకు తెమ్మన్నాడు. అంతలో వాడికి దగ్గుతెర వచ్చింది. ఊపిరాడక రొప్పుతున్నాడు.

"నీ ఆరోగ్యం బొత్తిగా చెడిపోయిందే?" అన్నాడు ఇలియా విచారంగా.

"రోజురోజుకు నేను క్షీణించి పోతున్నాను.... అదృష్టవశాత్తు నువ్వు కనిపించావు. నీ వ్యవహార మెల్లా వుంది!"

"నాకేమీ ఫర్వాలేదులే. నీ సంగతే విచారించాలి."

ఇలియా తన విషయాలు కూడ చెప్పి మిత్రుని వ్యాకుల పరచ దలచలా. అసలు మాట్లాడాలన్న వుత్సాహమే వానికి లేదు. జాకోబు దీనస్థితి వానిని బాధించ సాగింది.

"ఏదో విధంగా ప్రాణం నిలబెట్టు కొస్తున్నా" నని జాకోబు నిరాశాభావం వెలిబుచ్చాడు.

"మానాన్న నీరక్తమంతా పీల్చి పిప్పి చేశాడోయ్!"

"తనూ అనుభవించు తున్నాడులే. బలేవాళ్ల పాల బడ్డాడు!"

"శాస్తి జరగాల్సిందే!"

"మా మారుటి తల్లే మానాన్న యావదాస్తికి యజమానురాలయింది. ఈయింట్లో ఆవిడ మాటకి తిరుగు లేదు."

"ఆ పెట్టెలోని దేమిటి!'

"హార్మోనీ. నాన్న కొనిచ్చాడు. ప్రస్తుతం దీనితో నేర్చుకుంటే సమ్మరదిపుడ మంచిది తెస్తానన్నాడు. నే నెందుకూ కొరగానని, హోటలుకు వచ్చేవారి వినోదానికి

హార్మోనియం మీద పాడటమైనా నేర్చుకోమనీ చెప్పాడు. ఆయన చెప్పినదాంట్లో అర్థం వుందిలే. ప్రతి హోటల్లోను జనాకర్షణకు యేదో ఒక వాయిద్యముండాలి.''

"మీ నాన్న పక్కా సైతాను!''

"ఏం?"

"నీ ప్రాణం పోయేటప్పుడు నిన్నెత్తుకెళ్ళి హోటల్లో పెట్టి, నీ అంతిమ ఘడియలు చూడటానికి వచ్చే వాళ్ళకు టిక్కెట్లు పెట్టమని మీ నాన్నతో చెప్పు. నీ చావు కూడా డబ్బు చేసిపెడుతుంది"

జాకోబుకు నవ్వొచ్చింది. నవ్వు దగ్గుకి ఫిరాయించింది. చేతుల్తో రొమ్ము పట్టుకొని దగ్గుతున్నాడు.

ఫర్ఫిష్టా సితారు వాయిస్తూనే వున్నాడు. దగ్గు వుపశమించిన తర్వాత ఇలియా జాకోబు నడిగాడు — "నీ సవతి సోదరుడు నీతో కలిసి మెలిసి వుంటున్నాడా?"

"వాడిక్కడ వుండటం లేదురా. కాలేజి హాస్టళ్ళలోనే వుండి చదువుకుంటున్నాడు. వాడి ముఖమెప్పుడూ కళకళ లాడుతూంటుంది. డబ్బు జోరుగానే తగలేస్తున్నాడు. (కొంచెం ఆగి) నీ కో పుస్తకం జ్ఞాపకం వుందీ? పచ్చటి పుస్తకంరా. దాన్ని వాడు తీసికెళ్ళాడు. అది చాలా ప్రత్యేకమైన గ్రంథమనీ, యిప్పుడు కొందామన్నా దొరకదనీ చెప్పాడు. నేను తెచ్చిపెట్టమన్నా మళ్ళీ తేనే లేదు."

జాకోబు మాటలకు ఇలియా నవ్వాడు. తర్వాత

మిత్రులిద్దరూ సర్వరు తెచ్చిన టీ కప్పు లందుకొని నోటి కందించారు.

"నాకీ మధ్య యింకో మంచి పుస్తకం చిక్కింది. చాలా బాగుంది. తీరికగా వున్నప్పుడు దానితోనే కాలక్షేపం చేస్తున్నా" నని జాకోబు పుస్తకాల ప్రసక్తి తెచ్చాడు.

ఇలియా ఆ గొడవ చెవిని పెట్టకుండా "అబ్బ! ఇది నరకతుల్యం! నే నుంటున్న చోటకూడ సుఖ-శాంతులు శూన్యమే; కాని, వీా కొంప కంటె యెన్నో రెట్లు మే"లన్నాడు.

"అయితే నీకూ సుఖం లేదన్నమాట!" అని జాకోబు విస్మయంగా చూచాడు.

ఇలియా జవాబివ్వలా. మాషా సంగతి వానితో చెపుదామా వద్దా అని ఆలోచించుతున్నాడు. అప్పుడు జాకోబు మెల్లగా అన్నాడు—"నువ్వెప్పుడూ యేదో ఒకటి ఆరోపించు తూంటావు. నాకు నీ స్వభావం బాగాలా. మానవుడు లలాటలిఖితాన్ని అనుభవించక తప్పదు. అందు కితరుల పైన దోష మారోపించడ మెందుకు? రాసి పెట్టిన గీతని చెరపడం యెవరితరం!"

ఇలియా మాట్లాడకుండా టీ తాగుతున్నాడు.

"మా నాన్న చేతులార చేసుకొని అనుభవిస్తున్నాడు. భార్య యెంత చెపితే అంత. రాత్రింబగళ్ళు తాగి వస్తూంటున్నాడు."

"మరి యిక నీ భావి కర్తవ్య మేమిటి?"

జాకోబు ప్రత్యుత్తర మివ్వలేక మాట్లాడకుండా కూచున్నాడు. మిత్రుని అయోమయావస్థ చూచి ఇలియాకు విచారం కలిగింది. "నే నడిగిన దానికి సమాధానం చెప్పవేం?" అనడిగాడు మళ్ళీ.

జాకోబు ప్రక్కకు చూస్తూ "నే నేం చెప్పను? నా భావి అంధకారబంధురంగా వుంది. నే నిం కెన్నాళ్ళో బ్రతక" నన్నాడు.

ఇలియా వెళ్దామని లేచాడు.

"అప్పుడే లేస్తావేం! యిం కొంచెం సే పుదూ." అన్నాడు జాకోబు.

ఇలియా జాకోబు కళ్ళలోకి చూచి "మిత్రమా! నీతో మాషా సంగతి చెప్పడమే మర్చిపోయాను. ఆమె చాలా కష్టదశలో వుంది. పాషా పరిస్థితీ అధ్వాన్నంగా నే వుంది. నేనూ అనంత వేదనకి గురి అవుతున్నాను నీ సంగతి చెప్పనే అక్కర్లేదు. మనందరి స్థితి ఒకలాగే వుంది. అంతా భగవదేచ్ఛ! ఇక వెళ్తా" అన్నాడు.

"అప్పు డప్పుడు వస్తుంటావు గదూ?" అనడిగాడు జాకోబు ప్రాధేయపూర్వకంగా.

ఇలియా మారు మాట్లాడ కుండానే బయల్దేరాడు. హోటలుదాటి వచ్చేప్పటికి ఇలియా తాజా మని షయ్యాడు. జాకోబు స్థితినిబట్టి వానికి త్వరలో మృత్యువ్

తప్పదనుకున్నాడు! జాకోబువంటి అమాయకుడీ సమాజంలో బ్రతకడం కష్టమే ననుకున్నాడు. వాడల్ప వయస్సులోనే బలవన్మరణానికి గురిచేయబడుతున్నాడన్న విషయం ఇలియా నెక్కువగా బాధించసాగింది. సమాజ, న్యాయశాస్త్రాల దృష్టిలో అది హత్యగా పరిగణింపబడదని తలచుకొన్నప్పుడు వాడికి మానవ జీవితమంటే రోత జనించింది.

ఇలియా కా రాత్రి కళ్లు మూతపడలా. కిటికీగుండా చల్లనిగాలి వస్తున్నా వాడికి ఉక్క పోస్తున్నట్టుంది. ఆరు బయట పక్కమీద వెల్లకిల పడుకొని ఆకాశంలోకి చూస్తున్నాడు. "సర్వమనుష్యాకాశాన్ని అంతచక్కగా అలంకరించడమెందుకో! అశేషజనం వుండే యీ పృథ్వీతలాన్ని మురికితోను, కశ్మలంతోను నింపి వుంచటంలోని అంతరార్థమేమి" అనుకొంటూ మిలమిల మెరిసే చుక్కలమీద దృష్టి నిల్పాడు. చెట్ల కొమ్మలు వంగిపోతున్నట్టూ, ఆకులు లేచిపోయి తారల చాటున దాక్కున్నట్టూ తోచింది. జాకోబు రూపం కళ్ళ ముందున్నట్టుగా వుంది. జాకోబు నీలవర్ణాకారంలో తేజరిల్లుతున్నాడు. కళ్ళు మెరుస్తున్నై." పాపం! శాంతిగా బ్రతకాలనుకున్నాడు. కాని, బలాత్కారంగా మృత్యుగహ్వరంలోకి పడద్రోయబడుతున్నాడని ఇలియా గొణుక్కున్నాడు.

29

ఇలియా ఆశాలతను కదల్చివేసే తుపాను రేగింది. అది వానిని మరింత కలవరపరిచింది. సైబీరిక్ భగిని నిత్యమూ వచ్చి వెళుతోంది; ఎప్పుడూ కొంప మునిగి పోతున్నట్టు హడావుడిగా వెళ్ళిపోతోంది. ఇలియాతో ముక్తసరిగా ఒకటి రెండు మాటలు మాట్లాడి వానిని సంధిగ్ధావస్థలో వదిలేది. ఒక రోజున "మీ కీ వృత్తి బాగుందీ!" అనడిగింది సోంకా.

"ఏం బాగు! కాని, యింతకంటె చేసేదిలేదు. ఏదో విధంగా భుక్తి గడించుకోవాలి గదా" అన్నాడు ఇలియా.

ఆమె వానిని తేరపార జూచి "కష్టించి సంపాదించటాని కెప్పుడైనా ప్రయత్నించారా?" అనడిగింది మళ్ళీ.

ఇలియా ఆమె ఉద్దేశాన్ని గ్రహించలేక ఆశ్చర్యంతో ప్రశ్నార్థకంగా చూచాడు.

"మీరెప్పుడూ శ్రమ పడలా?"

"నా జీవితమంతా శ్రమతోనే గడిపాను. ఇప్పుడూ కష్టించక తప్పటంలా."

సోంకా నవ్వింది. ఇలియా కామె ఉద్దేశం బోధపడక చిన్నపుచ్చుకున్నాడు.

"దుకాణంలో కూర్చొని అమ్మటంకూడ శ్రమ అనే భావిస్తున్నారా?" అంది సోంకా.

"శ్రమగాక మరేమిటి? పగలస్తమానం ఆయాసపడి అలసి పోతుంటేను!" అని ఇలియూ ఆమె వంక చూశాడు. సోంకా మొహం మీది చిరునవ్వు చిహ్నాలు అదృశ్యమైనై. గంభీర వదనంతో యిలా అంది—"అది శ్రమ అనిపించుకోదు. కష్టపడి యేదైనా జీవితావసర వస్తువు నుత్పత్తి చేయటం మాత్రమే శ్రమ అవుతుంది."

ఇలియూ తలాడించుతూ ఆమె అభిప్రాయానికి ఆమోదం తెలిపాడు. లజ్జతో తల వంచుకున్నాడు. శ్రమ శబ్దార్థమే గ్రహించలేనందుకు ఇలియూ సిగ్గు పడ్డాడు.

"దుకాణంలో కూర్చుని వస్తువులను విక్రయించటంలో శ్రమేముంది? మీ కష్టంతో యే వస్తువు తయారవుతోందో చెప్పం"డని సోంకా తర్కించింది.

"వర్తకం మాత్రం సులువా? మర్మం తెలిసి వ్యాపారం చెయ్యాలి. కష్టపడి దుకాణం నడిపితేనే లాభం; లేకపోతే దండుగేగా!" అన్నాడు ఇలియూ.

సోంకా మరి మాట్లాడలా. తమ్మునితో యేదో చెప్పి చక్కా పోయింది.

తన మాటలకు సోంకా నొచ్చుకుందేమోనని ఇలియూ భయపడ్డాడు. తానన్న మాటల్ని నెమరు వేసుకున్నాడు. అందులో ఆవిడను నొప్పించే మాటేదీ లేదు. తర్వాత ఆమె వాదాన్ని గురించి పర్యాలోచించాడు. ఆ యువతిని గూర్చి ఆలోచించినకొద్దీ వాని కానందం కల్గుతోంది. వస్తూత్పత్తి చేసే శ్రమకు వస్తు వినిమయ కృషికి

గల భేదాన్ని వివరించింది. అంతవిశాల హృదయిని తన ముందు గంభీరంగా వుండి యెందు కంత తీవ్రంగా, ముభావంగా మాట్లాడుతోందో ఇలియూష గ్రహించ శక్యం కాలేదు. పాష్కా ఆమె న దేవనిగా మెచ్చుకొంటున్నాడు. ఇంటికి వెళ్తే చాల మర్యాద చేస్తుందట. అతిథుల్ని సత్కరించి వేళకు భోజనం పెడుతుందట. హృదయమిచ్చి మాట్లాడుతుందట. పాష్కా యీ విధంగా సోంకా గుణగానం చేయటానికి హేతు వేమిటా అని ఇలియూ ఆలోచించాడు. ఆమె యింటికి చాలమంది వస్తూంటారనీ, వాళ్ళందరూ వుత్సాహంగా వుంటారనీ, యెప్పుడూ యే మేమో చర్చించుతూ కాలక్షేపం చేస్తారనీ, పాష్కా చెప్పాడు. వా డెప్పుడు వచ్చినా సోంకానుగూర్చి చెపుతూండేవాడు.

ఒకపర్యాయం పాష్కా ఇలియూతో యిలా చెప్పాడు—"సోంకా వద్ద పత్రికలు, పుస్తకాలు కుప్పలు–తిప్పలుగా వున్నై. ఆమె స్నేహితులందరు విద్యావంతులే. ఒకాయన వకీలు, యింకొకాయన డాక్టరు. పెద్ద డిగ్రీలు పొంది నిరుద్యోగులుగా వున్నవాళ్లు, కాలేజి విద్యార్థులు కూడ వున్నారు. అక్కడికి వెళ్ళినప్పుడు నన్ను నేను మర్చిపోతుంటాను."

"అలాగా! న న్నెప్పుడూ ఆమె రమ్మని పిలవలా. సోంకా మహా గర్విష్ఠి" అని ఇలియూ వెక్కసపడ్డాడు.

"ఎబ్బె! ఆమె చాల మంచిది. సరళ హృదయ. పిలవా లేమిటి? ఒకసారి చూచి వద్దువుగాని రా. అక్కడ

యెవరికీ అక్కర లేదు. వాటిలో కృత్రిమమూ మచ్చుకైనా లేదు. ఎంత మంచి వాళ్ళను కన్నావు!" అని పావ్కా పుబ్బిపోతూ చెప్పాడు.

"సరేగాని, మాషా సంగతు లేమి"టని ఇలియూ అడిగాడు.

"క్రమంగా కోలుకొంటోంది. ఆ నరపిశాచం మీద కేసు పెట్టడానికి వకీలుతో సంప్రదించాను. వాడికి తప్పకుండా శాస్తి జరిగి తీరుతుంది. వేరా విషయంలో కూడ శ్రద్ధగా పని చేస్తున్నారు. ఆమె యిల్లు చాలా చిన్నది కావటంవల్ల యిబ్బంది పడుతున్నారు."

"అసలు సోంకా స్థితి యేమిటి?"

"ఆమె సంగతు లేమడుగుతావు? సోంకా మకుటం లేని రాణి. మిత్రులందరిపైన హుకుం చలాయించుతుంది. అందరూ ఆమె ముందు తలొగ్గుతారు. ఎదురు చెప్పిన వారిని శిక్షించి నోరు మూయించుతుంది."

"ఆ సంగతి నే నిదివరకే గ్రహించాను."

పావ్కా సోంకాను ప్రశంసించి నప్పుడెల్లా ఇలియూ వుడికి పోతూండేవాడు. పావ్కాయందు ఈర్ష్య పొందేవాడు. ఒక తడవ పోయి వద్దామా అనిపించింది; కాని, ఆత్మాభిమానం అడ్డు తగుల్తోంది. దుకాణంలో తీరిగ్గా కూచుని 'ఈ ప్రపంచంలో ప్రతివాడు మరొకని వల్ల ప్రయోజనాన్ని ఆశించేవాడే. అయితే మరి సోంకా మాషా, వేరాలకు తోడ్పడి యే మాశిస్తుంది? తాను

గర్భదరిద్రురాలేనే! ఉదర పోషణే గడ్డుగా వుంది. దీన్ని బట్టి ఆవిడ జాలిగుండె గలదని విదిత మవుతోంది. మరి నా యందంత విముఖత్వ మెందుకో? నేను పాపాత్మ కంటె దిగజారి పోయానా?' అని ఆలోచించుతూ సర్వం మర్చిపోయాడు. వాని జీవితము గాఢాంధకార మయమై వుండగా అందులో ఒక బీట, దానిగుండా తాను నది వర కెన్నడు చూచి వుండని దివ్యతేజము ఇలియా కా స్థితిలో దృగ్గోచర మయింది.

అదే సమయంలో లాసినా వచ్చింది. ఆవిడ వస్తూనే "ఇలియా! మన యింకా కొత్త రకాలు కూడ దుకాణంలో నెట్టాలి ఏజెటు ఒకణ్ని పంపన; వచ్చాడా?" అంది.

"రాలేదే!"

ఇలియాకు లాసినా యందంత లేని అసహ్యం కలిగింది. ఆమె యీ మధ్య కర్కోశ్ వెటపడి చిత్రకారై కక్కలా తిరుగుతూన్నట్లు ఇలియా చెవిని పడింది. తన కామె పై నెంత రోషగా వున్నా పైకి మాత్రిం కనపర్చేవాడు కాదు. వాని ప్రవర్తనలో యెలాంటి మార్పులేదు; అయినా లాసినా వెనకటిలాగా ఇలియా వద్దకు రావటం లేదు. అందు వల్ల వానికూడ బాధ లేకుండా పోయింది. వాని కామెను కలుసుకోవాలన్న అభిలాషే లేదు; కాని, మొన్న మొన్నటి వరకు తన పొందుకోసం తహతహ లాడిన లాసినా తన్నిప్పుడు కామించటం లేదనుకున్నప్పుడు మాత్రం ఇలియా వుక్రోషంతో వుడికి పోయేవాడు.

దుకాణానికి వచ్చినప్పుడు లాసినా పరివర్తన వింతగా వుండేది. ఒక్క క్షణమైనా కుదురుగా కూర్చునేది కాదు "దుకాణంలో వుండే వాళ్ళెప్పుడూ చలాకీగా వుండాలి. వినయ-విధేయతలు కలిగుండాలి. మేము నీకు జీతమిచ్చేది కాపలాకు, హాజరు వేయించుకున్నందుకే కాదు." అని యిలాగే గైబ్రిక్‌తో యేమేమిటో చెప్పేది.

గైబ్రిక్ సామాన్యుడు కాడు. లాసినా చీవాట్లు వేస్తుంటే తన్ను కాదన్నట్టు పెడచెవిని పెట్టేవాడు. ఆమె పీటెక్కి రాక్‌లపై నున్న వస్తువుల్ని తీయటానికి చేతులు పైకెత్తినప్పుడు ఆమె కుచాల వంక చూచి కొంటెగా నవ్వేవాడు. వానికామె యందు దేమాత్రం గౌరవభావముండేదికాదు. లాసినా చటాక్కీ తన మెరిగి వుంటంవల్ల నిరసన భావంతో చూచేవాడు. ఆమె వెళ్లినాక "వయ్యారి భామ వెళ్ళిపోయిం" దనే వాడు ఇలియాతో హేళనగా.

ఇలియా నవ్వుకొని "ఆమె యజమానిని కదా! అలా అనవచ్చా?జీతమిచ్చి పోషించే ఆమెకు విధేయత చూపాలి సుమా!" అనేవాడు.

వచ్చినప్పుడల్లా నాలుగు తిట్టి, గంతులేసి పోతుంది. అలాంటి మనిషితో నాకేం పని? నేను మిమ్మల్నే కొలుస్తా" నవేవాడు గైబ్రిక్.

గైబ్రిక్ తనకే మాత్రం విధేయత చూపనందుకు లాసినా అలిగి ఒకసారి ఇలియాతో యిలా అంది— "నువ్వు

వీడికి మర్యాద-మన్ననలు నేర్పటం లేదు. నీ కసలీ వ్యాపారంలో మనసున్నట్టే లేదు."

లాసినా మాటలకు ఇలియా తనలో "దేవీ! ఆ ముక్కాలి పీట మీద ఎక్కినప్పుడు కాలుజారి క్రిందపడి కాలో చెయ్యో విరగ్గొట్టుకున్నప్పుడుగాని నీ కిక్కడి నౌకరీ బాధ తెలియదు. పై పెత్తనం చెలాయించుతూంటే లోలోపల కళ్ళే వారి సంగతి నీ కెలా బోధపడుతుంది!" అనుకున్నాడు.

పెరెన్సు తీర్థ-యాత్రా పర్యటన ముగించుకొని వస్తున్నట్టు ఇలియాకు జాబు వచ్చింది, తన కాయన దూరంగా వుంటేనే బాగుంటుం దనుకొని, అందు కువాయు మేమిటా అని ఆలోచించుతుండగా దుకాణంలోకి సరకుల కోసం జనం వచ్చారు. అందరినీ పంపించేసరికి సోంకా వచ్చి పడింది. వస్తూనే మంచినీళ్ళు కావాలంది.

"ఆ, తెస్తా" నంటూ ఇలియా లేవబోతూంటే "మీరు కూచోండి నేను వెళ్ళి తాగుతా లెం"డంటూ సోంకా లోపలి కెళ్ళింది.

ఇలియా వచ్చిన మనిషి కేదోయిచ్చి పంపి ఆమె వద్ద కెళ్ళాడు. సోంకా మానవ జీవితావస్థలను తెల్పే చిత్రాన్ని రెప్ప వాల్చకుండా చూస్తోంది. ఇలియా రాకను గమనించి "అస్వభావికంగా వుంది" అని నిరసన భావాన్ని వెలిబుచ్చింది.

తా నెంతో వుత్తమ చిత్రంగా యెంచుతున్నదాన్ని సోంకా అంత చుల్కన చేయటంతో ఇలియా నెలనెల పోయాడు.

"అతి అసహజంగా వుంది. అంతా కృత్రిమమే" నంటూ సోంకా దిగ్గున లేచిపోయింది. ఇలియాకిప్పుడు అచిత్రం మరో నూతన సమస్య అయింది.

ఇంకో రోజున సోంకా గైబ్రిక్‌కు కొత్త బట్టలు తెచ్చింది. వాటినిస్తూ తమ్ముణ్ణి వాని మడ్డితనానికి, గుడ్డల విషయంలో అజాగ్రత్తకూ కూకలేయ సాగింది.

"ఊరుకో అక్కా! యజమానురాలి సతాయింపు చాలదనా నువ్వుకూడ నోరు చేసుకుంటున్నా" వన్నాడు గైబ్రిక్.

సోంకా ఇలియాని ప్రక్కకు లాగి "పిల్ల వెధవ తననేమీ చూపటం లేదుగద" అనడిగింది.

"ఎక్కువగా కాదులే" అని ఇలియా నవ్వాడు.

"నే నసలు తిన్నని వాణ్నేలే" అన్నాడు గైబ్రిక్ తన అక్కతో.

"నోటిదూల మాత్రం వుం"దని ఇలియా అంటించాడు.

"వింటున్నావా?" అని సోంకా తమ్ముణ్ణి గద్దించింది.

"వింటున్నా లెద్దూ" అని గైబ్రిక్ సోంకా వంక చుర చుర చూచాడు.

"మీవాడి అల్లరేమీ లేదు. మొత్తంమీదమంచి వా"డని ఇలియా గైబ్రిక్‌ను మెచ్చుకున్నాడు. తన మాటల్లో

సోంకా ప్రసన్న రాలైనట్టు గ్రహించి "నేను మిమ్మొక సంగతి అడగాలనుకొంటున్నా" నని ఆమె కళ్ళలోకి చూచాడు.

"ఏమిటి చెప్పండంది' సోంకా.

ఇలియా తల వూపుకొని "మాకు వ్యాపార మంటే యేవగింపనుకుంటానే!" అన్నాడు.

"కొంతవరకు."

"కారణం అడగవచ్చా?"

"వర్తకులు యితరుల శ్రమఫలితాన్ని లాభంగా పొందుతున్నారు కాబట్టి."

ఇలియా తలెత్తి చూచాడు. సోంకా మాటలు వానికి కటువుగా తోచటమేగాక కోపంకూడ వచ్చింది. "మీ రన్నది అందరిపట్ల వర్తించ" దన్నాడు తీవ్రంగా.

సోంకా మో మెర్రబారింది. ఆమె బీరువాలోని ఒక రిబ్బను చూపుతూ "మీరు దాన్నెంత కొన్నా"రనడిగింది.

"రూపాయి పావలా."

"మీ రమ్మే వెల?"

"రూపాయి న్నర."

"అంటే మీ లాభం నాల్గణాలు అవునా? అది మీకు మట్టాల్సింది కాదు. ఆ పావలా కూడా ఆ రిబ్బను తయారుచేసిన కార్మికునికే దక్కాలి. మీ రే కాదు,

అరరూపాయి పావలాలో సగానికి మించి మధ్య దళారులు దోచేస్తున్నారు."

"అరె; ఇదంతా నిజమేనా!"

"మీరు రతి సామాన్య విషయాన్ని కూడ గ్రహించలేకపోతున్నారు. మీరే వస్తూత్పత్తిదారుల నే దృష్టితో ఆలోచించండి" అని సోంకా ఒక్కొక్క వస్తువును చూపుతూ వాటి తయారుకు పుష్పక్తదారు లెట్లు చమటోడ్చే. అయినా వారు నిత్య దరిద్ర మనుభవించుతూ తాముత్పత్తి చేసిన జీవితావసర వస్తువులకే యెలా యిబ్బంది పడుతున్నదీ, ఒళ్లే మాత్రం వొంచని సోమరిపోతు లెట్లు వస్తుపరిశ్రమలలో వ్యాపారంలో లక్షలు కోట్లు గడించి భోగవిలాసాల్లో మునిగివుంటున్నదీ బోధపర్చనారంభించింది. మొదట్లో ఆమె సరళంగానే ఆరంభించింది కాని, క్రమంగా ఆమె వదనము, ధోరణి గంభీరమైనయి. "వ్యాపారం ఓట్టి మోసం వర్తకుడు కార్మికుల వద్ద చౌకగా కొని, ప్రజలను ప్రియంగా అమ్ముతాడు. ఇంతకంటె దగా యేముంది. అని ముగించింది.

సోంకా వాదన ఇలియాకు తలవంపులుగా తోచింది. ఆమె 'నువ్వు దొంగవి, దగాకోరు' వని స్పష్టంగా తన్నవమానించటానికే మొహంమీద అన్నదని ఇలియా తలిచాడు; అయితే తగు సమాధాన మిచ్చేందుకు వానికి మాటలే స్ఫురించలా. లోలోపల ఉడికిపోతున్నాడు.

సోంకా వాదనతో వాడేకీభవించలేక పళ్లు పటపట లాడి స్తున్నాడు. మొహం వాచేటట్టు జవాబివ్వాలని మాటల కోసం దేవులాడుతున్నాడు. మరోప్రక్క ఆమె సాహ సాన్నీ, యదార్థ వాదాన్నీ మెచ్చుకుంటున్నాడు. కాస్సేపు వితర్కించుకొని "మీరు చెప్పిన దంతా నిజం కాదు. మీ వాదాన్నెవరు నమ్ముతారు?" అని ప్రశ్నిస్తున్నాడు. వాని హృదయంలో గాలిదుమారం లేచింది. మొహం కోపంతో నిప్పులు చెరుగుతోంది.

సోంకా మెల్లగా "అయితే నా వాదాన్ని ఖండించి మీ వుద్దేశం చెప్పండి" అంది.

ఇలియా పక్క చూపుల్తో "నా జీవితాన్నే వుదాహ రణగా మీ వాదాన్నెదిరిస్తాను. ఈ దుకాణం పెట్టడా నికి నేను చెయ్యని దురాగతం యేముంది!" అన్నాడు.

"అది మరీ ఘోరం; మీరు నా వాదనని ఖండించు టకు మారు బలపరుస్తున్నా"రని సోంకా మందహాసం చేసింది.

ఇలియా చల్లబడ్డాడు. ఇక వాని నోట మాట రాలా. మనస్సును కుదుట బెట్టుకోటానికి ప్రయత్నిస్తూ ఆమె వంక చూస్తున్నాడు.

సోంకాకు స వ్వాగలా. విజయదర్పంతో "నేను చెప్పింది వాస్తవమే. దానిక ప్రతివాదం లే"దన్నది.

"ఏమిటీ! నేను ఖండించలేనూ?" ఇలియూ వున్మాదునివలె అరిచాడు.

"ఖండించలేవు. మీ ప్రతివాదన కాధారమే లేదు" అని ఖండితంగా చెప్పేసింది.

పై మాటలని సోంకా మృదువుగా నవ్వింది. ఆ తర్వాత లేచి దారి పట్టింది. వెనకనుంచి "మీ మాటలు సర్వాబద్ధాలు, నిస్సారాలు. వాటిలో తత్వంలేదు, సారం లేదంటూ" ఇలియూ బిగ్గరగా అరిచాడు; కాని, సోంకా వెనక్కి తిరిగి చూడకుండానే వెళ్ళిపోయింది.

ఇలియూ లేచెల్లి సోంకా పోకడను గమనించి వచ్చి పీటమీద కూచున్నాడు. సోంకా మాటలు గైబ్రిక్‌కు సంతోషాన్నే కల్గించాయి. వాడి మొహం కళకళలాడుతోంది. వాడోరకంటితో ఇలియూ ముఖభంగిమ కన్పెడుతున్నాడు.

ఇలియూ వాడి యెచ్చును సహించలేకపోయాడు. "ఆ మూపేమిట్రా" అని ప్రశ్నించాడు.

"ఏం లేదండి."

"సరే నీకివాళ సెలవిచ్చా పో" అని వాణ్ణి పంపేశాడు. తాను యేకాంతంగా వుండాలనుకున్నాడు.

ఇలియూ సోంకా మాటల్లోని యదార్థాన్ని తెలుసుకోవాలన్న ప్రయత్నమే చేయలా. ఆమె తన్నవమానించ

టానికే అలా మాట్లాడిందని మాత్రం నిశ్చయించుకున్నాను. ఆమె నన్నెందుకు క్షమించాలి? నేనామెకేమపకారం చేశాను వచ్చిది వచ్చినట్లు పోక నా వ్యాపారం పరిసక్తి తన కెందుకు?'నన్న చెప్పిపోయిందే! అది చమత్కారోక్తి అనుకోవాలి! ఈ తడవ రానీ చెప్తా'నని మదన పడ్డాడు.

తరువాత తాను సోంకా నవమానించే మాటేమీ అనలేదుగదా అని ఇలియాస్ కలత చెందాడు.

'ఆమె పాష్కాతో సంపర్కం పెట్టుకోదనే నా విశ్వాస' మనుకొని ఇలియాస్ అద్దంలో ముఖం చూచుకున్నాడు. కళ్ళలో విచారం తొంగిచూస్తోంది. మొహం కళాహీనంగా వుంది. అవమాన భారంతో కృంగిపోతున్న చిహ్నాలింకా కనపడుతూనే వున్నై. అయినా తానెంతో అందంగావున్నా ననుకొన్నాడు. సుఖరోగ పీడితుడగు పాష్కా రూపానికీ తన రూపానికీ పోలికేమిటనుకున్నాడు.

సోంకా తన్ను కాదని పాష్కాను ప్రేమించటం సంభవమేనా అని ప్రశ్నించుకున్నాడు. మరుక్షణంలోనే 'ఆ మదిరాక్షి నన్నెలాగూ ప్రేమించదు. ఆవిడను గురించి నా కాలోచన యెందుకు? సోంకా ఏ డాక్టర్నో, వకీల్నో పెళ్ళాడుతుంది. నా వంటి సామాన్యుడి యందు మోజెల్లా కలుగుతుంది?' అని సమాధానం చెప్పుకున్నాడు,

అప్పుడు వాని పెదాలమీద చిరునవ్వు పరుగు తీసింది, 'కాని, మాటిమాటికి కావాలని పాష్కానే పిలవటానికి

కారణం? సామాన్య దుకాణదారూ దొంగా సమానమేనా? నేను వుత్పత్తికి శ్రమ పడనిమాట నిజమే; ఇతరుల శ్రమ వల్లనే నేను లాభం పొందుతున్నాను. అయితే నేను మాత్రం యెవరికాౕవలసిన వస్తువుల్ని వారికి సప్లయి చేసేందుకు అస్తమానం కళ్ళు తెరుచుకొని కూర్చో టంలా? ఈ పని నింకొకరితో చేయించి నేను కూచుని తింటున్నానా?' అని మళ్లీ వితర్కించుకున్నాడు.

సోంకా వాదాన్ని ఖండించడానికి దారి దొరికింది గదా అని సంబర పడ్డాడు; కాని, వినటాని కామె లేదుగా. ఆమె వెళ్ళిపోక ముందే యిదంతా స్ఫురించ నందుకు వానికి తనపైనె కోపం వచ్చింది. అవమానాఘాతంచే యేర్పడ్డ గాయం వానికి తీరని బాధగా వుంది. లేచి వెనక గదిలో కెళ్ళాడు. రెండు గుక్కలు నీళ్ళుతాగి అటూ యిటూ చూచాడు. వాని దృష్టి తన అభిమాన చిత్రం మీద నిల్చింది. తదేక ధ్యానంతో చూస్తూ 'నిజాని కిది అసహజంగానే వుంది. ఇందులో మాదిరిగా యెందరికి గడు స్తోంది?' అనుకున్నాడు.

ఆ పటాన్ని పరిశీలనగా చూస్తూ, అందలి ప్రత్యవ స్థను తన జీవితంతో పోల్చుకొని 'ఎబ్బే! ఇందులో మాత్రం సుఖ మేముంది? అసలీ విధంగా మాత్రం యెందరు బ్రతుక గలుగుతున్నారు?' అని ఆ చిత్రాన్ని గోడలాగి నలుపుతూ దుకాణంలోకి తెచ్చాడు. నలిపిన పటతల్ని విప్పి నేల మీద పరచి అందలి వివిధావస్థలను మరొకసారి చూచాడు.

అంతకు క్రితం సోంకా అనిపోయిన మాటలన్నీ జ్ఞప్తి కొచ్చాయి. 'నేనే పోలటోవ్ హంతకుడనని ఆమె గ్రహించి నట్టుంది. మరి నన్నెలా చేపడుతుంది?' అనుకున్నాడు మళ్లీ.

ఇలియా హృదయంలో భావతరంగాలు దొంతర దొంతర్లుగా బయలు దేరుతున్నై. చిత్రాన్ని చూడగా చూడగా వాని దృష్టి మందగించింది. అప్పుడా చిత్రాన్ని నలిపి నేలకేసి కొట్టాడు; కాని, గాలి కది తిరిగొచ్చి వాని పాదాలవద్దే పడింది. ఈ సారి చించి ముక్కల్ని వీధిలోకి విసిరేశాడు. ఆ ముక్కలు గాలి కెగిరి పోతుంటే చూస్తూ కూచున్నాడు.

మర్నాడు సోంకా మళ్లీ వచ్చింది, ఆమెను చూస్తూనే ఇలియా పగబట్టిన త్రాచులా బుసకొట్టాడు. సోంకా వాని వాలకం కన్పెట్టి నవ్వుతూ "మీముఖం వాడి నట్టుందే ? ఒంట్లో ఖులాసాగా లేదా ?" అనడిగింది.

మనసులో వున్న భావాన్ని వెలిబుచ్చకుండా "బాగా నే వున్నా" నన్నాడు ఇలియా.

సోంకా మధుర స్వరము, తీయని నవ్వు వానికోపాన్ని వుపశమింప జేశాయి. అయినా కృత్రిమ కోపాన్ని చూపాలనుకున్నాడు ఇలియా

"నిన్నటి నామాటలు మీకు కష్టం కలిగించా యనుకుంటాను" అంది సోంకా సహజ గంభీర స్వరంతో.

"అవమాన, నిరాదరణలు నా కలవాటేలే" అని ఇలియా తానేదో దెబ్బకొట్టినట్టు సోంకా వంక చూచాడు. ఆ చూపులో ప్రతీకార భావ మిమిడి వుది. 'ఒకనాడు చీ వాట్లు వేసి, యింకో రోజున బుజ్జగించే నీ ఆటలిక నాముందు చెల్లనివ్వన్లే' అంటున్నట్లుంది ఆ చూపు.

"నాకు మి మ్మవమానించా లన్న తలంపే లేదు. నేను నమ్ముతున్న విషయాన్ని మీతో వాదించా నంతే" నన్నది సోంకా.

"న న్నవమానించటం నీతరమా? నీ తాహతు నాకు తెలుసు" అని ప్రతిమాటా ఇలియా నొక్కి పలికాడు.

సోంకా చెవులు నిక్క పొడుచుకున్నై. ఏమి టిలా మాట్లాడుతా డని విస్మయ పడింది. ఆమె చిన్నబోవటం ఇలియా గమనించుతూనే వున్నాడు. అయినా వాడు తన ధోరణి మార్చుకోలా. కసి తీర్చుకోవాలన్న వాంఛ ప్రబలంగా వుంది. అందుచే మైమరచి నోటికి వచ్చినట్లు అనేస్తున్నాడు.

"నీలాగా పొగరుగా మాట్లాడటం సులువే అది తేలిగ్గానే పట్టుబడుతుంది. అదృష్ట వశాత్తు యేవో నాలుగు అక్షరం ముక్కలు అబ్బించుకున్నావు గాని, లేకపోతే నువ్వీ పాటికి యెక్కడైనా దాసిగానో దాదిగానో వుండే దానివి. నీవ టి పేదపిల్ల కంతకంటె మంచి నౌకరీ యేమ

దీస్తాడు?" అని ఇలియా తననాక్స్ఫణా లావిడపై నెలా పని చేస్తున్నవో క న్పెడుతున్నాడు.

"మీ మాటలకు అర్థమేమి టని సోంకా మెల్లిగా అడిగింది.

తనమాటలు బాగానే నాటినట్లు గ్రహించి ఇలియా సంతృప్తి చెందాడు. "నాయిష్టం వచ్చినట్లు మాట్లాడు తున్నాను. ఇక నీబడాయి నాముందు నాగదని తెలుసుకో" మన్నాడు.

"నా బడాయి మీ కేం కనపడింది? నేను కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించానే గాని, అందులో నాప్రత్యేకతను ప్రదర్శించాలని యేమీ అనలేదే!" అంది సోంకా అతిశాంతంగా.

అక్కకు జరుగుతున్న అవమానన్ని గైబ్రిక్ ఓర్వ లేక పోయాడు. సోదరి చేయిపట్టుకొని "ఇక్కడి నుంచి వెళ్లిపో అక్కా!" అని ఇలియా వంక మిరిమిరి చూచాడు.

"మీ రిద్దరూ వెళ్లిపోండి. నా కెవరూ వ"ద్దని ఇలియా ఆ వ్రదేకంలో సోదరీ సోదరులకు దారి చూపించాడు. సోంకా మీద కసి తీర్చుకున్నానన్న తృప్తితో వాని హృదయా రాటం కొంత తగ్గింది. కంగారుపడి బిత్తర చూపులు చూచిన సోంకా ముఖమూ, ద్వేషాగ్నిని చిందుతున్న ఆవిడ కళ్లూ వాళ్ళు వెళ్లిపోయిన తర్వాత కూడ ఇలియా కళ్ళకు కన్పిస్తున్నట్లుగా నేవుంది.

తానెంతో దయగా చూస్తూ వచ్చిన గ్రైబిక్ కూడ అక్కను వెనకేసు కొచ్చాడని ఇలియూ మండి పడ్డాడు. అప్పట్లో లాసినా రావటం తటస్థించినా సరే ఆమెపైన కూడ యిలాగే కన్నెబున్నె మనేవాడు.

కాని, లాసినా ఆనాడసలు రానేలేదు. ఇలియూ ఒక్కడే దుకాణంలో కూచుని వున్నాడు. ఎంత సేపటికీ ప్రొద్దు గడుస్తున్నట్టు లేదు. పెందలాడే దుకాణం మూసి వేశాడు. వెనకగదిలో పక్కమీద వాలాడు. అక్కడి ప్రశాంత వాతావరణం వానికి మరింత దుర్భర మయింది. అప్పుడు వానికి లీపా జ్ఞప్తి కొచ్చింది. తన్ను మనసార ప్రేమించి నిష్కపటంగా వర్తించినది లీపా ఒక్కతే ననుకున్నాడు.

ఆ రాత్రి వానికి కూరుకు రానేలేదు. ఏమాత్రం అలికిడయినా తన కోస మెవరో వచ్చినట్లు లేచి కూర్చునేవాడు. ఒంటరితనం వానిని వేధిస్తోంది. రేయంతా జాగారం చేసి కోడి కూయగానే లేచి కాల కృత్యాలు నివృత్తి చేసుకున్నాడు. నిద్రలేమివల్ల తలదిమ్ముగా వుంది. టీ తాగాలనిపించింది కాని, కాచుకోలేక మానుకున్నాడు. గ్లాసుడు చన్నీళ్ళు తాగి దుకాణం తెరిచాడు.

మధ్యాహ్నం పావెల్ వచ్చాడు. వాడి మొహం ధుమ ధుమ లాడుతోంది. "ఇలియూ! నీవు రోజు రోజుకు వున్న మతి పోతోందే" అన్నాడు రాగానే.

ఇలియా వాడి ఉద్దేశాన్ని గ్రహించాడు. వాడు కూడ తనకు ప్రతికూలుడయ్యాడనుకున్నాడు. పైకి మాట్లాడకుండా తలపంకించి ఊరుకున్నాడు.

"సోంకా సమమాసించటంలో నీ ఉద్దేశమేమి"టని పాషా తీవ్రంగా అడిగాడు.

ఇలియా వాని ప్రశ్నను ఖాతరు చెయ్యకుండానే "దేవుని పటం ముందు నుంచున్నావు. నీ టోపీతీసి అభివాదం చెయ్యవోయ్, మాటామంతీ తర్వాత చూద్దాం" అన్నాడు.

పాషా టోపీని మరింత అదుముకొని కోపావేశంతో" కానియ్యవోయ్ నీడాబు! ఎక్కడిదీ బడాయి? నాలుగురాళ్లు చేతిలో చేరాయనా? మనల్ని చూచేవాడొక డున్నాడనేదే మరిచావుగా! నీకంటికి మేమిప్పుడు కనపడుతామూ? మీ వ్యాపారస్తుల నైజమే అంత!" అనేశాడు నిప్పులు కక్కుతూన్నట్లు.

ఇలియా కొంచెం మెత్తబడ్డాడు. పాషాకి పిచ్చెంత్తిందేమోననుకున్నాడు. అసలింతకి జవాబిచ్చే దేమిటని మౌనం దాల్చాడు. ఆవిడపోయి మొరబెట్టుకుంది కాబోలు వీడు దోషం నాపైన మోపుతున్నాడు; కాని, నే నామెను కాని మాట లేమన్నాను? అసలింకా బుద్ధివచ్చే మాట లనాల్సింది." అనుకున్నాడు తనలో.

పాషా ఉద్రేకంలో అంటున్నాడు—"ఆమె విద్యావతి. అన్నిసంగతులు తెలిసిన మనిషి. చెడామడా

ట్లావే, వాళ్లెంత మంచివాళ్లు! నువ్వామెను నేర్పుగా చేజిక్కించుకోవాల్సింది; కాని, నువ్వు....."

ఇలియా వాడిని మధ్యలో ఆపి" చాల్లే, నోర్మూయ్యి! నాకు నీతులు గరపటానికొచ్చావా? నాకు మంచిదని తోచింది చేస్తా; నాయిష్టం" అన్నాడు.

"ఏమిటి నువ్వు చేస్తున్నది? నీకు బుర్రవుంది మాట్లాడుతున్నావా?"

"మీతో విసిగిపోయాను మీరువచ్చి నామతి చెడగొడుతున్నారు. (బీగువాను చేరగిలబడి ఆవులించుతూ) ఇంతకూ నువ్విప్పుడు చెప్పదలచుకున్న దేమి"టని అడిగాడు ఇలియా.

"నామాట నమ్ము. వాళ్లు చాలా యోగ్యులు. వారి స్నేహం వల్ల యెంతైనా ప్రయోజనముంటుంది."

"అలాగా! అయితే యిక్కడికెందు కొచ్చావ్? అక్కడికే పో" అని ఇలియా మొహం ప్రక్కకు తిప్పుకున్నాడు. పాషా సలహా వాడికి వెగటుతోచింది. ఇక వాడితో మాట్లాడటానికి యిష్టం లేకపోయింది. అలసి వున్నట్లు బడలికగా కూడ వుంది. ఏకాంతంగా వుంటే బాగుండు ననిపించింది.

"సరే, నేను వెళ్తున్నాన్లే. ఒక సంగతి విను: వారితో కలసి మెలసి తిరుగుతున్నందువల్లనే నాకు జీవితంలోని వాస్తవం బోధపడుతోంది. వారి దరఘురలేని జీవితం. వారను

సరిస్తున్నదే సత్యపథం. ఇల్లాంటి ఆనందజీవితాన్ని గడిపే సౌభాగ్య మిదివర కెక్కడా నాకు లభించలేదు. వారివాళ నా కాశ్రయమిచ్చి ఆదరించిన వారూ లేరని పాషా బిగ్గరగా చెప్పాడు.

"అలా అరుస్తావెందు"కని ఇలియా కసిరాడు.

"ఓరి దురాత్ముడా! అందాక వచ్చిందీ నీవ్యవహారం!" అని పాషా మొహం చిట్లించాడు.

అప్పుడొక బాలిక రాగా ఇలియా ఆమెకు కావలసినది యిచ్చాడు. ఆపిల్లయిచ్చిన రూపాయి తిరిగియిచ్చి "తరువాత యిద్దువుగాలే"నన్నాని పంపేశాడు చిల్లర యివ్వటాని కూడ బద్ధకించాడు. ప్రక్కన వ పాషా వున్నట్టే మర్చిపోయి యీల వేస్తున్నాడు.

పాషా మరి మాట్లాడకుండా లేచిపోయాడు. ఇలియా ముఖం త్రిప్పైనా చూడలేదు. ఓర చూపుతో పాషా వెడుతున్నట్టు మాత్రం గమనించాడు.

అప్పుడొక కుక్కవచ్చి దుకాణంలోకి తొంగిచూచి వెళ్ళిపోయింది. తర్వాత ఒక బిచ్చకత్తె వచ్చి చేయి చాచింది. ఇలియా చేత్తో వెళ్ళిపొమ్మన్నాడేగాని ముష్టి పెట్టలా.

రోడ్డుమీద సందడిగా నేవుంది; కాని, ఇలియా హృదయం శూన్యంగావుంది. వాడేదో అవ్యక్త వేదన ననుభవించుతున్నాడు.

ఈ విధంగా రోజులు దొర్లిపోతున్నై. ఇలియా నియమంగా దుకాణం తెరచి వ్యాపారం సాగిస్తూనే వున్నాడు. తనతో యితరుల కవసరం లేదనీ, తనకూ యిక యెవరితోను పనిలేదనీ, ప్రస్తుతం బిక్కుబిక్కు మంటున్నా క్రమంగా అలవాటయితే యెవరి పొత్తు లేకుండానే ఒంటరిగా సుఖజీవితం గడపవచ్చునీ అనుకున్నాడు.

గైబ్రిక్‌ను నౌకరీలో నుంచి తీసివేసిన తర్వాత ఒక వంట కత్తెను కుదుర్చుకున్నాడు. ఆమె అనాకారి. చూడటానికి అసహ్యంగా వుండేది. ఆమెను చూచి "నాకళ్ళ కింత కంటె అందమైన వాళ్ళను చూచే అదృష్టం లేదు కాబోలు! నాజన్మ నిరర్థకం. నాజీవితం నిష్ప్రయోజన" మనుకొని, నిరాశ చెందేవాడు.

మిత్రుల రాకపోక లొక్కసారిగా కట్టడి పోయినై. ఆదిలో కొత్త కొత్తగా వున్నా, క్రమంగా ఇలియా ఒంటరి జీవితానికి అలవాటు పడ్డాడు.

30

ఒక నాటి సాయంత్రం ఇలియా దుకాణం మూసివేసి షికారు బయల్దేరాడు. అక్కడక్కడ తిరిగి చివరకు మైదానంలో ఒక చెట్టుక్రిందికి చేరి కూర్చున్నాడు. సమీపంలో ఒక యువతి పెంపుడు కుక్కను ముద్దులాడుతూండడం చూచాడు. కుక్క యెగిరెగిరి యువతి భుజం మీద కెక్కటానికి ప్రయత్నిస్తోంది. కుక్కతో ఆడుకోవడం ఆ పడుచుకెంతో వుల్లాసంగా వుంది.

ఇలియా ఆ దృశ్యాన్ని చూచి 'కలవాళ్ళు కుక్కల్ని ప్రేమించుతున్నారు. ప్రేమించటానికి పేదలకు మనుష్యులు దొరకనట్లు' అనుకున్నాడు. అప్పుడు వాడికి మాషా, పాషా, జాకోబులు తలపు కొచ్చారు. పని వున్నంత సేపు అంతా తనచుట్టూ చేరేవారనీ, యిప్పుడెవరూ కంటికి కన్పడటం లేదనీ, అందరూ స్వార్థులేననీ తలపోశాడు. ఎదురుగా వున్న తరుణిని చూచి "ఇప్పుడు లాసినా వుంటే యెంత బాగుండేది! ఆవిడకి వేసవిలో పల్లెటూరి గాలి కావాల్సొచ్చింది! ఆమె వున్నా కాలక్షేప మయ్యేది" అనుకున్నాడు.

మర్నాటి ఉదయం జాకోబును చూచి రావాలనుకున్నాడు, కాని అందుకోక అభ్యంతరం వచ్చింది. టెరెన్సు యాత్ర ముగించి ఆపూటే వస్తున్నానని రాసిన జాబు

ఇలియా కందింది. వాడు గదిలో కూర్చొని పిన్నబ్బ వస్తే తన యేకాంతం భంగమవుతుందే అని ఆలోచిస్తున్నాడు. అడు గడుగునా తన కేదో అపాత్రం వచ్చి పడుతున్నట్టు తోచింది. తన శాంతి కెవరో ఒకరు అడ్డు పడుతున్నారని భావించాడు.

ఇలియా యీవిధంగా యోచనా నిమగ్నుడయి వుండగా ముందరి తలుపు తట్టిన చప్పుడయింది. వంటమనిషి మోనని ఇలియా వెళ్లి తలుపు తీసిచూస్తే వాకిట్లో ఒరెస్సు నిలబడున్నాడు.

"ఏమోయ్! వ్యాపారస్థుడ! రెండు వారలు ప్రొద్దెక్కినా యింకా దుకాణం మూసేవుంది!" అని ఒరెస్సు నవ్వాడు.

ద్వారం మధ్య నిలబడివున్న ఇలియా మందహాసం చేస్తూ పినతండ్రికి స్వాగతం చెప్పాడు. ఒరెస్సు అలసి నట్టున్నా వుత్సాహంగా వున్నాడు. "పెట్టెని లోపలికి తీసుకొనిపద" మని ఒరెస్సు పెట్టె-బేడ చూపించాడు.

ఇలియా మౌనంగా సామాను జేర వేస్తున్నాడు. ఒరెస్సు లోపలి కెళ్ళగానే యెదురుగా కనపడిన క్రీస్తుపటానికి ప్రణమిల్లాడు. "నీదయవల్ల సుఖంగా తిరిగి వచ్చా" నంటూ కూచున్నాడు. సామాను లోపలికి చేర్చివచ్చి ఇలియా పినతండ్రి ముందు కూచుని కుశల ప్రశ్న లడిగాడు. ఒరెస్సు పూర్వం కంటె లావుపారాడు. కళ్ళలో కాంతి వుంది. మనిషి దిగులు లేన ట్టున్నాడు.

తర్వాత పెరెన్ను స్నానం చేసి వచ్చాడు. తన యాత్రా వివరాలు చెపుతూ చూచిన ప్రదేశాలను గూర్చి కళ్ళకు కట్టినట్టు వర్ణించాడు. చెపుతూంటే సంతృప్తి, సంతోషాలచే వాని కళ్ళు మెరిసేవి. పినతండ్రిలో కలిగిన మార్పుకు ఇలియా సంతోషించాడు.

బయట చినుకులు పడనారంభించి క్రమంగా తీవ్రమయింది.

"మీ మానసిక సంతాపం వుపశమించి నట్టేనా? పాప భారం తగ్గిందిగద?" అన్నాడు ఇలియా.

పెరెన్ను ఒకక్షణమాగి "అబ్బాయ్! నే నాపాపం యిచ్ఛా పూర్వకంగా చేసింది కాదు. అయినా అది బిగువైన కొత్తచెప్పు పాదాన్ని కరచినట్టు నాహృదయంలో పుండు చేసి వేధించింది. నే నాపనిని బలాత్కారంగా చేయాల్సి వచ్చింది. నే నందుకు అంగీకరించి యుండకపోతే పెట్రుహా న న్నప్పుడే పనిలోనుంచి తొలగించేవాడు" అని చెప్పాడు.

"అలాగా!"

"అందువల్లనే నేను తీర్థయాత్రకు వెళ్లాను. పుణ్యక్షేత్రాలను దర్శించటంతో సంహృదయ భారం తగ్గిపోయింది. నేను పాపినే కాని, ప్రాయశ్చిత్తానికి సిద్ధంగా వున్నానని భగవంతునికి విన్నవించుకున్నాను."

"అయితే మీరు పాప పుణ్యాల జమాఖర్చుల్ని బరాబరి చేశారన్నమాట?" అని ఇలియా బిగ్గరగా నవ్వాడు.

"అది భగవదభీష్టం మీద ఆధారపడి వుంటుంది."

"మీ ఆత్మ యేమంటోంది?"

"అంటే?"

"మీకు శాంతి లభించిందా?"

"ఆ, నా హృదయం శాంతించింది."

ఇలియా మళ్ళీ నవ్వాడు.

"నవ్వుతా వెందుకు? ఏకాగ్ర చిత్తంతో భగవంతుని ప్రార్థించితే శాంతి లభించితీరుతుం" దన్నాడు పెరెన్ను ఆత్మవిశ్వాసంతో.

ఇలియా టీ తాగి కిటికీదరికి పోయి వర్షంలోకి చూస్తూ నిలబడ్డాడు. వర్షాధిక్యం వల్ల జనసంచార మాగిపోయింది. వాన నీరు కాల్వలు గట్టి కలవరం చేస్తూ పారుతోంది. చూరుల క్రింద నక్కిన జనాన్ని చూచి ఇలియా నవ్వు కున్నాడు.

ప్రార్థనకు మనహా మానవుని వశంలో యింకే ముంది!" అన్నాడు పెరెన్ను.

"అయితే మంచి మాటమే! నిత్యము పాపం చేసి ప్రార్థనతో మాపుకో వచ్చుగా!"

"ఒక దఫా ప్రాయశ్చిత్తం అయిన తర్వాత మానవుడు మళ్లీ పాపానికి ఒడిగట్ట లేడు" అన్నాడు ఔరెన్సు గంభీరంగా.

"ఎందువల్ల?"

"ఆత్మను పవిత్రంగా వుంచుకోటానికే."

"అసలు పవిత్రంగా వుండాలన్న అవసర మేమిటని నాజిజ్ఞాస."

ఔరెన్సు మొహం చిట్లించి "నీమాటలన్నీ చిత్రంరా" అన్నాడు.

ఇలియా పెడమొగం పెట్టి "అందులో చిత్రమేముంది? నేను నిజాన్నే అడుగుతున్నాను" అన్నాడు.

"అలా అనొద్దు నాయనా! పాపం ప్రపశమించుగాక!"

"పాపం యేం చేస్తుం దేమిటి."

"భగవంతుడు శిక్షిస్తాడు."

"అది మాత్రం అబద్ధం."

"ఎందుకాకూడదు? భగవంతుడు శిక్షించి తీరుతాడు. పాపం చేసి నే ననుభవించలా?"

"ఎప్పుడు? మీ రనుభవించిం దేమి" టని ఇలియా ఔరెన్సు వంక చూచాడు.

"నాప్రాణం తీయటానికహర్నిశలు యెవరో పొంచి వున్నట్లు నే నెప్పుడూ భయపడుతూండే వాడిని."

"నేనూ పాపం చేశాను కాని, నాకలాంటి భయమేమీ లేదే?"

"అది పొరపాటు. నువ్వు ఏకాంతంలో వుంటంవల్ల కనపడటంలా; అంతే."

"నేను చెప్తున్నది నిజమే బాబూ!... అయితే మొత్తం మీద జీవితం దుర్భరంగానే వుంది. అందు క్కారణం మాత్రం తెలియటంలా."

ఔరెన్సు బల్ల గుద్ది "ఆఁ అదీ! జీవితం దుఃఖదాయకంగా వుందని ఒప్పుకుంటున్నావు గద?" అన్నాడు.

"మిత్రులంతా నన్నొదిలేశారు"

"ఇంకేం, అది తమ్కువ శిక్షా?" అన్నాడు ఔరెన్సు.

ఇలియా అరచేత్తో గోడమీద రుద్దుతున్నాడు. వాని వైఖరి ఔరెన్సును కలత పెట్టింది. ఇలియా స్వవిషయం స్నితులతో చెప్పకొని యెన్నాళ్లో అయింది. ఇవాళ హృదయంలో పేరుకున్న దంతా వెళ్ళగక్కి బరువు తగ్గించుకోవాలనుకున్నాడు

"మీ తీర్థయాత్రలు నిరర్థకము, నిష్ప్రయోజనం కూడాను. నిత్యము లూటీలు, దోపిడీలు జరుగుతూనే వున్నై. వాటినిగూర్చి ఆలోచించే దెవడు? ఒకని కష్ట నష్టాలతో యింకొకడి కేం పని? ఈ జరిగే అక్రమాలకు యెవడు శిక్షించుతున్నాడు? ఎవడూ లేడనే చెప్తాను. సంఘశాసనా లెవర్ని శిక్షిస్తున్నాయి? నిరపరాధులూ,

దురదృష్టవంతులూ శిక్షింపబడుతున్నారు. శ్రీమంతులు, తెలివిగలవాళ్ళు, యుక్తిపరులు శిక్షార్హులయినా తప్పించుకొంటున్నారు ”

అని ఇలియా చెప్పుకొని పోతూంటే ఒరెన్సు వానిని సమీపించి రెండు చేతులూ పట్టుకొని “నీ కీ ప్రపంచ గొడవలు వద్దురా అబ్బాయ్! అవన్నీ బుర్రకెక్కించుకొని వుద్రిక్తుడ్నై జీవితం పాడు చేసుకోకు నాయనా” అన్నాడు.

అప్పుడు బయట యేదో చప్పుడయింది. వాన జోరుగానే కురుస్తోంది. “ఏమిటయి వుంటుం”దని ఒరెన్సు అడిగాడు.

ఇలియా తలుపు తీసి చూసివచ్చి “దేవదారు పెట్టెల దొంతర పడిందిలే” అన్నాడు.

ఒరెన్సు సామాను మూటలు విప్పుతూ “ఈ విధమైన తర్క వితర్కాలతో దేవుని కయిష్టం కల్గించటమే కాక నీ ఆత్మను కూడ అపవిత్రం చేసుకుంటున్నావు. నీ యీ ధోరణి సుఖ-శాంతులను దూరం చేస్తుంది. తీర్థయాత్రల్లో నా కనేకమంది పుణ్యాత్ముల దర్శనం లభించింది. వారి సత్సంగంలో నే నెన్నో సదుపదేశాలు పొందాను” అని చెప్పాడు.

ఇలియా ఆ మాటలు వింటూనే యిక ముందాయనతో కలిసివుండటం యెలాగా అని ఆలోచిస్తున్నాడు.

తండ్రి, కొడుకులకు రోజు లానందంగానే గడిచిపోతున్నై. ఒరెన్సు గైబ్రిక్ స్థాన మాక్రమించాడు.

రాత్రిళ్ళు నిద్రించేముందు ఒరెన్సు ఇలియూ కనేక ఆధ్యాత్మిక విషయాలు బోధించుతూండేవాడు; కాని, ఇలియా కవి చెవి కెక్కేవి కావు. వాని అంతరంగంలో మామూలు భావయుద్ధం సాగుతూనే వుండేది.

ఒక రోజున ఒరెన్సు పెట్రుషాను చూచి రావటానికి వెళ్ళాడు. తిరిగి వచ్చినప్పుడు వాని మొహం కందగడ్డలాగుంది. ఇలియా "విశేషా లేమి"టని అడగ్గా "ఏమీ లే" వని మాత్రం చెప్పి వూరుకున్నాడు.

"జాకోబు బాగున్నాడా?" అని ఇలియా మళ్లీ ప్రశ్నించాడు.

"వాడి చావు దగ్గరకు వస్తోంది. దగ్గు వాడిని కృంగదీసివేసింది. నిన్నడిగానని చెప్పమన్నాడురా అబ్బాయి!" అని ఒరెన్సు అవతలి కెళ్ళాడు.

తరువాత మరికొన్ని రోజులు సాఫీగా గడచిపోయాయి. ఇలియా హృదయం లోలోపల కుములుతూనే వుంది. వానికి మిత్రులు, పరిచితులతోడి సంబంధం బొత్తిగా తెగిపోయింది. పావ్కా, మాషాలు నూతన మిత్రులతోనే వుంటున్నారు. బండి బోల్తాపడి దెబ్బలు ప్రమాదంగా తగలటంవల్ల మతిస్సా చచ్చిపోయింది. ఫర్ఫిస్కా జాడే తెలియదు. ఇలియా ఒకటి రెండు సార్లు జాకోబును చూచి వద్దా మనుకున్నాడే గాని, వెళ్ళలేక పోయాడు.

ఇలియా ఒకనాడేదో వారపత్రిక పుటలు తిరగేస్తున్నాడు. అందులో ఒకచోట పావ్కా పేర ప్రకటింపబడ్డ

గీతాన్ని చూచి ఆప్యాయంగా చదివాడు. వాని కళ్లముం దప్పుడు పాషాక్రూపం నాట్యమాడి నట్టుంది. పాషా ఆగీతంలో తానె ట్లనాథుడై గాలిగా తిరిగిందీ, నా అన్న వాళ్లు లేక పంచ పంచలబడి గ్రుమ్మరుతూండగా నూతన సమాజాన్ని నిర్మించే ఆశయంగల కొందరు వ్యక్తులు తన కాశ్రయమిచ్చి నూతన మార్గంలో పెట్టిందీ వర్ణించాడు.

ఆగీతాన్ని పూంతం చదువుటతో ఇలియాసు ఒళ్ళు మండింది. పత్రికను విసరి నేలకేసి కొట్టాడు. "తొందరెందు కోయ్? వాళ్లదయ యెంతవరకో చూస్తాగా!" అని పళ్ళు పట పట లాడించాడు. కొంచెమాగి 'వాళ్లవద్దకు పోయి క్షమాపణ కోరితే! అయినా వాళ్ళు నన్నెందుకు క్షమి స్తారు?" అనుకున్నాడు.

కోపం చల్లారిన తర్వాత పారేసిన పత్రికను తెరచి మళ్ళీ ఆగీతాన్నే చదివాడు. ఈసారి వాని స్మృతిపథంల సోంకా రూపం పొడకట్టింది. 'ఆబిడకు తలబిరుసు మహాజాస్తి' అనుకున్నాడు.

పత్రిక పుటలు త్రిప్పుతూవుంటే మరోచోట వేరాకేసు విచారింపబడుతుందన్న వార్త కనపడింది. వేరా మీద చోరీ నేర మారోపించ బడినదన్న తలంపుతో ఇలియాసు హృదయం క్షోభించింది. పాషాను ద్దేశించి కిరాతకా! బాగా వున్నన్నినాళ్ళు అనుభవించి, యిప్పు

డామె కారలో కుళ్ళుతూంటే నువ్వు నిశ్చింతంగా కవిత రాసుకొంటున్నావా?" అని ఆక్రోశించాడు.

అదే సమయంలో టెరెన్సు కళ్లు మూసుకొని, చేతులు ముకుళించి "భగవాన్! నీ దయాభిక్షకు చేతులు చాచాను. నన్ను కరుణించు స్వామీ!" అని ప్రార్థన చేస్తున్నాడు.

తరువాత యువతలికొచ్చి పత్రిక పుటలు తిరగేస్తున్న ఇలియాతో "ఒరే అబ్బాయ్! పెట్రిహా నన్ను మోసం చేశాడు చూచావా" అన్నాడు.

ఇలియా పినతండ్రివంక చూస్తూ 'నీకు తగిన శాస్తే జరిగిందిలే' అనుకున్నాడు తనలో.

"ఇలియాం! వాడు నన్ను దగా చేశాడురా" అని టెరెన్సు మళ్ళీ చెప్పాడు.

"అసలు మీరు అపహరించిన మొత్తమెంత?"

టెరెన్సు పీట నవతలికి లాగి కూచుని వ్రేళ్ళపైన లెక్క పెడుతున్నాడు.

"పదివేలుంటుందా?" అనడిగాడు ఇలియా మళ్లీ.

"ఎబ్బే! అంతెక్కడిది? మూడు వేలకు పైగా వుంటుంది."

"నేను నమ్మను. జర్మియావద్ద యింకా యెక్కువే

వుండాలి."

"లేదు ఇలియా! నువ్వు పొరపడ్డావు."

"పొరపా టేమిటి? నా కాయన స్వయంగా చెప్పి తేను" అన్నాడు ఇలియా కృథంగా.

"జర్మియాను లెక్క తెలునా?"

"మీ కంటే బాగానే తెలుసు."

ఒరెన్బు ఆలోచన్లో పడ్డాడు. తలొంచుకొని "అయితే పెట్రిహా నన్ను పూర్తిగా దగా చేశా డన్నమాట?" అన్నాడు.

"ఇంతకూ వాడు మీ కిచ్చిన దెంత?"

"ఏ డొందలే, నిజంగా పదివేలు వుంశి దంటావా?"

ఇలియా జవా బివ్వలా. ఒరెన్బు దీనవదనం చూస్తున్నకొద్దీ ఇలియా కడుపుమంట రగుల్తోంది.

"పెట్రిహా నన్నింత మోసం చేస్తా డనుకోలా." ఒరెన్బు మెల్లగా అన్నాడు

"చాల్లే, యిక నోరు మూసుకోండి."

"అంతకంటె చేసేదిమాత్రం యే ముందిలే."

ఇలియాకి ఆలోచన కలిగింది. 'డబ్బుకోసం మానవులెట్టి నీచానికైనా సిద్ధపడుతున్నారు. నాకే రెండు లక్షల రూపాయలుంటే వీళ్ళకి నా శక్తిని చూపిద్దును. ఈ స్వార్థ

వరు లాకొక్కడినే నా యెదుట పొట్టతో సాకించే వాడి' నని తలపోశాడు. వాని క్రోధం ముమ్మరమై మో మెర్రబడింది. సమాజంపైన రోత మిక్కుటమై పిడికిలి బిగించాడు. ఆ ఆవేశంలో ఘట్టిగా బల్లమీద గ్రుద్దబోయి అంతలో వుద్వేగంతో కంపిస్తూ తనపైనె చూడ్కి నిల్పి యున్న ఔరెన్నును గాంచి ఆగిపోయాడు.

ఇలియా అక్కడనుంచి మెల్లగా వెళ్లిపోయాడు. ఔరెన్ను వానివైపే వింతగా చూస్తూ వుండిపోయాడు.

పినతండ్రి తన మనోవైకల్యాన్ని గ్రహించి, తన భావాలను తెలిసికోగోరుతున్నట్టు ఇలియా ఆక అందుచే వీలైనంతవరకు ఔరెన్నుకు మొహం దుకు ప్రయత్నిస్తున్నాడు.

ఇలియాకు తన యీ స్థితి దుస్సహంగా వుంది. ఎప్పుడూ చింతాక్రాంతుడై వుంటున్నాడు. రోజురోజుకు తా నధఃపతన మౌతున్నట్టు తలిచాడు. తన కెవరో ఘోర దురన్యాయం చేస్తున్నట్టు కలత చెందేవాడు. తుదకు తన పాప ఫలితమే తన్నట్టు వేధిస్తోం దనుకున్నాడు.

పల్లెటూరికి విహారానికి వెళ్ళిన లాసినా ఔరెన్ను వచ్చిన కొన్నాళ్ళకు తిరిగి వచ్చింది. ఆబిడ దుకాణంలో ఔరెన్నును చూడగానే మూతి విరిచింది.

ఔరెన్ను లేనుండా చూచి "ఇతడేనా మీ పిన్నబ్బ?" అనడిగింది లాసినా.

"అవు" నని ఇలియా చెప్పాడు.

"ఇక నీతోనే వుంటాడా యేం?"

"తప్పకుండాను."

ఇలియూ జవాబు తీవ్రస్వరంలో వుంది. ఆ సంగతి గ్రహించి లాసినా యింకేమీ ప్రశ్నించలా. ఇలియూ ఆమెతో లడాయికోసం సిద్ధంగా వున్నాడు; కాని, అందు కవకాశ మీయకుండా లాసినా గప్‌చిప్‌గా చిత్రా, అవ స్త్రాలు చూచుకో సాగింది. మధ్యమధ్య తాను పల్లెటూళ్ళలో చూచిన వింతలు, విశేషాలు చెప్తోంది.

ఉన్నట్టుండి ఇలియూ కళ్ళలోకి చూస్తూ "నా యందు నీ కంత కోప మెందుకు ఇలియూ?" అనడిగింది.

ఆమె మొహంమీద ముడత లేర్పడ్డై. కళ్ళు మెరు స్తున్నై. ఇలియూ కప్పు డామె జగన్మోహినిగా కనపడింది. అటూ యిటూ చూచాడు. తా మిద్దరే వున్నారు. ఇలియూ లేచి వెళ్ళి లాసినా భుజాలమీద రెండు చేతులూ వేశాడు. ఆమె యందు ద్వేష మున్నప్పటికీ కామోద్రేకంలో వాని కళ్ళు మూసుకొని పోయినై. ఆమెను గట్టిగా కావిలించు కోవాలన్న కోరిక ప్రబల మయింది. లాసినా వాని బాహు పాశంలో నుంచి విడవడటానికి గింజుకుంటోంది. "నీకు పిచ్చి యెత్తిందా యేం? ఏమిటీపని? ఇది సగసాలకు తగిన తావేనా? ఎవరైనా చూస్తే! నన్నొదిలిపెట్టు ఇలియూ! మా బాగాను నిక్కడినుంచి పంపివెయ్యి. వాడి గూని చూచి దుకా

గ్గానికి వచ్చిన వాళ్లు తిరిగి పోతారు కూడాను" అని వాని చేతుల్ని తోసి వేస్తోంది.

ఇలియూ ఆమెవిముఖత్వాన్ని లక్ష్యపెట్టలా. మోహాంధుడై బాహుబంధాన్ని మరింత బిగించాడు. ముద్దు పెట్టుకోటానికి లాసినా మూతికి మూతిని చేర్చబోతూండగా ఆమె చప్పున క్రిందికి జారి నేలమీద చతికిలబడింది. తర్వాత లేచి దూరంగా పోయి నిలబడి కురులు సరిచేసుకుంటూ "నీవు శుంఠలాగున్నావు. వేళాపాళా లేదూ? ఛండాలుడా! నీ పల్లెటూరి వాసన పోనిచ్చావు కా"దన్నది మురముర లాడుతూ.

ఇలియూ దెబ్బతిన్న పాములా గయ్యాడు. వాని నుదదు వేడెక్కింది. వాని కాళ్ళు మాట్లాడుతూంటే నీటి కలకలం లాగుంది. పిడికిలి బిగించి తన దురవస్థ కాబిడే హేతువన్నట్టు మిరిమిరి చూస్తున్నాడు.

"ప్రేమోన్మాదం మంచిదేగాని, మనసును వశంలో ఉంచుకోవాలి'' అంది లాసినా.

"ఛీఛీ! పాతకీ! నా యెదటినుంచి పో" అన్నాడు ఇలియూ కసిపట్టలేక.

"నేను వెడుతున్నాన్లే. ఇప్పుడు నీతో మాట్లాడి ప్రయోజనం లేదు. అయితే ఒకమాట: ఎల్లుండి నా పుట్టిన రోజు పండుగ."

ఇలియూా ఆమెను లంకించుకొని నలిపి వేయూలను కన్నాడు; కాని, మళ్లీ యేంతోచిందో "ఇంకా వెళ్లక నుంచున్నావేం? పో" అని ఫురిమాడు.

ఆమె పోగానే జెరెన్కు లోపలికొచ్చాడు. "ఈ బిడేనా నీ భాగస్వామిని?" అనడిగాడు. ఇలియూ తలూ పాడు.

"చూపుల కీమె సుజాతగా కన్పించటం లేదే?"

"అవగుణాల కాటపట్టులెండి."

జెరెన్కు ఇలియూవంక అనుమానంగా చూచాడు.

"ఎందుకలా చూస్తా"రని ఇలియూ తీవ్రంగా అడిగాడు.

"ఏం లేదు."

"నే నామెను గురించి చెప్పింది యదార్థమే. ఇంకా అంతకంటే పాపాత్మురాలు!" అని ఇలియూ నవ్వాడు.

"ఇందువల్ల తేలే దేమంటే—"

ఇలియూ జెరెన్కును పూర్తిగా చెప్పనివ్వకుండా "ఏమి తేలిం"దని ప్రశ్నించాడు.

జెరెన్కు తొట్రుపడ్డాడు. ఇలియూ ధోరణి వానికి క్షోభ కలిగించింది. నీళ్లు నములుతూ "ఆమెను గురించి నాకంటె నీకే బాగా తెలుసు" అన్నాడు.

"అవును, నాకు బాగా పరిచితమే" అని ఇలియూ గొణగసాగాడు. వీళ్ళమధ్య తనకిక సుఖం లేదనీ, యెక్కైనా పారిపోతే శాంతిగా బ్రతకవచ్చనీ అనుకున్నాడు. వాని కిప్పుడు మళ్ళీ సంఘంపైన రోత కలిగింది. వీళ్ళు వేధించి వేధించి యెప్పుడో తన ప్రాణం తీసేస్తా రనుకున్నాడు. ఈ విధమైన భావపరంపర చుట్టుముట్టుతూంటే యికనక్కడ వుండలేక "కాస్సేపెక్కైనాపోయి తిరిగివస్తా"నని ఔరెన్స్తో చెప్పి బయల్దేరాడు.

బయటికొచ్చినా ఇలియూ మానసికాందోళన తగ్గలా. ఆకాశంనిండా మబ్బు కమ్మింది. క్రితంనాటి వర్షంవల్ల రోడ్డు జీరుకుగా వుంది. మైదానంలో పల్ల-పల్లాలు నీటితో నిండి వున్నై. చెట్ల ఆకులింకా తడిగా నేవున్నై.

"దుకాణం ఒదిలిపెట్టి వచ్చినా నాకు శాంతి లభించేట్టు లేదు. శాశ్వత శాంతికి ఆత్మహత్య ఒకటే మార్గ" మనుకుంటూ నడుస్తున్నాడు.

31

అది సెప్టెంబరు యిరవై మూడో తేదీ. నేరా విచారణ ఆవాళే. ఇలియా పొద్దున్నుంచే కోర్టుకు వెళ్ళే సన్నాహంలో వున్నాడు. పైదలాడే ఫోను చేసి బయల్దేరాడు.

ఇంకా వేళ కాకముందే ఇలియా కోర్టుకు చేరుకున్నాడు. ఒకరొకరే అక్కడికి చేరుతున్నారు. ఇలియా వరండాలో కూచుని ముందున్న ఖాళీ ప్రదేశంలోకి చూస్తున్నాడు. మేఘాలు పరుగులు తీస్తూ సూర్యుని మరుగు చేస్తున్న యెండ తెరలు తెరలుగా పడుతోంది పచ్చికమీద.

అక్కడికి వచ్చినవారిలో అనేక రకాల మనుషులున్నారు. కేసులకు సంబంధించినవారు యెదురు పార్టీలను చూచి మొహాలు చిట్లిస్తున్నారు. చేతులు తడైన సాక్షులు వకీళ్ళు నేర్పిన పాఠాలు వల్లెవేస్తున్నారు. చెట్లుకింది ప్లీడర్లు పల్లెటూరి అమాయకులకు ధైర్యం నూరి పోస్తున్నారు. చంకలో కాయితాలకట్ట లిరికించుకొని ప్లీడరు గుమాస్తాలు హడావుడిగా తిరుగుతున్నారు. విచారాక్రాంతులై ముద్దాయిలాందోళన పడుతున్నారు.

ఇలియా తన ప్రక్కన కూచొని మాట్లాడుకొంటున్న కోర్టుపక్షుల సంభాషణ నాలకించాడు. ఆరకం మనుషులు మోసగించి, వచించడానికే పుట్టి, బ్రతుకుతున్నారా అను

కున్నాడు. అంతలో "అదిగో! కోర్టు తెరిచా" రన్నాడొకవ్యక్తి.

అందరూ అటు వేపుకు కదిలారు. ఇలియా లోపలి కెళుతూంటే ఒకరిద్దరు వానిని ప్రక్కకు నెట్టి ముందుకు చొరబడ్డారు. ఇలియా ఒళ్ళుమండి "దొంగ ముండా కొడుకులు! ఏమి ఠీవిగా పోతున్నారు! వీళ్ళకు జడ్జీదగ్గిరనే ఆసనాలేసి వుంచారు కాబో" లన్నాడు పైకి వినపడకుండా.

విశాలమైన కచ్చేరీ హాలులో యెదురుగా యెత్తైన దిమ్మమీద ఒక మేజా, దాని వెనక మూడు వున్నతాసనాలు వున్నై. హాలుమధ్య నిలువుగా పచ్చని గుడ్డతో కప్పబడిన పొడుగాటి బల్ల, దాని కిరుప్రక్కల కుర్చీలు వున్నై. వాటిలో నల్లకోటులు ధరించిన లాయర్లువచ్చి కూర్చుంటున్నారు. ఉన్నతాసనాలకు వెనక గోడను క్రీస్తు, చక్రవర్తి పటాలు వ్రేలాడుతున్నై. కిటికీలకు తెరలున్నై. జవాన్లు చప్పుడు కాకుండా తిరుగుతున్నారు. ఒక బంట్రోతు వచ్చి 'న్యాయమూర్తులు వేంచేస్తున్నా' రని హెచ్చరించాడు. అదివరకున్న సద్దణిగి నిశ్శబ్ద మావరించింది.

వెనక ద్వారంగుండా న్యాయమూర్తులు ముగ్గురు ప్రవేశించారు. అందరూ లేచి నిలబడ్డారు. ప్రధాన న్యాయమూర్తి — గ్రోమోవ్ మధ్యనున్న ఆసన మలంకరించాడు. ఆయనకు కుడివైపున వృద్ధ న్యాయాధిపతి ఆసీనుడయ్యాడు. మూడో పీఠాన్ని యువక జడ్జి ఆక్రమించాడు. వారికి ప్రక్కగా జూరీలు కూచున్నారు. కాస్సే పందరూ

యెదుట బల్లలపైనున్న కాయితాలను చూచుకుంటున్నారు. ఇలియూం గౌరవభావంతో వారివంకే చూస్తున్నాడు.

ఇలియూ దృష్టి జూరీలలో సుఖాసీనుడయి వున్న పెట్రిశాపైన పడింది. ఒకటి రెండు తడవలు ఇలియూ పెట్రిశాల చూపులు కలిశాయి కూడాను, జూరీలలో పెట్రిశానుగాంచి ఇలియూ కడు పుడికింది. 'వీడు పక్కా బద్మాష్! జూరీగా వుండటాని కనర్హు' డని జడ్జీలతో చెప్ప దామా అనుకున్నాడు ఇలియూ.

అప్పుడు గ్రోమోవ్ "నీ మీద అపరాధం......" అని యేదో అభియోగాన్ని గూర్చి ప్రారంభించాడు. ఆ మాట లెవరి నుద్దేశించి అన్నవో ఇలియూకు తెలియలా. వాని దృష్టి పెట్రిశాయందె వుంది. అలాంటి క్రూరుడు, వంచకుడు తీర్పరెలా కాగలిగాడా అని తనలో తాను వితర్కించుకొంటున్నాడు.

ప్రి. న్యా. మూర్తి మళ్ళీ ప్రశ్నించాడు—"నీ వా వస్తువు లన్నిటిని తిరిగి యిచ్చివేస్తానని వర్తకునితో చెప్పావా?"

"అవు" నని బోనులోవున్న ముద్దాయి జవా బిచ్చాడు.

ఇలియూ జూరీలను బాగా పారజూచాడు. వారిలో తా నెరిగిన వాడింకొకడున్నాడు. అతడొక దివాలా కోరు.

జడ్జీ అడిగాడు— "నీవు వర్తకుని యింటికి నిప్పంటించుకోవటం చూచావా?"

"చూచానండి" అన్నాడు ముద్దాయి.

ఇలియా పక్కనున్నవారిలో ఒకడు "తెలివి తక్కువ దద్దమ్మ!" అన్నాడు.

"ఎవరు తెలివి తక్కువ దద్దమ్మ?" అనడిగాడు ఇలియా ప్రాకులాడలేక.

ఇలియా ప్రక్కనున్న నల్లటి మనిషి "ఇంకెవరు, ఆ ముద్దాయే. కేసును తలకిందులు చేసే పాయింటును పాడు చేసుకున్నా" డన్నాడు.

ఇలియా బోనులోని మనిషివంక చూచాడు. దుక్కలాగున్నాడు. పల్లెటూరి యువకుడు. చోరీలో ఆరితేరినవానివలె లేడు. బిక్కమొగంతో బిత్తరచూపులు చూస్తున్నాడు. ప్రేక్షకు లందరి దృక్కులు వానిపైనె నిలిచి వున్నై.

"ఈ కేసు విచారణ మజాగా లేదు. ముద్దాయి ఒట్టి గబ్బిలాయి. వాడి ప్లీడరు అంతకంటె గాడిద! సాక్షులు అమ్ముడు పోయారు. నే నైతే కేసును బుట్టదాఖలు చేయించేవాణ్ని" అని నల్లటి వ్యక్తి గప్పాలు కొట్టాడు.

"అతను నేరం చేశాడనేనా మీ వుద్దేశం?" అనడిగాడు ఇలియా.

"వాని వైఖరినిబట్టి నే నలా అనుకోను; కాని, ఏం లాభం? చెడగొట్టేశాడు. శిక్ష తప్పదు. పల్లెటూరి వెధవకి కేసు నడుపుకోవడం యేం తెలుసు?" అని నల్లటాయన చిన్న వుపన్యాసం దంచాడు.

"మీరు చెప్పింది నిజమే"నని ఇలియాం వానితో యేకీభవించాడు.

నల్లటిమనిషి జేబు తడివి చూచుకొని "అరె, సిగరెట్లు అయిపోయాయే! (ఇలియాంతో) ఒకరూపాయి వుంటే యివ్వండి. మళ్ళీ యిచ్చేస్తా" నని చెయి జాపాడు.

ఇలియాం మాట్లాడకుండా జేబులోనుంచి రూపాయి తీసి యిచ్చాడు. తర్వాత "పత్రికవాళ్లని దోచుకుంటానికి మీరు మంచి వుపాయమే కనిపెట్టా" రని నవ్వాడు. నల్లటాయన చల్లగా లేచి బయటికి దారి పడుతూంటె వాని స్నేహితు డింకొకడు లేస్తూ, "మర్యాద లేకుండా నటయ్యా మాట్లాడేది?" అని చక్కాపోయాడు.

అంతలో ప్రభుత్వ న్యాయవాది సింహగర్జన వినపడింది. ఇలియాం చూపటు మళ్ళింది.

"న్యాయమూర్తులారా! జూరీమహాశయులారా! సింది తుని వాఙ్మూలాన్ని తమ రాలకించారు. నానాల వైఖయతను లటుంచి, ముద్దాయి వాఙ్మూలమే నేరాన్నంగీకరించుతోంది.........కాబట్టి యితడు ప్రజాశాంతి–భద్రతలకు

ప్రమాద కరుడని స్పష్టమే. అందువల్ల......" అని ప్రతి న్యాయవాది వాదించాడు.

ప్ర. న్యాయవాది తన పేరుచ్చరించినా, గట్టిగా బల్లమీద గ్రుద్దినా, బిగ్గరగా హుంకరించినా ముద్దాయి. పులిక్కి పడేవాడు.

ఇలియా తల వొంచుకొని వింటున్నాడు. వాని కంతా అయోమయంగా వుంది. వాని బుర్రలో అల్లకల్లోలంగా వుంది. వాని కళ్ళముందు పెట్రిషా మబ్బులో చంద్రునిలా తేజరిల్లుతున్నాడు.

న్యాయమూర్తులు ఫలాహారానికి లేచారు. అందరితో పాటు ఇలియా కూడ చెట్టుకిందికి వెళ్లాడు. నల్లటి మనిషితో వున్న పొట్టివ్యక్తి "వాడు తాను నిప్పు పెట్టలేదని ఒట్లు పెట్టుకొని చెప్పాడు; కాని, యిక్కడ ఒట్లు, ప్రమాణాలను లక్ష్యపెట్టేదెవరు? కోర్టు కీడ్వబడిన తర్వాత ప్రతి ఒప్పుజప్పి కొరడా దెబ్బలకు సిద్ధపడాల్సిందే. కేసు అవక తవకగా వుంది. వర్తకుని యిల్లు తగులబడి పోయింది. ఇంట్లోని సామాను దోచుకోబడింది. కాబట్టి యెవడికో ఒకడికి కోర్టులో శిక్ష విధింపబడితీరాలి. వీడు పట్టుబడ్డాడు; కాబట్టి అపరాధి అయినా, కాకపోయినా శిక్ష ముట్టజెప్పాల్సిందే" నన్నాడు.

"ముద్దాయినిగూర్చి మీ అభిప్రాయమేమి" టని ఇలియా వాని నడిగాడు.

"వాడు సుంత. అదే వాని దోషం. తెలివిగల వాడైతే తప్పించుకో గల్గేవాడు" అని పొట్టిమనిషి అనుభవ శాలిలా సమాధానమిచ్చాడు.

"ఇక్కడున్న జూరీలలో—" అని ఇలియా ప్రారంభించేసరికి "ఎక్కువమంది వర్తక ప్రముఖు"లని నల్లటాయన పూర్తి చేశాడు.

"నేను వారిలో యిద్దర్ని బాగా యెరుగుదు" నన్నాడు ఇలియా.

"చాలా పెద్దమనుష్యుల్లే!" అని పై వ్యక్తి నవ్వాడు.

"పచ్చి మోసగాళ్లూ, దోపిడీగాళ్లూ" నన్నాడు ఇలియా గట్టిగా.

నల్లటి వ్యక్తి సిగరెట్టుపీకను పారేసి "న్యాయ విచారణ ఒక రకమైన నాటకం. శ్రీమంతులు న్యాయమూర్తులు, జూరీలు అయి గర్భదరిద్రుల్ని, అనాథల్ని విచారణ చేస్తారు. వాళ్లని నరక కూపంలోకి దొర్లించుతారు...... గరిద్రుడు జూరీలోవుండి భాగ్యవంతులను విచారించడం నే నెన్నడు చూచి యెరుగను" అన్నాడు.

"కడుపునిండా వున్న వాళ్ళకు అనాథల బాధ తెలియదుగా."

"అది పొరపాటు. తెలిసే వాళ్లు పేదలను నాశం చేస్తున్నారు."

"శ్రీమంతులైనా, విద్యాధికులైనా న్యాయానికి బద్ధులై వ్యవహరిస్తే మంచిదే; కాని, అన్యాయానికి ఒడిగట్టేవాళ్లు న్యాయమూర్తులెలా అవుతారు?'' అని ఇలియా ప్రశ్నించాడు.

''దుర్మార్గులు, క్రూరులే తీర్పరులౌతారు. వాళ్లయితేనే దయాదాక్షిణ్యాలు లేకుండా కఠినశిక్షలు విధించగలుగుతారు. సరే, పోదాం పదండి. ఇంకేదో కేసు పిలుస్తున్నారు'' అని నల్లటి వ్యక్తి లేచాడు.

''ముందు కూర్చుందాము, త్వరగా పదం''డన్నాడు పొట్టిమనిషి.

ఇలియా తనతో మాట్లాడిన నల్లటాయన కోర్టు వ్యవహారాల్లో రాటు తేలిన మనిషిగా భావించి ఏమైనా అడిగి తెల్సుకోవాలనుకున్నాడు; కాని, వాడొక చేదెబ్బ కొట్టే ఆ నెస్తురో॰ఁ అని మళ్లీ ఆలోచించుకొని మానుకున్నాడు. పెటున్హా జూరీలో వున్నాడని తలచుకొన్నప్పుడల్లా వాని హృదయం వర్రియ్యలవుతోంది.

తిరిగి కోర్టు హాలులో ప్రవేశించినప్పుడు ఇలియా దృష్టి ఆజనంలో నిలబడున్న పాషాక్రపైన పడింది, ఇలియాకి పట్టరాని ఆనందం కలిగింది. పోయి వాని చెయి పట్టుకున్నాడు. పాషా వెనుదిరిగి చూచాడు. ఇద్దరూ నవ్వుకున్నారు.

"చూద్దామని వచ్చావా?'' అనడిగాడు పాషా.

"అవునుగాని, ఆమె వచ్చిందా?" అని ఇలియూ ప్రక్క ప్రక్కల చూస్తూ అడిగాడు.

"ఎవరు?"

"ఆబిడే, మీ సోంకా."

"మా సోంకా యేమిటోయ్? నీకెంతో, నాకూ అంతే" నన్నాడు పాషా.

ఇద్దరూ మౌనం దాల్చారు. తరువాత పోయి కూర్చుందాం ర"మ్మని ఇలియూ ఖాళీగావున్న స్థలం చూపించాడు.

"నాతో యింకా మిత్రు లున్నారులే" అని పాషా మరోవైపు కెళ్లాడు.

ఇలియూ వాని వంకే చూస్తున్నాడు. పాషా తన పుండు మీద ఒత్తినట్లు బాధ బడ్డాడు. పాషా వేసుకున్న కొత్తకోటు, నాడి శుభ్రత, కళకళలాడే ముఖము చూచి ఇలియూ కీర్ష్య కలిగింది. పాషా ప్రక్కనే సోంకా కూర్చొని వుంది. వా డామె చెవిలో యేదో చెప్పగా సోంకా తలత్రిప్పి ఇలియూ వేపు చూచింది. అది గమనించి ఇలయూ మొహం ప్రక్కకు త్రిప్పు కున్నాడు. వాని హృదయంలో ద్వేషాగ్ని మళ్లీ రగుల్కొన్నది. తల తిరుగుతున్నట్టుంది. కళ్ల ముందు చీకటి కమ్మింది. వాడప్పుడు తన చుట్టూ యేమి జరుగుతున్నదీ కూడ తెలియని స్థితిలో వున్నాడు.

వేరా పోలీసు పహరాలో కోర్టుకు తీసికొని రాబడింది. బోనులో నిలబెట్టారు. ఆమె రెప్ప వాల్చకుండా ప్రధాన న్యాయమూర్తి గ్రోమోన్ వంక చూస్తోంది.

గ్రోమోన్ వేరా వంక జాలిగా చూచి "వర్తకుని సొమ్ము వగైరా అపహరించావని నీ మీద నేర మారోపించ బడింది. అందుకు సంజాయిషీ యేం చెప్పు కుంటా" వని అడిగాడు.

ఇలియా అన్ని వైపులకు దృష్టిసారించాడు. పాపా[...]కల ఒంచుకొని వున్నాడు. సోంకా స్వాభిమానంతో మొంర పై కెత్తి చూస్తోంది.

వేరా తడబడుతూ జవాబిచ్చింది— "నేను నేరాన్ని అంగీకరిస్తున్నాను."

పంచాయతీ దారు లిద్దరు మెడలు వంకరగా పెట్టి కళ్ళార్పకుండా వేరాను తేరి చూస్తున్నారు. పెటునహా నవ్వుతున్నాడు. తతిమ్మా వాళ్లు కూడ అదో మాదిరి చూపు గా మొహపైన నిలిపారు. ఆ చూపులో మర్మాన్ని గ్రహించి ఇలియా వాళ్ళ నసహ్యించుకున్నాడు. ఇంత కుత్సితులకేమి న్యాయం చేస్తారని గొణిగి పళ్ళు నూరాడు. "ఓరి పాతకుడా! ఏమి టాలోచిస్తున్నావు? నువ్విప్పుడున్న చెక్కడో తెలుసా? నీ వా స్థానానికి అర్హుడ వేనా?" అని పెటునహాను గద్దించాలనుకున్నాడు.

కాని, వాని నోటినుంచి ఒక్క పలుకైనా బయట పడలా. ఏదో గొంతులో అడ్డ పడినట్లు ది ఒక తడవ ఆ ఆవేశంలో సగం లేచాడు కూడాను; కాని, పక్క నున్న వారి అదమాయింపుతో చతికిల బడ్డాడు.

"నువ్వీ వృత్తిలో యెన్నాళ్ళనుంచి వున్నా"వని గోరిమోవ్ వేరా నడిగాడు.

వేరా నీ ప్రశ్న చాల నొప్పించింది. రెండు చేతుల్తో ముఖాన్ని కప్పుకొని "చాలా కాలాన్నుంచీను" అంది మెల్లగా.

వేరా స్వరం దృఢంగానే వుంది. ఆమె నిబ్బరానికి ప్రేక్షకులు విస్మితులయ్యారు. వారిలో గుసగుస లారంభమైనై. తన్నెవరు గుర్తిస్తారోనని వాష్కా తల క్రింద దించుకున్నాడు.

"ఎన్నాళ్ళనుంచో సరిగా చెప్పు" మన్నాడు న్యాయమూర్తి మళ్లీను.

వేరా పోత విగ్రహంలా నుంచొనుంది. ఆమె తలకి చుట్టబడ్డ రుమాలు అంచుమాత్రం గాలికి కదుల్తోంది.

గోరిమోవ్ గడ్డం సవరించుకొని "పోనీలే, యిష్టం లేకపోతే చెప్ప నవసరంలేదులే" అని యింకేవో కొన్ని ప్రశ్న లడిగాడు.

తర్వాత ఒక వకీలు లేచాడు. జడ్జిలకు అభివాదం చేసి కోటు సరిచేసుకుంటూ "నువ్వీ వ్యాసలీ వృత్తి నెందుకు

అవలంబించాల్సి వచ్చిందో చెప్పు" మని వేరా నడిగాడు.

"అందుకు ప్రత్యేక కారణమంటూ ఒకటి లే"దని చెప్పి వేరా న్యాయమూర్తుల వంక చూచింది.

"సందేహ మెందుకు? మొన్న నాతో చెప్పావే అదంతా చెప్పు" అన్నా డామె వకీలు.

వేరాకి కోప మొచ్చింది. ముఖ మెర్రబడింది. "నేను మీతో యేమీ చెప్పలా. మీరే యేదో కల్పన కథ చెప్పమన్నారు" అని న్యాయమూర్తులవైపు తిరిగి "నాకు స్లీడయితో పనిలేదు. ఆయ న్నిక కూర్చోబెట్టం"డని చెప్పేసింది.

ఇలియాకి కలవరం పుట్టింది. పాప్కా లేచి యే మైనా చెపుతాడేమోనని ఆ వేపుకు చూచాడు; కాని, వాడు మిత్రులతో హాస్క్యా కొడుతున్నాడు. గోత్రమోవ్ మళ్లి వేరా నేదో ప్రశ్నించాడు.

వేరా పూర్వంకన్న ఘట్టిగా సమాధాన మిచ్చింది- "నేను దరిద్రంలో నుంచి బయటపడాలనుకున్నాను. లేమి వల్లనే యీ వృత్తి నవలంబించాను. ఇంత కంటె నేను చెప్పాల్సిందేమీ లేదు"

జూరీ సభ్యులు గుసగుస లాడుతున్నారు. న్యాయ మూర్తుల మొహాల్లో గంభీరత కనబడుతోంది. కచేరీ హాల్లో నిశ్శబ్దంగా వుంది. ముందరి మైదానంలో కవాతు చేస్తున్న సిపాయిల బూట్ల టకటకమాత్రం విన్పిస్తోంది.

"ముద్రాయి స్వయంగా నేను స్వీకరించుతూంట—" అని వేరా వరే తేడో చెప్తున్నాడు. ఇలియా ఒక పక్కాడ కూర్చోలేక నిల్చొన్నాడు; బంగ్రాతు వాసి సదలించి కూచోబెట్టాడు.

గత్యంతరం లేక ఇలియా పాపాన్ని తలొంచుకొని కూచున్నాడు. పెట్రోగ్రాడ్ యెదురుగా కనపడుతుం డటము, వాని పదవి ఇలియాకు కటుగింపుగా ప్రశ్న. 'చిత్రకారుడు బొమ్మను సులువుగా గీసినట్లు న్యాయమూర్తు లకు ప్రజల్ని విచారించటం సులభంగా వుంది. నేనుకూడా హంత్యాపరాధాన్ని స్వీకరిస్తే యిలాగే చులాకనగా విచా రణ అయిపోతుంది. పెట్రోగ్రాడ్ జైలులోవుంచి సన్నాకో యికేని సైబీరియాకి సాగనంపుతారు. తాను మూడో కొంతు డయ్యేందుకుంటే యిక్కడ సర్వభోగాలు అనుభవించు తూంటా'డని భావించుకొని ఇలియా గబగబ లాడాడు. అప్పుడు వాసికి శాపవశ్యాస ముక్తి లేదు. ఎవరేమి చెప్పుతున్నది వాసికి వినపడనేలేదు.

ప్రభుత్వన్యాయవాది గంభీర గర్జనలతో మాట్లాడు తూండగా వేరా అన్నాచ్చి "మా కింకా కలత్రోక సము దుకు? నే నెప్పుడో పాపాలు చదివినాట్లు నాకిక చెప్పా ల్సిన అవసర మేముంది?" అని పక్కవాళ్ళ తోడ్పా సాగింది.

ఆమె మాటలతో కొత్తకోలు ప్రతిధ్వనిస్తాయి. వేరా యెదురుగా నే "నన్నెందుకిగా వేసినవడానికి? దిమ్మ...

మొక్కు లేని ఆడుదా న్నేడ్పించడం మీకు ధర్మమేనా? మీకు తోచిన శిక్ష విధించండి" అంది.

ప్రేక్షకు లొకరొకరే బయటికి దారి పట్టారు. ఇలియా జనాన్ని వొత్తిగించుకుంటూ వరండాలోకి చేరాడు. "ఆమెను వృథాగా వేధించుతున్నా"రన్న మాటలు వాని పెదాలు దాటివచ్చాయి.

పాషా గోడ నానుకొని నుంచున్నాడు. వాడి ముఖంలో కళ లేదు. జుట్టు చెదిరిపోయింది. లోలోపల దిగులు పడుతున్నాడు. ఇలియా వానివద్ద కెళ్ళాడు; కాని, ఏమి మాట్లాడ్డానికీ పాలుపోక గుడ్లు మిటకరించి చూస్తున్నాడు. వరండాలో చేరిన జనం వేరా కేసును గూర్చి పలువిధాల చెప్పుకొంటున్నారు.

వాళ్లు చెప్పుకొన్నవి ఇలియా చెవిని పడుతూనే వున్నై. వాడిక ఊరుకోలేక పాషా చేతిని గట్టిగా నొక్కుతూ "నిన్ను ప్రేమించినందుకు వేరా కెల్లాంటి గతి పట్టిందో చూశావా?" అన్నాడు.

పాషా ఇలియా భుజంమీద చెయ్యేసి "ఇందులో నాదోష మేముంది?" అన్నాడు.

ఇలియాకి ఒళ్లు మండింది. 'ఆమె సర్వనాశనానికి నువ్వే బాధ్యుడ' వని చెప్పాలనుకున్నాడు; కాని, ఆ మాటను దిగమింగి "వేరాను విచారించేందుకు [illegible] కేమి హక్కుంది?" అన్నాడు.

ఆ మాట అని అక్కడినుంచి యిసురుగా బయల్దేరాడు. ఆనడక వాడేదో తొందరతో యీడ్చుకొని పోబడుతున్నట్లుగా వుంది. ఇలియాకి తన హృదయమే భారంగా తోచింది. మనస్సు చీకాకుగావుంది. పిచ్చెత్తినట్లు సాయంత్రందాకా అటూయిటూ వీధ తిరుగుతున్నాడు. ఇలియా ఆకలి దప్పులుకూడ మరిచాడు.

32

చీకటి పడుతోంది. నలుముఖాల దీపాలు వెలిగించారు. ఇండ్లలోని వెలుగు కిటికీలగుండా బయట పడుతోంది. వెర్రి గంగులెత్తినట్లు తిరుగుతున్న ఇలియా కప్పుడు గ్రోమోవ్ భవనము, దాని కిటికీ తెరలు, రంగద్దాలు, ఇల్లాలి చక్కదనము తలపుకొచ్చాయి.

ఆ విధంగా నడచిపోతుండగా వానికి క్షుద్బాధ తెలిసింది హోటలుకు దారిపట్టాడు. అంతలో ఒక జట్కా మహావేగంగా వెనకనుంచి వచ్చి ఇలియా ప్రక్కగా దూసుకొని పోయింది. నూలువాసిలో ప్రమాదం తప్పింది.

ఇలియాకి మాటిమాటికి వేరా జ్ఞప్తికొస్తోంది. ఆమె చిక్కులపా లయినందుకు చింతపడుతున్నాడు. తన స్థితి

మాత్రం ఏం బాగుంది? వాని బుద్ధి పదేపదే "వేరా సంగతెందుకు? స్వవిషయ మాలోచించుకో" మని చెప్పుతోంది; ఎంత వద్దనుకున్నా వేరా వాని స్మృతి పథంలో నుంచి తొలగటమే లేదు.

"వేరా స్వాభిమానం మెచ్చుకోతగ్గది. పాస్కా పేరే ఎత్తలా. ఎంత విశాల హృదయం! లీపా అయితే చెప్పివుండేదేమో? ఏమో, ఆమె యింతకంటే ఉత్తమురాలు. మరి లాసినా అయితేనో?" ఇలా అనుకొనేటప్పటికి వానికి లాసినా పుట్టినరోజు పండుగ సంగతి జ్ఞప్తికొచ్చింది. ఆమె స్వయంగా ఇలియా నాహ్వానించింది కూడాను. ఆవుత్సవం ఆనాడే. ఇలియా మొదట వెళ్ళవద్దనుకున్నాడు; కాని మళ్ళీ ఏంతోచిందో పోయివద్దామని నిశ్చయించుకున్నాడు. హోటలుకు వెడుతున్నవాడు చప్పున ఒక జట్కాలో ఎక్కి సరాసరి లాసినా యింటికి వెళ్ళాడు.

ఇలియాను చూచి నికోడిమిచ్ యెదురొచ్చి స్వాగత మిచ్చాడు. "నువ్వు రాలేదనే అనుకుంటున్నాను. సమయానికే వచ్చావు" అన్నాడు.

"ఇలియూషా! నీ మొహం వాడిపోయిందేం?" అని లాసినా వాని రిక్తహస్తాలను చూచి "అదే! ఉత్త చేతుల్తో వచ్చావా? నాకు బహుమతి తెచ్చావుకాదేం? అంతా మిడి గుడ్లుపెట్టి చూస్తావెందుకు? పగలంతా యెక్కడి కెళ్లా" వని గుక్క తిరక్కుండా అడిగింది.

కిరిక్ ఇలియా చెయి పట్టుకొని తీసుకెళ్ళి కుర్చీల కూర్చోబెట్టాడు. అతిథు లందరికి పరిచయం చేశాడు. అం రితో చేతులు కలిపిన తర్వాత ఇలియా కుర్చీలో ఒక కూచున్నాడు. బాగా అలసి వుంటావల్ల వాని పాదా తేలిపోతున్నట్టు వున్నై. అప్పాకంలో వున్నదేమొ ను దున్న పదార్థాలను గబగబా తినసాగాడు. వచ్చిన యిం పూర్తి కాకమునుపే ఇలియా అసభ్యంగా భోజనాని కు మించడం చూచి అభ్యాగతు డొకడు నవ్వాడు.

"నువ్వు నాకు శుభాకాంక్షనైనా తెల్పకుండా తిం త్వరపడుతున్నావే. బలేమనిషివి! వచ్చినవాడివి ఒక పలుకైనా పలికావా?" అని ఇలియా కెదురుగా కూర్చున లాసినా టేబిలుక్రింద తన కాలి వేళ్ళతో వాని పాదాని త్రొక్కుతూ మెల్లిగా యింకా యిలా అంది—"కొంచె తెలివిగా ప్రవర్తించు."

ఇలియా చేతిలోని రొట్టె ముక్కను క్రిందపె "నే నివాళ పగలంతా కొండ్చుట్టూ తిరగటంవల్ల బాగ ఆకలయింది" అని చెప్పాడు.

అతిథులు మౌనంగా వున్నారు. అందరూ కెప్ప నాల్చకుండా ఇలియావంకే చూస్తున్నారు. వాడేదైన వినోదవిషయం చెప్తాడేమోనని ఎదురు చూస్తున్నారు గదిలో నిశ్శబ్దంగా వుంది. ఇలియా మనోవీధి నెన్నో భావాలు పొడసూపి అంతలో అదృశ్యమవుతున్నాయి.

"న్యాయవిచారణ ఒకొక్కప్పుడు బలే తమా
షాగా వుంటుంది" అన్నది గిబ్లోవా అనే ఆవిడ.

లాసినా మొహం జేవురించింది.

కిరిక్ ఇలియా నుద్దేశించి "నువ్వేదో వింతసంగతి
చెప్తావని చూస్తుంటే ఒకమాట చెప్పి వూరుకున్నావేం?
చేరి కెందు కెళ్ళావు?" అని కదిలించాడు.

అక్కడున్నవారిలో నిరుత్సాహం వ్యాపిస్తోందని
లియా కనిపెట్టాడు. ఇక లాగుండదని నోరు విప్పాడు.
తిమ్మాన్మవారు కూడ శాంతాఖాని ప్రారంభించారు.

"నే నొక పర్యాయం ఒక హత్యాభియోగంలో
ని చేయాల్సివచ్చింది" అన్నా డొక లాయరు.

"హత్యా రహస్యాలు చదవడానికి బలే మజాగా
వుంటాై" అంది శ్రీమతి క్రాకిన్.

"నేను పని చేసిన కేసులోని ముద్దాయి నా సహా
ధ్యాయే. అతను ఖజానాకు కాపలా వున్నాడు. ఆ సమీ
పంలోకి ఒక బాలుడొచ్చి నుంచున్నాడట! ఆ కుర్రాడితో
వేళాకోళమాడుతూ నా సహపాఠి వాణ్ని కాల్చివేశాడు"
అని లాయరు చెప్పాడు.

"అయ్యొయ్యో పాపం!" అంది లాసినా.

"నే నొకసారి సాక్షిగాను, మరొకప్పుడు చూద్దా
మనీ కోర్టు కెళ్ళాను. అక్కడొక తమాషా కేసు విచారణ

జరుగుతోంది. ఆ కేసులో ముద్దాయిపైన నేరమేమిట
విన్నారూ! వాడింకొకడిని కొరికాడట!" అని గొ
వింత సంగతి చెప్పినట్టు బ్రౌకిన్ సతి తతిమ్మావారి వం
చూచింది.

ఈ సంభాషణ విని కిరిక్ కిలకిల నవ్వాడు. అక్క
డున్నవారిలో కొందరు హత్యలనుగూర్చి, మరికొంద
బందిపోటు వార్తలు చెప్పుకుంటున్నారు. ఇలియా ధ్యా
మా కబుర్లమీద లేదు. వాడు రెప్ప వాల్చకుండ లూసిన
వంక చూస్తున్నాడు. వాని హృదయకుహరంలో అగ్ని
కణాలు రగుల్తున్నై; కాని, పైకిమాత్రం మంటలు లేవటంల
లూసినా యిటూ అటూ చలాకీగా తిరుగుతోంది. సీత
కోక చిలుకలాగా అందరి దృష్టి నాకర్షిస్తూ మెరి
పోతోంది. ఒకటి రెండుసార్లు ప్రక్క గదిలోకెళ్లి యి
రులు గమనించకుండా ఇలియాను రమ్మని సైగ చేసింది
కాని, వాడు కూర్చున్న చోటునుంచి కదల్లా. అందువ
లూసినా చీకాకు పడుతోంది. ఇలియా ఉద్దేశపూర్వక
గానే ఆమె నలా వుడికిలించుతున్నాడు.

"మిత్రమా! మౌనంగా వున్నావే! కబుర్లు చెప్ప
నిన్ను హేళన చేసేవారిక్కడ యెవరూ లేరులే" అన్నాడ
నికోడిమిచ్.

"ఇవాళ కోర్టులో ఒక వేశ్యకేసు విచారణ జ
గింది. ఆమె చాలా మంచి స్వభావం కలది. నే నావిడన
బాగా యెరుగుదును" అని ఇలియా చెప్పాడు.

అందరిచూపు ఇలియా వేపుకు మళ్ళింది. వాడు
...యంగా వేశ్యతో పరిచయమున్నట్టు చెప్పుకొంటున్నం
...కు కొందరికి నవ్వొచ్చింది; కాని, వాడు చిన్నపోయి
...రి మాట్లాడడేమోనని పైకి రానీక ఇలియా వంకే
...తూహలంగా చూస్తున్నారు.

ఇలియా వారి భావాన్ని కనిపెట్టి "ఎందుకు మీ
...లా నవ్వుతారు? వేశ్యల్లో మంచి వాళ్ళెందరు లేరు?"
...న్నాడు.

"నువ్వు చెప్పింది నిజమేలే. తర్వాత సంగతి చెప్పు"
...న్నాడు శిరిక్.

"మీ రందరు పెద్దమనుషు లనిపించుకొంటున్నారు.
...నే నేదైనా పొరపాటు మాట్లాడితే గోరంతను కొండంత
...చెయ్యడం భావ్యమేనా? తర్వాత చెపుతా వినండి. ఆమె
...క వర్తకుని సొమ్మపహరించిందని కేసు పెట్టారు."

"భేష్! తమాషాసంగతే" నన్నాడు వెక్కిలో శిరిక్.

"కాని, వాస్తవాని కామె ఆ సొమ్మును దొంగి
...ంచలా. ఆ వర్తకుడే ఆమె వ్యామోహంలో పడి ఆ
...సొమ్మ వసైరా నామె కిచ్చాడు."

ఒక పక్క—గాపున్న లాసినాను పల్చి కిరిక్ అన్నా
...డు—"ఇటురా. ఎంత మంచిగా వుండనుకున్నావు కథ!"

ఇలియా చెప్పింది విని లాసినా అదివరకే నవ్వుతోంది ఆమె అతిథులవంక చూస్తూ "ఇందులో విశేషమేముంది మీరిలాంటివి వేనవేలు విని వుంటారు. ఇక్కడి కథ వినేందుకు పసుపు పిల్లలెవరూ లేరు. ఇక భోజనం కానివ్వండి" అంది.

అందరి దృష్టి ఆహార పదార్థాల పైకి మళ్లింది. తన మాటల నాలకించుతున్నవారు లాసినా వల్లనే విముఖులయ్యారని ఇలియా తెలుసుకున్నాడు. వానికి లాసినా పైన అమిత కోపం వచ్చింది. ఆ కోపంతో "ఇదివరకామె పొందుకూడిన వాళ్లుకూడ విచారణ చూడటానికి వచ్చారు. జూరీలో వున్నవాళ్ళు పరమనీచులు, దుర్మార్గులూను" అన్నాడు.

"మీరు గౌరవనీయుల నావిధంగా దూషించకూడదు వారు జూరీ సభ్యులు. నేను కూడ......" అని లౌకిన్ అంటూంటే ఇలియా అందుకొని యిలా అన్నాడు— "వారు జూరీ సభ్యులే; కాని, వారు న్యాయం చెప్పగలరా? ఒక వేళ......"

ఇలియాను ముగించనీకుండా లౌకిన్ మొదలెట్టాడు— "రెండో అలెగ్జాండర్ చక్రవర్తి దేశకళ్యాణార్థం యీ జూరీ విధానాన్ని అమలుపర్చాడు. అట్టి జాతీయవిధానాన్ని నిందించటం ద్రోహం."

లౌకిన్ కనుబొమలు పైకి క్రిందికి నాట్యమాడుతున్నై. అతని వాగ్ధోరణి ఇలియాను దబాయించుతూన్న

స్తుంది. ఒకరిద్దరు లేచెళ్ళి ఫాక్కిన్ ప్రక్కన నుంచు
న్నారు. లాసినా కంగారు పడింది. ఆ చర్చ నక్కడితో
రమించమని చెప్పింది.

"అవన్నీ వేదాంత విషయాలు, మనకెందుకు పోని
ద్దరూ" అని కిరిక్ తన సతికి మద్దతిచ్చాడు.

"ఇందులో వేదాంత మేముంది? రాజనీతి. ప్రభుత్వ
ధానాన్ని నిందించే వాడు రాజనీతి నెరుగని వాడన్న
మాట" అని ఫాక్కిన్ తన వాదాన్ని సమర్థించుకున్నాడు.

తన్నధిక్షేపించినా లాసినా దంపతుల కెదురాడి
ందుకు ఇలియా ఫాక్కిన్‌ను మనసులో మెచ్చుకున్నాడు.
ఫాక్కిన్ ఆ దంపతుల నింకా యేడ్పిస్తే బాగుండు నను
న్నాడు. అతిథుల కా దంపతులయందు గౌరవము లేకుండా
ోవాలని ఇలియా కోరిక. ఎలాగైనా రసాభాస చెయ్యా
న్న తలంపుతో "మీరు విద్యావంతులు. ఏది మాట్టా
నా చెల్లిపోతుంది. నన్ను మీరు ఆక్షేపించినా సరే
ని, నేను చెప్పినది ముమ్మాటికీ నిజం. కడుపు నిండిన
ాడికి డొక్కంటుకొని వున్నవాడి బాధ యేం తెలుస్తుంది?
ద్రుడు చౌర్యం చేయడని చెప్పను; కాని, కలవాళ్లు
ండ తక్కువ దొంగలు కాదు" అన్నాడు.

"కిరిక్! ఏమిటీ గొడవ?" అన్నాడు ఫాక్కిన్. అతి
ల కానందం, వినోదాలు లేకుండా రసాభాస మవుతున్నం
దుకు లాసినా కలత చెందింది. ఫాకిన్ చేయి పట్టుకొని

"కూర్చోండి. పదార్థాలన్నీ చల్లబడిపోతున్నాయి. ఇ
భోజనం కానివ్వం"డని బిక్క-మొగంతో బ్రతిమలాడింద

శ్రీమతి క్రాకిన్ కూడ భర్త రెండో చేయి పట్టుకొ
"మీరింత స్వల్ప విషయానికే ఆవేశపడుతా రెందుక
ఇక కూర్చోం"డని ఇలియావంక మిరిమిరి చూడసాగింద

"అబ్బాయ్! నువ్వింకా చిన్నవాడివి. నువ్వు చాల
సంగతులు తెలుసుకోవాలి. ఆ మూలాగ్రంగా తెలియని
నోరు విప్పరా"దన్నాడు క్రాకిన్ ఇలియాతో.

"నా కా లౌక్యం తెలియదులెండి. అందువల్ల
నోటికివచ్చినట్లు వాగుతున్నాను. పెట్రుహాలాంటి దుష్ట
లకు యితరులను విచారించే అర్హత యెక్కడిది చెప్పండి
అని మరింత రెచ్చగొట్టాడు.

అతిథు లొకరొకరుగా భోజన మారంభించారు
ఇలియా మాటల నెవరూ చెవినిపెట్టలా. కిరిక్ మాత్ర
వాని దగ్గర జేరి "నువ్వు అడ్డగాడిదలాగున్నావే! ఏమిట
రగడ?" అన్నాడు మెల్లిగా.

ఈ మాటల్తో ఇలియా క్రోధాంధుడయ్యాడు. కిరిక్
వంక మిరిమిరి చూచాడు. ఆచూపు తాగలేక కిరిక్ నీళ్ళు
నమిలాడు. లాసినా అతిథులను "ఇంకేం కావా" లని
అడుగుతోంది. ఆమె కంఠస్వర మాలకించుటతో ఇలియాకి
ఒళ్లూ పై తెలియకుండా పోయింది. 'ఓసిలంజ! నీకు కావా
ల్సింది నేను పెడతాలే' అనుకొని టేబిలుమీది మధుపాత్ర

సి "ప్రేయసీ! రా, మన మిద్దరం కలిసి జతగా తాగితే గాని మజాగా వుండదు" అన్నాడు లాసినాతో.

అందరూ నిర్ఘాంతపోయి చూస్తున్నారు. చేతుల్లోని పదార్థాలు అట్టె వుండిపోయాయి. ఎవరికీ నోట మాట రాలేదు. ప్రతివారికి వుక్కిరి బిక్కిరైనట్టుంది.

"కిరిక్! నాతో రెండుగుక్కలు తాగమని ప్రియ లాసినాతో చెపుదూ. ఇందులో తప్పేముంది? మేమిద్దరము మనసార ప్రేమించుకున్నప్పుడు దాపరిక మెందుకు? మేము ప్రేయసీ ప్రియులమని నలుగురకు తెలియటమే మంచి"దని ఇలియా వున్మాదునివలె వాగాడు.

లాసినాకు మిన్ను విరిగి మీద పడినట్టుంది. వెర్రిగా చూస్తూ "ఓరిదుష్టా!" అని బిగ్గరగా అరిచింది.

తర్వాత బల్లమీది పళ్లెంతీసి ఇలియా పైకి విసిరింది. అది ముందే కనిపెట్టి ఇలియా వాటంగా దెబ్బ తప్పుకు న్నాడు. పళ్లెం క్రిందపడి ఖంగ్‌మని మోగింది. ఆ గందర గోళంతో అతిథు లందరూ లేచి ప్రక్కప్రక్కలకు తప్పు కున్నారు. కిరిక్ మతి మతిలో లేదు. తానేమి చెయ్యాలో కూడ తోచక గ్రుడ్లు మిణకరించి చూస్తున్నాడు.

లాసినా గడగడ వణుకుతోంది. అవమాన భారంచే పళ్ళు కద నొక్కుకొనిపోయి నోట మాటరాక దెబ్బతిన్న పాములాగా బుసకొడుతోంది. ఆమె ముఖం లావణ్యాన్ని కోల్పోయింది. పెదాలు తడారి పోయినై. పాదాలు భూమి

లోకి దిగబడి పోతున్నట్టుంది. "నువ్వు శుద్ధ అబద్ధ
కోరువు. నా పైన నింద వేస్తావెందుకు?" అన్నది
క్లైట్కో.

ఇలియా తొణుకూ బెణుకూ లేకుండా "ఓక్ వ్రా
వోయ్! నీ సంగతంతా చెప్పేస్తా. నువ్వే నాకీ దా
చూపించావు. ఎప్పటిలాగుంటే నే నెందుకు బయట
వాణ్ని? నేను నీ కిప్పుడు ఏక్కస మయ్యానే?" అన్నా

ఎవరో మెల్లిగా నవ్వారు. లాసినా నిలువునా
రయింది. ఇక నుంచోలేక కుర్చీలో కూలబడి కళ్ళు ము
కుంది.

ఒక అభ్యాగతుడు రక్షకభటులకు కబురు పంపః
సలహా యిచ్చాడు. కిరిక్ ఆ అతిథి వైపొకసారి చూ
ఇలియామీది కెళ్ళాడు.

"ఏయ్! ఎక్కడికి? ఒక్క దెబ్బతో చిత్తై పోతా
నోరు మూసుకొని నేను చెప్పేది విను: నా మాదిరి
నిజాన్ని విప్పిచెప్పే నాడింకెవడూ వుండడు; తెలిసిందా
అని ఇలియా అదలించాడు.

కిరిక్ ఆ బెదరింపుతో జంకలా. ఇలియా మీ
మీదికి వెడుతూనే వున్నాడు. విందుకు వచ్చినవాళ్ళు గ
చిప్‌గా నిలబడి ఆ తమాషా చూస్తున్నారు. కదలడాః
మొదలడానికి ఒక్కడికీ గుండెలేదు.

ముగ్గురు మిత్రులు

ఇలియా కిరిక్‌ను గద్దించుతూ మళ్ళీ అన్నాడు—
న్ను నాపైకి రావద్దని చెప్పినా వినకపోయావు. నీ కర్మ;
ం చేస్తాను? నిజానికి నువ్వు నాకేమీ అపకారం చేసిన
వి కాదు. పైగా నువ్వు ఒట్టి శుంఠవు. అనవసరంగా
పైకి రాక దూరంగా పో"

అని ఇలియా తనమీదికి వస్తున్న నికోడిమిచ్‌ని పిడి
తో పొడిచాడు. అప్పుడొక గోడప్రక్కకు చేరి దండలు
స్తూ నుంచున్నాడు. ఒకపర్యాయం అక్కడున్న వారం
కలయచూచి తర్వాత కిరిక్ నుద్దేశించి "నీ పెళ్ళాం
ను తానైవచ్చి నా మెడకు తగులుకుంది. నువ్వు యెంత
హాయకుడివో ఆమె అంత జాణ. ఈమెను మించిన
మాంధను, జారిణిని నేనిదివర కెక్కడా చూడలేదు.
లు ఆమే నన్ను మాటేమిటి—మీరందరూ అలాంటి
ళ్ళే. నేనివాళ కోర్టుకెళ్ళానని చెప్పానుకదూ? అక్కడే
ర్యయమైన తీర్పు చెప్పడం నేర్చుకొచ్చాను" అన్నాడు.

ఏ విషయాన్నిగాని ఒక వరుసలో చెప్పవీలుగాని
న్నసంగతులు ఇలియా బుర్రలో చెలరేగుతున్నై. పిచ్చి
నిలా వాగుతున్నాడు.

"ఇందులో దోషమంతా లాసినాదే ననటానికూడ
లేదు. పరిస్థితులు అలా కలిసి వచ్చాయి. నా జీవితంలో
గినవన్నీ యిలాంటి అయాచిత ఆకస్మిక సంఘటనలే.
ల్లే నేనొక తడవ హత్యకూడా చేశాను, అప్పుడునాకు

చంపాలన్న తలంపే లేదు; అయినా వాడు నా చేతు
చచ్చాడు. మా జాయింటు వ్యాపారంలో నేను పెట్టు
పెట్టిన సొమ్మా హతునిదే" అని చెప్పి ఇలియా ఆగా

కిరిక్ బిగ్గరగా "వీనికి మెదడు చెడింది. పిచ్చెత్తిం
ఇలియాతో "మిత్రమా! నీ దుస్థితికి నా కమిత విచారం
వుంది సుమా!" అన్నాడు యెంతో సంతాప పడుతున్న
వాడిలాగా.

ఇలియా పకపకమని నవ్వాడు. వానికి హృదయభార
కొంత తగ్గినట్టుగా వుంది. తన హత్యాపరాధాన్ని పదిమం
ముందు చెప్పివేశానన్న తృప్తి కలిగింది. అప్పుడు ఇలియా
గాలిలో తేలిపోతున్నట్టుగా వుంది.

లాసినా మనఃస్థితి వర్ణింప నలవికాకుండా వుంది
ఇలియా మతి చెడిందన్న తన పెసిమిటి మాటలతో ఆమె
కొక వెలుగు కనపడింది. ఎలాగో తేరుకొని మెల్లగా ఇగొ
రోనా ప్రక్కకు చేరి "ఇతని కపుడపుడు వున్మాదం వస్తూ
వుండేది. పాప మీ వ్యాధి చాలా కాలంనుంచీ వుంది. అది
వచ్చినప్పుడల్లా యితని స్థితి యిలాగే వుంటుంది. కళ్ళెర్రబడి
మొహం భయావహంగా వుంటుంది. పిచ్చిపిచ్చిగా వాగు
తాడు" అని చెప్పింది. ఇలియాకి మతిభ్రమ వున్నట్టు అతిథు
లకు నచ్చజెప్పితే వారు ఇలియా తన జారత్వాన్నిగూర్చి
చెప్పిన మాటల్ని పిచ్చి ప్రేలాపనగా తలుస్తారని లాసినా
కొనాశ.

ముగ్గురు మిత్రులు

ఇలియా మొహంలోకి చూస్తూ ఇగ్రోనా అన్నది-
ంగా అతనికి పున్నాదమే అయితే వెంటనే పోలీసుల్ని
ంచండి.

కిరిక్ కు తన భార్య వ్యభిచారిణి అన్న ఇలియామాట
లమై గుచ్చుకుంది. లాసినా శీలాన్ని గూర్చిన అను
నంతో అతను కృంగి పోతున్నాడు. అయినా పదిమందీ
భార్యను శీలవతిగానే తలచాలన్న వుద్దేశంతో "వానికి
త్తడంలో యింకా సందేహమెందుకు?" అని లాసినా
పనదాన్ని బలపర్చాడు.

"మనందరిపైన విరుచుకోని పడడుగద!" అన్నాడు
స్టోవ్ ప్రక్కలు చూచుకుంటూ.

పాపం! విందారగించటానికి వచ్చిన ఆహూతులందరు
సుకంపితులయ్యారు. అక్కడినుంచి జారుకోటానికి మార్గం
సం చూస్తున్నారు. ఇలియా ద్వారాని కడ్డంగా నిలబడి
టాట్టహాసం చేస్తున్నాడు. అతిథులు తనకు వ్యతిరేకంగా
ని, లాసినా కిరిక్ లకు సానుభూతి సూచకంగా గాని ఒక్క
మాటైనా అనకుండటం ఇలియాకు సంతోషాన్నే కల్గిం
ంది. ఆహూతులను బెదరించి కంగారు పెట్టడం యిష్టంలేక
ని, కానిచో ఇలియా తెల్లవార్లు దారికడ్డంగా
బ్బుండి లాసినా యేడ్పుముఖం చూస్తూ ఆనందించేవాడే.

"నాకు పిచ్చెత్తిందని చెపుతూన్న మాటలు నమ్మ
ండి. నేను అన్నీ తెలిసే మాట్లాడుతున్నాను. నే నిక్కడి
ంచి కధల దలచలేదు. మీరుకూడ ముందుకోసం అడుగు

పెట్టేందుకు సాహసించవద్దు. ఇదిగో నా కండపుష్టి చూశారా మీలో యెవరైనా నాపైకి రావటానికి ప్రయత్నించారో వాళ్ళు హూనం చెయ్యందే వదల్ను, జాగ్రత!" అని ఇలియా చొక్కా చేతులు పైకెగదోపి పిడికిలి చూపిస్తూ "మీ జీవితాలెందుకు, తగులబెట్టనా? దమ్మిడీకి అక్కరలేని గడ్డి కరుస్తున్నారు" అన్నాడు.

"ఏయ్! నోరు సంబాళించుకొని మాట్లాడు; నే నెవ ర్ననుకున్నావో!" నని కిరిక్ లేని ధైర్యం తెచ్చుకొని బుకా యించాడు.

"ఛీ, ఛీ! నోరు ముయ్యి. నువ్వొక మగాడివి (అతిథులతో) ఇక్కడికొచ్చి మీరందరూ ఆనందించారు కదూ? మజాగా వుందా? పొట్టలనిండా మెక్కారు. పరస్పర ప్రేమ ప్రకటించుకున్నారు; కాని, అందులో సారమేమైనా వుందీ? మీబ్రతుకే బూటకం! నేనిప్పటివరకు శాంత్యుత పవిత్ర జీవితాన్వేషణ చేస్తున్నాను; కాని, నాకట్టి జీవిత చిహ్నా వే కనపడలేదు. దాన్ని వెతుక్కుంటూ నేనెంత ముందు కెళ్ళానో అంత లోతుకు దిగబడి పోయాను. ఈ సమాజంలో పవిత్రునికి బ్రతుకే లేదు. వాడు కుళ్ళి, చీకి అంతరించి పోవ ల్సిందే. నా మట్టుకు నేను పక్కా బద్మాష్‌ని. నే నిక్కడ గాఢాంధకారబంధురమైన యినుప బోనులో వేలాది యెలుకల మధ్యనున్న మార్జాలంలా పడివున్నాను. మీర ప్రతిభావంతులమని విర్రవీగుతున్నారు. ఇతరులను విచారించ గల వారమని మిడిసిపడుతున్నారు; కాని, నిజానికి మీర

పచ్చిరక్తం తాగే క్రూరమృగాలు! మీ సావాసానికి వచ్చిన వారి ప్రాణాలు తీసిగాని తృప్తిచెందరు" అన్నాడు ఇలియా.

అప్పుడు ఇలియా మోమాకస్మికంగా చింతాక్రాంత మైంది. ఇక తానేమి చెయ్యాలా అని యోచించ సాగాడు. వాని పరధ్యానా న్నదనుగా చూచి చల్లగా ఒకడు బయటికి జారాడు. ఇలియా వెంటనే కెవ్వరిలి "అదృష్టవంతుడివి, దాటిపోయావులే, పో" అన్నాడు.

"ఏడిశావులే. ఇక చూడు నిన్నేం చేస్తామో! పోలీసులకు వప్పజెపుతానుండు" మన్నాడు బయటపడిన వ్యక్తి.

"మంచిదే; పోయి త్వరగా తీసుకురావోయ్ పంద!"

అని ఇలియా వాని వంక చూస్తుండగా లాసినా వాని ప్రక్కగా బయటికి తుర్రుమంది. ఇలియా ఆమె పోకడను కన్నెట్టికూడ కన్నెత్తి చూడలా. "లంజెకి తగిన శిక్షే వేశాలే'' అన్నాడు.

పోలీసులకు కబురెళ్లిందిగదా అన్న ధీమాతో "నోరుముయ్యరా వెధవ!" అన్నా డక్కడున్న వారిలో ఒకడు.

ఇలియా ప్రక్కనున్న కుర్చీలో తనాయించి కూచున్నాడు. "గుడ్లగూబలాగా కూస్తా వెందుకు? నీ కీ టక్కులాడి సంగతేమి తెలుసు? నేను వీళ్ళతో కలిసి వుంటున్నాను. కండలు తిరిగిన నా శరీరాన్ని చూచి లాసినా నా వెంట పడింది. రహస్యంగా నన్ను మరిగింది. (కిరికొను

చూపుతూ) ఈ నపుంసకుడు బయటికి పోగానే తలుపు బిగించి నా పక్కలో చేరుతూండేది. బయటి కందరు పతివ్రతలే! నేను మాత్రం పవిత్రుడనని చెప్పుకుంటున్నానా? పోలటోవ్‌ను హత్యచేసింది నేనే. నేనా పోటోన్ డబ్బు నపహరించి వుండబట్టే పిల్లతో పాటు నేను వ్యాపారంలో పెట్టుబడి పెట్టగలిగాను.'' అని యేక వరసః మైమరచి వాగుతున్నాడు ఇలియా.

ఒకసారి తలెత్తి నాలుగు వైపులా చూచాడు. అందరూ తెల్లమొహాలతో హానివంకే చూస్తున్నారు. వాగి వాగి ఇలియానోరు నొప్పిగా వుంది. మనసులో వున్నదంతా వెళ్ళగ్రక్కటంవల్ల హృదయం శూన్యమయిందికిటికీగుండా బయటికి చూచాడు. ఇక జరుగబోయే దేమిటన్న ప్రశ్న వచ్చింది. అతిథులవేపు తిరిగి "మీ ముందే నా నేరాన్ని అంగీకరించాను గదూ. నన్ను పట్టుకోండి.. ... నేను మిమ్మల్ని వెర్రికుంకల్ని చేసి వేశాను కదూ? అన్నాడు.

కిరిక్ పిస్తోలు చేతబట్టి ముందుకొస్తూ "ఇం కెక్కడి పోతావులే. దొంగవు దొరకనే దొరికావు. పోలటోవ్‌ని హత్యచేసింది నువ్వా?" అన్నాడు.

అక్కడున్న నారీమణులు కెవ్వుమని అరిచారు. గ్రొకిన్ వారికి ధైర్యం చెప్పి "మనమిక నిక్కడ వుండకూడదు; ఇది వారి స్వవిషయం. మనకెందుకు? మనం పోదాం పదం" డన్నాడు.

కిరిక్ అతని మాటలను విన్పించుకోలా. ఇలియాకి పిస్తోలు గురిపెట్టి "నీవు సైబీరియాకు దారి చూపిస్తా వుండు" మని బెదరించాడు.

"అనవసర హంగామా యెందుకోయ్? నే నెక్కడికీ వెళ్ళటంలేదే. అయినా నే నెందుకు పారిపోతాను? సైబీరియా పేరు చెప్పి నన్ను భయపెట్టాలనా? ఓస్. అది నాకో లెక్కా?" అన్నాడు ఇలియా నిర్లక్ష్యంగా.

త్రొకిన్ పత్నీ సమేతంగా వెళ్ళిపోయాడు. లాసినా పక్క గదిలో మంచంమీదపడి కుమిలి కుమిలి యేడుస్తోంది. ఇలియాను నిరాశ చుట్టుముట్టింది. వాని కంతా అయోమయంగా వుంది. "నే నధఃపతనమై పోయాను. నా యీ స్థితికి కారకులెవ" రని తన్నుతాను ప్రశ్నించుకున్నాడు.

కిరిక్ ఇలియా కెదురుగా నిలబడి వున్నాడు. "నీ జాలి చూపులకు నేను దయతలచనులే" అన్నాడు.

ఇలియా మళ్ళీ భగ్గుమన్నాడు. కుర్చీలో లేచి కూచున్నాడు.

"ఒరేయ్ చవట! నీ జాలికోసం యిప్పు డేడ్చిం దెవరా? అయినదానికి కానిదానికి సాటిమానవుల కెగ్గు చేసే నీబోటి తుచ్ఛు డితరులపైన దయచూపటంకూడానా? మీమీద నాకూ జాలిలేదులే. నా దృష్టిలోమీరు కుక్కతో సమానమే. నే నిన్నాళ్లనుంచి మీవంటి నీచులు, పరమపాతకులతో కలసి వున్నందుకే దుగ్ధగావుంది. ఏ పశువుల కాప

రిగానో వుండివుంటే నాకింతకంటె శాంతిగాను, సు
గానువుండేది. ఏంరా నపుంసకుడ! పోలీసులింకా రాలే దే
ఎంతసేపు? ఏయ్ కిరిక్! నా ఎదుటినుంచి పోరా. నిన
చూచేకొద్దీ నాలో ద్వేషాగ్ని మరీ రగులొ్కంటుంద
అని ఇలియూ ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

అతిథు లొకరొకరె నిష్క్రమించారు. వా
నక్కుతూ తారుతూ ప్రక్కగా పోతుంటే నల్లని వే
దొర్లిపోతున్నట్టుంది ఇలియాకి. వాని హృదయం
శూన్యమౌతోంది.

ఉన్నట్టుండి "కిరిక్! మనమిద్దరము కుస్తీ పడదాం
అని ఇలియూ తొడ చరిచాడు.

కిరిక్ కోపంతో పళ్ళునూరుతూ "పిస్తోలు గుండు
నీ బుర్ర ఎగరగొడ్తా. ఒళ్లు దగ్గరుంచుకొని మాట్లా
మన్నాడు.

"ఆఁ, అంత మొనగాడివేఁ? తాప్మని మనిషిని
కూల్చడం నీకు సరదా కాబోలు! సరేగాని, తర్వాత
గ తేమవుతుందో ఆలోచించుకున్నావా?"

లాసినా భర్త మళ్లీ నోరెత్తలా. ఇలియూ పై మా
లని పోలీసుల రాక కెదురు చూస్తున్నాడు.

కాస్సేపటికి ఒక సబ్ ఇన్స్పెక్టరు యిద్దరుపోలీసుల
వచ్చాడు. వారిని చూడగానే ఇలియూ లేచి నుంచున్నా

రక్షకభటులు వచ్చిన సవ్వడి విని లాసినా గదిలో నుంచి బయటికివచ్చి "ఇతను పోలటోవ్‌ను హత్య చేసింది తానేనని మాతో చెప్పా" డని ఇన్స్పెక్టరుతో చెప్పింది.

పోలీసు అధికారి ఆమెవంక తేరిచూచి "అలాగా! మీరా విషయాన్ని మీ సాక్ష్యంలో చెప్పుదురుగాని లెం"డన్నాడు.

"వీళ్ళ సాక్ష్యాలుకూడా యెందుకు? నేను స్వయంగానే ఆసంగతి చెప్పేస్తాను" అని ఇలియా లాసినా వేపు యీసడింపుగా చూచాడు.

ఇన్స్పెక్టరు యేదో రాసుకుంటూంటే భటులిద్దరూ ఇలియాకి రెండు పక్కలా కాచుకున్నారు. ఇలియా ఒక నిట్టూర్పువదలి తల వంచుకున్నాడు. కలం నడుస్తున్న బరబర ధ్వని మినహా వేరే శబ్దంలేదు. అప్పుడు కిరిక్‌కి ఏం తోచిందోగాని పిస్తోలు పారేసివచ్చి "ఇతనికి మతి భ్రమించి అలా అన్నాడులెండి. పాపం, దయతలచి వదిలిపెట్టండి" అని వినయపూర్వకంగా అధికారికి మనవి చేశాడు.

ఇన్స్పెక్టరు తీక్షణంగా చూచి "ఇంత జరిగిన తర్వాత వదిలి పెట్టడం అసంభవం. నేను డైరీలో రాసేశాను. పైగా నేను వచ్చేముందే మీరిపోర్టును కమీషనరుగారికి తెలియ పర్చాను. ఇక నే నేమి చేయటానికీ వీలుకాదు. వ్యవహారం నా చెయ్యి దాటిపోయిం" దన్నాడు.

కిరిక్ ప్రుస్సురని నిట్టూర్చాడు.

ఇలియూ తలాడించుతూ "కిరిక్! నీవు నా యందెం దయ! పాపం, బలే వుదారుడివి. దెబ్బతిన్న కుక్క కూడ యిలాగే యజమాని చెయ్యి నాకుతుంది. నీ యెత్తు నాకు తెలుసులే. నేను మిమ్మల్ని కూడ కోర్టుకీడ్చి అందరియెదుట నీ పెళ్ళానికీ నాకూ వున్న ప్రేమ సంబంధాన్ని గూర్చి చెప్పి వేస్తే సంఘంలో తలవంపులని నీభయం; కాని, నువ్వేమీ దిగులు పడకు. నేనిక ఆసంగతి నెత్తనులే. ఆ సంగతి తలుచుకుంటే నాకే సిగ్గుగా వుంది" అన్నాడు.

తన ప్రసక్తి రాగానే లూసినా అక్కడినుంచి వెళ్ళి పోయింది. కిరిక్ కూడ సిగ్గుపడి తలొంచుకున్నాడు.

అధికారి రాత ముగించి "ఈ కాయితంమీద వ్రాలు చేస్తావా?" అని ఇలియూ నడిగాడు.

"ఆ, చేస్తాను. నే నన్నిటికీ సిద్ధంగానే వున్నా"నని ఇలియూ ఆ కాయితం తీసుకొని చదువకుండానే సంతకం బరకాడు.

ఇన్స్పెక్టరు ఇలియూను వింతగా చూస్తూ "అపరాధ మంగీకరించమని నీ ఆత్మ ప్రేరేపించిందా?" అనడిగాడు.

"అసలు నాలో ఆత్మఅనేది వుంటేగా?" అన్నాడు ఇలియూ.

"వాడికి పిచ్చెత్తింది, పిచ్చి!" అన్నాడు కిరిక్ తన బడే స్వరంతో.

"నీవు అరదండాలు తగిలించబోవటంలేదు. అయితే

నువ్వు పారిపోయేందుకు ప్రయత్నించచకేం?" అన్నాడు అధికారి.

"నే నసలెందుకు పారిపోవాలి?" అన్నాడు ఇలియా.

"ఆ సంగతి నాకేం తెలుసు? నువ్వు పారిపోనని శపథం వెయ్యి."

"నాకు దేవునియందు విశ్వాసమే లేనప్పుడు ఒట్టుతో ప్రయోజనం?" అన్నాడు ఇలియా తీవ్రంగా.

బయట అంధకారబంధురంగా వుంది. ఇలియా నలువేపులా చూచాడు. ఏమీ కన్పించటంలేదు. భూమ్యాకాశాలు కలిసిపోతున్నట్టుంది. ఇలియా పెద్దగా నిట్టూర్చి పోలీసుల ననుసరించాడు.

అంతా చీకటిమయం. రోడ్డు కిరుప్రక్కల యెత్తయిన మేడలు, మిద్దెలు వున్నై. చితికిపోయిన రోడ్డుమీద బాడీగా వుంది. అపుడపుడు కాలు జారుతోంది. 'ఇక ముందేమి జరుగుతుం'దన్న ప్రశ్న మాటిమాటికి ఇలియా హృదయంలో రేగుతోంది.

అప్పుడు ఇలియా కళ్లముందు న్యాయ విచారణ దృశ్యం కనపడింది. గ్రోమోవ్ యేదో ప్రశ్నించుతూండగా పెట్రుహా తన్నుచూచి మీసాలు మెలివేస్తున్నట్టు తోచింది.

చీకట్లో పరధ్యానంగా నడుస్తున్నందున ఇలియా పాదానికి యెదురుదెబ్బ తగిలింది. అందుచే వాని నడక

మందగించింది. బుర్రలో యేవేవో భావాలు చెలరే
తున్నై. పెట్రోహా రూపం మరొకసారి కన్పించ సాగిం
అప్పుడు ఇలియాకి అడుగు ముందుకు పడటంలేదు.

"త్వరగా నడువు"మని కానిస్టేబిలు అదలించాడు.

ఆ అదలింపు ఇలియాకు తేలుకాటులా చురుక
మంది. వాడి కత్తి తన హృదయాన్ని దూసుకొని పో
నట్లు వాడు వ్యధ చెందాడు. వాని బుర్రలో యేమి పుట్టి
దో హఠాత్తుగా పోలీసుల మధ్యనుంచి తప్పించుకొని ప
యించాడు. రక్షకభటులు వెంటబడ్డారు. ఇలియా శ
కొద్దీ పిక్కబలం చూపుతున్నాడు. "పట్టుకోండి, పట్టుకోం
పోనివ్వకం"డని ఇన్స్పెక్టరు వెనకనుండి అరుస్తున్నాడు.

ఇలియా యేకబిగువున పరుగుతీస్తూనే వున్నాడ
కాని, వాని కలసట కలిగినట్లుగాని, సొలివచ్చినట్లుగా
లేదు. పట్టుబడితే పెట్రోహా యెదుట చేతులు కట్టుకొ
నిలబడాలన్న తలంపు వాని శక్తి నినుమడింప జేసింది. ఇం
ముందుకు వెడితే చౌరస్తా తగుల్తుందనీ, అక్కడ జన
వుంటారు కాబట్టి పట్టుబడిపోతాననీ దౌడు తీస్తూనే ఆలో
చించుకున్నాడు. అప్పుడొక సందులోకి తిరిగి లగూ తీస
న్నాడు. చీకటిలో కన్ను పొడుచుకున్నా కన్పించటంలేదు.
వెనక-ముందు లాలోచించడానికే అవకాశంలేదు. పరుగ
వేగాన్ని మాత్రం తీవ్రం చేశాడు.

ఆ సందు కొంత దూరాన ఆగిపోయింది. ఎదురుగా
పెద్ద రాతిగోడ వుంది. అక్కడ అకస్మాత్తుగా శాంగ

వ్న ధ్వని వినపడింది. అంతలోనే అది గాలిలో విలీనమై
యింది.

తరువాత కాస్సేపటికి రక్షకభటులు లక్కడికి చేరు
న్నారు. వాళ్ళు పరుగెత్తుకొని వచ్చిన దూకుడులో
ంత తమాయించుకున్నా గోడమీద పడక తప్పలా;
ని, వాళ్ళు రొప్పుతూ రొజుతూ నెమ్మదిగా రావటం
్గ ప్రమాదం లేకపోయింది. వాళ్ళు గోడకు కొట్టుకొని
మాయించుకొనేప్పటికి కాళ్ళక్రింద మానవ కళేబరం తగి
ంది. క్రిందికి వంగి శవంమీద చేతులు వేసి చూచారు.

“గోడకు కొట్టుకొని బుర్రపగిలి చచ్చినట్టున్నాడు”
న్నాడు యింకా రొప్పుతూన్న పోలీసుల్లో ఒకడు.

రెండోవాడు జేబులో నుంచి అగ్గిపెట్టె తీసి నిప్పుల్ల
గించాడు. ఇద్దరూ వంగి చూచారు. ఇలియా శిరస్సు
సికమై వుంది. వాని పిడికిలి యింకా బిగించేవుంది.

“తల పగిలి మెదడు పైకి వచ్చింది” అన్నాడు
ండోవాడు.

“దేవాంతకులాగున్నాడు. పట్టుబడకుండానే చచ్చా”
న్నాడు మొదటివాడు.

రెండో కానిస్టేబిలు హృదయం ద్రవించి అన్నాడు—
ప్పుడేమనుకుంటే యేంలాభం? పాపం! చచ్చిపోయాడు.
గవంతు డీతని ఆత్మకు శాంతిని ప్రసాదించుగాక!”

సమాప్తి

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA115B180
పుస్తకం పేరు	ముగ్గురుమిత్రులు
తారీఖు	26/10/24
ముందు అట్ట	no
వెనుక అట్ట	no
మొత్తం పేజీలు	505
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	5 to 14,63,64
లేని పేజీలు	no
తయారు చేసినది	munisha
పేజీలు విడదీసినది	thasin
స్కాన్ చేసినది	thasin
పరీక్ష చేసినది	pragathi
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good